
నా ఆఫ్రికన్ స్వప్నం

# CONTENTS


| | |
|---|---|
| 1. ఇది ఓ విప్లవకారుడి కల | 3 |
| 2. The African Dream - పరిచయం | 5 |
| 3. అలైదా మాట | 37 |
| 4. పేర్లు, ఊర్లు, వాటి వివరాలు | 44 |
| 5. ముందుమాట | 52 |
| 6. మొదటి చర్య | 55 |
| 7. రెండో చర్య | 58 |
| 8. మొదటి భావన | 61 |
| 9. మొదటి నెల | 67 |
| 10. ఓ నమ్మకం చనిపోయింది | 72 |
| 11. ఒక ఓటమి | 80 |
| 12. షూటింగ్ స్టార్ | 87 |
| 13. తూర్పున మందగించిన పశ్చిమ పవనం | 93 |
| 14. అడ్డుకట్ట | 101 |
| 15. నాటిన విత్తనం | 118 |
| 16. వెంటాడే యత్నం | 125 |
| 17. విషమించిన రోగి పరిస్థితి | 131 |
| 18. నాడి దొరికింది | 138 |

# CONTENTS




19. మొదలైన ముగింపు 147

20. కాలంతో పోరాటం 156

21. తప్పిన గండాలు 170

22. విపత్తు 177

23. సుడిగాలి 188

24. మధ్యమ విఘాతం 208

25. కోమాలోకి జారుకున్న తూర్పు ఫ్రంట్ 223

26. కూలిపోయింది 232

27. ముగింపు 247

28. కాంగో 275

29. లారెంట్ కబీలా (1939-2001) 276

# 1. ఇది ఓ విప్లవకారుడి కల



మానవ జాతి చరిత్ర మీద తమదంటూ ఓ ముద్ర వేసిన వ్యక్తులు కొద్దిమంది ఉన్నారు. ముఖ్యంగా ఆధునిక చరిత్రగురించి చెప్పుకుంటే ఆ లిస్ట్‌లో చేర్చదగిన పేర్లు ఇలా ఉంటాయి. మార్క్స్ లెనిన్, గాంధీ, స్టాలిన్, మావో, మదర్ థెరిస్సా. ఇకచెడుకైనా అంటే హిట్లర్ పేరు కూడా చేర్చుకోవచ్చు. ఐతే, యువతను విశేషంగా ప్రభావితం చేయగలిగినవారు ఎవరని అడిగితేమాత్రం ఒకే ఒక్కపేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఆ పేరే.. చే గువేరా. ఆయన గురించి తెలిసీతెలియని యువకులు సైతంఆయన్ని తమ గుండెలకు (టీ షర్ట్‌ల రూపంలో) హత్తుకుంటున్న వాస్తవం కాదన లేనిది. యువత గుండెలపై బొమ్మగా నిలిచినఆయన గురించి వారికి తెలిసింది చాలా తక్కువే. చే గురించి తెలుసుకున్నకొద్దీ ఆయనపై వారికి అభిమానం మరింతపెరుగుతుంది.

మొదట రచయిత కావాలనుకున్నచే ఆ తర్వాత చరిత్రనే ఓ మలుపు తిప్పాలను కున్నారు. దోపిడి, అణచివేత, వివక్షలేనినూతన ప్రపంచం కోసం కలలు కన్నారు. అందుకోసం తన జీవితాన్నే పణంగా పెట్టారు. యువకుడిగా మోటారుసైకిల్ యాత్రతోప్రారంభమైన ఆయన సాహస జీవితం బొలీవియన్ అడవుల్లో చివరి శ్వాస విడిచే వరకూ అడుగడుగునా ఎంతో ఉత్కంఠతోసాగింది. ఆయన చేసిన ప్రతి సాహసానికీ, ప్రతి అనుభవానికీ ఓ రచయితగా అక్షర రూపమిచ్చారు. ఆ క్రమంలో వచ్చిందే "దిఆఫ్రికన్ డ్రీమ్" అనే ఆయన సాహస గాథ. ఓ విప్లవ కారుడిగా ఆఫ్రికా ఖండంలోని కాంగో అనే దేశంలో తన సహచరులతో కలిసిఆయన చేసిన సాహసాలు, ఆయనకెదురైన అనుభవాలే ఈ రచనలోని ముఖ్యాంశం. అక్కడి పాలకుల అణచివేతను,అన్యాయాలనూ ఎదిరిస్తూ, తిరుగుబాట్లు నిర్వహిస్తున్న స్థానిక విప్లవ దళాలకు అండగా వెళ్లిన ఆయన, వారికి శిక్షణ ఇస్తూ,వారితోపాటు తానూ ఆ పోరాటంలో పాల్గొంటుండగా ఎదురైన అనుభవాల్ని ఇందులో పొందుపరిచారు. ఐతే, చే మిగతారచనలకు లేని ఓ విశిష్టత దీనికి ఉంది. చారిత్రక ప్రాధాన్యతేగాక తాత్విక ప్రాధాన్యత కూడా ఉన్న రచనగా దీన్ని చెప్పుకోవచ్చు.


# 1. ఇది ఓ విప్లవకారుడి కల



ఆధునిక ప్రపంచంలో తాను కలలు కన్న నూతన సమాజం గురించిన తన ఆలోచనలకు, తనలోని విప్లవ తాత్వికతకుఅక్షర రూపమిచ్చిన రచన ఇది. దోపిడి, అణచివేత లేని నూతన ప్రపంచం అనే ఆ అందమైన కల సాకారం కావాలంటే కమ్యూనిస్టు విప్లవకారులు పాటించాల్సిన విప్లవ నైతికత, ఆచరించాల్సిన విప్లవ కార్యాచరణను ఇది ప్రతిపాదిస్తోంది.

- అనంతుల సత్యనారాయణ (అనువాదకుడు)


CHAD
SUDAN
NIGERIA
CENTRAL AFRICAN REPUBLIC
CAMEROON
UGANDA
Dem. Rep of The Congo
CONGO
GABON
KENYA
RWANDA
BURUNDI
INDIAN OCEAN
TANZANIA
ANGOLA
ZAMBIA


Burundi
Uvira
Bujumbura
Kigoma
D R Congo
Kalemie
Tanzania
Lake Tanganyika
Moba
D R
Congo
Zambia

చే గువేరా జీవితంలోని ఓ మిస్సింగ్ లింక్‌ను ఈ రచన తెలియజేస్తోంది. 20వ శతాబ్దపు విప్లవకారులకు ఓ ఆరాధ్యుడిగా నిలిచిన మహనీయుడు చే గువేరా.. ఆయన నాయకత్వంలో క్యూబాకు చెందిన వందమంది గెరిల్లా యోధులు తూర్పు కాంగోలో 1965 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఏడు నెలలపాటు సాగించిన పోరాట అనుభవాల్ని ఇది మన ముందుంచుతోంది. క్యూబా ప్రభుత్వం 30 ఏళ్ల పాటు ఈ కథనాల్ని మిగతా ప్రపంచానికి తెలియకుండా దాచిపెట్టింది. ఆయన స్నేహితులు, స్నేహ బృందాల్లోనివారి క్షమించరాని బలహీనతల్ని నిర్దయగా వెల్లడి చేసిన చే రచన ఇది. కాంగోకు చెందిన భావి విప్లవకారులతోపాటు క్యూబా నుంచి తనతోపాటు అక్కడికి వెళ్లిన గెరిల్లా యోధుల లోపాల్నీ ఆయన క్షమించలేదు. ఇక మిగతా వారి గురించి చెబుతూ మరింత చెత్త సరుకంటూ మండిపడ్డారు.

"విప్లవ యుద్ధక్షేత్రం నుంచి కథనాలు" అన్న పేరుతో 1961లో అచ్చయిన ఆయన మొదటి రచనలో. 1950లలో ఫిడెల్ క్యాస్ట్రో సాగించిన గెరిల్లా పోరాటాల్ని గురించి తెలుపుతూ ఎంతో ప్రశంసించారు. ఆ పోరాటాల్లో క్యాస్ట్రో తోపాటు ప్రధాన భూమిక నిర్వహించిన విషయం తెలిసిందే. చే మరణానంతరం ప్రచురిత మైన మరో రచన "బొలీవియన్ డైరీలు". 1967లో బొలీవియాలోని దట్టమైన అడవుల్లో రాత్రివేళ ఆయన రాసిపెట్టిన కథనాలు అందులో ఉన్నాయి. దృఢ సంకల్పంతో లక్ష్యాన్ని సాధించే దిశగా సాగిన ఆయన వీరోచిత పోరాట జీవితం చివరికి అక్కడే విషాదంగా ముగిసింది. ఐతే కాంగోలో చే బృందం సాగించిన సాహస యాత్ర గురించి తెలిపే ఈ రచన అందుకు పూర్తిగా భిన్నమైంది. అటు క్యూబన్లతోపాటు ఇటు కాంగోవాసుల్లోని లోపాల్ని ఏ మాత్రం కప్పిపుచ్చకుండా చే ఇందులో బహిరంగపరిచారు.ఇందులోని కొన్ని వివరాలు 1990లలోనే బయట పడ్డాయి. చే తోపాటు కాంగో పోరాటంలో పాల్గొన్న క్యూబన్లు ఇదే తగిన సమయమంటూ ఈ కథనాల్లోంచి కొన్నింటిని వెల్లడి చేశారు. "మేం అక్కడ ఉన్న సమయంలో" అన్న టైటిల్‌తో చే రచనకు సంబంధించిన వివరాల్ని ఇంటర్వ్యూ రూపంలో వారు వెల్లడించారు. వారిలో ఒకరు చేగువేరా టీంలో డిప్యూటీ కమాండ రైన విక్టర్ డైకే అలియాస్ మోజా కాగా, మరొకరు దార్ ఎ సలామ్ క్యూబన్ అంబాసిడర్‌గా చేసిన ప్యాబ్లో రివల్టా. వారు తెలిపిన వివరాలతో చూస్తే అక్కడ చేగువేరా

చేసిన కృషి అపూర్వం. ఆయన కేవలం తన సహచరుల చీకటి కోణాల్ని వెలికితీయడానికే పరిమితం కాలేదు. అంతకుమించి ఎంతో ప్రాధాన్యమున్న తన రాజకీయ లక్ష్యాల్ని ఈ రచన ద్వారా స్పష్టం చేశారు.

1965 డిసెంబరు నుంచి 1966 జనవరి వరకు రెండు నెలలపాటు ఈ రచన సాగింది. రివల్గా ఉండే రాయబార కార్యాలయంలోని ఓ చిన్న గదిలో కూర్చొని చే ఈ రచన చేశారు. అపుడు చే వయసు 37 ఏళ్లు మాత్రమే. తాను స్వయంగా రాసుకున్న నివేదికలు, డైరీల ఆధారంగా చే ఈ రచనకు డిజైన్ చేశారు. క్యాస్ట్రోతోపాటు క్యూబన్ విప్లవ నాయకుల కోసం చే ఈ రచన చేశారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే విప్లవోద్యమాలతో సంబంధాల్ని మెరుగుపరచుకునేందుకు, భవిష్యత్‌లో పొరపాట్లు జరక్కుండా తగిన జాగ్రత్తల కోసం అవసరమైన సమాచారాన్ని విశ్లేషణల్ని చే తన రచన ద్వారా అందించారు.

చే సతీమణి అలైడా మార్చ్ ఈ పుస్తకానికి ముందుమాట రాశారు. క్యాస్ట్రో ఇందులోని విషయాల పట్ల ఎంతో ఆసక్తి చూపినట్టు ఆమె తెలిపారు. చే చెప్పిన విప్లవ పాఠాల్ని క్యూబన్లు తమ గుండెలకు హత్తుకున్నారు. కాంగోలో చేదు అనుభవాలు ఎదురైనప్పటికీ క్యాస్ట్రో ప్రభుత్వం ఆఫ్రికన్ దేశాల్లోని విప్లవ పోరాటాలకు, విప్లవ ప్రభుత్వాలకు తమ రాజకీయ, మిలటరీ సహకారాన్ని కొనసాగించడం మానుకోలేదు. ముఖ్యంగా పోర్చుగీస్ వలసలైన అంగోలా, గినియా-బిసావు, మొజాంబిక్, ఎరిత్రియా, ఇథియోపియాల్లో చెప్పుకోదగిన విజయాల్నే సాధించింది. 1975-76, 1987-88ల్లో అంగోలాలోని చట్టబద్ధ ప్రభుత్వానికి మద్దతుగా వెళ్లిన క్యూబన్ దళాలు దక్షిణాఫ్రికా సైనిక దళాల్ని అక్కడి నుంచి వెనక్కి నెట్టగలిగాయి. క్యూబా సాధించి పెట్టిన ఈ విజయాలతో చివరికి నమీబియా, దక్షిణాఫ్రికా దేశాల్లో సైతం తెల్లదొరల పాలనకు అక్కడి ప్రజలు చరమగీతం పాడగలిగారు.

కాంగో అనుభవాల నుంచి చే సైతం పాఠాలు నేర్చుకున్నారు. ఓ ఏడాది తర్వాత వాటిని బొలీవియాలో ఆచరణలో పెట్టారు. ఆపై జరిగిన ఘోర విషాదం గురించి తెలిసిందే. ఐతే అందుకు దారి తీసిన పరిస్థితుల్లో కొన్నింటిని ఈ రచన ద్వారా అర్థం చేసుకోగలం.

కాంగోలో స్థానిక నాయకత్వాన్నందించిన లారెంట్ కబీలా తదితర కాంగో నేతల వ్యవహార శైలిపైనే ఈ రచనలో ప్రధానంగా చర్చించారు. కాంగో అనుభవాల ద్వారా చే ఓ నిర్ణయానికొచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ, మిలటరీ నాయకత్వాన్ని తానే స్వయంగా నిర్వహించాలనుకున్నారు. అసమర్థులైన స్థానిక కమ్యూనిస్టు నేతలకు వంతపాడే రెండో తరహా నాయకత్వ పాత్ర వల్ల నష్టమే తప్ప లాభం లేదని గ్రహించారు. 1966 నవంబర్‌లో బొలీవియా చేరుకున్న చే అక్కడే తన అనుభవ పాఠాల్ని ఆచరించడం ప్రారంభించారు.

కాంగోపై తాను రాసిన పుస్తకం వెలుగులోకి రావడానికి కొంతకాలం ఆగక తప్పదని చే నే స్వయంగా చెప్పుకున్నారు. అంతేకాదు, తన కథలో విప్లవ స్ఫూర్తి లోపించి, విలన్‌గా చూపబడ్డ 26 ఏళ్ల యువకుడు. లారెంట్ కబీలా భవిష్యత్తులో ఆ దేశానికి నేతృత్వం వహించగలరని కూడా చే ఊహించారు. క్యూబన్ వీరులు ఎక్కడైతే పోరాడి వెళ్లారో అక్కడే (తూర్పు కాంగోలో) 32 ఏళ్ల తర్వాత సరిగ్గా అదే జరిగింది. 1994లో రువాండాలో జాతుల వైరం సమసిపోయింది. 1997లో రువాండా, ఉగాండాల మద్దతుతో కబీలా దళాలు కాంగో నుంచి కిన్షాసా వరకు విస్తరించాయి. కొన్ని వారాల్లోనే జనరల్ మొబూటూ నియంతృత్వపాలనకు చరమ గీతం పాడాయి. 1965 నవంబర్‌లో చే అక్కడి నుంచి వెనక్కి వెళ్లిన సమయంలోనే మొబూటూ ఆ దేశ అధికార పగ్గాలు చేపట్టాడు.

ఐతే మొబూటూను కూలదోసి కబీలా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన సంతోషం ఎంతోకాలం నిలువలేదు. 1998లో మొదటి వార్షికోత్సవంలో పాల్గొన్న అలైదా మార్చ్ ఆ అధికార మార్పును "కాంగోలియన్" విప్లవ విజయంగా అభివర్ణించారు. ఐతే ఆ తర్వాతి కాలంలో ఆ దేశం తిరిగి అంతర్యుద్ధ పరిస్థితిలోకి నెట్టబడింది. కాంగో చుట్టూ ఉన్న కనీసం ఆరు దేశాలకు ప్రస్తుత పరిణామాల్లో జోక్యం ఉంది. 1960లో ఆ దేశం స్వాతంత్ర్యం పొందిన తొలినాళ్ల పరిస్థితిని ఇది గుర్తు చేస్తోంది. 1966లో చే ఇలా అన్నారు."కబీలా యువకుడు. అతనికి మారేందుకు అవకాశం ఉంది. ఐతే ఇప్పుడున్న పరిస్థితిని చూస్తే తన లోపాల్ని సవరించుకునే సామర్థ్యం అతనిలో ఉందా అన్న అనుమానాలు నాకు బలంగా ఉన్నాయి". ఈ పుస్తకం చదివిన ఎవరికైనా ఓ మనిషిని గురించిన వాస్తవ పరిస్థితిని చే ఎలా అంచనా వేయగలరో అర్థమవుతుంది.

ఎర్నెస్టో చే గువేరా 14 జూన్, 1928లో అర్జెంటీనాలోని ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. డాక్టర్‌గా శిక్షణ పొందిన ఆయనకు రచయిత కావాలన్న లక్ష్యం ఉండేది. లాటిన్ దేశాల్లో మోటారుసైకిల్ పై విస్తృతంగా పర్యటనలు జరిపిన యువకుడిగా ఆయన ప్రసిద్ధి చెందారు. ఆ పర్యటనలో పేద ప్రజల దీనస్థితిని చూసి చలించిపోయారు. ఆ పర్యటన తర్వాతే ఆయన తన భవిష్య జీవితాన్ని నిర్దేశించుకున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపాలంటే హింసామార్గాన్ని ఎంచుకోక తప్పదని నిర్ణయించుకున్నారు.

1954లో గ్వాటిమాలాలోని జాకోబో అర్బెంజ్ నేతృత్వంలోని ప్రగతిశీల ప్రభుత్వాన్ని సిఐఏ కుట్ర చేసి కూల్చింది. ఆ సమయంలో అక్కడే ఉన్న చే మనసు అమెరికా పట్ల ఎనలేని ద్వేషంతో రగిలిపోయింది. ఆ మరుసటి సంవత్సరమే మెక్సికోలో ఫిడెల్ క్యాస్ట్రోను కలిసిన చే క్యూబా విముక్తి కోసం ఆయనతో చేతులు కలిపారు. ఆయన సీనియర్ కమాండర్‌గా ఉన్న తిరుగుబాటు దళం శాంతాక్లారా పట్టణాన్ని చేజిక్కించుకోవడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన తీరు, చూపించిన తెగువ చేలోని నాయకత్వ ప్రతిభను వెల్లడించాయి. క్యూబా అనుభవం నుంచి నేర్చుకున్న యుద్ధ తంత్రాల్ని ఆ తర్వాత కాంగోలోనూ, బొలీవియాలోనూ ఆయన ఆచరణలో పెట్టారు. క్యూబా విప్లవానంతరం క్యాస్ట్రో ప్రభుత్వంలో చే కీలక బాధ్యతలు నిర్వహించారు. ఓవైపు అధికారికంగా ఆర్థికమంత్రిగా బాధ్యతలు నిర్వ హిస్తూనే మరోవైపు అనధికారికంగా
విదేశాంగమంత్రిగా వహించారు. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన మూడో ప్రపంచ దేశాలతో క్యూబాకు రాజకీయ బంధాల్ని నెలకొల్పడంలో ఆయన కృషి ప్రశంసనీయం. విజయాలు సాధించినకొద్దీ ఆయనలో విప్లవ పోరాట స్ఫూర్తి మరింత బలపడిందే తప్ప తగ్గలేదు. 1964లో క్యూబాను వదిలి వెళ్లే అవకాశం కోసం చూశారు. 1965లో కాంగో చేరుకున్న చే తన తల్లిదండ్రులకు రాసిన లేఖలో ఇలా అన్నారు. "మరోసారి నా శక్తి ఏమిటో నిరూపించాలనిపిస్తోంది." అంటూ గుర్రంపై స్వారీ చేస్తూ అలుపెరగని అన్వేషణ సాగించిన డాన్‌క్విక్సోట్‌ను ఆయన గుర్తు చేశారు.

చాలామంది నన్ను ఓ సాహ సికుడు అంటారు. వారనేది నిజమే కావొచ్చు అంటూ తనను తాను ఓ అసాధారణ సాహసికుడిగా భావించుకున్నారు. తాము సత్యమని నమ్మిన వాటి కోసం తమ జీవితాలను పణంగా పెట్టిన మహనీయుల అడుగుజాడల్లో ఆయన నడవాలనుకున్నారు. ఓ విప్లవాన్ని విజయవంతం చేయడంలో ప్రధాన భూమిక నిర్వహించిన ఆయన ఆ ఫలితాల్ని అక్కడే వదిలేసి మరోచోట సాహసానికి సిద్ధమయ్యారు.

కాంగోకు చేసిన సాహసయాత్రను చూసి ఆయన్ని ఓ పిచ్చెక్కిన వృత్తి విప్లవకారుడిగా తోటివారంతా హేళన చేశారు. బూర్జువా విప్లవాలతో విసుగెత్తిన కొద్దిమంది మిత్రులతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్లడం, కొత్త సవాళ్లను ఎదుర్కోవడం, ఇవన్నీ ఆయన తలబిరుసు నిర్ణయాలుగానే అందరూ అనుకున్నారు. ఐతే, ఆయన స్వీయ నిర్ణయానికి ముందు క్యూబన్ ప్రభుత్వం కూడా కాంగో యాత్రపై సమాలోచనలు జరిపింది. కాంగో విషయంలో వివిధ అవకాశాల్ని పరిశీలిస్తున్నట్లు 1964 డిసెంబర్‌లోనే క్యాస్ట్రో చేకు చెప్పినట్లు చే సతీమణి అలైదా తెలిపారు. ఐతే అల్జీరియా అధ్యక్షుడు అహ్మద్ బెన్బెల్లాతో చే సమావేశమైన తర్వాతే ఆఫ్రికా దేశాలతో క్యూబా మైత్రి మొదలైందని ఆమె తెలిపారు. చరిత్రను గమనిస్తే ఆ తర్వాతే ఆఫ్రికా రాజ కీయాల్లో క్యూబా జోక్యాన్ని మనం చూడగలం. అంతర్జాతీయంగా అమెరికా జోక్యానికి కాంగోలోనే మొదటి బ్రేక్ పడింది. అమెరికాకు భయపడి మిగతా లాటిన్ దేశాలన్నీ తనను వ్యతిరేకిస్తున్న సమయంలో ఆఫ్రికన్ దేశాల పట్ల క్యాస్ట్రో ఆసక్తి చూపడం ఆయనలోని దూరదృష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. వలసపాలన నుంచి విముక్తి పొందిన ఆఫ్రికన్ దేశాల్లో కొన్ని ప్రగతిశీల భావాలవైపు ఆకర్షితం కాగా ఇంకా వలసలుగానే కొనసాగుతున్న దేశాల్లో తిరుగుబాటు ఉద్యమాల్ని ఆయన గుర్తించగలిగారు.1967లో చే మరణం తర్వాత ఇక లాటిన్ దేశాల్లో గెరిల్లా పోరాటాలను ప్రోత్సహించడం సాధ్యం కాదని గ్రహించిన క్యాస్ట్రో ఆఫ్రికా దేశాల పట్ల ఆసక్తి పెంచుకున్నారు.

1967 బొలీవియా విషాదంతో 1965 కాంగో సాహస యాత్రను పోల్చలేం. బొలీవియా ఎపిసోడ్ కేవలం చేకు సన్నిహితులైన కొద్దిమంది మిత్రుల ప్రణాళిక కాగా, కాంగో ఎపిసోడ్‌కు

క్యూబా ప్రభుత్వమే స్వయంగా చొరవ చూపింది. ఐతే, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమంటే చేకు వ్యక్తిగతంగా ఎంతటి ఆసక్తి ఉందో క్యూబా నాయకత్వం సరిగ్గా అంచనా వేయలేకపోయింది. ఆ కాలంలో అది (యాంకీ లేదా అమెరికా సామ్రాజ్యవాదం) ఓ తీవ్ర సమస్య అంటూ చే వర్ణించారు. 1964 కాంగో సంక్షోభ సమయంలోనే వియత్నాంపై అమెరికా దాడులు మొదలయ్యాయి. ఉత్తర వియత్నాంపై బాంబుల వర్షం కురిపించింది. 1964లో గల్ఫ్ ఆఫ్ టాంకిన్ సంఘటన జరిగింది(అమెరికా యుద్ధ నౌకలపై వియత్నాం టార్పెడోల దాడి). ఆ సందర్భంలోనే "సృష్టించండి. రెండు. మూడు. మరిన్ని వియత్నాంలను సృష్టించండి" అన్న ప్రసిద్ధ కరపత్రాన్ని చే విడుదల చేశారు. దీన్ని 1967లో ప్రచురించినపుడు చే బొలీవియాలో ఉన్నారు. చే తన కాంగో రచనలోనూ అమెరికా సామ్రాజ్యవాద మూలాల్ని ఎలా పెకలించాలన్న దానిపై తన అభిప్రాయాల్ని వెల్లడించారు. ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని చాటుకునేందుకే వలస, నయా వలసల్లో అమెరికా జోక్యం చేసుకుంటోందని ఆయన సూత్రీకరించారు.

సుదీర్ఘంగా సాగిన అంతర్జాతీయ సంక్షోభ క్రమంలోనే 1960 నుంచి 63 వరకు కాంగోలో జరిగిన పరిణామాల్ని అర్థం చేసుకోవాలి. ఐతే ఇప్పుడవన్నీ అందరూ మరచిపోయారు. కానీ 1990లో యుగోస్లావియాలో జరిగిన సంఘటనలు మరోసారి కోల్డ్‌వార్ ఉద్రిక్తతల్ని గుర్తుచేశాయి. 1960 జూన్‌లో బెల్జియం నుంచి కాంగో స్వాతంత్ర్యాన్ని పొందడం, వామపక్షవాది ప్యాట్రిస్ లుముంబా ప్రధాని కావడం, ఆ తర్వాతి సంఘటనల క్రమం ఎవరూ ఊహించని ఓ డ్రామాను తలపిస్తుంది. సైనిక పాలన, బెల్జియం సేనలు తిరిగి దేశంలోకి ప్రవేశించి సంపన్న ప్రాంతమైన కటంగాను దేశం నుంచి విడదీయడం, దేశ భౌగోళిక సమగ్రతను కాపాడాలంటూ లుముంబా వేడుకోలుతో యుఎన్ దళాలు దేశంలోకి ప్రవేశించడం వరుసగా జరిగి పోయాయి. ఆర్మీ చీఫ్ మొబూటూ అండతో అధ్యక్షుడు కసావుబూ ప్రధాని లుముంబాను తొలగించడంతో ఆయన సోవియట్ మిలటరీ సాయం కోరారు. ఆ తర్వాతి పరిణామాల్లో జైలుపాలైన లుముంబాను సిఐఏ కుట్ర చేసి చంపేసింది. ఇదే సందర్భంలో యుఎన్ సెక్రటరీ జనరల్ డగ్ హమర్షెల్డ్ విమాన ప్రమాదంలో చనిపోవడం కూడా ఓ మిస్టరీగానే మిగిలిపోయింది.

కాంగో మూడేళ్లకు పైగా ప్రాపంచిక వార్తల్లో హెడ్ లైన్‌లో ఉంటూ వచ్చింది. ఆఫ్రికా ఖండానికే ఓ పరీక్షగా నిలిచింది. స్వతంత్ర దేశాలుగా మనగలగడమా లేక తిరిగి సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్లిపోవడమా, కమ్యూనిస్టులతో చేతులు కలపడమా అన్నది అప్పట్లో ఆఫ్రికన్ దేశాల ముందున్న సవాల్ కోల్డ్‌వార్ సంబంధం లేకుండా క్యూబన్లు తమకు తాముగా తిరుగుబాటు చేసి 1959 జనవరిలో అధికారాన్ని చేజిక్కించుకోవడం సంచలనం సృష్టించింది. అదే వేడి 1963 నుంచి ఆఫ్రికా సంక్షోభంలో కనిపిస్తుంది. ఆ సమయంలో సిరిల్లా అనే ప్రజాదరణ లేని వ్యక్తి కాంగోకు ప్రధానిగా వ్యవహరిస్తున్నాడు. దాంతో యుఎన్ అక్కడి నుంచి తన దళాల్ని ఉపసంహరించడం ప్రారంభించింది. చరిత్ర ఏ ఒక్కరి కోసమో ఆగిపోదు. 1964 ప్రారంభ రోజుల్లోనే కాంగో అంతటా తిరుగుబాట్లు మొదలయ్యాయి. లుముంబా నేర్పిన తిరుగుబాటు చైతన్యం వారిలో వ్యక్తమైంది. ఐతే 1960 నాటి లోపాల్నించి కొత్తతరం బయటపడింది. కాంగో పార్లమెంట్ మూతపడ్డ తర్వాత జరిగిన ఈ తిరుగుబాట్లకు వామపక్ష తీవ్రవాద సంస్థ నేషనల్ లిబరేషన్ కౌన్సిల్ నాయకత్వం వహించింది. ఈ సంస్థ 1963 అక్టోబర్‌లో బ్రజ్జావిల్లేలో ఏర్పాటైంది.

లిబరేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తిరుగుబాటు దళాలు కాంగోలోని ఎంపిక చేసిన నాలుగు ప్రాంతాలకు వెళ్లాయి. మొదట 1964 జనవరిలో 36 ఏళ్ల పైరే ములేలే నేతృత్వంలోని దళాలు పశ్చిమ ప్రాంతంలోకి ప్రవేశించాయి. ఇది కిన్షాసాకు తూర్పు దిక్కున ఉంది. లుముంబా ప్రభుత్వంలో ములేలే విద్యామంత్రిగా పని చేశారు. తాను కాంగో రెండో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నానని చెప్పుకునేవారు. ఈయన కొంతకాలం చైనాలో ఉన్నారు. ఈయన నడిపే ఉద్యమానికి సాయ మందిస్తామని పెకింగ్ హామీ ఇచ్చింది. 1964 ఫిబ్రవరిలో మరో తిరుగుబాటు దళాన్ని ఈశాన్య ప్రాంతానికి పంపారు. దీనికి 43 ఏళ్ల స్థానిక నేత గేస్టన్ నాయకత్వం వహించారు. మూడో దళానికి లారెంట్ కబీలా నేతృత్వం వహించారు. ఈయన ఉత్తర కటంగా నుంచి అసెంబ్లీకి ఎన్నికైన వ్యక్తి. ప్యారిస్, బెల్‌గ్రేడ్ నగరాల్లో విద్యాభ్యాసం చేశారు. నాలుగో క్యాంపును ఉత్తర ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇక్కడి తిరుగుబాటు దళానికి నికోలస్ ఒలెంగా నాయకత్వం వహించారు.

1964 మధ్యకాలంలో కాంగోలోని మెజార్టీ ప్రాంతాల్ని లుముంబా అనుచర వామపక్షీయులు వశపరచుకున్నారు. వీరికి చైనాతోపాటు సోవియట్ యూనియన్ సహకరించింది. ఐతే వీరు సాధించిన విజయం ఏమంత సురక్షితం కాదని అర్థమైంది. 1960 నాటి నుంచి స్థానిక నేతల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు తిరుగుబాటు దళాల్ని నిర్వీర్యం చేయసాగాయి. వారంతా అపుడు అమెరికాలో మారనున్న రాజకీయాలపై దృష్టి సారించారు. 1963 నవంబర్‌లో కెన్నెడీ హత్య తర్వాత అధ్యక్ష పదవి చేపట్టిన లిండన్ జాన్సన్ 1964 నవంబర్ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి గోల్డ్ వాటర్‌ను ఎదుర్కోవాల్సి ఉంది. వియత్నాంలో తగిలిన ఎదురుదెబ్బతో రగిలిపోతున్న జాన్సన్ ఆఫ్రికాలో బలపడుతున్న కమ్యూనిస్టుల పట్ల మెతక వైఖరి అవలంభించే అవకాశాలు లేవు.

1964 ప్రారంభంలో ఆఫ్రికాలో జరిగిన రెండు పరిణామాలపై అమెరికన్లు దృష్టి సారించారు. కాంగో నలువైపులా మొదలైన తిరుగుబాట్లు, యుఎన్ దళాలు అక్కడి నుంచి వెనక్కి వెళ్లడం, జంజిబార్‌లో వామపక్ష విప్లవం, ఇవన్నీ హిందూ మహా సముద్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు బలపడ్డానికి సూచికగా వారు భయ పడ్డారు. జంజిబార్ విప్లవకారులు క్యాస్ట్రోకు గట్టి మద్దతుదారులు కావడం అమెరి కాకు మింగుడు పడని పరిణామమే. జంజిబార్ను మరో క్యూబాగా వారు భావించారు. అక్కడ జరుగుతున్న పరిణామాలపై అమెరికా ఓ కన్నేసింది. దక్షిణాఫ్రికాతో పాటు కాంగో వ్యవహారాల్లో అనుభవమున్న దౌత్యవేత్త కార్లుస్సీని జంజిబార్‌కు రాయబారిగా పంపింది. (ఈయనే 1980లో రీగన్‌కు రక్షణ కార్యదర్శి). ఆ తర్వాతి నెలలోనే మరో అనుభజ్ఞుడైన దౌత్యవేత్త హారిమన్‌ను ఆఫ్రికా వ్యవహారాల్ని తమకనుకూలంగా మలచాలని కోరుతూ కిన్షాసాకు పంపింది.

అమెరికా రక్షణశాఖ డిప్యూటీ కార్యదర్శితో కలిసి హారిమన్ కాంగోకు వైమానిక దళాల్ని పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాడు. విమానాలు, హెలికాప్టర్లు, టి20 ఫైటర్ బాంబులకు అవసరమైన నిధుల్ని USAID రహస్యంగా సమకూర్చింది. సిఐఏ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ మే నెలలో ప్రారంభమైంది.

క్విలూలో ములేలే నేతృత్వంలో జరుగుతున్న తిరుగుబాటు పట్ల సిఐఏ అలర్టయింది. టి-6 శిక్షణ విమానాలతో దాడులు చేయాలని సూచించింది. కాంగో తరలించిన ఈ విమానాలు రెండో ప్రపంచ యుద్ధ కాలంనాటివి. కాంగోలీస్ వైమానిక దళాలకు శిక్షణ ఇచ్చేందుకు వీటిని తీసుకొచ్చారు. ఐతే మిస్సైల్స్‌తోపాటు పాయింట్ 30 కాలిబర్ మెషీన్ గన్స్‌ను మోసుకువెళ్లేలా వీటిని తీర్చిదిద్దారు. వీటి పైలెట్లను ఫ్లోరిడాలో ప్రవాసముంటున్న క్యూబన్ల నుంచి రిక్రూట్ చేసుకుంది సిఐఏ. వీరికి నెలకు రెండు వేల యుఎస్ డాలర్లు వేతనం ఇచ్చేలా కాంట్రాక్ట్ కుదిరింది. వీరు అడవి ప్రాంతాల్లో వైమానిక దాడులు చేయాల్సివుంటుందని, హెలికాప్టర్ల ద్వారా వీరికి రక్షణ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చింది. కివూ రాజధాని కిక్విట్లో బేస్ క్యాంప్ ఏర్పాటు చేసి ఫిబ్రవరి మధ్యలో ములేలా దళాలపై దాడులు ప్రారంభించింది. కాంగోలీస్ వైమానిక దళాలతోపాటు క్యూబన్ ప్రవాస పైలెట్ల పర్యవేక్షణ కోసం WIGMO (వెస్టర్న్ ఇంటర్నేషనల్ గ్రౌండ్ మెయింటెనెన్స్ ఆర్గనైజేషన్) పేరుతో లీక్టెన్‌స్టీన్ ప్రధాన కార్యాలయంగా ఓ చిన్న బృందాన్ని సిఐఏ నియమించింది. 1965 అక్టోబర్‌లో క్యూబా గెరిల్లాల చేతికి అమెరికన్ కూలిబంటు సైనికులు పెద్ద సంఖ్యలో చిక్కారు. ఆ సందర్భంలోనే విగ్మో వివరాల్ని చే పసిగట్ట గలిగారు. 1964 జూలైలో షోంబే (గతంలో కటంగా వేర్పాటువాద నాయకుడు) అడౌలా నుంచి అధికారం చేజిక్కించుకున్నాడు. ఐతే అంతకు ముందు జూన్ నెలలోనే యుఎన్ దళాలు అక్కడి నుంచి వెనక్కి వెళ్లడంతో ప్రభుత్వ బలగాలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాయి. కాంగో ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో తిరుగుబాట్లు చెలరేగడంతో షోంబే బయటి నుంచి సాయం కోరాడు. దక్షిణాఫ్రికా నుంచి తెల్ల సైనికుల్ని రిక్రూట్ చేసుకోవాల్సిందిగా ఆయనకు అమెరికా సలహా ఇచ్చింది. 60-61లో కటంగాలో ఇతడు చేసింది అదే. రెండో ప్రపంచ యుద్ధంలో బర్మాలో కల్నల్‌గా చేసిన మైక్‌హోరే 60లో షోంబేకు అండగా నిలిచాడు. అప్పుడు వాళ్ల కటంగాను లుముంబా నుంచి రక్షించడం కోసం వస్తే, ఇప్పుడు కమ్యూనిజం నుంచి కాంగోను కాపాడ్డం కోసం రావాలి. ఇక్కడ అమెరికన్లు జనరల్ మొబూటూతో చేయి కలిపారు. ఇతడు కాంగో స్వాతంత్రం పొందిననాటి నుంచి ఆ దేశ ఆర్మీ కమాండర్ ఇన్ చీఫ్గా ఉన్నాడు. దక్షిణాఫ్రికా , రొడీసియాల నుంచి వెయ్యి మందిని రిక్రూట్ చేయాలని హోరేను మొబూటూ కోరాడు.

అదే సమయంలో బెల్జియం కమాండర్ కల్నల్ వ్యాండే వల్లే తన బలగాలతో కాంగో ప్రభుత్వ దళాలకు అండగా వచ్చాడు. ఇతడు 61-63లో షోంబేకు సలహాదారు. ఆఫ్రికన్ దేశాల్లో ఒంటరి వాడైన షోంబే వీరందరి సాయంతో అమెరికా, బెల్జియంల మద్దతుతో మరోసారి తెరమీదికొచ్చాడు. ఐతే మరోసారి తమ ప్రాంతంలో వలస పాలన నెలకొల్పడం కోసం అమెరికా చేస్తున్న కుట్రల్ని ఎదుర్కోవాలంటూ ఆఫ్రికాలోని ప్రగతిశీల దేశాలన్నీ ఓ కూటమిగా ఏర్పడ్డాయి. ఈ కూటమిలో అల్జీరియా, ఈజిప్టు, ఘనా, గ్యూనియా, మాలి, టాంజానియా ఉన్నాయి (ఏప్రిల్లో జంజిబార్ ఈ కూటమిలో చేరింది). కాంగోలో అమెరికాకు షోంబే ఓ కీలుబొమ్మగా మారాడంటూ ఈ దేశాలు తీవ్రంగా మండిపడ్డాయి. తిరుగుబాటు నేత బెన్యే నేతృత్వంలో స్టాన్లీవిల్లే-కిసంగనీలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వాన్ని గుర్తించేందుకు చొరవ చూపాయి. అవసరమైన సాయ మందించేందుకు ముందుకొచ్చాయి. ఆఫ్రికన్ అలీన దేశాల మొదటి సదస్సు జూలై నెలలో కైరోలో జరిగింది. ఈ సదస్సులో కాంగోపైనే ప్రధానంగా చర్చించారు. కైరోలోనే అక్టోబర్లో జరిగిన రెండో సదస్సుకు క్యూబా నుంచి ముఖ్య నేతలు హాజరయ్యారు. కల్నల్స్ వ్యాండేవల్లే, హోరేల నేతృత్వంలోని తెల్ల సైనికుల ప్రధాన లక్ష్యం తిరుగుబాటు దళాల్ని అణచివేయడం ఒమ్మెన్గ్యాంగ్ పేరుతో చేపట్టిన ఆపరేషన్ ద్వారా వీరు ఆల్బర్ట్ విల్లేను సులభంగానే ఆక్రమించారు. ఆపై కమీనా నుంచి స్టాన్లీవిల్లే-కిసంగనీ వైపు ముందుకు సాగారు. వీరి ఆపరేషన్ కు కౌంటర్గా స్పందించిన బెన్యే ప్రభుత్వం స్టాన్లీవిల్లేలోని యూరోపియన్లను బందీలుగా పట్టుకుంది. ఐతే బందీలలో ఎక్కువభాగం మత ప్రచారకులే. ప్రభుత్వ ఆదేశాలతో నవంబర్ నెలలో ఇలాంటి అరాచకాలు స్టాన్లీవిల్లే అంతటా వ్యాపించాయి. ఈ ప్రతిచర్యలకు తీవ్రస్థాయిలో బదులివ్వాలని అమెరికన్లు నిర్ణయించారు. ఐతే అందుకు కేవలం దక్షిణ ప్రాంతం నుంచి ముందుకు వెళ్తున్న కిరాయి సైన్యంపైనే ఆధారపడకూడదనుకున్నారు. ఆపరేషన్ డ్రాగన్ రోగ్ పేరుతో మరో ప్రణాళికను సిద్ధం చేశారు. అమెరికన్ రవాణా విమానాల ద్వారా బెల్జియన్ ప్యారాట్రూప్స్‌ను స్టాన్లీవిల్లేలో దించాలని నిర్ణయించారు. ఈ ప్యారాట్రూప్స్‌ను చేరవేయడం కోసం బ్రిటన్ కు చెందిన సౌత్ అట్లాంటిక్ బేస్ను అమెరికా ఉపయోగించుకుంది.

ఆ సమయంలో హెరాల్డ్ విల్సన్ నేతృత్వంలోని లేబర్ పార్టీ బ్రిటన్‌లో అధికారంలో ఉంది. ఓవైపు నుంచి వీరు అక్కడికి చేరుకునే సమయానికే మరోవైపు నుంచి కిరాయి సైనికుల్ని కూడా అక్కడికి తరలించింది. అక్కడి వారి లక్ష్యం కేవలం యూరోపియన్ బందీలను విడుదల చేయించడమే గాక స్టాన్లీవిల్లేను ఆక్రమించడం. వాళ్లు చేపట్టిన ఈ ఆపరేషన్ ద్వారా 200 మందికి పైగా యూరోపియన్ బందీలకు విముక్తి కలిగించారు. ఐతే లెక్కకు మించిన సంఖ్యలో ఆఫ్రికన్లను చంపేశారు. షోంబే దళాలు సాగిస్తున్న ఈ దమనకాండను అడ్డుకునేందుకు ప్రగతిశీల ఆఫ్రికన్ దేశాలన్నీ ఐక్యంగా నిలవాలని నిర్ణయించాయి. కాంగో తిరుగుబాటు దళాలకు మద్దతుగా ఆయుధాలతోపాటు తమ సైనికుల్ని కూడా పంపిస్తామని అల్జీరియా అధ్యక్షుడు బెన్బెల్లాతోపాటు ఈజిప్టు అధ్యక్షుడు నాజర్ ప్రకటించారు. సాయ మందించాల్సిందిగా మిగతా దేశాల్ని వారు కోరారు. ఈ సమయంలోనే కాంగో వ్యవహారాల్లో క్యూబా ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటూ అల్జీరియాకు సన్నిహిత మైంది. అప్పటికే ఈ రెండు దేశాలు విప్లవోద్యమాల్ని ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాయి. 1961 అల్జీరియా విప్లవానికి క్యూబా సహకరించింది. పెద్ద సంఖ్యలో వారికి ఆయుధాలు అందించింది(అవన్నీ బేఆఫ్ పిగ్స్ దగ్గర సిఐఏ చేపట్టిన ఆపరేషన్ని తిప్పికొడూ క్యూబన్ విప్లకారులు స్వాధీనం చేసుకున్నవే). ఈ ఆయుధాల సరఫరా అంతా అర్జెంటీనాకు చెందిన జోర్డే మసెట్టీ ద్వారా జరిగింది. ఈయన గువేరా స్నేహితుడు క్యూబన్ న్యూస్ ఏజెన్సీ పెన్సా ల్యాటినాను నెలకొల్పడంలోనూ ఈయన తన సాంకేతిక సహకారం అందించారు.

ఆపై మసెట్టీ తన సొంత దేశమైన అర్జెంటీనాలో క్యూబన్ తరహా గెరిల్లా విప్లవం కోసం ప్రణాళిక వేశారు. 1962 జూలైలో అల్జీరియా స్వాతంత్ర్యం పొందింది. దాంతో గువేరాతో కలిసి అర్జెంటీనా విప్లవకారులకు అల్జీరియాలో శిక్షణ ఇచ్చారు. వారికి అల్జీరియా అన్ని విధాలా సహకరించింది. ఐతే 1964లో మసెట్టీ కనిపించ కుండా పోవడం, ఆపై అనుమానాస్పద స్థితిలో చనిపోవడంతో ఆ ప్రణాళికలన్నీ విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలోనే కాంగోలోని తమ మిత్రులకు సాయమందించాల్సిందిగా అల్జీరియన్లు కోరినపుడు క్యూబా సంతోషంగా అంగీకరించింది.

స్టాన్లీవిల్లేలో ప్యారాట్రూప్స్‌ను దించడం పట్ల అంతర్జాతీయంగా తీవ్ర నిరసన వ్యక్తమైంది. డిసెంబర్లో చే న్యూయార్క్ వెళ్లారు. డిసెంబర్ 11న యుఎన్ జనరల్ అసెంబ్లీలో క్యూబా ప్రతినిధిగా చే ప్రసంగించారు.

కాంగోలో అమెరికా జోక్యంపై మండిపడ్డారు. ఆధునిక ప్రపంచంలోనూ మరో ప్రత్యామ్నాయానికి అవకాశం లేకుండా చేసే ఏకపక్ష అధికారమేమిటని ప్రశ్నించారు. ఆ ప్రాంత ప్రజల హక్కుల్ని ఎలా కాలరాసిందీ వివరించారు. కాంగోలోని అపారమైన సహజ వనరుల్ని తమ సొంతం చేసుకోవాలన్నదే సామ్రాజ్యవాదుల లక్ష్యమంటూ తేల్చి చెప్పారు. లుముంబాను హతమార్చడం కోసం నాడు యుఎన్ పేరును వాడుకున్నవారే, నేడు తెల్లవారి రక్షణ కోసమన్న సాకుతో వేలాదిమంది కాంగోవాసుల్ని చంపేస్తున్నారంటూ మండిపడ్డారు. లుముంబాకు యుఎన్ చేసిన ద్రోహాన్ని మేమెలా మరిచిపోతామంటూ గుర్తు చేశారు. ఇటీవల జరిగిన సంఘటనలు ప్రపంచ ప్రజల్ని అవమానించేలా ఉన్నాయన్నారు. ఐతే నేరస్తులు ఎవరు? బెల్జియన్ ప్యారాట్రూపర్సా? లేక వారిని అక్కడికి రవాణా చేసిన అమెరికన్లా? లేక తమ ఎయిర్ బేస్ ద్వారా సహకరించిన బ్రిటీష్ వారా? కాంగో నేరస్తులపై పగ తీర్చుకునేందుకు ప్రపంచంలోని స్వేచ్ఛా జీవులంతా సిద్ధమవుతున్నారంటూ చే తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఆ తర్వాత ఆయన అదే దారిలో నడిచారు. న్యూయార్క్ నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఆఫ్రికా పర్యటనకు బయలుదేరారు. ఆఫ్రికాలో ఆయన పర్యటన సుదీర్ఘంగా సాగింది. ముఖ్యంగా కాంగో తిరుగుబాటుదారులకు మద్దతునిచ్చే దేశాల్ని ఆయన సందర్శిం చారు. మొదట ఆయన అల్జీరియాకు వెళ్లి బెన్బెల్లాతో చర్చించారు. 1965 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మాలి, కాంగో-బ్రజ్జావిల్లే, సెనగల్, ఘనా, దహోమి, ఈజిప్టు, టాంజానియా దేశాల్ని ఆయన సందర్శించారు. ప్రతిచోట ఆయన కొన్నిరోజులు గడిపి, వారికి కాంగోలో జరుగుతున్న పోరాటాన్ని వివరించారు. పైరేములేలే దళాలకు క్యూబా సాయమందించాలంటూ బ్రజ్జావిల్లే అధ్యక్షుడు ఆల్ఫోన్సే కోరారు. దార్ ఏ సలామ్‌లో ఉన్న లారెంట్ కబీలాను సందర్శించగా, తూర్పు కాంగోలోని విముక్తి ప్రాంతాలకు సాయమందించాలని అడిగారు. కైరోలో గేమ్టన్‌తో సుదీర్ఘంగా చర్చించారు. స్టాన్లీవిల్లే కోసం సైనిక, ఆర్థిక సాయాన్ని ఆయన కోరారు.

ఐతే కాంగో మరో ముఖ్యనేత బెన్యేను చే కలవలేకపోయారు. (బ్రజ్జావిల్లేలో చేతో చర్చించిన అంగోలియన్ నాయకుడు అగొస్టినో తమ అంగోలియన్ లిబరేషన్ ఆర్మీకి MPLA) సాయమందించాలన్నారు.

ఐతే వారు విన్నవించినంతగా సాయమందించడం అంత సులభం కాదు. భౌగోళిక సమస్యలతోపాటు అక్కడి తిరుగుబాటు దళాల మధ్య వారికి సహకరిస్తున్న విదేశీయుల మధ్య తీవ్ర విభేదాలుండటం మరో పెద్ద సమస్య. రానున్న కాలంలో నైనా ఈ విభేదాలు తొలగిపోవాల్సివుందని చే తన రచనలో ఆశించారు. వీరికి సాయమందించడంలో క్యూబన్లకు ఓ లక్ష్యం ఉంది. అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే దేశాలతో మూడో ప్రపంచ కూటమిని నిర్మించాలన్నదే ఆ లక్ష్యం. ఆ దృష్టితో వారు జాగ్రత్తగా అడుగులు వేయాల్సివుంది. కాంగో తిరుగుబాట్లకు ప్రధాన మద్దతుదారుగా ఉన్న చైనా ఆలోచనల్ని వారు తెలుసుకోవాలనుకున్నారు. దాంతో ఫిబ్రవరి ప్రారంభంలో కైరో నుంచి పెకింగ్ వెళ్లారు చే. ఆయనతో క్యూబాకు చెందిన ఇద్దరు సీనియర్ నేతలున్నారు. వారిలో ఒకరు ఉస్మానీ అలియాస్ బ్రాసిరో మరొకరు ఎమిలో అలియాస్ టెంబో, క్యూబా ప్రభుత్వం తరఫున కాంగో యాత్రకు ప్రణాళిక సిద్ధం చేసింది కూడా వీరిద్దరే. ఆ సమయంలో చైనా తమ రక్షణ మంత్రి లిన్ పియావో వ్యూహాల్ని అనుసరిస్తోంది. క్షీణదశకు చేరుకుంటున్న పట్టణాల్ని వ్యవసాయ విప్లవకారులతో బలోపేతం చేయాలన్నది ఆయన ఆలోచన. ఈ ఆలోచనల పట్ల ఆకర్షితుడైన చే చైనాకు దగ్గరవుతూ రష్యా పట్ల విముఖత వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంశాల్లో చైనా-రష్యాల మధ్య పొడచూపిన విభేదాలతో ప్రపంచ కమ్యూనిస్టులు రెండు శిబిరాలుగా చీలిపోతున్న సందర్భమది. మొదట క్యాస్ట్రో ఆధ్వర్యంలో జరిగిన క్యూబా విప్లవం పట్ల ఆకర్షితమైన చైనా ఆ తర్వాత పునరాలోచనలో పడింది. 1962 అక్టోబర్‌లో కృశ్చేవ్ సృష్టించిన క్షిపణి సంక్షోభం తర్వాత అది మొదలైంది. దీనికితోడు లాటిన్ దేశాల కమ్యూనిస్టు పార్టీల్ని చైనా శిబిరంలో చేర్చడంలో క్యూబా వైఫల్యం చెందిందంటూ వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆ తర్వాత 1965 నుంచి 30 ఏళ్లపాటు క్యూబా పట్ల చైనా ఆసక్తి చూపలేదు.

చే బృందం పెకింగ్‌లో ఆఫ్రికా వ్యవహారాలు చూస్తున్న చైనా ప్రముఖులు కొందరితో చర్చించింది. వారిలో ఆ దేశ ప్రధాని చౌఎన్‌లై కూడా ఉన్నారు. ఆయన అంతకు ఏడాది ముందే ఆఫ్రికా సందర్శించారు. 1963 డిసెంబర్ 1964 ఫిబ్రవరి మధ్య చౌ ఎన్ లై ఈజిప్టు, అల్జీరియా, మొరాకో, టునీషియా, ఘనా, మాలి, గ్వీనియా, సూడాన్, ఇథియోపియా, సోమాలియా దేశాలను సందర్శించారు. చే తో చర్చల తర్వాత చౌ ఎన్ లై 1965 మార్చిలో అల్జీరియా, కైరోలను మరోసారి సందర్శించారు.

ఆ తర్వాత జూన్‌లో కాంగో నేతలైన కబీలా, సౌమాలియట్లను కలిసేందుకు టాంజానియా వెళ్లారు. అప్పటికే చే కాంగోలో మకాం వేశారు. పెకింగ్ పర్యటన తర్వాత చే కైరోకు, ఆ తర్వాత దార్ ఏ సలామ్‌కు వెళ్లారు. అప్పట్లో టాంజానియాలోని జూలియస్ నైరేరీ ప్రభుత్వం ఓ విప్లవ కేంద్రంగా ఉంటోంది. ఆఫ్రికన్ కూటమి గుర్తించిన విముక్తి ఉద్యమాలకు టాంజానియాలోని దార్ ఏ సలామ్ ఓ హెడ్‌క్వార్టర్‌గా పని చేస్తోంది. ఫిబ్రవరిలో ఓ వారంపాటు చే అక్కడే గడిపారు. కబీలా, సౌమాలియట్లతోపాటు పలువురు ఉద్యమకారులతో ఆయన చర్చించారు. వారితో చర్చలు ఎంతో ఉద్విగ్నంగా సాగినట్టు ఆయన తన రచనలో తెలిపారు.

మార్చి ప్రారంభంలోనే కైరో వెళ్లిన చే అక్కడ కల్నల్ నాజర్‌తో చర్చించారు. కాంగో పోరాటంలో తాను పాల్గొనే విషయాన్ని ఆయనకు చెప్పారు. అందుకు నాజర్ ఏమంత ఆసక్తి చూపలేదు. నాజర్ అల్లుడు, పత్రికా సంపాదకుడైన మహ్మద్ హీకల్‌తోనూ చే చర్చించారు. కొంతమంది నల్లజాతి క్యూబన్లతో కలిసి తాను కాంగో కోసం పోరాడనున్నట్టు ఆయన తెలిపారు. "నేను కాంగోకు తప్పకుండా వెళ్తాను, ఇప్పుడది ప్రపంచంలోనే ఉద్రిక్త ప్రాంతం. కటంగాపై సామ్రాజ్యవాదులు పెట్టుకున్న ఆశల్ని భగ్నం చేయగలమని నేను భావిస్తున్నాను." అంటూ చే తీవ్ర స్వరంతో తన ప్రణాళిక వివరించారు. ఐతే చే ప్రణాళిక పట్ల నాజర్ విస్మయం వ్యక్తం చేసినట్టు హీకల్ చెప్పారు. నల్లజాతివారిని రక్షించడం కోసం తెల్లజాతికి చెందిన మరో టార్జాన్‌లా నీవు మారకూడదని నాజర్ అన్నట్టు ఆయన తెలిపారు.

రెండు నెలల పర్యటన అనంతరం 14 మార్చి 1965న చే తిరిగి క్యూబా చేరుకున్నారు. హవానా ఎయిర్‌పోర్టులో క్యాస్ట్రో ఆయనకు ఘనస్వాగతం పలికారు. కాంగో యాత్ర కోసం క్యూబాలో జరుగుతున్న ఏర్పాట్ల గురించి తెలుసుకునేందుకే చే తిరిగి వెళ్లారు. ఐతే చే బహిరంగంగా కనిపించడం అదే చివరిసారి. ఆ తర్వాత 1967 అక్టోబర్‌లో బొలీవియాలోని వ్యాల్లేగ్రాండేలో ఆయన శవమైపోయారు. కనిపించకుండా పోయిన మొదటి సంవత్సరం 1965లో ఆయన ఏం చేశారనేది ఈ రచన ద్వారా మనకు తెలుస్తుంది.

చే హవానాకు తిరిగి రాకముందే కాంగోలో జోక్యం చేసుకోవాలని క్యూబా నిర్ణయించింది. అందుకోసం నల్లజాతికి చెందిన 150 మంది గెరిల్లాలను ఎంపిక చేసి శిక్షణ కోసం క్యూబాలోని మూడు ప్రాంతాలకు పంపింది. వారిని ఎక్కడికి పంపేదీ ముందే చెప్పకపోయినా, మొత్తం నల్లవారినే ఎంపిక చేయడంతో వారిలో చాలామందికి అర్థమైంది తమను ఆఫ్రికాకు పంపిస్తారని. తమపై దాడులు జరిపే షోంబే నేతృత్వంలోని తెల్లజాతి కిరాయి సైనికుల నుంచి తమకు మద్దతు తెలిపే దళాల్ని వేరు చేసి గుర్తించేందుకు నల్లవారినే పంపాలంటూ సౌమాలియట్ కోరడంతో అలా చేశారు. ఐతే ఇది సరైందని గానీ, తెలివైందనిగానీ చెప్పలేమని చే తన రచనలో విశ్లేషించారు. దాంతో ఆఫ్రికాకు ఆ తర్వాత పంపిన క్యూబా దళాల్లో నల్లవారితోపాటు తెల్లవారూ ఉన్నారు.

క్యూబన్ దళాలకు విక్టర్ డ్రేకే అలియాస్ మోజా నాయకత్వం వహించారు. క్యూబా విప్లవంలో పాల్గొన్న ఈయన చే కు బాగా తెలిసిన వ్యక్తి. ఆ తర్వాత ఎస్కాంబ్రే పర్వత ప్రాంతాల్లో క్యాస్ట్రోకు వ్యతిరేకంగా వచ్చిన తిరుగుబాట్లను అణచి వేయడంలో ఈయన చురుగ్గా వ్యవహరించారు. 1964లో ఆ తిరుగుబాట్లు సద్దు మణిగాయి. 60 దశకం చివరన గినియాకు పంపిన క్యూబన్ దళాలకు కూడా ఈయనే నాయకత్వం వహించారు.

గువేరా రాక కోసం క్యూబన్ నాయకత్వం ఎదురు చూసింది. కాంగో వెళ్లే విప్లవ దళాలకు ఆయన నాయకత్వం వహిస్తారా, లేదా అన్న సందేహాలు వారికున్నాయి. అంతకుముందే ఆయన లాటిన్ దేశాల విప్లవం కోసం కొన్ని ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు.

ఐతే అప్పటివరకూ పెరూ, బొలీవియా, అర్జెంటీనాల్లో జరిగిన ఉద్యమాల్లో ఆయన స్వయంగా పాల్గొనలేదు. ఆఫ్రికా నుంచి తిరిగి వచ్చాక ఆయన అందుకు సిద్ధమవుతారని అందరూ అనుకున్నారు. దీనికి సంబంధించి డ్రకే కొన్ని విషయాలు చెప్పారు. అవి 1990 వరకూ వెలుగులోకి రాలేదు. "ఆఫ్రికా నుంచి తిరిగి వచ్చాక ఆయన అర్జెంటీనా పోరాటంలో పాల్గొంటారని అనుకున్నారు. ఐతే ఆయన ఆలోచనలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. లుముంబా హత్య తర్వాత ఆయన కాంగో పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఆయన ఇపుడు ద్విముఖ వ్యూహంతో వెళ్లాలనుకున్నారు. ఓవైపు లాటిన్ దేశాల్లో విముక్తి ఉద్యమాల్ని నిర్మించడం, మరో వైపు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వియత్నాం, లాటిన్ అమెరికా, ఆఫ్రికన్ దేశాలతో కలిసి అంతర్జాతీయంగా మూడో కూటమిని నిర్మించడం. తనలో మెదిలో ఈ ఆలోచనలకు ఓ తుదిరూపం ఇవ్వాలనుకున్నారు. ఆ క్రమంలోనే ఆయన లాటిన్‌కన్నా ఆఫ్రికన్ దేశాల్లో ముందుకు వెళ్లడమే సులభమనుకున్నారు."

దేశంలోని వివిధ క్యాంపుల్లో శిక్షణ పొందిన గెరిల్లా దళాలు 1965 మార్చి చివరన హవానాకు చేరుకున్నాయి. దళాలు క్యూబాను విడిచి వెళ్లేందుకు చివరి సన్నాహాలు మొదలయ్యాయి. చివరి నిమిషాన ఆ దేశ నిర్మాణశాఖ మంత్రి ఉస్మానీ, డ్రకేను పక్కకు పిలిచి వెళ్లాల్సింది కాంగో, నేతృత్వం వహించేది చేగువేరా అంటూ అసలు సంగతి చేప్పేశారు. కాంగో దండయాత్రకు వెళ్తున్నవారిలో గువేరాతోపాటు మరో నాయకుడున్నారు. 27 ఏళ్ల మార్టినేజ్ తమయో అలియాస్ ఎంబిలీ అనే ఈయన క్యూబన్ సీక్రెట్ సర్వీస్ అధికారి. ఆ దేశ అంతర్జాతీయ మిలటరీ వ్యవహా రాల్లో ప్రముఖుడు. కొన్నేళ్లుగా గువేరాతో కలిసి పని చేసిన అనుభవం ఈయన కుంది. హోల్గిన్ ప్రావిన్స్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసిన ఇతను క్యాస్ట్రో ఆధ్వర్యంలో జరిగిన జూలై 26 ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత 1958 ఏప్రిల్లో చే నేతృత్వంలోని తిరుగుబాటు దళాల్లో చేరారు. 1962లో గ్వాటిమాలా గెరిల్లా ఉద్యమంలోనూ 1963 మార్చి నుంచి అర్జెంటీనా గెరిల్లా ఉద్యమంలోనూ ఈయన పాల్గొన్నారు. అర్జెంటీనా ఉద్యమం అల్జీరియన్ల మద్దతుతో గువేరా స్నేహితుడు మసెట్టీ నేతృత్వంలో జరిగింది. కాంగో యాత్ర తర్వాత 1966 మార్చిలో బొలీవియా వెళ్లారు ఎంబిలీ.

అక్కడి ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ చే ప్రవేశానికి రంగం సిద్ధం చేశారు. బొలీవియా ఉద్యమంలో పాల్గొన్న ఎంబిలీ (ఎంబిలీని బొలీవియాలో రికార్డోగా పిలిచేవారు) 30 జూలై 1967లో, అతని సోదరుడు అర్చురో అక్టోబర్ 8న శత్రుదళాల చేతుల్లో హతులయ్యారు. అదే నెలలో గువేరా పట్టుబడ్డారు.

1965 ఏప్రిల్ 1న హవానా బేస్ నుంచి కాంగో వెళ్తున్న గెరిల్లా దళాలకు క్యాస్ట్రో వీడ్కోలు పలికారు. గువేరా మాత్రం మూడు వారాలపాటు హవానాలోనే గడిపారు. తిరుగు ప్రయాణం కోసం ఆయన కొంత విశ్రాంతి తీసుకున్నారు. ఆయన తిరిగి కాంగో వెళ్లే విషయం ఎవరికీ తెలియదు. ఐతే క్యాస్ట్రో మద్దతుతోనే ఆయన వెళ్తున్నారు. మాస్కో విమానంలో మారువేషంలో ఆయన ప్రయాణించారు. క్యూబా నుంచి ఆయనతో వెళ్లిన ఓ చిన్న బృందం మొదట కైరోలో దిగి, అక్కడి నుంచి ఏప్రిల్ 19న దార్ ఏ సలామ్ చేరుకుంది. ఆయన క్యూబాను విడిచి వెళ్ల దానికి ముందు క్యాస్ట్రోకు ఓ వీడ్కోలు ఉత్తరం రాశారు. అది ఆరునెలల తర్వాత అక్టోబర్‌లో హవానాలో ప్రచురితమైంది. "క్యూబా విప్లవంలో నా బాధ్యత తీరిందని భావిస్తున్నా. ఐతే క్యూబా మీద ఎలాంటి న్యాయపరమైన హక్కులూ నాకు లేవు. నా సేవల్ని వినియోగించుకునేందుకు ప్రపంచంలోని ఇతర దేశాలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నాయి." ఇది ఎంతో జాగ్రత్తగా డిజైన్ చేసిన లెటర్లా కనిపిస్తుంది. క్యాస్ట్రోతో చే ఇంకా ఇలా అన్నారు. "మీరు క్యూబా నాయకుడిగా బాధ్యతలు నిర్వహించాల్సి వున్నందున మీరు చేయలేని పని నేను చేయగలను" ఈ విషయంలో క్యాస్ట్రోతో తనకు విభేదాలు లేవని చే స్పష్టం చేశారు. "మన విప్లవోద్యమపు విదేశీ విధానాన్ని నేను గుర్తించాను. దాన్నే నేను కొనసాగిస్తున్నా."

కాంగో యాత్ర పూర్తి కావడానికి ఓ నెలరోజుల ముందు ప్రచురితమైన ఈ లెటర్ బహుళ ప్రచారం పొందడమేగాక వివాదాస్పదంగా మారింది. చే తనను తాను ప్రత్యేకంగా భావించి ఉండాల్సింది కాదని, క్యాస్ట్రో కూడా ఆ లెటర్‌ను బయట పెట్టకుండా ఉండాల్సిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గెరిల్లా యుద్ధం కోసం క్యూబా పౌరసత్వాన్ని వదులుకోవాలన్న ఆలోచన, చే మిగతావారితో తీవ్రంగా విభేదించారన్న భావన కలిగించింది.

దార్ ఏ సలామ్ ఎయిర్ పోర్టులో చే నేతృత్వంలోని గెరిల్లా దళాలకు క్యూబన్ అంబాసిడర్ ప్యాబ్లో రివల్టో స్వాగతం పలికారు. స్కూల్ టీచర్‌గా పని చేసిన ఈయన కొన్ని నెలల క్రితం టాంజానియా రాయబారిగా నియమితులయ్యారు. క్యూబా విప్లవంలోనూ ఈయన పాల్గొన్నారు. ఈయన ద్వారానే 1960లో లుముంబాకు క్యాస్ట్రో ఓ సమాచారం అందించాలనుకున్నారు. ఐతే అది కార్యరూపం దాల్చలేదు. టాంజానియా ప్రభుత్వానికి ఓ రాయబారిగా తన పూర్తి సహకారం అందించారు. జంజిబార్ విప్లవాన్ని ప్రోత్సహించిన అబ్దుల్ రహ్మాన్ సహా ఆఫ్రికాలో జరుగుతున్న వివిధ విముక్తి ఉద్యమాలతో రివల్టాకు సంబంధాలున్నాయి. టాంజానియా ప్రభు త్వంలో రహ్మాన్ మంత్రిగా చేశారు(1996 ఆగస్టులో లండన్‌లో మరణించారు).

నల్లజాతికి చెందిన ఓ పెద్ద విదేశీ గుంపు అక్కడికి వెళ్లినపుడు సిఐఏకు అనుమానం వస్తుందని చేకు తెలుసు. ఐనా ఆయన ఆందోళన చెందలేదు. ఆ సమయంలో సిఐఏ తూర్పు ఆఫ్రికాలో గడ్డుస్థితిని ఎదుర్కొంటోంది. అపుడు చే కాంగో యాత్రపై అమెరికాకు అందింది తప్పుడు సమాచారమే. చే బ్రజ్జావిల్లే ద్వారా వెళ్లినట్టు ఆ సమాచారం. 1990 వరకూ అదే నిజమనుకున్నారు. ఐతే దార్ చేరుకున్న క్యూబన్ బృందానికి మొదట క్లిష్ట పరిస్థితే ఎదురైంది.

కాంగో భవిష్యత్ పై చర్చించేందుకు సీనియర్ నేతలెవరూ అందుబాటులోకి రాలేదు. కైరోలో సుదీర్ఘ చర్చల్లో మునిగిపోయిన సౌమాలియట్, కబీలాలు వారి డిప్యూటీలైన మసెంగో, మిటౌడీలను పంపించారు. ఆ సమయంలో వాళ్లంతా తమలో తమకున్న విభేదాలపైనే శ్రద్ధ చూపడంతో పరిస్థితి నిరుత్సాహంగా ఉంది. కనీసం చేను క్యూబా విప్లవ నేతగా కూడా వారు గుర్తించలేకపోయారు. ఎలాంటి నిర్ణయాలూ చేయలేని ఆంటోనీ గాడ్ ఫ్రాయ్ అలియాస్ ట్రిమెండ్ అనే జూనియర్ నేత మార్గదర్శకుడిగా వ్యవహరించారు. టాంజానియా నుంచి టాంజానియికా సరస్సువైపు వెళ్లాలని క్యూబా టీంకు ఆయన సూచించారు.

స్పష్టంగా చెప్పాలంటే అక్కడికి వెళ్లిన దగ్గరి నుంచి చే ఆలోచనలతో ఆఫ్రికన్ విప్లవకారుల ఆలోచనలు కుదరలేదు. ఆ తర్వాతి సంవత్సరం అవే రకం విభేదాల్ని బొలీవియన్ల నుంచి చే ఎదుర్కొన్నారు. బయటి వాళ్లేవరో వచ్చి తాము ఎలా విప్లవం చేయాలో చెప్పడమేమిటీ అన్న

భావన స్థానిక నేతల్లో బలంగా ఉండేది. క్యూబన్లు మాత్రం తమను తాము శుద్ధ అంతర్జాతీయవాదులుగా భావించుకునేవారు. అమెరికన్ సామ్రాజ్యవాదులు ఎక్కడ ఉంటే అక్కడ తాము ప్రత్యక్షమవుతూ అంతిమంగా ప్రపంచ విప్లవ లక్ష్యాన్ని చేరుకోవాలన్న ఆసక్తి వారిలో వ్యక్తమయ్యేది. కాంగో నేతల్లోనూ, బొలీవియన్ కమ్యూనిస్టు నేతల్లోనూ అంతటి ఉన్నత లక్ష్యాలు కనిపించక పోయేది. వారి ఆలోచనలన్నీ జాతీయవాదం దగ్గరే ఆగిపోయేవి. తమ ఆధిపత్య గొడవలకే పరిమితమయ్యేవి. ప్రపంచ రాజకీయాల పట్ల వారికి తగినంత జ్ఞానం లేకపోయింది.

చేతో రివల్టా సుదీర్ఘంగా చర్చించారు. ఆఫ్రికాపై చే ఆలోచనల్ని రివల్టా ఆ తర్వాతి సంవత్సరాల్లో వెల్లడించారు. కాంగోను బేస్‌గా చేసుకుని ఆఫ్రికా దేశాల్లో విప్లవోద్యమాల్ని నిర్మించాలన్నదే చే ప్రణాళిక. కాంగో ఉద్యమకారులకిచ్చే శిక్షణ మిగతా దేశాలకుపయోగపడుతుందని ఆయన భావించారు. ముఖ్యంగా దక్షిణా ఫ్రికాకు. టాంజానియికా సరస్సు పశ్చిమ తీర ప్రాంతాన్ని విముక్తి ప్రాంతంగా చేయాలన్నది ఆయన ఆలోచన. దాన్ని కాంగో గెరిల్లాలతోపాటు మిగతా దేశాల ఉద్యమకారులకు శిక్షణా కేంద్రంగా చేయాలన్నది ఆయన ప్రణాళిక. అది ఆఫ్రికా ఖండానికి మధ్యలో ఉండటమేగాక పక్కనే స్నేహ దేశం టాంజానియా ఉండటం అనుకూలమైందిగా చే గుర్తించారు. ఇది వినేవారికి ఓ పాఠ్యాంశంగా అనిపిస్తుంది. కానీ, ఆ తర్వాతి సంవత్సరమే బొలీవియాలో ఇదే తరహా ప్రయోగానికి చే యత్నించారు. ఐతే ఇది పనామా కెనాల్ జోన్‌లో అమెరికా చేసిందానికి ప్రతిచర్యగా ఉంటుంది. స్పానిష్ మాట్లాడే అడవి ప్రాంతంలో ల్యాటిన్ అధికారుల ద్వారా అమెరికా చేసింది అదే. వియత్నాంలో నేర్చుకున్న విప్లవ ప్రతీఘాత చర్యల్ని పనామా ప్రాంతంలో అమెరికా అమలు చేసింది. అమెరికాకు ప్రతిగా క్యూబన్లు అదేరీతిన బదులివ్వాలనుకున్నారు.

1965 ఏప్రిల్ 22న గువేరా నేతృత్వంలోని 14మందితో కూడిన క్యూబా బృందం మూడు మెర్సిడెస్ బెంజ్ కార్లలో దార్ ఏ సలామ్ నుంచి టాంజానియికా సరస్సు వైపు బయలుదేరింది. అది ఎండాకాలం, పగలు వెచ్చగా ఉంటే రాత్రి చల్లని వాతావరణం. వారి వెంట వెళ్తున్న లారీలో ఓ మోటార్ బోట్ ఉంది. సరస్సును దాటి కాంగో చేరేందుకు దాన్ని ఉపయోగిస్తారు.

వారి కాన్వాయ్ డోడోమా ద్వారా సరస్సు తీరాన కిగోమా పట్టణానికి వెళ్లింది. కిగోమా పక్కనే ఉన్న ఉజీజి గ్రామానికి చారిత్రక ప్రాధాన్యత ఉంది. వందేళ్ల క్రితం 1871లో డేవిడ్ లివింగ్స్టన్ అనే మతాధికారితోపాటు అమెరికన్ జర్నలిస్ట్ హెన్రీ స్టాన్లీ ఎన్కౌంటర్లో చనిపోయింది అక్కడే.

దార్ను వదిలి వెళ్లడానికి ముందు గువేరా తన దగ్గరున్న స్వాహిలీ డిక్షనరీని బైటకు తీశారు. క్యూబా నుంచి తనతో వెళ్తున్నవారికి ఆ డిక్షనరీ ఆధారంగా పేర్లు మార్చేశారు. విక్టర్ డ్రెకే పేరు: మోజా, మార్టినెజ్ తమయో పేరు: ఎంబిలీ, గువేరా పేరు: టాటు. తమ శత్రువుల్ని కన్ఫ్యూజ్ చేయడానికే ఈ పేర్ల మార్పిడి. కాంగో వాసుల దృష్టిలో అందరిలోకి తెల్లగా ఉండే గువేరా పేరు టాటు. మోజా, ఎంబిలీలు నాయకులుగా వ్యవహరిస్తే ఈయన వారికి మధ్యవర్తిగా వ్యవహరించారు. ఎప్పుడు గమనించినా టాటూనే అందరికీ ఇంచార్జ్గా వ్యవహరించడం చూసి కాంగోవాసులు ఆశ్చర్యపోయారు. చేతో వెళ్లిన క్యూబా టీం కిగోమాలో ఓ రవాణా కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంది. ఆ తర్వాత సరస్సు దాటి కాంగోలోని కిబంబా గ్రామానికి చేరుకుంది. అక్కడ వారికి కాంగో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ స్వాగతం పలికింది. వారంతా చైనా నుంచి వచ్చిన ఆయుధాలతో ఖాకీ దుస్తుల్లో కనిపించారు. వారిలో ఒకరు చేతో ఫ్రెంచ్లో మాట్లాడారు. క్యూబన్ల దగ్గరున్న ఆధునిక ఆయుధాల్ని చూసి వారు ఆకర్షితులయ్యారు.

ఆపరేషన్ ఎలా కొనసాగించాలి, విముక్తి ప్రాంతాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న ప్రణాళిక క్యూబా నుంచి వెళ్లిన టీంలో ఒక్క చే దగ్గర మాత్రమే ఉంది. కల్నల్ హోరే కిరాయి సైనికులు ఆర్నెళ్ల క్రితమే దక్షిణాన ఆల్బర్ట్ విల్లే-కలేమీతోపాటు ఉత్తరాన బుకావూను ఆక్రమించగా, ఫిజీ, బరాకా పట్టణాలు మాత్రం మిత్ర గెరిల్లాల ఆధీనంలో ఉన్నాయి. క్యూబన్లు వెళ్లిన ప్రాంతం 1967లో కల్నల్ హోరే రచన "కాంగో మెర్సినరీ"లో వర్ణించినట్టు పర్వతాల వరుసలతో నిండివుంది. "ఫిజీబరాకా ప్రాంతం వేల్స్కు రెండింతలుంటుంది. టాంజానియికా సరస్సు చివరన ఉవీరా నుంచి 150 మైళ్ల పొడవున దక్షిణాన కబింబా వరకు, ఉత్తరాన 30 మైళ్ల పొడవున ఆల్బర్ట్విల్లే వరకు అది విస్తరించి ఉంది. ఈ ప్రాంతమంతా పర్వతాలతో, నదులతో, మలుపులు తిరిగిన దారులతో నిండివుంది."

క్యూబన్లను ఆశ్చర్యపరచిన మరో విషయం అక్కడ ఉన్న వేలాదిమంది టుట్సీలు. వీరంతా రువాండాకు చెందినవారు. వీరిలో చాలామంది కొన్ని శతాబ్దాలుగా కాంగోలో ఉంటున్నారు. మరికొందరు మాత్రం రువాండా స్వాతంత్ర్యానంతరం హుటూలు జరిపిన మారణకాండ వల్ల శరణార్థులుగా వచ్చినవారు. వీరిలో దాదాపు 4వేలమంది కాంగో కోసం పోరాడారు. శరణార్థులు మాత్రం కాంగో విప్లవం తర్వాత తమ స్వదేశానికి వెళ్లాలనుకున్నారు. చైనాలో శిక్షణ పొందిన ముందండి వీరికి నాయకత్వం వహించారు. క్యూబన్లతో చర్చల్లో ఆయనే ప్రముఖంగా పాల్గొన్నారు. దార్ ఏ సలామ్‌లో చౌ ఎన్‌లైతో చర్చల తర్వాత ఈయన స్థానంలోకి కబీలా వచ్చారు (జూన్ మధ్యలో).

చే బృందం కాంగో చేరుకున్న తర్వాత కొన్ని నెలలపాటు క్యూబా నుంచి గెరిల్లా దళాలు రాసాగాయి. 18 మందితో కూడిన మొదటి బృందం 35 ఏళ్ల టెర్రీ రోడ్రిగ్వేజ్ అలియాస్ అలీ నేతృత్వంలో మే 8న కాంగో చేరుకుంది. ఈయన క్యూబా విప్లవంలోనూ పాల్గొన్నారు. (ఆ తర్వాత క్యూబాలో జరిగిన ఓ ప్రమాదంలో మర ణించారు.) 34 మందితో రెండో బృందం ఉస్మానీ అలియాస్ బ్రాసిరో నేతృత్వంలో మే చివరన, 39 మందితో మూడో బృందం 25 ఏళ్ల విల్లేగ్యాస్ అలియాస్ పోంబో నేతృత్వంలో వచ్చింది. ఈ బృందాన్ని రక్షణ కోసం క్యాస్ట్రో పంపారు. చేతో క్యూబా విప్లవంలో పాల్గొన్న పోంబో ఆ దేశ పరిశ్రమల మంత్రిగా చేశారు. పోంబో బృందం 1966 జూలైలో బొలీవియాకు వెళ్లింది. 1967 అక్టోబర్లో చే మరణంతో పోంబో బృందం చిలీకి పారిపోయి అటునుంచి సురక్షితంగా హవానాకు చేరుకుంది. పోంబో 1975లోనూ 1981-90ల మధ్య అంగోలా పోరాటాల్లో పాల్గొన్నారు.

అరగోన్స్ అలియాస్ టెంబో(ఏనుగు) నేతృత్వంలో నాలుగో బృందం సెప్టెంబర్ చివరన చేరుకుంది. ఈయన గువేరాతో ఫిబ్రవరిలో పెకింగ్ సందర్శించారు. ఈ బృందంతో వచ్చిన మరో నేత ఆస్కార్ ఫెర్నాండేజ్ మెల్ అలియాస్ సికీ. ఈయన డాక్టర్. క్యూబా విప్లవంలో పాల్గొన్న గువేరా సన్నిహిత మిత్రుల్లో ఒకరు(తర్వాత లండన్‌లో రాయబారిగా చేశారు). వీరిద్దరూ క్యూబన్ ప్రభుత్వంలో సీనియర్లు. అరగోన్స్ క్యూబన్ కమ్యూనిస్టు పార్టీలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ.

చివరగా ఐదో బృందం అక్టోబర్‌లో చేరుకుంది. ఈ బృందంతో క్యూబా ఆరోగ్యమంత్రి మకాడో వెంచూరా వచ్చారు. కాంగోవాసులు కోరినట్టుగా 50 మంది డాక్టర్లు అవసరమా అన్నది ఆయన పరిశీలించారు.

మే మధ్యలో మొదటి బృందం చేరుకున్న తర్వాత చేతోపాటు ఓ చిన్న బృందం సరస్సు తీరంలోని కిబంబా క్యాంప్ నుంచి లులూవాబర్గ్ పర్వతం మీది అప్పర్ బేస్కు చేరుకుంది. అక్కడి పర్వతాల వరుసలో అదే ఎత్తయింది. అది కిబంబా నుంచి 5 కి.మీ. దూరంలో ఉంది. సరస్సు నుంచి అక్కడికి 4గంటల ప్రయాణం. "క్యూబా పర్వతాల కన్నా ఇవి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి." అంటూ ఓ క్యూబన్ అన్నాడు. అక్కడ ఉదయం పది గంటల వరకూ దట్టమైన పొగమంచు ఉంటుంది. దాన్ని ఓ కత్తితో తుంచుకుంటూ ముందుకు వెళ్లాలి. ఈ విషయంలో క్యూబన్లకు శిక్షణ లేదు. శిక్షణ సమయంలో వారికి అది బల్లపరపుగా ఉండే అటవీ ప్రాంతంగా చెప్పారు. ఈ ప్రాంతంలో ఎలా ముందుకు సాగాలనేదానిపై ఇద్దరు కాంగో కమాండర్లతో కలిసి గువేరా, ఎంబిలీలు ప్రణాళిక రూపొందించారు. అప్పర్ బేస్ నుంచి నాలుగు దిశలుగా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. తూర్పున లులింబాకు, దక్షిణ దిశగా బెండేరా, కబింబాలకు, ఉత్తర దిశగా పిజీ-బరాకాల వైపుగా ముందుకు సాగాలి. మోజా, ఎంబిలీల నేతృత్వంలో ఈ యాత్ర రెండు వారాల్లో పూర్తి కావాలి. చే మాత్రం లారెంట్ కబీలా కోసం అప్పర్ బేస్ దగ్గరే వేచివుంటారు.

క్యూబన్ దళాలు వెళ్లిన దారిలో పెద్ద సంఖ్యలో మిత్ర దళాలు వీరికి తోడయ్యాయి. ఇంకా ముందుకు వెళ్తే మాత్రం శత్రు దళాలు బలంగా ఉన్నాయని వారు చెప్పారు. పిజీ సెక్టార్లో కాంగో దళాలకు తగినంత ధైర్యం లేదని మోజా గ్రహించారు. పట్టణం బయట మొదటిసారిగా షోంబే క్యాంప్‌ను వారు చూశారు. అక్కడ పెద్ద సంఖ్యలో కిరాయి సైన్యాన్ని గుర్తించారు. వారు చిన్న విమానాలతోపాటు హెలికాప్టర్లు ల్యాండయ్యేందుకు ఓ బేస్ ఏర్పాటు చేసుకున్నారు. మిత్ర దళాలు ముందుకు వెళ్లి ఆ తర్వాత వెనక్కి వచ్చాయి. వారు చెప్పిన విషయాలతో వాస్తవ పరిస్థితిని చే రెండు మాటల్లో విశ్లేషించారు. సమఉజ్జీ కాకపోవడం, నిర్మాణం లేకపోవడం. కాంగోవాసులు క్యూబన్లకు ఘనస్వాగతం పలికారు. ఐతే స్థానిక తిరుగుబాటు నేత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

కబీలా, మిటౌడీలు స్థానిక నేతల్లాకాక టూరిస్టుల్లా వ్యవహరించారు. నాయకత్వం అవసరమైనపుడు వారు అందుబాటులో లేకపోవడంతో స్థానికుల్లో నిరసన వ్యక్తమైంది బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన కమాండర్లు చుట్టూ జనం ఉండగానే ఎలాంటి జంకూబొంకూ లేకుండా సుపుగా త్రాగుతూ, పుష్టిగా విందార గించేవారు. అవసరంలేని ప్రయాణాలతో అనవసరంగా పెట్రోల్ ఖర్చు చేసేవారు. సరైన శిక్షణ లేకపోవడం వల్లే వాళ్లు అలా వ్యవహరించారని క్యూబన్లు గ్రహించారు. అలాంటి స్థితిలో వారిని ఎలా ఆర్గనైజ్ చేయాలన్నది క్యూబన్ల ముందున్న సమస్య కబీలా వచ్చేదాకా క్యూబన్లకు మిటౌడీ గైడ్‌గా వ్యవహరించాల్సివుంది. ఆయన కాంగోలియన్ల సీనియర్ నేత. ఐతే, జూన్ 7న జరిగిన ఓ సంఘటనలో టాంజానియికా సరస్సులో ఆయన శవమై తేలారు. అది ప్రమాదమా? లేక హత్యనా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. దాంతో క్యూబన్లు కాంగో దళాలతో ఎలా వ్యవరించాలన్న సందిగ్ధంలో పడ్డారు. అంతటి నిరాశకర పరిస్థితుల్లోనూ క్యూబన్లు ధైర్యం కోల్పోలేదు. ఆల్బర్ట్ విల్లే, బెండేరాల మధ్య రోడ్డు మార్గంలో దాడులు జరిపేందుకు కెప్టెన్ ఎంబిలీ సిద్ధమయ్యారు. ఆ రెండు పట్టణాల్లోనూ హోరే కిరాయి సైనికులతో పాటు షోంబే దళాలు తిష్టవేశాయి. ఐతే, ఆ రెండు పట్టణాల మధ్యనున్న రోడ్డు మార్గంపై తిరుగుబాటు దళాలే బలంగా ఉన్నాయి. ఆల్బర్ట్ విల్లే నుంచి బెండేరా వైపు రెండు కార్లలో ప్రయాణిస్తున్న శత్రు దళాలపై క్యూబన్లు దాడి జరిపారు. వాటిలో నలుగురు కిరాయి సైనికులుండగా, మరో నలుగురు బెల్జియన్ సైనికులున్నారు.

ఈ ఆపరేషన్ గురించి హోరే తన జ్ఞాపకాల్లో ప్రస్తావించాడు. లెఫ్టినెంట్ గ్రాహమ్ తన అనుచరులతో కార్లలో వెళ్తుండగా మెషీన్ గన్లతో ఆకస్మాత్తుగా దాడి జరిగిందని హోరే చెప్పుకున్నాడు. ఈ దాడిలో ఏడుగురు చనిపోగా, ఒకడు బతికి బయటపడ్డట్టు వెల్లడించాడు. క్యూబన్లు చేసిన ఈ దాడి విలువైందే ఐనా రాజకీయంగా పెద్ద ముందడుగేమీ కాదు. మరోవైపు కాంగో నేతల్లో అనైక్యత, విభేదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అది కాంగోవాసులకేగాక హవానాకు సైతం క్లిష్టమైన పరిస్థితే..

ఆ ఏడాది మధ్యవరకెల్లా చేతో సహా క్యూబన్లంతా డీలా పడ్డారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో అనారోగ్యానికి గురయ్యారు. చే అస్తమా, మలేరియాలతో నీరసించారు. విప్లవకారులుగా వారికిది అనుకోని చేదు అనుభవమే. పరిస్థితులు మెరుగవుతాయన్న సూచనలు కూడా లేవు.

తమ వాళ్లకు పరిస్థితి ఎందుకిలా ఎదురు తిరుగుతుందో ప్రపంచానికి మరోవైపున హవానాలో ఉన్న క్యాస్ట్రోకు అర్థం కాలేదు. తమకక్కడ ఎందుకంత నిరాశ ఎదురవుతుందో వివరంగా డైరీలో నోట్ చేసుకుంటున్న చే వాటిని వెంటనే క్యాస్ట్రోకు తెలియజేయడం సరైంది కాదనుకున్నారు.

క్యూబా నుంచి శిక్షణ పొందిన గెరిల్లాల్ని టాంజానియా మార్గంలో పంపించడం మాత్రం ఆగిపోలేదు. పరిస్థితిని అంచనా వేసేందుకు సెప్టెంబర్ ప్రారంభంలో క్యూబా ప్రభుత్వానికి ఓ అవకాశం వచ్చింది. క్యూబన్ల ఆహ్వానంతో హవానా వెళ్లిన సౌమాలియట్ అక్కడ రెండు వారాలు గడిపారు. సౌమాలియట్ అక్కడికి వెళ్లడం చేకు ఇష్టం లేదు. ఐతే, చే అనుమానించినంతగా హవానాకు ఆయన తమ బాధల గాథల్ని వివరించలేదు. ఓ దశలో విప్లవోద్యమం ముందుకు సాగుతున్నట్టుగా క్యాస్ట్రోకు నమ్మబలికారు. సౌమాలియట్ కోరిక మేరకు 50 మంది డాక్టర్లను పంపేందుకు క్యూబన్లు అంగీకరించారు. ఐతే రివల్గా నుంచి తనకొచ్చిన సమా చారంతో క్యాస్ట్రోకు అనుమానం కలిగింది. డాక్టర్ల అవసరం ఏ మేరకు ఉందో తెలుసుకునేందుకు ఆరోగ్యమంత్రి వెంచూరాను అక్కడికి పంపాలని నిర్ణయించారు. అక్టోబర్ ప్రారంభంలో అక్కడికి చేరుకున్న వెంచూరా యుద్ధ సమయంలో డాక్టర్లను పంపించడం తీవ్ర తప్పిదమన్న చే అభిప్రాయంతో ఏకీభవించారు.

అప్పటికే హోరే కిరాయి సైన్యపు దాడితో క్యూబన్లు ఆందోళనకు గురయ్యారు. దాంతో, ఆల్బర్ట్ విల్లే నుంచి ఉత్తర దిశగా వెళ్లే కిరాయి సైన్యాన్ని లక్ష్యంగా రోడ్డు మార్గాన తన బలగాల్ని మోహరించారు చే. ఐతే, ఈ దారిని వదిలేసిన హోరే పెద్ద సంఖ్యలో తన బలగాల్ని వ్యతిరేక దిశగా ముందుకు కదిలించాడు.

సెప్టెంబర్ చివరన రాత్రివేళ తన బలగాల్ని సరస్సు దాటించిన పకోతే, క్యూబన్లకు ఉత్తర దిక్కున ఉన్న తీరాన మోహరించాడు.

క్యూబన్లు వెన్నుదన్నుగా నిలిచినా కాంగో తిరుగుబాటుదారులు మాత్రం కిరాయి సైన్యాన్ని ఎదిరించలేకపోయారు. కాంగో చేరుకున్న ఆర్నెళ్ల తర్వాత అక్టోబర్ చివరి వరకల్లా హోరే మనుషులు క్యూబన్ స్థావరాలన్నిటినీ చుట్టుముట్టగలిగారు. సెప్టెంబర్ చివరన బరాకాను స్వాధీనం చేసుకున్న కిరాయి సైన్యం ఆ తర్వాత పది రోజులకు ఫిజీని ఆక్రమించింది. దక్షిణాన లుబోండ్జా, లులింబాల వైపు కదిలింది.
ఆ సమయంలోనే చే తమ దళాల్ని లులువాబర్గ్ పర్వతం మీది అప్పర్ బేస్ వైపు వెనక్కి మళ్లించారు. ఆ ప్రాంతాన్ని దీర్ఘకాలిక ప్రతిఘటన కోసం సిద్ధం చ్చే ఉంచారు. తిరుగుబాటు దళాలకూ, కిరాయి సైనికులకూ మధ్య ఈ డ్రామా ముగింపు దశకు చేరుకోగా, దౌత్యపరంగా మరో పరిణామం జరిగింది. ఆఫ్రికన్ దేశాలు అధ్యక్షుడు కసావుబూకు ఓ ప్రతిపాదన చేశాయి. ప్రధాని పదవి నుంచి షోంబేను తొలగించి ఆ స్థానంలో ఎవరిస్తే కింబాను నియమించాలని ప్రతిపాదించాయి. దీన్ని అనుకూల పరిణామంగా చే భావించారు. ఐతే, ఈ ప్రతిపాదన వల్ల ఓ వైపు షోంబే ప్రభుత్వం కూలిపోతుంది, కానీ, మరోవైపు తిరుగుబాటు దళాలకు ఆఫ్రికన్ దేశాలు తమ మద్దతు నిలిపివేయాలి. పదిరోజుల తర్వాత అక్టోబర్ 23న క్వామే క్రుమా అధ్యక్షతన ఆఫ్రికన్ దేశాల అధినేతల సమావేశం ఆక్రాలో జరిగింది. ఈ సందర్భంగా కసావుబూ ఓ ప్రకటన చేశాడు. తన దేశంలో తిరుగుబాట్లు అణచి వేత ముగిసినందున కిరాయి తెల్ల సైనికుల్ని వారి స్వదేశాలకు పంపిస్తానన్నాడు. ఆఫ్రికా దేశాలు కోరుకుంది అదే.. ఐతే, అందుకు బదులుగా వీరు సోమాలియట్ నేతృత్వంలోని తిరుగుబాటు దళాలకు మద్దతు ఉపసంహరించాలి.

ప్రగతిశీల ఆఫ్రికా దేశాలకిది ఘోర పరాజయమే. ఆఫ్రికా దేశాల్లో అధికార సమతుల్యత మారిపోయింది. ఓ దశాబ్దంపాటు అదే పరిస్థితి కొనసాగింది సుదీర్ఘకాలం అధికారాన్ని అనుభవించిన తెల్ల జాతీయులకు మెజార్టీ నల్ల జాతీయుల చేతికి అధికారాన్ని బదలాయించడం ఇష్టం లేదు.

1965 నవంబర్ 11న వాతావరణం అనుకూలంగా ఉందంటూ రొడీషియాలో ఐయాన్ స్మిత్ (స్థానిక తెల్లజాతి నేత) తనకు తాను స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. అంగోలా, మొజాంబిక్, గ్వినియా-బిస్సావుల్లో పోర్చుగీస్ పాలన 1975 వరకూ కొనసాగింది. ఈ దశలో ప్రగతిశీల పాలకులకు చేదు అనుభవాలే ఎదురయ్యాయి. జూన్‌లో బెన్బెల్లా అధికారాన్ని కోల్పోగా 1966లో క్రుమా చైనా పర్యటనలో ఉండగా పదవీచ్యుత దయ్యారు. మొరక్కొ ప్రతిపక్ష నేత బెన్‌బుర్కాను ప్యారిస్‌లో కిడ్నాప్ చేసి హత మార్చారు. 1966 జనవరిలో హవానాలో జరిగిన మూడు ఖండాల అంతర్జాతీయ సదస్సు నిర్వహణలో ఈయనది కీలక పాత్ర. ఆ సదస్సుకు ప్రపంచ నలుమూలల నుంచి విప్లవ నేతలు హాజరయ్యారు.

చే నేతృత్వంలో క్యూబన్లు అక్కడ ఉండటం కల్నల్ హోరేతోపాటు కిరాయి తెల్ల సైనికులపై తీవ్ర ప్రభావం చూపింది. షోంబే తొలగింపుతో స్పందించిన హోరే తమ మనుషుల పట్ల గౌరవంగా వ్యవహరించాలంటూ జనరల్ మొబూటూను కోరాడు. అక్రాలో కసావుబూ ప్రకటన వెలువడ్డ వారం రోజులకు తానే స్వయంగా లియోపోర్ట్విల్లేకు వెళ్లి మొబూటూను కలిశాడు. హోరే తన జ్ఞాపకాల్లో ఇలా రాసు కున్నాడు. "సైన్యం నుంచి తెల్ల సైనికుల తొలగింపుపై తనను సంప్రదించకపోవడం పట్ల జనరల్ మొబూటూ తీవ్ర ఆగ్రహంతో ఉన్నాడు. అది ఆయనకు మింగుడు పడలేదు." ఆ తర్వాత నూతన ప్రధాని కింబా. కాంగోలో ప్రశాంతత నెలకొనేవరకూ తెల్ల సైనికుల్ని పంపించాలన్న ఆసక్తి తమకు లేదంటూ మరో ప్రకటన చేశాడు వాస్తవానికి జరిగింది మాత్రం వేరుగా ఉంది. అక్టోబర్ చివరికల్లా హోరేతోపాటు కిరాయి తెల్ల సైనికుల్లో కొందరిని దక్షిణాఫ్రికాకు తిప్పి పంపారు. ఐతే, చాలామంది మరో ఏడాదిపాటు అక్కడే ఉండిపోయారు. చే సైతం అలాంటి క్లిష్ట పరిస్థితుల్నే ఎదుర్కొన్నారు. దార్ ఏ సలామ్‌లో ఉన్న పడిల్లా నుంచి నవంబర్ 1న ఆయనకో అత్యవసర సమాచారమందింది. ఇక క్యూబా దళాలకు సాయమందించకూడదని టాంజానియా ప్రభుత్వం నిర్ణయించింది. అక్రా సమావేశం తర్వాత వారీ నిర్ణయం తీసుకున్నారు. కాంగో నేతల మధ్య తలెత్తిన అంతర్గత కలహాలు తమ ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపడంతో అధ్యక్షుడు నైరేరీ చేతులెత్తేశారు.

ఓవైపు కిరాయి సైన్యం ముందుకు దూసుకువస్తుండగా, మరోవైపు తిరుగుబాటు దళాలు పోరాటాన్ని విరమించేందుకు సిద్ధం కావడం చేపై ఒత్తిడి పెంచింది. ఆ సమయంలో చే ఇతర ప్రణాళికలపై ఆలోచించసాగారు. ఎంపిక చేసిన 20 మందితో ముందుకు వెళ్తూ ఉద్యమాన్ని విస్తరించాలనుకున్నారు. మరో నిర్మాణం కోసం ప్రయత్నించడం, లేదంటే మరో చోట రక్షణ పొందడం ఆ ప్రణాళికల్లో ఉన్నాయి. కాంగో ఆపరేషన్ చివరి రోజుల్లో చైనా సాయం కోరుతూ చౌ ఎన్ లైకి చే లెటర్ రాసినట్టు ప్యాబ్లో రివల్టా చెప్పారు. చే అక్కడే ఉంటూ ఉద్యమాన్ని నిర్మించాలని, దాడులు మాత్రం చేయొద్దని చౌ ఎన్ లై సలహా ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ సలహా పట్ల ఆసక్తి చూపిన చే.. చురుకైన దళ సభ్యులతో ముందుకు కదిలి క్విలూలోని ములేలా దళాల్ని చేరుకొని, ఆ తర్వాతే ఉద్యమాన్ని కొనసాగించాలనుకున్నారు. ఐతే, దీన్ని తెగువతో కూడిన ఆలోచనగా భావించిన క్యూబా ప్రభుత్వం వద్దని వారించింది. అలాంటి సంకటస్థితిలో "మనమింకా ఏం చేయగలం?" అంటూ చే ఆవేదన వ్యక్తం చేశారు. ఇది నవంబర్ 20న జరిగింది. తిరుగు ప్రయాణానికి తన సహచరుల్ని సిద్ధం చేశారు. యుంగాలోని చిన్న రేవు నుంచి సరస్సు దాటి టాంజానియా చేరు కున్నారు. ఆ సమయంలో తిరుగుబాట్ల పట్ల రైతుల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. చేసేదేమీ లేక కాంగో తిరుగుబాటు నేతలంతా వెనక్కి తగ్గారు. జరిగిన సంఘటన గురించి క్యాస్ట్రో కొనేళ్ల తర్వాత వెల్లడించారు. "చివరి దశలో కాంగో విప్లవ నేతలంతా పోరాటాన్ని నిలిపివేయాలని నిర్ణయించారు. వారి సహచరులంతా ఉద్యమం నుంచి విరమించుకున్నారు. ఆచరణలో అది సరైన నిర్ణయమే. ఆ సమ యంలో ఇంకా పోరాటాన్ని ముందుకు నడిపించడం సాధ్యం కాదని మా పరి శీలనలో అర్థమైంది."

వందలమంది క్యూబన్లు టాంజానియికా సరస్సు తీరాన చేరారు. వారందరినీ కిగోమా తరలించేందుకు మూడు చిన్న పడవల్ని సిద్ధం చేశారు. వారి వెంట దాదాపు 40 మంది కాంగో తిరుగుబాటుదారులు బయలుదేరారు. వందలాదిమంది వారి సహచరులు తీరం దగ్గరే ఉండి వీడ్కోలు పలికారు. వారికది కలవరపరిచే అవమానకర సన్నివేశం.

చుట్టుపక్కల శత్రువులు మోహరించి ఉండగానే చే బృందం ఎలాంటి ఆటంకాలూ లేకుండా సరస్సు దాటింది. మూడు లారీల్లో దార్ ఏ సలామ్ చేరుకుంది. దార్‌లో కొన్ని రోజులపాటు వారు గడిపారు. అక్కడి నుంచి మాస్కోకు వెళ్లి రెండు సోవియట్ విమానాల్లో సరాసరి హవానాకు చేరుకున్నారు. క్యాస్ట్రోతోపాటు ఆయన సోదరుడు రౌల్ ఓ సీనియర్ నేత ఇంటికి వెళ్లి అక్కడ జరిగిందేమిటో వివరంగా చర్చించారు.

కాంగో అనుభవం నుంచి చే ఓ పాఠం నేర్చుకున్నారు. జరిగిన పొరపాటు మళ్లీ చేయకూడదనుకున్నారు. స్థానిక నేత సూచనల కోసం నిరంతరం వేచివుండేకన్నా తానే నాయకత్వం వహించాలని నిర్ణయించుకున్నారు. 1966 డిసెంబర్లో న్యాన్ క్యావజ్ క్యాంప్‌లో అదే అనుసరించారు. మాస్కో అనుకూల బొలీవియన్ కమ్యూనిస్టు నేత మారియో మంజేతో ఉద్యమ నాయకత్వాన్ని ఇద్దరం కలిసే నిర్వహిద్దా మంటూ ప్రతిపాదించారు. అందుకు సమ్మతించని మంజే క్యాంప్ విడిచి వెళ్లిపోయారు. ఆ సంఘటన తర్వాత బొలీవియన్ గెరిల్లాలు బయటి మద్దతు తీసు కునేందుకు ఇష్టపడలేదు. విప్లవోద్యమాన్ని సురక్షితంగా కొనసాగించడం కోసం కాంగోలో చే, క్యూబాలో క్యాస్ట్రో అదే చేశారు. మూణ్ణెల్ల తర్వాత 1967 మార్చిలో గెరిల్లాలు పోరాటానికి సిద్ధమయ్యారు. ఏప్రిల్లో బొలీవియా సైన్యంపై దాడులు ప్రారంభించారు. హవానాతో సంబంధాలు లేకుండానే కొనసాగిన ఆ పోరాటం కొన్ని నెలలకే క్షీణదశకు చేరుకుంది. తానుగా చొరవ తీసుకుని ఆ పోరాటాన్ని నడిపిన చే అక్టోబర్‌లో ఓ రోజున శత్రువు చేతికి చిక్కారు. ఆ మరుసటి రోజే ఆయన్ని కాల్చేశారు.

కాంగో యాత్ర గురించి వివరిస్తూ తనకు తాను నిందించుకున్నారు చే. అక్కడ ఉద్యమం కొనసాగించకపోవడం తన తప్పిదంగా ఒప్పుకున్నారు. అందుకు దారి తీసిన పరిస్థితుల్ని వివరించారు. హవానా విడిచి వెళ్తున్న సందర్భంగా తాను రాసిన వీడ్కోలు ఉత్తరాన్ని అక్టోబర్లో క్యాస్ట్రో విడుదల చేయడం వల్ల తన నైతికత ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

తన యాత్ర ముగింపు దశకు చేరుకున్న సమయంలో అక్కడి తిరుగుబాటు దళాలకు అందులోని విషయాలన్నీ తెలిసిపోయాయన్నారు. లెటర్ ద్వారా పార్టీ నాయకత్వంలో తన స్థానం, తన మంత్రిత్వ శాఖ, క్యూబన్ పౌరసత్వంలాంటి వివరాలు వెల్లడయ్యాయన్నారు. ఆ ప్రకటన అంత హానికరమైంది కానప్పటికీ దాన్ని ప్రచురించడం వల్ల అది చేతో-క్యూబన్లకూ, క్యాస్ట్రోకూ మధ్య ఊహించని అగాధాన్ని సృష్టించింది. ఆ సమయంలో తనకు తన పదేళ్లనాటి గతం గుర్తుకొచ్చిందన్నారు చే."క్యూబన్లకు నేనపుడే పరిచయమైన పరాయి దేశస్తుడిని" మళ్లీ ఓసారి అలాంటి భావనకే చే లోనయ్యారు. కాంగో కోసం తనతోపాటు పోరాడ మని తన క్యూబన్ మిత్రుల్ని అడగలేకపోయానంటూ ఆయన గుర్తు చేసుకున్నారు. ఆపై రెండేళ్లు గడవక ముందే తూర్పు బొలీవియా అడవుల్లో విషాదకర పరిస్థితుల్లో ఆయన్ని చూడాల్సి వచ్చింది. స్వీయ నిర్ణయంతో తన సన్నిహితులతో కలిసి చే అక్కడ పోరాడారు. కాంగో అనుభవం నేర్పిన పాఠాలుండగా, తిరిగి అదే తరహా చేదు అనుభవం ఎదురవుతుందని ఎవరూ ఊహించలేకపోయారు.

ఆ తర్వాతి పరిణామాల్ని గమనిస్తే ఆఫ్రికాలో క్యూబన్లు వెనక్కి తగ్గలేదు. గ్రాంగోలో ఎదురైన ప్రతికూల అనుభవం నుంచి వారు మరో ప్రయత్నానికి అవసర మైన జ్ఞానాన్ని సాధించారు. తాను ల్యాటిన్ అమెరికా కోసం (కాంగో యాత్ర కన్నా) ముందుగానే రూపొందించుకున్న ప్రణాళికను అమలు చేయడం కోసమే చే బొలీవియా వెళ్లారు. ఆ తర్వాతి రోజుల్లో ఆఫ్రికా రాజకీయాల్లో క్యాస్ట్రో ప్రధాన భూమిక పోషించారు. కాంగోలో చే సాహస యాత్రకు ఎదురైన ఆటంకాలను దృష్టిలో ఉంచుకొని కొంతకాలం సహనం పాటించిన క్యాస్ట్రో, ఆఫ్రికాలో ఆ తర్వాత వెల్లువెత్తిన విప్లవోద్యమాలన్నిటికీ అండగా నిలిచారు. ముందుగా 60వ దశకపు చివరి రోజుల్లో, గ్వినియా-బిస్సావులో పోర్చుగీస్ పై పోరాడుతున్న అమిల్కార్ కేబ్రల్కు తన దేశ మిలటరీ నిపుణుల ద్వారా సాయమందించారు.

1975లో అంగోలాకు పెద్ద సంఖ్యలో క్యూబన్ దళాల్ని పంపి అగొస్టినో నేటో నేతృత్వంలోని MPLAకు అండగా నిలిచారు. వారపుడు దక్షిణాఫ్రికా తెల్ల సైన్యంతో పోరాడారు. 80వ దశకంలోనూ అంగోలాకు సాయమందించారు.

దీర్ఘకాలంపాటు ఓ క్రమం లేకుండా గెరిల్లా పోరాటాలు నిర్వహించిన క్యూబన్లు ఆ తర్వాత మిలటరీ జోక్యం ద్వారా నిర్మాణాత్మక మద్దతునిచ్చే స్థాయికి ఎదిగారు. 1977-78ల్లో ఇథియోపియా-సొమాలియాల మధ్య సంఘర్షణ జరుగుతుండగా క్యూబా తమ దళాల్ని పంపింది. అమెరికా అధికారుల అంచనా ప్రకారం ఆఫ్రికా లోని 16 దేశాల్లో జరిగిన పోరాటాల్లో కనీసం 27 వేలమంది క్యూబన్లు పాల్గొన్నారు. కాంగో చరిత్రను మార్చేందుకని వందమందితో వెళ్లిన చే తన ప్రయత్నంలో వైఫల్యం చెందాక కొన్నేళ్లకి ఇలా జరిగింది.

రిచర్డ్ గాట్

************

నేను ఎన్నోసార్లు చెప్పాను. అది ఎంత కష్టమైంది ఐనా ఏదో ఒకరోజు ప్రారంభిస్తానని... ఈ పుస్తకం రాసిన వ్యక్తి నన్ను ఎంతగానో ప్రభావితం చేశారు. నాకు తెలిసినంతవరకూ అంతటి గౌరవనీయమైన వ్యక్తి మరొకరు లేరు. దురదృష్టవశాత్తూ ఆయనిపుడు మన మధ్య లేరు. ఉండివుంటే 30 ఏళ్ల క్రితం ఆయన చెప్పిన విషయాలపై ఆయనే వివరణ ఇచ్చేవారు. ఇప్పుడేం చెప్పాల్సి వుంటుందో కూడా చెప్పేవారు. నేనెందుకిలా అంటున్నానంటే అవి ఎంతో సంక్లిష్ట మైన విషయాలు కనుక. ఇప్పుడు ప్రచురిస్తున్న "కాంగో విప్లవోద్యమ డైరీలు". చే వ్యక్తిగత ఆర్కైవ్స్‌లో భద్రపరచిన ఓ డాక్యుమెంట్ కు సంబంధించినవి. చరిత్ర కోసం ఎంతో బాధ్యతగా చేసిన వివిధ పరిశీలనలు, కొన్ని దిద్దుబాట్లు, ఎన్నో తీసివేతలు (నోట్స్‌లో ఉన్న కొట్టివేతలు) అందులో ఉన్నాయి. దీనికన్నా ముందు చే చేసిన ఇతర రచనలన్నీ ఇప్పటికే అందుబాటులోకొచ్చాయి. ఇందులో మార్పులు చేసేం దుకు సంపాదకులకు ఆయన స్వేచ్ఛ ఇచ్చారు. ఐతే, మాకు ఆయన వ్రాతప్రతుల పట్ల ఉన్న గౌరవంతో యథాతథంగా మీ ముందుంచుతున్నాం.. కాంగో యాత్ర పూర్తయ్యాక ఆయన ఇవన్నీ రాసి ఉంచారు. ఆనాటి పోరాట అనుభవాలపై తన లోతైన విశ్లేషణల్ని ఆయన ఇందులో పొందుపరిచారు. ఆ అనుభవ పాఠాలన్నీ తదుపరి విప్లవోద్యమాలకు ఉపయోగపడాలన్నదే ఆయన ఆకాంక్ష.

ముందుమాటలో ఆయన ఇలా అన్నారు. "ఇది ఓ వైఫల్యపు చరిత్ర". ఐతే, ఆయన మాటలతో నేను ఏకీభవించను. దాన్ని ఓ వైఫల్యంగా చెప్పిన ఆనాటి ఆయన మానసిక స్థితిని నేను స్పష్టంగా అర్థం చేసుకోగలను. అది ఓ సాహసంగా నేను భావిస్తాను. ఆఫ్రికా దేశాల్లో కొంతకాలం గడిపి వచ్చినవారికి నా మాటలు అర్థమవు తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఆఫ్రికన్ ప్రజలు యూరోపియన్ వలసపాలకుల చేతుల్లో శతాబ్దాలుగా అవమానాలపాలయ్యారు. ఏదో ఒక రూపంలో అది నేటికీ కొనసాగుతూనే ఉంది. పరాయి పాలకులు తమ సంస్కృతుల్నీ మతాల్నీ వారిపై బలవంతంగా రుద్దుతూ సహజంగా అభివృద్ధి చెందాల్సిన వారి నాగరికతను పక్షవాతంతో చచ్చుబడేలా చేశారు. వారి సహజ సంపదల్ని దోపిడీ చేసి, వారిని వారి సొంత గడ్డపైనే బానిసలుగా మార్చి, అత్యంత నీచంగా అవమానించిన గుర్తులు ఏనాటికీ మాసిపోవు. ఆనాటి నీచత్వానికి కారణమైనవారే నేటికీ తమ ఆధి పత్యాన్ని ఏదో ఒక రూపంలో కొనసాగింప చూస్తుంటే..

అక్కడి స్థానికులు తిరగ బడుతున్న సందర్భాలు అభినందనీయం.

చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తుంది. విప్లవోద్యమాలతో చే ఎందుకలా మమేక మయ్యారని. ఆ ఉద్యమాలకు సాయమందించేలా ఆయన్ని అంతగా ప్రేరేపించిం దేమిటీ అని.. ఇలాంటి అనుమానాలకు ఆయనే సమాధాన మిచ్చారు."అమెరికా సామ్రాజ్యవాదాన్ని కేవలం సైనికంగా ఎదిరిస్తే సరిపోదు. దాని మూలాలపై దెబ్బ కొట్టాలి. ప్రపంచాధిపత్యం కోసం అది వలస, నయా వలసల్లో జోక్యం చేసు కుంటోంది."

ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో పోరాటం కొనసాగించాలని చే ఎల్లప్పుడూ ఆకాంక్షించేవారు. ఐతే, మనిషిపై జీవితం విధించే పరిమితుల్లోనే ఆయన ప్రసిద్ధి చెందారు. ఆయన త్యాగాలు గెరిల్లా యుద్ధంకన్నా కఠినమైనవి. అనుకూల భౌతిక పరిస్థితులున్నపుడే తన కలల్ని నిజం చేసుకోవాలని ఆరాటపడ్డారు. తమ కోసం పోరాడగలడని ఆయనపై నమ్మిక ఉంచిన కామ్రేడ్స్ పట్ల ఎంతో బాధ్యతగా ఆలో చించేవారు. దీన్నిబట్టి ఆయనకున్న రాజకీయ పరిపక్వత ఏమిటో అర్థమవుతోంది. ఆయన మొదటిసారి ఆఫ్రికాను సందర్శించినపుడు. ఆ సమయంలో అక్కడి విప్లవోద్యమాల్లో చురుకైన నాయకులుగా ఉన్నవారిలో కొందరితో మాట్లాడే అవ కాశం ఆయనకు లభించింది. విప్లవ కాంక్షతోపాటు వారిలో వారికున్న విభేదాలు ఆయన్ని ప్రభావితం చేశాయి. ఎప్పటికప్పుడు ఆయన క్యాస్ట్రోతో సంప్రదించేవారు. 1964 డిసెంబర్లో క్యాస్ట్రో రాసిన ఓ లెటర్ అప్పట్లో ప్రచురితం కాలేదు. ఎదురైన పరిస్థితులకనుగుణంగా క్యూబా తీసుకున్న చర్యల్ని అది స్పష్టం చేస్తోంది.

"చే. ఇంతకుముందే సెర్జియో నాతో మాట్లాడారు. అక్కడ జరుగుతుందేమిటో పూర్తిగా వివరించారు. కార్యక్రమాన్ని చివరిదాకా తీసుకెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందీ లేదని అర్థమవుతోంది. దయోక్లీజ్ స్వయంగా మీకు వివరిస్తారు. ఎలాంటి ఫార్ములా అనుసరించాలో మీరిక్కడికి తిరిగి వచ్చాక నిర్ణయిస్తాం. మనకున్న ప్రత్యామ్నాయాల్లో దేన్ని మనం ఎంచుకోవాలో మన మిత్రునికి (అహ్మద్ బెన్బెల్లా) తెలిసివుండాలి. మీరు మాకందించే సమాచారం సురక్షితంగా ఉండేలా చూడండి."

చేతోపాటు ఆయన నిర్ణయాన్ని అమలు చేయడం కోసం అక్కడికి వెళ్లిన క్యూబా బృందాన్ని

ఎన్నటికీ మరచిపోలేం.. "అమెరికా సామ్రాజ్యవాదానికి ఎదురు నిలిచిన ఒకే ఒక్క సోషలిస్టు దేశంగా.. పోరాడుతూ చావడానికైనా సిద్ధపడ్డ మా సైనికుల్ని దూర తీరాన ఉన్న ఓ పరాయి దేశానికి పంపించాం. మా చర్యలకు మా దేశస్తులంతా తమ పూర్తి మద్దతు తెలిపారు. సమకాలీన ప్రపంచంలో అమెరికా సామ్రాజ్య వాదానికి ఎదురు నిలిచి పోరాడటం ద్వారా మేమేంటో స్పష్టం చేశాం. కాంగో పోరాటంలో పాల్గొనడం మా వీరత్వానికి గుర్తుగా నిలుస్తుంది."

చేతో వెళ్లిన బృందానికి ఓ లక్ష్యం ఉంది. కాంగో విముక్తి పోరాటాన్ని బలోపేతం చ్చే ఐక్య సంఘటన ఏర్పరచాలి. దాన్నుంచి ఎంపిక చేసిన యోధుల ద్వారా ఆఫ్రికా సంపూర్ణ విముక్తి కోసం పోరాటాన్ని కొనసాగించాలి. ఈ నూతన విప్లవం కోసం క్యూబాలో నేర్చుకున్న అనుభవాన్ని ఆయన ఉపయోగించారు. కాంగో వెనకబాటుకు కారణమైన కఠినమైన వాస్తవాలు ఆయనపై తీవ్ర ప్రభావం చూపాయి. వారిలో రాజకీయ చైతన్యం లేకపోవడం ఓ పెద్ద లోపంగా కనిపించింది. ఐతే, తమ ప్రజల గౌరవప్రదమైన జీవితం కోసం పోరాడాలన్న కోరిక అక్కడి ఉద్యమకారుల్లో వ్యక్త మైంది. వారిపట్ల ఎంతో అభిమానంతో స్పందించిన చే ఓ ప్రవక్తలా ఆలోచించారు.

ఆఫ్రికా చరిత్రలో ఆ తర్వాత 30 ఏళ్లకుపైగా జరిగిన పరిణామాలు వారిలో మిలటరీ విద్యను అభివృద్ధి చ్చే విప్లవస్ఫూర్తిని రగిలించాయి. అంగోలా, ఇథియో పియా, నమీబియాలాంటి దేశాల్లో వారు ఘన విజయాలు సాధించారు. వారు సాధించిన విజయాలే ఆఫ్రికా దేశాల స్వాతంత్ర్యానికీ, సార్వభౌమత్వానికి రాళ్లుగా నిలిచాయి.

కాంగోలో చే కార్యకలాపాలపై వివరణ ఇవ్వడంలో క్యూబన్ విప్లవకారులు జాగ్రత్తగా వ్యవహరించారు. తమపై వ్యక్తమైన అనుమానాల పట్ల కొన్ని నెలలపాటు సహనం వహించారు. చే ఇంకా అక్కడ పోరాటంలో కొనసాగుతుండగానే ఆయన రాసిన వీడ్కోలు ఉత్తరాన్ని ప్రచురించాలని పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆయన మన మధ్య లేకుండా పోవడంతో, మిగతా వివరాల్ని వెల్లడించడానికి చాలాకాలం పట్టింది. విప్లవోద్యమంలో చారిత్రక పాత్ర నిర్వహించిన ఆ వ్యక్తి గురించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు క్యూబన్ ప్రజలతోపాటు మిగతా ప్రపంచం వేచి ఉండక తప్పలేదు.

తన నోట్స్‌లో ఆయన ఓ అభిప్రాయానికొచ్చారు. ఆ లెటర్ తనకూ, క్యూబన్ యోధులకూ మధ్య దూరాన్ని పెంచిందన్నారు. "మానవులకు తప్పనిసరిగా ఉండా ల్సినవి కొన్ని ఉంటాయి. ఐతే, అవి లేకుండా ఎంతో మంది ఉన్నారు. తనకంటూ ఓ కుటుంబం, భూమి ఓ దేశం లేదా ప్రాంతం అలాంటి వాటిని నేను సున్నితంగా తిరస్కరిస్తాను." ఇలాంటి ఆలోచనలతో ఉన్న ఆయన్ని తిరిగి క్యూబాకు రప్పించడ మంటే క్యాస్ట్రోకు ఎంత కష్టమో అర్థమవుతుంది. ఆయన్ని ఒప్పించేందుకు క్యాస్ట్రో ఎన్నోసార్లు, ఎన్నో విధాలుగా యత్నించారు కూడా. 1966 జూన్లో క్యాస్ట్రో ఆయనకు రాసిన ఓ లెటర్ ప్రచురితం కాలేదు. అందులో ఇలా అన్నారు.

'ప్రియమైన రామన్. లెటర్ రాయాలన్న నా ప్రణాళికల్ని పరిస్థితులు అధిగ మించాయి. కాంగోలో మీ అనుభవాల్ని వివరిస్తూ రాసిన పుస్తకాన్ని పూర్తిగా చదివాను. గెరిల్లా యుద్ధతంత్రాల విశ్లేషణ కూడా చదివాను. ముఖ్యంగా ఆ అనుభవాల్ని కార్లిటోస్ మాతృభూమిలో (కార్లోస్ గార్డెల్-అర్జెంటీనా వాగ్గేయ కారుడు) ఆచరణలో పెట్టాలన్న మీ ఆలోచనల్ని తెలుసుకున్నాను. కాంగోలోని మీ అనుభవాలన్నిటికీ అక్షర రూపం ఇవ్వడం ఎంతో ఆసక్తి కలిగించేదేగాక విలువైంది కూడా.

మీ పరిస్థితి గురించి... బ్రాసిరోకు మీరు రాసిన లెటర్ ఇప్పుడే చదివాను. డాక్టర్ (అలైదా మార్చ్)తో మాట్లాడి వివరంగా తెలుసుకున్నాను. మన కామ్రేడ్స్కు సలహా కూడా ఇచ్చాను. అక్కడ పరిస్థితి అనుకూలంగా లేనపుడు తిరిగి రావాల్సిం దిగా మిమ్మల్ని కోరమని... అందరి మనసులోనూ అదే ఉంది. ఐతే, మీరు మాత్రం బయటనే ఉండేందుకు నిశ్చయించుకున్నారు. మీ ఆలోచన అదేనని మీరు బ్రాసిరోకు రాసిన లెటర్ ద్వారా స్పష్టమవుతోంది. ఈ సమయంలో ఆ విషయమై ఇంకా ఏమీ చెప్పలేను. మీ పరిస్థితి ఎప్పుడైనా ఆందోళనగా ఉంటే మాత్రం ఇక్కడికి రావడమే మంచిదని చెప్పగలను. కానీ, మీరు మాత్రం క్యూబాలో అడుగుపెట్టేం దుకు ఏ అవకాశాన్నీ వినియోగించుకునేందుకు ఇష్టపడటం లేదని నాకు స్పష్టంగా అర్థమవుతోంది. మీరు ప్రశాంతంగా ఆలోచించగలిగితే మీకున్న అభ్యంతరాలన్ని టినీ పక్కకు నెట్టవచ్చునని చెప్పగలను. ఐతే నేను చెప్పేది విప్లవకారుల దృష్టిలో న్యాయసమ్మతమవుతుందా లేదా అన్నది మాత్రం చెప్పలేను. పనిమధ్యలో (half Way) వెళ్లడం వల్ల ఎన్నో ఇబ్బందులెదురవుతాయి. అవసరమైన సంప్రదింపులు జరపడం

కష్టమవుతుంది, ప్రణాళికలు అమలు చేయడం ఆలస్యమవుతుంది. స్పష్టతలేక వేచి ఉండటం వల్ల అసహనానికీ, అనవసర ఉద్విగ్నతకీ దారితీస్తుంది.

దీనికంతకీ కారణమేంటి? నిబంధన గానీ, గౌరవం లేదా విప్లవ నైతికతగానీ మిమ్మల్ని నిలువరించే ప్రశ్నే లేదు. మీ లక్ష్యాల్ని సాధించడానికి అవసరమైన సదు పాయాలన్నీ మీరిక్కడ ఉపయోగించుకునే వీలుంది. ప్రణాళికలు రూపొందించుకోవ దానికి, కార్యకర్తల్ని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడానికి, మీకిక్కడ ఎన్నో అనుకూల వసతులున్నాయి. మీరిక్కడికి వచ్చి వెళ్లడం అవినీతికరమని, మోసపూరితమని ఎవరూ ఆరోపించలేరు. ఈరోజుగానీ, భవిష్యత్‌లోగానీ ఇది తప్పని ఎవరూ అనలేరు. నిజానికి చావుతో సమానమైంది లేదా క్షమించరాని తప్పిదమేంటంటే మంచిగా చేయగలిగే అవకాశమున్నపుడు చెడుగా చేయడం, విజయం సాధించే అవకాశమున్నపుడు వైఫల్యం చెందడం.

మీ ప్రణాళికల్ని మానుకోవాలని లేదా వాయిదా వేసుకోవాలని నేను సలహా ఇవ్వను. అభిప్రాయభేదాలు తలెత్తినందుకు నిరాశ చెందడం లేదు. వాటిని సులభంగానే అధిగమించగలమనీ, మన ప్రణాళికల్ని మరింత అనుభవంతో, అవగాహనతో విజయవంతం చేయగలమని భావిస్తున్నా. మనకున్న అవకాశాల్నీ, వనరుల్నీ అత్యున్నత వివేచనతో ఉపయోగించుకోవాలని ఆశిస్తున్నా. మన ముందున్న సమస్యల్లా పాత ప్రణాళికను కొత్త వాతావరణంలో ఆచరించడానికి సంబంధించినది. మీ ప్రణాళికల్ని సమీక్షించుకునేందుకు, పటిష్ఠ నిర్మాణంతో ఆచరణలో పెట్టేందుకు ఎన్నడూ లేనివిధంగా మీకిపుడు తగినంత సమయం చిక్కింది. మీకిక్కడ అవసరమైన అన్ని వనరులూ దండిగా ఉన్నాయి. మీ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక వ్యవసాయ క్షేత్రాలు, పర్వతాలతో కూడిన విశాల మైదానాలున్నాయి. మీకు సాయపడేందుకు అవసరమైనంతమందిని ఉపయోగించుకునే వీలుంది. కొద్ది మందికి మినహాయించి మీరెక్కడ ఉండేది కూడా ఎవరికీ తెలియదు. మీపై ఎలాంటి రాజకీయ ఒత్తిడిలూ ఇక్కడ ఉండవు. మీరిప్పటికే అధికార బాధ్యతల నుంచి తప్పుకోవడంతో మీకు ఆ ఇబ్బందులు కూడా లేవు. మీరు కుట్రలూ, కుతంత్రాలూ పన్నుతున్నారంటూ మిమ్మల్ని నిందించేవారుగానీ, మీకు జరిమానాలు విధించేవారు

గానీ ఇక్కడ ఎవరూ లేరు. ఇన్ని మంచి అవకాశాల్ని వదులుకోవడం సరైందేనా? విప్లవకారులుగా మీ చారిత్రక కర్తవ్య నిర్వహణ కోసం ఆదర్శపూరిత వాతావరణం ఇక్కడ ఉంది. ప్రజా విజయాన్ని కాంక్షిస్తూ జరిపే నిర్ణయాత్మక పోరాటం కోసం మానవీయంగా ఆలోచించాల్సిన సమయమిది.

మనకు అవకాశమున్నపుడు వనరుల్ని ఎందుకు ఉపయోగించకూడదు? మన కర్తవ్యం కోసం కనీస సమయం కూడా అవసరం లేదా? ఎందుకంత అమిత వేగం? మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, బొలీవర్, మార్టి అలా ఎందుకు వెళ్లలేదు? తగిన సమయం కోసం వారు దశాబ్దాలపాటు ఎందుకు వేచివున్నారు?

మనుషుల మధ్య దూరాన్ని తగ్గించేందుకు, వారి కర్తవ్యాల్ని వేగవంతం చేసేం దుకు అప్పట్లో విమానంగానీ, రేడియోగానీ లేవు. మనం ఇక్కడికి తిరిగి రావడానికి మెక్సికోలో 18 నెలలపాటు ఉండకతప్పలేదు. అలాగని మిమ్మల్ని దశాబ్దాలు లేదా సంవత్సరాలపాటు వేచివుండమని చెప్పను. మీరనుకున్నది చేయడం కోసం ఇప్పుడున్నదాని కన్నా పరిస్థితులు మెరుగుపడేవరకూ కొన్ని నెలలపాటు మాత్రమే. వచ్చే 14కు మీ వయసు 28 అనుకుంటా. ఎవరికైనా ఆ వయసులో ముసలితనం ప్రారంభమవుతుందని చెప్పగలరా? ఇలా చెబుతూ ఆందోళన కలిగించడం నా ఉద్దేశం కాదు. మీరు ఓపిగ్గా విశ్లేషించుకుంటే నేను చెప్పేది సరైందని ఒప్పుకో గలరు. మీరు ఇందుకు పూర్తిగా భిన్నమైన నిర్ణయం తీసుకున్నా నేను బాధపడను. మీ పట్ల నాకున్న గాఢమైన అభిమానంతో, మీ అత్యున్నత మేధస్సు, దోషరహితమైన ప్రవర్తన, తలవంచని విప్లవ హృదయం పట్ల ఉన్న గౌరవంతో నేనిదంతా చెబుతున్నా" అదే ఏడాది చే తిరిగి క్యూబా వెళ్లారు.

కాంగో విప్లవ మొదటి వార్షికోత్సవంలో పాల్గొన్నపుడు చేతో పని చేసిన కామ్రేడ్స్ కొందరితో మాట్లాడే అవకాశం నాకు లభించింది. ఈ పుస్తకాన్ని ప్రచు రించే విషయమై వారితో చర్చించా. సునిశిత విశ్లేషణలు చేసే చే రచన తమకు మార్గదర్శంగా ఉంటుందన్నారు. అప్పట్లో జరిగిన పొరపాట్లు తిరిగి జరకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అందులో అనేకమంది నాయకుల గురించి చే ప్రస్తావించారు. వారిలో ఆ దేశ ప్రస్తుత అధ్యక్షుడు లారెంట్ కబీలా (ఆ తర్వాత లారెంట్ కొడుకు జోసెఫ్ కబీలా ఆ దేశ అధ్యక్షుడయ్యారు) కూడా ఉన్నారు.

చే పట్ల వారికున్నఅభిమానాన్ని గౌరవాన్ని నాకు గుర్తు చేశారు. ఆ సమయంలో వారంతా యువకులు. చే ఎంతో వినయంగా, నిరాడంబరంగా ఉండేవారని, తమను గౌరవించి తమ నాయకత్వంలోనే ఆయన పనిచేసినట్టు వారు గుర్తు చేశారు. అంతటి ఉన్నత వ్యక్తిత్వమున్నచే ఇచ్చే సూచనలు తమ దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. ఈ రచన పట్ల వారు ఎంతో ఆసక్తి చూపారు. ఇతరుల కోసం జీవించిన మనుషులు భౌతికంగా లేకున్నా వారు నిర్దే శించిన మార్గం తరతరాలకూ సజీవ స్ఫూర్తినిస్తుందనేందుకు ఇదే ఓ ఉదాహరణ.

- అలైదా గువేరా మార్చ్, జూన్ 1998

*************

అబ్దల్లా - ... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి

అఫెండే - ..... క్యూబన్ సైనికుడు

అగానో - ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి

అంచలి -..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి

అరోజైనీ - ..... క్యూబన్ సైనికుడు

అరోబో -. క్యూబన్ సైనికుడు

అజీ - ..... క్యూబన్ లెఫ్టినెంట్

బాటి -..... క్యూబన్ సైనికుడు

బహాజ -..... క్యూబన్ సైనికుడు - తీవ్రంగా గాయపడి కాంగో పోరాటంలో మరణించారు.

బస్సిర్ - ..... క్యూబన్ సైనికుడు

బరావా ..... టాంజానియికా సరస్సుపై పిజీ-ఉవీరా రోడ్డు మార్గంలోని చిన్న ఓడరేవు.

బెంబా, చార్లెస్ ..... కాంగో సైనికుడు, రాజకీయ(కమిస్సార్) ప్రతినిధి

బెండేరా, ఫెస్టస్ ..... రాజకీయ(కమిస్సార్) ప్రతినిధి

బిడాలిలా ..... కాంగో కల్నల్ – ఉవీరా ప్రాంతం

బొండో ..... టాంజానియికా సరస్సు ఒడ్డున ఉన్న గ్రామం.

బుజుంబురా ..... బురుండీ రాజధాని

బుకావు ..... కివూ ప్రావిన్స్ రాజధాని

బుకాలి ..... కాంగో వంటకం, కాసవా దుంపల పొడిని నీటిలో మరిగించి పేస్ట్గా చేస్తారు.

కెలిగ్నిటే ..... కాంగో కమాండర్

చాంగా ..... క్యూబన్ కెప్టెన్, కిగోమాలో ఉంటూ సరఫరాలు, సమాచార బాధ్యతలు నిర్వహించారు.

చెయి ..... క్యూబన్ సైనికుడు

కాంపేగ్ని ..... రువాండన్ యోధుడు

దస్సుసి ..... క్యూబన్ సైనికుడు-ప్రచార నిర్వహణలో చేకు సహాయకుడు

దవా ..... స్వాహిలీ భాషలో ఔషధం-శత్రు దాడుల నుంచి తమను కాపాడుతుందని కాంగోవాసుల నమ్మకం.

దువాల ..... క్యూబన్ సైనికోద్యోగి

పౌమే ..... కటెంగాలో కాంగో గెరిల్లా నాయకుడు

ఫిజీ ..... టాంజానియికా సరస్సు పక్కనున్న పట్టణం.

ఫ్రాంకోయిస్ ..... కాంగో కమాండర్-ముందండితోపాటు ప్రమాదంలో మరణించారు.

ఫ్రంట్ డీ ఫోర్స్ ఫ్రంట్ బెందేరా ..... ఆల్బర్ట్‌విల్లే-లులింబా రహదారి పక్కనున్న ప్రాంతం, ఇక్కడే శత్రు సైన్యానికి జల విద్యుత్ కేంద్రం ఉంది.

బెన్యే ..... తిరుగుబాటు కాంగోకు స్వయం నియమిత అధ్యక్షుడు, అడౌలా ప్రభుత్వంలో హోంశాఖ మంత్రి.

గిజెంగా ..... కాంగో మాజీ ఉప ప్రధాని, షోంబే కాలంలో అరెస్టయి, మొబూటూ కాలంలో విడుదలయ్యారు.

హంజిని ..... క్యూబా సైనికుడు

హింది ..... క్యూబన్ డాక్టర్

హంకుము ..... క్యూబన్ సైనికుడు

హంసేనీ ..... కాంగో కమాండర్ (అప్పర్ బేస్, లుబుండ్జో స్థావరాల్లో)

ఇలా, జీన్ ..... కాంగో కమాండర్ (కలోండా – కిబుయే దళాలకు)

ఇలుంగా, ఎర్నెస్ట్ ..... కాంగో యోధుడు – చేకు స్వాహిలీ ఉపాధ్యాయుడు

ఇఫ్రిని ..... క్యూబన్ సైనికుడు

ఇజ్రాయెల్ ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి

జుంగో ..... టాంజానియికా సరస్సు స్థావరానికి దక్షిణ దిశగా ఉన్న గ్రామం.

కబాంబేర్ ..... ఆల్బర్ట్ విల్లే – స్టాన్లీవిల్లే రోడ్డుపై ఉన్న గ్రామం. చాలా కాలంపాటు విప్లవ దళాల స్వాధీనంలోనే ఉంది.

కబీలా ..... విప్లవ సుప్రీం కౌన్సిల్‌కు రెండో ఉపాధ్యక్షుడు, తూర్పు ఫ్రంట్ నేత

కబింబా ..... టాంజానియికా సరస్సు పక్క గ్రామం, శత్రు ఆక్రమణలో ఉంది.

కయెలా ..... కసీమా-కిసోసీల మధ్యనున్న గ్రామం.

కలోండా-కిబుయే ..... కటెంగా-లులింబా రోడ్డు పక్కనున్న వ్యవసాయ గృహం, కాంగో గెరిల్లా దళాల స్థావరం.

కన్యాంజ ..... గంజా-ఫ్రంట్ డీ ఫోర్స్ మధ్యనున్న రువాండన్ గ్రామం.

కంజా .... కాంగో రాజకీయ నేత, ఔన్యే ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి.

కపిట..... కాంగో గ్రామ రాజకీయ నేతకు మారుపేరు.

కరంబా ..... బరాకా – కసీమా మధ్యనున్న ప్రాంతం.

కరీం ..... క్యూబన్ లెఫ్టినెంట్

కరుమే ..... జంజిబార్ అధ్యక్షుడు, టాంజానియా మొదటి ఉపాధ్యక్షుడు.

కసాబువాబు, ఎమ్మాన్యెల్ ..... సాధారణ సిబ్బంది సరఫరాల బాధ్యుడు.

కసాయి ..... కాంగోలోని ఓ ప్రావిన్స్, ఇక్కడే ములేలే పని చేశారు, డైమండ్ నిల్వలున్న ప్రాంతం.

కసాలి ..... కాంగో కమాండర్

సాంబలీ ..... క్యూబన్ సైనికోద్యోగి

కసెంగో ..... కాంగో నదీ రేవు, విప్లవ దళాలు బలంగా ఉన్న ప్రాంతం.

కసీమా ..... టాంజానియికా సరస్సు పక్కనున్న గ్రామం, బేస్ క్యాంప్ పై దాడి కోసం శత్రువు ఆక్రమించిన ప్రాంతం.

కాసులు ..... క్యూబన్ డాక్టర్, ఫ్రెంచ్ అనువాదకుడు, హైతీ జాతీయుడు.

కటంగా ..... కాంగో ప్రావిన్స్___కెల్లా సంపన్న ప్రాంతం, పరిశ్రమలున్న ప్రాంతం.

కటెంగా ..... ఆల్బర్ట్‌విల్లే-లులింబా రోడ్డు పక్కనున్న గ్రామం.

కవావా ..... క్యూబన్ సైనికోద్యోగి, ఫ్రంట్ డీ ఫోర్స్ పోరాటంలో మరణించారు.

కవావా ..... టాంజానియా రెండో ఉపాధ్యక్షుడు.

కజోలేలో-మకుంగో ..... కమాండర్ కేలిగ్జెటే క్యాంప్ ప్రాంతం.

కిబంబా ..... టాంజానియికా సరస్సు పక్కన కాంగో వైపునున్న బేస్ క్యాంప్ ప్రాంతం.

కిలివే ..... కింబీ నది ప్రాంతం, 24 అక్టోబర్ 1965న శత్రుదళాలు ఆకస్మిక దాడి జరిపిన ప్రాంతం.

కింబా ..... షోంబే అనంతర కాంగో ప్రధాని.

కింబీ ..... కాంగో ఉపనది, టాంజానియికా పర్వత ప్రాంతం.

కిసోసి ..... సరస్సు ఒడ్డున, రువాండసీ-కాయెలాల మధ్యనున్న గ్రామం.

కిస్వా ..... క్యూబన్ లెఫ్టినెంట్

కివూ ..... కాంగోలోని ప్రావిన్స్

కివే ..... జర్నలిజం విద్యార్థి, సాధారణ సిబ్బందికి ఇంటెలిజెన్స్ బాధ్యుడు.

కుమీ ..... క్యూబన్ డాక్టర్

ల్యాంబర్ట్ ..... లెఫ్టినెంట్ కల్నల్

లబిచాకో ..... టాంజానియికా పశ్చిమ పర్వత శ్రేణుల్లోని ఓ గ్రామం.

లుబోండ్జా ..... లులింబా-ఫిజీల మధ్య గ్రామం.

లుముంబా, ప్యాట్రిస్ (1925-61) :

స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతీయ నాయకుడు. బెల్జియం నుంచి 1960లో కాంగో విముక్తి పొందాక మొదటి ప్రధానిగా ఎన్నికయ్యారు. రెండు నెలలు మాత్రమే ఆ పదవిలో కొనసాగి గృహ నిర్బంధానికి గురయ్యారు. 1961 జనవరి 17న అనుమానాస్పద స్థితిలో మరణించారు. సిఐఏ కుట్ర చేసి చంపిందన్న ఆరోపణలున్నాయి. ఈయన మరణానంతరం కాంగోలోని వివిధ ఉద్యమ సంస్థలు తమను తాము లుముంబా అనుచరులుగా చెప్పుకునేందుకు ఆరాటపడ్డాయి. అలాంటి వారంతా లుముంబిస్టులుగా పిలువబడ్డారు.

లుబోండ్జా ..... లులింబా-ఫిజీల మధ్య గ్రామం.

లులింబా ..... ఆల్బర్ట్ విల్లే -బుకావు రోడ్డు పక్కనున్న గ్రామం.

మపూ ..... క్యూబన్ లెఫ్టినెంట్

మగంగా ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి

మకాంబిలా, జెరోమ్ ..... కాంగో జాతియోద్యమంలో డిప్యూటీగా వ్యవహరించారు.

మకుంగో ..... ఫ్రంట్ డీ ఫోర్స్ సమీప గ్రామం.

మరెంబే ..... క్యూబన్ సైనికుడు

మసెంగో ..... తూర్పు ఫ్రంట్ సాధారణ సిబ్బంది ఛీఫ్.

మౌరినో ..... క్యూబన్ సైనికుడు, ఉపసంహార సమయంలో కనిపించకుండా పోయారు.

ఎంబిలీ వింబోలో ..... క్యూబన్ యోధుడు, మిశ్రమ దళనేత.

మిటౌడీ ..... తూర్పు ఫ్రంట్ సాధారణ సిబ్బంది చీఫ్, ఓ ప్రమాదంలో మరణించారు.

మోజా ..... క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, క్యూబా అధికారులకు ఇన్స్ట్రక్టర్.

మొరొగోరో ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి

మౌలేన్ ..... మేజర్ జనరల్ పిజీ రెండో బ్రిగేడ్.

మయెంగా ..... పిజీ-బుకావు రోడ్డు పక్కనున్న గ్రామం.

ముగంగా ..... స్వాహిలీ భాషలో డాక్టర్, స్థానికంగా నాటు వైద్యుడు.

ముకుంది ..... ఆల్బర్ట్ విల్లే రైల్వే స్టేషన్‌కు సమీప ప్రాంతం.

ముందండి ..... రువాండన్ కమాండర్, ఫ్రంట్ డీ ఫోర్స్లో రువాండన్లకు కెప్టెన్గా వ్యవహరించారు.

ముస్తాఫ ..... క్యూబన్ సైనికుడు

ముచుంగో ..... విప్లవ సుప్రీం కౌన్సిల్ ఆరోగ్య మంత్రి, ఆపరేషన్స్ చివరి వరకూ కాంగోలోనే ఉన్నారు.

ముటేబా ..... కాంగో సాధారణ సిబ్బందికి సమాచార నిర్వాహకుడు.

నబీకుంబే ..... లుబోండ్జా-గంజాల మధ్యనున్న ఓ చిన్న గ్రామం.

నానే ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి

ఎన్‌బేగిరా ..... విప్లవ సుప్రీం కౌన్సిల్ విదేశాంగ మంత్రి, ఉవీరా ప్రాంతంలో చివరి వరకూ ఉన్నారు.

గంజా ..... రువాండన్ పశువుల కాపరులున్న గ్రామం.

గోజా, ఆంద్రే ..... కాంగో యోధుడు, కబేంబేర్ ప్రాంతం.

జెంబే ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి.

న్నే ..... క్యూబన్ లెఫ్టినెంట్, ఫ్రంట్ దీ ఫోర్స్ పోరాటంలో చనిపోయారు.

నార్-కటంగా ..... కాంగోలోని ఓ ప్రావిన్స్

న్యాంగీ ..... ఫ్రంట్ డీ ఫోర్స్ సమీప గ్రామం.

నైరేరే, జూలియస్ ..... టాంజానియా అధ్యక్షుడు

ఒలెంగా ..... కాంగో జనరల్ స్టాన్లీవిల్లే ఫ్రంట్ నేత

ఒట్టో ..... క్యూబన్ సైనికోద్యోగి

పాస్కాస ..... ములేలే ఫ్రంట్లో కాంగో కల్నల్, విప్లవకారుల మధ్య గొడవల వల్ల కైరోలో మరణించారు.

పోంబే .....కాసవా దుంపలు+మొక్కజొన్నలతో చేసే నాటు సారాయి.

పొంబో ..... క్యూబన్ లెఫ్టినెంట్

రబానినీ ..... క్యూబన్ సైనికుడు

రఫెల్ ..... టాంజానియాలో క్యూబా ప్రతినిధి.

రెబోకేట్ ..... క్యూబన్ లెఫ్టినెంట్

వల్డా, ప్యాబ్లో ..... టాంజానియాలో క్యూబా రాయబారి.

రువాండసీ ..... టాంజానియికా సరస్సు తీర ప్రాంతం, కిబంబాకు 4 కి.మీ దూరంలో ఉంది.

సలూమూ ..... కాంగో కెప్టెన్, చివరి రోజుల్లో కనీమా ఇంచార్జ్

సెలే ..... కిబంబాకు 15 కి.మీ. దూరంలోని గ్రామం.

సికీ ...... క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, సాధారణ సిబ్బంది నిర్వాహకుడు.

సింబా ..... స్వాహిలీ భాషలో "సింహ" అని అర్థం, కాంగో విముక్తి పోరాటంలో యోధులకిచ్చే గౌరవ నామం.

సింగిడా ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి.

సిటా ..... క్యూబన్ సైనికుడు

సిటైనీ ..... క్యూబన్ సైనికుడు, అనారోగ్యం వల్ల వెనక్కి వెళ్లారు.

సిటినీ ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి.

సౌమాలియట్ గేస్టన్ ..... విప్లవ సుప్రీం కౌన్సిల్ అధ్యక్షుడు

సుల్తాన్ ..... క్యూబన్ సైనికుడు

ట్యానో ..... క్యూబన్ సైనికుడు

టాటు ..... స్వాహిలీలో "మూడు" అని అర్థం, కాంగోలో చే మారు పేరు.

టెంబో ..... ఏనుగు అని అర్థం. ఎమిలియో అరగోన్స్ స్వాహిలీ పేరు, క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు.

తెలాతినీ ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి.

ట్రిమెండో పుంటో ..... చామలెసో మారు పేరు, మసెంగో సాధారణ సిబ్బంది సభ్యుడు.

టుమా ..... క్యూబా లెఫ్టినెంట్, సమాచార ప్రసారాల నిర్వాహకుడు.

టుమ ఎయినీ ..... సైనిక శిక్షణ ఇచ్చే క్యూబన్ అధికారి, చే సహాయకుడు.

ఉటా ..... క్యూబన్ కెప్టెన్

ఉవీరా ..... టాంజానియా సరస్సుకు ఉత్తర దిశగా ఉన్న గ్రామం.

జకారియాస్ ..... రువాండన్ కెప్టెన్

జివా ..... క్యూబా లెఫ్టినెంట్

జొంబే ..... కాసవా ఆకులతో చేసే కాంగో వంటకం.

***********

ఇది ఓ వైఫల్యపు చరిత్ర. జరిగిన సంఘటనల వివరాల్ని యుద్ధ కథనాల్ని ఎవరైనా ఆశిస్తారు. ఐతే, అవన్నీ ప్రతిస్పందనలతో, నిశిత విశ్లేషణలతో ఉన్నాయి. నా అవ గాహనలో ఇది అనుభవాల్ని వైఫల్యానికి కారణమైన వాస్తవ పరిస్థితుల్ని వివరిస్తుంది. ఇతర విప్లవోద్యమాలకు అవి ఉపయోగపడ్డాయి. విజయగాథలో పాజిటివ్ అనుభవాలుంటే ఓటమి కథలో అలా ఎందుకు జరిగిందనే వివరణ ఉంటుంది. ఇందులో నటులతోపాటు కథా వస్తువును సమకూర్చినవారంతా విదేశీయులు. వారంతా తమ జీవితాల్ని పణంగా పెట్టి అపరిచిత ప్రాంతంలో అపరిచిత భాష మాట్లాడే ప్రజల మధ్య పని చేసినవారు. అక్కడ వారికున్న సంబంధమల్లా కార్మిక అంతర్జాతీయత. ఆధునిక విముక్తి ఉద్యమాల్లో ఎక్కడా లేనివిధంగా వారికి స్వాగతం పలికిన సందర్భమది.

ఈ కథ ముగింపులో ఆఫ్రికా పోరాటాలపై కొన్ని ప్రశ్నలున్నాయి. అవి సామ్రాజ్య వాదానికి మరో రూపమైన నయా వలసవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ విముక్తి ఉద్యమాలకు సంబంధించినవి. సామ్రాజ్యవాదులు తమ మారు రూపంలో సాగించిన దోపిడీలు, మోసాలపై సుదీర్ఘ అనుభవాలతో వేసిన ప్రశ్నలవి.

ఇలాంటి వివరాలన్నీ చెప్పిన తర్వాత వెంటనే కాకుండా కొంత కాలానికి ప్రచురిస్తే రచయిత వాటికి బాధ్యత వహించడం అసాధ్యమవుతుంది. జరిగిన తప్పిదాలన్నీ కాలగమనంలో మాసిపోవచ్చు. అలాంటపుడు ప్రచురితమయ్యే సమ యానికనుగుణంగా సంపాదకులే వివరణ ఇవ్వాల్సి వుంటుంది.

నిజమే. ఇది ఓటమి చరిత్రే.. ఐతే, మేం కాంగోపై కాలుమోపే సమయానికి విప్లవోద్యమ రూపం మారుతోంది. పోరాటాన్ని సరైన దిశగా మళ్లించేందుకు అనేక సంఘటనలు జరిగాయి. ఇక్కడ ఆసక్తికర అంశం మాత్రం. కాంగో విప్లవ ఓటమికి సంబంధించిన కథనం కాదు. నైతికంగా మాకు ఎదురైన అనుభవం ఓటమి. కానీ మొదటి ఆహ్వానంతో వెళ్లిన అంతర్జాతీయ కార్మిక సేనకు ఆ మొదటి అనుభవం వృథా కాదు. అక్కడ ఎదురైన సమస్యల్ని లోతుగా విశ్లేషించడం ద్వారా వాటికి ఓ పరిష్కారం దొరుకుతుంది. శాంతి సమయంలో అనేకమందికి బోధన చేసే ఉపాధ్యా యుడికన్నా యుద్ధ క్షేత్రంలో సూచనలిచ్చే ఓ మార్గదర్శకుడిదే విలువైన జ్ఞానం. అలాంటి అనుభవమున్న మార్గదర్శకుడు భవిష్య విప్లవకారులకిచ్చే సాంకేతిక శిక్షణపై శ్రద్ధగా అధ్యయనం చేయాలి.

విముక్తి పోరాటాల్లో అనుభవమున్నవారిని (ఆ తర్వాత విప్లవ ప్రతీఘాతశక్తులతో పోరాడింది కూడా వీరే) అనుభవం లేనివారితో కలిపి పోరాడించడం ద్వారా కాంగో వాసుల్ని క్యూబనైజ్ చేయాలన్న భావనే మమ్మల్ని గైడ్ చేసింది. అందుకోసం అక్కడికి వెళ్లిన క్యూబన్లని కాంగోలైజ్ చేయాలనుకున్నాం. కాంగోలైజేషన్ అంటే.. ఆనాటి కాంగోవాసుల ఆలోచనలు, అలవాట్లకనుగుణంగా మా వ్యవహార శైలిని మార్చు కోవడం. అలా కొన్ని రోజులు చేశాం. ఐతే, ఇది కాంగోవాసుల్ని తక్కువ చేసి చెప్పడం కాదు. ఆనాటి కాంగో పోరాటయోధుల్ని విప్లవీకరించడం కోసం చేసిందే. ఆ తర్వాత ఆ పోరాట యోధులకు ఎదురైన వ్యతిరేక అనుభవాలను ఈ కథ వివరిస్తుంది. ఇందులో ఉండేదల్లా వాస్తవాలు లేదా నా దృష్టిలో వాస్తవాలు. ఎల్లప్పుడూ నేనమసరించే సాధారణ నైతిక సూత్రం అదే. వ్యక్తిగత పరిశీలనలు, దిద్దుబాట్లు కూడా ఇందులో ఉన్నాయి. ఇందులో ఏవైనా పొరపాట్లు ఉంటే అందుకు జవాబుదారును కూడా నేనే. కొన్ని సందర్భాల్లో సత్యమైనవే ఐనా సందర్భోచితం కాదని తొలగించాను. ఇందులో కొన్ని విషయాల్ని శత్రువు తెలుసుకోలేదు. కొన్ని సందర్భాల్లో చేసిన విశ్లేషణలు స్నేహితులకుపయోగపడ్డాయి. ముఖ్యంగా కాంగో విప్లవోద్యమాన్ని పునర్నిర్మించాలనుకునేవారికి (లేదా ఆఫ్రికాలోని లేదా ప్రపంచం లోని ఇతర దేశాల వారికి ఇలాంటి సమస్యలే ఉన్న ఎవరికైనా). కథా గమనం కోసం ఈ మార్పులన్నీ నేను టాంజానియా మార్గంలో ప్రయాణం సాగిస్తుండగా చేసినవే. ఇందులో ఇచ్చిన కాంగోవాసుల పేర్లు నిజమైనవి. ఐతే, నాతోపాటు కాంగో వెళ్లినవారి పేర్లు మాత్రం స్వాహిలీ భాషలోకి మార్చిన పేర్లు. వీరి నిజమైన పేర్లు ఇవ్వాల్సివుంటే సంపాదకులు అనుబంధంలో పొందుపరుస్తారు. చివరగా చెప్పాల్సింది.ఇందులో ఉన్న కఠిన వాస్తవాలు, వ్యక్తులు. బృందాల బలహీనతలపై వివరణలన్నీ భవిష్యత్ విముక్తి ఉద్యమాలకు ఉపయోగపడాలన్నదే నా ఉద్దేశం.

అంతేతప్ప ఆ పోరాటయోధుల్ని కించపరచడం నా లక్ష్యం కాదు. ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా క్యూబన్ ప్రభుత్వంతోపాటు మా ప్రజలు తమ వీరత్వాన్ని ప్రపం చానికి చాటుకున్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి ఎదురు నిలిచిన ఒకే ఒక్క సోషలిస్టు దేశంగా. పోరాడుతూ, చావడానికైనా సిద్ధపడ్డ మా సైనికుల్ని దూరతీరాన ఉన్న ఓ పరాయి దేశానికి పంపించాం.. మా చర్యలకు మా దేశస్తులంతా తమ పూర్తి మద్దతు తెలిపారు.

సమకాలీన ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాదానికి ఎదురు నిలిచి పోరాడటం ద్వారా మేమేంటో స్పష్టం చేశాం. కాంగో పోరాటంలో పాల్గొనడం మా వీరత్వానికి గుర్తుగా నిలుస్తుంది. ఆత్మరక్షణకే పరిమితం కాకుండా శత్రువుపై దాడి చేయాలన్న సంసిద్ధత మా నాయకత్వంతోపాటు ప్రజల్లోనూ కనిపిస్తుంది. అమెరికా సామ్రాజ్యవాదాన్ని కేవలం సైనికంగా ఎదిరిస్తే సరిపోదు. ప్రపంచాధిపత్యం కోసం అది జోక్యం చేసుకుంటున్న వలస, నయా వలసల్లోని దాని మూలాలపై (మద్దతుదారులపై) దెబ్బకొట్టాలి.

- చే గువేరా

ఇలాంటి కథలో మొదటి చర్యగా దేన్ని చెప్పాలనేది కష్టమైందే. కథా గమనంకోసం నా మొదటి ఆఫ్రికా సందర్శనతో ప్రారంభిస్తా. ఆ సమయంలో నాకు అనేకమంది విప్లవ నేతలతో మాట్లాడే అవకాశం లభించింది. వారంతా వివిధ విముక్తి ఉద్యమాల్లో పని చేస్తున్నవారు. దార్ ఏ సలామ్‌ను సందర్శించాను. అక్కడే ఎంతో మంది ఉద్యమకారులు ఆశ్రయం పొందుతున్నారు. వారిలో ఎక్కువమంది హోటల్స్‌లోనే ఉంటున్నారు. నాతో చర్చించినపుడు క్యూబా నుంచి మిలటరీ శిక్షణతో పాటు ఆర్థిక సాయాన్ని వారు కోరారు. దాదాపుగా అందరి నుంచీ అదే కోరిక. అక్కడే నాకు కాంగో నేతలతో పరిచయమైంది. వారిలో పలువురు పలు రకాల అభి ప్రాయాల్ని వ్యక్తం చేశారు. కబీలాతోపాటు ఆయన అనుచరులతో జరిపిన చర్చలు నన్ను ప్రభావితం చేశాయి. కిగోమా నుంచి వచ్చినట్టు వారు చెప్పారు. అది టాంజానియాలోని చిన్న పట్టణం. టాంజానియికా సరస్సు పక్కనున్న ఆ పట్టణం కాంగోతో రాకపోకలకు కీలకమైంది. నది పక్కనున్న పర్వతాలు విప్లవకారులకు విశ్రాంతి కేంద్రాలుగా ఉండేవి.

కబీలా అభిప్రాయాల్లో స్పష్టత, ప్రత్యేకత కనిపించేవి. స్థానిక నేతలైన బెన్యే, కంజాలను ఆయన వ్యతిరేకించేవారు. సౌమాలియట్‌తో తీవ్రంగా విభేదించేవారు. కాంగో ఆగ్నేయ ప్రాంతానికి పార్టీ వైస్ ఛైర్మన్‌గా కబీలా వ్యవహరించారు. అమెరికా సామ్రాజ్యవాదమే తమ ప్రధాన శత్రువన్న సంగతి చాలా స్పష్టంగా గుర్తించారు. దానిపై చివరికంటా పోరాడేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆయన చేసిన ప్రకటనలు, ఆయనలోని ఆత్మవిశ్వాసం నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. మరుసటి రోజు సౌమాలియట్‌తో మాట్లాడాం. ఈయన వయసులో పెద్దవారు. ఐతే, రాజకీయంగా ఏమంత ఎదగలేదు. మౌనంగా ఉండేవారు లేదా మితంగా, అస్పష్టంగా మాట్లాడేవారు. నాయకుడిగా ప్రాచుర్యం పొందలేకపోయారు. ఆయన నిర్వహించిన పదవుల గురించి చెప్పారు. బెన్యే ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా చేశారు. బెన్యే చర్యలు తమను ఆశ్చర్య పరిచాయన్నారు. బెన్యే, కంజాల పట్ల ఆయనలో వ్యతిరేకత ఉంది. వీరిద్దరితో నేను మాట్లాడలేకపోయా. ఎయిర్‌పోర్టులో కంజాతో కరచాలనం మాత్రమే చేయగలిగాను. కబీలాతో మేం విస్తృతంగా చర్చించాం. ఆఫ్రికాలోని కొందరు మిత్రులు తప్పుడు వ్యూహంతో ఉన్నట్టు తమ ప్రభుత్వం భావిస్తుందని చెప్పాం. సామ్రాజ్యవాదుల చొరబాటును వారు "కాంగో సమస్య ఆఫ్రికా సమస్య"గా మాత్రమే చూస్తున్నారని,

అది తప్పని.. కాంగో సమస్యను మేం ప్రపంచ సమస్యగా చూస్తున్నామన్న మా అభిప్రాయంతో కబీలా ఏకీభవించారు. మా ప్రభుత్వం తరపున మా దగ్గరున్న ఆయుధాలతోపాటు 30 మంది ఇన్‌స్ట్రక్టర్స్‌ను పంపిస్తామని చెప్పా. అందుకు కబీలా ఎంతో సంతోషించారు.

ఆ పని త్వరగా జరగాలన్నారు. ఇన్‌స్ట్రక్టర్‌గా నల్లజాతివారినే ఎంపిక చేస్తామన్న మా ఆలోచన ఎంతో సరైందని మరో నేత సౌమాలియట్ అన్నారు. నేనిదంతా వారితో ప్రత్యేకంగా స్నేహపూర్వకంగా మాట్లాడుతూ చెప్పా అక్కడి రాయబార ఉద్యోగులు చేసిన ఓ తప్పిదం వల్ల అలా చేశా. అక్కడ 50 మందితో ఒకేసారి సమావేశం నిర్వహించడంతో అది కాస్తా అల్లరిగా మారింది. దాదాపు పది దేశాలకు చెందిన వారు పాల్గొనగా వారినుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందుకే అలా చేయక తప్పలేదు. సమావేశంలో వారిని ప్రోత్సహిస్తూ మాట్లాడాను. వారంతా ఆర్థిక సాయంతోపాటు మిలటరీ శిక్షణ ఇవ్వాలన్నారు. వారికి నేను శిక్షణకు సంబంధించిన వ్యయప్రయాసల గురించి వివరించాను. పోరాటానికి ఉపయోగపడే వారిని ఎంపిక చేయడంలో ఎదురయ్యే ఇబ్బందుల గురించి చెప్పా సియేరా మీ స్ట్రాలో మాకెదురైన అనుభవాన్ని గుర్తు చేశా. శిక్షణ తీసుకున్న ప్రతి ఐదుగురిలో ఒక్కరు మాత్రమే సైనికునిగా ఎంపికయ్యారని, ఎంపికైన సైనికుల్లో ఐదుగురిలో ఒక్కరుమాత్రమే మెరుగైనవారని వివరించా.. శిక్షణకోసం చేసేఖర్చంతా వృథా అని గుర్తు చేశా. అకడమిక్ శిక్షణ ద్వారా విప్లవసేనను రూపొందించలేమని, యుద్ధ రంగంలోనే వారు తయారవుతారని తేల్చి చెప్పా శత్రువు జరిపిన కాల్పుల్లో గాయపడ్డపుడు లేదా ఓటమి ఎదురైనపుడు ఎలా ప్రతిస్పందిస్తారనేది ఆచరణలో నిగ్గు తేలాల్సిందే. ఓ వ్యక్తి వ్యక్తపరిచే భావాల్ని బట్టి, వారి గత చరిత్ర ఆధారంగా మాత్రమే ఆ వ్యక్తిని స్పష్టంగా అంచనా వేయలేం ప్రజాయుద్ధంలో నేరుగా పాల్గొన్నపుడు ఎదురయ్యే గెలుపు-ఓటముల పట్ల వారు ఎలా ప్రతిస్పందిస్తున్నారనేదే వారేంటో తేల్చి చెబుతుంది. శిక్షణ ఇవ్వాలనుకుంటే మాత్రం సుదూరాన ఉన్న క్యూబాలో కాకుండా సమీప ప్రాంతంలోనే ఇవ్వాలని చెప్పా. పోరాడాల్సింది కీలుబొమ్మలాంటి షోంబే పై కాదని, నూతనంగా స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రికా దేశాలన్నింటినీ తన నయా వలసలుగా మార్చుకోజూస్తున్న అమెరికా సామ్రాజ్యవాదంపైనని తేల్చిచెప్పా.. మా దృష్టిలో కాంగో విముక్తి

పోరాటానికి ఎంతో ప్రాధాన్యత ఉందని గుర్తు చేశా.

అది సాధించే విజయం ఆఫ్రికా దేశాలన్నిటికీ విస్తరించాలని, లేదంటే తిరిగి ఓటమి ఎదురవుతుందని వివరించా..దీనిపై వారి ప్రతిస్పందన ఏమాత్రం సంతృప్తికరంగా లేదు. చాలామంది ఏమీ మాట్లాడకుండా ఉండిపోయారు. కొద్దిమంది మాత్రం తీవ్రంగా స్పందించారు. తమను అవమానిస్తున్న సామ్రాజ్యవాదంపై తమ దేశాల్లోనే గాక ఇతర దేశాల్లోనూ పోరాడుతామన్నారు. మనం మన సరిహద్దులకే పరిమితం కాకుండా మన ఉమ్మడి శత్రువుపై పోరాడాలని చెప్పా. మొజాంబిక్, రొడీషియా, దక్షిణాఫ్రికా, కాంగో, అంగోలా..ఎక్కడ చూసినా ఆ శత్రువు మనకు కనిపిస్తాడని గుర్తుచేశా.. ఐతే, వారిలో ఎవరూ దీన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. వీడ్కోలు మాత్రం ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ముగిసింది. ఆఫ్రికా నుంచి ఓ స్పష్టమైన అభిప్రాయంతో బయటపడ్డాం. అక్కడ నిజమైన విప్లవోద్యమానికి సుదీర్ఘకాలం పడుతుందని గ్రహించాం. ఐతే, పోరాటాన్ని ఓ లక్ష్యం వైపు మళ్లించడంలో ఆ ప్రజల్ని సిద్ధం చేస్తున్నామన్న సంతోషం మాలో కలిగింది. ఆ క్షణం నుంచే కాంగో పోరాటాన్ని శక్తివంతం చేయడానికి క్యూబన్ల నుంచి నల్లవారిని ఎంపిక చేయడంపై దృష్టి సారించాం.

రెండో చర్య కాంగోలో ప్రారంభమైంది. అందులో అనేక అధ్యాయాలున్నాయి. ఐతే, అవన్నీ వివరించడానికి సమయం చాలదు. క్యూబన్ దళాలకు నేతృత్వం వహించేది నేనే. వారందరిలోకీ నేనొక్కణ్ణే తెల్లవాణ్ణి. యుద్ధ ప్రణాళికలు, అందుకు సంబంధించిన ఉత్తరాలు, రహస్యంగా సాగిన మా ప్రయాణ వివరాలన్నీ కాగితాలపై ఉంచడం నేటికీ ప్రమాదకరమే. అవన్నీ తగిన సమయంలో వివరిస్తారు.

ఉద్విగ్నంగా ముగిసిన వీడ్కోలు అనంతరం మా రహస్య యాత్ర మొదలైంది. ఆనంద నిలయాన్ని విడిచి వెళ్తున్నానన్న భావం కలిగింది. క్యూబా విప్లవం కోసం పదకొండేళ్లపాటు క్యాస్ట్రోతో కలిసి పని చేసిన జ్ఞాపకాలు. ఎంతోమంది చిన్నారులు .. వారిపట్ల నాకుండే అనురాగం ఎలాంటిదో కూడా తెలియనివాళ్లు. నా జీవిత చక్రం మళ్లీ మొదలు.

ఓ శుభోదయం వేళ దార్ ఏ సలామ్‌లో ప్రత్యక్షం. అక్కడి రాయబారితో సహా ఎవరూ నన్ను గుర్తించలేకపోయారు. తిరుగుబాటు సేనలో కెప్టెన్గా చేసే ఓ కామ్రేడ్ మాత్రం నన్ను గుర్తుపట్టారు. అంతకుముందు నేనక్కడికి వెళ్లినపుడు చూశారు. ఓ చిన్న వ్యవసాయ క్షేత్రంలో మా మకాం ఏర్పాటైంది. మాకు తోడు రావాల్సిన 30 మంది కోసం వేచి ఉన్నాం. అక్కడ ముగ్గురమున్నాం. మోజా-నల్లని వ్యక్తి, మా అధికారిక నేత. ఎంబిలీ-తెల్లని వ్యక్తి, ఇలాంటి పోరాటాల్లో గొప్ప అనుభవజ్ఞుడు. టాటూ-నేను, గెరిల్లా అనుభవముంది, తెల్లరంగులో ఉన్నందున ఫ్రెంచి భాషలో మాట్లాడుతూ డాక్టర్‌గా నటించాలి. మా రక్షణ కోసమే మా పేర్లను స్వాహిలీ భాష త్రోత్రి మార్చుకున్నాం. సౌలభ్యం కోసం 1, 2, 3 అంటూ నెంబర్లతో పిలుచుకున్నాం. వారి దేశంలో జరిగే పోరాటంలో పాల్గొంటున్నట్టు కాంగోవాసులెవరికీ ముందే సమాచారమివ్వలేదు. నేనక్కడికి వెళ్లింది కూడా ఎవరికీ తెలియదు. మొదటిసారి కబీలాతో మాట్లాడినపుడు కూడా నా విషయం చెప్పలేదు. అప్పటికింకా నా మన సులో ఆ ఆలోచన లేదు. మాకు ఆశ్రయమిచ్చే దేశాల ద్వారా అక్కడికి వెళ్లాల్సి వున్నందున ముందే చెప్పడం అపాయమని భావించా. నేనక్కడికి వెళ్లే వారు వ్యతి రేకిస్తారని భావించలేదు. నేనక్కడ ఆకస్మాత్తుగా ప్రత్యక్షమవడం ఓ విధంగా మోసమని కూడా ఊహించలేదు. ఐతే, కైరోలోని విప్లవ ప్రభుత్వంతో కబీలా ఎప్పటికపుడు సంప్రదిస్తూనే ఉన్నారు. నూతన విప్లవం కోసం ఐక్య పోరాటం ఎలా నిర్వహించాలో చర్చలు జరిపారు. ఆయనతోపాటు ఆయన అనుచరులు

మసెంగో, మిటౌడీలు అక్కడే ఉన్నారు. ఈ ఆపరేషన్ కోసం మొదటిసారిగా మాతో సంప్ర దించిన వ్యక్తి చామలెసో. ఇతనికి మేమిచ్చిన క్యూబన్ పేరు "ట్రిమెండో పుంటో". మొదట ఆయన 30 మంది ఇన్‌స్ట్రక్టర్ కావాలన్నారు. మా దగ్గర 130 మంది ఉన్నారని చెప్పాం. వారంతా నలుపు రంగులో ఉన్నారని చెప్పాం.

ఐతే, మా వ్యూహంలో కొంత మార్పు చేశాం. ఇన్‌స్ట్రక్టర్స్‌గా 30 మంది క్యూబన్లను పంపేం దుకు అంగీకరించాం. కైరోలో ఉన్న కబీలాతోపాటు ఇతర కాంగ్రేడ్లకు క్యూబన్లు అక్కడికి చేరుకున్న విషయం తెలిపాం (ఐతే నేనక్కడ ఉన్నట్టు చెప్పలేదు). మేం మా మొదటి బృందం కోసం వేచి చూస్తున్నాం. టాంజానియికా సరస్సు దాటేందుకు మాకు ఓ స్పీడ్‌బోట్ (పడవ) కావాలని కోరాం. ఆ సరస్సుపై దాదాపు 70 కి.మీ. ప్రయాణం చేయాలి. ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు నిర్వాహకుల్లో ఒకరు ముందుకొచ్చారు. దార్ ఏ సలామ్‌లో ఎక్కువ రోజులు గడపడం నాకు ఇష్టం లేదు. కాంగోకు వీలైనంత తొందరగా చేరుకోవాలని ఆత్రుతగా ఎదురుచూశా. ఏప్రిల్ 20 రాత్రి క్యూబన్ల మొదటి బృందం మమ్మల్ని చేరుకుంది. 14 మందితో బయలుదేరాం. కొత్తగా వచ్చినవారిలో నలుగురిని అక్కడే ఉంచాం. వారికి అవసర మైన వస్తువులు కొనాల్సివుంది. ఇద్దరు డ్రైవర్లు, కాంగో తరపు ప్రతినిధి (చామలెసో) తో పాటు దారిలో మాకు సమస్యలు రాకుండా చూసేందుకు టాంజానియా పోలీస్ అధికారి ఒకరు మా వెంట ఉన్నారు. పోరాటం కోసం మా ప్రయాణం మొదలైన నుంచి నిర్మాణ సమస్యలు ఎదురయ్యాయి. మా కదలికల్ని సామ్రాజ్యవాదుల నిఘూ వ్యవస్థ ఎక్కడ గుర్తిస్తుందోనన్న ఆందోళన కలిగింది (ఈ ప్రాంతంలోని ఎయిర్ లైన్ కంపెనీలతోపాటు ఎయిర్‌పోర్టుల్లో అది శక్తివంతంగా ఉంది). దార్ ఏ సలామ్లో మేం కొనుగోలు చేసిన నైలాన్ బట్టలు, దుప్పట్లు, కత్తులు, వగైరా భారీ లగేజ్ వారి కంటపడే అనుమానించే అవకాశాలున్నాయి. కాంగోవాసుల్లోనే గాక మాలోనూ నిర్మాణపరంగా లోపాలున్నాయి. దళాల కోసం బెల్జియన్ ఎఫ్ఎ ఎల్ రైఫిల్స్ తీసుకెళ్తున్నాం. కబీలా మరో రెండువారాలపాటు కైరోలోనే ఉంటారు. దాంతో నా విషయం అతనికి చెప్పలేకపోయా.

నా విషయం రహస్యంగా ఉంచాలనుకున్నం దునే టాంజానియా ప్రభుత్వానికి కూడా తెలియపరచలేదు. ఐతే, ఇలాంటి సమస్య లేవీ నన్ను బాధించవని వినయంగా చెప్పగలను. ఎందుకంటే కాంగో పోరాటంలో పాల్గొనాలన్న ఆసక్తి నాలో ఉంది. మరోవైపు నా విషయం వెల్లడైతే కాంగోవాసులపై శత్రుదాడుల తీవ్రత పెరుగుతుందని, స్నేహిత ప్రభుత్వం చిక్కుల్లో పడుతుందని భయపడ్డాం. ఏప్రిల్ 22 రాత్రి కిగోమా చేరుకునేసరికి అలసిపోయాం. నదిని దాటేందుకు పడవలు లేకపోవడంతో మరుసటి రోజు వరకూ ఆగక తప్పలేదు. మాకు అక్కడ స్వాగతం పలికిన ప్రాంతీయ కమాండర్ కాంగో వాసులపై కొన్ని ఫిర్యాదులు చేశారు. ఆయన మాకిచ్చిన సూచనలన్నీ ఆ తర్వాత నిజమని తేలింది. ముందుగా మాకు స్వాగతం పలికిన కమాండర్లంతా అక్కడ ఉన్నారు. సరిహద్దులు దాటాలంటే పాసులు మంజూరు చేయాల్సింది వారే. ఆ చిన్న పట్టణంలో ఉండే వారంతా అదృష్టవంతులు. ఈ గొడవలన్నిటికీ వారు దూరంగా ఉంటారు. ఓ పెద్ద పట్టణంగా క్రిగోమా ప్రసిద్ధి చెందింది. మందుబాబులు, మగువలతోపాటు ప్రవాస జీవులకు అది ఓ కేంద్రంగా ఉంటోంది. అది అలా ఎందుకు ఉందో విప్లవకారులకు ఎన్నటికీ అర్థం కాదు.

ఏప్రిల్ 24 తెల్లవారుజామున కాంగో నేలపై అడుగుపెట్టాం. సాయుధులైన పోరాటయోధులు సైనిక వందనంతో మాకు స్వాగతం పలికారు. మమ్మల్ని ఓ గుడిసెలోకి తీసుకెళ్లారు. అక్కడ ముందుగా 16 కి.మీ. మేర మైదాన ప్రాంతం ఉంటుందని, ఆ తర్వాతే పర్వతశ్రేణులుంటాయనేది మా ఏజెంట్లు మాకిచ్చిన సమాచారం. ఐతే, వాస్తవం అలా లేదు. సరస్సు రెండువైపులా పర్వతాలు, లోయలతో నిండి ఉంది. మేం కిబామాలోని హెడ్ క్వార్టర్స్‌కు చేరుకోవాలంటే వాటన్నిటినీ దాటి వెళ్లాలి. మాకు శిక్షణ లేకపోవడంతో అది ఎంతో కష్టమైంది.

**********

అక్కడికి చేరుకోగానే మా లగేజీ అంతా ఓ మూలన పడేశాం. గుడెసెలోని నేలమీదే అలసట తీరేలా నిద్రపోయాం. మేలోగానే కాంగోకు సంబంధించిన వాస్తవాల్ని తెలుసుకోవడం ప్రారంభించాం. మా దగ్గరకొచ్చినవాళ్లలో రెండు బృందాల వారిని గుర్తించాం. వారి మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువే. ఓ బృందంలో చాలా తక్కువ శిక్షణ కనిపించింది, వారిలో ఎక్కువ భాగం రైతులే. మిగతావారు ఎంతో నాగరికంగా ఉన్నారు. వారు వేసుకున్న బట్టలు కూడా వేరుగా ఉన్నాయి. ఫ్రెంచ్‌లో వారికి మంచి ప్రావీణ్యత ఉంది. ముందుగా మాకు పరిచయమైంది–కసాబువాబు, కివే. వారిద్దరూ తమను తాము పరిచయం చేసుకున్నారు. మొదటి వ్యక్తి సరఫరాలు, యుద్ధ సామగ్రికి ఇంచార్జ్ కాగా, రెండో వ్యక్తి ఇంటెలిజెన్స్ అధికారి. వీరిద్దరూ చక్కని భావ వ్యక్తీకరణ ఉన్న యువకులు. వారు చెప్పిందాంతో కాంగో ప్రజల వైరుధ్యాల పట్ల ఓ అవగాహనకొచ్చాం. ఆ తర్వాత ట్రెమెండో పుంటో ఓ చిన్న సమావేశానికి నన్ను ఆహ్వానించారు. ఆ సమావేశానికి వీరిద్దరూ హాజరు కాలేదు. వేరే బృందానికి చెందిన బేస్ కమాండర్తోపాటు బ్రిగేడ్ లీడర్స్ హాజయ్యారు. వారిలో ఉవీర్ ఫ్రంట్ కు నాయకత్వం వహించే కల్నల్ బిడాలిలా, జనరల్ మౌలేన్ నేతృత్వంలోని రెండో బ్రిగేడ్ తరపున లెఫ్టినెంట్ కల్నల్ ల్యాంబర్ట్, కబాంబేర్‌లో పోరాడుతున్న ఆంద్రే గోజా హాజరయ్యారు. మా దళాలకు మోజా నాయకత్వం వహించాలని పుంటో కోరారు. మరో క్యూబన్ నేతను కూడా ఆయనే ఎంపిక చేయాలన్నారు. వారిద్దరూ సమావేశాల్లో పాల్గొంటూ నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వాములు కావాలన్నారు. నేనాసమయంలో మిగతావారి ముఖాల్లోకి చూశా. ఈ సూచనకు వారెవరూ ఆమోదం తెలిపినట్టుగా కనిపించలేదు. పుంటో మాత్రం ఇవేమీ పట్టించుకోలేదు. ఆ బృందాల్లో వ్యతిరేకతకు కారణాలున్నాయి. వారిలో కొందరు ఫ్రంట్ కోసం కొంత సమయం మాత్రమే కేటాయించే వారు కాగా, మిగతావారు కాంగో నుంచి కిగోమాకు అప్పుడప్పుడూ రాకపోకలు సాగించేవారు మాత్రమే. ఇక పంటో విషయానికొస్తే, ఆయన దార్ ఏ సలామ్‌లో ఓ ప్రతినిధిగా ఉంటూ సందర్భోచితంగా మాత్రమే కాంగో వచ్చి వెళ్తారు.

మేం స్నేహపూర్వకంగా మాట్లాడుకుంటుండగా, ల్యాంబర్ట్ నాకో విషయం చెప్పారు. వైమానిక దళాలకు తాము ప్రాధాన్యత ఇవ్వమన్నారు. తమ దగ్గర "దవా" అనే మందు ఉంటే చాలు తమపై తుపాకీ పేల్చినా ఎలాంటి హానీ జరగదన్నారు. "నాపై వాళ్లు ఎన్నోసార్లు తుపాకీ పేల్చారు,

ఐనా బుల్లెట్స్ నన్ను తాకకుండానే నేలరాలాయి". ఈ మాటలంటున్నపుడు ఆయన ముఖంలో చిరునవ్వు తొణికిస లాడింది. ఈ జోక్ విని వాళ్లకు మనసులోనే సెల్యూట్ చెప్పా. శత్రువు దగ్గరున్న ఆయుధాల్ని తేలిగ్గా తీసుకునేందుకు వాళ్ళేర్పరచుకున్న ఓ నమ్మకమిది.

అక్కడ కొన్ని రోజులు గడిపాక నాకర్థమైంది. అది వారి దగ్గరున్న ఓ మేజికల్ ఆయుధమని. కాంగో సైనికులపై పైచేయి సాధించడానికి వారుపయోగిస్తున్న గొప్ప ఆయుధం ఇదే. ఈ దవా అనేది మిలటరీ శిక్షణకు ఎంతో అడ్డంకిగా తయారైంది. దవాను ఉపయోగించే పద్ధతి ఇలా ఉంటుంది. కొన్ని ఆయుర్వేద మూలికల్ని ఆకు పసరుతో కలిపి ఓ ద్రావణం తయారు చేస్తారు. దాన్ని పోరాటాయోధులపై చల్లు తారు. ఆ తర్వాత వారి నుదిటి మీద బొగ్గుతో ఓ గుర్తు పెడ్తారు. ఇక వారికి ఎంతటి ఆయుధాల వల్లనైనా ఎలాంటి హానీ జరగదనేది వారి నమ్మకం. ఇలాంటి నమ్మకమే శత్రు సైనికుల్లోనూ ఉంది. ఈ దవా ఉన్న వ్యక్తి తనదికాని ఏ వస్తువునూ తాకదుగాక తాకదు. పరాయి మహిళలపై చేయివేయనుగాక వేయదు. అతన్ని భయం, గాయాల వల్ల కలిగే నొప్పి లాంటివి అస్సలు బాధించవు.

యుద్ధ భాషలో మనిషి చావడమంటే.. శత్రువును చూసి వణికిపోవడం, మహిళ లతో మత్తులో జోగడం. గాయపడటమంటే.. భయపడటం. ఇలాంటివన్నీ యుద్ధం పట్ల అవగాహన ఉన్న ఎవరైనా సహజంగా నేర్చుకునేవే. చచ్చినవాడు మాట్లాడ లేడు. యుద్ధానికి సంబంధించిన భయాలన్నీ ఇలాంటివే. వీటిని అధిగమించడం కోసం కాంగోవాసులు దవాను ఆశ్రయిస్తున్నారు. ఇది వారిలో బాగా నాటుకు పోయిన నమ్మకం. ఇలాంటి మేజిక్ నమ్మకాలు మమ్మలెక్కడ కమ్మేస్తాయోనన్న భయం నాకు కలిగింది. యుద్ధాల్లో ఎంతోమంది చనిపోతారు. ఇలాంటి నమ్మకాలు వాస్తవాల్ని కప్పిపుచ్చలేవు. అక్కడి జనాల్ని దవా నుంచి దూరంగా ఉంచడం కోసం ఎన్నోసార్లు యత్నించా. ఐతే, నాకది సాధ్యం కాలేదు. అక్కడి రాజకీయాల్లో అనుభవ మున్న ఓ పెద్ద మనిషి నాతో ఇలా అన్నారు. అది సహజమైన భౌతికశక్తి. గతితార్కిక భౌతికవాదులు (కమ్యూనిస్టులు) దాని శక్తిని గుర్తించాలి. ఆటవికుల్లోని ఓ ఆయుర్వేద నిపుణుడు ఈ రహస్యాన్ని కనుగొన్నాడు.

బ్రిగేడ్ నేతలతో సంప్రదించాక, పుంటోను ఒంటరిగా తీసుకెళ్లి నాగురించి వివరించా.

అందుకాయన తీవ్రంగా స్పందించారు. ఇక్కడ అంతర్జాతీయ కుట్ర జరుగుతుందన్న విషయం రహస్యంగా ఉండాలన్నారు. మీ విషయం ఎవరికీ తెలిసే అవకాశం లేదని పదేపదే నమ్మబలికారు. ఐతే, ఇక నా విషయం స్థానిక నేతలకు తెలియకుండా దాచడం సాధ్యం కాదనుకున్నా ఇక నా పలుకుబడి వారికి ఉపయో గిస్తే ఉపయోగించాలనుకున్నా. మమ్మల్ని శాశ్వత క్యాంప్‌కు పంపించమని కోరా. అది సరస్సు తీరం నుంచి 5 కి.మీ. దూరాన ఉన్న పర్వత శిఖరాన ఉంది. శిక్షణ గురించి చర్చించాం. వందమందికి 4 నుంచి 5 వారాలపాటు శిక్షణ ఇవ్వాలి. ఒక్కో బృందంలో 20 మందికన్నా ఎక్కువ ఉండకూడదు. ఆయుధాలు, సమాచార వ్యవస్థల్ని ఉపయోగించడంతోపాటు కందకాల్ని తవ్వడంలో శిక్షణ ఉంటుంది. శిక్షణ పొందినవారు ఎంబిలీ నేతృత్వంలో పోరాటంలో పాల్గొంటారు. మొదటి బృందం క్యాంప్కు తిరిగివచ్చాక వారి స్థానంలో రెండో బృందం వెళ్తుంది. ఇలా వారిని క్షేత్రస్థాయిలో పరీక్షించి ఎంపిక చేయాలి. అంటే వందమందికి శిక్షణ ఇస్తే దాదాపు 20 మంది మాత్రమే సైన్యానికి పనికివస్తారు. వారి నుంచి ఇద్దరు లేక ముగ్గురు భవిష్యత్‌లో కమాండర్లవుతారు(అంటే దళాలకు నేతృత్వం వహిస్తారు). నా ఈ ప్రతిపాదనకు మంచి ప్రతిస్పందన వచ్చింది. దీనిపై ఓ సిద్ధాంత పత్రం రాయ మన్నారు. మాకు వారం రోజులు గడిచిపోయాయి. సంబంధిత అధికారి (బేస్ కమాండర్) వస్తే తప్ప పని ప్రారంభించలేం.

కొంతమందితో అప్పర్‌బేస్‌కు వెళ్లమని ఓరోజు మోజాను ఆజ్ఞాపించా. ఆయన అలాగే చేశారు. వారంతా రాత్రివేళ తిరిగి వచ్చారు. వారి బట్టలన్నీ తడిసి ముద్ద య్యాయి. ఓవైపు ఎముకలు కొరికే చలి. మరోవైపు జోరున వర్షం. వారు మా కోసం ఓ గుడిసె నిర్మిస్తున్నామని చెప్పారు. అందువల్ల మరికొన్ని రోజులు వేచి ఉండక తప్పదు. ఈ సందర్భంగా కామేడ్ క్రివేతో హృదయపూర్వకంగా మాట్లాడే అవకాశం చిక్కింది. ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన అలసట ఎరుగని సమన్వయకర్త. ఫ్రెంచ్‌లొ అనర్గళంగా మాట్లాడగలరు. కాంగో విప్లవంలోని ముఖ్య నేతల గురించి ఆయన నాకు వివరించారు. ముందుగా ఆయన నుంచి వినిపించిన పేరు-ఒలెంగా. ఆయన స్టాన్లీవిల్లేలో జనరల్ స్థాయిలో ఉన్నారు. ఆయన సాధారణ సైనికునికన్నా కాస్త ఎక్కువ ప్రతిభావంతుడు. అంటే ఆయనది లెఫ్టినెంట్ స్థాయి.

స్వతహాగా ఓ గ్రామాన్ని ఆక్రమించినపుడు ఒక్కసారిగా జనరల్ స్థాయికి ఎదిగారు. కివే దృష్టిలో కల్నల్ పస్మాసా నిజమైన మిలటరీ నేత (కైరోలో జరిగిన ఓ పోరాటంలో ఆయన చనిపోయారు). మిలటరీ పరిజ్ఞానంతోపాటు విప్లవ తత్వం ఉన్న నేత. మరో రోజున బెన్యే గురించి వివరించారు. మొదట ఆయనకు స్పష్టత లేకున్నా ఇప్పుడాయన విప్లవ నాయకుడిగా ఎదిగారన్నారు. ఆయనకన్నా మంచి విప్లవ నేతలు ఇంకా ఎంతోమంది ఉన్నట్టు కివే చెప్పారు. రోజులు గడిచేకొద్దీ మా మధ్య సాన్నిహిత్యం పెరిగింది. బెన్యే గురించి చెబుతూ, అతడు విప్లవ నాయ కుడిగా కన్నా దొంగలముఠా నాయకుడిగానే తగినవాడన్నారు. అదేలా ప్రభుత్వంలో తాను హోంమంత్రిగా ఉన్నపుడు గిజెంగాను అరెస్ట్ చేసినట్టు కివే గుర్తు చేశారు. కివే దృష్టిలో గిజెంగా ఓ వామపక్ష అవకాశవాది. అంతా రాజకీయంగానే సాధ్యమని, విప్లవం కేవలం సైనిక చర్య అన్నది అతని అభిప్రాయం. లియోపోల్డ్ విల్లే అతడు అలాగే చేశాడు. విప్లవకారులకు డబ్బులిచ్చి తన రాజకీయ పార్టీ కోసం ఉపయో గించాడు. కివేతో పిచ్చాపాటీ వల్ల అక్కడి నాయకుల పట్ల నాకు ఓ అవగాహన కలిగింది. వారిలో నిబద్ధత లోపించింది. కాంగో విప్లవంలో వారు విప్లవకారుల్లాగాక సాధారణ కార్యకర్తల్లా వ్యవహరించారు.

డాక్టర్‌గా (నేనొక చర్మవ్యాధుల డాక్టర్ను) క్యూబా డాక్టర్ కిమీతో కలిసి కొన్ని రోజులపాటు ఓ క్లినిక్ నడిపా. ఆ సమయంలో కిగోమా నుంచి కొన్ని అంటు వ్యాధులు అక్కడికి సరఫరా అయ్యాయి. ముఖ్యంగా సుఖరోగాలు. అందుకు నేను కిగోమాలోని వ్యభిచారుల్ని తప్పుపట్టను. సరస్సు దాటి అక్కడికి వెళ్లి వచ్చిన పోరాట యోధుల్లో ఎక్కువమంది ఆ వ్యాధుల బారిన పడటం నన్ను తీవ్రంగా ఆలోచింప జేసింది. అప్పుడు నాలో కొన్ని ప్రశ్నలు మెదిలాయి. ఆ మహిళలకు డబ్బులిచ్చిం దెవరు? ఏ డబ్బును అందుకు వినియోగించారు? విప్లవోద్యమం కోసం అందుతున్న నిధులన్నీ ఎలా ఖర్చవుతున్నాయి?

అక్కడికి వెళ్లిన కొత్తలో తాగుడుకు బానిసలై రోగాల బారిన పడ్డ కొందరిని చూశాం. వాళ్లు పోంబే అనే అల్కహాల్ వల్ల అనారోగ్యానికి గురయ్యారు. దాన్ని అక్కడి వ్యాపారులు నాటు పద్ధతుల్లో తయారు చేయడమే అందుకు కారణం. క్యాంప్‌లోకి పోంబే వచ్చినప్పుడల్లా గొడవలు, అనారోగ్య

సమస్యల్ని పరిష్కరించడంతోనే మా సమయమంతా గడిచిపోయేది.

క్లినిక్లోకి చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు వచ్చేవారు. రేడియో బెంబా ద్వారా వారు డాక్టర్ల గురించి తెలుసుకున్నారు. ఐతే, మా దగ్గరున్న మందులు చాలా తక్కువ. సోవియట్ నుంచి మందులొచ్చాయి. కానీ, అవన్నీ పౌరులనుద్దేశించి పంపినవి కాదు. పోరాట యోధుల కోసం పంపిన ఆయుర్వేద మందులు.

కిగోమా నుంచి సరస్సు మీదుగా ఆయుధాల సరఫరా జరిగేది. అవి కూడా సరిగ్గా ఉండేవి కాదు. రైఫిళ్లు వచ్చేవి, కానీ వాటికి తగిన బుల్లెట్లు ఉండకపోయేది. మందుపాత్రలు వచ్చేవి, వాటికి అవసరమైన పేలుడు సామగ్రి ఉండేది కాదు. కాంగో విముక్తి సేనలోని నిర్మాణపరమైన లోపాలే ఈ వైఫల్యాలన్నిటికీ కారణమని గుర్తించాం.

ఆహారం, మందులు, ఆయుధాల్ని లాఫ్లేయర్లోని ఓ దట్టమైన అడవిలో నిల్వ ఉంచారు. నిల్వల్ని సురక్షితంగా మేనేజ్ చేసేందుకు మాకు అనుమతివ్వాలంటూ ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదు. కొన్ని ముఖ్యమైన ఆయుధాల్ని వేరే చోట దాచి పెట్టాలని సలహా ఇచ్చాం.

కిగోమా నుంచి ప్రతిరోజూ మాకు వివాదాస్పద వార్తలు అందుతూ ఉండేవి. ఓరోజు క్యూబన్ల బృందం పడవ కోసం అక్కడే వేచి ఉన్నట్టు.. మరో రోజు మిటౌడీ వస్తున్నారంటూ... కానీ, అతను ఆరోజు రాలేదు. ఆ సమయంలోనే కైరోలో సమా వేశాలు జరుగుతున్నట్టు సమాచారం. కబీలా కొన్ని రోజులపాటు అక్కడే ఉన్నారు. ఆ తర్వాత ఏదో మిలటరీ ఆపరేషన్ కోసం వెళ్లినట్టు వార్త, కానీ, అది అంత సీరియస్ కాదు. మొత్తానికి అతను మమ్మల్ని చేరుకోవడంలో ఆలస్యమైంది. మాతో ఉన్నవారిలో సోమరితనం వదిలించడం కోసం ఏదో ఒకటి చేయాలనుకున్నాం. ఫ్రెంచ్, స్వాహిలీ భాషల్లో సంస్కృతిపై తరగతులు నిర్వహించాం. అది అక్కడివారికి ఎంతో అవసరమైంది. వాస్తవానికి కామ్రేడ్లకు సాంస్కృతిక వారసత్వంపై బోధిం చాల్సిన అవసరముండదు. మన నైతికత ఎంతో ఉన్నతం. ఐతే, కాలాన్ని ఎలా సద్వినియోగం చేయాలో నేర్పక తప్పదు.

అక్కడ ప్రతి ఒక్కరూ మలేరియా తదితర వ్యాధులతో బాధపడ్డవారే.

వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక మందులు అవసరమయ్యాయి. వ్యాధుల వల్ల వచ్చే నీరసత్వం మనుషుల్లో నిరాసక్తతకీ, నిరాశకీ కారణమవుతుంది. రోజులు గడిచేకొద్దీ నిర్మాణపరమైన బలహీనతలు బయటపడసాగాయి. సోవియట్ నుంచి వచ్చిన మందుల పంపిణీలో భాగస్వామినయ్యా దళాల ప్రతినిధులు ఎవరికివారు తమకు ఎక్కువ మందులు కావాలని కోరారు. అందుకు వారు దళసభ్యుల సంఖ్యను తప్పుగా చెప్పారు. ఒకరు 4 వేలంటే, మరొకరు రెండు వేలన్నారు. అది గమనించి కొన్ని మందుల్ని నిలిపివేశా. దళాలకు ఎంపిక అవుతున్నవారితోపాటు వారికి సమీపాన ఉన్న రైతులతో కలిపి చూసినా అంత సంఖ్యలో లేరని మా పరిశీలనలో తేలింది.

మే 8న అలీ నేతృత్వంలో 18 మంది క్యూబన్లు మమ్మల్ని చేరుకున్నారు. జనరల్ స్టాఫ్‌కు నేతృత్వం వహించే మిటౌడీ కూడా అప్పుడే వచ్చారు. ఆయుధాల కోసమని ఆయన తిరిగి కిగోమా వెళ్లారు. మా ఇద్దరి సంభాషణ స్నేహపూర్వకంగా సాగింది. ఆయనలో నిర్మాణ స్ఫూర్తి, సీరియస్నెస్ కనిపించాయి. నా విషయం బహిరంగం చేయడం కబీలాకు ఇష్టం లేదని ఆయన ద్వారా తెలిసింది. దాంతో, నేను ఓ డాక్టర్‌గా, అనువాదకుడిగా పరిచయం కాదలిచా.

మిటౌడీ చెప్పినట్టు మరుసటిరోజు అప్పర్‌బేస్‌కు వెళ్లాం. మోజా, నానే, టానో కిందనే ఉండిపోయారు. వారు జ్వరంతో బాధ పడుతున్నందున డాక్టర్ కిమీ కూడా వారితోనే ఉన్నారు. అప్పర్‌బేస్‌లో 20 మంది కాంగోవాసులున్నారు. వారంతా ఒంటరిగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నన్ను వారికి డాక్టర్‌గా, అనువాద కుడిగా పరిచయం చేసుకున్నా సోమరితనానికి స్వస్తి చెప్పాలనుకున్నాం. స్వాహిలీ, ఫ్రెంచ్ భాషల్లో తరగతులు నిర్వహిస్తూ, చలికి తట్టుకునే విధంగా షెల్టర్స్ నిర్మించడం ప్రారంభించాం. మేమున్నప్రాంతం సముద్రమట్టానికి 1700 మీటర్ల ఎత్తున, సరస్సుకు వెయ్యి మీటర్ల ఎత్తున ఉంది. అక్కడ హిందూ మహాసముద్రం నుంచి వచ్చే రుతుపవనాలతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దాంతో, మేం చేపట్టిన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడంలో నిమగ్నమయ్యాం...

**********

అప్పర్ బేస్ నుంచి నాలుగు గంటలపాటు నడిచి వెళ్తే అక్కడ చిన్నచిన్నగూడేలు కనిపించాయి. ఒక్కో గూడెంలో ఇళ్ల సంఖ్య పదికి మించదు. అవన్నీ విశాలమైన ప్రకృతి మధ్య విస్తరించి ఉన్నాయి. వారంతా గంజా అనే గిరిజన తెగకు చెందిన వారు. వీరి పూర్వీకులు కొన్ని వందల ఏళ్లక్రితం రువాండా నుంచి కాంగోకు వలస వచ్చి అక్కడే స్థిరపడ్డారు. ఐతే, వారు తమ మాతృ సంస్కృతిని మరచిపోలేదు. వారంతా పశువుల కాపరులు, ఐతే, సంచారజాతి మాత్రం కాదు. వారికి ఆహారంతోపాటు సంపద కూడా పశువులే. ఈ తెగలోని యువకులు అందమైన అమ్మాయిల్ని సొంతం చేసుకోవాలంటే ఎక్కువ సంఖ్యలో పశువుల్ని కలిగి ఉండాలి. వాటిని ఆ అమ్మాయిల తండ్రులకు బహుమతిగా ఇవ్వాలి. యువతుల్ని అక్కడ అమ్మేస్తారు. ఒకరికన్నా ఎక్కువమంది భార్యల్ని కలిగి ఉండటం వారి ఆర్థిక స్తోమతకు నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలు ఇంటి పనితోపాటు వ్యవసాయ పనులు చేస్తారు. వారు మాకు సమీపంలో ఉండటంతో కావాలనుకున్నపుడల్లా తాజా గొడ్డు మాంసం దొరికేది. యుద్ధ సమయంలో అది మాకు ఎంతో అవసరం. ఇంటి బెంగ లేకుండా చేయడంలోనూ అది ఓ దివ్యౌషధం. అక్కడ రువాండా, కాంగో తెగల మధ్య శత్రుత్వం ఉండేది. వారి మధ్య స్పష్టమైన సరిహద్దులు కూడా ఉండేవి. వారి మధ్య ఉన్న వైరం వల్ల ఆ ప్రాంతంలో రాజకీయ సమైక్యత కష్ట మయ్యేది. దాంతో కాంగోకు సరిహద్దు సమస్య పునరావృతమయ్యేది.

అప్పర్ బేస్‌కు చేరుకున్నాక కొన్ని రోజులపాటు అనారోగ్య సమస్యలు వెంటా డాయి. వాతావరణ మార్పు వల్ల అలా జరిగింది. డాక్టర్ కుమీ నా కోసం అక్కడికి వచ్చారు. ఐతే, క్లినిక్‌లో అవసరమున్నందున ఆయన్ని వెనక్కి పంపించా. అప్పటికే నా ఆరోగ్యం కూడా కుదుటపడింది. మూడు రోజుల తర్వాత గాయాలతో ఉన్న ఓ వ్యక్తిని మా దగ్గరికి తీసుకొచ్చారు. ఓ సంఘర్షణలో బుల్లెట్ తగిలి అతని చేతికి గాయమైంది. అతనికి ఆరు రోజులపాటు ఎలాంటి వైద్యమూ అందలేదు. అతనికి సపరిచర్యలు చేస్తూ నేను మరోసారి అనారోగ్యానికి గురయ్యా. కుమీ మరోసారి అప్పర్‌బేస్‌కు రాక తప్పలేదు. ఆయనకిది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహిస్తున్న భావన కలిగించింది. చివరికాయనే ఓ రోగిలా మారారు. ఐదు రోజుల్లో నా ఆరోగ్యం కుదుటపడింది. కానీ, ఆందోళన ఆకలి మందగించేలా చేసింది. మొదటి నెల దాదాపు డజన్మంది వరకూ నాలాగే జ్వరంతో

బాధపడ్డారు. మిటౌడీ మరోసారి కిగోమా నుంచి తిరిగివచ్చి ఓ ఆదేశం జారీ చేశారు. ఆల్బర్ట్ విల్లేపై రెండంచెల దాడికి సిద్ధం కావాలన్నారు. ఐతే, ఆ సమయానికది అసం గతంగా అనిపించింది. మేమున్నది 30, అందులోనూ పదిమంది అనారోగ్యంతో బాధ పడుతున్నారు. దాంతో, ఓవైపు యుద్ధానికి సిద్ధం కావాలని చెబుతూనే మరోవైపు ప్రణాళికను వాయిదా వేయించేందుకు యత్నించా. మే 22న మాకు రకరకాల వార్తలు వచ్చాయి. అందులో ఒకటి మాకు ఎంతో ఆందోళన కలి గించింది. క్యూబా మంత్రి ఒకరు మేమున్న కొండలవైపు వస్తున్నారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో క్యూబన్లున్నారు. ఆ వార్త మాకు హేతుబద్ధంగా లేదా నమ్మదగిందిగా అనిపించలేదు. ఎందుకైనా మంచిదని పర్వతం మీదినుంచి కొంత దూరం కిందికి దిగా. నన్ను ఆశ్చర్యపరుస్తూ ఉస్మానీ కనిపించారు. ఆయన టాంజానియా ప్రభు త్వంతో మాట్లాడేందుకు వచ్చారు. పనిలోపనిగా కాంగో వెళ్లి కామ్రేడ్లను కలిసి వస్తా నంటూ అనుమతి పొందారు. మిగతా క్యూబన్ మంత్రులు కూడా రావాలను కున్నారు. కానీ, చివరి నిమిషంలో మనసు మార్చుకున్నారు. నేనపుడు కాంగోలో ఉన్న సంగతి టాంజానియా ప్రభుత్వానికి తెలియదని అర్థమైంది. ఉస్మానీతోపాటు కిగోమా వచ్చిన 34 మందిలో 17 మంది మా దగ్గరికొచ్చారు. యుద్ధానికి సంబంధించి ఆయన మోసుకువచ్చిన వార్త ఎంతో సంతోషానిచ్చేదే. ఐతే, మరో వార్త మాత్రం వ్యక్తిగతంగా నాకు విషాదాన్నిచ్చేది. బ్యూనోస్ ఎయిర్స్ ద్వారా వచ్చిన టెలీన్యూస్ ప్రకారం మా అమ్మగారు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఇది ఓ చేదు వార్తను చెప్పేందుకు ముందస్తుగా ఇచ్చే సమాచారంగా భావించాను. ఈ విషయంలో మరింత సమాచారం తెప్పించడం ఉస్మానీ వల్ల కాలేదు. ఓ నెల రోజులపాటు అనిశ్చితితో గడిపా. చివరికి నా అనుమానం నిజమైంది. మా అమ్మ చనిపోయారన్న వార్త నిర్ధారణయింది.

క్యూబా విడిచి రావడానికి కొన్ని రోజుల ముందే ఆమె నన్ను చూడాలను కున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్నారు. ఐతే, నేను నా ప్రయాణపు హడావిడిలో పడి అమ్మను చూడలేకపోయా. నేను మా అమ్మానాన్నల కోసం హవానాలో విడిచి వచ్చిన ఉత్తరాన్ని కూడా ఆమె చూడలేకపోయారు. నా ప్రయాణం గురించి క్యూబా ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించినపుడే... అంటే.. అక్టోబర్‌లో ఆ ఉత్తరం కూడా విడుదలైంది.

మిటౌడీ అప్పర్‌బేస్‌కు చేరుకున్నారు. మిలటరీకి సంబంధించిన వివిధ అంశాల్ని ఆయనతో చర్చించా. అల్బర్ట్ విల్లేను ఆక్రమించేందుకు ఓ బృహత్ ప్రణాళికను ఆయన కోరారు. ఆ సమయంలో అలాంటి ఆలోచన అత్యాశతో కూడినదని, అపాయకరమంటూ నచ్చచెప్పా. ఆ ప్రాంతంలోని వాస్తవ పరిస్థితి పట్ల అవగాహన లేకుండా అలాంటి ప్రణాళిక సాధ్యం కాదని చెప్పా స్టాఫ్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్నవారికి వివిధ ప్రాంతాల్లోని దళాల పరిస్థితిపై స్పష్టత లేదు. ఫీల్డ్ ఆఫీసర్స్ నుంచి వచ్చే ఇంటెలిజెన్స్ నివేదికల మీదే అంతా ఆధారపడుతున్నారు. ఐతే, వారిచ్చే నివేదికలు తప్పుల తడకగా ఉంటూ వాస్తవ పరిస్థితిని గందరగోళంగా చూపాయి. ఓటమి ఎదురైనపుడు మాత్రం ఆయుధాల కొరతే అందుకు కారణమన్నారు. దీనికి పరిష్కారంగా వివిధ ప్రాంతాల్లోకి మేమే వెళ్లాలని నిర్ణయించాం. మనకూశత్రువుకూ మధ్య ఉన్న వ్యత్యాసాల్ని స్పష్టంగా అంచనా వేయాలనుకున్నాం. ఈ పరిశోధన కోసం నాలుగు బృందాల్ని ఏర్పాటు చేశాం. అలీతోపాటు మరో ముగ్గురు కబింబాకు, న్నేతోపాటు మరో ఇద్దరు ఫ్రంట్ డీ ఫోర్స్‌కు, మోజా, పౌలు. బరాకా, పిజీ, లులింబాలకు, మిటౌడీతో కలిసి నేను ఉవీరాకు వెళ్లాలనుకున్నాం. ఐతే, చివరి రెండు బృందాలకు కుదరలేదు. పడవలు, పెట్రోలు అందుబాటులో లేక పోవడంతో పాటు ఊహించని పరిణామాల వల్ల వెళ్లలేకపోయాం. ఆ సమయంలోనే కబీలా వస్తాడన్న ప్రకటన వచ్చింది. అతని కోసం వేచి చూస్తూ కొన్ని రోజులపాటు వృధాగా గడిపా. కబింబా, ఫ్రంట్ డీ ఫోర్స్ నుంచి వచ్చిన మొదటి నివేదికల ప్రకారం అక్కడి దళాలు పోరాటానికి సిద్ధంగా ఉన్నాయి. ఐతే, కబింబాలో ఉన్న వారికి ఎలాంటి శిక్షణా లేదు. ఫ్రంట్ డీ ఫోర్స్ వారికి కొంత శిక్షణ ఉంది (వీరిలో కూడా ఆయుధాల నిర్వహణ, శత్రువు పట్ల అవగాహన, రాజకీయ చర్యలు, వగైరా నిర్మాణపరమైన సమస్యలున్నాయి).

మేం ఏప్రిల్ 24న అక్కడికి చేరుకోగా, ఓ నెల రోజుల తర్వాత అంటే మే చివరన నా ఫీల్డ్ డైరీలో నోట్ చేసిన విశ్లేషణ ఇలా ఉంది.

"మిటౌడీ వచ్చే వరకు మా సమయమంతా వృధా అయింది. ఆ తర్వాతే అక్కడి పరిస్థితుల పట్ల ముందుస్తు అవగాహనకొచ్చాం. వారికి ఎలాంటి సలహాలు అవ సరమో తెలుసుకోగలిగాం. రేపు ఓ బృందానికి శిక్షణ ఇవ్వడంతో మా పని మొదలవుతుంది. జూన్ నెలలో జరిపే మొదటి

దాడికి మేమంతా సిద్ధం కావాలి. కాల్పులు ఎలా జరపాలో తెలియకపోవడం వల్లే కాంగోవాసులకు ఓటమి ఎదురవు తోంది. ఆయుధశక్తి వృథా అవుతోందని గుర్తించాం. దీనిపైనే వారికి మేమిచ్చే మొదటి శిక్షణ. ఇక్కడివారిలో క్రమశిక్షణ చాలా తక్కువ. ఐతే, క్రమశిక్షణ అలవరచు కునే సంసిద్ధత వారిలో ఉంది. నిర్మాణలోపమే అసలు కారణం. కాల్పులు జర పడంపై శిక్షణ, ఆ తర్వాత గెరిల్లా దాడులపై శిక్షణ ఇవ్వాలనుకున్నాం."

ఫ్రంట్‌లో గొప్ప క్రమశిక్షణ ఉందని మేమనుకున్నదంతా భ్రమేనని ఈ రోజున చెప్పగలం. ఇక్కడ మూడు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సివుంది. కాల్పులు జరపడంలో శిక్షణ, దాడులు చేయడంలో మెళకువలు, కీలక దాడులవైపు దళాలను కేంద్రీకరించడం. ఇవి కాంగోలో మచ్చుకైనా కనిపించవు. ఇక్కడి బృందాల్లో గిరిజన లక్షణాలెక్కువ. మంచి పొజిషన్లో ఉండి దెబ్బ కొట్టడం మాత్రమే వీరికి తెలిసిన విద్య. ఎత్తుగడలరీత్యా కొన్ని ఎంపిక చేసిన ప్రదేశాల్లో స్థావరాల్ని ఏర్పాటు చేస్తారు. వాటినే బారికేడ్స్‌గా పిలుస్తారు. అవన్నీ ఎత్తయిన కొండ ప్రాంతాలు కావడంతో మిలటరీ ఆపరేషన్స్‌కు అవకాశముండదు. అక్కడే వీరి క్యాంప్ జీవితముంటుంది. దాంతో, శిక్షణకు అవకాశముండదు. శత్రువు తమను చేరుకోలేదన్న ధీమా మాత్రం ఉంటుంది. ఆహారంతోపాటు వివిధ సరఫరాల కోసం రైతులపై ఆధారపడ్డారు. ఈ పనుల కోసం రైతులపై దళాల బెదిరింపులుంటాయి. ఇక్కడి ప్రజా విముక్తి సేన పరాన్న (ఇతరులపై ఆధారపడే) లక్షణం కలిగివుంది. ఈ సేనకు పనీ ఉండదు, శిక్షణ ఉండదు, పోరాటమూ ఉండదు. ప్రజల నుంచి మాత్రం తమ కోసం ప్రత్యేక సదుపాయాల్ని డిమాండ్ చేస్తుంది. రైతులతో తమ పనులు చేయించడం కోసం వారితో దురుసుగా వ్యవహరిస్తుంది. క్యాంపుల సమీప రైతులు వీరి దయాదాక్షిణ్యా లపై బతకాల్సిన దుస్థితి. సెలవులపై దళ సభ్యులెవరైనా రైతుల ఇళ్లకు వెళ్లినపుడు వారి ఇళ్లల్లోని విలువైన వస్తువులన్నీ వీరికి అర్పించాల్సిందే.

ఇక్కడి దళ సభ్యుల ప్రధాన ఆహారం."బుకాలి". "కాసవా" అనే దుంపను పైపొట్టు తీసి కొన్ని రోజులపాటు ఎండబెడ్తారు. మిల్లులో వేసి కాఫీ పొడిలా గ్రైండ్ చేస్తారు. ఆ తర్వాత నీళ్లతో కలిపి వేడి చేస్తే పేస్ట్ అవుతుంది. బుకాలిలో మనకవసర మైన కార్బోహైడ్రేట్లుంటాయి.

కొన్నిసార్లు "జోంబే వారి ఆహారంగా ఉంటోంది. దీన్ని కాసవా ఆకుల్ని పొడి చేసి నీళ్లలో కాచి తయారుచేస్తారు. రుచి కోసం పామాయిల్ లేదా ఏదైనా వేట జంతువు మాంసాన్ని అందులో కలుపుతారు (ఈ ప్రాంతవాసులకు జంతువుల వేట ఓ క్రీడా వినోదంలాంటిది. ఐతే, పండుగలు లాంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే మాంసాహారం తింటారు). ఇక్కడి పోరాట యోధులకు సరైన ఆహారం మాత్రం లేదని చెప్పొచ్చు. వీరిలో ఓ బలహీనత కూడా ఉంది. బేస్ క్యాంపుకు తామే స్వయంగా ఆహారాన్ని మోసుకువెళ్లే శక్తి కూడా వీరికి లేదు. వారి భుజాల మీద ఓ రైఫిల్, ఓ కార్ట్రిడ్జ్ బెల్ట్, బ్లాంకెట్లాంటి కొన్ని వ్యక్తిగత వస్తువులు మాత్రమే ఉంటాయి. ఇక్కడి సేనతో కొన్ని రోజులపాటు తిరిగిన తర్వాత వారి స్వభావమెలాంటిదో అర్థమైంది. కొన్ని విషయాల్లో వారి ప్రవర్తన మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. ఎవరైనా ఓ చిన్న బరువు ఏదైనా ఇస్తే చాలు "మిమీ హపానా మోటోకారి" (నేను మీ ట్రక్కును కాదు) అంటూ కటువైన సమాధానం వస్తుంది. అదే క్యూబన్తో ఐతే వారి సమాధానం ఇలా ఉంటుంది. "మిమీ హపానా క్యూబన్" (నేను మీ క్యూబన్ని కాదు).

ఇక్కడి దళాలకవసరమైన ఆహారంతోపాటు ఆయుధాల్ని కూడా రైతులే మోసుకు వెళ్తారు. ఇక్కడి ప్రజా సైన్యానికీ, శత్రు సైన్యానికీ మధ్య ప్రవర్తనలో పెద్ద తేడాలేమీ కనిపించవు. ఇలాంటి ప్రవర్తన ప్రజా సేనకు సరైంది కాదని మేం గుర్తించాం. ఉనికిలో ఉన్న చెడును మార్చేందుకు యత్నించకపోవడమే కాంగో విప్లవకారుల బలహీనత, ఆ బలహీనతే వారి ఓటమికి కారణమవుతోంది.

**********

సాంకేతికంగా చెప్పాలంటే రోజులు మునుపటిలాగే గడిచిపోతున్నాయి. ఇక్కడి రెండు పర్వతాల చివరి కొనలూ సరస్సులోనే కలిసిపోయాయి. సరస్సువైపు తొంగి చూస్తే కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. పని ప్రారంభించాలని సంకల్పించిన మిటొడీ చివరికి ఎలాంటి ఫార్ములా రూపొందించలేకపోయారు. కబీలా ఆదేశాల తోనే ఆయన కదలకుండా ఉండిపోయినట్టు అర్థమైంది. కబీలా రాకకోసం అతనితో పాటు మేమంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం. ఎలాంటి మార్పూ లేకుండానే రోజులు గడిచిపోతున్నాయి.

బరాకా, పిజీ, లులింబాల్లో పర్యవేక్షణ కోసం వెళ్లిన మోజా తిరిగి వెనక్కి వచ్చారు. ఆయన తెచ్చిన సమాచారం ఆందోళన కలిగించేదే. స్థానిక ప్రజలతోపాటు వారికి నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్ ఆయనకు సరైన సమాచారమే అందిం చారు. కబీలా, మసెంగో, మిటొడీలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వారు తమకు నేరుగా నాయకత్వం వహించకపోగా, వారికి తమతో ఎలాంటి పరిచయమూ లేదంటూ మండిపడుతున్నారు. ఆ ప్రాంతంలో సాయుధ దళాలు విస్తృతంగా సంచ రిస్తున్నాయి. ఐతే, వారిలో నిర్మాణ రాహిత్యం ఉంది. ముఖ్యంగా నేతలంతా ఎలాంటి సిగూ ఎగూ లేకుండా ప్రజల మధ్యే తాగితందనాలాడుతూ విశ్వసనీయత కోల్పోయారు. పైగా తాము చేసే వెకిలి పనులన్నీలోకంలో ఎవరైనా చేసేవే అంటూ సమర్థించుకుంటున్నారు. వారికి అవసరమైన సరఫరాల కోసమని కేటాయించిన వాహనాలపై ఇష్టానుసారం ట్రిప్పులు తిరుగుతూ పెట్రోల్ వృధా చేస్తున్నారు.

లులింబాలో ఏర్పాటైన బేస్ క్యాంప్ జనావాసాలకు ఏడు కి.మీ. దూరంలో ఉంది. అది ఎత్తయిన పర్వతాలపై ఉంది. విప్లవ దళాలు దాడి చేయాలంటే కిందికి దిగాల్సిందే. శత్రువును ప్రత్యక్షంగా గురిపెట్టి కాల్చే గన్స్ పరిధి ఒకటిన్నర కి.మీ. మాత్రమే. శత్రువు పొజిషన్ పట్ల స్పష్టత లేనపుడు రాకెట్లతో దాడి జరపాలి. దీనిపై వారికి శిక్షణలేదు. ఈ విషయాలన్నీ నేను మిటొడీ దృష్టికి తెచ్చా. ఆయన నా మాట లతో ఏకీభవించారు. ఆ ప్రాంతానికి మౌలేన్ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన విప్లవ స్ఫూర్తి లోపించిన ఓ అరాజకవాది (Anarchist). ఆయన్ని చర్చల కోసం రావాలంటూ మిటొడీ కోరగా నిరాకరించాడు. అరెస్ట్ చేస్తారని అనుమానించాడు.

అప్పటికింకా ఏమీ చేయలేకపోయాం. మరోసారి ఫ్రంట్ డీ ఫోర్స్ కటెంగా ప్రాంతాల పరిశీలన కోసం ఇన్నే నానేలను పంపించాం. కబింబా-ఆల్బర్ట్ విల్లేల మధ్య రోడ్డు మార్గ పరిశీలన

కోసం అలీ వెళ్లారు. ఆ మార్గంలో అడ్డంకులున్నాయని తెలిసింది.

ప్రతిరోజూ మాకు ఒకే మాట వినిపిస్తోంది. కబీలా రావడం లేదని.. రేపు లేదా ఎల్లుండి తప్పకవస్తారని... పడవలు మాత్రం వస్తూనే ఉన్నాయి. పెద్ద ఎత్తున ఆధు నిక ఆయుధాల్ని మోసుకుంటూ... చెప్పుకునేందుకిది సిగ్గుపడే విషయం.. చైనా, సోవియట్లాంటి మిత్ర దేశాల వనరుల్ని దండిగా ఉపయోగించుకుంటూ.. టాంజానియా చేస్తున్న కృషి, తమ జీవితాల్ని పణంగా పెడుతున్న కొందరు యోధుల కష్టం. పౌరులందిస్తున్న సహకారం. అంతా కలిసి సాధిస్తున్న ఫలితం మాత్రం అత్యల్పం.

నిర్మాణాత్మక చర్యలకు మిటౌడీ నడుం బిగించారు. తాగుబోతులపై చర్యలకు సిద్ధమయ్యారు. ఆయుధాలతోపాటు ఇతర సరఫరాలపై నియంత్రణ విధిస్తానన్నారు. ఆయుధాల అవసరంపై స్పష్టమైన సమాచారమొచ్చే వరకూ పంపిణీ నిలిపి వేస్తా నన్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎంతో చేయాల్సివుండగా, చొరవ తీసుకున్నది మాత్రం ఒక్కరే. అయితే, ఆయనకు మాత్రం తన అనుయాయుల నుంచి అందు తున్న సహకారం కూడా తక్కువే. రోజులు గడిచేకొద్దీ మా ఇద్దరి మధ్యా స్నేహం బలపడింది. నాలో ఒకే ఒక్క బలహీనత ఉందన్నారు. అది ఫ్రెంచియేతర భాషల వారితో నేరుగా సంబంధాలు నెలకొల్పలేకపోవడం. కాంగోవాసులతో ప్రత్యక్ష సంబంధాల కోసం నాకు స్వాహిలీ నేర్పాలనుకున్నారు. ఎర్నెస్ట్ ఇలుంగాను అందుకు కేటాయించారు. ఆయన ఓ తెలివైన యువకుడు. భాషలోని మర్మాల్ని ఆయన నాకు పరిచయం చేశారు. ఎంతో ఉత్సాహంగా మా క్లాసులు మొదలయ్యాయి.

మొదట మూడు గంటలంటూ మొదలైన క్లాసుల్ని ఓ గంటకు నేనే కుదించాను. ఐతే, నాకు సమయం కుదరక కాదు. ఇతర భాషలు నేర్చుకోవాలన్న ఆసక్తి లేకపోవడం వల్ల. స్వాహిలీ అంత సులభమైంది కూడా కాదు. అందులో కఠినమైన గ్రామర్ ఉంది. కాంగోలో ఉన్నంతకాలం నేనా సమస్యను అధిగమించలేకపోయా. స్వాహిలీని తమ దేశ జాతీయ భాషగా చెప్పుకుంటారు. ఐతే అక్కడి తెగలకు ఎవరి మాతృ భాష వారికుంది. దాంతో దీన్ని రెండో భాషగానే నేర్చుకుంటారు. ఈ భాషలో ప్రావీణ్యం రాజకీయ నేతృత్వానికి ఓ సింబల్‌గా భావిస్తారు. దాదాపు రైతులంతా దీన్ని తమ

రెండో భాషగా మాట్లాడుతారు. కాకపోతే వెనకబాటు వల్ల ఎవరికి వీలైన విధంగా వారు సరళీకరించుకున్నారు. అసలు భాషలో వారికీ, నాకూ ప్రావీణ్యం లేకపోవడమే ఓ విధంగా కలిసి వచ్చింది. సగం భాషే నాకూ-వారికీ మధ్య సంబంధాల్ని నెలకొల్పడంలో సౌకర్యంగా మారింది. ఈ రోజుల్లోనే నాకు ముందండి పరిచయమయ్యారు. ఆయన ఫ్రంట్ డీ ఫోర్స్‌లో రువాండన్ కమాండర్. ఆయన చైనాలో చదువుకున్నారు. ఆయనతో జరిపిన మొదటి సంభాషణ నాపై ఎంతో ప్రభావం చూపింది. ఒకే ఘటనలో 35 మంది శత్రువుల్ని మట్టుబెట్టినట్టు ఆయన నాతో చెప్పారు. ఆ ఘటనలో ఎన్ని ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నారంటూ నేనడిగా. అందుకు ఆయన ఏమీ లేదన్నారు.

ఎందుకలా జరిగిందంటే మందు పాతరతో పేల్చేయడం వల్ల శత్రు సైనికుల ఆయుధాలన్నీ తునాతునకలయ్యా యన్నారు. లౌక్యంలో నాకు నైపుణ్యత చాలా తక్కువ. వెంటనే నేను అది అబద్ధ మంటూ తేల్చి చెప్పా. దాంతో, ఆయన తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. సంఘటనలో తాను ప్రత్యక్షంగా పాల్గొనలేదని, తన అను యాయులే ఘటన గురించి తనకు సమాచారమిచ్చినట్టు వివరించారు. దాంతో, అబద్ధాన్ని అబద్ధమంటూ ముఖం మీదే చెప్పేయడం స్నేహితుల విషయంలో సరైంది కాదని తెలుసుకున్నా.. జూన్ ఏడున నేను అప్పర్ బేస్‌కు వెళ్లా. సమీపకాలంలో కబీలా వచ్చే అవకాశం లేదని మిటొడీ అన్నారు. ఆ సమయంలో దార్ ఏ సలామ్‌కు చౌ ఎన్ లై వస్తుండగా, ఆయనతో చర్చించేందుకు కబీలా అక్కడికి వెళ్తున్నారు. చైనా నేతను సాయం కోసం అభ్యర్థించనున్నారు. నేను అప్పర్బేస్కు వెళ్తుండగా మిటొడీ నీట మునిగారంటూ మాకు ఓ సమాచారమందింది. ఆయన శవాన్ని మూడు రోజుల తర్వాత అంటే జూన్ పదిన ఒడుకు చేర్చారు.

పడవ ప్రమాదానికి గురైనపుడు అందులో ఇద్దరు క్యూబన్లు కూడా ఉన్నట్టు తెలిసింది. వ్యక్తిగతంగా నేను జరిపిన విచారణతో ఓ నిర్ధారణకొచ్చా.. మిటొడీ రువాండసీకి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అది కబింబా బేస్కు 3 కి.మీ. దూరంలో ఉంది. రోడ్డు మార్గం సరిగ్గా లేకపోవడంతో ఆయన పడవలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో బలమైన గాలులు వీస్తుండగా, సరస్సులో అలలు ఎగసిపడ్డాయి. ప్రమాదవశాత్తూ ఆయన సరస్సులోకి జారిపడ్డారు. మిటొడీకి ఓ మేరకు ఈత వస్తుంది.

అందుకోసం ఆయన తన బూట్లను తొలగించేందుకు యత్నించారు. ఆ సమయంలో సాయం కోసం పది, పదిహేను నిమిషాలపాటు అరిచారు. ఆయన్ని రక్షించడం కోసం కొంతమంది నీళ్లలోకి దూకారు. అదే ప్రమాదంలో ఆయన సహచరుడు కమాండర్ ఫ్రాంకోయిస్ కూడా నీట మునిగారు. (ఐతే, ఈయన మిటౌడీని రక్షించడం కోసం దూకారా, లేక తాను కూడా కాలుజారి పడిపోయారా అనేది నాకు ఎప్పటికీ అర్థం కాలేదు). ప్రమాదం జరగ్గానే మోటార్ను ఆపివేసి పడవను కొంత దూరంలో నిలిపారు. ఆ తర్వాత మిటౌడీ మునిగిన చోటుకి పడవను మళ్లించేందుకు యత్నించగా అంతు చిక్కని ఏదో శక్తి తమను అటు వెళ్లకుండా అడ్డుపడ్డట్టు వారు చెప్పారు. ఆయన సాయం కోసం అరుస్తుండగా, వీరు పడవను ఒడ్డుకు ఎందుకు నడిపించారనేది సమాధానం దొరకని ప్రశ్నగానే మిగిలిపోయింది. కాంగో నేతల మధ్య మానవ సంబంధాలు ఎంతో సంక్లిష్టంగా అనిపించాయి. వారు అలా ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోలేకపోయా.. పడవను నడిపించిన వ్యక్తి కూడా ఓ సైనిక కమాండరే. ఈ సంఘటన తర్వాత అతన్ని వేరే ఫ్రంట్‌కు పంపించారు. బేస్‌లో జరిగిన అనేక దుస్సంఘటనలు అతని సమక్షంలోనే జరిగినట్టు తెలిపారు.

ఓ చిన్న ప్రమాదం ఓ ఉద్యమ నేతను బలితీసుకోవడం ఆలోచింపజేసింది. అంతా గజిబిజిగా ఉన్న కబింబా బేస్లో ఓ సరైన నిర్మాణం కోసం ఆయన శ్రమిం చారు. 30 ఏళ్ల యువకుడైన మిటౌడీ లుముంబా ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వ హించారు. ఆ తర్వాత ములేలేతోపాటు పోరాటాల్లో పాల్గొన్నారు. విప్లవోద్యమం పూర్తిగా బలహీనపడ్డ సమయంలో తననిక్కడికి ములేలా పంపించారని మిటౌడీ చెప్పారు. సంఘటన జరిగిన మరుసటి రోజే చుట్టుపక్కల ప్రాంతాలకు తెలిసి పోయింది. జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ కబీలా నాకో లెటర్ రాశారు.

"సోదరుడు మిటూతోపాటు మిత్రుల మరణవార్త నాకిపుడే తెలిసింది. జరిగిన సంఘటన నన్ను ఎంతో కలిచివేసింది. నేను మీ రక్షణ గురించి ఆందోళన చెందా. నేనిపుడు నేరుగా అక్కడికి రావాలనుకుంటున్నా మనకిపుడు జరిగిన పెద్ద విషాదం అదే. నేను అక్కడికి వచ్చేవరకూ మీతోపాటు వచ్చిన కామ్రేడ్స్ అంతా అక్కడే ఉండ గలరు. మీరు ఎంత చురుకైనవారో నాకు తెలుసు. ఇక మన పని వేగంగా చేద్దాం.

కా(మేడ్స్ ముటెబా, బులుంగాయి, కసాబీల ద్వారా అక్కడి విషయాల్ని తెలుసు కుంటున్నా...
శుభాకాంక్షలతో... స్నేహితుడు
కబీలా..."

మిటౌడీ మరణం కామ్రేడ్ ముటేబాకు ఆవేదన కలిగించింది. జరిగిన సంఘ టనలపై మా అభిప్రాయాల్ని తెలుసుకునేందుకు మా దగ్గరికొచ్చారు. కాంగోలో మా దృష్టికి వచ్చిన ముఖ్య సమస్యల గురించి మాట్లాడాం. అప్పటికి దాదాపు రెన్నెళ్లు గడిచిపోయాయి. మేం మాత్రం ఏమీ చేయలేకపోయాం. మిటౌడీకి నేనిచ్చిన నివేదికల గురించి చెప్పా ఐతే, అవి ఆయనతోపాటే పోయాయి. కబీలాకు పంపడం కోసం నన్ను మరో నివేదిక ఇవ్వమన్నారు. ఆ నివేదికలోని అంశాలు ఇలా ఉన్నాయి ... (ఐతే, నేనిక్కడ ఇస్తున్న నివేదిక అసలు ప్రతికి కొంత భిన్నంగా ఉండొచ్చు).

సాధారణ అభిప్రాయాలు. కాంగోలో నా అనుభవాలన్నీ ఒకటిన్నర నెలకు మాత్రమే పరిమితమైనవి. అన్ని విషయాల్ని అప్పుడే చెప్పలేను. అమెరికా సామ్రాజ్య వాదం నుంచే మనకు అసలైన ప్రమాదమని నేను గుర్తించా. అమెరికన్ల నుంచే ప్రధాన ప్రమాదమెందుకో నేను విశ్లేషించి చెప్పలగలను... తాజాగా ఎదురైన ఓటమి బాధల నుంచి బయట పడాలంటే కాంగో విప్లవ శక్తులన్నీ ఏకం కావాల్సిన సమయమిది. ఇతర విప్లవాల నుంచి అమెరికన్లు పాఠాలు నేర్చుకుంటే మాత్రం వారిక్కడ కఠినంగానే వ్యవహరిస్తారు. అందుకోసం ముందస్తు వ్యూహంతో సరస్సు ప్రాంతంపై పట్టు బిగిస్తారు. మనకందుతున్న అన్ని రకాల సరఫరాలకూ అడ్డుకట్ట వేయాలంటే వారికదే సరైన దారి. మరోవైపు వియత్నాం విప్లవం, తాజాగా శాంటో డొమింగోలో అమెరికా జోక్యంలాంటి ఇతర సంఘటనలు సామ్రాజ్యవాదుల చేతుల్ని కట్టి పడేసిన సందర్భం. విప్లవోద్యమ అభివృద్ధికి ఇదే తగిన సమయం. శత్రువుపై పెద్ద ఎత్తున మెరుపు దాడులు చేయడం ద్వారా అది సాధ్యం. స్తబ్దత ఓటమికి ప్రారంభం లాంటిది.

నిర్మాణపరంగా ఉన్న లోపాల వల్లే శత్రువుపై దాడులు చేయలేకపోయాం. ఒక దానితో ఒకటి సంబంధమున్న అనేక అంశాలు అందులో ఉన్నాయి.

1-క్యాంపుల మధ్య సమన్వయం కోసం యూనిఫైడ్ సెంట్రల్ కమాండ్ లేక పోవడం. మిలటరీ భాషలో చెప్పాలంటే ఐక్యతా సూత్రం. (ఇది కాంగోకు మాత్రమే పరిమితం కాకుండా ఈ ప్రాంతమంటికీ వర్తిస్తుంది.) 2- ఉన్నత సంస్కృతి ఉన్న కార్యకర్తల కొరత. విప్లవోద్యమ నిబద్ధత స్థానిక నాయకత్వంలో లోపించడం. 3 భారీ ఆయుధాల పంపిణీపై నియంత్రణ లేకపోవడంతో కమాండ్ ఖాళీ అవడం. 4–దళ సభ్యులకు శిక్షణ లేకపోవడం, క్రమశిక్షణ లోపించడం. 5-దళాల కదలికల్ని సమన్వయం చేసే శక్తి కమాండ్ సెంటర్‌కు లేకపోవడం. 6-ఆయుధాల్ని ఉపయో గించడంలో కనీస శిక్షణ లేకపోవడం...

ఈ లోపాలే ఎత్తుగడల్ని బలహీనపరిచాయి. వ్యూహాత్మక ఆపరేషన్స్ నిర్వహించ కుండా పక్షవాతం వచ్చినట్టు అచేతనంగా పడివుండేలా చేశాయి. ఏ విప్లవమైనా ఎదుర్కోవాల్సిన బలహీనతలివి. వాటి నుంచి బయట పడాలంటే ఓ క్రమ పద్ధతిలో చర్యలు తీసుకోక తప్పదు.

క్యూబన్ భాగస్వామ్యం... క్యూబాలోని నల్లజాతి ప్రజలు సైతం దారుణమైన దోపిడీ, వివక్షల్ని ఎదుర్కొన్నవారే. ఈ పోరాటంలో వారిని భాగస్వాముల్ని చేయ డానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చాం. ముఖ్యంగా తూర్పు ప్రాంత రైతుల్లో ఎక్కువ భాగం నిరక్షరాస్యులు. దాంతో, నల్లజాతి వారిలో శిక్షణ పొందిన వారు కొద్దిమందే. వారిని పంపించాలని నిర్ణయించినపుడు యుద్ధ అనుభవమున్న వారి కోసం వెతికాం. మా దేశవాసుల్లో ఎడతెగని పోరాటస్ఫూర్తి ఉంది. యుద్ధ ఎత్తుగడల్లోనూ వారికి అనుభవంతో కూడిన జ్ఞానం ఉంది. చర్యలు ఎలా ప్రారంభించాలనేదానిపై ప్రతిపాదనలు చేశా. మా సైనికులకున్న ప్రత్యేక లక్షణాల వల్ల యుద్ధ చర్యల్లోనూ, ప్రత్యక్ష యుద్ధాల్లోనూ భాగస్వామ్యముండాలని సూచించా. రెండు విధాలుగా మా భాగస్వామ్యముండాలని ప్రతిపాదించా... 1–మా దేశవాసుల్ని ఫ్రంట్‌లోని వివిధ యూనిట్లలో చేర్చాలి. వారు కాంగో వాసులకు ఆయుధాల్ని ఎలా ఉపయోగించాలో నేర్పుతూ వారితోపాటు పోరాటంలో పాల్గొంటారు. 2-మొదట క్యూబన్ కమాండ్ కింద మిశ్రమ యూనిట్లలో పని చేయడం ద్వారా కాంగో యోధులకు శిక్షణ ఇవ్వ గలుగుతాం. దాంతో పోరాట పరిధి విస్తరిస్తుంది (మేం తక్కువ సంఖ్యలో ఉన్నందున ఒక్కో యూనిట్లో ఇద్దరికి మించి ఉండకూడదని నిర్ణయించాం). శిక్షణ ఇవ్వడం కోసం క్యూబన్ ఇన్‌స్ట్రక్టర్ల

ఆధ్వర్యంలో బేస్ క్యాంప్ నిర్వహించాలనుకున్నాం.

మిలటరీ, రాజకీయ కారణాల వల్ల మేం రెండో ప్రతిపాదన పట్ల ఆసక్తి చూపాం. దీని వల్ల మిలటరీ విషయంలో మేం అనుసరించే గెరిల్లా యుద్ధ తంత్రాన్ని అక్కడ అమలు చేసేందుకు వీలవుతుంది. అక్కడ మేం సాధించే విజయం భిన్న సంస్కృతులు, మతాల వారి మధ్య మా ప్రాబల్యాన్ని పెంచుతుంది. కాంగోవాసుల్ని తమ బలహీనతల నుంచి బయట పడేలా చేయడం కోసం మాకిది ఓ అవకాశంగా మా కమాండర్లు భావించారు. ఆయుధాల్ని ఉపయోగించడంలో బలహీనంగా ఉన్న క్యాంపుల్లో మా శిక్షణ అవసరమని భావించాం. మిలటరీ శిక్షణతోపాటు అక్కడి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలనుకున్నాం. వారిని నిర్మాణాత్మకంగా అభివృద్ధి చేయాలనేదే మా ప్రణాళిక.

మిలటరీ పరిస్థితిపై మా అంచనా. ఆల్బర్ట్ విల్లేను ఆక్రమించాలన్న ప్రతిపాదన వచ్చింది. ఐతే, మా దళాలకది తగిన సమయం కాదని చెప్పా.. అందుకు కారణాల్ని వివరించా... 1-పర్వత ప్రాంతాల్లో రక్షణ పొందుతున్న మాకు మైదాన ప్రాంతాల నుంచి శత్రువును తరమగలిగే శక్తి లేదు. 2- మొదటిసారిగా అక్కడ అంత పెద్దదాడి జరిపేందుకు తగిన అనుభవం లేదు. అలాంటి దాడి చేయాలంటే దళాలన్నిటినీ ఒకే కమాండ్ కింద సమీకరించాలి. అలాంటి ఆపరేషన్‌కు అవసరమైన నిర్మాణ మింకా ఏర్పడలేదు. 3-దాడికి అవసరమైన ఆయుధాలు కూడా లేవు.

ఆల్బర్ట్ విల్లే నుంచి శత్రువును ఖాళీ చేయించాలంటే ఓ క్రమ పద్ధతిలో ముందుకు కదలాలని నిర్ణయించాం. ముందుగా శత్రువు నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలి. సమాచార వ్యవస్థకూ, రాకపోకలకూ అడ్డుకట్ట వేయాలి. ఏకాకిని చేసి మిలటరీని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి పెంచాలి. కబింబా, ఫ్రంట్ డీ ఫోర్స్, లులింబా. ఇలా మా దళాలు బలంగా ఉన్న ప్రాంతాల నుంచి శత్రువును వెనక్కి నెట్టాలి. ఆల్బర్ట్ విల్లేకు వెళ్లే దారులన్నిటిపై పట్టు బిగించాలి. వరుస దాడులతో శత్రువును ఉక్కిరిబిక్కిరి చేసి చివరగా ఆల్బర్ట్ విల్లేపై దాడి చేయాలి.

మరో నివేదికలో ఆపరేషన్స్ ఎలా ప్రారంభించాలో వివరించా.. కబింగాపై మొదటి దాడి జరపాలని సూచించా. అందుకు నేను చూపిన కారణాలిలా ఉన్నాయి.

1 – అక్కడ శత్రు దళాలు తక్కువ సంఖ్యలో ఉండటం. 2–పర్వతాలకు సమాంతరంగా శత్రు దళాల రాకపోకలు కొనసాగుతుండటం. 3-కటెంగాను స్వాధీనం చేసుకుంటే కసెంగోకు గేట్ వేగా ఉన్న లులింబాను వేరు చేయొచ్చు.

ఈ లెటర్ తర్వాత పరిస్థితిని వివరిస్తూ నివేదిక పంపించాం. కటెంగాపై దాడి జరపాలని సూచించాం. ఆ సమయంలో కటెంగాపై దాడి జరపడం సులభం. అక్కడ మన దళాల కదలికలు పూర్తిగా నిలిచిపోవడంతో శత్రు దళాల నిఘా వ్యవస్థ అక్కడ లేకుండా పోయింది.

**********

మిటౌడీ స్థానంలో వచ్చిన వ్యక్తి కిగోమాకు వెళ్లారు. ఇంకా కొందరైతే యుద్ధ సమయానికి కనిపించకుండా పోయారు. ఉదాహరణకు.. కామ్రేడ్ ముటీబా. కబీలాకు నా లెటర్ అందించిన వ్యక్తి. బేస్ క్యాంప్లో మరోసారి అనిశ్చితి నెలకొంది. వైమానిక దాడుల నుంచి రక్షణ పొందాలంటే మెషిన్గన్స్ ఉపయోగించాలి. ఐతే, కాంగో యోధులకు వాటిని ఉపయోగించడంలో శిక్షణ లేదు. కొద్దిమందికి మిన హాయించి వారిలో నేర్చుకోవాలన్న ఆసక్తి కూడా లేదు. శత్రు విమానాల్ని వెనక్కి పంపాలంటే మెషిన్గన్స్ ఉపయోగించాల్సిందే. అలా చేయని పక్షంలో విమానాలు తక్కువ ఎత్తులో వెళూ బాంబులు జారవిడిచే ప్రమాదముంది. ఇదే పరిస్థితిని మేం అప్పర్నేస్లోనూ ఎదుర్కోక తప్పలేదు. అక్కడి కామ్రేడ్స్లో ఎక్కువభాగం జ్వరంతో బాధ పడుతున్నారు. మరోవైపు మిటౌడీకి హామీ ఇచ్చిన విద్యార్థులెవరూ తిరిగి రాలేదు. వారంతా దూర ప్రాంతాలకు చెందినవారు. మానుంచి ఆయుధాలు తీసు కెళ్లడం కోసమే అలా చెప్పారు. వారు తీసుకెళ్లిన ఆయుధాలు వృథా లేదా లక్ష్య రహితం. జూన్ మధ్యలో కామ్రేడ్ ముందండి వచ్చారు. కబీలా నుంచి కొన్ని లెటర్స్ తెచ్చారు. వాటిలో జూన్ 16న రాసిన లెటర్ ఇలా ఉంది.

కామ్రేడ్.. నా కోసం మీరు ముటీబా ద్వారా పంపిన నివేదిక చదివాను. మీకు ముందే చెప్పినట్టు దాడులు ప్రారంభించాలని కోరుతున్నా. వాటి గురించి ముందండి మీతో మాట్లాడుతారు. ముందండి నేతృత్వంలో జూన్ 25న దాడి జరపాలి. దయచేసి అందుకోసం 50 మంది క్యూబన్ యోధుల్ని అనుమతించ గలరు. ఓ విప్లవకారుడిగా అక్కడి లోపాల్ని గుర్తించినందుకు అభినందిస్తున్నా. ఏదో ఓ రోజు నేను అక్కడికి రాగలనని భావిస్తున్నా. మరో డజన్ మందిని కబింబాకు పంపించగలరు.

అభినందనలతో..
స్నేహితుడు, కబీలా

నేను పంపిన ప్రణాళికను కబీలా అంగీకరించారు. మాకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న కటెంగాపై దాడి కోసం ముందండితో చర్చిస్తున్నా. ఐతే, ముందండి దగ్గర స్పష్టమైన ప్రణాళిక ఏమీలేదు. జూన్ 25న దాడి జరపాలన్నారు. అదే రోజున ఎందుకని అడిగితే సమాధానం

చెప్పలేకపోయారు. కబింగాపై దాడి గురించి చర్చించాం. దాడి తర్వాత శత్రువు రాకపోకల్ని అడ్డుకునేందుకు రోడ్డు మార్గాన్ని ధ్వంసం చేయాలన్నాం. దీనిపై ఆయనకు స్పష్టత లేదు. ఆయన తన శక్తి సామర్థ్యాల్ని అతిగా అంచనా వేసినట్టు అనిపించింది. ఫ్రంట్ డీ ఫోర్స్ పై దాడి జర పాలన్నది ముందండి, కబీలాల నిర్ణయం. ఆ దాడితో శత్రువుపై పెద్ద విజయం సాధించగలమని వారు భావించారు. ఐతే, నా భయమెల్లా క్యూబన్, రువాండన్ దళాల రక్షణ గురించి.. శత్రువు అనుకూల స్థితిలో భారీ ఆయుధాలతో ఉంటే నష్టం తీవ్రంగా ఉంటుందని ఊహించా. ఆపరేషన్స్ నిర్వహణలో మా భాగ స్వామ్యం ఉండాలని కోరా. నా ప్రతిపాదనను కబీలా తెలివిగా తిరస్కరించారు. ముందండి ఆదేశాల ప్రకారమే దాడులు జరపాలని, మిశ్రమ దళాలకు మాత్రమే క్యూబన్లు నాయకత్వం వహించాలన్నారు. అది నాకు అంతగా నచ్చలేదు. ముందం డికి నేనెవరో తెలుసు. నాపట్ల ఆయన గౌరవ భావంతోనే ఉన్నారు. ఈ సందర్భంగా కబీలాకు కొన్ని విషయాలు తెలిపా.. అవి ఇలా ఉన్నాయి.

ప్రియమైన కామ్రేడ్... మీరు లెటర్ పంపినందుకు కృతజ్ఞతలు. మీరు విశ్రాంతి స్థితిలో ఉన్నారు. నా అసహనం కార్యరంగంలో ఉన్న మనిషికి సంబంధించి. ఇక్కడ నా ఉద్దేశం మిమ్మల్ని విమర్శించాలని కాదు. మీలాంటి పరిస్థితుల్లోనే నేనూ జీవించాను కనుక మిమ్మల్ని నేను అర్థం చేసుకోగలను. మీరు వస్తారని ఆత్రుతగా ఎదురు చూశా.. మీరు నాకు పాత మిత్రులే కనుక వాస్తవాల్ని వివరించాలను కున్నా. మీ నాయకత్వంలో పని చేయడం నా బాధ్యత. మీరు ఆదేశించిన మరుసటి రోజే క్యూబన్లు ఫ్రంట్ డీ ఫోర్స్‌కు వెళ్లగలరు. దురదృష్టవశాత్తూ ఎక్కువమంది అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఉన్నది కూడా 40 కన్నా తక్కువే. నలుగురు కామ్రేడ్లు కబింబాలో ఉన్నారు. మిగతావారు రాగానే వారిని కూడా పంపిస్తాం. మిమ్మల్ని కోరేదెల్లా ఒక్కటే. ఫ్రంట్ డీ ఫోర్స్‌కు వెళ్లేందుకు నాకు అనుమతి ఇవ్వండి. అందుకు నాకు ఎలాంటి అధికారమూ అవసరం లేదు. కేవలం మా కామ్రేడ్లకు రాజకీయ నిర్దేశకతగా వెళ్తాను. కామ్రేడ్ ముందండి ఆదేశాల ప్రకారమే పని చేస్తాం. ఈ విషయం అతనికి చెప్పాను. ఆయన అందుకు అంగీకరించారు. ఇది ఉపయోగ కరంగా ఉంటుందని భావిస్తున్నా. మీ లెటర్ అందాక మూడు లేదా నాలుగు రోజుల్లో నివేదిక

పంపించగలను.

శుభాకాంక్షలతో... టాటు

నేను అక్కడికి వెళ్లే విషయమై ముందండితో చర్చించా. ఆయన అంగీకరించారు. ఐతే, కబీలా నుంచి ప్రత్యుత్తరమొచ్చే వరకూ ఆగకుండా దళాల్ని పంపిస్తానన్నారు. కొన్ని రోజుల తర్వాత లెటర్ వచ్చింది. ఐతే, అందులో స్పష్టత లేదు. ఆటో ఇటో తేల్చి చెప్పాలంటూ మరో లెటర్ రాశా. అందుకు ఆయన సమాధానమివ్వలేక పోయారు. ఫ్రంట్ డీ ఫోర్స్‌కు వెళ్లలేకపోయా.

నిర్ణయించిన తేదీకే అక్కడికి వెళ్లారు. ఐతే, నేను చెప్పినట్టు 40 మంది కాకుండా 36 మందే. కొన్ని రోజులకు మరో ఏడుగురితో కలిపి మొత్తం నలభైమూడు. అంతా క్షేమంగా ఉన్నట్టు సమాచారమొచ్చింది. ఐతే, దాడి వాయిదా పడింది. ముందండి అక్కడ కనిపించలేదు. అక్కడికి వెళ్లినవారు తమకు ఓ డాక్టర్ కావాల న్నారు. ఆ సమయంలో మా దగ్గరికి మరో 39 మంది కామ్రేడ్లు వచ్చారు. వారిలో ముగ్గురు డాక్టర్లున్నారు (ఒకరు సర్జన్, ఒకరు ఎముకల డాక్టర్, మరొకరు జనరల్ డాక్టర్). దీంతో, వారి కోరిక నెరవేర్చేందుకు మాకు అవకాశం చిక్కింది. యుద్ధానికి సంబంధించి మొదటి నివేదిక ఇలా ఉంది. "టాటూ లేదా కుమీ. దాడి ప్రారం భించాం. 1965 జూన్ 29న ఉదయం 5 గంటలకు ప్రారంభించాం. మేం ముందుకు కదులుతున్నాం. కటెంగాపై దాడిలో మన కామ్రేడ్లు ఐదుగురున్నారు. నానే నేతృత్వంలో జరుగుతున్న ఈ దాడిలో ఇద్దరు రువాండన్లు కూడా ఉన్నారు. ఇట్లు. ప్యాట్రియో ఓ మ్యూర్టే, మోజా..." ఆ తర్వాత మరో వార్త. "సమయం 730. ఈ సమయం మనకు ఎంతో అనుకూలంగా ఉంది. దళ సభ్యులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. అనుకున్న సమయానికే దాడి ప్రారంభించాం, తుపాకులతో, మోర్టార్లతో మరింత సమాచారం తర్వాత పంపిస్తాం." దీని తర్వాత మరో సమాచారం. దజిన్ల కొద్దీ సంఘటనలు జరిగాయి. క్యూబన్లు కొందరు చనిపోగా, మరికొందరు గాయపడ్డారని... దీంతో, అంతా అనుకూలంగా ఏమీ లేదని అర్థమైంది. 29న ప్రారంభించిన దాడిలో దళ సభ్యుల మధ్య సమన్వయం లోపించిందంటూ వివరణ వచ్చింది.

దాడికి సంబంధించి ముందండి ప్రణాళిక సరీగా లేదంటూ కామ్రేడ్లు ఎంబిలీ, మోజాలు

నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కబీలా ఆదేశాల ప్రకారమే చేస్తున్నానంటూ ముందండి సమాధానమిచ్చారు. ఐతే అలాంటి ఆదేశాలేమీ ఇవ్వలేదంటూ 39 తర్వాత కబీలా చెప్పారు.

ఫ్రంట్ ఢీ ఫోర్స్/ఫ్రంట్ బెండేరాలోని కింబీ నదిపై ఓ జల విద్యుత్ కేంద్రం ఉంది. దానికి నీటి సరఫరా పర్వతాల మధ్య నుంచి జరుగుతోంది. ఆ ప్రాంతం రువాండన్ల ఆధీనంలో ఉంది. ఆ గ్రామం రెండు భాగాలుగా ఉంది. పాత గ్రామం దాటి వెళ్లే విద్యుత్ కేంద్రం వస్తుంది. కొత్త గ్రామానికి సమీపంలోనే టర్బైన్లున్నాయి. అక్కడే మిలటరీ క్వార్టర్లున్నాయి. మొత్తం 80 ఇళ్లు. కింబీ నది వారికి సహజ రక్షా కవచంగా ఉపయోగపడుతోంది. రక్షణాత్మకంగా దాడులు జరిపేందుకు వీలుగా కందకాలు తవ్వకున్నారు. పక్కనే వైమానిక స్థావరం కూడా ఉంది. ఐదు నుంచి ఏడు వందలమంది దృఢకాయులైన సైనికులక్కడ పహారా కాస్తున్నారు. ఈ గ్రామానికి 4 కి.మీ. దూరంలో ఆల్బర్ట్ విల్లే జంక్షన్ ఉంది. అక్కడ ప్రత్యేక దళా లున్నాయి. అక్కడే సైనిక శిక్షణ కోసం ఓ కళాశాల కూడా ఉన్నట్టు తెలిసింది.

కామ్రేడ్ ఇన్నే మరణించారని తెలిసి కామ్రేడ్ ఎంబిలీతోపాటు 20 మందిని అక్కడికి పంపించాం. వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేయాలని చెప్పాం. దీనిపై ముందండితో చర్చించినపుడు రువాండన్ కామ్రేడ్లు అక్కడికి వెళ్లేందుకు నిరాకరించి నట్టు ఆయన తెలిపారు. అక్కడికి పంపేందుకు మా దగ్గర మరెవరూ లేరు. ఇన్నే బృందంలో క్షేమంగా బయటపడ్డవారంతా బేస్‌కు చేరుకున్నారు. దాంతో , ఎంబిలీతో వెళ్లిన 20 మంది రువాండన్లు కూడా పోరాడేందుకు నిరాకరించారు. మహా బృందానిదీ అదే పరిస్థితి. ఇన్నే ప్రణాళికలో స్పష్టత లేదు. దాడికి ముందు మహాతో చర్చించారు. యుద్ధంలో ఓటమి తప్పదని తెలిసినపుడు వెనక్కివచ్చే అవకాశమున్నా దాన్ని సరిగ్గా ఉపయోగించలేకపోయారు. వారిని గైడ్ చేసిన వ్యక్తికి వెనక్కి తిరిగే దారి తెలియకపోవడం భారీ నష్టానికి కారణమైంది. ఈ ఘటనలో నలుగురు క్యూబన్లతోపాటు 14 మంది రువాండన్లు మృత్యువాత పడ్డట్టు తెలిసింది. రువాండన్ల సంఖ్యపై స్పష్టత లేదు. ఈ ఘటనకు సంబంధించి ఎక్కువగా తప్పు పట్టాల్సింది మాత్రం క్యూబన్లనే. శత్రు సేనను కామ్రేడ్ ఇన్నే తక్కువ అంచనా వేశారు. భయపడ కుండా ఆపరేషన్ నిర్వహించడమే తన బాధ్యతగా భావించారు తప్ప పొజిషన్స్‌పై

దృష్టి సారించలేదు. దాడికి బయలుదేరడానికి ముందు తమ దగ్గరున్న డాక్యు మెంట్స్ వదిలి వెళ్లకుండా తమ వెంటే తీసుకెళ్లారు. శత్రువుతో పోరాడుతున్న సమయంలోనూ అవి వారివెంటే ఉన్నాయి. శత్రువు చేతికి ఓ డైరీ దొరికిపోయింది. పోరాటంలో క్యాబిన్లు పాల్గొంటున్న విషయం శత్రువుకు తెలిసిపోయింది. ఐతే, చనిపోయిన వారిలో నలుగురు క్యాబిన్లున్న విషయం వారు తెలుసుకోలేకపోయారు. వార్తా పత్రికలన్నింటా ఇద్దరే అంటూ ప్రస్తావించారు. ఘటనలో మన ఆయుధాలు పెద్ద ఎత్తున శత్రువు చేతికి చిక్కాయి. మరణించిన వారితోపాటు గాయపడ్డవారి ఆయుధాలు కూడా శత్రువు చేతికి చిక్కాయి.

ఇంతకీ కటెంగాలో జరిగిందేమిటీ?... 160 మంది సాయుధులు ఈ దాడిలో పాల్గొన్నారు. ఐతే, వారి దగ్గరున్న ఆయుధాల కంటే శత్రువు దగ్గరున్న ఆయుధాలే శక్తివంతమైనవి (శత్రువు దగ్గర సబ్‌మెషీన్ గన్స్, రాకెట్ లాంచర్స్ ఉన్నాయి). మనవాళ్లు దాడి జరపడానికి ఓ రోజుముందే శత్రు యుద్ధవిమానాలు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టాయి. మనవాళ్లు జాగ్రత్తలు తీసుకునేందుకు వీలు కల్పించిన సంఘటన అది. దళాలు ముందుకు కదలడం ప్రారంభించాక 160 మందిలో దాదాపు 60 మంది తప్పించుకుపోయారు. మిగిలిన వారిలో ఎక్కువ భాగం తమ ఆయుధాలకు పని కల్పించలేకపోయారు. కొద్దిమంది మాత్రమే శత్రు స్థావరాలపై కాల్పులు జరి పారు. ఐతే, వారి ఆయుధ శక్తి గాలిలో కలిసిపోయింది. అందుకు సమాధానంగా శత్రు దళాలు 60 ఎంఎం మోర్టార్లతో కాల్పులు జరిపాయి. మనవాళ్లపై ఖచ్చితంగా గురిపెట్టి కాల్చగలిగారు. దాంతో, భారీ నష్టం జరిగింది. నలుగురు చనిపోగా, 14 మంది గాయపడ్డారు. భయంతో ఓ క్రమం లేకుండా పారిపోవడం వల్లే ఎక్కువ మంది గాయపడ్డారు.

దవా వైద్యుడు సరైనవాడు కాకపోవడం వల్లే ఓటమి ఎదురైందన్నారు స్థానిక పోరాట యోధులు. దళ సభ్యులకు చెడ్డ దవా ఇచ్చాడంటూ తప్పు పట్టారు. దాంతో, మందులోడు ఆత్మరక్షణలో పడ్డాడు. మహిళలు, భయం వల్లే ఓటమి ఎదురైందంటూ మందులోడు తప్పించుకోజూశాడు. ఐతే, ఆ ప్రాంతంలో మహిళలెవరూ లేకపోవడంతో అతని వాదనకు బలం లేకుండా పోయింది. తనకిక స్థానభ్రంశం తప్పదని మందులోడికి అర్థమైంది.

ఈ వైఫల్యంతో కాంగో, రువాండన్ దళాల ఆత్మస్థైర్యం దెబ్బతింది. క్యూబన్ల హృదయం గాయపడింది. ఓటమి భయంతో వేగంగా పరుగెత్తడం కోసం ఆయుధాల్ని జారవిడవడమే భారీ నష్టానికి కారణమైంది. ఐతే, కీలక ఆయుధాలన్నీ క్యూబన్ల వద్దే ఉండటంతో అవన్నీ సురక్షితంగా తిరిగి వచ్చాయి. రువాండన్ల వద్దనున్న ఆయుధాలన్నీ నష్టపోక తప్పలేదు. ఈ ఘటన తర్వాత దళ సభ్యుల్లో ఎక్కువ భాగం తమను విధుల నుంచి తప్పించమని కోరారు లేదా తప్పించుకు పారిపోయారు. ముందండి నుంచి నాకు ఓ సుదీర్ఘ లేఖ అందింది. దాన్నొక వీరోచిత పోరాటంగా వర్ణించేందుకు ప్రయత్నించారు. ఆ పోరాటంలో తన సోదరుని మరణం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఐతే, అతడు తన మరణానికి ముందు ఓ లారీ నిండా వచ్చిన శత్రు సైన్యాన్ని మట్టుబెట్టినట్లు చెప్పుకున్నారు (మాకందిన సమాచారం ప్రకారం అక్కడ లారీలేమీ తిరగలేదు). ఓవైపు తన బృందంలోని దళ సభ్యుల త్యాగాల్ని కీర్తిస్తూనే, మరోవైపు కిగోమాలో ఉన్న జనరల్ స్టాఫ్‌ను నిందించారు. శత్రు దళాల్లోని మూడింట రెండొంతుల మంది ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసినట్టు చెప్పారు. ఐతే, అది కూడా వాస్తవం కాదని తేలిపోయింది. జరిగిన సంఘటనలపై అతని విశ్లేషణ అంతా కాల్పనికంగా సాగింది. అదే సమయంలో తన బలహీనతల్ని క్షమించమని వేడుకున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ మొత్తం సంఘటనతో ముందండి నిరుత్సాహ పడ్డారు. ఆయనలో పునరుత్తేజం నింపడం కోసం ప్రత్యుత్తరం రాయాల్సివుంది. పరిస్థితిని విశ్లేషిస్తూ, సలహా ఇవ్వాల్సివుంది. జూన్ 30న ఫ్రంట్ డీ ఫోర్స్‌లో ఏం జరిగిందో ఇంకా తెలియదు. నేను నా డైరీలో రాసుకున్న నెలసరి నివేదిక ఇలా ఉంది. "మాకిది ఎంతో బలహీన పరిస్థితి. ప్రతిదీ మరోసారి కొత్తగా ప్రారంభిం చాల్సిందే. మిటౌడీ చనిపోవడంతో మబ్బులు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. కిగోమాకు జనం పెద్ద సంఖ్యలో వలసలు వెళూనే ఉన్నారు. కబీలా ఇక్కడికి వస్తున్నా నంటూ కబురు పంపిస్తున్నారే తప్ప అది జరగడం లేదు. నిర్మాణం ఏమాత్రం లేకుండా పోయింది. అనుకూలాంశం ఏమంటే.. పోరాటంలో పాల్గొనేందుకు దళాలు వెళూనే ఉన్నాయి. దాడికి సంబంధించిన నివేదిక మాత్రం నిరాశాజనకంగానే ఉంది. మన చర్యలు షోంబే దళాల్ని (శత్రు దళాల్ని మేల్కొల్పేలా ఉన్నాయి. అనేక ప్రశ్నలకు సమాధానాలు స్పష్టం కావాల్సివుంది. మా గురించి, ముఖ్యంగా

నా గురించి కబీలా అభిప్రాయాలు ఎలా ఉన్నాయో తెలియాల్సివుంది. ఇక్కడి గజిబిజి పరిస్థితిని చక్కదిద్దేందుకు అసలతను సరైన వ్యక్తేనా? మేమిద్దరమూ ముఖాముఖీ మాట్లాడుకుంటే తప్ప ఏమీ చెప్పలేను. మొదటి ప్రశ్నకు సమాధానం కొంత అర్థమవుతోంది. నేనిక్కడ ప్రత్యక్షం కావడం పట్ల అతనికి ఆసక్తి ఉన్నట్టుగా లేదు. అది భయం వల్లనా, శత్రు భావం వల్లనా లేక నా ప్రశ్నించే పద్ధతి అతన్ని గాయపరిచిందా?"

ఈ రోజుల్లోనే టాంజానియాలో ఉన్న మా రాయబారి ప్యాబ్లో రివల్టాకు నేనో లెటర్ రాశా. ఇక్కడ నేనున్న విషయం టాంజానియా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరా, వారికి చెప్పకుండా నేనిక్కడికి వచ్చినందుకు క్షమాపణ చెప్పమన్నా కబీలా ఇక్కడ లేకపోవడం వల్ల వివరాలు అందించలేకపోయానని, ఇక్కడికి వచ్చే నిర్ణయం నా సొంతమని, అది క్యూబా ప్రభుత్వ నిర్ణయం కాదని స్పష్టం చేశా. ఈ లెటర్ తీసుకెళ్లే వ్యక్తి మొదట కిగోమాలోని కబీలాతో చర్చిస్తారు. ఈ లెటర్ ద్వారా కబీలాకు నా అభిప్రాయాలు తెలుస్తాయి. అతను కాంగో వచ్చాక ఆ విషయాలపై మేమిద్ద రమూ చర్చించాల్సివుంది.

**********

కబీలా రావడానికి ముందు నాకు నాలుగు రకాల సమాచారమందింది. ఇప్పటి వరకూ ఇచ్చిన వాగ్దానాలన్నీ భంగం కావడంతో ఇక ఏదీ నమ్మలేకపోయా. అంతకు మించి ఇక్కడ నా చుటూ ఎన్నో సమస్యలు పేరుకుపోయాయి. ముందండి నుంచి ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. ఒకదాన్ని మించి మరొకటి విమర్శనాత్మకంగా ఉన్నాయి. కాంగోవాసుల్లో పోరాట స్ఫూర్తి లోపించడం వల్లే నష్టపోతున్నామంటూ తప్పంతా వారిపైకే నెట్టేశారు. తమ కార్యకర్తలంతా చనిపోతున్నారని, తాను తమ రువాండా విప్లవం కోసం ఒంటరిగానే వెళ్లాల్సివస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రువాండా వెళ్లడానికి ముందు ఆల్బర్ట్ విల్లేలోనే ఉండాలనుకున్నారు. రువాండన్లు చిన్న చిన్న ఆపరేషన్స్‌తోనే అలసిపోతున్నారు. శత్రు కదలికల్ని గమనించడం, శత్రు దళాల్ని బందీలుగా పట్టుకోవడం, వగైరా... వారు పర్వత శ్రేణుల మొదటి వరుసలకే పరిమితమవుతున్నారు. మా విమర్శలకు వారిచ్చే సమా ధానమల్లా. కాంగోవాసుల నుంచి తగినంత సహకారం అందకపోవడమేనన్నది. ఐతే, అసలు ఆపరేషన్ ప్రారంభించిన తానే అందుకు బాధ్యత వహించాల్సివుండగా, తప్పంతా కాంగోవాసులపైకి నెట్టేందుకు యత్నించారు. జరిగిన తప్పిదానికి మమ్మల్ని కూడా బాధ్యుల్ని చేయొచ్చు. కానీ, నిర్ణయాలు తీసుకునేటపుడు కాంగో వాసుల్ని పక్కకు నెట్టి తప్పంతా వారిపైకి నెట్టడం ఎలా సరైంది?

కటెంగా, ఫ్రంట్ డీ ఫోర్స్‌లో గాయపడ్డవారిని తీసుకొస్తున్నారు. పర్వత శ్రేణుల మార్గంలో రైతులే వారిని మోసుకొస్తున్నారు. తోటి పోరాటయోధులకు వారిని మోసుకొచ్చే ఓర్పు కూడా లేని పరిస్థితి. అక్కడి బాధ్యులతో మాట్లాడేందుకు వరో సారి యత్నించా. ఆ సమయంలో మేజర్ కసాలీ తలనొప్పితో బాధ పడుతున్నందున కామ్రేడ్ కివేను మా దగ్గరికి పంపారు. నా ఆలోచనల్ని ఆయన క్రిగోమాలో ఉన్న వారికి వివరిస్తారు. చెప్పేందుకు విషయాలేమీ అంతగా లేవు. (ఎ) కొన్ని రోజుల క్రితం ఇక్కడికి వచ్చిన మా మనుషులు 40 మందిని ఏం చేశారు? వారందరినీ ఎక్కడికి పంపించారు? (బి) బెండేరాలో చేపట్టిన ఏ చర్యకూ నా అనుమతి లేదు..

అదే సమయంలో కబీలాకు నేనో లెటర్ పంపించా. ఫ్రంట్‌లో నా అవసరం తప్పనిసరని తెలిపా. మన దళాలు ఆత్మస్థైర్యం కోల్పోతున్న విషయం మా పరి శీలనలో అర్థమైంది. ఫ్రంట్ డీ ఫోర్స్ నుంచి దళాల్ని వెనక్కి మళ్లిస్తుండగా ఇక ఇలాంటి వారితో కలిసి పోరాడలేమంటూ కొందరు

మాతో చెప్పారు. మరికొందరైతే అసలు కాంగోనే విడిచి వెళ్తున్నట్టు పుకార్లు రాసాగాయి. ఆ సమయంలో నైతిక స్థిర్యాన్నివ్వడమే మా ప్రధాన కర్తవ్యంగా భావించాం. నేను పైన అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానాలివ్వాలని కోరా. ఐతే, ఎవరూ రాలేదు. కమిస్సార్ ఆల్ఫ్రెడ్ ద్వారా నేను మరో లెటర్ పంపా. ఫ్రంట్ డీ ఫోర్స్‌లో ఓటమి గురించి విశ్లేషించా. నా దృష్టికి వచ్చిన మరికొన్ని విషయాల్ని కూడా ప్రస్తావించా..

దాడుల నిర్వహణలో సమన్వయం లోపించింది. ఫ్రంట్ డీఫోర్స్ 29న దాడి జరపగా, 30న కటెంగా బృందం దాడి జరిపింది. దీనిపై ముందండి ఒక్కరినే తప్పు పట్టలేం. మరో బృందం ఏం చేసింది? ఒకే యూనిఫైడ్ కమాండ్ కింద ఆపరేషన్స్ జరగాలని ముందండి సూచించారు. ఒక్కో బృందంలో ఓ క్యూబన్ ఉండాలన్నారు. ఓ పెట్టె నిండా బుల్లెట్లు పెట్టి ఓ బృందం నుంచి మరో బృందానికి సరఫరా చేసినంత మాత్రాన వైరుధ్యాలు సమసిపోవు. మన కామ్రేడ్లకు ఓటమి కారణాల్ని వివరించేందుకు అప్పర్ బేస్‌కు వెళ్లా, కొత్తగా దళాల్లో చేరేవారు వాటిని ఓ గుణపాఠంగా నేర్చుకోవాలని హెచ్చరించా. ఓటమి కారణాలపై నా విశ్లేషణ ఇలా సాగింది. మొదటిది, మనం శత్రువును తక్కువ అంచనా వేయడం. శత్రువును తేలిగ్గా మట్టి కరిపించి విజేతలుగా నిలవగలమని ఊహించుకోవడం. మిలటరీ శిక్షణ పొందిన శత్రువు తన రక్షణ విషయంలో మెలకువగా ఉన్న వాస్తవాన్ని గ్రహించలేకపోయాం. రెండోది, క్రమశిక్షణ లోపించడం. కఠినమైన క్రమశిక్షణ అవసరమని నేను ఎంతో బోధించా. బాధాకరమే అయినా ఇన్నేచర్యల్ని విమర్శించక తప్పదు. ఆయన వీరత్వం వల్ల ముగ్గురు క్యూబన్లతోపాటు డజన్మంది రువాండన్లు కూడా మృత్యువాత పడాల్సి వచ్చింది. మూడోది, పోరాట స్ఫూర్తి లేకపోవడం.  మనం మన నైతిక ఔన్నత్యాన్ని నిలుపుకోవాలని చెప్పా. ఓటమి గురించి ముందు గానే కొన్ని ప్రకటనలు చేసినందుకు కామ్రేడ్ అజీమాను బహిరంగంగానే విమర్శించా.

"యుద్ధంలో ఆకలి, బుల్లెట్ గాయాల బాధ, చివరికి చావు, ఏదైనా సరే ఓరిమితో భరించాల్సిందే." పోరాటం ఎంతో కఠినమైంది, సుదీర్ఘమైందంటూ కొత్త సభ్యులనుద్దేశించి హెచ్చరించా. ఎందుకంటే అనుభవం లేనివారికి ఎన్నో సందేహాలుండటం సహజం.

కానీ, నన్ను ఆశ్చర్యపరుస్తూ వారెవరూ భయపడలేదు. అనుభవమున్న యోధులే పోరాటం నుంచి తప్పుకోనున్నట్లు సమాచారమందింది. అందులో ఒకరు మన పార్టీ సభ్యులు. ఆ ముగ్గురి పేర్లు, అబ్దల్లా, అంజలి, అంగ. వారిని పిలిచి మాట్లాడా. జరిమానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించా.

నాకు ఆశ్చర్యంతోపాటు బాధ కలిగించిన మరో విషయం. కామ్రేడ్ సిటెయినీ తిరిగి క్యూబాకు వెళ్తాననడం. ఆయన క్యూబా విప్లవంలో నాతో ఆరేళ్లు కలిసి పని చేసిన వ్యక్తి. నాతో ఆయన వాదించిన తీరు మరింత బాధ కలిగించింది. అదృష్టం కలిసొస్తే యుద్ధం మూడేళ్లలో ముగుస్తుందని, లేదంటే ఐదేళ్లయినా పడుతుందని అందరూ అనుకుంటున్నారని, ఆ విషయం తనకు తెలియకుండా దాచి ఉంచా రంటూ తప్పు పట్టారు. నా అంచనా ప్రకారం అది సుదీర్ఘకాలం కొనసాగే పోరాట మని, ఆ విషయం మిగతావారి కంటే ఆయనకే బాగా అర్థమవుతుందని భావించా. ఎందుకంటే ఆయనకు నాతో కలిసి పని చేసిన అనుభవముంది. నాతో ఎంతో సన్నిహితంగా తిరిగిన ఆయన మధ్యలోనే వెళ్లిపోతే మా అందరిపైనా అక్కడి వారిలో నమ్మిక పోతుందని చెప్పా. ఐతే, ఆ సమయంలో ఆయన హెర్నియాతో బాధ పడు తున్నారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తోంది. పోరాటం నుంచి ఆయనకు మినహాయింపు ఇవ్వడం ఎంతో న్యాయమనిపించింది.

ఆ రోజుల్లో నాలో ఉత్సాహం పూర్తిగా సన్నగిల్లింది. ఐతే, జూలై 7న కబీలా వస్తున్నాడని తెలిసి ఎంతో సంతోషించా. చివరగా పోరాట నిర్వహణకోసం అగ్రనేత వచ్చారు. ఆయన హృదయమున్నవాడే కానీ, కార్యరంగంలో నిలిచేవాడు కాదు. ఇక నేను ముందుగా చెప్పకుండా కాంగో వెళ్లిన విషయం ఆ వివరాలన్నీ ఆయనకు గుర్తు చేశా. ఈ విషయాన్ని టాంజానియా ప్రభుత్వానికి తెలపాలని కోరా. అందుకు ఆయన బదులివ్వకుండా మరోసారి క్రి చూద్దాంలే అన్నారు. ఆ సమయంలో ఆయనతోపాటు ఆయన సన్నిహిత అనుచరులు కామ్రేడ్ మసెంగో (జనరల్ స్టాఫ్ హెడ్), విదేశాంగ మంత్రి బేగిరా ఉన్నారు. వర్తమానంలోకి దృష్టి సారిస్తూ, మీరు ఏం చేయాలనుకుంటున్నారంటూ నన్నడిగారు. అందుకు బదులిస్తూ, ఫ్రంట్‌కు వెళ్లేనే నా వల్ల ఉపయోగముంటుందని, అక్కడైతే దళ సభ్యులకు శిక్షణ ఇవ్వగలనని చెప్పా. అందుకు తన అభ్యంతరాలేమిటో గుర్తు చేశారు. ప్రపంచ విప్లవానికి నా అవసరమున్నందున స్వీయ జాగ్రత్తలు

తీసుకోవాలన్నారు. ఐతే, ఫ్రంట్‌కు వెళ్లేది పోరాటంలో పాల్గొనేందుకు కాదని, మా సైనికులకు తోడుగా ఉండేందుకంటూ బదులిచ్చా. నా రక్షణ పట్ల నాకు తగినంత అనుభవముందని చెప్పా ఇప్పుడు మనం మాట్లాడే విషయం మీకు ఎంతో ఉపయోగపడుతుందని, మీ సైనికుల కార్యశీలతను పెంపొందిస్తుందని వివరించా. అందుకు ఆయన బదులీయకుండానే ఆత్మీయంగా తన స్వరాన్ని మార్చారు. మనమిపుడు విస్తృతంగా పర్యటించాల్సి వుందన్నారు.

లోపలికెళ్లి అన్ని ఫ్రంట్‌ల్నీ పర్యవేక్షించాలన్నారు. ముందుగా ఈ రాత్రికే కబింబా ప్రాంతానికి వెళ్లాలన్నారు. ఎందుకోగాని ఆ పర్యటన రద్దయింది. దాంతో, కైరో కాన్ఫరెన్స్ పై వివరించేందుకు ర్యాలీలో పాల్గొనాలని, రైతుల నుంచి వ్యక్తమవుతున్న అనుమానాల్ని తీర్చాలన్నారు. ఆ సమయంలో అలీతోపాటు మరో పదిమందిని కబింబా పంపించారు. లెఫ్టినెంట్ కిస్వాను ఉవీరాకు పంపారు.

ర్యాలీ ఆసక్తికరంగా సాగింది. కబీలా మాటల్లో తమ ప్రజల మనోభావాలు అద్భుతంగా వ్యక్తమయ్యాయి. కైరో సమావేశంలోని ముఖ్యాంశాల్ని వారికి స్పష్టంగా అర్థమయ్యేలా స్వాహిలీ భాషలో వివరించారు. రైతులతో ముచ్చటించారు. వారడిగిన ప్రశ్నలకు ఆయనిచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందారు. ఆయన ప్రసంగం ఆద్యంతం వారిని మంత్ర ముగ్ధుల్ని చేసింది. ర్యాలీ చివరన కబీలా హే.హో అంటూ సంగీతానికనుగుణంగా పాటలు పాడుతూ హృద్యంగా నృత్యం చేశారు. ఆ ప్రాంత ప్రజల్లో పోరాట స్ఫూర్తి నింపి మరోసారి నిర్మాణాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఆయనలో కనిపించింది.

ఐదు రోజుల తర్వాత అంటే జూలై 11న కబీలా నాకోసం ఓ సమాచారం పంపించారు. ఆ రాత్రే తాను కిగోమావైపు వెళ్తున్నానని తెలిపారు. ఆ ప్రాంతానికి సౌమాలియట్ నాయకుడని చెబుతూ, ఆయన లోపాల్నీ బలహీనతల్నీ ఏకరువు పెట్టారు. కబీలా సలహాలతో బెన్యే ఏజెంట్లు కొందరిని టాంజానియా ప్రభుత్వం అరెస్ట్ చేయగా, సౌమాలియట్ వారిని విడిపించారట. వారంతా శత్రు శిబిరానికి ఏజెంట్లని కబీలా కథనం. సౌమాలియట్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాక విస్తృతంగా పర్యటనలు జరుపుతూ విప్లవ ప్రచారానికే పరిమితమయ్యారు తప్ప ఎలాంటి కార్యకలాపాల్లోనూ పాల్గొనలేదని, ఆయనకు నిర్మాణం పట్ల నమ్మకం లేకపోవడమే అందుకు కారణమన్నారు.

అది సౌమాలియట్ పుట్టి పెరిగిన ప్రాంతమని, అక్కడి పరిస్థితుల్ని చక్కదిద్దాల్సి వుందని, లేదంటే అతని వల్ల భవిష్య విప్లవానికి హాని జరుగుతుందంటూ కబీలా విశ్లేషించారు. తన పర్యటన ఒక్కరోజుకే పరిమితమని మరుసటి రోజే తిరిగి వస్తానన్నారు. ఆ తర్వాత సౌమాలియట్ ఇప్పటికే దార్ ఏ సలామ్ వెళ్లారంటూ నోరు జారారు కబీలా. ఐతే, ఆ విషయం ఇంకా నిర్ధారణ కావాల్సివుందన్నారు. ఓవేళ అతను వెళ్లే తానూ అక్కడికి వెళ్లి వెంటనే తిరిగి వస్తానన్నారు. మీరు సరస్సు దాటి ఎలా వెళ్తారంటూ ఈ సందర్భంగా కబీలాను అడిగా.. కబీలా తిరిగి వెళ్తున్నా రని తెలియగానే కాంగో, క్యూబన్ సభ్యులంతా మరోసారి డీలా పడ్డారు.

అంతకుముందు డాక్టర్ కుమీ, కబీలా ఏడురోజులు మాత్రమే కాంగోలో ఉంటారంటూ ఓ పేపర్ పై రాశారు. ఆయన జోస్యం ఓ రెండు రోజులు తప్పింది. ఈ సందర్భంగా మా అడ్మిరల్ చాంగా ఇలా అన్నారు. "ఆయన ఉండేది ఐదు రోజులే అయినపుడు ఇన్ని బాటిళ్ల విస్కీ ఎందుకు తెచ్చినట్లు?" ఇది కాంగోవాసుల నుంచి వస్తున్న అభ్యంతరం. నేను మాత్రం ముఖాముఖీ ఏమీ అనలేదు. ఐతే, ఈ బలహీనత క్రమంగా మా కామ్రేడ్లపై కూడా ప్రభావం చూపుతోంది. పలు అంశాలపై కబీలా నాతో చర్చించారు. అందులో ఒకటి. తమ మధ్య చీలికవస్తే మీరెవరి పక్షం అంటూ ప్రశ్నించారు. అందుకు నేను సమాధానమిస్తూ, మేం ఇక్కడికొచ్చింది కాంగోవాసుల మేలు కోరి. మా ప్రభుత్వం మమ్మల్నిక్కడికి పంపింది మీ అందరి కోసం. మీ అంతరంగిక రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం మా పని కాదన్నాను. మీ పట్ల మాకేమైనా అనుమానాలుంటే వాటికి మీనుంచి సమాధానాలు కోరతాం. "అంతిమంగా విజయం సాధించాల్సింది యుద్ధంలో తప్ప సమావేశ గదుల్లో జరిగే చర్చల్లో కాదంటూ తేల్చి చెప్పా". భవిష్య ప్రణాళికల గురించి చర్చించాం. కబింబాకు దక్షిణంగా నాకోసం ఓ స్థావరం ఏర్పాటు చేస్తానన్నారు. తన రాజకీయ శత్రువులకు ఆయుధాల పంపిణీ జరకుండా చూడాలన్నారు. కాంగోలోని కీలక ప్రాంతమైన కటంగా కోసం జరిగే యుద్ధం కఠినంగా ఉండగలదని చెప్పా అక్కడి ఖనిజ సంపదపై అందరి దృష్టి ఉంటుందని గుర్తు చేశా. కాంగో సమస్యను ఓ ప్రాంతం లేదా ఓ తెగ సమస్యగా చూడొద్దనీ,దేశీయంగా చూడటం ద్వారానే దానికి పరిష్కారం దొరుకుతుందని వివరించా. ఏదో ఒక తెగపై ఆధారపడి పోరాటాన్ని

నిర్వహించ లేమని, విప్లవ కార్యకర్తల ద్వారానే అది సాధ్యమని, ఆ దిశగా నిర్మాణాన్ని అభివృద్ధి చేయాలని, అందుకోసమే నేను ఫ్రంట్ కు వెళ్లాల్సివుందంటూ మరోసారి గుర్తు చేశా.

మా నుంచి వీడ్కోలు తీసుకొని కబీలా వెళ్లిపోయారు. ఆయన వచ్చినపుడు ఎంతో ఉత్సాహంగా కనిపించిన కార్యకర్తల్లో ఆయన వెళ్లిన మరుసటి రోజే నిరుత్సాహం ఆవహించింది. తమ నాయకుడు తమకు దూరంగా వెళ్తున్నందున తామీరోజు పని చేయమన్నారు కందకాలు తవ్వే సైనికులు. హాస్పటల్ నిర్మాణంలో పాల్గొంటున్న వారిదీ అదే మాట. వాతావరణాన్ని ఆహ్లాదపరచడం కోసం మా జనరల్ స్టాఫ్ ఓ జానపద గీతం అందుకున్నారు. అది యుద్ధానికే కాదు జీవితంలో వచ్చే అన్ని మార్పులకూ దూరంగా ఉండే గ్రామీణులు పరవశించి పాడుకునే జానపద గీతం.

***********

పరిస్థితి మరింత దిగజారిపోకుండా నేను ఏదో ఒకటి చేయక తప్పదని స్పష్టమైంది. మేం ఇక్కడికి చేరుకుంది మొదలు ఆపరేషన్స్ నిర్వహించడంలో దూకుడుగా ముందుకు వెళ్లాం. ఆ తప్పిదమే ఈ క్లిష్టపరిస్థితికి కారణమైంది. ముందుగా పోరాటం నుంచి విరమించుకోవాలన్న ప్రతిపాదన క్యూబన్ల నుంచి రావడంతో ఒకటి తర్వాత ఒకటి అదే దిశగా జరిగిపోతున్నాయి. వెనక్కి వెళ్లేందుకు అచిరీ, హంజినీ అనే ఇద్దరు కామ్రేడ్లు సిద్ధమయ్యారు. వారిలో ఒకరు పార్టీ సభ్యులు. వారిని మరో ఇద్దరు డాక్టర్లు అనుసరించారు. వారిద్దరూ ఈ మధ్యే ఇక్కడికి వచ్చిన పార్టీ సభ్యులు. వారితో కొంత మృదువుగానే ఐనా, నిర్మొహమాటంగానే నిర్ణయం మార్చుకోవాలని చెప్పా. సాధారణ సైనికుల లెక్కనే వారూ ప్రతిస్పందించారు.

క్యూబాలో ఎంపిక జరిగిన పద్ధతి సరిగా లేదని స్పష్టమైంది. క్యూబన్ విప్లవం నాటి అనుభవంతో వారిని అంచనా వేయడం సరైంది కాదని అర్థమైంది. విప్లవ సమయంలోని వారి వ్యవహార శైలి ఆ తర్వాత వారనుభవించిన స్వేచ్ఛా జీవితం వల్ల మారిపోయింది. విప్లవ సమయం మెజార్టీ ప్రజల్ని విప్లవకారులుగా మార్చి వేస్తుంది. ఐతే, వారికిది భిన్నమైన పరిస్థితి. అందుకే, వ్యక్తులు ఎవరైనా సరే వారి పోరాట స్ఫూర్తిని కార్యక్షేత్రంలోనే తేల్చవలసి ఉంది. మొదటి చర్యలోనే వెనక్కి రావడం వల్ల వాస్తవమేమిటో బయటపడింది. కామ్రేడ్లలో ఎక్కువమంది ధైర్యం కోల్పోయి పోరాటం నుంచి విరమించుకునేందుకే నిర్ణయించారు. ప్రాణ త్యాగానికి సిద్ధపడి, తెగించి పోరాడుతామంటూ వచ్చిన వారే వెనక్కి తగ్గిన పరిస్థితి ఇది.

"ఇక్కడ సైనిక బాధ్యత అంటే "తప్పని సరైతే చావడానికైనా" అని... ఈ సమస్యల పరిష్కారం మన వారసులకు ఉపయోగపడాలని."

రువాండన్ల వల్ల జరుగుతున్న సంఘటనలు విద్రోహకరంగా ఉన్నాయి. ముందండి అనుచరుడు కాల్పుల్లో చనిపోయాడు. ఐతే, అతన్ని కుట్ర చేసి చంపారని తెలుస్తోంది. ఈ సంఘటన అనేక సందేహాలకు అవకాశమిచ్చింది. అవన్నీ అసత్య మని కొట్టివేసేందుకు కూడా వీల్లేదు. తమ కుట్రల కోసం కొంతవరకు మహిళల్ని కూడా ఉపయోగిస్తున్నట్లు అర్థమవుతోంది. కుట్రను అమలు చేసిన కమాండర్ మిచెల్‌కు విలాస జీవితం బహుమతిగా దక్కింది. అతడిచ్చిన చెడ్డ దవా వల్లే 20 మంది కామ్రేడ్లు మృత్యువాత పడ్డారన్నది ఆరోపణ. ఐతే, వారిని కుట్ర చేసి స్వయంగా చంపారా లేక

తప్పుదోవ పట్టించి పరోక్షంగా కారణమయ్యారా అన్నది స్పష్టం కాలేదు.

ఈ సంఘటన జరిగిన సమయంలోనే మరికొన్ని సంఘటనలు జరిగాయి. ఆ పోరాటంలో ఓటమికి ప్రధాన బాధ్యుడు ముందండి. మరో బాధ్యుడైన అతని అనుచరున్ని కాల్చేశారు. ఈ సంఘటనలన్నీ కబీలా నేతృత్వంలోని విముక్తి సేనపై తిరుగుబాటును ప్రోత్సహించేలా ఉన్నాయి. అదే సమయంలో క్యాంపులో మిగిలి వున్న రువాండన్లు ఖాళీ చేసి వెళ్లిపోతామనడం, లేదంటే కాంగోవాసులు యుద్ధంలో పాల్గొంటేనే తామూ పాల్గొంటామనడం అనుమానాల్ని బలపరిచాయి. ఓవేళ క్యాంప్‌కు కబీలా వస్తే ఆయనకు ఉప్పలేని ఆహారం, చక్కెర లేని టీ ఇవ్వాలను కున్నారు. తామూ అలాగే తీసుకొని తమ త్యాగాల్ని గుర్తు చేయాలనుకున్నారు (అలాంటిదేదో జరుగుతుందని గ్రహించిన కబీలా అటు వెళ్లేందుకే ఇష్టపడలేదు).

ఫ్రంట్‌లో ఈ సంఘటనలు జరుగుతున్నపుడు కాంగోలీస్ కమాండరొకరు జోక్యం చేసుకునేందుకు యత్నించారు. ఐతే, వారాయన్ని అడ్డుకొని క్యాంప్ విడిచేలా ఒత్తిడి చేశారు. ఆయన ఎవరో కాదు ఆల్బ్రెడ్, ఈయన గురించి ఇంతకుముందే చెప్పా. దీనిపై ఆయన ఇలా స్పందించారు. ముందండిని కాల్చేయాలి లేదంటే నేను పోరాటం నుంచి విరమించుకుంటా.

మాతో సన్నిహితంగా ఉన్న రువాండన్లు కొందరిని దళాల్లో పని చేసేందుకు అనుమతించాం. ఐతే, తోటి దళ సభ్యులు వారిని శత్రువులుగా భావిస్తూ వెనక్కి పంపారు. దీంతో, సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. మసెంగోతో ఈ విషయాన్ని చర్చించా. విజయం సాధించాలంటే విముక్తి ఉద్యమాన్ని సమగ్రంగా నడిపించాలని చెప్పా. తిరిగి ఆపరేషన్స్ ప్రారంభించాలంటూ మోజాకు సందేశా లందాయి. అందుబాటులో ఉన్న మిశ్రమ దళాలతో అంటూ షరతు విధించారు. క్యూబన్లు, రువాండన్లు సరిసమానంగా ఉండాలన్నారు. దాడి ఎలా జరపాలంటూ ఎంబిలీతో చర్చించా. నా లక్ష్యమల్లా అతనికి ఇలాంటి యుద్ధాలపై ప్రాథమిక విషయాలు తెలిసేలా చేయడమే. మొదటి చర్యగా ఓ వాహనంపై దాడి చేయాలంటూ ఆదేశించారు.

ఫ్రంట్ డీ ఫోర్స్ నుంచి ఆల్బర్ట్ విల్లేకు వెళ్లే రోడ్డు మీద దాడి జరపాలన్నది ప్రణాళిక. అజీ నేతృత్వంలోని దళాలు ఆ ప్రాంతంలో తిరుగుతున్నాయి. శత్రువుపై దాడి ద్వారా ఆ మార్గంలో

సరఫరాలు అందకుండా చేయాలన్నది వ్యూహం. అక్కడి పర్వత ప్రాంతం దట్టమైన అడవులతో నిండివుంది. కబింబా ఫ్రంట్ సమాచారాన్ని అలీ అందించారు. నలుగురు శత్రు పోలీసుల్ని బందీలుగా పట్టుకొని ఒకన్ని చంపేశారు.

ఫ్రంట్ డీ ఫోర్స్ బేస్ కమాండర్‌గా కెప్టెన్ జకారియాస్ నియమితులయ్యారు. ముందండి తనతోపాటు పెద్ద దళాన్నే సరస్సువైపు తీసుకెళ్లారు. కబీలాతో చర్చిం చేందుకు క్రిగోమా వెళ్తున్నారు. తన రక్షణ పట్ల భయంతోనే వారిని వెంట తీసు కెళ్లారు. త్వరలోనే ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఓ నెల రోజులపాటు తన అనుచరులతోపాటు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత నాదగ్గరికొచ్చారు. మేమిద్ద రమూ దాడిపై మాట్లాడుకున్నాం. ముఖ్యంగా కామ్రేడ్ల మరణాలపై చర్చించాం. దానిపై ఆయన కథనం ఇలావుంది. కామ్రేడ్ మిచెల్ అక్కడి స్థానికులతో స్నేహంగా మెలిగారు. వారి పట్ల నమ్మకంతో దాడి జరపబోతున్న రహస్యాన్ని తెలిపారు. విషయం శత్రువుకు చేరిపోయింది. వారిలో ఒకడు శత్రు గూఢచారి అని మన కామ్రేడ్లు తెలుసుకున్నారు. వాన్ని కాల్చేయాలని వారు పట్టుపట్టారు. అందుకు సమా వేశంలో తగినంత మెజార్టీ లేనందున తానంగీకరించలేదన్నారు. ఆ సంఘటనతో దళసభ్యులు పోరాటం నుంచి విరమించుకున్నారు. ఆయన ద్వారా మరికొన్ని విషయాలు నాకు తెలిసాయి. ఓటమికి కారణం కేవలం కుట్ర మాత్రమే కాదని, దాడికి సంబంధించిన ప్రణాళికలోనే లోపముందని అర్థమైంది. ఇక్కడ ఇన్నే వైఖరిని తప్పు పట్టక తప్పదు. సైనికులతో సమావేశాలు జరిపి నిర్ణయాలు తీసుకోవద్దని, సైనిక చర్యల విషయంలో ప్రజాస్వామ్యాన్ని పాటించిన ఏ పోరాటమైనా విషాదం గానే ముగిసిందంటూ విప్లవ యుద్ధాలపై అనేక ఉదాహరణలు చెప్పా." కాంగో విముక్తి సేనలోని ఫీల్డ్ కమాండర్ తన జనరల్ స్టాఫ్‌తో కూడా దాడి ఏలా జరప బోతున్న విషయం చెప్పకూడదు. క్రమశిక్షణ, కేంద్రీయ నియంత్రణ లేకపోవడం వల్లే దుష్ఫలితాల్ని చవిచూడాల్సి వచ్చింది. ఇలాంటి లోపాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ముందండి వాదనలోని బలహీనతల్ని మసెంగోకు గుర్తు చేశా. అందు కాయన బదులిస్తూ.. ముందండి తనకు చెప్పిన కథ మరో విధంగా ఉందన్నారు. అసలు కథ వేరే ఉండొచ్చంటూ అనుమానాలు వ్యక్తమయ్యాయి.

వివిధ ప్రాంతాల నేతలతో సమావేశం ఏర్పాటైంది. అందులో ముందండి, కేలిగ్బీటే రెండో కమాండర్ సలూమ్, ఫిజీ జోన్ నాయకుడు ల్యాంబర్ట్‌లతోపాటు వారి అనుయాయులు హాజరయ్యారు. మసెంగోలో అధికారికత లోపించింది. ఇక్కడ నేనే ఇంచార్జ్. నా ఆదేశాల ప్రకారమే అందరూ వెళ్లాలంటూ చెప్పలేకపోయారు. వివిధ ఫ్రంట్లకు స్వేచ్ఛనిస్తూ మరోసారి ఇలాంటివి జరకుండా చూడాలన్నారు. దాంతో, సమస్యలన్నీ అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. ఒకే నేతృత్వం కింద యూనిఫైడ్ ఫ్రంట్ ఏర్పడాలన్ననా ప్రతిపాదన చర్చకే రాలేదు. ఆయుధాలు ఎవరికి అందుతున్నాయనే విషయంలో ఎవరూ శ్రద్ధ చూపలేదు. పంపిణీ అయిన వాటిలో ఎక్కువభాగం తాగుబోతుల చేతికి అందాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. వారిలో ఎంతోమంది పోరాటం నుంచి తప్పుకొని, ఆయుధాల్ని వెంటే తీసుకెళ్లారు. తమ దగ్గరున్న ఆయుధాల్ని చూపి ఆ ప్రాంతంలో పెత్తందార్లుగా చెలామణీ అయ్యేం దుకు యత్నిస్తున్నారు. అలాంటివారి నుంచి ఆయుధాల్ని స్వాధీనం చేసుకునేందుకు ఓ కమిషన్ ఏర్పాటైంది. ఆయుధాల్ని స్వాధీనం చేయనివారిని నిర్బంధిస్తామని హెచ్చరించాం.

కొన్నిరోజుల్లో ఫ్రంట్‌కు వెళ్తానంటూ చెప్పగానే మసెంగో నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఆయన నా రక్షణ పట్ల ఆందోళన చెందారు. ఐతే, నేనాయన్ని ఒప్పించా. ఇద్దరం కలిసి ఐదు లేదా ఆరు రోజులపాటు పర్యటించేందుకు నిర్ణ యించాం. ఆ ప్రాంత పర్యవేక్షకుని నుంచి నివేదిక అందగానే మేం వెళ్లాలను కున్నాం. ఆ ప్రాంత ఉద్యమకారులకు తప్పుడు సంకేతాలందాయి. ముఖ్య నేతలు కబీలా, మసెంగోలు ఆ ప్రాంతాల్లో పర్యటించి చాలా కాలమైంది. దాంతో, అక్కడి ఉద్యమకారుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఐతే, క్యూబన్ సాహసికుల బృందం నాయకుడు అక్కడ పర్యటించడంద్వారా వారిలో ధైర్యాన్ని నింపగలమని భావించాం. ఆ ప్రాంత పరిస్థితి స్వయంగా తెలుసుకునేందుకు వీలవుతుంది. దీంతోపాటు ఆ ప్రాంత ముఖ్య నేతలకు వారి బాధ్యతల్ని గుర్తు చేసినట్టు కాగలదు. పర్యటన ఉద్దేశాన్ని మసెంగో అర్థం చేసుకున్నారు. పర్యటన ద్వారా వివిధ ఫ్రంట్‌లోని బృందాలకు ఆహారం, బట్టలు, మందులు, ఆయుధాలు ఎలా అందుతున్నాయో ప్రత్యక్షంగా తెలుసుకునే వీలుంది.

ఆ ప్రాంతం పట్ల ఓ ప్రణాళికతో మా పర్యటన ఖరారైంది. మాతోపాటు కసీమా చీఫ్ పర్యటించారు. కిబంబాకు ఉత్తరాన 27 కి.మీ. దూరంలో కసీమా ఉంది. ఆ ప్రాంతంలోనూ క్రమశిక్షణా రాహిత్యం మా దృష్టికి వచ్చింది. అక్కడి కమాండర్‌ను తొలగించి ఆ స్థానంలో మరొకరిని నియమించాలని మసెంగో నిర్ణయించారు. కమాండర్ తన డిప్యూటీతో కలిసి పగటివేళ పర్వతాల సమీపాన దాక్కుంటున్నాడు. వైమానిక దాడుల భయంతో అతడలా చేస్తున్నట్టు తెలిసింది. మెషిన్ గన్స్‌తో మాకు రక్షణ కల్పిస్తున్న నలుగురు దళ సభ్యులు మలేరియాతో బాధపడుతుండడంతో వారిని కిబంబా తీసుకెళ్లాం.

జనరల్ మౌలేన్‌కు రాజకీయంగా ప్రాబల్యమున్న ప్రాంతానికెళ్లాం. స్థానికులు మసెంగో పట్ల సానుకూలంగా స్పందించారు. సెంట్రల్ అథారిటీని ఏర్పాటు చేయాలన్న ఆయన కోరికకు మద్దతు తెలిపారు. ఆ తర్వాత కరంబా అనే మరో ప్రాంతానికెళ్లాం. అక్కడే నిజమైన ఓ మిలటరీ స్థావరముంది రువాండన్ల బృందం దాన్ని ఏర్పాటు చేసింది. వారు ముందండితో రాజకీయంగా విభేదించి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. ఐతే, ఆ విభేదాల గురించి నేను వివరించలేను. వారు పర్వతం మీద 75 ఎంఎం గన్స్ ఏర్పాటు చేశారు. సమీపం నుంచి వెళ్లే శత్రు పడవల్ని నీట ముంచేందుకు వాటిని ఉపయోగించాలి. ఐతే, ఇప్పటికే ఓ పడవను ముంచేందుకు యత్నించి వారు విఫలమయ్యారు. దాంతో దాన్ని ఎలా ఆపరేట్ చేయాలో వారికి తెలియదని అర్థమైంది. వారిని కిబంబాకు పంపించమని చెప్పా. నా సలహాను ఎవరూ వినిపించుకున్నట్టు లేదు. వారికి శిక్షణ ఇవ్వాల్సివుంది. మసెంగోకు ఇలాంటి విషయాల పట్ల అవగాహన లేకపోవడం, నిర్ణయాలు తీసుకునే చొరవ లేకపోవడం మరో సమస్య ఉపయోగించకుండా వాటిని అక్కడే ఉంచేస్తే చివరికి శత్రువుకు దొరికిపోతాయి.

పరిస్థితిని మనకు అనుకూలంగా మార్చాలంటే శత్రు సేనలపై దాడులు చేయా లన్నది మసెంగో ఆలోచన. ఉవీరాపై దాడి జరపాలంటూ నాకు సలహా ఇచ్చారు. ఐతే, ఆ ప్రాంతంలో మన దళాలు దాడికి సిద్ధంగా లేవంటూ అభ్యంతరం చెప్పా ఉవీరాకు మరో వైపున దాడి చేయాలని, అందుకోసం శత్రుసేన కదలికలపై నిఘా నివేదిక తెప్పించాలని సూచించా. టాంజానియికా సరస్సు

చివరన రోడ్డు మార్గాలు మూసుకుపోయే చోట దాడి ప్రారంభించాలని చెప్పా. ఆ దాడి ద్వారా శత్రు సమాచార వ్యవస్థకు విఘాతం కలిగించి అవతలివైపుకు చొచ్చుకుపోవచ్చని చెప్పా కాంగోలో ఒకేసారి పెద్ద ఎత్తున దాడి జరపడం ద్వారా ముందుకు చొచ్చుకు వెళ్లేందుకు అవకాశముంది. ఐతే, అందుకు ఎవరూ చొరవ చూపలేదు. దాడుల ఏర్పాట్లతోనే కాలం గడిచిపోతుంటే శత్రు సేన మేల్కొంటోంది.

ఇక్కడన్నీ ప్రతికూల సంఘటనలు జరుగుతుండగా, దార్ ఏ సలామ్ నుంచి మాకు కొంత సంతోషం కలిగించే వార్త వచ్చింది. క్యూబా నుంచి ఓ ఓడలో మాకోసం ఆయుధాలొస్తున్నాయి. ఆయుధాలతోపాటు 17 వేల రౌండ్ల బుల్లెట్లు. అవి రోడ్డు మార్గాన త్వరలో మాకు అందనున్నాయి. కాంగో పోరాటంలో క్యూబన్లు చనిపోయారన్న వార్త అన్ని పత్రికల్లోనూ ప్రచురించారు. దాంతో, అక్కడి రాయబారి ఆ వార్తను ఖండించాల్సిందిగా కాంగో నేతల్ని కోరినట్టు తెలిసింది. అది నాకు తెలివైన పనిగా అనిపించలేదు. అలాంటి వాటిని దాచి పెట్టడం సరైంది కాదు. సరైందల్లా మౌనంగా ఉండటమే..ప్యాబ్లో రివల్టాకు ఈ మాత్రం తెలుసనే అనుకున్నా. దీనిపై ఓ లెటర్‌తోపాటు ఇతర నివేదికల్ని వారికి పంపించాలని నిర్ణయించా. అందుకోసం ఇద్దరు కామ్రేడ్లను ఎంపిక చేశా. వారిలో ఒకరు. "ఒట్టో". ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మరొకరు. సిటెయినీ. హెర్నియాతో బాధ పడుతున్న కామ్రేడ్. ఇది బాధాకరమైన నిర్ణయమే. ఎందుకంటే పోరాటం నుంచి తప్పించుకోవాలనుకునేవారు వీరిద్దరినీ ఓ ఉదాహ రణగా చూపిస్తారు. ఐతే, నా నిర్ణయం సరైందే. అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి మినహాయింపివ్వడం న్యాయమైందే.

నా స్వాహిలీ ఉపాధ్యాయుడు ఎరెస్ట్ ఇలుంగా కూడా కొన్ని రోజులపాటు సెలవుపై వెళ్లాలనుకున్నారు. ఆయన కొన్ని ఆపరేషన్స్ చేయించుకోవాల్సివుంది. ఆయన మెదడులో కణితి పెరుగుతుందని డాక్టర్ల అనుమానం. ఐతే, దీనికి మసెంగో అంగీకరించలేదు. కిగోమాలోని స్థానిక డాక్టర్లే ఆయనకు చికిత్స చేయ గలరని, దార్ ఏ సలామ్ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

మా సూచనలతో కేలిగ్నిటే స్థావరాన్ని సందర్శించిన మోజా నా కోసం ఓ నివేదిక పంపారు. ఆ తర్వాత కొన్ని రోజులకు మాకు ఓ సమాచారమందింది. దాడి విజయవంతమైనట్టు తెలిసింది.

జకారియాస్, ఎంబిలీల నేతృత్వంలో 25 మంది రువాండన్లు, 25 మంది క్యూబన్లు దాడిలో పాల్గొన్నారు. ఈ దాడికి ప్రధాన నాయకత్వం ఎంబిలీదే. శత్రు దళాలు ఎలాంటి రక్షణ లేకుండా వెళ్తున్నాయంటూ అజీ ఇచ్చిన సమాచారంతో దాడి జరిపారు. దాడి జరిగినపుడు ఐదుగురు సైనికులు లారీలో ఉన్నారు. రాకెట్లతో జరిపిన దాడిలో లారీ గుల్లగుల్ల కాగా, శత్రు సైనికుల ఒంటినిండా బుల్లెట్ గాయాలయ్యాయి. అందులో ఒక్కరి దగ్గరే ఆయుధముండగా, లారీ నిండా ఆహారం, సిగరెట్లు, విస్కీ సీసాలున్నాయి.

భవిష్యత్‌లో పెద్ద దాడులు నిర్వహించేందుకు ఇలాంటి చిన్న దాడుల అనుభవం ఉపయోగపడుతుంది. కాల్పులు ప్రారంభించగానే రువాండన్లు వెనక్కి వెళ్లారు. దాంతో, మనవాళ్లు అపాయంలో చిక్కుకున్నారు. కామ్రేడ్ అరోబెయిసీకి బుల్లెట్ తగిలి ఓ వేలు తెగి పోయింది. దీనిపై స్పందించిన జకారియాస్ అందుకు కారణమైన రువాండన్‌కు రెండు వేళ్లు తీసెయ్యాలంటూ తీర్మానించారు. కంటికి కన్ను అన్న న్యాయాన్ని అమలు చేయాలనుకున్నారు. వేళ్లు కట్ చేసేందుకు కత్తి పట్టుకోగా ఎంబిలీ అడ్డుకొని క్షమాభిక్షకు ఒప్పించారు. ఇదిలావుంటే, మరో రువాండన్ కాల్పుల మోత వినగానే (కాల్పులు జరిపింది మనవాళ్లే, అటునుంచి ఎలాంటి ప్రతిఘటన లేదు) వెనక్కిపరుగు లంకించాడు. ఐతే, దాడి జరుపుతున్న సమయంలో ప్రతి రువాండన్ వెనుక ఓ క్యూబన్ ఉన్నారు. దాంతో ఆయుధంతో పారిపోతున్న యువకున్ని పట్టుకునేందుకు యత్నించగా క్యూబన్ చేతిపై గాటుపడేలా బలంగా కొరికాడు.

మా సుదీర్ఘ ప్రయాణంలో ఎదురయ్యే అడ్డంకులకు ఇవి రెండూ ఉదాహరణ లుగా నిలుస్తాయి. రూపంలేని ప్రజా సమూహాల నుంచి సైనిక నిర్మాణం చేయాల్సి వుంది. ఈ విషాదభరిత హాస్యం ఈ ఒక్కదాడికే పరిమితం కాలేదు. ఘటన అనంతరం పరిసరాల్ని పరిశీలిస్తుండగా, తెలివైన దళ సభ్యులు కొందరు లారీ పైభాగాన ఓ అందమైన బహుమతి కనుగొన్నారు. విస్కీ బీరు బాటిళ్లు. లారీలో దొరికిన ఆహారం ఉపయోగపడుతుందనుకున్న ఎంబిలీ మందు సీసాల్ని మాత్రం ధ్వంసం చేయాలనుకున్నారు. ఐతే, అది సాధ్యం కాలేదు. కొన్ని గంటల వ్యవధిలోనే దళ సభ్యులు వాటిని తాగేశారు. ఆ తర్వాత సమావేశమై ఓ నిర్ణయం తీసుకున్నారు.

మిగతా ప్రణాళికల్ని అమలు చేయడం కోసం మైదాన ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేదని, జరిగినదాంతో తృప్తి చెంది ఇక బేస్‌కు వెళ్లాలని. ఓ క్యూబన్‌గా దౌత్య నీతిని పాటించాలనుకున్న ఎంబిలీ వారి నిర్ణయానికే ఆమోదం తెలిపారు.

తిరిగి వెళ్తున్నపుడు తాగిన మత్తులో ఓ రైతు ఇంట్లోకి జొరబడ్డ జకారియాస్ అతన్ని కాల్చి చంపాడు. ఎందుకలా చేశావంటే అతడు శత్రు గూఢచారి అంటూ ఆరో పించాడు. రైతులతో అలా ప్రవర్తించడం ప్రమాదకరమని వివరించా. మసెంగో సైతం జకారియాస్‌నే సమర్థించారు. ఆ ప్రాంతంలోని ఆ తెగ వారంతా విప్లవ వ్యతిరేకులంటూ తేల్చారు. ఓ వ్యక్తి గుణాన్ని బట్టి ఆ తెగ మొత్తాన్ని తప్పుపట్టడం సరైంది కాదు. ఓ తెగలోని ఓ వ్యక్తితో మనం స్నేహంగా ఉంటే ఆ తెగలోని వారంతా మనకు స్నేహితులు కావొచ్చు. అదే విధంగా శత్రువులుగా కూడా..ఇలాంటి చర్యలు విప్లవాన్ని అభివృద్ధి చేయలేవు. ఐతే, ఇలాంటి తెగల వల్ల జరిగే ప్రమాదాల్ని కూడా చూడాలి. ఆ తెగలోని కొందరు మొదట మనకు స్నేహితులుగా ఉండి ఆ తర్వాత శత్రు గూఢచారులుగా, ఆపై ఆ తెగ మొత్తం శత్రువులుగా మారారు.

మనకిది మొదటి విజయం, అందులోనూ కొంత చేదు అనుభవం. ఎదురవు తున్న సమస్యలకనుగుణంగా నేను నా కాల పట్టికను మార్చుకోవడం ప్రారంభించా. ఆ మార్పులన్నీ ఈ సాయుధ దళాల్ని పూర్తిస్థాయి విముక్తి సేనగా రూపొందించడం కోసమే. ఓ ఆశావాదిగా కాంగో విప్లవం మరో ఐదేళ్లలో విజయం సాధిస్తుందని చెప్పగలను. యుద్ధం జరుగుతున్న తీరులో ఏదైనా అనుకోని మార్పు వస్తే తప్ప గడిచిన రోజులన్నీ విజయం తథ్యమని చెబుతున్నాయి.

**********

నా ఫీల్డ్ డైరీలో గత నెల (జూలై)కి సంబంధించిన విశ్లేషణ ఇది. ఈ నెల కొంత మెరుగుపడింది. కబీలా వచ్చేసి ఐదు రోజులు మాత్రమే ఉండి తిరిగి వెళ్లడంతో పుకార్లు ఊపందుకున్నాయి. నేను అక్కడ ఉండటం అతనికి ఇష్టం లేదు. కొంత కాలం ఉండి అలా వెళ్లిపోవాలన్నదే ఆయన కోరిక. అతను అక్కడి పరిస్థితులకు తగిన వ్యక్తిగా అనిపించలేదు. రాజకీయ గొడవలకే పరిమితమవుతూ ఏమీ చేయకుండా కాలం గడిపేస్తున్నాడు. మందుకూ, మగువలకూ బానిసైపోయాడు. మిలటరీ విషయంలో. ఫ్రంట్ డీ ఫోర్స్ కటెంగాల దగ్గర విషాదాల తర్వాత చిన్న విజయాలు కొన్ని నమోదయ్యాయి. కటింబా దగ్గర రెండు చోట్ల, ఫ్రంట్ డీ ఫోర్స్పై దాడి ఘటన, కటెంగా దగ్గర బ్రిడ్జిని తగులబెట్టడం. అదే సమయంలో కొంత శిక్షణ ప్రారంభించాం. వివిధ దళాల్లో మెరుగైన యోధుల కోసం అన్వేషణ సాగిస్తున్నాం. ఐతే, ఆయుధాల పంపిణీ మాత్రం విచ్చలవిడిగా ఉంది. సమన్వయం లోపించి క్రమం తప్పుతోంది. గమనం నెమ్మదిగా ఉన్నా ప్రగతిశీలంగా ఉండాలి. చొరవ తీసుకునేందుకు కబీలా నాకు అవకాశమిస్తే అది సాధ్యమవుతుంది. అప్పటికీ నేను వేతన విద్యార్థినే.

కటెంగాలో దాడి జరిపామంటూ వార్త అందించారు. మనవాళ్లక్కడ నాలుగు రోజులపాటు గడిపారు. ఐతే, ఆ రోడ్డుపై శత్రు దళాలు కనిపించకపోవడంతో వెనక్కిమళ్లారు. తిరిగి వస్తూ బ్రిడ్జిని తగలబెట్టి ధ్వంసం చేశారు. నా నెలసరి విశ్లేషణలో ఈ సంఘటన గురించి తెలిపా. ఈ ప్రాంతంలోనూ క్రమశిక్షణా, పోరాట స్ఫూర్తి లోపించడం ఆందోళన కలిగించాయి. ఫ్రంట్ డీ ఫోర్స్ నుంచి అజీ వచ్చారు. ఆయన వెంట 14మంది క్యూబన్లున్నారు. ఆహారం కోసం వారు వెతుకుతున్నారు. ఐతే, ఆయుధాల విషయంలో ఏమంత ఆసక్తి చూపలేదు. ప్రాంత పరిస్థితుల వల్ల వారు తమ వెంట కొంత ఆహారం తీసుకుపోవాల్సివుంది. సైనికులకు అవసరమైన వస్తువులు అందించడానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. ఐతే, అక్కడ వారుండే స్థావరాల సమీపంలో కొంతవరకు మాంసంతోపాటు కాసవా దుంపలు దొరుకుతాయి. మైదాన ప్రాంతాల్లోని రైతుల ఇళ్లల్లో ఈ దుంపల్ని ఎక్కువగా పెంచుతారు. ఈ దుంపల కోసం ఒక్కోసారి సుదీర్ఘ ప్రయాణాలు చేయాలి. అలా వెళ్లడం ప్రమాదకరం కావడంతో అందుకు రువాండన్లు నిరాకరించారు. ఆహారం సమకూర్చే బాధ్యత నాయకత్వానిదే అంటూ తప్పించుకున్నారు. దాంతో, క్యూబన్లు వెళ్లక తప్పలేదు.

కొన్ని రోజులపాటు ఆహారపు కొరత ఎదుర్కొన్నాం. ఆ సమయంలో భారీ ఆయు ధాల వినియోగంపై శిక్షణ, కందకాల తవ్వకంలాంటి పనులకు హాజరు కామన్నారు. మేం కాంగోలో ఉన్నపుడు వారు విరివిగా ఉపయోగించిన మరో వాక్యం "హపానా చాకులా, హపానా ట్రావా ఇల్లే. దాదాపుగా దీని అర్థం ఇలా "తిండి లేకుంటే పనీ లేదు"

కొత్తగా వచ్చిన సీటా, సబ, బాటి అనే ముగ్గురు కామేధ్లు క్యూబాకు వెళ్లిపోతా మన్నారు. దీనిపై వారితో కఠినంగా వ్యవహరించా. బేస్లోనే ఉంటూ వంట పనులు చేయాలని చెప్పా.

ఆగస్టు 6న సౌమాలియట్ బెన్యేను తొలగించారు. రెండు రోజుల తర్వాత మసెంగో వచ్చారు. కిగోమా రావాల్సిందిగా కబీలా కబురంపారని, తాను మరుసటి రోజే తిరిగి వస్తానన్నారు. ఉద్యమానికి బయటి నుంచి ఎదురవుతున్న సమస్యల గురించి మాట్లాడుకున్నాం. విప్లవ మండలి నుంచి బెన్యేను తొలగించిన విషయం తెలుసని చెప్పా. ఇలాంటి నిర్ణయాలు తీసుకునే అధికారం సౌమలియట్ కు లేద న్నారు. దీనిపై కబీలాతో వివరంగా చర్చిస్తానన్నారు.

మసెంగో వెళ్లారు ఆ మరుసటి రోజే సరస్సు దగ్గర శిక్షణ పొందుతున్న బృందం పని మానేసింది. సంఖ్యాపరంగా ఎక్కువగా నష్టపోయింది ఈ బృందమే. మసెంగో వెళ్లిపోగానే వారంతా స్థైర్యం కోల్పోయారు. సరస్సు దగ్గర శత్రు పడవ ఒకటి కనిపించగానే వారికి నిర్మాణాన్ని పోరాట స్ఫూర్తిని గుర్తు చేశా. రెండో వరుస రక్షణ వ్యవస్థను ఏర్పరచాలన్న ప్రణాళిక సాధ్యం కాదని అర్థమైంది. ముందు వరుసలోని నేతల్లో ఎక్కువ భాగం గల్లంతయ్యారు. ఉద్యమ నేతల అధికారాన్ని ఎవరూ గుర్తించడం లేదు. కొన్నిసార్లది తుపాకులతో, కత్తులతో గొడవలకు కారణ మవుతోంది. ఇక్కడొక సంఘటన గురించి చెప్పాలి. ఓ అధికారి క్యూబన్ గదిలో రక్షణ పొందారు. ఓ సైనికుడతన్ని ఆహారం అడగ్గా లేదన్నాడు. దాంతో, కోపగించిన సైనికుడు తుపాకీతో బెదిరిస్తూ వెంటపడ్డాడు. అప్పుడా అధికారి దేవాలయానికి పరుగుతీశాడు (అక్కడివారికి ఆ ఆలయం పట్ల గౌరవముంది). ఈ సంఘటనతో చివరికి సైనికునికి ఆహారం దొరికింది. ఇలాంటి సందర్భాల్లో క్రమశిక్షణా చర్యలేమీ తీసుకోలేదు. ఐతే, ఇలాంటి అనైతికత సాధారణ సిబ్బంది మొదలు ఉన్నత నాయ కత్వం వరకూ వ్యాపించే ప్రమాదముంది.

అంటు రోగాల నివారణ కోసం మెరుగైన క్యూబన్లని క్యాంప్‌కు దూరంగా ఉంచాలనుకున్నా క్యూబా వెళ్లాలనుకున్నవారితో పాటు రోగ పీడితులు, మెషిన్గన్స్ నిర్వాహకులు (సరస్సు పక్కన), కొందరు బోధకులు అక్కడే ఉంటారు. కొంతకాలం వేచి చూడాలనుకున్నా అప్పటికీ ఏమీ జరక్కపోతే, అధికారిక ఆదేశాల కోసం ఎదురు చూడకుండా నేనే నాయకత్వం వహించాలనుకున్నా.

నాకందిన కొన్ని నివేదికలు, కామ్రేడ్లతో జరిపిన చర్చల ఆధారంగా జరిగిన కొన్ని దుర్ఘటనల వెనుక అసలు కారణాలేమిటన్న అన్వేషణ ప్రారంభించా. ఆయా ప్రాంతాల్లో మిలటరీ చర్యలు వైఫల్యం చెందినట్టు నివేదికలందడం. ఆ తర్వాత కాంగోవాసులపై నిరసనలు రావడం సర్వసాధారణమయ్యాయి. "పోరాడేందుకు కాంగోవాసులు నిరాకరిస్తున్నారు", "కాంగోవాసుల వల్లే వైఫల్యం" అదీ-ఇదీ అంటూ ఆరోపణలు. దీన్నంతటినీ విశ్లేషిస్తూ, పోరాటం నుంచి విరమించుకునే వారికీ, పోరాటంలో కొనసాగేవారికీ మధ్య అపోహల్ని తొలగించేందుకు ఓ సందేశాన్ని రూపొందించా, "పోరాట యోధులకు సందేశం" అన్న ఆ వివరణ పత్రాన్ని స్థావరాల్లోని మన దళాల ముందు చదవాలని చెప్పా. ఆ తర్వాతి నెలల్లో పరిస్థితులు ఉద్విగ్నంగా మారడంతో మరోసారి సందేశమిచ్చేందుకు నాకు అవ కాశం చిక్కలేదు. ఇలాంటి సందేశాల వల్ల ఏదైనా ఉపయోగం ఉంటుందో, లేదో కూడా నాకు తెలియదు. ఆ సమయంలో చదివిన ఈ సందేశం అప్పటివరకూ జరిగిన ఘటనలపై ఓ అవగాహన కలిగిస్తుంది. మా అనుభవంలోకి వచ్చిన సమస్యలపై నా అభిప్రాయాల్ని తెలియజేస్తుంది.

పోరాట యోధులకు సందేశం :

కామ్రేడ్స్... కొన్ని రోజుల్లో మనలో కొందరికి ఇక్కడ నాలుగు నెలలు పూర్తవు తుంది. పరిస్థితులపై సంక్షిప్త విశ్లేషణ ఇది. పరిస్థితులు బాగున్నాయని మనం చెప్పలేం. ఇక్కడి ఉద్యమ నేతలు ఎక్కువ కాలం దేశం బయటే గడిపారు. వారి చర్యల్ని బట్టి రాజకీయ నేతలు అర్థమవుతారు. ఇది మధ్యశ్రేణి నేతలకు వర్తించదు. ఐతే, మధ్యశ్రేణి నేతలు సైతం ఇక్కడ సంచరిస్తూనే వారాలకొద్దీ దేశం బయటే గడిపారు. వాస్తవానికి నిర్మాణాత్మక కార్యక్రమాలేమీ జరగలేదు. అవి ఎలా చేయాలో మధ్యశ్రేణి నేతలకు తెలియదు. వారిపై నమ్మకం కూడా లేదు. స్థానిక నేతలు మధ్యశ్రేణి నేతల్ని

మోసగిస్తారు. వారి మాటలు సాధారణ సిబ్బందిని పోలి వుంటాయి. ఉద్యమం కోసం ఉపయోగిస్తున్నట్టు ఆధారాలు చూపకుండానే ఆయు ధాలు, మందుగుండు పట్టుకెళ్తారు. ఆయుధాలు పొందిన వారిలో ఎక్కువ మందికి శిక్షణతోపాటు పోరాట స్ఫూర్తి లోపించింది. క్రమశిక్షణ, త్యాగ గుణం లేకపోవడమే ఇక్కడి గెరిల్లా యోధుల ప్రధాన బలహీనతలు. ఇలాంటివారితో యుద్ధంలో విజయం సాధించలేం. మనం ఎక్కడ ఉంటే అక్కడ అంతా సానుకూలంగా మారు తుందంటూ ఎవరైనా ఆశించవచ్చు. నేను అక్కడ అలాగే అనుకున్నా. నాతో సహా మనలో మనకే అనేక విభేదాలు, వాస్తవానికి నేనిక్కడ ఖైదీనయ్యా. వివిధ బృందాల మధ్య విభేదాలు, పలువురు నేతల మధ్య వైరుధ్యాల భయం వగైరా.. యుద్ధంలో వారు విజయం సాధించేందుకు సాయమందించాలని మనమొచ్చాం. ప్రతికూలంగా ఉన్న ఈ పరిస్థితిని మనం కొంత అనుకూలంగా మార్చాల్సివుంది. అందుకోసం రాజకీయంగా మనపై ఎంతో ఒత్తిడి ఉంటుంది. మనం మన స్వీయ పోరాటంలో ఎన్నో వైరుధ్యాల్ని ఎదుర్కొన్నాం. అదే వారికి చెప్పాలి. మనలోనూ అసహ్యించుకునే లక్షణాలున్నాయని చెప్పకపోతే వారు తమ తప్పుల విషయంలో మనల్ని తలక్రిందులుగా అర్థం చేసుకునే ప్రమాదముంది.

ముందుగా మనం వారితో విప్లవ స్నేహితులుగా వ్యవహరించాలి. వారి నుంచే రేపటి మధ్యశ్రేణి నేతలు వస్తారు. ఇక్కడి కామ్రేడ్స్‌తో పోలిస్తే మనకు ఎక్కువ దుస్తులు, ఎక్కువ ఆహారం అందుతున్నాయి. వాటిని సాధ్యమైనంత ఎక్కువగా వారితో పంచుకోవాలి. విప్లవ స్ఫూర్తి ఉన్న కామ్రేడ్స్‌ను ఎంచుకొని వారికి వీలైనంత బోధించాలి. ఇక్కడి యోధులకు మన అనుభవాన్ని ఏదో ఒక రూపంలో అందిం చాలి. "బోధన అద్వితీయంగా ఉండాలి. ఐతే, పాండిత్య గర్వం ఉండకూడదు. మానవ స్పర్శతో సమష్టి అధ్యయన రూపంలో ఉండాలి. మన ప్రాథమిక ఆయుధాల్లో ఒకటైన విప్లవ విధేయత మన రాజకీయ కార్యాచరణకు మార్గదర్శిగా ఉండాలి." కాంగోలీస్ కామ్రేడ్స్‌కు మాత్రమే కాదు మనలోని బలహీన మనస్కులకు సైతం మన త్యాగశీలత స్ఫూర్తినివ్వాలి. "ఇతరులు మనల్ని డిమాండ్ చేసే దానికన్నా మన స్వీయ బలహీనతలే ఎక్కువ ప్రమాదకరం. నిఖార్సైన విప్లవకారుల నుంచే ఎవరైనా ఎక్కువ ఆశిస్తారు. అందుకే ఇవ్వాల్సింది కూడా మనమే."

చివరగా ఓ విషయం మనం మరచిపోకూడదు. మనకు తెలిసివుండాల్సిన దానికన్నా మన కిపుడు తెలిసింది చాలా తక్కువని. కాంగోలీస్ కామ్రేడ్స్‌తో సాన్నిహిత్యం కోసం మనం కాంగో గురించి నేర్చుకోవాలి. అంతేకాదు, సాధారణ సంస్కృతి, యుద్ధ కళల గురించి కూడా మనకు తెలియని విషయాలు నేర్చుకోవాలి. ఇలా ఆలోచించక పోతే అన్నీ మనం తెలుసుకోలేం లేదా నేర్చుకోలేం.

రెండు హెచ్చరికలతో నా ఈ సందేశాన్ని ముగిస్తా.. 1. కామ్రేడ్స్ ప్రవర్తన. పోరాటాన్ని విరమించాలని ప్రతి పాదించిన ఓ కామ్రేడ్ల బృందాన్ని ఇక విప్లవకారులుగా గౌరవించలేం లేదా వారిని అలా విశ్వసించలేం. ఇంతకన్నా మరో న్యాయ సూత్రమేమీ లేదు. అలాంటివారిని నైతికంగా తీవ్రంగానే ప్రశ్నించగలను. ఐతే, మనం ఎంతోకొంత చేయాల్సివుందని మరచిపోకూడదు. వారు నమ్మకద్రోహులు కాదు. వారిని బహిరంగంగా తిరస్కరించ కూడదు. ఇప్పుడిక స్పష్టం. ఓ విప్లవకారుడు మాత్రమే ఇవన్నీ చేయగలడు. తనవి కాని బాధ్యతలు మోయగలడు. అందుకే వాటికి అంతటి ప్రాధాన్యత. లేదంటే ఇది ఇతరులు అనేకమంది చేసే సాధారణ పోరాటం లాంటిదే అవుతుంది. ఈ రోజున ఈ కామేడ్స్ అంతా చల్లబడ్డారు. ఆత్మరక్షణ కోసం ఐక్యమయ్యారు. న్యాయంకాని చర్యను న్యాయమని సమర్థించుకోజూస్తున్నారు. ఇక్కడ వారింకా కొన్ని నెలలపాటు గడపాల్సివుంది. ఏదైతే సిగ్గు పడాల్సిన విషయమో స్నేహం మాటున చాలావరకు దాన్ని దాచేస్తున్నాం. "విధిగా చేయాల్సిన దాని కోసం వెయ్యి విధాలుగా ఆలో చించాలి. ఏం జరిగినా దాని ఫలితాల్ని అందరం పంచుకోవాలి. వారి తప్పిదాల్ని మరచిపోకుండానే వారిపట్ల కొంత ఆత్మీయత వ్యక్తం చేయండి. వారిని ఆత్మరక్షణలో పడేలా ఒత్తిడి చేయకండి."

2. కొన్ని నివేదికల్ని బట్టి తెలిసిందేమంటే... యుద్ధానికి సంబంధించి కాంగో వాసుల ఆలోచనల పట్ల తిరస్కార భావంతో వ్యవహరిస్తున్నారని. ఇక్కడ రెండు సమస్యలున్నాయి. రెండు వేర్వేరు భాషలు మాట్లాడే ప్రజలు ఒకరి భావాల్ని ఒకరు అర్థం చేసుకోవడంలో ఉండే ఇబ్బంది. మన ప్రధాన కర్తవ్యం ఇక్కడివారికి యుద్ధాల పట్ల చైతన్యం కలిగించడం. ఐతే, వారితో మనకు నిజమైన సాన్నిహిత్యం లేకుండా అది సాధ్యం కాదు. యుద్ధం అంటే మనుషుల్ని చంపే రకరకాల పద్ధతులు

మాత్రమే కాదు, దీర్ఘకాలిక పోరాటంలో ఎదురయ్యే ఇబ్బందుల గురించి కూడా.విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలంటే ఏదో ఒక ఉదాహరణ తీసుకోవాలి. కామ్రేడ్స్ మనం మరో విషయం మరచిపోకూడదు. "ఎంత అనుభవజ్ఞుడైన విప్లవకారుడైనా సరే. తాను ఏనాడూ పారిపోలేదని చెబితే నమ్మకండి..అది అబద్ధమని అతని ముఖం మీదే చెప్పేయండి. చీకటి రోజుల్లో మేమంతా పరుగుతీసిన వాళ్లమే. నీడల్ని చూసి భయపడ్డవాళ్లమే."

ఇలాంటి దశ నుంచి ఇక్కడివారు బయట పడేందుకు మనం సాయమందించాలి. ఐతే, ఇక్కడి పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయి. వీరి చైతన్యం ఆ రోజుల్లో మనవారి చైతన్యం కన్నా తక్కువ స్థాయిలో ఉంది. వీరిలో చైతన్యాన్ని పెంపొందించడం కొంత కష్టమైన పనే. ఈ సందేశాన్ని పార్టీ సభ్యుల మధ్య చర్చించండి. ఇంకా ఏవైనా సలహాలుంటే నాకు ఇవ్వండి. కామేడ్స్ కోసం చదివిన వెంటనే దీన్ని కాల్చేయండి. స్థావరంలోనే ఉంచకండి. పోరాటాన్ని విర మించుకుంటున్న కామేడ్స్ ముందు దీన్ని చదవకండి. విప్లవ శుభాకాంక్షలతో...

టాటూ, 12 ఆగస్టు, 65

నేననుకున్న సమయానికి మసెంగోగానీ, కబీలాగానీ రాలేదు. 16న అప్పర్ బేస్‌కు వెళ్లాను. అక్కడి నుంచి 18 తెల్లవారుజామున బయలుదేరి సాయంత్రానికెల్లా ఫ్రంట్ డీ ఫోర్స్‌కు చేరుకున్నా ఆ సమయంలో తప్పించుకుపోతున్న అపరాధిలా కొంత ఇబ్బంది పడ్డాను. ఐతే, ఇక బేస్‌కు తిరిగి రావడానికి మాత్రం దీర్ఘకాలం పడుతుందని అర్థమైంది.

* * * * *



చే...1965 ఏప్రిల్లో క్యూబా నుంచి వెళ్లడానికి ముందు... కాంగో పోరాటంలో చే పాత్రను రహస్యంగా ఉంచాలనుకున్నారు. అందుకే, ఆయన తన రూపురేఖల్ని మార్చుకున్నారు.







క్యాంప్‌లో చే.. ఎడమ పక్క విక్టర్ డ్రెకే, మధ్యలో క్యూబన్ డాక్టర్ కుమి..



ఎడమ వైపు నుంచి.. ప్యాబ్లో బి ఓర్టిజ్ అలియాస్ సబ, నానే, మరో ఇద్దరు కాంగో యోధులు...





రేడియో వార్తలు వింటున్నచే బృందం. ఎడమ నుంచి కూర్చున్న వారిలో ఇలివా, ఎంబిలీ, చే, నిలబడ్డ వ్యక్తి చాంగా..



టాంజానియికా సరస్సు పశ్చిమతీర ప్రాంతంలోని బేస్ క్యాంప్‌లో చే. స్థానిక పోరాటయోధులు, గ్రామస్తులతో...



కాంగోలో చే. 1965



భారత ప్రధాని నెహ్రూతో చే (1959లో ఇండియాను సందర్శించిన చే)





భార్య, పిల్లలతో చే



ఫ్రంట్ డీ ఫోర్స్‌కు చేరుకోగానే నేలపై వాలిపోయా. అలసట తీర్చుకునేందుకు అదే నాకు ఇష్టమైన పద్ధతి. రువాండన్లపై అక్కడి కామ్రేడ్స్ నుంచి ఆరోపణల పర్వం వినిపిస్తోంది. ముఖ్యంగా కెప్టెన్ జాకారియాస్ పై మాకు మాత్రం హృదయ పూర్వక స్వాగతం అందింది. పర్వత శిఖరాన క్యాంప్. పచ్చికబయళ్లతో ప్రకృతి శోభించే ప్రాంతం. ఐతే, అది వేసవి కావడంతో ఇంకా గడ్డి మొలకెత్తలేదు. వాతా వరణం పగలు ఆహ్లాదకరంగా ఉంటే రాత్రి బాగా చల్లగా ఉండేది. పడుకునేముందు చలిమంట వేసేవాళ్లం. చలికి తట్టుకోలేక మంటకు దగ్గరే పడుకునేవాన్ని.

మా స్థావరం బాగా ఎత్తున ఉండటంతో బెండేరా పట్టణపు విద్యుత్ దీప కాంతులు కనిపించేవి. వివిధ ఫ్రంట్ల నుంచి తాజా సమాచారమందింది. కాంగో తూర్పు ప్రాంతంలో పోరాటం ఏ స్థాయిలో ఉందో తెలిసింది. మరిన్ని ఆయుధాల పంపిణీ జరిగింది. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. ఉవీరాలో దాదాపు 350 ఆయుధాలతోపాటు ఓ ఫిరంగి, ఓ మోర్టార్, కొన్ని విమాన విధ్వంసకాలు, పిజీలో. బరాకాతో కలిపి ఇది ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రాంతం. ఇక్కడ వెయ్యి నుంచి రెండు వేలమంది సాయుధులున్నారు. కొన్ని విమాన విధ్వంసకాలు, ఓ ఫిరంగి, కొన్ని మోర్టార్లున్నాయి, లులింబాపై. ల్యాంబర్ట్ ఇచ్చిన సమాచారం ఇలా ఉంది. 150 రైఫిళ్లు, మూడు విమాన విధ్వంసకాలు, ఓ ఫిరంగి రెండు మోర్టార్లు, ఇంకా కిందికి వెళ్లే కబెంబేర్ రోడ్.ల్యాంబర్ట్ నేతృత్వంలో 45 మంది సాయుధులు, తేలికపాటి ఆయుధాలు, రాకెట్లు, కబెంబేర్ రోడ్డుపై దాదాపు కసెంగో వరకు కొన్ని దళాలు పని చేస్తున్నాయి. ఐతే, వారి దగ్గర కొన్ని రైఫిళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాంత దళాల పట్ల సాధారణ సిబ్బందిలో వ్యతిరేకత ఉంది. మైదాన ప్రాంతానికి చెందిన దళ సభ్యుడొకరిచ్చిన సమాచారమిలా ఉంది. అక్కడ నిరాయుధంగా ఉన్నవారు ఆపద సమయంలో రక్షణ కోసం సాయుధ దళాలున్నపర్వత ప్రాంతానికి పరుగుతీస్తారు.

లులింబా-ఫ్రంట్ డీ ఫోర్స్‌ల మధ్య మరికొన్ని స్థావరాల్లోనూ ఆయుధాల పంపిణీ జరిగింది. ఐతే, వాటి వివరాలు నాకు వివరంగా తెలియదు. దక్షిణ ప్రాంతం కబింబాలో దాదాపు 150 ఆయుధాలుండగా, వాటితోపాటు రెండు విమాన విధ్వంసకాలు, ఓ ఫిరంగి, రెండు మోర్టార్లున్నాయి.

ఎంబిలీ నేతృత్వంలో జరిగిన దాడి వార్తలు సంతృప్తికరంగా ఉన్నాయి. దాడి పెద్దదే ఐనా, రైతులు అడ్డు రావడంతో పూర్తి చేయలేకపోయారు. మనవాళ్లను చూసి రైతులు పారిపోవడంతో

శత్రువుకు సమాచారమిస్తారన్న అనుమానం కలిగింది. దాంతో, మన దళాల్ని మెలకువగా ఉండాలంటూ ఎంబిలీ ఆదేశించారు. ఆల్బర్ట్ విల్లే నుంచి రోడ్డుపై ఓ జీపుతోపాటు ఓ చిన్న ట్యాంక్ వెళ్తుండగా రాకెట్‌తో దాడి జరిపారు. జీపు తునాతునకలు కాగా, ఎగిరి వచ్చిన ఇనుప ముక్కలు తగిలి మన కార్యకర్తలు అఫెండే, అలక్రేలు గాయపడ్డారు. ట్యాంక్ పై గ్రెనేడ్లతో మనవాళ్లు దాడి చేయగా శత్రు దళాలు మెషిన్గన్‌తో బదులిచ్చాయి. ఆ సమయంలో ట్యాంక్‌లో డ్రైవర్‌తోపాటు అతని అనుచరుడున్నాడు. ఈ మొత్తం దాడిలో ఏడుగురు చనిపోయారు. ఎరుపు రంగులో ఉన్న వారి ముఖాల్ని చూసి బెల్జియన్లుగా నిర్ధా రించారు. దాడి తర్వాత శత్రు దళాల నుంచి ఆయుధాలతోపాటు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకోవడంలో విఫలమయ్యారు. అందుకోసం యత్నిస్తుండగా ఫ్రంట్ డీ ఫోర్స్ నుంచి వచ్చిన శత్రు దళాలు మన వాళ్లపై కాల్పులు ప్రారంభించాయి. దాంతో, మన దళాలు చెల్లాచెదురయ్యాయి. దారి తప్పిన కొందరు చివరికి స్థావ రానికి చేరుకోగా, ఓ రువాండన్ మాత్రం తిరిగి రాలేకపోయారు. సామ్రాజ్యవాదుల వార్తల ప్రకారం ఆ దాడిలో ఏడుగురు శత్రు సైనికులతోపాటు ఓ గెరిల్లా చనిపోయారు. ఈ దాడిలో డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకొనివుంటే మనకు కొంత ఉపయోగపడేవి. రోడ్డుపై మనవాళ్లు ఇద్దరిని బందీలుగా పట్టుకున్నారు. వారిచ్చిన సమాచారంతో ఫ్రంట్ డీ ఫోర్స్ పై ప్రత్యేక దాడి జరపాలన్న శత్రు సైన్యపు ప్రణాళిక మనకు తెలిసింది.

ఇదివరకటి దాడి సందర్భంగా ఆహారపు కొరత ఉందంటూ రువాండన్లు వెనక్కి వచ్చారు. ఐతే, ఈసారి వారికి అలాంటి అవకాశం లేదు. ఈసారి తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదంటూ ఎంబిలీ, అతనితో వెళ్లిన క్యూబన్లు చెప్పారు. దాంతో వారితో పాటే ఉంటామంటూ రువాండన్లు నిర్ణయించక తప్పలేదు. వారికోసం క్యాంప్ నుంచి కొంత ఆహారం పంపాం. వారు ఓ ఏనుగును చంపేశారు (ఆ ప్రాంతంలో అవి ఎక్కువ). దాంతో, వారిని ఆహార సమస్య అంతగా బాధించదు.

రెండో దాడి కోసం మరో కొత్త ప్రాంతాన్ని ఎంపిక చేశాం. సైకిల్ పై వెళ్తున్న ఇద్దరు వ్యాపారుల్ని పట్టుకున్నాం. వారి దగ్గర కొంత ఆహారంతోపాటు రెండు పీపాల పోంబే ఉంది (ఇంతకు ముందటి ఘటన పునరావృతం కాకూడదనుకున్న ఎంబిలీ ఆ నాటు సారాను దూరంగా తీసుకెళ్లి

పారబోశారు). మరోసారి రైతులు ఎదురుపడ్డారు. దాంతో, రువాండన్ల మాట మన్నించి బేస్కు తిరిగి వెళ్లేందుకు ఒప్పుకున్నాం. వెళ్లేముందు రాకెట్ దాడికి యత్నించగా అది విఫలమైంది.

మసెంగోకు నేను మరో సందేశం పంపించా. రైతులతో వ్యవహరించేందుకు విధానపరమైన నైపుణ్యత అవసరమని చెప్పా. బందీల ద్వారా ఇంటెలిజెన్స్ పని ప్రారంభించాలని ప్రతిపాదించా. రైతుల్ని అందులో భాగస్వాముల్ని చేసి సరస్సు నుంచి ఆ దిశగా జరిగే సరఫరాల్లోంచి వారికి బహుమతులిచ్చి ప్రోత్సహించాలని చెప్పా. అదే విధంగా ఫ్రంట్లోని దళాలన్నిటినీ ఒకే కమాండ్ కిందికి తేవాలి. దళాల తరలింపు విషయంలో ఎవరికివారు స్వతంత్రంగా వ్యవహరించకూడదు. అరాచకత్వానికీ, తిరుగుబాటు ధోరణులకు ఓచోట అవకాశమిస్తే, అది దళాల కన్నిటికీ విస్తరించి చివరికి ముఠాల ఏర్పాటుకు, వాటి మధ్య గొడవలకూ దారి తీస్తుందని హెచ్చరించా.

పోరాటంలో రువాండన్లు కనబరచిన ప్రగతిని చూసిన మేం ఇక వారికి శిక్షణ అవసరం లేదని భావించాం. కాంగోవాసులకే ఎక్కువగా శిక్షణ ఇవ్వాలనుకున్నాం. చివరికి కాంగోను విముక్తి చేయాల్సింది కూడా వారే. మపూను ఇక అక్కడే ఉంచాలనుకున్నాం. 12 మంది రువాండన్లకు ఆయన ఇంచార్జ్‌గా ఉన్నారు. మిగతా దళాలన్నిటినీ కేలిగ్నిటే ఫ్రంట్‌కు పంపాలనుకున్నాం (నేను కూడా వారితోపాటు వెళ్తా). మేం వెళ్లడానికి ముందు సరస్సు ప్రాంత బాధ్యతల్ని టామ్కు అప్పజెప్పాం. ఆయన కబింబా వెళ్లి అక్కడి పరిస్థితిని అంచనా వేస్తారు. టామ్ అక్కడికి వెళ్లడానికి ముందు ఓ సమావేశం ఏర్పాటు చేసి సమస్యల గురించి చర్చించాం. ఆయనకు రాజకీయంగా సలహాలిచ్చేందుకు కొందరు సభ్యుల్ని ఎంపిక చేశాం. ఇఫ్రిని, సింగిడా మా బృందంలోనే కొనసాగుతారు. మపూతో ఉండే చిన్న బృందంలో అలసిరి ఉంటారు. కాంగోవాసులపై తీవ్ర వ్యాఖ్యలు చేసినందుకు కామ్రేడ్ సింగిడాను మేం మందలించాం. రువాండన్ల పట్ల అమర్యాదకరంగా వ్యవహరించిన అజీ, అజీమా లను విమర్శించా. కేలిగ్నిటే ఫ్రంట్‌కు వెళ్లడానికి ముందు నన్ను ఓ సమావేశానికి రువాండన్లు ఆహ్వానించారు. ఆ సమావేశంలో జకారియాస్‌తోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. యుద్ధానికి సంబంధించిన మిలటరీ చర్యలు, శిక్షణ, ఆచరణలో ఎదురయ్యే సమస్యలపై మాట్లాడాం. చివరగా రువాండన్ల పని విధానంపై అప్పటి వరకూ మీకున్న అవగాహన

చెప్పాలంటూ కార్యదర్శి నన్ను కోరారు. వారిలో రెండు బలహీనతల్ని గుర్తించానని చెప్పా.

మొదటిది, ఆహారం కోసం అదృష్టంపై ఆధారపడటం. రైతులు తమ కోసం ఆవుల్ని పంపిస్తారని నమ్మేవారు. అందుకోసం కొందరు సైనికుల్ని పంపిస్తే చాలు ఇక తమకు సమస్యే ఉండదనుకునేవారు (కోతి మాంసం తింటూ గడిపారు. మొదట అది రుచిగా అనిపించింది. ఆ తర్వాత ఆకలి తీర్చుకునేందుకు అదే గతి)చివరి కొన్ని రోజుల్లో తప్ప వారు కాసవా దుంపల కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లలేకపోయారు. ప్రజా సైన్యాన్ని నిర్మించాలంటే రైతులతో శాశ్వత సంబంధాలు అవసరమని చెప్పా. అది ఎంత మాత్రం కూడా పరాన్న జీవితం కాబోదని, రైతులు మనల్ని తమ ప్రతిబింబాలుగా చూస్తారంటూ వివరించా.

రెండోది, కాంగోవాసుల పట్ల ఏ మాత్రం నమ్మిక లేకపోవడం. కాంగోవాసులతో ఐక్యంగా మెలగాలని చెప్పా రువాండా విప్లవ విజయం కాంగో పోరాట ఫలితాలపై ఆధారపడివుంటుందని వివరించా. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడంలో కాంగో వాసులది విశాల దృక్పథమని గుర్తు చేశా. ప్రతిస్పందనగా నా మొదటి విమర్శను ఒప్పుకున్నారు. కొన్ని ఉదాహరణలు చెబుతూ, తమ తప్పిదాల్ని ఎలా సరి చేసుకుంటోందీ వివరించారు. రెండో విమర్శ గురించి మాత్రం నోరు మెదపలేదు. నా అభిప్రాయాల పట్ల వారికి అంగీకారం లేనట్టుంది లేదా తమ దృక్పథాన్ని మార్చుకునేందుకు సిద్ధంగా లేనట్టుంది.

బేస్(స్థావరం) నుంచి దూతలొచ్చారు. వారు దార్ ఏ సలామ్ నుంచి ఉత్తరా లతో పాటు కొన్ని పత్రికా వార్తల్ని మోసుకొచ్చారు. ప్యాబ్లో రాసిన లెటర్ ద్వారా కొన్ని ముఖ్య విషయాలు తెలిశాయి. అది 19 ఆగస్టు 1965న రాసిన లెటర్.

టాటూ... మీరు ఆదేశించినట్టే ప్రయాణాన్ని ప్లాన్ చేశాం. ఐతే, హవానా నుంచి వచ్చిన ఓ సమాచారంతో ఓ చిన్న మార్పు. ఓ దూతను ఇక్కడికి పంపారు. సరి హద్దును సురక్షితంగా దాటించేందుకు ఆయన అంతా సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ఆయన మిమ్మల్ని చేరుకుంటారు. రెండు విషయాలు, ఓ బృందం స్థావరానికి చేరుకొని శిక్షణ ఇవ్వనుంది. మొజాంబిక్‌తోపాటు ఈ ప్రాంతంలోని ఇతర ఉద్యమాల నుంచి వచ్చిన కామ్రేడ్లకు వారు శిక్షణ ఇస్తారు.

టాంజానియా ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ బృందాన్ని పంపిస్తున్నాం. కార్యాచరణ ఎలా ఉండాలో ఉస్మానీ మీకు వివరిస్తారు. ప్రత్యేక పరిస్థితుల వల్ల ప్రణాళికలు వాయిదా పడ్డాయి. కాంగో వాసులకు శిక్షణ ఇచ్చేందుకు టబేరాకు బృందం వెళ్తుంది. ఐతే, సౌమాలియట్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం దేశం లోపలే స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. అందువల్ల బృందం సభ్యులు బయటకు వెళ్లాల్సిన పని లేదు. వారు అక్కడే ఉండి మొజాంబికన్లతోపాటు మిగతా ఉద్యమకారులకు శిక్షణ ఇస్తారు.

మరో విషయం, గత కొన్ని రోజులుగా కాంగోకు చెందిన వివిధ బృందాలు నన్ను కలిశాయి. వారందరికీ మీ గురించి ఎంతోకొంత తెలుసు. అక్కడ పని చేయాలన్న ఆసక్తి కబీలాకు లేదన్న సాకుతో వారంతా ఆయన తరపున నాయకత్వం చేపట్టాలని చూస్తున్నారు. తమ సొంత ముఠాల ఏర్పాటు కోసం మీ కమాండ్ కింద మన నుంచి సాయం పొందాలని చూస్తున్నారు. అలాంటి ప్రయత్నం ప్రమాద కరమని వారికి వివరించా. ఉద్యమాన్ని చీల్చివేస్తుందని నచ్చచెప్పా. వారు ఏం చేయాలనుకున్నా కబీలాతోపాటు మీతో చర్చించాలని సూచించా. ఇది వారి పట్ల మనకున్న బాధ్యతను గుర్తు చేస్తుంది. కబీలా మా దగ్గరికొచ్చి పరిస్థితి వివరించారు. ఆ కామ్రేడ్స్‌నందరినీ బహిష్కరించినట్టు టాంజానియా ప్రభుత్వానికి తెలిపారు. ఇక నుంచి ఎవరైనా తమకు తామే ఉద్యమకారులుగా చెప్పుకుంటే వారందరినీ అక్కడికి పంపిస్తామన్నారు. ఆ కామ్రేడ్స్ సందర్శించిన రాయబార కార్యాలయాలన్నిటికీ ఈ విషయాల్ని వివరించినట్టు చెప్పారు. ఇక తానే అక్కడికి వస్తానంటూ ఒట్టేసి చెప్పారు...

మీ.. ప్యాబ్లో..

ప్యాబ్లోకు తిరిగి లెటర్ రాశా. కబీలాపై కూడా నాకు నమ్మకం లేదని చెప్పా ఇక మిగతా వారైతే అంతకన్నా బుద్ధిహీనులని వారు అతనికి ప్రత్యామ్నాయం కాజాలరని చెప్పా. ఐతే, మేమిక్కడ పని చేసేందుకు అవకాశమిస్తే చాలు, ఎలాంటి భయాలూ అవసరం లేదని ఆయన కమాండ్ కిందే అందరినీ ఐక్యం చేయగలమని వివరించా. ఇక్కడ పని చేసేవారికి ఇక్కడే శిక్షణ ఇస్తే ఇక్కడి వారిలో కనిపించే క్రమశిక్షణా రాహిత్యం, నిర్మాణ రాహిత్యం, నైతిక పతనంలాంటి అవలక్షణాలు వారిపై

ప్రభావం చూపగలవని వివరించా. ఆ విధమైన ఆదేశాలివ్వరాదంటూ ప్యాబ్లోకు సూచించా. అది రాజకీయంగా ప్రమాదమని హెచ్చరించా.

కేలిగ్నిటే క్యాంప్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యా మోజాతోపాటు కొంతమంది ఇక్కడే ఉంటారు. జకారియాస్ కోసం వేచి చూస్తారు. ఆయన తనతోపాటు పదిమందిని తీసుకొస్తానన్నారు. నిజంగానే వారు వస్తే కాంగోవాసులతో కలిసి పోరాటంలో పాల్గొంటారు. కేలిగ్నిటే క్యాంప్‌కు ఇక్కడి నుంచి నడిచి వెళ్లాలంటే రెండున్నర గంటల ప్రయాణం. పర్వతాల వరుస దాటగానే మైదాన ప్రాంతం వస్తుంది. అది పల్లపు ప్రాంతమే కాకుండా ఎగుడుదిగుడుగా ఉండటంతో రక్షణ విషయంలో సరైంది కాదు. అక్కడ కాల్పులు జరపడం కష్టం. క్యాంప్‌లో చిన్న చిన్న గుడిసెలున్నాయి. ఒక్కోదానిలో నలుగురి నుంచి పదిమంది వరకూ ఉంటారు. ఖాళీగా ఉన్న కొన్ని గుడిసెల్ని మాకిచ్చారు. బెందేరాలో ఉన్నంత చల్లదనం ఇక్కడ లేకపోవడంతో నాకు అనుకూలంగా ఉంది. ఐతే, పేల సమస్య మాత్రం యథావిధిగానే ఉంది. మేం అక్కడికి వెళ్లడంతో ఆయనకు సంతోషంగా ఉందన్నారు. ఐతే, మా వెంట రువాండన్లు ఉండటం ఆయనకు ఇష్టం లేదు. వారికి శిక్షణ ఇవ్వాలంటూ మాకు ఆదేశాలున్నట్టు వివరించా. మీతోనూ పని చేస్తామని చెప్పా. మా సంభాషణ స్నేహపూర్వకంగా సాగింది. ఐతే, రువాండన్లతో మాట్లాడినట్టు నేరుగా వారితో మాట్లాడలేకపోయాం. కేలిగ్నిటే ఫ్రెంచ్‌లో ఒక్క మాట కూడా మాట్లాడలేరు. నేను నేర్చుకున్న స్వాహిలీ కూడా అంతంత మాత్రమే. దాంతో, క్యూబన్ అనువాదకులపై ఆధారపడక తప్పలేదు. ఐతే, వారు కూడా అన్ని పదాల్ని అర్థం చేసుకోలేరు. కొన్ని సంక్లిష్ట భావాల్ని అనువదించడం వారికీ కష్టంగానే ఉంది. క్యాంప్ నుంచి దగ్గరలో ఉన్న మకుంగో, న్యాంగీ, కటెంగా, ఫ్రంట్ డీ ఫోర్స్ దళాల్ని మేం పర్యవేక్షించాల్సి వుంది. ఈ ప్రాంత దళాల్లో తటపటాయించే స్వభావం ఉంది. శత్రుదళాలు సమీ పించాయంటే చాలు దాడి జరపాలా లేక వెనక్కి పరుగెత్తాలా అంటూ సంశ యిస్తారు. ఆ ప్రాంత ప్రజలతో సంబంధాలు మెరుగుపరచుకోవాలంటూ అక్కడి నేతలకు సూచించా.

అది ఆదివారం. మా గౌరవార్థం అక్కడి రైతులు వారి గ్రామ దేవతకు పండగ జరుపుకున్నారు. చెట్ల కొమ్మల్ని దేవతావస్త్రాలుగా అలంకరించుకున్నరైతులు జాన పద నృత్యాలు

చేస్తూ అలరించారు. పర్వత శిఖరాన ఓ రాయిని దేవతగా నెలకొలిపారు. ఓ గొర్రెను దేవతకు బలి యిచ్చి దాని రక్తాన్ని అక్కడున్నవారిపై చల్లారు. క్రతువు పూర్తి కాగానే దాని మాంసం తింటూ, తాగుతూ ఎంజాయ్ చేయడం వారి సంప్రదాయం.

అక్కడి రైతులు మాతో ఎంతో స్నేహంగా వ్యవహరించారు. వారి రుణం తీర్చు కోవాలనుకున్న నాకు డాక్టర్గా నా పాత అవతారం గుర్తొచ్చింది. అక్కడి వారిలో గనేరియా ఎక్కువగా ఉంది. దాని నివారణ కోసం కొన్ని పెన్సిలిన్ ఇంజక్షన్లను నా దగ్గర నిల్వ ఉంచా. మలేరియా నివారణ కోసం టాబ్లెట్లు కూడా.

మరోసారి యుద్ధానికి సంబంధించిన విషయాలపై బోధన ప్రారంభించాం. ప్రస్తుతానికైతే ఆ పరిస్థితి లేదు. భవిష్యత్‌లోనైనా అది జరుగుతుందో లేదో చెప్పలేం. ఐతే, మేమిక్కడి అన్ని ప్రాంతాల్లో ఇపుడు వెదజల్లుతున్న విత్తనాల్ని వారికి అవసర మైనపుడు ఎవరో ఒకరు మొలకెత్తిస్తారన్నదే ఆశ, ఆశయం.

**********

మకుంగో ప్రాంతంలో గెరిల్లా శిక్షణ కోసం కొత్తగా వచ్చిన బృందానికి తరగతులు నిర్వహించేందుకు యత్నించాం. ఆల్బర్ట్ విల్లే నుంచి ఫ్రంట్ డీ ఫోర్స్ వైపు వెళ్లే రహదారిపై దాడుల నిర్వహణపై శిక్షణ ఇచ్చాం. జకారియాస్ తన వెంట మరో పదిమంది రువాండన్లను తీసుకురావడంతో ఆ బృందం వివిధ జాతుల సమూ హంగా మారింది. వారి మధ్య సాన్నిహిత్యం పెంచి సమైక్య ఫ్రంట్గా తీర్చిదిద్దాలను కున్నాం.

ఫ్రంట్ డీ ఫోర్స్ దగ్గర శత్రు దళాలు మోహరించి ఉన్నాయి. కాలి నడకన వెత్తే మూడు లేదా నాలుగు గంటల్లో చేరుకునేంత దూరంలో ఉన్నాయి. మాకు వ్యతిరేక దిశలో న్యాంగీ అనే ఓ గ్రామం ఉంది. రెండు గంటల ప్రయాణ దూరంలో కటింగా, 50 కి.మీ. దూరంలో లులింబా ఉన్నాయి. కటింగా-లులింబా రోడ్డుపై దాడి చేయాలన్నది లక్ష్యం. ఓవేళ వాళ్లు న్యాంగీ నుంచి ముందుకు వచ్చేందుకు యత్నిస్తే అడ్డుకోవాలనుకున్నాం. దానికి సమీపంలోనే పర్వతాల వరుస ప్రారంభమవుతుంది. మకుంగో ఉన్నది అక్కడే. మా హెడ్ క్వార్టర్స్ ఉన్నది కూడా అక్కడే. రోడ్డుకిరువైపులా కటింగా గ్రామం. నదులు పొంగినపుడు వరదల నివారణకు వీలుగా ఆధునిక వంతెనల నిర్మాణం ఉంది.

న్యాంగీ నుంచి వచ్చే శత్రు దళాల్ని నిలువరించే బాధ్యతను అజీ నేతృత్వంలోని బృందానికి అప్పజెప్పాం. ఆరుగురు క్యూబన్లతోపాటు పదిమంది కాంగోవాసులు ఆ బృందంలో ఉన్నారు. రోడ్డుపై జరిపే దాడిలో 40 మంది కాంగోవాసులతోపాటు పదిమంది రువాండన్లు, 30 మంది క్యూబన్లు పాల్గొంటారు. శత్రు దళాలు ఏ రూపంలో వచ్చినా అక్కడ నిలువరించే శక్తి వారికుంది. ఈ సమయంలోనే పది మంది క్యూబన్లు అక్కడికి వెళ్లారు. భవిష్యత్‌లో వారు ఓ అంతర్జాతీయ స్థావరంలో శిక్షణ ఇవ్వాల్సివుంది. కాంగోవాసులతోపాటు ఇతర ఉద్యమాల నుంచి వచ్చినవారు అక్కడ శిక్షణ పొందుతారు. తర్వాతి దాడి నుంచి వారి ద్వారా శిక్షణ ఇప్పించాలను కున్నాం. ఐతే, వచ్చిన కామ్రేడ్స్‌లో ఎక్కువ భాగం సిద్ధాంతపరంగా శిక్షణ పొందిన వారే. వారు కేవలం సంప్రదాయిక ఆయుధాల్ని ఉపయోగించడంలో మాత్రమే శిక్షణ ఇవ్వగలరు. కొద్దిమందిని మినహాయించి వారిలో ఎవరికీ గెరిల్లా యుద్ధాల్లో అనుభవం లేదు.

దళాలతోపాటే నేనూ వెళ్లాను. అది వర్షాకాలం కావడంతో కటింగా నది ఉధృతంగా

ప్రవహిస్తోంది. ఎలాగోలా నదిని దాటి ముందస్తుగా మేం ఎంపిక చేసిన వ్యూహాత్మక పొజిషన్‌కి చేరుకున్నాం.

ఇక్కడ మేం అనుసరించిన ఎత్తుగడ చాలా సింపుల్. శత్రువును బలమైన స్థావరంపై దెబ్బ కొట్టడం ద్వారా యుద్ధ తీవ్రత అక్కడే కేంద్రీకృతమవుతుంది. ఎక్కడైతే దాడి జరుపుతామో ఆ ప్రాంతానికి బయటి నుంచి శత్రు దళాలు చేరు కోకుండా ఇరువైపులా మన దళాల్ని తగినంతగా మోహరించాలి. దీని వల్ల మరో ప్రయోజనమేమంటే.. యుద్ధ ప్రాంతం నుంచి శత్రు దళాలు బయటకు పారి పోకుండా అడ్డుకోగలం. వ్యూహాత్మకంగా జరిపే ఈ ఆకస్మిక దాడి నుంచి శత్రు దళాలు రక్షణ పొందే అవకాశమే ఉండదు. మొదట రాకెట్ లాంచర్స్‌తో దాడి ప్రారంభిస్తాం. కటింగాకు కిందివైపున 5 లేదా 6 కి.మీ. దూరంలో ఓ చిన్న బృందం ఉంటుంది. ఆ వైపున ఉన్న కట్టెల వంతెనపైకి శత్రు లారీలు చేరుకోగానే దాన్ని పేల్చి వేయాలి. దాంతో, బయటి నుంచి శత్రు దళాలు లోపలికి ప్రవేశించలేవు. లోపలి దళాలు బయటకు పారిపోలేవు. ఐతే, తగినన్ని మందు పాత్రలు లేక పోవడంతో గ్రెనేడ్లు, ఇతర పేలుడు పదార్థాల్ని పేలుళ్ల కోసం ఉపయోగిస్తున్నాం. ఈ విధమైన ఏర్పాట్లు కచ్చితమైన ఫలితాలిస్తాయని చెప్పలేం. వాటిని ఆపరేట్ చేసే వ్యక్తుల నైపుణ్యత, వంతెనపై లారీల వేగంపై ఫలితాలు ఆధారపడివుంటాయి.

యుద్ధ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో ఓ చిన్న కమాండ్‌ను అందుబాటులో ఉంచా. ఇలాంటి దాడుల్లో ఆహారం, నీటి సరఫరాపై జాగ్రత్తగా ఉండాలి. ఎందు కంటే శత్రు వాహనాల రాక కోసం రోజులకొద్దీ వేచి చూడాల్సివుంటుంది. అక్కడి నీరంతా మురికిగా ఉండటంతో చాలామంది విరేచనాలతో బాధ పడక తప్పలేదు. పర్వత ప్రాంతం కావడంతో పలు రకాల ఆహారానికి అవకాశం లేదు. అలాగే ఆహారానికి కొరత కూడా లేదు. కాసవా దుంపలు కావలసినన్ని దొరుకుతాయి. సాధారణంగా ఐతే తినడం కష్టమే కాని, మంచి ఆకలితో ఉన్న వారికి తినగలిగేవే. చిరు జల్లుల వల్ల అక్కడ ఉండటం కాస్త కష్టమనిపించింది. రెండు రోజులపాటు ఏమంత ఇబ్బంది లేకపోయినా ఆ తర్వాత మాత్రం గంటలు గడిచే కొద్దీ ఉద్వేగంగా, విసుగ్గా అనిపించింది. ఏదైనా మోటార్ ధ్వని వినిపిస్తే చాలు వెంటనే అలర్టయ్యే వాళ్లం. నన్ను సైతం అలాంటి ధ్వనులు అనేకసార్లు బాధించాయి.

ఆదివారం వరకు... అంటే మేమక్కడికి చేరుకున్నాక ఐదు రోజుల వరకు.. వారందరినీ మాతోపాటు నిలిపి ఉంచగలిగాం. ఆ తర్వాత రోజు నుంచి కాంగో వాసుల్లో అసహనం మొదలైంది. అందుకోసం వారు ఓ సమాచారాన్ని కారణంగా చెప్పారు. అదేమంటే.. పక్షం రోజులకోసారి మాత్రమే ఆ మార్గంలో శత్రు లారీలు వెళ్తాయని, మేం అక్కడికి చేరుకోవడానికి ఓరోజు ముందే లారీల వరుస వెళ్లి పోయిందని. దాంతో, ఇక వెనక్కి వెళ్లడమే మంచిదన్నారు. ఐతే, అలా మాట్లాడేందుకు కారణం మాత్రం వేరే ఉంది. మురికి నీటి వల్ల కలిగే అనారోగ్యం, దుంపల తిండి, ఎపుడో ఓసారి కొద్ది మోతాదులో దొరికే డబ్బా తిండి లేదా బికాలి. ఈ రకమైన అసౌకర్యాలు వారిలో పోరాట స్ఫూర్తిని నిలుపలేకపోయాయి. ఐదో రోజున మా బలహీనతను గుర్తు చేసే హాస్యభరిత సన్నివేశమొకటి మరోసారి పునరావృతమైంది. కమాండ్ పోస్ట్‌లోని ఊయలలో నేను విశ్రాంతి పొందుతుండగా, ఏనుగుల మందను చూసి ఎవరో పరుగు పెడుతున్న శబ్దాలు వినిపించాయి. ఆరు లేదా ఏడుగురు కాంగోవాసులు కళ్లు పెద్దవిగా చేస్తూ ఆస్కారీ షోంబే, ఆస్కారీ షోంబే (షోంబే సైన్యం) అంటూ అరిచారు. 20 లేదా 30 మీటర్ల దూరం నుంచి ఎవరో వెళ్తూ వీరి కంటపడ్డారు. నాకపుడు నా సైనిక దుస్తులు సరుకునేందుకు కూడా సమయం లేదు. ఊయల విడిచి వీపు వెనుక బ్యాగ్ తగిలించుకొని వారిని అనుసరించా. నాతోపాటు ఉన్న క్యూబన్లలోనూ ఒకరు ఆస్కారీ షోంబేను చూశారు. దాంతో, పరిస్థితి క్లిష్టంగా తయారైంది. కాంగోవాసులపై నాకు నమ్మకం లేదు. ఆ సమయంలో నావెంట క్యూబన్లు నలుగురు మాత్రమే ఉన్నారు. వెంటనే అదనపు దళాల్ని కోరుతూ మోజా వద్దకి సింగిడాను పంపించా. తనతోపాటు కాంగోవాసుల్ని దూరంగా తీసుకెళ్లమని చెప్పా ఇలాంటి పరిస్థితిలో వారుంటే న్యూసెన్స్ చేస్తారని పించింది. శత్రువు కంట పడకుండా ఉండేందుకని మేం కొన్ని మీటర్లు నది వైపుగా వెళ్లాం. వాళ్లపుడు వచ్చిన దారినే వెనక్కి వెళ్తున్నారు. మా దళాల్ని చేరుకున్నాక మేమూ వెనక్కి తిరిగాం. కొన్ని కదలికల తర్వాత తెలిసిందేమంటే వారు శత్రు సైనికులు కాదని, స్థానిక రైతులని. మమ్మల్ని చూడగానే వాళ్లు పరుగు పెట్టారు. అప్పటికే మా దళాల్లోని ఒకరు కాల్పులు కూడా ప్రారంభించారు.

ఇక్కడ ఏం జరుగుతుందో తెలుసుకుని రావాల్సిందిగా ఓ మనిషిని మోజా మా దగ్గరికి

పంపారు. విషయం తెలుసుకున్న అతను తిరిగి మోజాకు నివేదిక అందిం చారు. మన దళాలు తిరిగి కమాండ్ పోస్టుకు చేరుకున్నాయంటూ.. ఐతే అప్పటికే అక్కడ గజిబిజి నెలకొంది. మన దళాలపై దాడి జరిగిందన్న పుకార్లు వ్యాపించాయి. కమాండర్గా వ్యవహరిస్తున్న మోజా సమీపంలోని ఓ ప్రాంతంలో షెల్టర్ తీసు కున్నారు. కింబీ నది వైపున నాకోసం వెతకాల్సిందిగా మన దళాల్ని ఆదేశించారు. (నేను అటువైపు వెళ్తానంటూ సమాచారమిచ్చినందున).

రెండు గంటల తర్వాత మేం వెనక్కి వెళ్లడం ప్రారంభించాం. అదే తగిన సమయమనుకున్న కాంగోవాసులు క్యాంప్ చేరుకునేదాకా పరుగు వీడలేదు. ఇలాంటి గందరగోళాల వల్ల మేం అనేక నష్టాల్ని భరించాల్సి వచ్చింది. కాంగో వాసుల పిల్ల చేష్టల వల్ల సరైన శిక్షణ లేని మిగతా దళాలు సైతం తప్పుదోవ పడు తున్నాయి. మమ్మల్ని చూసి పారిపోయిన రైతులు ఏ తెగకు చెందిన వారో తెలి యదు. కామ్రేడ్ అరగోన్స్ వస్తున్నారని తెలిసి క్యాంప్‌కు వెళ్లా. దాడి పూర్తవడానికి 11 రోజులు పట్టింది. కాంగోవాసులు వెనక్కి వెళ్లాలంటూ అనేకసార్లు ఒత్తిడి చేశారు. ఐతే, తాను క్యూబన్లతోనే ఉంటానంటూ మోజా చెప్పడంతో చివరిదాకా వారికీ ఉండక తప్పలేదు.

చివరికి రెండు లారీలు వచ్చేశాయి. అందులో మొదటి లారీని ధ్వంసం చేయగా, ఏడుగురు శత్రు సైనికులు చనిపోయారు. అదే సంఖ్యలో వారి ఆయుధాలు స్వాధీనమయ్యాయి. ఆయుధాలుగాక వారి వెంట ఏమీ లేవు, కొద్ది పరిమాణంలో మేరిజ్వానా అనే ఉపశమన ఔషధం (ఓ రకం గంజాయి), అంతగా ప్రాముఖ్యత లేని కొన్ని పత్రాలు తప్ప. రెండో లారీని రాకెట్ లాంచర్‌తో ధ్వంసం చేయలేక పోయారు. కాల్పులు జరపడంలో అది విఫలమైంది. రెండింటినీ ధ్వంసం చేయా లన్న సంకల్పంతో మన దళాలు ఆ దారి చివరి వరకూ వెంటాడి, ఆ తర్వాత వెనుతిరిగాయి. ఆ సమయంలో కాంగోవాసులు వెనక్కిపరుగుపెట్టారు. కింబీ నదిని దాటి జనరల్ స్టాఫ్‌ను చేరుకునే వరకూ ఆగలేదు. ఈ దాడిలో చివరి వరకూ కొనసాగిన క్యూబన్లకు రువాండన్లు వెన్నుదన్నుగా నిలిచారు. యుద్ధాల్లో వీరికి అనుభవం కొంత ఎక్కువ. రువాండన్లలో ఒకరు రాకెట్‌తో కాల్పులు జరపగా, మరొకరు మన దళాలతో కలిసి దాడిలో పాల్గొన్నారు. వీరిద్దరూ మృత్యువాత పడ్డ శత్రు సైనికుల నుంచి ఆయుధాల స్వాధీనంలోనూ చురుగ్గా వ్యవహరించారు. ఈ దాడి వల్ల

దళాల నిర్మాణంలో మన లోపాలేమిటో బయటపడ్డాయి. చిన్న చిన్న పోరాటాల్లోనూ మనమెంత వెనకబడి ఉన్నామో తేలిపోయింది. తమ దేశంలోని గెరిల్లా పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న క్యూబన్లలో కొందరు ఇక్కడ నేర్చుకోవాల్సిం దేమిటో అర్థమైంది. మరోవైపు శత్రు దళాలు తమ రక్షణ విషయంలో పొందిన శిక్షణ, సాధించిన ప్రగతి ఈ దాడి ద్వారా స్పష్టమయ్యాయి. మొదటి లారీని ధ్వంసం చేశాక రెండో లారీని వారు సురక్షితంగా తీసుకెళ్లడంతో వాళ్లు ఎంత మెళకువతో ఉన్నారో అర్థమైంది. శత్రువును ఎదుర్కోవడంలో మన నిర్లక్ష్యం బయట పడటం కాంగోవాసులకు మింగుడు పడలేదు. వారంతా (శత్రు సైన్యం) నల్ల జాతి వారేనన్న వాస్తవాన్ని విస్మరిస్తూ, తెల్ల జాతి కిరాయి సైనికులు తమ నల్ల జాతి వారిని భయ కంపితుల్ని చేస్తున్నారంటూ కప్పిపుచ్చేందుకు యత్నించారు.

దాడి ప్రారంభానికి ముందు రువాండన్లతో కలిసి పోరాడేందుకు తమ వాళ్లకు ఇష్టం లేదంటూ కేలిగ్జేటే చీఫ్ నాతో చెప్పారు. రువాండన్లు క్రూరంగా కాల్పులు జరుపుతూ పరుగెడ్తారు. తమ సొంత కామ్రేడ్లను సైతం కాల్చేస్తారంటూ ఆరోపిం చారు. ఇలాంటివి కొన్ని జరిగిన మాట వాస్తవమే. ఆ దుష్ఫలితాలు మునుపటి దాడుల్లో మన అనుభవంలోకి వచ్చాయి. ఐతే, అంతకు మించిన తప్పిదాల్నే కాంగోవాసులు చేశారు. కాంగోవాసులు శత్రు దళాలపై కాల్పులే జరపలేదు. అటు వైపు నుంచి కాల్పుల శబ్దం వినిపించగానే వచ్చిన దారినే ఇటు వెనక్కి పరుగు తీశారు. ఇది మాకు ఆందోళన కలిగించలేదు. మొదటిసారి రువాండన్లతోనూ మాకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. రువాండన్లకిది మూడో దాడి. ఐనా, వారిలో కొందరు ఇంకా పాత పోకడలే పోతున్నారు. మరికొందరు మాత్రం మారి పోయారన్నది ఈ దాడిలో స్పష్టమైంది. ఈ రెండు బృందాల్ని ఐక్యం చేయాలన్న మన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఈ సమస్యను పరిష్కరించాక, మరో సమస్య ముందుకొచ్చింది. ఆయుధాల్ని కాంగోవాసులకు బహుమతిగా ఇవ్వాలని సూచించా. అందుకు రువాండన్లు అభ్యంతరం చెప్పారు. వారి ఆయుధాలు వారికి ఉన్నాయంటూ వాదనకు దిగారు. ఈ సమస్యను శక్తివంతంగా పరిష్కరించాలను కున్నా అందుకోసం జకారియాస్‌తో చర్చించా. ఎలాంటి స్నేహభావం వ్యక్తం చేయకుండా వారి ఆయుధాల్ని వారికి ఇచ్చేశాం. ఇక రువాండన్లు అక్కడ ఉండేం దుకు ఇష్టపడలేదు. వారి ఫ్రంట్‌కు వారు వెళ్లిపోయారు. ఐక్య పోరాటాల పట్ల, జకారియాస్ పట్ల

మసెంగోకు నా అభిప్రాయాల్ని తెలియజేసిన మరుసటి రోజే ఈ సంఘటన జరిగింది.

పోరాట ఫలితాలు సంతృప్తినిచ్చాయి. ఆందోళన కలిగించే గాయాలేమీ లేకుం డానే ముగిసింది. కామ్రేడ్ అంజలీ మాత్రం తీవ్రంగా గాయపడ్డారు. శత్రు లారీని తగులబెట్టే సమయంలో పెట్రోల్ మంటలు అంటుకోవడంతో గాయపడ్డారు. న్యాంగీ వద్ద శత్రు దళాలపై అజీ బృందం దాడి చేసి ఇద్దరిని గాయపరిచింది. ఐతే, అది చెప్పుకోదగిన సంఘటన కాదు.

రోడ్డుపై మరికొన్ని దాడులు జరపాల్సిందిగా సూచించా. లులింబాకు సిద్ధం చేశా. లారీలో దొరికిన పత్రాల ప్రకారం అక్కడ 53 మంది శత్రు సైనికులున్నట్టు తెలిసింది. ల్యాంబర్ట్ నేతృత్వంలోని దళాలు లులింబాపై దాడికి ఇదే తగిన సమ యంగా భావించాం. ఆ దాడి ద్వారా కసెంగోలోకి ప్రవేశించగలం. కటెంగాలులింబాల మధ్య దాడులు విజయవంతమైతే కొన్ని రోజుల్లోనే లులింబాను చుట్టుముట్టగలం. దాంతో, చెల్లాచెదురైన మన దళాలన్నీ ఓ చోటికి చేరుకుంటాయి.

మన సూత్రాల ప్రకారం, సామాజిక సమస్యలకు పరిష్కారాలు చూపించాల్సి వుంది. బేస్ నుంచి డాక్టర్ హిండీ వచ్చారు. పర్వత సమీప గ్రామాల్ని సందర్శించి రైతులతో సంభాషించారు. సరస్సు నుంచి తెచ్చిన విత్తనాల్ని పంచిపెట్టాం. మనవాళ్ల కోసం కొన్ని కూరగాయల్ని పండించాల్సివుంది. వాతావరణాన్ని సానుకూలంగా మార్చుకున్నాం. ప్రపంచంలోని రైతులందరిలాగే వీరు కూడా తోటి మానవుల పట్ల బాధ్యతగా ఆలోచిస్తారు. కృతజ్ఞతతో సహకరిస్తారు. తలచుకుంటే బాధగా అని పిస్తోంది. మన పోరాటం పట్ల మన పట్ల ఎంతో నమ్మకంతో ఉన్న ఈ మనుషులే విముక్తి సేనలో చేరినపుడు క్రమశిక్షణా రాహిత్యంతో, సోమరిగా వ్యవహరించడం గుర్తుకొస్తే. విప్లవ స్ఫూర్తిని రగిలిస్తూ, సైనిక నిర్మాణం చేపట్టినపుడు చెత్తనంతా పోగేసి పక్కకు నెట్టకు తప్పదు. నిర్మాణ రాహిత్యం, నాయకత్వ లోపం వల్ల జరిగిన ఆ తప్పిదాల్ని ఇప్పటికే అనేకసార్లు గుర్తుచేశా.

* * * * *

ఎప్పటిలాగే ఆగస్టు చివరన నెలవారీ విశ్లేషణ రాశా. కాంగోలో గడిపిన ఏడు నెలల్లో చూస్తే. ఎంతో ఆశాజనకంగా ఉండే నివేదిక ఇదే.

"నా పరిశోధక జీవితం కొనసాగుతోంది. అంటే ముందుకు వెళ్తున్నానని అర్థం. ఈ నెల ఎంతో అనుకూల ఫలితాల్నిచ్చింది. ఇక్కడి మనుషుల్లో గుణాత్మక మార్పును చూశా. ఫ్రంట్ డీ ఫోర్స్‌లో జరిపిన చర్యలు అందుకు ఉదాహరణ. తన అను చరులతో కలిసి జకారియాస్ ఇక్కడికి రావడం ఓ శుభ పరిణామం. దాదాపు ఫ్రంట్‌లోని మనుషులంతా మైదానంలోకి ప్రవేశించారు. పరిస్థితిని మరింత అనుకూలంగా మార్చడం కోసం ఇపుడు కొన్ని ఫలితాల్ని సాధించాల్సివుంది. ఇక నేను లులింబాలో ల్యాంబర్ట్‌ను కలిసి ఆపై కబెంబేర్‌కు వెళ్లాల్సివుంది. లులింబాను స్వాధీనం చేసుకునేందుకు వారిని ప్రోత్సహించాలి. ఆపై అక్కడే కొనసాగాలి. ఇదంతా సాధించాలంటే కొన్ని దాడులు జరపాల్సిందే.

కబీలా ఏం చేస్తారో తెలియదు. ఈ ప్రాంతంలో పర్యటించేందుకు మసెంగో దగ్గరికి రావాల్సిందిగా చెబుతా. ఇక్కడి వారిలో ఆయన పట్ల నమ్మకం కలిగించా లంటే అదే సరైంది. ఈ ప్రాంతంలోని రైతులందరినీ ఒకే కమాండ్ కింద ఆర్గనైజ్ చేయాల్సివుంది. రెండు నెలల్లో ఇక్కడి పరిస్థితి పూర్తిగా అనుకూలంగా మారు తుందని భావిస్తున్నాం. ఇప్పటికిపుడు చూసినా ఎంతో ఆశాజనకంగా ఉంది".

కొన్ని రోజులు గడిచాక మరోసారి చీకట్లు కమ్ముకున్నాయి. అలీకి తన ప్రాంతంలోని నేతలతో తీవ్ర విభేదాలున్నాయి. ఆయనిపుడు సరస్సు దగ్గరే ఉంటున్నారు. తిరిగి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. తాజాగా ఫ్రంట్ డీ ఫోర్స్ చేజారిపోయింది. అక్కడిపుడు మన కదలికలు నిలిచిపోయాయి. ఓ వ్యక్తిని క్రిగోనూ పంపించాం. నెత్తిన పెట్టుకునే టార్చిలైట్ల కోసం అక్కడి నుంచి రెండు ఆక్సీ ఎసిటలీన్ సంచులు తీసుకురావాలని చెప్పాం. అవి బరువైనవి కావడంతో సరఫరా చేయడం కష్టమైంది. అదీగాక ఇక్కడివారు క్యూబన్లు లేకుండా ఏ పని చెప్పినా మొరాయిస్తున్నారు. జల విద్యుత్ కేంద్రంపై దాడికి అనుకూల స్థలం కోసం చేసిన అన్వేషణ ఫలించలేదు. పోరాటాల్లో పాల్గొన్న దళసభ్యులు బాగా అలసిపోయారు. కొన్ని రోజులపాటు సరదాగా ఆడుతూ, పాడుతూ గడిపేందుకు అప్పర్ బేస్‌కు వెళ్తామన్నారు.

పిజీ ప్రాంతంలోని నేతలతో-మసెంగో, కబీలాలకు, మొత్తంగా ఇక్కడి విప్లవ కారులతో టాంజానియా ప్రభుత్వానికి మధ్య చీకట్లు అలుముకున్నాయి. కబీలా, మసెంగోలు కిబంబాకు వెళ్లారు. మేం కోరినట్టుగా ఆయుధాలందించేందుకు టాంజానియా అధికారులు అంగీకరించలేదు. వెంటనే కబీలాను పంపాలని వారు కోరారు. ఇదే విషయాన్ని మా అధికారి చాంగా స్వయంగా చెప్పడంతో ధ్రువ పడింది. ఆయుధాల కోసం వెళ్లింది కూడా ఆయనే. అక్కడి ప్రభుత్వంతో కబీలా మాట్లాడే వరకూ ఎలాంటి సరఫరాలూ ఉండవని చెప్పారు. ఈ సమయంలోనే కాంగో రావడానికి కబీలా సీరియస్‌గా యత్నించారని తెలిసింది (మరోవైపు ఇందుకు ఆధారాలు లేవు). ఇదే సమయంలో ఓ సమస్యను పరిష్కరించే బాధ్యతపై ఆయన తిరిగి వెళ్లాల్సివచ్చింది. సరస్సు ప్రాంత స్థావరంలో పిజీ ప్రాంతానికి చెందిన కొందరు (విప్లవ ద్రోహుల్ని) మన దళాలు అరెస్ట్ చేశాయి. వారంతా యుద్ధ ప్రాంతంలో విప్లవ వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నారు. ఐతే, అక్కడ కారాగారం లేక పోవడంతో అరెస్టయిన వారిని ఉవీరాకు పంపారు. వాస్తవానికి ప్రతికూల ప్రాంతంలో పర్యటన కోసం వారిని వెంట తీసుకెళ్లాలన్నది ప్రణాళిక. వారిని పడవలోకి ఎక్కించారు. మొత్తమ్మీద మసెంగో నుంచి ఒకే ఒక్కసారి లెటర్ వచ్చింది. కాంగో విప్లవ నేతలు ఎలాంటి ప్రమాద స్థితిలో ఉందీ గుర్తు చేశారు. సెప్టెంబర్ 6న కిబంబా నుంచి ఆ లెటర్ వచ్చింది.

టూ-కామ్రేడ్ డాక్టర్ టాటు, మకుంగో :

కామ్రేడ్ డాక్టర్... మీకు శుభాకాంక్షలు. మిలటరీ విషయాల్లో మీ సలహాల్ని పాటించా. లులింబా-మకుంగో, కలొండ-కిబియే దళాల కార్యకలాపాల్ని కామ్రేడ్ ల్యాంబర్ట్ సమన్వయం చేస్తారు. కామ్రేడ్ కబీలాతో కలిసి నేను మీ దగ్గరికి రావాలనుకున్నా దురదృష్టకర పరిస్థితుల వల్ల కాల నిర్ణయం చేయలేకపోయాం. మేం కిబంబా చేరుకున్న ఐదు రోజుల తర్వాత వెంటనే రావాల్సిందిగా కోరుతూ టాంజానియా అధ్యక్షుడు నైరేరీ కబీలాకు కబురు పంపారు. దేశంలోని రాజకీయ పరిస్థితి మరీ అంత దారుణంగా ఏమీ లేదు. బాధ్యత లేని మనుషుల మధ్య తలెత్తిన కొన్ని వైరుధ్యాల్ని మనం పరిష్కరించగలమనే భావిస్తున్నా ఈ రోజు మేం కొందరు విప్లవ ప్రతీఘాతకుల్ని అరెస్ట్ చేశాం (అలీ చెప్పిన ముగ్గురు ఖైదీలు).

అందుకు స్థానికుల నుంచి ఎలాంటి ప్రతిఘటనా ఎదురుకాలేదు. పట్టుబడ్డవారి తప్పిదాలేంటో వారికి అర్థమయ్యాయి. ద్రోహి బెన్యే ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్నాడు. ద్రోహిగా మారినందుకు భారీ మొత్తంలో నిధులు అందుకుంటూ వివిధ ప్రాంతాల్లోని తన ఏజెంట్లకు పంపిస్తున్నాడు. విప్లవోద్యమాన్ని భూస్థాపితం చేసి, ఆ తర్వాత లియోపోల్డ్విల్లేలోని మన శత్రువులతో ఒప్పందం చేసుకోవాలన్నదే అతని లక్ష్యం. విప్లవాన్ని అణచివేయడంలో విజయం సాధిస్తే, ప్రభుత్వ ఏర్పాటుకు అతనికే అవ కాశమిస్తామని సామ్రాజ్యవాదులు హామీ ఇచ్చారు. భవిష్య ప్రభుత్వంలో తమ ఏజెంట్లందరికీ అవకాశం కల్పిస్తామన్నారు. కాంగోను నయా వలసగా మార్చుకో వాలన్నదే వారి లక్ష్యం.

తూర్పు ఆఫ్రికా రాజ్యాధినేతల (టాంజానియా, ఉగాండా, కెన్యా) సమావేశాన్ని బెన్యే ఉపయోగించుకున్నాడు. మా సమస్యలన్నీ లియోపోల్డ్ విల్లేతో పరిష్కరించు కుంటామంటూ వారికి నచ్చజెప్పాడు. లియోపోల్డ్ విల్లే ఒప్పందం కుదిరాక తూర్పు ఆఫ్రికా దేశాల సమాఖ్యలో చేరుతామంటూ నమ్మబలికాడు. దీనిపై మాట్లా డేందుకే కబీలాను దార్ ఏ సలామ్ పిలిపించారు. కబీలా వెంట దార్ ఏ సలామ్‌కు మా మనుషులెవరినీ అనుమతించలేదు. ఇలాంటి ఒప్పందానికి మేం ఎప్పటికీ అంగీకరించం. దీనిపై మీ రాయబారిని సంప్రదించాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాం.

ఈరోజు నేను ఉవీరా వెళ్తున్నాను. నాతోపాటు అలీ ఉంటారు తిరిగి వచ్చాక కిబంబా వెళ్తాను. నేను తిరిగి వచ్చేసరికి మీ నుంచి సమాధానం వస్తుందని ఆశి స్తున్నా ముఖ్యంగా ఈ సమస్యను పరిష్కరించేందుకు మీరిచ్చే సలహా.

ఆఫ్రికాలోని ముఖ్య నేతలెవరూ కాంగో సంపూర్ణ విముక్తి పట్ల ఆసక్తితో లేరన్నది మా అవగాహన. ఎందుకంటే.. కాంగో అధికార పగ్గాలు నిజమైన విప్లవకారుల చేతుల్లోకి వెళ్లే, ఆఫ్రికా దేశాలన్నీ మమ్మల్ని అనుసరిస్తాయన్నదే వారి భయం. ఏదిఏమైనా పరిస్థితి మరీ అంత నిరాశపరిచేదిగా లేదు. దీన్నుంచి మేం తప్పనిసరిగా బయటపడగలం. మీకు తెలిపిన వివరాల ఆధారంగా ఇలాంటి సమస్యల పరిష్కా రానికి మీ సలహా ఇవ్వగలరని ఆశిస్తూ..

ఈ లెటర్లో అనేక అసక్తికర అంశాల్ని ప్రస్తావించారు. బెన్యే చర్యలు, సామ్రాజ్య వాదులతో అతని సంబంధాలు, కబీలాపై దార్ ఏ సలామ్ నుంచి వస్తున్న ఒత్తిడి వగైరా.. క్యూబన్లతో స్నేహ సంబంధాల్ని గుర్తు చేయడం అభినందనీయం. విశ్రాంతి దశలో దానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం, శత్రువు వెనక్కి వెళ్తున్న సందర్భం. ప్రత్యుత్తరంలో ఈ విషయాల్ని వివరించా.

ప్రియమైన కామ్రేడ్... ఇపుడే మీ రాయబారి కామ్రేడ్ చార్లెస్ బెంబాతో మాట్లాడా. తాజా పరిస్థితిపై నా అవగాహన ఏంటో ఆయన ద్వారా మీకు తెలుస్తుంది. ఇక్కడ కొన్ని విషయాల్ని మీకు వివరిస్తా.. మనమిపుడు మైదాన ప్రాంతంలోనే కొనసాగడం సాధ్యమేనని నేను భావిస్తున్నా ఇటీవలే ముందండి ఫ్రంట్లో దాడి జరిపి ఏడుగురు శత్రు సైనికుల్ని చంపేశాం. అదే సంఖ్యలో ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నాం. న్యాంగీ నుంచి లులింబాకు, ఫోర్స్ నుంచి లులింబాకు వెళ్లే రెండు రహదారులపైనా దాడులు జరిపాం. ఈ ప్రాంతంలో మనం కఠినంగా ముందుకు వెళ్లే లులింబా సమీపం నుంచి షోంబే దళాల్ని తరిమి కొట్టగలమని భావిస్తున్నా దాంతో, మనకు సరస్సు వైపు మార్గం తెరుచుకుంటుంది. బరాకా, పిజీ ప్రాంత సమస్యల పట్ల నాకు అవగాహన ఉంది ఐతే, మన సరఫరాలు జరిపేందుకు నేరుగా వెళ్లే మార్గం ఎంతో ముఖ్యమైంది.

మీరు నాకు విన్నవించిన సమస్యలపై... టాంజానియా ప్రభుత్వంతో సంబంధాల విషయంలో.. మా మద్దతు మీకే ఉంటుందని విశ్వసించగలరు. మీతో మాట్లాడేందుకు ఆసక్తితో ఉన్నాను. సాధారణ సిబ్బందితో మీకున్న విభేదాల్ని అర్థం చేసుకోగలను. మరికొన్ని రోజుల్లో నేను మీ దగ్గరికి రాగలను. మీ ఫ్రంట్‌లోని మిగతా ప్రాంతాల్లోనూ పర్యటిస్తా నన్ను సరస్సు దగ్గరే ఉండాలని మాత్రం చెప్పొద్దు. ఇక్కడ నేను చేసేదంతా నా వృత్తి ధర్మం. దీర్ఘకాలికత పట్ల మీలాగే నేనూ ఆశా వాదిని. ఐతే, రాజకీయ, మిలటరీ నిర్మాణం పట్ల మనం ఎక్కువ శ్రద్ధ చూపాలి. మనం కొంత ప్రగతి సాధించాం. ఐతే, అది సరిపోదు. పోరాడుతూ ముందుకు వెళ్లడం ద్వారా మరిన్ని ఫలితాల్ని సాధించగలం.

"సైనికునికి యుద్ధ క్షేత్రమే గొప్ప పాఠశాల. శత్రు సైన్యమే మనకుండే పెద్ద ఆయుధాగారం." సరస్సును ఉపయోగించేందుకు మనకు అనుమతి లేదంటే యుద్ధ రంగంలో ఇంకా

కొనసాగాల్సిందే. కామ్రేడ్ ల్యాంబర్ట్స్ను సమన్వయకర్తగా నియ మించడాన్ని స్వాగతిస్తున్నా ఆయన పని మరింత కష్టం కానుంది. నా దృష్టిలో ఆయన ఫ్రంట్ కు కమాండర్‌గా ఉండటమే సరైంది. మనతో కలిసి పోరాటంలో పాల్గొన్న రువాండన్లది చురుకైన పాత్ర. కాంగోవాసులతోనూ వారు అలాగే ఉంటా రన్న మీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నా కెప్టెన్ జకారియాస్ సరైన వ్యక్తి. అతని వల్ల జరిగిన కొన్ని పొరపాట్లను కాలగమనంలో సరిచేసుకోగలరు.

రైతుల విషయంలో మనం తీసుకునే విధాన నిర్ణయానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ప్రజల మద్దతు లేకుండా ఎలాంటి విజయమూ వాస్తవం కాజాలదు. మనం ముఖాముఖీ కలుసుకున్నాక దీనిపై మీకు సుదీర్ఘంగా వివరించగలను.

విప్లవాభినందనలతో...టాటు"

నాలో ఆశావాదం మరోసారి ఉన్నత స్థితికి చేరుకుంది మా మధ్య విభేదాలు న్నప్పటికీ శత్రువుకైతే కొన్ని నష్టాలు కలిగించగలిగాం. కొన్ని కీలక ప్రాంతాల నుంచి శత్రువును వెనక్కినెట్టగలిగాం. ఈ రోజుల్లోనే నా కోసం వచ్చిన దూతలు మాతోనే ఉండిపోయారు. ఆరగోన్స్, ఫెర్నాండేజ్ మెల్, మార్గొల్లేస్ ఫ్రంట్‌లోనే ఉండి పోవడం నన్ను కలవరపరిచింది. వారు నన్ను తిరిగి క్యూబాకు రమ్మని గానీ, పోరాటాన్ని విరమించాలని గానీ ఒత్తిడి చేస్తారని భయపడ్డా. అవేవీ నా తలకెక్కవని భావించి, స్వయంగా పార్టీ కార్యదరే కాంగో రావడం కోసం తన పదవికి రాజీనామా చేశారని తెలిసింది. ఫిడేల్ అందుకు అనుమతిచ్చినట్టు అరగోన్స్ నాతో చెప్పారు. సైన్యంలో సీనియర్లయిన మార్గొల్లేస్, ఫెర్నాండేజ్‌ల విషయంలోనూ అదే జరిగింది. కమాండ్ను శక్తివంతం చేయాలని క్యూబాను కోరినందుకే ఇలా చేశారు. కరీం కూడా వచ్చేశారు. తనకున్న రాజకీయ, సాంస్కృతిక జ్ఞానంతో టామ్ స్థానంలో ఇక ఆయనే రాజకీయ విభాగాన్ని చూస్తారు. మొదటి ముగ్గురూ డాక్టర్ల రూపంలో రహస్యంగా దేశంలోకి ప్రవేశించారు. వారు మాతో కొనసాగుతారో లేదో తెలియదు. ఎందుకంటే వారు తెల్లనివారు. కాంగోవాసుల క్యాంప్‌లో పరిస్థితిని చక్కదిద్దేందుకు యత్నించగా సమస్యలు మొదలయ్యాయి.

అరగోన్స్ భారీ శరీరానికి తగ్గట్టుగా ఆయనకు స్వాహిలీ భాషలో 'టెంబో' (ఏనుగు) పేరు

నిర్ణయించాం. ఫెర్నాండేజ్ వ్యక్తిత్వానికి తగ్గట్టు సికీ (వినిగర్)గా, మిగతావారి పేర్లు మాత్రం భాషలోని అక్షరాల పట్టిక ఆధారంగా నిర్ణయించాం. టెంబో ఇచ్చిన లిస్ట్‌లో క్యూబా నుంచి వచ్చిన సాయుధుల సంఖ్య 120గా ఉంది. అందులో నలుగురు చనిపోగా, ఇద్దరు క్యూబాకు తిరిగి వెళ్లారు. కామేడ్ చాంగా పేరు కూడా లిస్ట్‌లో ఉంది. ఐతే, ఆయన కిగోమాలో ఉండి మనవాళ్లను సరస్సు దాటించే బాధ్యత నిర్వహిస్తున్నారు. ఇక మిగిలిన 113 మందిలో నలుగురు డాక్టర్లు కాగా, మిగతా వారంతా పోరాట యోధులే. ఇక్కడ ఏం చేయాలనుకున్నా తగినంత బలం మాకుంది. ఐతే, ఇక్కడ నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్ని ఎందుకు మార్చలేక పోయామన్నది విశ్లేషిస్తే అర్థమవుతుంది. పోరాట ప్రాంతాలు విస్తరించి ఉండటం, కార్యాచరణలో 30 నుంచి 40 మందికి మించి పాల్గొనలేకపోవడం. ఇందుకు మరో కారణమేమంటే దాదాపు మాలోని ప్రతి ఒక్కరూ ఏదో ఓ సమయంలో మలేరియా బారిన పడటం. కొందరైతే ఒకటికన్నా ఎక్కువసార్లు. దాంతో ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టలేకపోయాం. అదే జరిగివుంటే కాంగో కామ్రేడ్లు తమ పరిస్థితులకు తగ్గట్టుగా కొత్త తరహా సైనిక నిర్మాణం చేపట్టివుండేవారు.

క్యూబాకు తిరిగి వెళ్లాలనుకున్న మన ముగ్గురు కామ్రేడ్లు (అబ్దల్లా, అంజలీ, బాటి) ఇక్కడే పూర్తికాలం పని చేస్తామనడంతో మన నైతికత మరింత బలపడింది.

చైనా, బల్గేరియాల్లో శిక్షణ పొందిన కార్యకర్తలతో విముక్తి సేనను బలోపేతం చేసేందుకు ప్రయత్నం జరిగింది. ముందుగా.. వారందరినీ ఇక్కడ ఉన్న వారి కుటుంబాలతో పక్షం రోజులపాటు గడిపి రావాల్సిందిగా పంపించారు. ఐతే, వారంతా విప్లవం కోసం సిద్ధాంతపరంగా శిక్షణ పొందినవారే తప్ప తమ ప్రాణాల్ని పణంగా పెట్టి యుద్ధంలో పాల్గొనేవారు కాదు. వారు తమకున్న అపార విప్లవ పాండిత్యంతో కార్యకర్తల్ని ప్రోత్సహించేందుకొచ్చారు. అందుకోసం వారు ఆరు నెలలపాటు సిద్ధాంత శిక్షణ తీసుకున్నారు. ఈ పద్ధతిన పోరాటానికి సిద్ధం చేయ డాన్ని మోసపూరిత విప్లవ నేరంగా చూడాలి.

దాదాపు ఇక్కడి అన్ని బృందాలు ఇలాంటి ప్రయత్నమే చేశాయి. వారు శిక్షణ పొందుతుంది చైనా, బల్గేరియా, రష్యా. ఎక్కడైతేనేం.. శిక్షణ పొందిన ఆ విద్యార్థులంతా కాంగోలోని

పెటీ బూర్జువా కుటుంబాల నుంచి వచ్చిన వారే. దాంతో, వారనుసరించే పోరాట పద్ధతులన్నీ వలసవాదుల్ని పోలివున్నాయి. ఫ్రెంచ్ మాట్లాడే లేదా రాజకీయ ఆధిపత్య కుటుంబాలకు చెందిన వారినే అందుకు ఎంచుకున్నారు. వారంతా యూరప్ దేశాల చెడు సంస్కృతిని వంటపట్టించుకున్నవారే. విప్లవ స్ఫూర్తి ఉండే కార్మికవర్గం నుంచి ఏ ఒక్కరూ వారిలో లేరు. "విప్లవ కార్యకర్తలుగా ముసు గేసుకున్న వారంతా మార్క్సిజాన్ని పైపైన తడిమిన వారే. ఆధిపత్యం కోసం కుట్రలు పన్నడం, క్రమశిక్షణా రాహిత్యంలాంటి అవలక్షణాలు వారిలో స్పష్టంగా కనిపిస్తాయి. సమాజం కోసం తమ ప్రాణాల్ని పణంగా పెట్టే యోధుల్ని నాయకత్వం గుర్తించక పోవడంతో పోరాట కేంద్రాలు విప్లవకారులే లేని దుస్థితికి నెట్టబడ్డాయి."

రాలిపోయే ఆకుల్లాంటి నకిలీ సరుకును పక్కకు నెట్టేందుకు చివరి రోజుల్లో మాకు అవకాశం చిక్కింది.

**********

కటింగా నుంచి లలింబా వెళ్లే రోడ్డుపై దాడులు చేయక తప్పలేదు. ఒంటరియైన శత్రు దళాలు మరోసారి లోనికి చొరబడకుండా దాడుల్ని రెండింతలు చేశాం. పోంబే, నానేల నేతృత్వంలో తిరిగి పోరాటం ప్రారంభించాం. ఐతే, ఏదైతే కీలక ప్రాంతంగా భావించి ముందుకు సాగుతున్నామో అక్కడే శత్రువు తన బలగాల్ని పెంచుకొని అడ్డుకుంటున్నాడు.

లులింబా వెళ్లేందుకు సిద్ధమయ్యాను. ముందుగా పరిస్థితిని సమీక్షించేందుకు అజీమాతోపాటు ఓ చిన్న బృందాన్ని పంపించాం. మేఘాలు దట్టంగా కమ్మి కున్నాయి. ఆగి ఆగి కురుస్తున్న వర్షం వల్ల దారి పక్కన ఉన్న ఇళ్లల్లోకి వెళ్లి రక్షణ పొందాం. మలుపులు తిరిగిన రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. పోరాట ప్రాంతం నుంచి శబ్దాలు వినిపిస్తున్నాయి. యుద్ధ విమానాలు అటువైపుగా వెళ్లడం కని పించింది. అక్కడేం జరిగిందో తెలుసుకోవడానికి మాకు చాలా రోజులు పట్టింది. శత్రు దళాలు మా స్థావరాల్ని ట్యాంకులతో కూల్చివేసినట్టు మోజా నివేదించారు. శత్రు దళాలు లులింబాలోకి ప్రవేశించాయి. ఇంతకుముందున్న సమాచారం ప్రకారం అక్కడ శత్రు సైనికులు 53 మందే. ఇపుడు శత్రువు మన ఆధీన ప్రాంతం లోకి చొచ్చుకురావడంతో ఆ సంఖ్య పెరిగినట్టుగా అర్థమవుతోంది. శత్రు దళాలు లులింబాకే పరిమితం కాలేదు. మనం ఆక్రమించిన కీలక ప్రాంతాలపై దాడులకు సిద్ధమవుతున్నాయి. శత్రు శిబిరంలో మనకు వేగులు లేకపోవడంతో సరైన సమా చారం అందుకోలేకపోయాం.

మధ్యాహ్నానికి అజీమా మమ్మల్ని చేరుకున్నారు. తన పర్యటన ముగించుకుని తిరిగి వచ్చారు. రోడ్డు వెంట లులింబా గ్రామం వరకూ ఆయన ప్రయాణం సాగింది. ఆయన వెళ్లిన దారిలో శత్రు సైనికులెవరూ కనిపించలేదు. ఆయన వెళ్లిన రోడ్డు మార్గం ప్రతిఘటన దళాలు స్వాధీనం చేసుకున్న పర్వత ప్రాంతానికి సమాం తరంగా ఉంది. ఆ రోడ్డు చక్కగా వెళ్లి ఫ్రంట్ డీ ఫోర్స్ నుంచి వచ్చే ప్రధాన రహదారితో కలుస్తుంది. అలాగే కొనసాగి పర్వతాల కింది భాగాన ముగుస్తుంది. అది పర్వతారోహణకు అత్యంత అనుకూల ప్రాంతం.

జంక్షన్ దాటి కి.మీ. దూరం వరకూ తానెలా వెళ్లింది ఆయన వివరించారు. అది కింబీ నదికి వెళ్లే ముఖ్యమైన రహదారి. మనుషులెవరూ కనిపించలేదు. అక్కడి ఓ చర్చి దాకా వెళ్లారు. ప్రస్తుతమది శత్రు స్వాధీనంలో ఉంది. అక్కడి నుంచి ఆరు కి.మీ. దూరంలో బారికేడ్లు కనిపించాయి.

శత్రు సైన్యం శతఘ్నులతో 17 రౌండ్ల కాల్పులు జరిపింది. ఆ శకలాలు తమ సమీపానికి వచ్చి పడ్డట్టు వారు చెప్పారు. అటువైపున శత్రు స్థావరాలు విస్తరించి ఉండటాన్ని మనవాళ్లు గుర్తించారు.

మేం సుదూర ప్రయాణం సాగించాల్సివుండటంతో విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించాం. మైదాన ప్రాంతంలోని రోడ్డు మార్గం ద్వారా మేమక్కడికి వస్తున్నా మంటూ తెలిపేందుకు ఓ మనిషిని లుబోండ్వాకు పంపించాం. మరుసటి రోజు సహాయక బృందాలు మమ్మల్ని చేరుకున్నాయి. పర్వత ప్రాంత లులింబా స్థావరం వరకూ వారు మాకు తోడుగా వచ్చారు.

మేం చాలా దూరం ప్రయాణించాం. అడవిలో రైతులు నివాసముండే అనేక గ్రామాల్ని చూశాం. అవన్నీ పర్వతాల పక్కనే ప్రధాన రహదారికి రెండు, మూడు కి.మీ. దూరంలో ఉన్నాయి. అక్కడ కొంత నీటి సౌకర్యముంది. రైతులు తమ ఇళ్లను పురాతన పద్ధతుల్లో నిర్మించుకున్నారు. రోడ్డు సమీపంలోనే వారి పంటపొలా లున్నాయి. రైతులతో సుదీర్ఘంగా ముచ్చటించాం. అక్కడ కొందరు అనారోగ్యంతో బాధ పడటం చూశాం. మా దగ్గర మందులు లేవు. మకుంగో నుంచి ఓ డాక్టర్ను పంపాలని కోరా.

ల్యాంబర్ట్ స్థావరంలో చిన్నచిన్న గుడిసెల సమూహముంది. ఇక్కడ పేల సమస్య తీవ్రంగా ఉంది. స్థావరం రోడ్డు పక్కనే ఉంది. కనిపించకుండా చేసేందుకు మధ్యలో చేలూ, చెట్లు ఏమీ లేవు. రక్షణ కోసం కందకాలు గానీ, షెల్టర్లు గానీ లేవు. రెండు విమాన విధ్వంసకాలు మాత్రం ఉన్నాయి. ఐతే, యుద్ధ విమానాలు కనిపించినపుడు దగ్గరలోని లోయల్లోకి పరుగెత్తడమే ఇక్కడి వారికి తెలిసిన విద్య అప్పటివరకూ చెప్పుకోదగిన వైమానిక దాడులేమీ జరగలేదు. కొన్ని రాకెట్ లాంచర్లు కూడా ఉన్నాయి (కందకాల నిర్మాణం ఏమాత్రం పటిష్టంగా లేదు. వాటిని తవ్విన క్రాంగో మిత్రులు సైతం వాటిలో రక్షణ పొందేందుకు ఇష్టపడలేదు). ఈ స్థావరం రోడ్డు నుంచి చూస్తే ఎత్తయిన ప్రాంతంలో ఉండటంతో కొంతమేరకు రక్షణగా ఉంది. స్థావరం దగ్గరికి శత్రువు చేరుకోకుండా పైనుంచే దాడి చేయగల వీలుంది. ఐతే, శత్రు సైనికులు పర్వతపు అడుగు భాగానికి చేరుకుంటే మాత్రం కనిపించరు. అక్కడికి చేరుకోగలిగితే తమకు ఎలాంటి నష్టం జరకుండా కాల్పులు జరిపే అవకాశం శత్రువుకే ఉంటుంది. స్థావరం దగ్గర కొద్దిమందే ఉన్నారు. నిర్ణయం తీసుకునే అధికారులెవరూ

అక్కడ లేరు. లుబోండ్జావైపు వెళ్లాలనుకున్నాం. కానీ, మమ్మల్ని కలిసేందుకు కమాండర్ వస్తున్నట్టు సమాచారమందింది. మరుసటి రోజే అతను వచ్చేశారు. తన కూతురు అనారోగ్యంతో ఉన్నందున ల్యాంబర్ట్ పిజీ వెళ్లినట్టు తెలిపారు. ఇక అక్కడ మిగిలింది సాధారణ సిబ్బందే. దళాల్ని ఆదేశించే అధికారం వారికి లేదు. ఆహార సరఫరా బాధ్యత రైతులే నిర్వహిస్తున్నారు. అందుకోసం వారు 15 కి.మీ. నడవాల్సి వస్తోంది. ఆహారంలో మార్పు కోసం అప్పుడప్పుడూ వేటకు వెళ్తున్నారు.

రైతులు ఆహారం తేగానే (ఎక్కువభాగం కాసవా దుంపలే) ఎవరికివారు వాటిని నంజుకొని బుకాలీ చేసుకుంటారు. వారికి సమిష్టిగా తినే సంప్రదాయం లేదు. ఎవరి ఆహారాన్ని వారే తయారు చేసుకుంటారు. ఆ సమయంలో క్యాంప్ అంతా ఓ వంట గదిని తలపిస్తుంది. ఆహార పంపిణీకి ఓ క్రమపద్ధతి అంటూ ఏమీ లేదు. వారంతా నన్ను మాట్లాడాల్సిందిగా కోరారు. దాదాపు వందమంది వరకూ ఉన్నారు. ఐతే, వారిలో అందరూ సాయుధులు కాదు. నేను నా సహజ ధోరణిలో గలగలా మాట్లాడేశా. "సాయుధులంతా సైనికులు కాదు, కేవలం సాయుధులు మాత్రమే. విప్లవ సైనికుడు యుద్ధంలోనే తయారవుతాడు". అప్పుడక్కడ యుద్ధం లేదు. వారందరినీ కొండ దిగి రావాలని కోరా. యుద్ధం కఠినమైనదని, వెంటనే శాంతిని ఆశించలేమని చెప్పా. "త్యాగాలు లేకుండా విజయం చేకూరదు." ఆధునిక యుద్ధాల్లో దవా అన్ని వేళలా పని చేయదని, యుద్ధాల్లో మరణాలు సహజమని చెప్పా ఫ్రెంచ్ భాషలో నాకున్న ప్రాథమిక జ్ఞానంతోనే వివరించా. నా మాటల్ని చార్లెస్ బెంబా స్థానిక కిబెంబే భాషలోకి అనువదించారు.

ల్యాంబర్ట్‌తో చర్చల కోసం పిజీ వెళ్లేందుకు నిర్ణయించా. మొదట మేం పిజీలోని మైదాన ప్రాంతం లుబోండ్జాకు చేరుకున్నాం. అది ప్రధాన రహదారికి 15 కి.మీ. దూరంలో ఉంది. రైతులు మమ్మల్ని సాదరంగా స్వాగతించి మంచి భోజనం వడ్డించారు. అక్కడి వాతావరణం ప్రశాంతంగా, రక్షణాత్మకంగా ఉంది. అక్కడి దళాలకు ఆలుగడ్డలు, ఉల్లి తదితర సాధారణ ఆహారం దొరుకుతుండటంతో హాయిగా గడిపేస్తున్నాయి. మరుసటి రోజే మేం బయలుదేరాం. పది కి.మీ. నడిచాక ఓ లారీ కనిపించింది. లుబోండ్జాకు దళాల్ని తరలించేందుకొచ్చిన ఆ లారీ, తిరిగి వెళ్లేటపుడు మమ్మల్ని పిజీకి తీసుకెళ్లింది. ఆ లారీలో తాగుడు వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన

ఓ వ్యక్తిని చూశాం. అతడు భీతి గొలిపేలా వాంతులు చేసుకుని, మరుసటి రోజే పిజీలోని హాస్పటల్లో శవమై కనిపించాడు. అక్కడ డాక్టర్లుగానీ, వైద్య సహాయకులు గానీ ఎవరూ లేరు.

దాదాపు 40 కి.మీ. దూరం రోడ్డుపై ప్రయాణించాం. మేం వెళ్లిన దారిలో అనేక విషయాల్ని పరిశీలించాం. మొదటిది, మా దారిలో ఉన్న గ్రామాలన్నింటా పెద్ద సంఖ్యలో సైనికులు కనిపించారు. ప్రతి గ్రామంలోనూ ఓ అధికారి ఉన్నారు. వారు తమ సొంత ఇళ్లల్లో లేదా స్నేహితుల ఇళ్లల్లో నివాసముంటున్నారు. వారికి పౌష్టికాహారంతోపాటు మందు సరఫరా జరుగుతోంది. రెండోది, పరిస్థితిని తమ అదుపులో ఉంచుకునేలా వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. భుజాలకు రైఫిళ్లు తగిలించు కొని గ్రామాల చుట్టూ తిరుగుతున్నారు. మూడోది, ల్యాంబర్ట్-మౌలేస్ మనుషుల మధ్య ఎడం బాగా పెరిగింది. ఒకరికొకరు కుక్కలూ, పిల్లుల్లా తయారయ్యారు.

చార్లెస్‌ను చూడగానే మసెంగో అనుచర అధికారి ఒకరు మమ్మల్ని గుర్తించారు. పిజీ ఓ చిన్న పట్టణం. ఐతే, కాంగోలో నేను చూసిన వాటిలో అదే పెద్ద పట్టణం. అది రెండు భాగాలుగా ఉంది. ఓ చిన్న భాగంలో పురాతన నిర్మాణాలతోపాటు కొన్ని ఆధునిక భవంతులున్నాయి. ఇక్కడ తీవ్రంగా గాయపడ్డవారితోపాటు సైనికు లుంటున్నారు. రెండో భాగంలోని ఇళ్లు పేదల పూరి గుడిసెల్ని తలపిస్తాయి. ఇక్కడే జనాభా ఎక్కువగా ఉంది. వీరిలో ఎక్కువ భాగం, ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కాందిశీకులే. ఇక్కడ నీటి సౌకర్యం, పరిశుభ్రత లోపించాయి.

పిజీ. సరస్సుకు ఎగువన బరాకాకు 37 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ కొన్ని పంట పొలాలున్నాయి.

వీరికి ఉన్న ఒకే ఒక్క రక్షణ పరికరమెల్లా విమాన విధ్వంసకం. దాన్ని గ్రీసుకు చెందిన కిరాయి సైనికుడు నిర్వహిస్తున్నాడు. లులింబాలో అతన్ని బందీగా పట్టుకున్నారు. జనరల్ మౌలేస్ నుంచి మాకు సాదర స్వాగతం లభించింది. ల్యాంబర్ట్‌కూ ఆయనకూ మధ్య విభేదాల్ని పరిష్కరించేందుకే నేనక్కడికి వెళ్లానన్న విషయం ఆయనకు తెలుసు. ల్యాంబర్ట్ కూడా నాతో స్నేహంగానే వ్యవహరించారు. వారిద్దరి ఆతిథ్యాన్ని స్వీకరించాం. ఐతే, వారిద్దరికీ నేను బయటి వ్యక్తిని. దాంతో, నేను యుద్ధ విషయాలకే పరిమితమయ్యాను. మిగతా విషయాల్ని ప్రస్తావించలేదు.

వారిద్దరూ ఒకరినొకరు గౌరవిస్తూనే మాట్లాడారు. నా మాటల్ని జనరల్ శ్రద్ధగా విన్నారు తన అనుయాయునికి స్వాహిలీలో (ఇతనికి ఫ్రెంచ్ రాదు) ఆదేశించారు. మ్యూంగాలో జరిగిన ప్రధాన పోరాటాల గురించి వివరంచారు. ఉత్తర దిశగా 200 కి.మీ. దూరాన ఉన్న ఆ పట్టణాన్ని ఈ మధ్యే స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో వారి దగ్గర చెప్పుకోదగిన ఆయుధాలేమీ లేవు. బెల్జియన్ మతాధికారి నుంచి స్వాధీనం చేసుకున్న ఓ షాట్ గన్‌తోపాటు మరో ఆయుధం. దాంతో, మిగతా గ్రామాల్ని ఆక్రమించేందుకు మరింతముందుకు వెళ్లలేకపోయారు. ఇద్దరిని బందీలుగా పట్టుకున్నారు. ఈ విషయం చెబుతూ ఇలా అన్నారు. "మీకు తెలుసు. ఇక్కడ క్రమశిక్షణ ఏమంతబాగాలేదని, ఇక్కడికి చేరుకోకముందే వారిని చంపేశారు"

జనరల్ మౌలేన్‌తోపాటు కల్నల్ కూడా పాతకాలపు యోధులే. వీరిద్దరూ ప్యాట్రిస్ లుముంబాతో కలిసి విముక్తి పోరాటంలో పాల్గొన్నారు. ఈ వివరాల్ని జనరల్ సలహాదారే నాకు వివరించారు. వీరిద్దరూ నిఖార్సైన విప్లవకారులనీ, వీరు ప్రారంభించిన పోరాటంలోకే మసెంగో, కబీలాలు వచ్చి చేరారని ఆయన తెలిపారు. వారు తమ సొంత పద్ధతుల్లోనే వెళ్తున్నారంటూ మసెంగో, కబీలాలపై మండి పడ్డారు.

తమకు క్యూబన్లు కావాలంటూ కసెంగో, పీజీ నేతలు కోరారు. మాకున్న కొద్దిమందినీ ఇంతటి విస్తృత ప్రాంతంలో పంపిణీ చేయడం వీలుపడదని చెప్పా ఐనా, ఒకరిద్దరు క్యూబన్ల ద్వారా పరిస్థితి ఒక్కసారిగా మారిపోతుందన్న భావన సరైంది కాదని వివరించా. సరస్సు దగ్గరికెళ్తే మెషిన్గన్స్, ఫిరంగులు, మోర్టార్లను ఉపయోగించడంలో మా కామ్రేడ్స్ మీకు శిక్షణ ఇస్తారని చెప్పా.

బరాకా పక్కన తన సొంత గ్రామం ఎంబోలోకు రావాల్సిందిగా జనరల్ ఆహ్వానించారు. దౌత్య మర్యాద కోసం అంగీకరించా. ఐతే, లులింబా ప్రాంతానికి వెళ్లాల్సి వున్నందున అదే రోజు తిరిగి రావాలని చెప్పా. మేమక్కడికి వెళ్లడానికి ముందు పీజీలో తిరిగాం. గాయపడి కసెంగో నుంచి వచ్చిన ఓ బాధితుణ్ణి చూశా. బుల్లెట్ అతని కండరాల్లోకి చొచ్చుకుపోయింది 15 రోజులుగా ఎలాంటి చికిత్సా లేక పోవడంతో కుళ్లి వాసన పట్టింది. ఆలస్యం చేయకుండా కిబంబా పంపమని సలహా ఇచ్చా. అక్కడ డాక్టర్లున్నందున అతనికి చికిత్స చేస్తారని చెప్పా. మేం ఆ దారిలోనే వెళ్తున్నందున

బరాకా వరకూ తీసుకెళ్తామని చెప్పా. ఐతే, వారతన్ని పిజీలోనే వదిలేశారు. లారీలో మా వెంట పెద్ద ఎస్కార్ట్ను పంపేందుకే ఎక్కువ శ్రద్ధ చూపారు. ఆ తర్వాత అతన్ని గురించి నాకేమీ తెలియలేదు. అది అతనికి చాలా చెడ్డ సమయమని అర్థమైంది.

జనరల్ మౌలేన్ సైనిక దుస్తులు ధరించారు. తలకు పులి చర్మం కప్పిన హెల్మెట్ పెట్టుకున్నారు. చూసేందుకు హాస్యాస్పదంగా కనిపించారు. ప్రతి మలుపులోనూ ఆగి ఆగి నెమ్మదిగా నడవసాగారు. బరాకా చేరుకున్నాం. అది సరస్సు ఒడ్డున ఉన్న చిన్న పట్టణం. ఇప్పటికే ఎన్వోసార్లు గుర్తు చేసిన నిర్మాణరాహిత్యం అక్కడా ఉంది. కాలంలో కాస్త వెనక్కి వెళ్తే బరాకా ఓ సంపన్న పట్టణం అక్కడొక కాటన్ ఫ్యాక్టరీ ఉండేది. యుద్ధ సమయంలో ప్రతిదీ ధ్వంసమైనట్టే దానిపైనా బాంబుల వర్షం కురిసింది. ఎంబోలో.. సరస్సుకు ఉత్తర దిశగా 30 కి.మీ. దూరంలో ఉంది. తీరానికి సమాంతరంగా ఉన్న పాడుబడ్డ రోడ్డుపై మా ప్రయాణం సాగింది. ప్రతి కి.మీ. దూరానికీ ఓ చెక్‌పోస్ట్ సిగ్నల్ ఉంది. ప్రయాణీకులు ముందుకు వెళ్లాలంటే చెక్‌పోస్ట్ దగ్గర తమ గుర్తింపు పత్రాల్ని చూపించాలి. అక్కడ పెట్రోల్ కొరత ఉండటంతో వివిధ పోరాట బృందాలు ఆ దారిలో వెళ్లినట్టు అర్థమైంది. వింబోలో దగ్గర మా ఎస్కార్ట్ నుంచి ముగ్గురు మారిపోయారు. వారు పిజీ తిరిగి వెళ్లాలి. వారి స్థానంలో వేరే ముగ్గురు చేరారు. ఈ సందర్భంగా జనరల్ ముందు పెరేడ్ నిర్వహిం చారు. జనరల్ ఉపన్యాసమిచ్చారు. ఇదంతా నాకు చెడ్డ నవ్వులాటగా అనిపించింది. మరో వైపు విసుగ్గానూ ఆకలిగానూ ఉంది. పెరేడ్‌కు ఇంచార్జ్‌గా ఉన్న అధికారి గతంలో బెల్జియన్ సైన్యంలో చేశారు. ఇక్కడి ఏ సైనికుడైనా సరే తమ శత్రు సేనల చేతికి చిక్కి ఆ తర్వాత వారితో కొనసాగాలంటే వారి సైనిక సంప్రదాయాలన్నీ నేర్చుకోవాల్సిందే. అవన్నీ ఎంతో కఠినంగా ఉంటాయి. యుద్ధ ఎత్తుగడల్ని నేర్చుకోవడం కన్నా ఇలాంటి పనికిమాలిన విషయాల కోసమే ఎక్కువ సమయం వృథా చేస్తారు.

చివరగా వారంతా తలోదారిన వెళ్లారు. అలసటగొన్న నన్ను విశ్రాంతి కోసం తమ ఇంటికి తీసుకెళ్లారు జనరల్. అదే రాత్రి పిజీకి తిరిగివెళ్లాం. మరోసారి విడిచి వెళ్తున్నట్టు ల్యాంబర్ట్‌కు చెప్పా. అక్కడ క్రమం తప్పిన విషయాలు చాలా ఉన్నాయని, సరి చేయాలంటూ ఆయనకు సూచించా. అందుకు బదులుగా.. అలాంటివి తమ సెక్టార్‌లో లేవనీ, జనరల్ సెక్టార్‌లోనే అలాంటివి

ఉన్నాయంటూ సమాధానమిచ్చారు.

మరుసటి రోజు మా కోసం ఓ జీపు సిద్ధం చేశారు. ఐతే, కొద్ది సేపటికే పెట్రోల్ అయిపోవడంతో కాలినడకన వెళ్లక తప్పలేదు. సాయంకాలం విశ్రాంతి కోసం ల్యాంబర్ట్ స్నేహితుని ఇంటికెళ్లాం. ఆయన పోంబే (మత్తు పానీయం) చిల్లర వ్యాపారి. సమీపంలో ఏదైనా వేట జరుగుతుందేమో చూసొస్తానంటూ ల్యాంబర్ట్ వెళ్లిపోయారు. కొద్దిసేపటికే ఓ వేట జంతువుతో తిరిగి వచ్చారు. సాదాసీదా భోజనంతోపాటు కొంత మాంసం తీసుకున్నాం. ల్యాంబర్ట్ భోజనం ఆలస్యంగా జరిగింది. ఆయన దగ్గర పోంబే వాసన గుప్పుమంది. మాటతీరు మారిపోయింది.

ల్యాంబర్ట్ దళాల్లో కొత్తగా చేరిన బృందాల్ని కలిశాం, 15 నుంచి 20 మంది వరకూ ఉన్నారు. తమకు ఆయుధాలు లేనందున పోరాటం నుంచి తప్పుకుంటామన్నారు. మా సామాన్లు మోసుకుంటూ లుబోండ్లా వరకూ మాకు తోడుగా వచ్చారు. వారు కొంతకాలం కూలీలుగా వ్యవహరించి ఆ తర్వాత స్వేచ్ఛా జీవితం లోకి వెళ్లనున్నట్టు అర్థమైంది.

ల్యాంబర్ట్‌తో భవిష్యత్ ప్రణాళికలపై చర్చించా. సాధారణ సిబ్బందిని లుబోం డ్లాకు తరలించాలంటూ ప్రతిపాదించారు. శత్రువుకు 25 కి.మీ. దూరంలో అది సరైంది కాదని, ఆయుధాల్ని మాత్రం అక్కడికి తరలించగలమని, మేం ఫ్రంట్‌లోనే కొనసాగుతామని చెప్పా. అందుకు ఆయన అయిష్టంగానే ఒప్పుకున్నారు. మరుసటి రోజు వారి ఆయుధాగారాన్ని చూపించారు. లుబోండ్లాకు 5 కి.మీ. దూరంలోని రహస్య ప్రాంతం. ఆ సమయంలో కాంగోలో పెద్ద సంఖ్యలో ఆయుధాల్ని కలిగివున్న స్థావరం అదే. అందులో కొన్ని శత్రువు బలహీనంగా ఉన్న సమయంలో స్వాధీనం చేసుకున్నవి. వాటిలో ఒక 60 ఎం ఎం ట్యాంక్ విధ్వంసకంతోపాటు బెల్జియన్ రాకెట్ లాంచర్లు, 50-మోడల్ మెషిన్ గన్స్ ఉన్నాయి. పిజీ కన్నా ఇక్కడికే ఆయుధాల సరఫరా ఎక్కువగా జరిగింది.

మైదాన ప్రాంతానికెళ్లి ల్యాంబర్ట్ మనుషుల్ని కలవాలన్నది మా ప్రణాళిక. కలోండా-కిబియే, కేలిగ్నిటే దళాల ద్వారా కొన్ని దాడులు జరిపి శత్రు దళాల్లోకి కొత్తగా ఎవరూ చేరకుండా చేయాలనుకున్నాం. రోడ్డుపై దాడుల ద్వారా రెండు లక్ష్యాల్ని సాధించాలనుకున్నాం.

ఒకటి, లులింబా చుటూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయడం, రెండోది, శత్రు దళాల్లోకి కొత్త సభ్యులు చేరకుండా అడ్డుకోవడం. అప్పటికే లులింబా-కబేంబర్ రోడ్డుపై రిజర్వ్ దళాలున్నాయి. అవి ల్యాంబర్ట్ కమాండ్ కిందే పని చేస్తున్నాయి.

మా లక్ష్యాల్ని నెరవేర్చుకోవడం కోసం అంతా సిద్ధం చేసుకున్నాం. ఐతే, లుబోండ్జా గ్రామాన్ని విడిచి వెళ్లలేకపోయాం. ఆ సమయంలో రెండు టీ-28, రెండు బీ-26 రాకెట్లు గ్రామం మీదికి దూసుకువచ్చాయి. మెషిన్ గన్స్‌తో కొన్ని వాహనాలపై కాల్పులు జరిగాయి. ఈ దాడిలో ఆరు ఇళ్లు ధ్వంసం కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 'దవా శక్తి వల్లే నష్టం తక్కువగా జరిగిందంటూ కమాండర్ నాతో అన్నారు. ఇద్దరికి మాత్రమే స్వల్ప గాయాలయ్యాయంటూ ఉదహరించారు ఆయుధాలు గురి తప్పినపుడు నష్టం తక్కువగానే ఉంటుందని వివరించేందుకు అది తగిన సమయం కాదని వదిలేశా...

స్థావరానికి చేరుకోగానే సభలూ, సమావేశాలూ ప్రారంభమయ్యాయి. వివిధ కారణాల వల్ల మైదాన ప్రాంతానికి వెళ్లడం సాధ్యం కాదని ల్యాంబర్ట్ చెప్పారు. తమ దగ్గరున్న 350 మందికి 67 రైఫిళ్లు మాత్రమే ఉన్నాయన్నారు. వారంతా వివిధ ప్రాంతాలకు విడిపోయారన్నారు. దాంతో, దాడి చేయడానికి తగినన్ని బలగాలు లేవని తేల్చి చెప్పారు. వెంటనే తాను విశ్రాంత దళాల దగ్గరికెళ్లి వారిలో క్రమశిక్షణ పెంపొందిస్తానన్నారు.

ఇక్కడ మా పని ముందుకు సాగాలంటే మైదాన ప్రాంత పర్యవేక్షణ కోసం ఓ బృందాన్ని పంపించాలని, వారితో నేనూ వెళ్తానని చెప్పా. మరుసటి రోజు ఉదయమే మొదటి బృందంతో వెళ్లా, కొంత దూరం వారితో ప్రయాణించి ఆ తర్వాత కబేంబేర్ స్థావరానికెళ్తానని, తిరిగి వెనక్కి వస్తానని చెప్పా మేం వెళ్లిన గ్రామమే లులింబా అనుకున్నాం. అక్కడ ఎవరూ లేరు. దాంతో, కింబీ నది దిశగా ముందుకు సాగాం. పట్టణానికి రెండు కి.మీ. దూరంలో దళాల్ని కలిశాం. వారంతా దాడుల్లో పాల్గొన్న వారే. ఐతే, మేం లులింబా అనుకున్నది వాస్తవానికి లులింబా కాదని తెలిసింది. మరో 4 కి.మీ. దూరాన కింబీ నది తీరాన లులింబా ఉందన్నారు. కలొండాకిబయే నుంచి ల్యాంబర్ట్కు ఓ సువార్త అందింది. అక్కడి శత్రు స్థావరాలన్నీ ధ్వంసం కాగా, శత్రు దళాలు అడవిలోకి

పారిపోయాయన్నది సమాచారం. దాన్ని విశ్వసించిన ల్యాంబర్ట్ మన దళాల్ని ముందుకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు. ఐతే, వారు ముందుకు కదలగా శత్రు దళాలు తారసపడ్డాయి. గ్రామ సమీపంలో డ్రిల్ నిర్వహిస్తున్నాయి. మన శిక్షణ దళాలతో స్వల్ప పోరాటం జరిగింది. శత్రు దళాల సంఖ్య 150 నుంచి 300 వరకు ఉంటుందని మన దళాలు అంచనా వేశాయి. వీలైనంత ఎక్కువ సంఖ్యలో మన దళాల్ని సమీకరించి, మనం నిర్దేశించుకున్న ప్రాంతానికి శత్రు దళాల్ని ఆకర్షించాలని వ్యూహం పన్నాం. దీనికన్నా ముందు ఓ బలమైన స్థావరాన్ని ఏర్పాటు చేయాలని సూచించాం. ల్యాంబర్ట్తో వచ్చే 350 మంది కోసం వేచి చూశాం. వెనక్కి వెళ్లి లులింబాకు 4కి.మీ. దూరంలో మిషన్ క్యాంప్‌కు చేరుకున్నాం. ల్యాంబర్ట్ నేతృత్వంలో క్యాంప్ నేతలు చర్చలు జరిపి ఓ నిర్ణయానికి రాగలరని భావించాం.

**********

"మనకు అవకాశమున్నపుడు వనరుల్ని ఎందుకు ఉపయోగించకూడదు? మన కర్తవ్యం కోసం కనీస సమయం కూడా అవసరం లేదా? విందుకంత్ర అమిత్రవేగం? మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, బొలీవర్, మార్టి అలా ఎందుకు వెళ్లలేదు? తగిన సమయం కోసం వారు దశాబ్దాలపాటు ఎందుకు వేచిఉన్నారు?"

మీరు ఓపిగ్గా విశ్లేషించుకుంటే నేను చేప్పేది సరైందని ఒప్పుకోగలరు. మీరు ఇందుకు పూర్తిగా భిన్నమైన నిర్ణయం తీసుకున్నా నేను బాధపడను. మీ పట్ల నాకున్న గాఢమైన అభిమానంతో, మీ అత్యున్నత మేధస్సు, దోషరహితమైన ప్రవర్తన, తలవంచని విప్లవ హృదయం పట్ల ఉన్న గౌరవంతో నేనిదంతా చెబుతున్నా."

ఫిడేల్ క్యాస్ట్రో

మిషన్ క్యాంప్ పరిస్థితి చూస్తే. అనాథ చిన్నపిల్లల బృందమొకటి వారాంతపు విహారానికొచ్చినట్టుగా ఉంది కొంత దూరంలో ఎవరో గట్టిగా అరుస్తూ ఏదో చర్చిస్తు న్నట్టు వినిపించింది. ఓ చిన్న రాకెట్ శబ్దం చాలు ఇక్కడి జనాలంతా ఓ చోట చేరడానికి. పోరాటం కొండల మధ్య కేంద్రీకృతమై ఉండటంతో సెంట్రీల్ని మొల కువగా ఉంచాల్సిన సమయమది. తన మనుషుల్ని వెతుక్కుంటూ ల్యాంబర్ట్ విరామ మెరుగక తిరుగుతూనే ఉన్నారు. ఐనా, మా సంఖ్య ఏ రోజూ 40కి మించలేదు. ఒకవేళ ఆయన అదనంగా కొంతమందిని తీసుకొస్తే, ఆ మేరకు మరికొందరు తమ స్థావరానికో లేదా అడవుల మధ్య తమ సొంత గ్రామాలకో వెళ్తున్నారు. ఇక్కడ మెషిన్‌గన్లను కూడా పని చేయని దుస్థితి. అవి గురి తప్పి పర్వతాలకే తాకే అవకాశా లెక్కువ.

మొదట చెప్పినట్టుగా అక్కడి శత్రు సైనికుల సంఖ్య 53 మాత్రమే కాదనీ, ఇంకా చాలామంది ఉన్నట్టు తెలిసింది. పర్యవేక్షణకెళ్లిన వజీరీ బన్షిర్ మాటల మీద నాకు నమ్మకముంది. శత్రు సైనికుల ప్రధాన స్థావరం కింటీ నదికి అవతలి వైపున ఉంది. మరో స్థావరం కూడా ఉండే అవకాశముంది. ఐతే, దానిపై స్పష్టత లేదు. నది దాటి శత్రు దళాలు స్వేచ్ఛగా ఇవతలికి రాగలుగుతున్నాయి. రోడ్డుకిరువైపులా రైతులు పండిస్తున్న కాసవా దుంపల్ని తినేస్తున్నాయి. ఆ ప్రాంతంలో వారిపై దాడి చేయడం సులభమే. ఐతే, రోడ్డుకు కుడి పక్కన మరో క్యాంప్ ఉన్నట్టుగా బన్షిర్ అనుమానించారు ఆ వైపున పర్యవేక్షణ కోసం వెళ్లి శత్రు దళాలు ఎదురుపడటంతో వెనుతిరిగారు. ఆయన్ని మరోసారి మరో మార్గంలో పంపినా ఫలితం దక్కలేదు. శత్రు దళాలు జంతువుల్ని వేటాడుతూ కనిపించాయి అదృష్టవశాత్తూ వారి కంట పడకుండా తిరిగి వచ్చారు అక్కడ ఎలాంటి దాడినైనా తిప్పికొట్టగలమనే ధైర్యంతోనే శత్రు సైనికులు స్వేచ్ఛగా తిరగగలుగుతున్నారు. వేట కోసం వారు ఏ వైపున కాల్పులు జరిపినా మాకు వినిపిస్తోంది. దాంతో మన దళాలు పొజీషన్‌లో ఉండేం దుకు జంకుతున్నాయి. కాల్పుల శబ్దాలు విని మొదటి రోజునే చాలామంది క్యాంప్ విడిచి వెళ్లిపోయారు.

ఎంబిలీ దళాలు కటెంగా-లులింబాల మధ్య జరిపిన వివిధ దాడుల సమాచార మందింది. శత్రు దళాల్ని కొన్ని చోట్ల వెనక్కి పంపినట్టు చెప్పారు. ఐతే, ఆశించినన్ని ఫలితాలు సాధించలేకపోయారు. శత్రు సైన్యం తమ బలగాల్ని పెంచుకుంటున్నట్టు తెలిసింది.

దాడుల సమయంలో మావాళ్లు తప్ప ఎవరూ చివరిదాకా కొనసాగడం లేదని మోజా

చెప్పారు. కాంగోవాసులు రెండుమూడు రోజులకు మించి ఉండలేకపో తున్నారు. వారి స్థానంలో కొత్తవారిని నింపడం ఎంతో కష్టంగా ఉంది. వారంతా ప్రధాన స్థావరానికి తిరుగుముఖం పడుతున్నారు. ప్రారంభ సమయంలో ఉన్న కనీస ఉత్సాహం కూడా వారిలో లేదు. గంజా, కన్వంజా అనే రైతు గ్రామాలపై యుద్ధ విమానాలు బాంబులు కురిపించాయి ఆ తర్వాత కొన్ని కరపత్రాలు వదిలాయి. పోరాటాల్లో చనిపోయిన వారి ఫోటోల్ని కరపత్రాలపై ముద్రించారు. కింది భాగంలో స్వాహిలీ ఫ్రెంచ్ భాషల్లో ఓ విజ్ఞప్తి ఉంది. చైనీయుల్నీ, క్యూబన్లనీ నమ్మితే మీకు కష్టాలు, చావులూ తప్పవంటూ భయపెట్టారు. మీ దేశంలోని బంగారాన్ని దోచుకునేందుకే వారొచ్చారంటూ దుష్ప్రచారం సాగించారు మీరు వారికి మద్దతివ్వడం వల్లే ఆహారం, బట్టలు కరువయ్యాయని, వ్యవసాయ పనులకూ, అడవిలో వేటకూ దూరమయ్యారంటూ కష్టాల్ని గుర్తు చేశారు పోరాటాన్ని విరమించి సాధారణ జీవితంలోకి వస్తే మీ జీవితాలకూ, స్వేచ్ఛకూ షోంబే సైన్యం గ్యారెంటీ ఇస్తుందంటూ మొబూటూ సంతకంతో ఆ కరపత్రం ముగిసింది.

మా పోరాట సమయంలో(క్యూబాలో) బటిస్టా ఇదే పద్ధతిని అనుసరించాడు. ఇలాంటి ఎత్తులకు కొందరు బలహీనులు లొంగిపోతారు. క్యూబాలో మాకిది తక్కువ నష్టాన్నే కలిగించింది. కానీ, ఇక్కడ మాత్రం బలహీనులే ఎక్కువగా ఉన్నారన్నది నా అనుమానం ఐతే, బటిస్టా మనుషుల్లాగే ఇక్కడి శత్రు దళాలు కూడా మూర్ఖంగానే వ్యవహరించాయి. బాంబులతో భయపెట్టి, ఆ తర్వాత సందేశాలివ్వడమంటే వారి లోని అణచివేత స్వభావాన్ని మరోసారి గుర్తు చేయడమే.

సమీప ప్రాంతాల్లో పర్యటన కోసం వెళ్లా. దాడులకు అనుకూల ప్రాంతాల్ని ఎంపిక చేసి ఆయుధాల్ని అందించాలన్న ఆలోచనతో. నేను నా ప్రయత్నాల్లో ఉండగానే నా అనుచరుల్లో ఒకరైన ధనుసి పరుగున నా దగ్గరికొచ్చారు. శత్రు దళాలు మిషన్ క్యాంప్ను సమీపించి కొన్ని రౌండ్ల కాల్పులు జరిపిన విషయం తెలిపారు. దాంతో, సెంట్రీలు తలో దిక్కుపరుగు తీశారని చెప్పడంతో నేను వెనక్కి మళ్లా. వారంతా పర్వతాల్లో తలదాచుకునేందుకు వెళ్లగా, నా వెంట 20 నుంచి 25 మంది మాత్రమే కాంగోవాసులు మిగిలారు.

కిబేంబేర్ స్థావరం వైపు తన పర్యటన ముగించుకున్న ల్యాంబర్ట్ మరుసటి రోజున మమ్మల్ని

చేరుకున్నారు. తన మనుషులు లులింబాకు 4 కి.మీ. సమీపాన ఉన్నట్టు తెలిపారు. దేనికైనా సిద్ధంగా ఉండాలని వారికి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. ఐతే, అక్కడ ఉంది 120 కాదు 60 మందే అంటూ మాట మార్చారు. వారంతా పోరాట స్ఫూర్తితో ఉన్నారంటూ కితాబిచ్చారు. ఆయన గత చర్యలన్నీ బాధ్యతా రహితంగా ఉండటంతో ఆ మాటల్ని నమ్మలేకపోయా. అప్పటి పరిస్థితిని ఆయనకు వివరించా. మన వెంట ఉన్న మనుషులు పెద్ద దాడికి సరిపోరని చెప్పా తాజా నివేదికల ప్రకారం, లులింబాలో శత్రువు పెద్ద ఎత్తున తన బలగాల్ని మోహరించాడని గుర్తు చేశా. శత్రువుకు కొన్ని నష్టాలు కలిగించడం కోసం మూడు చిన్న దాడులు నిర్వహించాలని ప్రతిపాదించా. అందులో ఒకటి, ప్రధాన రహదారిపై దాడి.. రెండోది, కాసవా పంట పొలాల్లో (శత్రు దళాలు సంచరిస్తున్న ప్రాంతం). నా కమాండ్ ను కిలివేకు తరలించా. స్థావరానికి ఎడమ పక్కన ఓ నది ప్రవహిస్తోంది.

లాంబర్ట్ తన ఊహాజనిత అంచనాలతో అటూ ఇటూ తిరుగుతూ అడవిలో వేటకు వచ్చిన ఓ శత్రు సైనికుణ్ణి చంపేశాడు. ఈ సంఘటనతో నాకు మరింత ఆందోళన కలిగింది. కాల్పుల శబ్దం విన్న షోంబే దళాలు తమ సైనికుని ఆచూకీ కోసం గాలింపు చేపట్టే అవకాశాలున్నాయి. దాంతో, అతని శవాన్ని దూరంగా తీసుకువెళ్లడమో లేదా పూడ్చి పెట్టడమో చేయాలంటూ లాంబర్ట్‌కు సూచించా. లేదంటే మనం గడ్డు పరిస్థితిని ఎదుర్కోక తప్పదని వివరించా. దీనిపై వారికి నచ్చచెప్పడం ఎంతో కష్టమైంది. చివరికి ఆ శవాన్ని ఏం చేశారో తెలియదు. కానీ, నాతో మాత్రం రహస్య ప్రాంతంలో పూడ్చిపెట్టినట్టు చెప్పారు.

ఇక అక్కడ ఎక్కువ సమయం ఉండటం సరైంది కాదనుకున్నా సెంట్రీలు వ్యవహించిన తీరు ఓ ముందస్తు హెచ్చరికగా నన్ను ప్రభావితం చేసింది. ఓ కి.మీ. వెనక్కి వెళ్లామనుకున్న నా ప్రతిపాదనకు లాంబర్ట్ అంగీకరించారు. ఐతే, ఆయన తరఫున చేసిందేమీ లేదు.

నా కమాండ్ కింద గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేయడం కోసం సరైన మనుషుల కోసం మకుంగోలో వెతికా, క్రమశిక్షణ లేని వారితో పని చేయడం ప్రమాదకరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నా ఐతే, లాంబర్ట్‌ను ఒంటరిగా వదిలేయడం ఇష్టం లేదు. మోజాతోపాటు పదిమందిని పంపిస్తానని, అందుకు బదులుగా నా దగ్గర శిక్షణ పొందేందుకు పది మందిని ఎంపిక చేయాలని

చెప్పా ఇచ్చిన హామీ ప్రకారం ల్యాంబర్ట్ పదిమందినైతే పంపించారుగానీ, వారిని ఎంపిక చేసినట్టుగా అనిపించలేదు. వారి వ్యవహార శైలి ఏమంత బాగా లేదు.

ఉలింబాకు 5 కి.మీ. దూరంలో నది పక్కన టెంబో బృందం మమ్మల్ని చేరు కుంది. క్యూబన్ల గౌరవాన్ని విశ్వసనీయతను పెంపొందించేలా అలుపెరగని ప్రయాణం సాగించారు. ల్యాంబర్ట్ దగ్గరికెళ్లిన పది మందితో కలిపి 35 మందిమి అక్కడ ఉన్నాం. మా దేశం నుంచి వచ్చిన మొత్తం 120 మందిలోని మిగతావారు సరస్సు, పర్వత స్థావరం, ఫ్రంట్ డీ ఫోర్స్, కేలిటే ఫ్రంట్‌లో విస్తరించి ఉన్నారు. క్యూబన్లు లేకుండా ఏ ఫ్రంట్ కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి. అలా వెళ్లిన ప్రతిసారీ తిరిగి వెనక్కివచ్చిన అనుభవాలే ఎదురయ్యాయి. మా బృందంలో కొత్తగా చేరినవారి (క్యూబన్లు) గురించి చెప్పాలి. వారిలో ఒకరు రెబోకేట్, ఈయన అజీమా సోదరుడు, మరొకరి పేరు కాసులు, ఈయన హైతీ డాక్టర్. ఈయన ఫ్రెంచ్‌లో బాగా మాట్లాడగలరు. ఇంకొకరు టూమ, వైర్లెస్ సమాచార నిర్వాహకుడు. ఈయనతో నేను చర్చించా. దార్ ఏ సలామ్‌లోనే కొనసాగుతానన్నారు. సరస్సు దగ్గర ఎత్తయిన ప్రాంతంలో వైర్లెస్ సెట్ ఏర్పాటు చేస్తానన్నారు. దాని ద్వారా దార్ ఏ సలామ్, కిగోమాలతో సంబంధాలు నెల్కొలుపుతానన్నారు. క్యూబాతో ప్రత్యక్ష సంబంధాల కోసం ఓ రేడియో స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరా. ప్రతిదానికీ దార్ ఏ సలామ్ పై ఆధారపడుతూ కాంగోలో యుద్ధాన్ని నడపలేమని చెప్పా.

సమాచార పరికరాల అవసరాన్ని గుర్తించాం. చైనా నుంచి వచ్చిన పరికరాలైతే బాగా పని చేస్తాయన్నవారి అభిప్రాయంతో ఏకీభవించాం. ఐతే, ప్రతి ఫ్రంట్లోనూ ఒకటి ఏర్పాటు చేయడం కుదరదన్నారు. వాటిని ఆపరేట్ చేసేందుకు కూడా తగినంతమంది లేని పరిస్థితి. ఐతే, సమాచార వ్యవస్థ బలోపేతం కోసం కాంగో వాసులకు శిక్షణ ఇవ్వాలనుకున్నాం. దూర ప్రాంతాలకు సమాచారమందించేలా ఓ పరికరాన్ని పిజీలో ఏర్పాటు చేయాలని సూచించా. ఎందుకంటే.. వైమానిక దాడులు ఎక్కువగా జరుగుతోంది అక్కడే. విప్లవ రేడియో కేంద్రం లేకుండా వెనువెంటనే సమాచారం అందుకోవడం సాధ్యం కాదని వివరించా.

మసెంగోకు కామ్రేడ్ల ద్వారా ఓ లెటర్ పంపించా. పిజీతో మన సంబంధాల్లో స్పష్టత కోసం

అక్కడివారితో చర్చించాలని సూచించా. ఇప్పటికే అక్కడ ఉన్న రేడియోను ఉపయోగించుకోవాలని చెప్పా. ఐతే, సొంత ప్రచారం కోసం దుర్వినియోగం చేయకుండా సెంట్రల్ కంట్రోల్ కింద పని చేయాలని సూచించా. కివే సంపాదకత్వంలో వచ్చిన వార్తా పత్రికపై నా విమర్శల్ని గుర్తు చేశా. పోరాటాల గురించి అబద్ధాలు చెప్పడం వల్ల సమాచారంలో నాణ్యత లోపిస్తుంది. ఐతే, అదంతా రిపోర్టర్ల వల్ల జరిగిన తప్పిదంగా ఆయన వివరణ ఉంటుందనడంలో నాకు సందేహం లేదు.

ఈ రోజుల్లో శత్రు బలగాల వాస్తవ స్థితిని తెలుసుకునేందుకు యత్నించాం. దళాల పునర్నిర్మాణం కోసం క్యాంప్ ఏర్పాటుపై దృష్టి సారించాం. కొంతకాలం పాటు రోడ్డు పక్కగుడిసెల్లో షెల్టర్ తీసుకోవాలనుకున్నాం. ఈ ప్రాంతంలో వైమానిక దళాల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. ల్యాంబర్ట్ స్థావరం చుటూ మెషిన్‌గన్‌లతో కాపలా కాస్తున్నాయి. శత్రు బలగాల మోహరింపు మాకు ఆందోళన కలిగించింది. మోజా మనుషులిద్దరు మాకో సమాచారమందించారు. వారు పర్యవేక్షణ కోసం వెళ్లగా, శత్రు దళాలు ఎదురుపడ్డాయి. దాంతో, వారు వెనక్కి తిరిగి తలదాచుకోవాలనుకున్నారు. చివరికి వారు మిషన్ క్యాంప్‌ను చేరుకోలేక మా దగ్గరికొచ్చారు. ఆ ప్రాంతమంతటికీ శత్రు దళాలు విస్తరించినట్టు వారు చెప్పారు. జరిగిన సంఘటనపై నాకందిన నివేదిక ఇలా ఉంది.

28, సెప్టెంబర్..

టాటూ.. ఈ ఉదయం 10-30కి శత్రు దళాలు లులింబా నుంచి మిషన్ క్యాంప్ వెళ్లే రోడ్డుపై ముందుకు రావడం కనిపించింది. మరోవైపు, ఫిరంగులు పేలుస్తూ, యుద్ధ విమానాలతో బాంబులు కురిపించాయి. విమాన విధ్వంసక స్థావరం దగ్గర కల్నల్తోపాటు ఇతర మిత్రుల్ని కలిశా. మిషన్ క్యాంప్ను చుట్టుముట్టిన శత్రు దళాలపై కాల్పులు జరపాల్సిందిగా ఆదేశించా. కాంగో దళాలు కాల్పులు జరపకుండా చేతులెత్తేశాయి. ప్రస్తుతానికి వారెవరూ ఇక్కడ లేకుండా పోయారు. ఆ సమయంలో మిషన్ క్యాంప్ దగ్గర టిజా, చైల్లు వంట పని చేస్తున్నారు. వారిపుడు మా దగ్గరికి చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలకు ఐన్సిర్, రబానిసీలు పర్యవేక్షణ కోసం వెళ్లారు. ఆ తర్వాత వారి గురించి మాకెలాంటి సమాచారమూ లేదు బహుశా వారిద్దరూ మీ దగ్గరికి చేరుకొని వుంటారు. మన సొంత మనుషుల ద్వారా శత్రు దళాలపై కాల్పులు జరిపించాలనుకున్నా వైమానిక దాడులు

ప్రారంభం కాగానే కాంగోవాసులంతా వెనక్కి తగ్గారు దాంతో, విమాన విధ్వంసక మెషిన్ గన్ను వెనక్కి జరిపి వెళ్లిపోవాల్సిందిగా వారికి చెప్పా క్యూబన్ కామ్రేడ్లలో ఒకరిని మెషిన్ గన్ దగ్గర ఉండమన్నాను. మరొకరిని ఫిరంగి దగ్గరికి పంపించా. అది మా నుంచి రెండో పర్వతంపై ఉంది దాన్ని నిన్ననే స్థావరానికి తీసుకొస్తానన్నారు కల్నల్. ఐతే, అది ఇంకా జరగలేదు. మిషన్ క్యాంప్లో కామ్రేడ్ టిజాతో ఉండే కామ్రేడ్ కాంపెగ్ని కాంగోవాసులతో కలిసి వెనక్కి వెళ్లారు. ఆయ నిపుడు ఎక్కడున్నారో తెలియదు. ప్రస్తుతం, నాతోపాటు ఎనిమిది మంది మాత్రమే ఇక్కడున్నారు. ఇక్కడ మేం శత్రు దళాల్ని నిలువరించలేనట్టయితే వెనక్కి వెళ్లి మరో కొండపై రక్షణ పొందాల్సివుంది. ఈ కొండ ఏమాత్రం అనుకూలంగా లేదు. పిజీ నుంచి కూడా కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఐతే, ఆ కాల్పులు జరిపింది మన వాళ్లేనని కల్నల్ చెప్పారు. ఆయన మాటల పట్ల నాకు విశ్వాసం తక్కువ. శత్రు దళాలు మిషన్ క్యాంప్ దగ్గరే ఆగిపోయాయి.

- మోజా.

ఎంబిలీ నుంచి సమాచారమందింది. రెండు ట్యాంకులపై దాడి చేయగా, ఒకటి ధ్వంసమైంది. శత్రు విమానాలు మన దళాల్ని గుర్తించి వెంటపడ్డాయి. ఐతే, ఎలాంటి నష్టమూ జరగలేదు. నివేదిక చివరి భాగమంతా రోగాల గురించే. ఎంబిలీ వద్ద ఉన్న క్యూబన్లలో ఎక్కువ భాగం అనారోగ్యానికి గురయ్యారు. కాంగోవాసులు ముగ్గురు మాత్రమే మిగిలారు (మిగతా వారంతా వారి స్థావరాలకు వెళ్లిపోయారు). శత్రు దళాలు మరోసారి దాడి ప్రారంభించాయి. మన దళాలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవడంతో ఈసారి వారి పని సులభమైంది.

మరుసటి రోజు మొబూటూ దళాలు ఓ వార్తను రేడియోలో ప్రసారం చేశాయి. కల్నల్ హోరే నేతృత్వంలోని దళాలు పిజీ-బరాకాల్లో ముందుకు కదులుతున్నాయి. మొత్తం 2400 మంది ఈ దాడుల్లో పాల్గొంటున్నారు. మన ఆధిపత్య ప్రాంతాల్ని ధ్వంసం చేయాలన్నదే వారి లక్ష్యం. బరాకా ఇప్పటికే వారి చేతుల్లోకి వెళ్లిపోయిం దనేది వారి కథనం.

బరాకాపై దాడి జరిగిన విషయం ల్యాంబర్ట్ ప్రకటనలోనూ ఉంది ఐతే, మన దళాలు ప్రతిఘటించగా, శత్రు సైనికుల్లో 20 మంది తెల్లవారితోపాటు అనేకమంది నల్లవారు

హతమయ్యారు. నల్ల జాతీయులు చనిపోయారన్న వార్త కాంగోవాసులకు బాధ కలిగించలేదు. కానీ, తెల్ల జాతీయులు హతమయ్యారనడంతో సంతోషించారు. ల్యాంబర్ట్ ఫ్రంట్ నుంచి మరో నివేదిక అందింది.

29, సెప్టెంబర్...

టాటూ.. కల్నల్‌లో నిన్న మాట్లాడాం. శత్రు దళాలు మిషన్ క్యాంప్‌ను ఆక్ర మించడంతో లులింబా వైపు నుంచి కాల్పులు జరిపేందుకు తుపాకులు, ఫిరంగులూ తేవాలని కోరాం. దాంతో ఆయుధాల కోసం ల్యాంబర్ట్ వెళ్లారు. తిరిగి వస్తూ, నానేను వెంటబెట్టుకురావడంతో ఇక ఆయన మాతోనే ఉంటారన్న నమ్మకం కుదిరింది. శత్రు దళాలపై కాల్పులు జరిపి వెంటనే వెనక్కి వెళ్లి మరో పర్వతంపైకి మకాం మార్చాలని సూచించా. ఈ రోజు వైమానిక దాడులు జరిగే అవకాశం లేదు. నిన్నటి సంఘటనలో భూతల శత్రు దళాలు ఫిరంగులతో లక్ష్యాల్ని నిర్దే శించగా, వైమానిక దళాలు కింది వైపున ప్రయాణిస్తూ బాంబులు వేశాయి.

నిన్న సాయంత్రం 5 గంటలకు కామ్రేడ్ నానే వచ్చారు. రెండు ఫిరంగులు, కొన్ని తుపాకులు తెచ్చారు. దాంతో, మేం మా పొజిషన్లకు వెళ్లిపోయాం. కల్నల్ మాత్రం నానేతో కలిసి రాలేదు. ఆరుగంటలకు సుపుగా తాగి, క్యాంప్ నుంచి తన మనుషుల్ని వెంట తెచ్చుకున్నారు. మేం కాల్పులు జరిపి, వెంటనే మిషన్ క్యాంప్‌కు వెళ్లాలన్నారు. అప్పటికే శత్రు దళాలు ఎలాంటి ప్రతిఘటన చేయకుండా అక్కడి నుంచి వెళ్లిపోతాయన్నారు. ఐతే, ఈ ఆలోచన ప్రమాదకరమని చెప్పాం. అంచనా తారుమారై శత్రు దళాలు అక్కడే ఉండి ఎదురుదాడికి దిగితే పరిస్థితి గజిబిజిగా తయారవుతుందన్నాం. మనం పూర్తిగా వారి ఉచ్చుల్లో పడిపోతామని, మనలో మనమే ఒకరినొకరం శత్రువులుగా భ్రమపడి చంపుకునే ప్రమాదముందని హెచ్చ రించాం. అందుకాయన అలా ఏమీ జరగదు, మీరలా చేయాల్సిందే అన్నారు. ఆ తర్వాత ఆయన మీతో మాట్లాడారు. మీరిద్దరూ లులింబాపై దాడికి అంగీకరిచారు. మా మనుషులు మాత్రం ఇక్కడే ఉంటారని, అందుకు నాదే బాధ్యత అని చెప్పా. ఈ దాడి తర్వాత ఆయన చైనా వెళ్తానన్నారు. మేం కాల్పులు జరిపాం, ఫిరంగులు పేల్చాం. వెనక్కి వెళ్లి అతని క్యాంప్‌కు చేరుకున్నాం. అతనితోపాటు అతని మనుషులు

కూడా మాతో వచ్చారు.

గత రాత్రి అతనితో మాట్లాడాం. ఐతే, ఆయన తాగుడు మత్తులోనే ఉండటంతో ఆ విషయంపై ఇంకా ఏమీ చర్చించలేదు. సరైన సమయం కోసం వేచి చూడాలను కున్నాం. మా దగ్గర కొన్ని తుపాకులున్నాయి. వారి దగ్గర మాత్రం ఒకటే ఉంది. నిన్న మేం కాల్పులు జరిపిన చోట ఓ పరిశీలక బృందాన్ని ఉంచాం. శత్రు దళాలు ముందుకు రావడం కనిపిస్తే, ఆ బృందం అడ్డుకునేందుకు యత్నిస్తుంది. మిషన్ దగ్గర శత్రు దళాలు ఓ క్యాంపు ఏర్పరిచినట్టు అర్థమవుతోంది. మిగతా దళాలు మాత్రం లారీల్లో వెనక్కి వెళ్తున్నట్టు కనిపించింది. శత్రు దళాలు మరోసారి ముందుకు రావడానికి యత్నిస్తే, అక్కడి నుంచి వారు క్యాంప్‌ను ఎత్తివేసేలా ఓ ప్రణాళిక రూపొందించాం. అది ఇలా ఉంది...

రాత్రి వేళ మిషన్ వైపు కొన్ని రౌండ్ల కాల్పులు జరుపుతాం. ఆ తర్వాత చుట్టు పక్కల కొన్ని రోజుల పాటు పర్యవేక్షణ చేస్తాం. మా ప్రణాళిక విజయవంతమైతే ఇక ఆ ప్రాంతంలో శత్రు దళాల కదలికలుండవు. ఓవైపు మా మనుషులపై ఓ కన్నేసి ఉంచా మరోవైపు, వైమానిక దాడుల నుంచి రక్షణ కోసం తమ మనుషుల్ని ఇళ్లల్లోంచి బయటకు రప్పించాలంటూ కల్నల్కు చెప్పా. కొన్ని షెల్టర్లు నిర్మించాలని ఆలోచిస్తున్నాం. ల్యాంబర్ట్‌తో మా సంబంధాల్లో ఎలాంటి విభేదాలూ లేవు. ఎందు కంటే.. ఆయన ఇంకా పోంబే మత్తులోనే ఉన్నారు మా పొజిషన్ ఎటు మారినా, క్యాంప్‌తో సంబంధాల కోసం మా వెనుక ఎప్పుడూ ఓ మనిషి ఉండాల్సిందే. మీ నుంచి వచ్చే సలహాల కోసం ఎదురు చూస్తూ..

మోజా

కల్నల్‌ది భయంకరమైన బాధ్యతారాహిత్యం. బరాకా గురించి నాకందిన సమా చారం తప్పని తేలింది. ఎలాంటి ప్రతిఘటనా లేకుండానే దాన్ని కోల్పోయాం. పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. శత్రు సైన్యం ఓ స్పష్టమైన ప్రణాళికతో తగినన్ని బలగాలతో, పలు రకాల ఆయుధాలతో విస్తరిస్తోంది. మేం మాత్రం ఆశా వాదపు గుడ్డితనం నుంచి ఇంకా బయటపడలేదు. ఊహించని ఈ పరిణామాల్ని నా సెప్టెంబర్ నివేదికలో విశ్లేషించా.

"గత నెల విశ్లేషణ అంతా ఆశావాదంతో నిండివుంది. ఐతే, అది ఎంతోకాలం నిలువలేదు. మా బలగాల్ని ఓ నెలరోజులు కూడా నిలిపి ఉంచలేకపోయాం. వాస్తవానికి తేదీలేమీ రాసి పెట్టలేదు. బరాకాలో శత్రు దళాలు పైచేయి సాధించగా, లులింబాలో బలం పెంచుకున్నాయి. దీనికంతకీ బలహీన సమాచారమే కారణం. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బృందంతో ఇక పోరాటం సాగించలేం. ఇక క్యూబన్లు తమ కోసం తాము చేయాల్సిందే. ఫ్రంట్ కు సమన్వయకర్తగా మా స్నేహితుడు ల్యాంబర్ట్‌ను మసెంగో నియమించారు (ఎందుకూ పనికిరాని వ్యక్తి. ఇతరుల నుంచి గౌరవం పొందేందుకు, నన్ను గౌరవించేందుకు తప్ప). నన్ను శాంతింపజేయడం కోసం మసెంగో ఓ లెటర్ రాశారు. మీకెదురైన సమస్యల్ని గుర్తు చేస్తూ, ప్రత్యుత్తరం రాయమన్నారు. "నా పోరాటమంతా శక్తివంతమైన ఆయుధాలతో కూడిన పటిష్ట మైన స్వతంత్ర సైన్యాన్ని సృష్టించడం కోసం. అలాంటి మెరుపు దళం ఓ చోట వాస్తవమైతే, అదే మిగతా వారికి ఓ మోడల్గా నిలుస్తుంది. అది ఉనికిలోకి వస్తే యుద్ధ చిత్రమే మారిపోతుంది." అలా జరగని పక్షంలో విప్లవ సైనిక నిర్మాణమే అసాధ్యం. అధికారుల (ముఖ్య నేతల) గుణగణాలే అందుకు అడ్డంకిగా తయారయ్యాయి.

సారాంశంలో ఈ నెల కొన్ని ఫలితాలు సాధించినా, ఆశ మాత్రం సన్నగిల్లింది. మరో నెల వేచి చూద్దాం..

***********

ఒకవేళ శత్రువు దాడి చేస్తే ఇది మనకు చాలా చెడ్డ సమయమవుతుంది. లులింబా దిశగా పోరాటం కొనసాగుతోంది. కొంతకాలంగా ఆ ప్రాంతం మనకు అను కూలమైంది. అది కిలివే నది ఒడ్డున, పర్వతాల వరుసకు దగ్గరలో ఉంది. మా ప్రధాన ఆందోళన ఆహారం గురించి.. ఆహారం కోసం జంతువుల్ని వేటాడేందుకు వెళ్తున్నాం. ఐతే, పెద్దగా ఫలితాలు లేవు. మేం వేటాడే చోట మానవ సంచారం లేదు. వేటకు అదే సరైన ప్రాంతం. కానీ, కాల్పుల శబ్దాలు శత్రు దళాలకు స్పష్టంగా వినిపిస్తాయి. ఐతే, వారిపుడు ఆత్మరక్షణకే పరిమితమవుతున్నారు.

సమీపంలోని ఓ గ్రామ పెద్దతో మాట్లాడాం. ఇక్కడి ప్రతి గ్రామానికి లేదా కొన్ని చిన్న గ్రామాలకు ఓ గ్రామ పెద్ద ఉంటారు. మా తరపున ఒకరు అతనితో ఫ్రెంచ్‌లో మాట్లాడారు. ఆయన చురుకైన వ్యక్తి. సుదీర్ఘ సంభాషణ తర్వాత మా అవసరాల్ని గుర్తు చేశాం. సరస్సు దగ్గరి నుంచి కొన్ని ఆహారపు డబ్బాలు, ఇతర వస్తువులు మోసుకు రావడానికి వారి సహకారం కోరాం, సహకరించేందుకు ఒప్పుకున్నారు. అంతేగాక వారు పండించిన కొన్ని కూరగాయలు, పొగాకు మాకిచ్చారు. అందుకు ప్రతిఫలంగా సరస్సు నుంచి తెచ్చిన కొన్ని వస్తువులతోపాటు వైద్య సేవలందిస్తామని, కొన్ని మందులు, విత్తనాలు (కూరగాయలు పండించడం కోసం) ఇస్తామని చెప్పాం. ఆ గ్రామ పెద్ద మేం చెప్పిన విషయాలన్నీ జాగ్రత్తగా నోట్ చేసుకున్నారు. రెండు మూడు రోజుల తర్వాత ఆయన తన స్నేహితులతో మాట్లాడారు. ఆ తర్వాత టైప్ చేసిన ఓ ప్రత్యుత్తరాన్ని మాకిచ్చారు. దానిపై కొన్ని స్టాంప్ ముద్రలున్నాయి. సరస్సు దగ్గరికి మనుషుల కోసం చూస్తున్నామన్నారు. ఆహారం, పొగాకు గురించి ఆందోళన అవసరం లేదన్నారు. ఐతే, అందుకు ప్రతిఫలంగా ఏమీ తీసుకోమన్నారు. విప్లవ సైన్యానికి మద్దతు తెలపడం, ఆహారమందించడం మా నైతిక ధర్మం అంటూ వివరణ ఇచ్చారు.

ఎంబిలీ నుంచి మరిన్ని వార్తలొచ్చాయి. మరోసారి శత్రు సైనికులు తమ సరిహద్దుల్లోకి ప్రవేశించారని, ట్యాంకులతో కొంత అలజడి సృష్టించినట్టు తెలిపారు అందుకు ప్రతిగా రోడ్డుపై ఓ నాటు మందుపాతర పేలుళ్లు జరిపినట్టు చెప్పారు. ఆరు సెకండ్లలో అది పేలిపోగా, ఓ చిన్న ట్యాంక్ మాత్రం ధ్వంసమైందన్నారు. స్థావరం దగ్గర డాక్టర్‌గా సేవలందించేందుకు సికీని పంపించా. తన వృత్తి ధర్మంతో పాటు సంప్రదింపుల్లో మోజాకు సహకరిస్తారు. సికీ అందించిన మొదటి నివేదికలో

మోజాపై ఆరోపణలున్నాయి. నిర్మాణ రాహిత్యం విస్తరించిందనీ, శత్రు దాడుల్ని ఎదుర్కోవడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం ఉందన్నారు. ప్రతిరాత్రీ నిద్రకు వెళ్లే ముందు తుపాకుల నుంచి బుల్లెట్లు తొలగించి వాటిని తమ వెంటే తీసుకెళ్తున్నారు. స్వీయ రక్షణ కోసం కందకాలు తవ్వుకునే ఓర్పుగానీ, ఆయుధాల రక్షణ కోసం ఒకరిని కాపలా పెట్టుకునే తీరికగానీ వారికి లేదు. తుపాకిని తమ వ్యక్తిగత వస్తువుగా భావిస్తున్నారు. తమ సొంత ఇళ్లల్లో తప్ప మరో చోట నిద్ర ఇష్టపడటం లేదు. దాంతో, ప్రతి ఉదయం పోరాట ప్రాంతానికి కార్యకర్తల్ని తరలించడం కష్టమవుతోంది.

లుబోండ్జా ప్రాంతం నుంచి పేలుళ్ల శబ్దాలు పెద్ద పెట్టున వినిపించాయన్నారు. పరిశీలించేందుకు వెళ్లి చూడగా, శత్రు దాడి జరిగినట్టుగా ఉందన్నారు. ఆయుధాల డంప్ పూర్తిగా కాలిపోయింది. అందులో పెద్దసంఖ్యలో ఫిరంగులు, విమాన విధ్వంసకాలు, మెషిన్‌గన్ బుల్లెట్లున్నాయి.

మసెంగో కోసం ఎదురు చూస్తుండగా, హఠాత్తుగా ముజుంబా వచ్చిపడ్డారు. ఇటీవలి వరకూ దార్ ఏ సలామ్‌లో విప్లవ కౌన్సిల్ ప్రతినిధిగా వ్యవహరించారు. మకుంగోలోని ఆల్బర్ట్ విల్లే రైల్వే ప్రాంతంలో పోరాట బాధ్యత కోసం వచ్చారు. తనకు ఆరుగురు క్యూబన్లు కావాలన్నారు. అందుకు నేను తీవ్రంగా స్పందించా. మేమిపుడు పర్వత ప్రాంతంలో పెద్ద పోరాటానికి సిద్ధమవుతున్నామని, అందుకోసం బలమైన మిశ్రమ సైన్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపా. మా బలగాల్ని ఏకపక్షంగా పంపించలేమని వివరించా (క్యూబన్ల విషయంలో కాంగోలైజేషన్ అన్న పదాన్ని మొదటిసారిగా ఉపయోగించిన సందర్భమిదే). అలా పంపించడంవల్ల సాధించే ఫలితాల కన్నా ప్రమాదాలే ఎక్కువని చెప్పా విప్లవోద్యమం ఈ పద్ధతినే కొనసాగితే భవిష్యత్‌లో మేమేమీ ఇవ్వలేమని చెప్పా జరుగుతున్న సంఘటనలపై నా వ్యాఖ్యలు ఆయనపై ప్రభావం చూపాయి. కొన్ని రోజులపాటు నా దగ్గరే ఉంటానన్నారు. 20 మంది రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ముకుండీ ప్రాంతాన్ని పరిశీలించి తిరిగి వెళ్తానన్నారు. మిలటరీ శిక్షణ లేకుండానే రైతుల్ని చేర్చుకోవడంపై నా సలహా కోరారు. అది ఎంతో సరైందని చెప్పా క్యాంప్ జీవితంలో అవినీతికి అలవాటుపడ్డ సైనికుల కంటే ప్రజల నుంచి వచ్చే తాజా కార్యకర్తలు వేయి రెట్లు మేలని తెలిపా.

మరుసటి రోజు మసెంగో వచ్చారు. మాకు ఎదురైన సమస్యల గురించి వివ రించా. శక్తివంతమైన క్రమశిక్షణ గల సైనిక నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశా. లేదంటే పర్వతాల మధ్య బృందాలుగానే మిగిలిపోతారని తేల్చి చెప్పా. ఈ ప్రాంతంలో ల్యాంబర్ట్ కమాండ్ కింద ఓ ఫ్రంట్ ఏర్పాటుకు మా మధ్య అంగీకారం కుదిరింది. నా దళం మాత్రం స్వతంత్రంగానే ఉంటుందని చెప్పాం. ల్యాంబర్ట్‌తోనూ సంబంధం లేకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తుందని తేల్చి చెప్పా జరిగిన సంఘ టనల్లో ల్యాంబర్ట్ బాధ్యతారాహిత్యం పట్ల అవగాహన ఉండటంతో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు.

ఓ విధమైన సైనిక పాఠశాలను ఏర్పాటు చేయాలనుకున్నాం. విద్యార్థులుగా రైతులకే ప్రాధాన్యత ఇవ్వాలనుకున్నాం. అయితే, ఇప్పటికే ముజంబా తన మను షుల్ని 60 కి పెంచారు. వివిధ ఫ్రంట్ల నుంచి కొందరు సైనికుల్ని కూడా చేర్చు కోవాల్సి ఉంది. మరోవైపు సాధారణ సిబ్బందిని నియమించాలి. చురుకైన వారినే అందుకు ఎంచుకోవాలి. ఫ్రంట్లన్నిటినీ వారే ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. సలహా దారుల్ని పంపేందుకు అంగీకరించా. సికీ-సాధారణ సిబ్బంది కోసం; టెంబోరాజకీయ నిర్మాణం; డాక్టర్ కానులు-ఫ్రెంచ్ అనువాదకుడుగా. మా రాయబారికి ఓ లెటర్ రాయాల్సిందిగా మసెంగో కోరారు. ఇక్కడి వారిలో రోజురోజుకూ విభేదాలు తీవ్రమవుతండటంతోటాంజానియా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. చివరగా కొంతమంది క్యూబన్లు కావాలని అడిగారు. సూత్రరీత్యా అందుకు అంగీకరించా. అయితే ఈ యుద్ధానికున్న ప్రత్యేకత వల్ల ఎంపిక జాగ్రత్తగా జర గాలని చెప్పా. సంఖ్యతో సంబంధం లేకుండా వ్యక్తుల ప్రతిభపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

మరుసటి రోజు నిర్మాణ బలహీనతల నుంచి విముక్తి సేనను ఎలా బయట పడేయాలా అంటూ సుదీర్ఘంగా చర్చించుకుంటుండగా, హాస్యభరిత విషాదమొకటి జరిగింది. ఎవరో ఓ అగ్గిపుల్ల గీసి నిర్లక్ష్యంగా విసరడంతో అది కాస్తా గుడిసెలకు అంటుకుంది. ఎండుగడ్డి కావడంతో మంటలు ఒక్కసారిగా లేచాయి. దీంతో అనేక వస్తువుల్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇందులో బాధ కలిగించే మరో విషయం నిల్వ ఉంచిన గ్రెనేడ్లు మంటల్లో పేలిపోవడం. ఈ సంఘటన మసెంగోపై తీవ్ర ప్రభావం

చూపింది. మేం ఎన్నో రోజులుగా గుర్తు చేస్తున్న నిర్మాణ రాహిత్యం, నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్టు కనిపించడంతో చలించిపోయారు. మా కామ్రేడ్లలో ఒకరైన అగానో మూడు రోజులపాటు తిండి తినకుండా తనకు తాను శిక్ష విధించుకున్నారు.

బుల్లెట్లు, గ్రనేడ్లు పేలిపోతున్న సమయంలో మేం అక్కడే ఉన్నాం. వాటిలో నా సొంత పేలుడు సామగ్రి కూడా ఉంది. ఆ సమయంలో నా పక్కన మచాడిటో (క్యూబా ఆరోగ్యశాఖ మంత్రి) ఉన్నారు. ఫిడేల్ నుంచి కొన్ని ఉత్తరాలు తెచ్చారు. ఆయనతోపాటు మచుంగో ఉన్నారు. ఆయన సౌమాలియట్ విప్లవ ప్రభుత్వంలో ఆరోగ్యమంత్రి. సౌమాలియట్, ఆయన అనుచరులు ఫిడేల్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపిన విషయం నాకు తెలిసింది. విప్లవ కౌన్సిల్‌కు చెందిన వీరిచ్చే నివేదికలన్నీ తప్పుల తడకలే. వీరు ఎక్కువ కాలం దేశం బయటే ఉండిపోవడంతో లోపల జరుగుతున్న వాస్తవాల పట్ల వీరికి అవగాహన లేదు. ఇక్కడి సైనికులు చేసే అబద్ధపు ప్రచారాల్నే వారు నమ్ముతున్నారు తప్ప, తమకు తాము వాస్తవాలేమిటో తెలుసు కునేందుకు యత్నించరు.

ఆఫ్రికా దేశాల్లో విస్తృతంగా పర్యటించడం కోసం డబ్బులు సమకూర్చుకోవడం, విప్లవ కౌన్సిల్ పేరుతో ప్రచారం నిర్వహించడం మినహా వీరు చేస్తుందేమీ లేదు. వీరిపై కొన్ని పుకార్లు షికారు చేస్తున్నాయి. 5000 రైఫిళ్లు, టార్పెడో పడవలు, వివిధ రకాల ఆయుధాలు కావాలంటూ స్నేహ దేశాల్ని కోరినట్టు. అయితే పోరా టానికి సంబంధించి వీరివన్నీ తప్పుడు ప్రణాళికలు. క్యూబా నుంచి 50 మంది డాక్టర్లను రప్పించేందుకు హామీ పొందారు. అందుకు సంబంధించిన వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకే మచాడిటో ఇక్కడికొచ్చారు.

క్యూబాలో ఉన్నవారు నాదంతా నిరాశావాదంగా భావిస్తున్నట్టు టింబో ద్వారా తెలిసింది. నీవు నమ్మకాన్ని కోల్పోవద్దంటూ ఫిడేల్ నుంచి వచ్చిన సందేశం కూడా దాన్నే ధ్రువపరిచింది. క్యూబా పోరాటపు ప్రారంభ రోజుల్ని ఓసారి గుర్తు చేసుకోమన్నారు. అలాంటి ఇబ్బందులు ఎక్కడైనా ఎదురవుతాయన్నారు. ఇక్కడి నేత లంతా సరైన వారేనన్న భావన ఆయన మాటల్లో వ్యక్తమైంది. అందుకు సమా ధానంగా ఫిడేల్కు ఓ సుదీర్ఘ లేఖ రాశా. ఇక్కడి పరిస్థితులపై నా అవగాహన ఏమిటో

ఆయనకు వివరించా.

5-5-65, కాంగో...

ప్రియమైన ఫిడేల్. మీ లెటర్ అందింది. కార్మికవర్గ అంతర్జాతీయత పేరుతో మీరు నా పట్ల విరుద్ధ భావాల్ని వ్యక్తం చేశారు. మనం చేస్తున్న పొరపాట్లన్నీ తప్పకుండా రుజువవుతాయి. ఆధారంలేని నిరాశావాదంతో నేను బాధపడుతున్నాన్న భావన మీ నుంచి వ్యక్తం కావడంతో ఇక్కడి పరిస్థితిని మీకు అర్థమయ్యేలా వివరించడంలో విఫలమయ్యానన్న ఆందోళనకు నేను గురయ్యా...

మీ గ్రీకు బహుమతి (టెంబో) ఇక్కడికి రాగానే నాకో విషయం చెప్పారు. నేను రాసిన ఓ ఉత్తరం ద్వారా మీ దృష్టిలో నేనొక వెన్ను చూపిన మల్లయోధుణ్ణయ్యానని. మీ నుంచి ఆశావాద సందేశాన్ని తెచ్చిన మంత్రివర్యులు (మచాడిటో) కూడా మీరదే భావనతో ఉన్నట్టు ధ్రువపరిచారు. మీకోసం ఈ లెటర్ తెచ్చే వ్యక్తితో మీరు వివరంగా మాట్లాడగలరు. ఇక్కడికి రాగానే ఆయనకెదురైన మొదటి అనుభవంతో పాటు ఫ్రంట్‌లో పర్యటిస్తున్నప్పుడు ఆయన ఎలాంటి పరిస్థితిని చూశారో వివరంగా చెబుతారు. నేనో విషయం మీకు గుర్తు చేయదలిచా. వాస్తవ విరుద్ధ ఆశావాదమే నానుంచి వ్యక్తమైతే, ఇక్కడ నాకు దగ్గరగా ఉన్న వ్యక్తుల దృష్టిలో నా పేరు ప్రతిష్ఠలు మసకబారడం ఖాయం. మరో విషయం కూడా మీకు నేను స్పష్టంగా చెప్పగలను. నా చుట్టూ ఎంతటి ఘోర విపత్తు జరగనీగాక. అది నా అందమైన కలను అంతం చేయజాలదు.

ఇంతకుముందటి ఉత్తరాల్లో సాదా జనాల్ని ఎక్కువగా పంపించకుండా కార్య కర్తల్ని పంపించమని కోరా ఇక్కడ ఆయుధాలకు కొరత లేదు (ప్రత్యేక ఆయుధాల్ని మినహాయించి). సాయుధులు కూడా ఎక్కువే. సైనికుల విషయంలోనే కొరత ఉంది. ప్రత్యేకించి ఓ హెచ్చరిక. ఇక్కడి నుంచి అభ్యర్థన లేకుండా డబ్బు పంపకండి. ఈ జాగ్రత్తలతోపాటు వాస్తవాల్ని చెప్పకుండా దాచిపెడితే అంతర్జాతీయంగా మన విశ్వసనీయత దెబ్బతింటుంది. నేను దోషిగా నిలబడాల్సి వస్తుంది. అవన్నీ మీకు వివరంగా చెబుతా.

సౌమాలియట్‌తోపాటు ఆయన అనుచర కామ్రేడ్లు ఇక్కడ అంతా మంచే జరుగుతుందని

చెబుతూ మిమ్మల్ని పూదోటలో విహరింపజేస్తున్నారు. వారి అబద్ధాలన్నిటినీ వరుసగా చెప్పుకుంటూ పోతే మీకవి విసుగు పుట్టిస్తాయి. అందుకే ప్రస్తుత పరిస్థితుల వివరణకే పరిమితమవుతూ ఓ మ్యాప్ జత చేస్తున్నా ఇక్కడ రెండు జోన్లుండగా, ఓ దానిలో మాత్రమే విప్లవ నిర్మాణం కొంతమేరకు ఉంది. మేం ఉంటోంది కూడా అక్కడే. కసాయి ప్రొవిన్స్‌లోనూ కొంత ఉంది (అది ఎంత వరకో తెలియదు). అక్కడ ములేలే ఉంటున్నారు. దేశంలోని మిగతా ప్రాంతాల్లో కొన్ని బృందాలు అడవులకే పరిమితమయ్యాయి. అవి ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా ఉన్నాయి. వారు ఎలాంటి పోరాటం చేయకుండానే అంతా కోల్పోయారు. వాటిలో ఓ బృందానికి మాత్రమే బయటి ఉద్యమంతో సంబంధం ఉంది. కబీలా, సౌమాలియట్ల మధ్య విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. దాంతో, ఎలాంటి పోరాటం లేకుండానే పట్టణాల్ని కోల్పోవాల్సి వచ్చింది. కబీలా విషయంలో మనకు అనుమానాలు అవసరం లేదు. సౌమాలియట్ విషయంలో నేనలా చెప్ప లేను. ఆయన మీకు చెప్పినవన్నీ అబద్ధాలు. ఉద్యమ ప్రాంతాలకెళ్లకుండా అక్కడి ప్రజల బాధలేంటో తెలుసుకోకుండా ఇస్తున్న సమాచారమది. దార్ ఏ సలామ్‌లోని ఖరీదైన హోటళ్లలో ఉంటూ తాగి తందనాలాడుతూ విలాస జీవితం గడుపుతు న్నాడు. ఆ బాపతుగాళ్లంతా ఆయనతో జట్టుకట్టారు. వారి కార్యకలాపాలన్నీ మిగతా ఉద్యమకారులకు వ్యతిరేకంగా ఉన్నాయి.

తాజాగా షోంబే సేనకు చెందిన ఓ బృందం బరాకాను ఆక్రమించింది (దాదాపు వెయ్యి మంది సాయుధుల్ని కలిగి ఉన్న ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న మేజర్ జనరల్, సౌమాలియట్‌కు అనుకూలుడు). వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఈ ప్రాంతాన్ని ఎలాంటి పోరాటం లేకుండానే కోల్పోయాం. ఇప్పుడు ఎవరైతే నిందలు మోపుతున్నారో వారే ఎలాంటి పోరాటం చేయకుండా తమ అధీన ప్రాంతాల్ని శత్రువు చేతికి అందిస్తు న్నారు. సరస్సు నుంచి తగినన్ని ఆయుధాలు అందకుండా అడ్డుపడుతున్నారు. వాస్తవానికి వారు ఓ 75 ఎంఎం గన్‌తోపాటు రెండు ఫిరంగుల్ని కందకాల్లోకి విసిరేసి సిగ్గు లేకుండా పారిపోయారు. ఈ ఆయుధాల బాధ్యులంతా కనిపించ కుండా పోయారు. మిగిలిన వారు వాటిని క్యూబన్లు వెళ్లి తీసుకువస్తే మళ్లీ పోరా టంలో పాల్గొంటామంటున్నారు (వాటిని ఎక్కడ విసిరేశారో ఎవరికీ తెలియదు). ఇక్కడికి 36 కి.మీ.

దూరంలో ఉన్న పిజీ రక్షణకోసం ఏమీ చేయలేకపోతున్నారు. మనకు ఎంతో అనుకూలమైన పర్వతాల పక్కకందకాలు తవ్వేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీన్నిబట్టి ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకో గలరు. ఇక్కడికి పెద్ద సంఖ్యలో మనుషుల్ని పంపించకుండా అవసరాలకు తగ్గట్టుగా ఎంపిక చేయాలి. ఇక్కడ ఉన్న వాళ్లంతా మంచివారే. నన్ను విశ్వసించండి. అలా కానిపక్షంలో వారంతా ఏనాడో పారిపోయి ఉండేవారు. కానీ విషయం అది కాదు. ఇక్కడి పరిస్థితిని చక్కదిద్దాలన్నదే మీ ఆరాటమంతా. అయితే అందుకు మంచి మనుషులతో సరిపోదు. మహోన్నతులు కావాలి.

ఇప్పటికీ ఇక్కడ 200 మంది ఉన్నారు. నన్ను నమ్మండి. అయితే ఈ సమ యంలో వారు మేలు కన్నా కీడే ఎక్కువ చేస్తారు. ఒకవేళ మనం అందరితో కలిపి ఒకే బృందంగా పోరాటానికి నిర్ణయించకపోతే, విభజన చేయాలనుకుంటే, మనపై దాడికి శత్రువు ఎంతమందిని వినియోగిస్తున్నాడో తెలిసి ఉండాలి. అయితే ఇక్కడ అసలు సమస్య సంఖ్యకు సంబంధించి కాదు. స్థానికులెవరూ పోరాటానికి సిద్ధంగా లేకుండా మనంతట మనమే ఓ దేశాన్ని విముక్తి చేయలేమన్నది. పోరాట స్ఫూర్తిని రగిలించడం ద్వారా సైనిక జీవితానికి ఇష్టపడే వారిని ఎంపిక చేయాలన్నదే మీ కోరిక. కానీ, ఇక్కడ జరుగుతున్న తుచ్ఛమైన సంఘటనలు ఆ దిశగా ఆలోచిం చేందుకు అవకాశం లేకుండా చేశాయి.

పడవలకు సంబంధించి మరో అధ్యాయం. ఇద్దరు టెక్నీషియన్లను కొన్ని రోజుల పాటు కిగోమా ఒడ్డున ఉండాలని కోరా. అక్కడ వారు చేయాల్సిందెల్లా చెడిపోయిన పరికరాల్ని బాగు చేయడమే. వాటిలో సోవియట్ నుంచి వచ్చిన మూడు పడవ లున్నాయి. అవి నెలరోజుల క్రితమే ఇక్కడికొచ్చాయి. వాటిలో రెండు అప్పటికే పనికిరానివి. మూడో దానిపైనే మన రాయబారి సరస్సు దాటారు. దారి పొడవునా దానికన్నీ లీకేజీ. మూడు ఇటాలియన్ పడవల పరిస్థితీ అంతే. మరోవైపు పడవలతో పాటు విమాన విధ్వంసకాలకూ టాంజానియా ప్రభుత్వం అంత తేలిగ్గా అనుమ తించడంలేదు. క్యూబా ప్రభుత్వం వలె ఇక్కడి ప్రభుత్వాలు ఒకే కార్డుపై అనుమతు లివ్వడం లేదు (కార్డుల వ్యవహారం ఇక్కడ ఓ క్రీడలా తయారైంది). స్నేహిత ప్రభుత్వం మనకు ఏ మేరకు

సాయమందించగలదో తెలుసుకోవాల్సిందిగా రాయ బారిని కోరా, ఓడ పై వచ్చిన ప్రతి వస్తువునూ టాంజానియా ప్రభుత్వం విప్పి చూస్తోంది. అంతేగాక మన రాయబారిని వివరణ అడుగుతున్నారు.

డబ్బులతో ముడిపెట్టి నడుస్తున్న ఈ వ్యవహారమంతా నాకు బాధ కలిగిస్తోంది. ఇదంతా చూశాక ఓ ఫ్రంట్ కు (అది ఇక్కడ ప్రధానమైంది) సరఫరా బాధ్యతల్ని నేను చేపట్టా. నా కమాండ్ కింద మిశ్రమ సేనను ఏర్పాటు చేసి, ఇక్కడి పోరాటాన్ని నా ఆధ్వర్యంలోనే నిర్వహించాలనుకున్నా అందుకు సంబంధించిన వ్యూహాన్ని మీకు తెలియజేస్తా భారమైన హృదయంతో దానికయ్యే ఖర్చులన్నీ లెక్క వేశా. నెలకు 5000 డాలర్లు అవసరమవుతాయి. ఇక్కడి నేతలు ఓసారి పర్యటన కోసం ఇంతకు 20 రెట్లు ఖర్చుచేస్తున్నారనేది మరచిపోకూడదు. మరోవైపు, ఆఫ్రికా దేశాల రాజ ధానుల్లో వారికి భోజన, వసతి సదుపాయాల్ని ఉచితంగానే ఏర్పాటు చేస్తున్నారు. వారి రవాణా ఖర్చుల్ని కూడా ఇక్కడి విప్లవ ప్రభుత్వాలే భరిస్తున్నాయి (ఇక మందు, మగువల కోసమయ్యే ఖర్చుల్ని స్నేహిత ప్రభుత్వాలు లెక్కించడం లేదు. ఓవేళ మీరు నాణ్యత కోరితే మరింత ఎక్కువే ఖర్చు చేయగలరు).

చివరగా, కాంగోలోని విముక్తి ప్రాంతాలకు 50 మంది డాక్టర్లను పంపించే విషయం. అది వెయ్యి మందికి ఒకరి చొప్పన ఉంటుంది. ఇలాంటి సౌకర్యం రష్యా, అమెరికాతోపాటు ప్రపంచంలోని రెండుమూడు దేశాల్లో తప్ప మరెక్కడా లేదు. వారికోసం ఎలాంటి అలవెన్సులూ కోరలేదు. వారిని ప్రజా ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో కాకుండా రాజకీయ ప్రాధాన్యత క్రమంలో పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇంత పెద్దసంఖ్యలో పంపిస్తే, వారంతా విప్లవ డాక్టర్లయితే బాగుంటుంది. అవసరాన్ని బట్టి మరింత మందిని అభ్యర్థిస్తా. నర్సుల విషయంలోనూ తగిన అనుభవమున్న వారినే ఎంపిక చేయాలి.

మీకు పంపిస్తున్న మ్యాప్, ఇక్కడి మిలటరీ పరిస్థితిని సంక్షిప్తంగా తెలియ జేస్తుంది. వాస్తవ పరిస్థితులకు పరిమితమవుతూ మీనుంచి కొన్ని ఆశిస్తున్నా. ఇక మీరు కాల్పనిక బృందాల గురించి మరచిపోండి. వందమంది కార్యకర్తలకు శిక్షణ ఇవ్వండి (వారంతా నల్లవారే కావాలని ఏమీలేదు). వారిని ఉస్మానీ లిస్ట్ నుంచే ఎంచుకోండి. ఇక్కడ స్థిరంగా నిలువగల వారినే.

ఇక ఆయుధాల విషయం: ఓ కొత్త రాకెట్ లాంచర్, వెలుగునిచ్చే టోపీలు, కొన్ని ఆర్-4లు. ప్రస్తుతానికి ఇవి చాలు. రైఫిళ్ల గురించి మరచిపోండి. అవి ఎలక్ట్రానిక్‌వైతే తప్ప ఉపయోగంలేదు. ఫిరంగులన్నిటినీ టాంజానియాలోనే ఉంచండి. ఆపరేటర్లుగా నిపుణుల్ని పంపిం చండి. బురుండీ గురించి మరచిపోండి (టాంజానియా స్వతంత్ర దేశమన్న సంగతి గుర్తుంచుకోండి. అక్కడి నుంచి మన కార్యకలాపాలు సాఫీగానే సాగుతున్నాయి. దానికి సంబంధించి మీకు గుర్తుచేసింది చిన్న సమస్యే). మెకానిక్‌లను వీలైనంత త్వరగా పంపించండి. సరస్సును సురక్షితంగా దాటించేందుకు టాంజానియా అంగీకరించింది. డాక్టర్ల సమస్యను నాకు వదిలేయండి. వారిలో కొందరిని టాంజానియాకు ఇచ్చేస్తాను. ఖర్చుల విషయంలో మరోసారి పొరపాట్లు జరక్కుండా చూడండి. నాతో కలిసి కష్టపడే వారి విషయంలో మాత్రం ఖర్చుల గురించి ఆలో చించకండి. భ్రమల్లో కొట్టుకుపోకుండా నా మాటలపై విశ్వాసముంచండి. సమా చారాన్ని వాస్తవికంగా ఇవ్వాలంటూ బాధ్యుల్ని మందలించండి. ఇక్కడి పరిస్థితుల్ని బేరీజు వేసే సామర్థ్యంలేక ఊహాజనిత కథనాల్నే వారు మీకందిస్తున్నారు. వాస్తవాల్ని సమన్వయంతో మీ ముందుంచేందుకు యత్నించా. నా మాటలు సత్యమని మీరు నమ్మగలరా?

హృదయపూర్వక శుభాకాంక్షలతో...

గెరిల్లా దళాలతోపాటు కొనసాగితే తప్ప ఇక్కడ 50 మంది డాక్టర్లకు రక్షణ కల్పించడం అసాధ్యమన్న నా అభిప్రాయంతో మచాడిటో ఏకీభవించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలోనూ ఆయన నాతో ఏకీభవించారు. ఇక్కడ జరుగుతున్న దురదృష్టకర సంఘటనల్ని ప్రత్యక్షంగా చూడటమే గాక, విప్లవ స్ఫూర్తితో ఫ్రంట్‌ల్ని నడిపించడం కోసం మేం చేస్తున్న ప్రయత్నాల్నీ ఆయన గమ నించారు.

ప్రజా ఆరోగ్య మంత్రిలాంటి కొందరు కామ్రేడ్లపై నాకు నమ్మకముంది. పరి స్థితుల్ని చక్కదిద్దేందుకు పిజీ ప్రాంతం నుంచి వచ్చిన ఆయనకు ఎంతోకొంత అధికారం ఉంది. అయితే ఆయనకు స్థానికంగా పట్టు లేదు. వాస్తవ పరిస్థితుల పట్ల అవగాహన కూడాలేదు. దానికి తోడు మసెంగోకూ, ఆయనకూ మధ్య దూరం పెరిగింది. ప్రజా ఆరోగ్యం పట్ల స్వీయ అనుభవం కూడా

ఆయనకు లేదు. ఆయనకు అందుబాటులో ఉన్న వనరులెల్లా, ఫ్రంట్ల కోసం, మన బృందాలు పర్యటించే ప్రాంతాలకోసం వచ్చిన క్యూబన్ డాక్టర్లు, కొన్ని మందులు మాత్రమే. ఇంతకు ముందు పిజీపై శ్రద్ధ చూపాలని మసెంగోకు చెప్పాం. డాక్టర్లను పంపించి, అక్కడొక రేడియోస్టేషన్ ఏర్పాటు చేయాలనుకున్నాం. కానీ, ఇప్పుడు చరిత్ర మారిపోయింది. పిజీ, శత్రువు చేతుల్లోకి వెళ్లిపోయింది.

లుబోండ్జా నుంచి మోజా తిరిగి వచ్చారు. అక్కడి దంప్‌లో జరిగిన పేలుళ్లపై పరిశీలించి వచ్చారు. బరాకాను కోల్పోయామన్న వార్త చెప్పారు. అక్కడ ఎలాంటి పోరాటమూ జరగలేదన్నారు. అక్కడి బాధ్యులు తుపాకుల్నీ ఫిరంగుల్నీ దాచి పెట్టినట్టు చెప్పారు. అక్కడ కొత్తగా వచ్చిన బల్గేరియన్ ఇన్‌స్ట్రక్చర్స్ ముద్ర కని పిస్తుంది.

వివిధ ఫ్రంట్ల నుంచి అందిన సమాచారంతో నేతలందరినీ ఓ సమావేశానికి పిలిచాం. ఎవరికోసమైతే వెతికామో వారంతా చివరికి ప్రత్యక్షమయ్యారు. అప్పటి దాంక్రాం కేలిగ్నిటేగానీ, జీన్ ఇలా (కలోండా-కిబుయే కమాండర్) గానీ ఎలాంటి దిద్దుబాటు చర్యలూ తీసుకోలేదు. జరిగినదానికి వారు తమను తాము నిందించు కుంటున్నారా లేక ల్యాంబర్ట్ పై నిందలు మోపుతున్నారా అన్నది తెలియదు. సమావేశానికి మసెంగో, ముజుంబా, ప్రజా ఆరోగ్యమంత్రి, కమాండర్లు ఇలాజీన్, కేలిగ్నేట్లతోపాటు ల్యాంబర్ట్ ఫ్రంట్ నుంచి ఇతర కమాండర్లు, రాజకీయ ప్రతి నిధులు, పరిశీలకులు హాజరయ్యారు. జకారియాస్కు కబురు పంపిస్తే, ఆయన నుంచి జవాబులేదు. దాంతో, రువాండన్ల ప్రాతినిధ్యం లేకుండా పోయింది. సమావేశంలో నా మాటల సారాంశం ఇలా ఉంది.

మొదట అక్కడ ఉన్న వారిపై పరిచయ వాక్యాలు: క్యూబాకు చెందిన ప్రజా ఆరోగ్య మంత్రి, ఆరోగ్య రక్షణ అవసరాల్ని పరిశీలించడం కోసం వచ్చారు. సికీక్యూబన్ సైన్యపు ముఖ్య అధికారి, టెంబో పార్టీ కార్యదర్శి. ఇక్కడి పోరాటం కోసం తన పదవిని వదులుకున్నారు. కామ్రేడ్ మోజా, కామ్రేడ్ ఎంబిలీ-వీరిద్దరికీ సుదీర్ఘ పోరాట అనుభవముంది. మసెంగో విషయంలోనూ నేను ఇలాంటి విశ్లేషణే ఇచ్చా. దీంతోపాటు పలువురు నేతల వ్యవహార శైలి గురించి విశ్లేషించా. ల్యాంబర్ట్ -చురుకైన కామ్రేడ్ అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే అంతా తానే నడిపించాలనుకుంటారు. ఓ సైన్యాన్ని ఏర్పాటు చేయలేక పోయారు. ఆయన అక్కడ ఉంటేనే

వారంతా పనిలో ఉంటారు. లేదంటే ఏమాత్రం ముందుకు కదలరు. ఇందుకు ఉదాహరణగా చనిపోయిన కామ్రేడ్ విషయం చెప్పా తన ఫ్రంట్ సభ్యు లతో సాన్నిహిత్యం ఉంది. ఫ్రంట్లో ఆయనే ముందు వరుసలో ఉంటారు. కేలిగ్నిటే ఇందుకు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈయన ఏనాడూ పోరాటంలో పాల్గొనలేదు. అయితే వీరి రెండు దృక్పథాలూ చెడ్డవే. మొదటిది- నాయకుడు ఫ్రంట్ కు సన్ని హితంగా ఉండకపోతే మనలేడు అనేది. రెండోది- ఫ్రంట్ కు పూర్తిగా దూరంగా ఉండటం. దీనివల్ల ఫ్రంట్‌తో సంబంధాలు తెగిపోతాయి. కలోండా-కిబియే ప్రతి నిధులు రోడ్డు పక్కనే స్థావరాన్ని ఏర్పాటు చేయడం తప్పిదమని చెప్పా వీరు శత్రువుతో పోరాడిన సందర్భమే లేదు. అలాంటి చోట 150 మంది అవసరం లేదని చెప్పా ఆ తర్వాత క్రమశిక్షణారాహిత్యం, అరాచక చర్యలు, పరాన్న లక్షణాల గురించి విశ్లేషించా. అసలైన దోషాలు ఇవే. వాతావరణాన్ని మర్యాదపూర్వకంగా మార్చారే తప్ప, వాటి నుంచి బయటపడ్డామని ఎవరూ హామీ ఇవ్వలేదు.

సమావేశంలో నేను మాట్లాడిన తీరుపై కామ్రేడ్ టింబో తన అభిప్రాయం చెప్పారు. నేను తప్పులెంచానే తప్ప, కాంగో సమస్యలల గురించి మాట్లాడలేదన్నారు. గెరిల్లా యుద్ధం ద్వారా మనం ఏం సాధించగలమో చెప్పలేదన్నారు. ఆయన విమర్శలో స్పష్టత ఉంది.

నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయంటూ పుకార్లు షికారు చేస్తుండటంతో నేను నా కామ్రేడ్స్‌తో కూడా ఓ సమావేశం నిర్వహించా. కాంగోలో వాస్తవ పరిస్థితి గురించి ఫిడేల్కు తెలియకపోవడం వల్లే క్యూబన్లు ఇంకా కొనసాగుతున్నారన్నది కొందరి అభిప్రాయం. వాస్తవానికి పరిస్థితి సంక్లిష్టంగానే ఉందని వారితో చెప్పా విముక్తి సేన కొంతమేరకు ఆత్మరక్షణలో పడిపోయిందనీ, నిర్మాణ బలహీనతల నుంచి తనను తాను కాపాడుకునేందుకే పోరాడాల్సి వస్తోందంటూ వివరించా. మా పని ఎంతో కఠినమైనది, కృతజ్ఞత లేనిది. విజయంపై విశ్వాసముంచాలని వారిని కోరలేను. పరిస్థితిని చక్కదిద్దడం కోసం ఎంతో చేయాల్సి ఉంది. పాక్షికంగా ఎన్నో ఓటములు ఎదురయ్యాయి. దాంతో, నా నాయకత్వ సామర్థ్యంపై విశ్వాస ముంచాలని డిమాండ్ చేయలేను. అయితే ఓ విప్లవకారుడిగా నా నిజాయితీని నమ్మండంటూ పిలుపునివ్వగలను. ఇక్కడి సంఘటనలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఫిడేల్‌కు అందించాం.

ఇక్కడ జరిగిందేదీ ఆయనకు తెలియకుండా దాచిపెట్టలేదు. "కాంగోకు నేను నా వ్యక్తిగత విజయాన్ని ఆశించి రాలేదు. లేదంటే నా వ్యక్తిగత గౌరవంకోసం ఎవరినీ బలిపెట్టేందుకు కూడా కాదు. అలాంటి ఉద్దేశాలే నాలో ఉంటే.. ఇక్కడ మనకు జరిగిన నష్టాల గురించిన సమాచారమిచ్చే వాడినే కాదు. ఎందుకంటే నేను నా నిజాయితీని కోల్పోలేదు. అయితే నేను ఇక్కడి మను పుల మానసిక స్థితిని వివరించా. ఊగిసలాట, అనుమానాలు, బలహీనతల గురించి విశ్లేషించా." ఆనాటి సియేరామీస్త్రా అనుభవాల్ని గుర్తు చేసుకున్నా కొత్తవారి రాకతో విశ్వాసాన్ని కోల్పోయి నిర్వేదానికి గురైన సందర్భమది. "తమకు తాము సాధువు లుగా భావించుకున్నవారంతా మరుసటి రోజుకే వైరాగ్యానికి లోనయ్యారు. క్యూబాలో విప్లవోద్యమాన్ని బలోపేతం చేసే క్రమంలో మాకెదురైన అనుభవాలవి. అలాంటివే కాంగోలోనూ ఎందుకుజరగవనుకోవాలి? ప్రజల నుంచే కాంగో విప్లవ సేనను నిర్మించాలి. అందుకోసం ఒకరి తర్వాత ఒకరిని పరీక్షిస్తున్న సందర్భమిది."

దళాల నైతిక స్థయిరాన్ని పెంపొందించడం కోసమే ఈ వివరాలన్నీ చెప్పాల్సి వచ్చింది. మనుషులతో సరిగ్గా పని చేయించడమనేది సంక్లిష్టమైన విషయం. క్రమశిక్షణ గల కార్యకర్తలు నిర్దేశిత నియమాల్నే అనుసరిస్తారు. అయితే వారి పనిలో సృజనాత్మకత లోపిస్తోంది. ప్రతిదీ అనేకసార్లు పరీక్షించి చూస్తారు. అలాంటి వారిని దారిలో పెట్టేందుకే నేను కొన్ని సామెతల్ని ఉపయోగించా (అవి మరీ అంత సున్నితమైనవేమీ కాదు). ఇక్కడికొచ్చిన కొన్ని రోజులకే ఓ క్యూబన్ని వెనక్కి పంపించాం. అది కాల్పనికంగా ఊహల్లో విహరిస్తున్న సందర్భం. అలాంటిదే ఇప్పుడు చేస్తే, ప్రస్తుతం నా దగ్గర ఉన్నవారి సంఖ్య సగానికి పడిపోయి ఉండేది. అదృష్టవశాత్తూ అలా చేయలేదు.

ఫిడేల్‌కు టింబో ఓ సుదీర్ఘ లేఖ రాశారు. ముఖ్యంగా ఇక్కడ జరిగిన సంఘటనల్ని ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ.. ఈ సమాచారమంతా తీసుకొని మచాడో క్యూబా వెళ్లారు.

కమాండర్లతో సమావేశ ఫలితంగా అకాడమీ రూపు రేఖల్లో కొన్ని మార్పులు చేశాం. ఇప్పుడిక ఒక్కో ఫ్రంట్ నుంచి 50 మంది చొప్పున 150 మంది సైనికు లుంటారు (ల్యాంబర్ట్, కలోండా-కిబుయే, కేలిగ్టిటే). వీరితోపాటు స్థానిక రైతుల నుంచి ముజుంబా ఎంపిక చేసిన 60 మంది ఉంటారు.

బరాకా సంఘటన నేపథ్యంలో మసెంగోతో చర్చించా. పిజీ రక్షణ కోసం సికీ నేతృత్వంలో కొంతమందిని పంపించాలనుకున్నాం. అయితే అందుకు సికీ ఓ షరతు విధించారు. పరిస్థితి సీరియస్గా ఉన్నందున కమాండ్ మొత్తం క్యూబన్ల నేతృత్వం లోనే పని చేయాలన్నారు. తాజాగా, లులింబా కోసం జరిపిన దాడి విఫలం కావడంతో ఇలాంటి నిర్ణయం తప్పనిసరైంది. ఇక క్యూబన్లు లక్ష్యరహితంగా ఒంటరిగా పోరాడుతూ చావడానికి సిద్ధంగాలేరు. అలాంటివే మరోసారి జరి గాయంటే చాలామంది పోరాటం విరమించి వెనక్కి వెళ్లే అవకాశాలున్నాయి.

పరిస్థితిని సమీక్షించకుండా అన్ని రకాల ఆయుధాలూ మా దగ్గర లేకుండా బరాకాపై దాడికి నిర్ణయించలేను. అక్కడ శత్రు సైనికుల సంఖ్య ఎంతో మాకు తెలియదు. అయితే వారి మోహరింపుల వల్ల మేం అనేక సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. శత్రుసేన ఆధీనంలోని తీరం చుటూ పర్వతాలు అలుముకొని ఉన్నాయి. చివరగా పిజీపై పర్యవేక్షణ కోసం మనుషుల్ని పంపాల్సిందిగా మసెంగోను కోరా అందుకోసం తన అధికారాన్ని ఉపయోగించాలని చెప్పా. కాంగోకు రావాల్సిందిగా కబీలాకు లెటర్ రాయాలని కోరా. సౌమాలియట్తోపాటు ఆయన మనుషుల చెడు పనుల గురించి మాట్లాడేందుకు వీలు కాలేదు. వారి బలహీనతల్ని గుర్తు చేయడం నా బాధ్యతగా భావించా. అవన్నీ తన ద్వారా కబీలాకు తెలియాలన్నదే నా ఉద్దేశం. ఆ సమయంలో ఓ విప్లవ నాయకుడు ఎదుర్కోవాల్సిన త్యాగాలేమిటో చెప్పాలను కున్నాం. అంతే తప్ప, వారిపై పెత్తనం చేయాలన్న లక్ష్యం మాకు లేదు.

కబీలాకు లెటర్ రాస్తానని మసెంగో హామీ ఇచ్చారు. ఆ పని ఆయన చేశారో లేదో నాకైతే తెలియదు.

పిజీ శత్రువు చేతుల్లోకి ఇప్పటికే వెళ్లిపోయిందంటూ పుకార్లు వ్యాపించాయని ల్యాంబర్ట్ నాకో లెటర్ రాశారు. నేను తన దగ్గరికి 25 మందిని పంపిస్తే, దారిలో మరో 25 మందిని కలుపుకొని బరాకా లేదా పిజీ (ఇప్పటికే కోల్పోయివుంటే)ని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. అందుకు నేను అనుమతించనని చెప్పా. అతని సెక్టార్లో ఎన్నో బలహీనతలున్నాయి. వందలమందితో ఉన్నప్పుడే కోల్పో యిన వారు 25 లేదా 50 మందితో స్వాధీనం చేసుకుంటానంటే నమ్మలేం.

తన చిన్న బృందంతో పిజీకి వెళ్తున్నట్టు ప్రత్యుత్తరం రాశారు.

ఇలాంటి పరిస్థితుల్లో, లులింబా ప్రాంతంలోని శత్రువుకు ఎలాంటి హానీ తలపెట్టలేం. ప్రధాన స్థావరం నుంచి మనుషులెవరూ మైదానంలోకి రావడం లేదు. కబేంబర్ రోడ్డు మీదుగా స్థావరానికి ఓ సమాచార బృందాన్ని పంపాం. కిబీ నదిని దాటి ఆవతలి వైపున శత్రు బలాన్ని అంచనా వేయడమే వారి పని. అక్కడ యథాస్థితి కొనసాగుతుందంటూ నివేదిక పంపారు. స్థావరంలో తనతో మిగిలివున్న 25 మంది ఇక ఎంతో కాలం ఇక్కడ కొనసాగలేరంటూ ఇంచార్జ్ నుంచి సమాచారమొచ్చింది. మిలటరీ చర్యల కోసం తీసుకెళ్తామంటే మాత్రం స్థావరాన్ని వీడి వెళ్తామంటూ వారు తేల్చి చెప్పినట్టు ఆయన తెలిపారు. అది పేరుకు మాత్రమే పోరాట వీరులుండే యుద్ధ స్థావరం.

**********

భయాలన్నిటినీ పక్కకు నెట్టి మా చిన్న సేనలోకి కాంగోవాసుల్ని చేర్చుకోవాలను కున్నాం. మిలటరీ శిక్షణకు సంబంధించిన ప్రాథమిక విషయాల్ని వారికి నేర్పాలను కున్నాం. విప్లవ స్ఫూర్తిని సజీవంగా ఉంచడంలో ఈ చర్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఐతే, మారిన వాతావరణాన్ని తట్టుకోవడంలో క్యూబన్లు ఇంకా శక్తిహీనులు గానే మిగిలిపోయారు. అప్పటివరకూ మలేరియాతో బాధపడ్డ వారికి ఉదర వ్యాధులు తోడయ్యాయి. నాకున్న వైజ్ఞానిక స్ఫూర్తితో నా విషయంలో వ్యాధి తీవ్రతను లెక్కించి డైరీలో నోట్ చేసుకోగలిగా. 24 గంటల్లో నాకు 30 సార్లు విరేచనాలయ్యాయి. నాలా ఎంతమంది బాధపడ్డారో ఆ చుట్టుపక్కల పొదలకే తెలిసి ఉండాలి. చాలారోజుల వరకూ ఈ వ్యాధి నుంచి బయటపడలేకపోయాం. శక్తి వంతమైన సూక్ష్మక్రిమి నాశకాలు (యాంటీ బయోటిక్స్) కూడా మా బాధను నివా రించలేకపోయాయి. అప్పటికే దెబ్బతిని ఉన్న మా నైతిక స్థైర్యం మరింత దిగజారి పోయింది. ఆ సమయంలో క్యాంప్ బయట జరిగే ఎంతటి గొప్ప సంఘ టనగానీ, ఎంతటి తెలివైన చర్యగానీ మమ్మల్ని స్పృహలోకి తేగలదన్న నమ్మకం లేదు.

మేం చేర్చుకున్న కాంగోవాసుల్లో కొందరు 'దవా కోసం దగ్గరలోని క్యాంప్ కెళ్లారు. అక్కడి కాంగో డాక్టర్ (మంత్రగాడు)తో పరీక్షలు జరిపించుకున్నారు. ఆ తర్వాత పోరాటాన్ని విరమించి, ఇంటిముఖం పట్టారు. వారితో నేరుగా మాట్లాడి ఒప్పించలేకపోవడం మా బలహీనతగా అనిపించింది. నా సందేశాల్ని అను వాదకులు సరిగ్గా వివరించలేకపోవడం, నా చర్మపు రంగు భిన్నంగా ఉండటం కూడా వారితో సాన్నిహిత్యాన్ని పెంచలేకపోయింది. పని చేయడానికి నిరాక రించడం, ఇంకా ఇతర బలహీనతలపై ఫ్రెంచ్లో వారిని తీవ్రంగా మందలించా. ఇలాంటి వారితో కన్నా మహిళలతో సైన్యాన్ని నిర్మించడమే సరైందని చెప్పా నా మాటల్ని అనువాదకుడు స్వాహిలీలో చెబుతుండగా, వారంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ పగలబడి నవ్వుకున్నారు.

వారిలో బలహీనతల్ని ప్రోత్సహించే ప్రధాన శత్రువు "దవానే అనిపించింది. అలాంటి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకని ముగంగా అనే స్థానిక మంత్రగాన్ని పిలిపించా. వారి దృష్టిలో ఆయన రెండో శ్రేణి వైద్యుడు. ఆయన రాగానే క్యాంప్లో ఆనందం వెల్లివిరిసింది. వారిని పునరుత్తేజుల్ని చేయడంలో ఆయన ఎంతో తెలివిగా వ్యవహరించారు. నా దృష్టిలో ఆయన మొదటి శ్రేణి వైద్యుడు. మరుసటి రోజు ఆయనతో మాట్లాడుతూ, ఎక్కువ రోజులపాటు పోరాటాల్లో పాల్గొని అలసిపోయిన

వారి దగ్గరికి ఓ బృందంతో కలిసి మీరు వెళ్లాలనికోరా. ఇంతకుముందు వారికిచ్చిన దవా ఇపుడు పని చేయడం లేదనీ, దాంతో, వారంతా పోరాటం నుంచి వెనక్కి మళ్లుతున్నారని చెప్పా. అందుకు ఆయన నిరాకరించారు. వారి కోసం శక్తివంతమైన మరో దవా తయారు చేస్తానన్నారు. మాలో ఒకరు ఆయన మాటలతో ఏకీభ వించారు. ఆ తర్వాత వారు శక్తి దవాతో వెళ్లారు. దాంతో, పోరాట మార్గం సులభమైంది. వేగం పెరిగింది. మంచి ఫలితాలిచ్చింది.

కలోండా-కిబుయే ప్రాంతంలో ఆచరణాత్మక శిక్షణ గురించి చాలారోజుల క్రితమే మసెంగోతో చర్చించా. ఓ క్యూబన్ బృందాన్ని పంపిస్తానని చెప్పా. వారు కాంగోవాసుల రెండు బృందాలతో పోరాటం చేయిస్తారని, వారి చర్యల ఆధారంగా మెరుగైన యోధుల్ని ఎంపిక చేస్తారని చెప్పా కటెంగా సమీప ప్రాంతంలో మేం ఇదే విధానాన్ని అనుసరించనున్నాం. ప్రస్తుతానికైతే అక్కడ పోరాటాన్ని నిలిపివేశాం. ఒకరిద్దరు మినహా కాంగో వాసులంతా వెళ్లిపోవడం వల్ల అలా చేశాం. అజీతో ఇద్దరిని పంపగా, మిగతా వారు మాతో ఉన్నారు. రోగాల వల్ల, ఇతర భయాల వల్ల పోయినవారు పోగా కొద్దిమంది మాత్రమే వివిధ ఫ్రంట్లలో మిగిలివున్నారు.

కలోండా-కిబుయేలో ఎంబిలీతో 13 మంది మాత్రమే ఉన్నారు. ఆ కమాండ్ కు ఇఫ్రినీ రెండో నేత. క్యూబాలో ఇఫ్రినీ ఓ సాధారణ సైనికుడు. ఆయనలోని నాయ కత్వ లక్షణాల్ని గుర్తించి బాధ్యతలు అప్పజెప్పాం. కాంగో వాసులతో ఓ సైనిక బృందాన్ని ఏర్పాటు చేయడం కోసం స్థానిక నేతలకు ఆయన శిక్షణ ఇస్తారు. 20 రోజులపాటు దాడుల్లో పాల్గొనేలా షెడ్యూల్ నిర్ణయిస్తారు. ఇక్కడి వాతావరణం క్యూబన్లకు సరిపడనందున అంతకన్నా ఎక్కువ రోజులు వారు పోరాటంలో నిలువ లేరు. ఓ బృందం తర్వాత మరో బృందం మరో చోట పోరాటానికి వెళ్తుంది. ఒకే చోట వరుస దాడులు నిర్వహించదలచుకోలేదు. ఎందుకంటే... మొదటి బృందానికి కొంత విశ్రాంతినివ్వడం వల్ల పునరుత్తేజం పొందుతుంది. అప్పటికే ఎంబిలీ కింబీ నది దాటి దాడులు ప్రారంభించారు. కొన్ని గంటల తేడాతో సికీ నుంచి, ఆ తర్వాత మసెంగో నుంచి నివేదికలందాయి. సికీ నుంచి వచ్చిన నోట్ ఇలా ఉంది.

మోజా... శత్రు సైనికులు పిజీలో ముందుకు వస్తున్నారు. వారిని నిలువరించేందుకు

మేం ఏమీ చేయలేకపోతున్నాం. నిలిచిపోయేందుకు వారూ సిద్ధంగా లేరు. మేమిపుడు పీజీ నుంచి లుబోండ్జా వైపు వెళ్తున్నాం. వంతెనల్ని కూల్చేందుకు యత్నిస్తాం. నా పర్యటన విఫలమైందని టాటూతో చెప్పగలరు.

సికీ... 10-10-65

మసెంగో పంపిన నోట్‌లో పీజీని కోల్పోయామని స్పష్టం చేశారు. దాంతో, కలోండా-క్రిబియే బృందాన్ని తన ఆధీనంలో ఉంచాలని సూచించారు.

సరస్సు నుంచి రైతులు వచ్చారు. మా కోసం ఆహారంతోపాటు కొన్ని మందులు తెచ్చారు. మేం వారికి కొంత ఉప్పు, పంచదార ఇచ్చాం. మా మనుషులకు తీయని టీ తాగే అవకాశం దొరికింది. కబింబా ప్రాంతంలో ఓ దాడికి యత్నించామంటూ అలీ నుంచి పనికిమాలిన ఉత్తరమొకటి వచ్చింది. దారిలో సిగరెట్ల ప్యాకెట్ కనిపించడంతో వెనక్కి తిరిగారట. చివరికి ప్రధాన రహదారి చేరుకునేసరికి 60 మంది కాంగోవాసుల్లో 25 మంది మాత్రమే మిగిలారు. రోడ్డుపక్కన వెళ్తున్న కొందరు రైతుల్ని పట్టుకున్నారు (వారి నుంచి సమాచారం కోసం). కొన్ని గంటల్లో కబింబాలోని సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి ఓ లారీ వస్తుందంటూ వారిలో ఎవరో చెప్పారట. శత్రు సైనికులు రావడానికి వారం రోజులు పట్టింది. సుదీర్ఘంగా వేచి ఉండి, ధైర్యంగా ఆపరేషన్ పూర్తి చేసినందుకు పదోన్నతులు పొందారట. కెప్టెన్కు మేజర్ కమాండర్గా లేదా ఫీల్డ్ కమాండర్‌గా, వగైరా... వగైరా.

పీజీ నుంచి సికీ వచ్చారు. అక్కడి పరిస్థితిని ఆయన సమీక్షించారు. ఐతే, ఆయన మూలేన్తో జరిపిన సంభాషణల్లో అనేకమంది అనువాదకులుగా వ్యవహరించారు (సికీకి ఫ్రెంచ్‌గానీ, స్వాహిలీగానీ రాదు; మౌలేన్‌కు ఫ్రెంచ్ రాదు). దాంతో, ఆయన ఇచ్చే సమాచారం ఎంతవరకు నమ్మదగిందో చెప్పడం కష్టం. ఆయన కథనాన్ని కుదించి చెబితే ఇలా ఉంటుంది. తక్షణమే అక్కడ కందకాలు తవ్వాలన్నారు. ప్రస్తుతం, ఆ స్థావరంలో ఉన్నది మాత్రం ముగ్గురే. ఒకరు రాకెట్ లాంచర్ దగ్గర ఉంటే మరొకరు ఆయనకు సహాయకుడు. ఇంకొకరి దగ్గర సోవియట్ మెషీన్ గన్ ఉంది. శత్రు దళాల్ని నిలువరించేందుకు రోడ్డు మధ్యలో ఓ నాటు మందు పాత్ర ఉంచారు. కందకాలు తవ్వడం,

శత్రు దళాల్ని అంచనా వేయడంలాంటివి ఇంకా జరగలేదు. దీనిపై మసెంగోను మౌలేన్ తీవ్రంగా దుయ్యబట్టారు. దళాలకోసం లేదా ఆయుధాల కోసంగానీ, పోరాటంలో క్యూబన్ల సహకారం కోసంగానీ ఆయన ప్రయత్నించలేదన్నారు. ఇలాంటి పరిస్థితిలో పిజీని రక్షించడం అసాధ్యమన్నారు. గోతులు తవ్వుకునేందుకు తానేమీ శవాన్ని కాదన్నారు (అదృష్టవశాత్తూ ఆయన ఇంకా బతికే ఉన్నారు). తప్పంతా మసెంగో పైకి నెట్టారు. దీనిపై మసెంగో నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. మౌనం వహించడం ద్వారా తనది తప్పని ఆయన ఒప్పుకున్నట్లా లేదా అన్నది తెలియదు. ఆ రాత్రి వారు పిజీలో నిద్రించలేకపోయారు.

శత్రు సేనలతో మౌలేన్ కుమ్మక్కయ్యాడనేది కొందరు కామ్రేడ్ల అనుమానం. అందుకు ఆధారాలు మాత్రం నా దగ్గర లేవు. ఐతే, ఆయన మాత్రం మనవాళ్లంతా వెనక్కి వచ్చాక కూడా అక్కడే కొనసాగారు. ఆయన అసలు సంగతి కాలమే తేలుస్తుంది. ప్రస్తుతానికైతే ఆయన శత్రువు చేతులతో ఆడుకుంటున్నాడు.

అంతరంగికుల మధ్య విభేదాల వల్ల నష్టాలు ఎక్కువయ్యాయి. పర్వతాల పక్కన బరాకా నుంచి పిజీ వరకూ 37 కి.మీ. రోడ్డు మార్గం దాడులు జరిపేందుకు ఎంతో అనుకూలమైంది. అక్కడి సరస్సు కూడా మనకు రక్షణగా ఉంటుంది. ఆ వైపు వాహనాలు వెళ్లడం ఎంతో కష్టమైన పని. అక్కడి బ్రిడ్జి కూడా ఇప్పటికే శిథిలావస్థలో ఉంది. దాన్ని ధ్వంసం చేయడం ద్వారా మనం పూర్తిస్థాయిలో రక్షణ పొందే వీలుంది. కనీసం శత్రువు దూకుడుగా ముందుకు రాకుండా నిలువరించగల ఈ అవకాశాన్ని ఎవరూ ఉపయోగించకోలేకపోయారు.

అక్టోబర్ 12న శత్రు దళాలు లుబోండ్జాను ఆక్రమించేందుకు ముందుకు రాసాగాయి. పిజీ శత్రువు వశమయ్యాక ల్యాంబార్ట్ 40 మందితో అక్కడికెళ్లారు. వెళ్లేముందు లుబోండ్జా పక్కన చెట్ల పొదల్లో వేసిన భారీ ఆయుధాల్ని తిరిగి దక్కించుకోలేకపోయాం. పర్వత ప్రాంతంలోని ఆ స్థావరాన్ని కాపాడలేకపోయారు. లులింబా నుంచి బరాకా వైపు శత్రు దళాల కదలికల్ని నిలువరించడంలో అదికీలక స్థావరం. అక్కడే నిలిచి పోరాడాల్సిందిగా ల్యాంబర్ట్‌ను మసెంగో ఆదేశించ లేకపోయారు.

మసెంగో క్యాంప్‌కు వచ్చేసరికి సహనం కోల్పోయి శత్రువు నుంచి రెండు పక్కలా దాడి

జరుగుతుండగా, దాన్ని కాపాడేందుకు నా దగ్గరున్న మనుషుల వల్ల కాదని చెప్పా. తూర్పు చివరన ఎంబిలీ తన బలగాల్ని సమీకరిస్తున్నారు. తనతో ఉన్న 13 మందితో ఆయన ఆ దిశగా ప్రయాణం సాగిస్తున్నారు. క్యూబన్లు 13 మంది ఓ వైపున, పదిమంది మరోవైపున శత్రు దాడుల్నించి ఈ ప్రాంతాన్నంతా కాపాడేందుకు యత్నిస్తే ఈ 23 మందికి చావు తప్పదు. ఆ తర్వాత మిగతావారు ఒక్క అంగుళమైనా ముందుకు కదలగలరో లేదో చెప్పలేం. స్థావరం దగ్గరి ఆయుధా గారంలో 150 బాక్సులున్నాయి. వాటిలో వివిధ రకాల ఆయుధాలున్నాయి. ప్రత్యేకించి భారీ ఆయుధాలు; ఫిరంగులు, విమాన విధ్వంసకాలు, 12.7 మెషిన్ గన్లు. క్రితంరోజు వాటి రక్షణకోసం మేం చేయాల్సింది చేశాం. ముసుగుతన్ని పడుకున్నవారి ముఖాలపై నీళ్ల కుమ్మరించాం. రాత్రంతా వారితోనే ఉన్న మసెంగో మాత్రం వారితో ఏమీ చేయించలేకపోయారు.

తన మనుషులతో వచ్చి రక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా ల్యాంబర్ట్‌కు లెటర్ రాయాల్సిన బాధ్యత మసెంగోది. ఆ లెటర్ ఆయనకు అందిందో లేదో తెలియదు గాని ఫలితం మాత్రం కనిపించలేదు. త్వరలోనే మాకు వార్తలందాయి. ఎలాంటి పోరాటం లేకుండానే లులింబా, లుబోండ్జాల్ని కోల్పోయినట్టు. మా మనుషుల ఆలోచనా విధానం చాలా చెడ్డగా ఉంది. కాంగోవాసులకు ఫిరంగుల బాధ్యత అప్పజెప్పగా, వాటిని వారు వదిలేసి పారిపోయారు. కాంగోవాసుల్లాగే మావాళూ ఆలోచిస్తున్నారు. ఎవరి రక్షణ గురించి వారే. క్రమం తప్పి వెనక్కి పరుగు తీయ డంలో ఓ వ్యక్తి తప్పిపోయాడు. అతడు గాయపడ్డాడా లేక శత్రువు చేతిలో చని పోయాడా, బందీ అయ్యాడా అన్నది ఎవరికీ తెలియదు. లేదంటే అతడు సరస్సు ప్రాంతానికి లేదా మరో చోటికి వెళ్లి ఉంటాడనుకున్నాం. ఏది ఏమైనా, అతన్ని గురించి ఆ తర్వాత ఏమీ తెలియలేదు. ఆ రోజు పెద్దసంఖ్యలో ఆయుధాల్ని కోల్పోయాం.

కాంగో కామ్రేడ్లతో ఓ సమావేశాన్ని నిర్వహించాం. మేం ఓ కొత్త సేనను నిర్మించ నున్నట్టు వారికి వివరించాం. మాతో కలిసి పోరాడేందుకు ఇష్టం లేనివారు ఆయుధాల్ని విడిచి పోవాల్సిందిగా సూచించా. మేం కాపాడుకున్న ఆయుధాగారం మాతోనే ఉంటుందని చెప్పా. మాతో ఉండేవారు మేం ఓ అడుగు ముందుకు వేసినా, రెండడుగులు ముందుకు వేసినా అలాగే వేయాలని, అప్పుడే

వారికి మాతో కొనసాగే వీలుంటుందని చెప్పా. ఇదివరకటి పని విధానం నచ్చలేదనీ, అది మార్చుకోగలమనే నమ్మకముంటేనే మీరు మాతో కలిసుండాలని తేల్చి చెప్పా. ఆ మాటలు ఫలితాల్నిచ్చాయి. పోరాటాన్ని విడిచి వెళ్లేందుకు 15 మంది అంగీక రించారు. ఓ కమాండర్ తాను సాధారణ సైనికునిగానే కొనసాగుతానన్నారు (ఇదివరకటి హోదాల్ని నేను ఒప్పుకోనని చెప్పా). మేం ఆశించినదానికన్నా మాతో ఉన్న కార్యకర్తల సంఖ్య ఎక్కువే.

స్థావరానికి తిరిగి వచ్చేందుకు మసెంగో అంగీకరించారు. ఆయనతోపాటు టింబో, సికీ, డాక్టర్- అనువాదకుడు కాసులు కూడా వస్తారు. రెండు వైపులా రాజకీయంగా ఏం బాగాలేని పరిస్థితి. షోంబే పడిపోవడం, ప్రభుత్వ ఏర్పాటుకు కింటా చేస్తున్న ప్రయత్నాలన్నీ వైఫల్యం చెందడం, రాజధాని లియోపోర్డ్ విల్లేలో జరుగుతున్న పరిణామాలు. రాజకీయంగా ప్రత్యామ్నాయం లేని దుస్థితి. ఆపరేషన్స్ నిర్వహిస్తూ ముందుకు వెళ్లడానికి ఇదే మనకు అనుకూల సమయం. శత్రుదళాలు ముందుకు రాకుండా వాటికవే ఎక్కడివక్కడ నిలిచిపోతున్న సందర్భం.

దార్ ఏ సలామ్లో మాకు ఇంచార్జ్‌గా ఉన్న కామ్రేడ్ రఫెల్ పర్యటన కోసం ఇక్కడికొచ్చారు. నాతో చర్చించారు. ప్రాథమిక అంశాల్లో మా ఇద్దరి మధ్యా అంగీకారం కుదిరింది. ముఖ్య నేతలు పోరాట ప్రాంతంలోనే ఉండి ఆదేశాలివ్వాలి. వారి వెంట ఓ వార్తాహరుడుంటారు. సంఘటనల గురించి ఎప్పటికప్పుడు హవానాకు సమాచారమందిస్తారు. నూతన సైనిక స్థావరానికి వారినికోసారి ఆహారం పంపిస్తారు. వీలైనంత త్వరగా సరఫరాలు జరిగేలా చూస్తానన్నారు. దార్ ఏ సలామ్ నుంచి ఓ వ్యక్తి కిగోమా వెళ్లి చాంగా స్థానంలో పని చేస్తారు. చాంగాకు స్వాహిలీ రాకపోడంతోపాటు ఇతర సమస్యల వల్ల ఆయన్ని మా దగ్గరికి పంపిస్తారు. ఆయన ఇక్కడ పడవలకు ఇంచార్జ్‌గా ఉంటారు.

వసతుల విషయంలో ఇదివరకటి నా అభిప్రాయం తప్పని తెలుసుకున్నా మార్చుకున్నా కాంగోవాసులతో కలిసి పోరాటాన్ని నడిపేందుకు ఓ కేంద్రక దళాన్ని ఏర్పాటు చేయాలనుకున్నాం. మా స్వీయ త్యాగాల ద్వారా విప్లవ సేనకు మార్గ దర్శకులుగా నిలవాలనుకున్నాం. కేంద్రక దళం నా కమాండ్ కింద పని చేయ నుంది. మిగతా దళాల కన్నా మెరుగైన ఆహారం, ఆయుధాల్ని కేంద్రక దళానికి అందిస్తారు. విప్లవ కార్యాచరణ నుంచే కేంద్రక దళాన్ని నిర్మిస్తాం. మేమనుకున్నది సాధ్యం

కావాలంటే కిగోమా నుంచి మాకు అవసరమైన వస్తువులు అందాల్సివుంది. సరస్సు నుంచి ఫ్రంట్కు సరఫరాల విషయంలో రైతులు సహకరిస్తారు. ఆ పనికి కాంగో సైనికుల్ని ఒప్పించడం కష్టం. మా వాళ్లే చేయాలంటే మాత్రం ఇక పోరా డేందుకు ఎవరూ ఉండరు.

మా దళాల్ని రెండు కంపెనీలుగా విభజించాం. ఆ కంపెనీలకు రెండో కమాం డర్లుగా జివా, అజీమా వ్యవహరిస్తారు. ఎంబిలీ, మోజా ఆదేశాలతో వారు కొంత కాలం పోరాటంలో పాల్గొంటారు. అదే వారికి శిక్షణ. కంపెనీ మౌలిక స్వరూపం ఇలా ఉంటుంది. ఒక్కో కంపెనీలో 15 మంది క్యూబన్లకు 45 మంది కాంగోవాసు లుంటారు. అవసరాన్ని బట్టి మరికొందరు తోడుగా ఉంటారు. ప్రతి కంపెనీకి ఓ కమాండర్ ఉంటారు. ముగ్గురు క్యూబన్లు ప్లటూన్ కమాండర్లుగా ఉంటారు. స్వాడ్ కమాండర్లుగా ముగ్గురు క్యూబన్లు (ఒక్కో స్క్వాడ్లో ఐదుగురు సభ్యులు). అంటే ఒక్కో కంపెనీకి 9 మంది స్క్వాడ్ కమాండర్లు. కంపెనీ కమాండర్ కింద ఓ రెండో కమాండర్ ఉంటారు. ఆయనకు ఓ సహాయక దళం ఉంటుంది. వారంతా క్యూబన్లే.

మేం కొత్త క్యాంప్కు మారిపోయాం. పాత దాన్నుంచి రోడ్డు మార్గాన వెళ్లే ఓ గంట ప్రయాణం. పర్వతాల పక్కనే మైదానంలో ఉంది.

**********

ఇటీవలే ట్రిమెండో పుంటో వచ్చారు. ఆయన ఉన్నతస్థాయి రాజకీయ ప్రతినిధి. చార్లెస్ కూడా మాతో చేరారు. ఆయన ఆచరణవాది. అసాధారణ ప్రతినిధి. క్రికెంబే మాట్లాడేవారితో ఆయన నేరుగా పని చేస్తున్నారు. మా బృందంలో ఎక్కువమంది వారే. పుంటో ఇక్కడ ఉండటానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తా ఎందుకంటే. ఇక్కడి వారికి కార్యకర్తలుగా శిక్షణ ఇచ్చేవారికోసం ఎదురుచూస్తున్నాం. బెన్నేతో ఒప్పందం కోసం టాంజానియా ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్నట్టుగా అక్కడి మా రాయబారి నుంచి సమాచారమందింది. ఏం జరగనుందో నాకైతే తెలియదు. నేను మాత్రం పోరాటాల్ని చివరిదాకా కొనసాగించేందుకు సిద్ధమయ్యా పోరాట బావుటాను ఉన్నతస్థాయిలో నిలిపేందుకు నాతో కలిసి వచ్చేవారికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తా.

ప్రకృతిరీత్యా కొత్త క్యాంప్ చాలా బాగుంది. ఐతే, వసతులరీత్యా దారుణంగా ఉంది. నీటి లభ్యత చాలా తక్కువ. చిరుజల్లులతో బురదమయంగా ఉంది. గత అనుభవాల దృష్ట్యా ఈ వాతావరణం ఉదరవ్యాధులకు కారణం కానుంది. ప్రధాన రహదారికీ-క్యాంప్‌కు మధ్య ఎత్తయిన పర్వతాలుండటంతో చుట్టుపక్కల ఏదీ కని పించదు. ఎత్తైన ప్రాంతాన్ని ఎంచుకునేందుకు ఏ పర్వతం పక్కనా నీరు లేదు. నీరులేని చోట్ మా పెద్ద బృందం ఆశ్రయం పొందితే గందరగోళంగా ఉంటుంది. ఆయుధాల డంప్ కోసం ఆదేశించా. లుబోండ్జా నుంచి తెచ్చిన 150 పెట్టెల్ని దాచేందుకు సరైన ప్రాంతం కోసం వెతికా. మరికొన్ని జాగ్రత్తలు తీసుకున్నా శత్రు దాడుల నుంచి మమ్మల్ని కాపాడేందుకు ఓ ప్లటూన్ను సిద్ధం చేశా.

కొందరు రైతులు మాతో చేరడంతో మూడో కంపెనీకి మార్గం సులభమైంది. ఇదే ప్రక్రియ నాలుగు కంపెనీల ఏర్పాటు వరకూ కొనసాగించాలనుకున్నా ఆ తర్వాత కొంత్ర విరామమిచ్చి పరిస్థితిని సమీక్షించదలిచా. సంఖ్యను పెంచుకోవడం పట్ల నాకు ఆసక్తి లేదు. అసలైన ఎంపిక పోరాటంలోనే జరగాలి. మసెంగో విజ్ఞప్తి మేరకే స్థానిక రైతులు మాతో చేరారు. నియమాల పుస్తకాన్ని ప్రతి వ్యక్తికీ చదివి వినిపించారు. చార్లెస్ ఎంతో చక్కగా అనువదించారు.

సరస్సు దగ్గరున్న మచాడో నుంచి ఓ లెటర్ వచ్చింది. పడవ అందుబాటులో లేక సరస్సు దాటలేకపోయానన్నారు (చివరికి ఎలాగో అలా సరస్సు దాటారు). తన వెంట కామ్రేడ్ అరోబెయినీని తెసుకెళ్తున్నారు. ఆయన వేలికి గాయమైంది. మా సంఖ్య మరొకటి తగ్గుతోంది. డాక్టర్లతో

మాట్లాడినట్టు మచాడో చెప్పారు. పోరాటాన్ని విరమించి వెళ్లామనగా, మరో ఆరు నెలలపాటు అంటే మార్చి వరకూ ఉండాల్సిందిగా ఒప్పించినట్టు తెలిపారు. తాను చెప్పింది వినకపోతే వారి కర్మకు వారిని వదిలేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. విధివిధానాలు కొంత అమానుషంగానే ఉన్నాయి. ఐతే, లక్ష్యసాధన కోసం తప్పదు. ఆయనతో నేను ఏకీభవించా.

లుంబోడ్వా నుంచి తెచ్చిన ఆయుధాల్ని మరో సురక్షిత ప్రాంతంలో డంప్ చేయాల్సిందిగా రెండు బృందాల్ని పంపించా. ఐతే, డంప్‌ను రక్షించడంలో వారు విఫలమైనట్టు తెలిపారు. సరస్సు నుంచి వచ్చిన ఓ బలహీన బృందానికి బాధ్యత అప్పజెప్పడంతో తప్పిదం జరిగిపోయిందన్నారు.

లుంబోడ్వా, కలోడా -క్రిబియే, మకుంగో స్థావరాల నుంచి వచ్చిన అనేకమంది దళసభ్యులు ఆ చుట్టుపక్కల తలదాచుకుంటున్నారు. సమీప గ్రామాల్లో ఆశ్రయం పొందుతున్నారు. స్థానికుల్ని బెదిరించి తమ అవసరాల్ని తీర్చుకుంటున్నారు. దీనికి ఓ పరిష్కారం ఇవ్వాలనుకున్నాం. ఆ ప్రాంతంలో పర్యటించిన చార్లెస్ బృందం దళసభ్యుల నుంచి ఆయుధాల్ని స్వాధీనం చేసుకోవడంతో వారి ఆగడాలకు అడుకట్ట పడింది. సోమరిపోతుల దుశ్చర్యల వల్ల ఎన్నో బాధలు పడ్డ రైతులు, మా ప్రతిచర్యతో ఎంతో సంతోషించారు. ఆ వెధవల్ని అలాగే వదిలివుంటే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చివుండేది.

నిర్మాణ చర్యలతోపాటు శిక్షణ పని ప్రారంభించాలని నిర్ణయించాం. కాంగో, క్యూబా వాసుల విరామ సమయాన్ని అందుకు ఉపయోగించాం. కార్యాచరణ ప్రణాళిక కోసం రెండు సమావేశాల్ని నిర్వహించాం. ఒకటి - సాధారణ సిబ్బంది అధికారులతో, రెండోది– పార్టీ సభ్యులతో, మొదటి సమావేశం ద్వారా మిలటరీ శిక్షణ విధివిధానాల్ని ఖరారు చేశాం. ఒక్కో కంపెనీకి దాని ప్రత్యేక లక్షణాల్ని నిర్వ చించాం. జరపనున్న ఆపరేషన్ల లిస్ట్ తయారుచేశాం. అంతరంగిక క్రమశిక్షణతో పాటు కాంగోవాసులతో సమైక్యతను ప్రతిపాదించాం. అధికారుల్లో స్ఫూర్తి లోపించింది. చర్చల్లో వారి నుంచి అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. చివరికి ఆమోదయోగ్యంగా సమావేశం ముగిసింది. ప్రారంభంలో వసతుల కల్పనపై చర్చించాం. మరుగుదొడ్లు, హాస్పటల్, నీటి శుభ్రత, శత్రువుపై దాడికి అనుకూల ప్రాంతంలో కందకాలు తవ్వడం. ఐతే, వర్షం మరింత తీవ్రం కావడంతో పనులు

నెమ్మదిగా జరుగుతున్నాయి. ఆయుధాల డంప్పు మార్చాలన్న ప్రతిపాదన వాయిదా వేశా. ముందుగా కొండపై నిర్మాణాలు పూర్తి చేయాలి. ఇక్కడ నా బలహీనత కూడా కొంత బయటపడింది. అదే సమయంలో రక్షణ విషయంలో మా అవగాహన తప్పని తేలింది. శత్రు దళాలు మాకు కొన్ని కి.మీ. దూరంలోనే పొంచి ఉన్నట్లు తెలిసింది. దాంతో, బహిరంగ పోస్టుల్ని ఏర్పరచలేకపోయాం. ఐతే, అంతర్గతంగా ఏర్పాటు చేశాం.

పార్టీ సమావేశంలో క్రమశిక్షణతో పోరాడగల వీరోచిత సేనను నిర్మించాలన్న నా ప్రతిపాదనకు ఆమోదం లభించింది. విజయం సాధించగలమని మీలో ఎవరైనా నమ్ముతున్నారా అంటూ ప్రశ్నించా. అందుకు మోజా, ఎంబిలీతోపాటు ఇటీవలే అక్కడికి వచ్చిన డాక్టర్లు మాత్రమే చేతులెత్తారు. వాస్తవ పరిస్థితుల పట్ల అవ గాహనతోనా లేక నా పట్ల వారికున్న అపార నమ్మకంతోనా అంటే నా పట్ల వారికున్న విధేయత వల్లే అన్నది వాస్తవం. నేను కొన్నిసార్లు గొప్ప త్యాగాల్నే కోరుకుంటానని, అలాంటి సందర్భాల్లో మీరు కష్టాల్లో చిక్కుకుంటారంటూ వారిని హెచ్చరించా. అది మీకు ఇష్టమేనా అంటూ మరోసారి ప్రశ్నించా. ఈసారి అందరూ చేతులెత్తారు.

ఆ తర్వాత పార్టీ సభ్యుల వివిధ బలహీనతల్ని విశ్లేషిస్తూ, విమర్శలు చేయగా అందుకు అందరూ ఆమోదం తెలిపారు. బవాజా మాత్రం ఒప్పుకోలేదు. శత్రు దాడికి భయపడి ఆయుధాన్ని దాచిపెట్టిన కామ్రేడ్. ఐతే, బవాజాలో ఉన్న అసా ధారణ గుణాల్లో ఒకటి. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం. అది క్యూబన్-కాంగో కామ్రే డ్లందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. ఐతే, ఆ సమయంలో ఆయన తన బలహీనతల్ని బయటపెట్టుకున్నారు. ఆయుధాన్ని దాచిపెట్టారు. ఈ విషయాన్ని నేను పదేపదే గుర్తు చేయగా, చివరికి అయిష్టంగానే నాది పొరపాటే అంటూ ఒప్పుకున్నారు. నా ఉద్దేశమిక్కడ ఆయన్ని విమర్శించాలని కాదు, మన బలహీనతల్ని విశ్లేషించు కోవడం. కామ్రేడ్లలో అనేకమంది అది మన సమష్టి వైఫల్యమన్నారు. సమావేశం ముగిసే సమయానికి కాంగోవాసులకు విజయం సిద్ధించే విధంగా సైనిక నిర్మాణం జరగాలన్ననా కలలకు కొద్దిమంది మాత్రమే మద్దతు తెలిపారు. స్వీయ త్యాగాలకు సిద్ధపడేవారి ద్వారా అది సాధ్యమేనన్నది నా వివేచనాత్మక నమ్మకం.

ఇక్కడ కష్టసాధ్యమైన మరో ముఖ్య విషయం చర్చకు వచ్చింది. అది క్యూబన్ కాంగోవాసుల

మధ్య ఐక్యత సాధించడం. వ్యక్తిగత అరాచకత్వాన్ని నిరోధించేందుకు సమష్టి వంటశాలల్ని ప్రారంభించాం. ఐతే, మా ఆహారాన్ని కాంగోవాసులు ఇష్టపడ లేదు. వారి నిరసన కొనసాగుతూనే ఉంది. (వంటవాళ్లు క్యూబన్లే. లేదంటే వండిన ఆహారం మాయమవుతోంది) ఇది ఉద్రిక్తతలకు దారితీసింది.

కలోండా-కిబుయే కమాండర్ జీన్ ఇలా 70 మందితో వచ్చి మాతో చేరారు. ఐతే, అప్పటికే మా దగ్గర సరిపడినంతా ఉండటంతో వారిని వెనక్కి పంపాం. వారి దగ్గరికి క్యూబన్ల బృందం వస్తుందంటూ హామీ ఇచ్చా. లులింబా-కటెంగా రహ దారిపై దాడుల్ని ఆర్గనైజ్ చేస్తామని చెప్పా అక్కడ మనకింకా చర్యలు జరపగల శక్తి ఉంది. జీన్ కోరిక మేరకు ఆయన వెంట వచ్చినవారితో మాట్లాడా. మీతో కలిసి పని చేస్తామని చెప్పా రైతుల పట్ల మీ ప్రవర్తన మార్చుకోవాలంటూ హెచ్చరించా. మీ పూర్వ చరిత్ర మరచిపోవద్దంటూ గుర్తు చేశా. మా వాళ్లను కూడా హెచ్చరించా. పోరాటాన్ని వదిలి వెళ్లే కాంగోవాసుల్ని క్షమించినట్టుగా ఉండదనీ, కాల్చి వేస్తామని చెప్పా పోరాటాన్ని వీడి వెళ్లేవారు తమతోపాటు ఆయుధాల్ని తీసుకెళ్తున్నారు. అలాంటివారి పట్ల కఠినంగా ఉండక తప్పదు. రైఫిళ్ళు ఇచ్చి వెళ్లే వారిని స్వేచ్ఛగా వదిలేందుకు అభ్యంతరముండదు.

చుట్టుపక్క గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించి ఆయుధాల కోసం వెతికాం. ఓ మెషిన్ గన్ దొరికింది. దానికి కొన్ని భాగాలు లేవు. కలోండా-కిబుయే నుంచి వచ్చిన మరోదాని విడిభాగాల్ని కలిపి ఒకటి తయారుచేయగలిగాం. నా హెచ్చరికలు కొందరిని కదిలించాయి. పోరాటాన్ని వీడి వెళ్లేందుకు నిర్ణయించారు.

అక్టోబర్ 22 ఉదయం లుబోండ్జా వైపు నుంచి ఫిరంగి కాల్పుల శబ్దాలు విని పించాయి. శత్రుదళాలు ముందుకు దూసుకువస్తున్నట్టుగా అర్థమైంది. మేం కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వెంటనే మసెంగోకు లెటర్ రాశా. సరస్సు నుంచి దళాల్ని రప్పించాలని చెప్పా. నావైపు నుంచి రక్షణ చర్యలు సాధ్యం కాదని వివరించా. మరికొన్ని సూచనలు చేశా. పిజీ, ఉవీరాలకు కొందరిని పంపించి మనవాళ్లను వెనక్కి రప్పించాలని సూచించా.

లుబోండ్జా నుంచి సమాచారమందింది. ఆయుధాల డంప్‌ను రెండుగా విభజించి రహస్యంగా

దాచిపెట్టామన్నారు. లుబోండ్జాకు కొందరు క్యూబన్లు, రాకెట్ లాంచర్లు, కొన్ని ఆయుధాలు కావాలన్నారు. అందుకు నేను అంగీకరించలేదు. వారి కోరిక నెరవేర్చాలంటే మా దళాల్ని ఆయుధాల్ని పంచి ఇవ్వాల్సిందే.

అక్టోబర్ 24, కాంగోకు మేం చేరుకొని ఆరు నెలలు పూర్తయిన రోజు. భారీ వర్షం కురుస్తోంది. మా గుడిసెలోకి నీటి చుక్కలు జారుతున్నాయి. పాత క్యాంప్ నుంచి జింక్ రేకులు తెచ్చేందుకు కాంగోవాసులు కొందరు అనుమతి కోరగా వెళ్లమన్నాను. ఓ గంట గడిచాక తుపాకీ కాల్పులు, గ్రనేడ్ పేలుళ్ల శబ్దాలు విని పించాయి. కాంగోవాసుల్లో కొందరు అప్పటికే శత్రు దాడుల్లో చిక్కుకుపోయారు. ఐతే, శత్రు దళాలు కాస్త దూరంగా ఉండటంతో తప్పించుకునేందుకు వీలైంది. క్యాంప్‌లో ఉన్న కాంగోవాసులంతా ఒక్కసారిగా పరుగుపెట్టారు. దవా కోసం స్థానిక డాక్టర్ ఇంటికెళ్లారు. ఇక మేమక్కడ ఉండటం అసాధ్యమైంది. జివా కంపెనీతో ఆత్మరక్షణా చర్యలు ప్రారంభించాం. శత్రు దళాల్ని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాం. పర్వతాల మీదుగా వస్తున్నట్టు మన కామ్రేడ్లు చెప్పారు. నాకు మాత్రం ఎవరూ కనిపించలేదు. ఎంతమందని అడిగితే. చాలా మంది అంటూ సమాధానం. ఎంత మందో చెప్పలేకపోయినా చాలా మందే ఉన్నారు. మా పరిస్థితి సంక్లిష్టంగా ఉంది. శత్రువు కొండ దిగితే ఇక మేం తప్పించుకోవడం కష్టం. రెబోకేట్ నేతృత్వంలో ఓ ప్లటూన్ను పంపించా. శత్రువును వీలైనంత ఎత్తున నిలువరించాలని చెప్పా. సందిగ్ధ స్థితిలో చిక్కుకున్నాం. మేం అక్కడే ఆగి ఉంటే శత్రుదళాలు మమ్మల్ని చుట్టుముట్టే ప్రమాదముంది. వెనక్కి మళ్లితే ఆయుధాల డంప్ కోల్పోతాం. అందులో రెండు 60 రకం ఫిరంగులు, ఓ రేడియో పరికరం ఉన్నాయి. వాటిని వెంట తీసుకెళ్లేందుకే సమయం లేదు.

శత్రు దళాల్ని ఎదుర్కొనేందుకే నిశ్చయించా. చీకటి కమ్ముకునే వరకూ శత్రు సేనను నిలువరించి, ఆ తర్వాతే వెనక్కి వెళ్లాలనుకున్నా లులింబా రోడ్డుకు అవతలి వైపు శత్రుసేన కనిపించగానే కాల్పులు ప్రారంభించాలనుకున్నా ఇలా అను కుంటుండగానే ఓ కామ్రేడ్ పరుగుతీస్తూ మావైపు రాసాగారు. ఆయన తీవ్రంగా గాయపడినట్టు అనిపించింది. ఐతే, అది రాకెట్ లాంచర్ పేల్చినప్పుడు మంటలు లేవడంతో కాలిన గాయమని తెలిసింది. శత్రువు అప్పటికే కొండ

దిగినట్టుగా ఉప్పందించారు. వెంటనే అందరినీ వెనక్కి వెళ్లాల్సిందిగా ఆదేశించా. మెషిన్‌గన్ను ఆపరేట్ చేసే కాంగోవాసి పారిపోగా దాన్ని ఓ క్యాబిన్ దాచిపెట్టారు. మరో చివరన ఉన్న మన మిత్రులకు సమాచారమివ్వాల్సిందిగా కొందరిని పంపించా. సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని చెప్పా. ఇక మేం వేగంగా వెనక్కి పరుగుతీశాం. ఎన్నో వస్తువుల్ని అక్కడే వదిలేశాం. పుస్తకాలు, డాక్యుమెంట్లు, ఆహారం, రెండు చిన్న కోతులు. అవి అదృష్ట చిహ్నాలుగా నా దగ్గరే ఉండేవి.

ఓ బృందం నా ఆదేశాల్ని అందుకోలేక శత్రు దాడుల్లో చిక్కుకుంది. ఎన్నో నష్టాల్ని చవిచూసింది. ఆ బృందంలోనే బవాజా, మగంగా కూడా ఉన్నారు. జివా, అజీమాలతో కలిసి పోరాడారు. పారిపోతున్న కాంగోవాసులకు ఆయుధాలు దాచి పెట్టమని చెప్పారు. చీకటి పడేంతవరకూ శత్రువును నిలువరించేందుకే యత్నిం చారు. చివరగా రాకెట్ లాంచర్ ను ఆయుధాల డంప్ వైపు పేల్చి తిరుగుముఖం పట్టారు.

ముందే చెప్పినట్టు మేం ఓ పక్కకు పరుగుతీశాం. శత్రువు మమ్మల్ని చుట్టుముట్టే అవకాశాన్ని ఛేదించాం. నా నైతికత బాగా దిగజారిన సందర్భమిది. జరగనున్న దాడిని ముందే పసిగట్టలేకపోయినందుకు నన్ను నేను నిందించుకున్నా నన్ను అనుసరించిన బృందం చాలా పెద్దది. మా దారిలో శత్రు దళాలుంటే గుర్తిం చేందుకని కొందరిని ముందుకు పంపించా. కొండ పక్కనే నా కోసం వేచి ఉండమని చెప్పా. ఐతే, వారక్కడ ఆగకుండా ముందుకు వెళ్లారు. కొన్ని రోజులు గడిచాకే వారు మాకు మళ్లీ కనిపించారు. మేం మాత్రం కొంతసేపు అక్కడే ఆగిపోయాం. ఆ సమయంలో అక్కడ మిగిలిఉంది 13 మంది మాత్రమే అన్న చేదు నిజం నాకు బోధపడింది. అలాంటి పరిస్థితిలో ఫిడేల్‌ను మించిన సమర్థుడెవరైనా ఉంటే ఎలా ఉండేదో. నేనైతే అంతటి సమర్థుణ్ణి కాదని చెప్పగలను. అక్కడ మిగిలింది మోజా, ఎంబిలీ, కరీం, ఉటా, పోంబో, టుమైనీ, దనసీ, ముస్తాఫా, ద్వాలా, సిటిసీ, మరెంబో, ట్రిమెండో, నేను. మిగతా వారు ఏమైపోయారో తెలియదు.

చీకటి పడింది. శత్రు సైనికుల కాల్పుల శబ్దాలు వినపించడం ఆగిపోయింది. మేం ఓ గ్రామానికి చేరుకున్నాం. అక్కడ కొంచెం వెన్న, కోడి మాంసం దొరికాయి. క్యాంప్‌కు 3 కి.మీ. దూరంలో ఉన్నాం. ఇంకాస్త దూరంగా వెళ్ళేందుకు రోడ్డు మార్గంలో ప్రయాణించాం. ఒకటి లేదా

ఒకటిన్నర కి.మీ. దూరంలో మరో గ్రామానికి చేరుకున్నాం. అక్కడ రైతులున్నారు. మరికొంత కోడి మాంసం తిన్నాం. అందుకోసం రైతులకు డబ్బులివ్వబోగా వద్దని వారించారు. మమ్మల్ని తమ సోదరులుగా భావిస్తున్నట్లు చెప్పారు. ఓటమి దురదృష్టకరమన్నారు. మా కోసం ఎవరైనా గైడ్‌గా ఉండాలని కోరాం. అందుకు వారు భయంతో వణికిపోయారు. తమకు డాక్టర్లతోపాటు ఓ వ్యక్తి తెలుసన్నారు. వారు కొద్ది దూరంలోని మరో గ్రామంలో ఉన్నట్లు తెలిపారు. ఓ మనిషిని అక్కడికి పంపించాం. డాక్టర్ పీజీ, నర్స్ కింబీ, మరో ఇద్దరు కామ్రేడ్లను తీసుకొచ్చారు. ఉదయాన్నే గ్రామాల్లో పర్యటించేం దుకు బయలుదేరగా కాల్పుల శబ్దం విని అక్కడే ఆగిపోయామన్నారు. కాసేపటికి పారిపోయి వస్తున్న కాంగోవాసుల పెద్ద గుంపు తమను చేరుకుందన్నారు. వారిలో ఓ వ్యక్తి గాయపడి ఉండగా, అతనికి చికిత్స జరిపామన్నారు. గాయపడ్డ వ్యక్తి వారికి ఓ సమాచారమిచ్చారు. మరో కాంగోవాసికి స్వల్ప గాయాలు కాగా, బవాజా పరిస్థితి సీరియస్‌గా ఉందంటూ, వారెక్కడ ఉందీ చెప్పారు. అలసట తీర్చుకు నేందుకు కాసేపు కునుకు తీశాం. ఓ గైడ్ను తోడుగా తీసుకొని బయలుదేరాం. ఉదయం ఆరు గంటలకు బవాజా ఉన్న చిన్న గ్రామానికి చేరుకున్నాం. అక్కడ క్యూబన్లతోపాటు కాంగోవాసులు పెద్దసంఖ్యలో ఉన్నారు.

విపత్తు కారణాలతోపాటు జరిగిన నష్టాల గురించి స్పష్టమైంది. ఆ సమయంలో పర్వతశ్రేణుల్ని సమీపిస్తున్న శత్రు దళాల్ని నిలువరించేందుకని కొంతమందిని పంపించా. ఐతే, కొండ కింద క్యాంప్‌లోకి ప్రవేశిస్తున్న శత్రు దళాల్ని గమనించా మని, కాల్పులు మాత్రం జరపలేదన్నది వారి కథనం, పారిపోతున్న మేం ఇంకా ఆ ప్రాంతాన్ని దాటి ఉండకపోవచ్చన్న అనుమానం వల్లే కాల్పులు జరపలేదన్నారు. వాస్తవానికి జరిగింది వేరుగా ఉందని జివా వివరించారు. శత్రు దళాల్ని చూసి పరుగు తీసి వస్తున్న రైతుల్ని చూసి శత్రువులుగా భ్రమపడ్డారని, అసలు శత్రు దళాలు మైదానాన్ని దాటి పర్వత ప్రాంతంలోకి ప్రవేశించనే లేదన్నది కథనం. నా అనుమానమే నిజమైంది. సమాచార సిబ్బంది నిర్మాణాత్మకంగా లేకపోవడం వల్లే తీవ్ర తప్పిదం జరిగింది. జరగకూడని నష్టం జరిగిపోయింది. శత్రువుపై దాడి చేయగల మంచి అవకాశాన్ని కోల్పోయాం. పారిపోయే ప్రయత్నం వల్లే బవాజాపై కాల్పులు జరిగాయి. గాయపడ్డ ఆయన్ని

కామ్రేడ్లు తమ భుజాలపై ఈ గ్రామానికి మోసుకొచ్చారు.

కొండకు ఇరుపక్కలా రక్షణ వలయంగా ఏర్పడ్డాం. మా పరిస్థితి ఇంకా ప్రమాదంలోనే ఉంది. బవాజాకు చికిత్స జరుగుతోంది. తూటా దండ ఎముకను తాకి ఊపిరితిత్తుల వైపు దూసుకుపోయింది. గాయాన్ని చూడగానే కొన్నేళ్ల క్రితం క్యూబాలో జరిగిన సంఘటన గుర్తొచ్చింది. ఆ సమయంలో గాయపడ్డ కామ్రేడ్‌కు సేవకున్ని నేనే. కొన్ని గంటల్లోనే ఆయన చనిపోయారు. బవాజా శక్తివంతుడు. ఆయన ఎముకలు బలమైనవి కావడంతో తూటా నెమ్మదిగా లోనికి వెళ్లింది. దాంతో, ఊపిరితిత్తుల మధ్యకు చేరుకోలేకపోయింది. నొప్పులు మాత్రం తీవ్రంగా ఉన్నాయి. వీలైనంత వరకు కట్టు కట్టాం. వర్షం కురుస్తుండటంతో నిటారు పర్వతంపై నడవడం కష్టమవుతోంది. అలిసిపోయిన మనుషులు బరువైన తమ స్నేహితున్ని మోసుకెళ్తున్నారు. కాంగో కామ్రేడ్ల నుంచి ఎలాంటి సాయమూ ఆశించకుండా.

బవాజాను మోసుకెళ్లడానికి ఆరు గంటలు పట్టింది. భయానక వాతావరణంలో భుజాలపై పది, పదిహేను నిమిషాల కన్నా మోయలేకపోతున్నాం. మేం కొద్ది సంఖ్యలోనే ఉండటంతో భుజాలు మార్చుకోవడం కూడా కష్టంగా ఉంది. సాయ మందించేందుకు కాంగోవాసులెవరూ ముందుకు రాలేదు. ఓ చోట శత్రు దళాలు మావైపు వస్తున్నట్టుగా అనిపించింది. దాంతో, బవాజాను వెనక్కి తీసుకెళ్లాల్సిందిగా ఆదేశించా. ఐతే, కొద్దిసేపటికే వారు రైతులని అర్థమైంది. అనుకూల ప్రాంతానికి చేరుకున్నాక గ్రామాలవైపు చూశాం. శత్రు దళాలు రైతుల ఇళ్లను తగలబెడుతున్న దృశ్యాలు కనిపించాయి. మంటలు పెద్దయెత్తున పైకి లేస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలే తగలబడిపోతున్నాయి. ఓవైపు గాలిలో పొగలు చిమ్ముతుండగా, మరోవైపు రైతులు పర్వతాల వైపు పరుగున వస్తున్నారు.

చివరికి ఓ చిన్న గ్రామాన్ని చేరుకున్నాం. తినేందుకు అక్కడ ఏమీ లేదు. అక్కడ ఉన్న వారంతా కాందిశీకులే. తమ కష్టాలకు కారణమైనవారిపై మౌనంగా కోపా వేశాల్ని వ్యక్తం చేస్తున్నవారే. వారందరి నోటా వచ్చేది ఒకే మాట. మేమిక ఏంతిని బతకాలి? వారికున్న పొలాల్నీ పశువుల్నీ వదిలేసి వచ్చారు. తమ చేతుల్లో మోయ గలిగినంతా మోసుకొచ్చారు. చిన్న పిల్లలు, ఒకటి రెండు

రోజులకు మాత్రమే సరిపడినంత ఆహారం. కొందరు రైతులు తమ కష్టాల్ని నాకు వినిపించారు. శత్రు దళాలు అకస్మాత్తుగా తమ గ్రామం మీద పడ్డాయి. వచ్చీరాగానే తుపాకులతో బెదిరించి తమ మహిళలపై అత్యాచారాలకు తెగబడ్డాయి. ఆ సమయంలో ప్రాణభయంతో పరుగుపెట్టడం తప్ప మరో మార్గమేమీ కనిపించలేదన్నారు.

బవాజా పరిస్థితి కొంత మెరుగుపడింది. నొప్పి కాస్త తగ్గిందని చెప్పారు (ఐతే, ఆయనలో అసహనం తీవ్ర స్థాయిలో ఉంది). కోడి మాంసం కొంత తినగలిగారు. పరిస్థితిని మరోసారి సమీక్షించాక ఓ ఫోటో తీశా. ఆవేదనతో ఆయన కళ్లు ఎర్రబడ్డాయి.

అక్టోబర్ 26న ఉదయం వేళ నర్స్ నా దగ్గరికొచ్చారు. జరిగిన విషాదం గురించి చెప్పారు. బవాజా తన గాయానికి కట్టిన బ్యాండేజ్ని ఒక్కసారిగా పీకేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి చనిపోయారు. విషాద వాతావరణంలో అంతిమ సంస్కారం కోసం ఆయన శవాన్ని మోసుకెళ్లాం. ఓ గొయ్యి తీసి కామ్రేడ్ బవాజాను అందులో పాతిపెట్టాం. ఇక్కడ మేం కోల్పోయిన ఆరో వ్యక్తి అంతిమ సంస్కారాలు నోచుకున్న మొదటి వ్యక్తి భవిష్యత్‌ను దర్శించలేకపోయిన నా మూర్ఖత్వాన్ని నేను నిందించు కున్న సందర్భమిది.

ఓటమిపాలైన చిన్న బృందం నా దగ్గరికి రాగా వారికి వీడ్కోలు పలికా. నా పొరపాట్లను నేను అంగీకరించా. కాంగో విషాదాల్లో నాకు ఎక్కువ బాధ కలి గించింది బవాజా మరణం. ఎందుకంటే. ఆయన బలహీనతల్ని తీవ్రంగా విమ ర్శించా. ఓ నిజమైన కమ్యూనిస్టుగా నా విమర్శలకు ఆయన స్పందించారు. ఈ వైఫల్యం నుంచి బయటపడేందుకు నా శక్తి మేరకు ప్రయత్నిస్తా. ఇదివరకటికన్నా మరింత కఠినంగా మరింత ఉత్సాహంగా పని చేయదలచు కున్నా. పరిస్థితి మరింత విషమిస్తోంది. కాంగోవాసుల్ని చైతన్యం చేయకుండా సైనిక నిర్మాణం సాధ్యంకాదు. బయటి నుంచి సంబంధాలు, మద్దతు లేకుండా కేవలం అంతర్జాతీయ కార్మిక సిద్ధాంతంతో మనమిక్కడ పోరాటం చేయలేమంటూ క్యూబన్లకు చెప్పా. ఆ సంబం ధాలు తెగిపోకుండా కాపాడుకోవాలని, లేదంటే ఇక్కడ ఎంతోకాలం నిలువలేమని వివరించా.

తర్వాత కాంగోవాసులతో మాట్లాడా. పరిస్థితి తీవ్రతను వారికి వివరించా. ఓటమికి కారణం

– పోరాటంలో చురుగ్గా పాల్గొనాలంటూ మిమ్మల్ని ఒత్తిడి చేయక పోవడమేనని తెలిపా. మీ నుంచి విప్లవ స్ఫూర్తి వ్యక్తం కావాలని కోరా. ఒకరిపట్ల ఒకరికి నమ్మకం దృఢంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితి ఎదురైనా వేగంగా స్పందిం చేలా ఐక్య సేనను నిర్మించాల్సి ఉందని చెప్పా సంతాప కార్యక్రమం పూర్తయ్యాక నబీకుంబే గ్రామానికి వెళ్లాం. అదే పేరుగల నది పక్కన ఉన్న పెద్ద గ్రామం అది. ఆహ్లాదకరమైన సారవంతమైన లోయల మధ్య ఉంది. కాంగోవాసుల నుంచి రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. స్థావరానికి దగ్గరలోనే ఉండాలన్నది ఫుంటో నేతృత్వంలోని చిన్న బృందపు అభిప్రాయం. తమ ప్రాంతాన్ని ఆక్రమించిన శత్రు దళాలకు సమీపంగా వెళ్లి తిరిగి పోరాడాలన్నది చార్లెస్ నేతృత్వంలోని బృందపు ఆలోచన.

నేను మాత్రం ఉన్న చోటే ఉండాలని నిర్ణయించా. వెనక్కి వెళూనేవుంటే మరిన్ని ఓటములు ఎదురవుతాయని చెప్పా నైతిక పతనం వల్ల పోరాటం పట్ల విశ్వాసం పోతుందని వివరించా. స్థావరానికి వెళ్లేందుకే క్యూబన్లు ఇష్టపడ్డారు. సరస్సు దగ్గరైతే పోరాట బాధలుంటాయి, స్థావరం నుంచైతే తప్పించుకునేందుకు అనేక మార్గా లున్నాయన్నది వారి ఆలోచన. ఐతే, మేమున్న చోటే నిలిచి ఉన్నాం. మాతో మిగిలి వున్న వారితో రెండు కంపెనీల్ని ఏర్పాటు చేయాలనుకున్నాం. వీలైనమేరకు కాంగోవాసుల్ని మా దగ్గరికి చేర్చుకున్నాం. వెనక్కి తిరిగి వెళూ, వివిధ ప్రాంతాల్లో నిలిచివున్న క్యూబన్లందరినీ మా దగ్గరికి రావాల్సిందిగా కోరాం.

విపత్తు పాఠాలు సంక్షిప్తంగా ఇలా ఉన్నాయి. మిలటరీ దృష్టితో చెప్పాలంటే, నిశితంగా పరిశీలించకుండా క్యాంప్ కోసం ఆ ప్రాంతాన్ని ఎంచుకోవడమే మొదటి తప్పిదం. ఆత్మరక్షణ కోసం నిర్మాణాత్మక చర్యలు చేపట్టకపోవడం. క్యాంప్ నుంచి కి.మీ.ల దూరం వరకూ తగినన్ని ఔట్ పోస్టులు ఏర్పాటు చేయకపోవడం. ఆయు ధాల డంప్ విషయంలో నిర్లక్ష్యం. ఫిరంగిలాంటి కొన్ని కీలక ఆయుధాల్ని సరైన పొజిషన్‌లో ఉంచకపోవడం. మరోవైపు, శత్రు సైనికులు కొండల్ని చుట్టుముట్టారన్న నివేదికల వల్ల ఆత్మరక్షణ కోసం సమన్వయంతో చర్యలు చేపట్టపోవడం. సరైన కారణం లేకుండానే మన దళాలన్నీ చెల్లాచెదురైపోవడం. క్యూబన్లు ఎక్కువగా ఉన్న మా సొంత బృందం సైతం ఎలాంటి పోరాటమూ జరపకుండా వెనక్కి పరుగు తీయడం. ఈ సంఘటనలో

మాత్రం పారిపోయిన కాంగోవాసుల్ని నిందించలేం. ఎందుకంటే, అక్కడే ఉన్న క్యూబన్లు సైతం అదేపని చేసినందున. వాస్తవానికి ఆ సమయంలో శత్రు సైనికులు కొండపైకి రానేలేదు. భయం వల్ల రైతుల్ని చూసి మనవాళ్లు భ్రమపడ్డారు. వారపుడు 15 మందికి మించి లేరు.

మిలటరీపరంగా ఆయుధాల దంప్పు పూర్తిగా కోల్పోయాం. 150 పెట్టెల్లో ఉన్న విమాన విధ్వంసకాలు, రెండు 60 రకం ఫిరంగులు, ఓ 82 రకం ఫిరంగి, కొన్ని భాగాలులేని రెండు మెషిన్ గన్లు, సోవియట్ రాకెట్ లాంచర్ (ప్రొజెక్టయిల్స్ లేని), చైనా మోడల్ రేడియో ట్రాన్స్‌మీటర్, ఇంకా కొన్ని తేలికపాటి ఆయుధాల్ని మనం కోల్పోయాం.

ఈసారి కాంగోవాసుల ప్రవర్తన ఇదివరకటిలా మరీ అంత చెడ్డగా ఏమీలేదు. వాస్తవానికి మొదటి సంఘటనలో వారు పూర్తిగా కనిపించకుండా పోయారు. ఈసారి వారిలో కొందరికి దవా పని చేసింది. ఇక మనం వారి నుంచి సైనిక ఎంపిక ప్రారంభించాలి.

రాజకీయ దృష్టితో చూస్తే రైతుల్లో మన పట్ల విశ్వసనీయత పెరిగింది. స్నేహపూర్వకంగా ఆదరించారు. మనపట్ల సానుభూతి ప్రకటించారు. ఫలితంగా వారు తీవ్ర నష్టాల్నే చవిచూశారు. వారి ఇళ్లన్నీ మంటల్లో కాలిపోయాయి. కూటి కోసం వారెక్కడైతే గూళ్లు కట్టుకున్నారో అక్కడి నుంచే వారు తరిమివేయబడ్డారు. శత్రువు దూసుకురావడంతో కొండలపాలయ్యారు. కూటికీ, గూటికీ దూర మయ్యారు.

స్థానిక నేతలు మరోసారి మాపై నమ్మకముంచారు. కేలిటే, జీన్, ల్యాంబర్ట్‌తోపాటు ఆయన కమాండర్లు, రాజకీయ ప్రతినిధి బెండేరా, ఇంకా ఇతర ముఖ్య నేతలంతా వారిలో ఉన్నారు. కీలక స్థావరాల రక్షణకోసం పర్వతాల్లోనే కొనసాగుతా మన్నారు. తప్పుడు వైద్యుల వల్లే నష్టాలు జరిగాయన్నారు.

కమాండర్లు, వారి అనుచరులు, కొందరు రైతులు చేసిన ప్రచారం వల్లే ఈ నష్టాలన్నీ జరిగాయి. శత్రుదళాలు ముందుకు దూసుకురాగలిగాయి. కాంగో వాసుల్లో మరోసారి విశ్వాసాన్ని పెంపొందించడం కోసం సుదీర్ఘ పోరాటమే చేయాల్సివచ్చింది. నా గురించిన వాస్తవాలు తెలుసుకున్నాకే వారికి నా పట్ల, నా అనుచరుల పట్ల నమ్మకం కుదిరింది.

**********

రైతులకు అనుకూలంగా పోరాడేందుకే మొదటి ప్రాధాన్యత. సేనల్ని వెనక్కి మళ్లించడం, ఓటమి పాలవడం మనవాళ్లని బాధించాయి. ఈ ప్రాంతంలోని స్థానికుల నుంచి వ్యతిరేకత, వారికి ప్రతిగా కమాండర్ల చర్యలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేశాయి. సమీప గ్రామాల నాయకుల్ని రైతుల్ని సమీకరించాం. చార్లెస్ సాయంతో వారితో మాట్లాడాం. కాంగోకు మేం వచ్చిన కారణాన్ని ప్రస్తుత పరిస్థితిని వివరించాం. శత్రువుపైకి పోరాటాన్ని ఎక్కుపెట్టకుండా అంతర్గత వైరుధ్యాల్లో కూరుకుపోవడమే ఇక్కడి విప్లవోద్యమం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అంటూ తేల్చి చెప్పాం. గ్రామాల నేతలు సహకరించేందుకు సుముఖంగా ఉన్నారు. మమ్మల్ని బెల్జియన్లతో పోల్చేవారిని తీవ్రంగా దుయ్యబట్టారు. కాస్త తెల్లగా ఉండే ఓ మనిషి దళ సభ్యులతో కలిసి బుకాలీ తినడం చూశామని, అప్పటిదాకా బెల్జియన్లు ఎవరూ ఇక్కడ కనిపించలేదన్నారు. మమ్మల్ని ఆదుకోవడంలో రైతులు ఏనాడూ వైఫల్యం చెందలేదు. మేం పోరాటం నిర్వహించడంకన్నా వారి మనసుల్ని గెలుచుకునేందుకే ఏమైనా చేయాల్సివుంది. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం కోసం ఆ ప్రాంతంలో పర్యటించాలనుకున్నా వారితో కలిసి బుకాలీ తింటూ కాలక్షేపం చేయడం ద్వారానే వారికి మరింత సన్నిహితం కాగలమని భావించా.

కాసవా దుంపలు లేదా ఇతర ఆహారం మాకు సరఫరా చేయాలని కోరాం. ఆ ప్రాంతానికి దగ్గరలో, రోడ్డుకు దూరంగా హాస్పటల్ నిర్మాణానికి సాయం చేయాలని అడిగాం, శత్రు దాడుల నుంచి ఆ ప్రాంతానికి రక్షణ కల్పించేందుకు కందకాలు తవ్వాల్సి ఉంది. అందుకు అవసరమైన పనిముట్లు ఇవ్వాలని కోరాం, శత్రు బలగాల్ని అంచానా వేసేందుకు ఓ చిన్న బృందాన్ని ఏర్పాటు చేయాలనుకున్నాం.

దురదృష్టవశాత్తూ జరిగిన ఓ సంఘటన సాయమందించేందుకు రైతుల్ని త్వరితపరిచింది. లుబోండ్జా స్థావరంలో శత్రు దళాలే లక్ష్యంగా కాంగోవాసులు కొందరు పొదల మధ్య కొన్ని గ్రెనేడ్లనుంచారు. విషయం మిగతావారికి చెప్పక పోవడంతో కాంగోవాసుల మరో బృందం అటుగా వెళ్ళి చిక్కుల్లో పడింది. ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా చికిత్స కోసం వచ్చారు. మరో వ్యక్తి శత్రు దళాల ఫిరంగి గుళ్లు తగిలి తీవ్రంగా గాయపడ్డారు. అవి ఆయన పొట్టలోకి చొచ్చుకు పోయాయి. స్వల్ప గాయాలైనవారు త్వరలోనే కోలుకోగా, తీవ్రంగా గాయపడ్డ వ్యక్తికి ఆరు బయటే ఆపరేషన్

నిర్వహించాల్సి వచ్చింది. ఆ ప్రాంతంలో శత్రు విమానాలు గాలిలో ఎగురుతుండగానే అది జరిగింది. ఎట్టకేలకు ఆపరేషన్ విజయవంతమైంది. సర్జన్, కామ్రేడ్ మొరాగోరో గౌరవాన్ని పెంచిన సంఘటన అది. దీంతో, హాస్పటల్ పని త్వరగా పూర్తి చేయాలన్న పట్టుదల పెరిగింది. ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం. హాస్పటల్‌కది ఎంతో సురక్షిత ప్రదేశం.

అదే సాయంత్రం గాయపడ్డ మరో వ్యక్తి వచ్చారు. ఆయనకు రెండు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. అసలేం జరిగింది? విస్ఫోటన శబ్దాలు వినిపించగానే బృంద మంతా పరుగుతీసింది. స్వల్పంగా గాయపడ్డవారు, కడుపులో గాయమైన వ్యక్తి తమంతట తామే వెనక్కి వెళ్లేందుకు యత్నించారు. మధ్యలో మన కామ్రేడ్లకు కనిపించడంతో సాయమందించారు. ఐతే, వీరి వెనకాలే తీవ్రంగా గాయపడ్డ మరో వ్యక్తిని ఎవరూ గమనించలేదు. చీకటిపడ్డాక, ఇక శత్రు సైనికులెవరూ ఆ దిశగా రారని నిర్ధారించుకున్న కొందరు కాంగో కామ్రేడ్లు, పారిపోతూ పొదల్లో విసిరేసిన ఆయుధాల కోసం వచ్చినదారినే వెనక్కి మళ్లారు. ఆ సమయంలోనే ఈయన వారి కంటపడ్డారు. దాంతో, హాస్పటల్‌కు తరలించారు. రాత్రివేళ మా దగ్గర ఎలాంటి దీపాలూ లేవు. సరైన మందులు కూడా లేవు. రెండు టార్చ్ లైట్ల వెలుగులో ఎంతో క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించాం. మేం చేయగలిగినంతా చేశాం. ఫలితం మాత్రం దక్కలేదు. ఉదయానికెల్లా చనిపోయారు. వీటన్నిటికీ తోడు ఓ దున్నపోతుతో జరిగిన పోరాటంలో ఓ మహిళ గాయపడి రాగా వైద్యం అందించాం (ఆ దున్నపోతును ఈటెలతో చంపేశారు). ఈ సందర్భంగా బాధితులకు వైద్యమందించడంలో రైతుల సహకారం మరువలేనిది.

కమాండర్లు తమ తప్పుడు ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. రేడియో బెంబాలో ఓ వార్త ప్రసారమైంది. క్యూబన్లు అమర్చిన గ్రెనేడ్ల వల్లే కాంగోవాసులు గాయపడ్డారంటూ దుష్ప్రచారం సాగించారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడమే రాజకీయ ప్రతినిధి బెండేరా, కమాండర్ హుస్సేనీ, వారి అనుయాయుల ప్రత్యేకత. కానీ, కేలిగ్జిటే, జీన్ ఇలాతోపాటు ల్యాంబర్ట్ మనుషులెవరూ మమ్మల్ని అవమానించే ప్రయత్నం ఏనాడూ చేయలేదు.

లుబోండ్జా స్థావరంలో మా కమాండ్ కింద పని చేస్తామంటూ కాంగోవాసులు

ముందుకొచ్చారు. దాంతో, రక్షణ కోసం కందకాలు తవ్వాలంటూ వారిపై ఒత్తిడి చేశాం. ఇది వారి సొంత సైనిక పద్ధతికి భిన్నమైంది. కేవలం ముగ్గురో నలుగురో సెంట్రీలను కాపలా పెట్టుకొని ఇళ్ళలోనే ఉండటం వారి పాత పద్ధతి. అంతేగాక, కొన్ని ఆయుధాల్ని మాకు తెలియకుండా దాచిపెట్టేవారు. ఇప్పటిదాకా ఇలాంటి మోసాల్ని ఎంతో సహనంతో భరించాం.

కాంగోవాసులతో కామ్రేడ్ హుస్సేనీ ఓ సమావేశం నిర్వహించారు. ఆ సమా వేశంలో ఆయన నాపై పలు ఆరోపణలు చేశారని తెలిసింది. తనను ఓ చిన్న పిల్లాడిలా చూస్తూ, కోపగించానన్నారు. సరస్సు నుంచి వచ్చిన ఆహారాన్ని కేవలం మా కంపెనీలకే పంపిణీ చేశానని, వారి దగ్గరున్న ఆయుధాలన్నీ లాక్కున్నానంటూ విమర్శించారు. వారి కాసవాదుంపల్నీ మొక్కజొన్నల్నీ మేమే తిన్నామంటూ మరో ఆరోపణ.

ల్యాంబర్ట్ మనుషులు కూడా మా వాళ్లతో ఇలాగే గొడవపడ్డారు. పిరికివాళ్లంటూ ఆరోపించారు. శత్రుదళాల్ని వ్యూహం లేకుండా రెచ్చగొట్టి ఆ తర్వాత పారిపోయారు. ఇలాంటి అనాలోచిత ప్రవర్తనే పరిస్థితులు ప్రతికూలంగా మారేందుకు కారణమైంది. పోరాట స్ఫూర్తిని అభివృద్ధి చేయడంలో విఫలమైంది. ఇలాంటి ప్రతికూల స్థితే ప్రతిచోటా ఎదురైంది. దాంతో, మనవాళ్లను కమాండర్లకు కొంత దూరంగా ఉంచా లంటూ ఎంబిలీ అనేకసార్లు ప్రతిపాదించారు. వారితో తగువులాటను నివారించా లన్నా, మనవాళ్లలో ఆత్మస్థైర్యం సడలిపోకుండా కాపాడుకోవాలన్నా అలా చేయా లన్నారు.

ఫ్రంట్ డీ ఫోర్స్ నుంచి కామ్రేడ్ మపూ నాకో నివేదిక పంపారు. దాన్ని వెంటనే మసెంగోకు పంపించా. "ప్రస్తుత పరిస్థితిని ఇది మీకు వివరిస్తుంది. పరిస్థితిని అనుకూలంగా మార్చేందుకు మేం వెళ్లాలంటూ కెప్టెన్‌తోపాటు కమాండర్ నన్ను కోరారు. తమ దగ్గర బుల్లెట్లు, ఆహారం లేవన్నారు. ఆహారపు డబ్బాలు పూర్తిగా ఖాళీ అయ్యాయన్నారు. అక్కడ ఓ సమావేశానికి కమాండర్ హాజరయ్యారు. పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. తిరిగి తాను అక్కడికి వెళ్తే కాంగోవాసులు తనను చంపేస్తారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వారు ప్రతిరోజూ ఓ సమావేశం నిర్వ హిస్తున్నారు. అరుపులతో, చప్పట్లతో నానా అల్లరీ చేస్తున్నారు. వారు తమకు తామే పోరాటానికి

సిద్ధమవుతున్నట్లుగా అనిపిస్తోంది. కెప్టెన్తోపాటు పదిమందిని సరస్సు దగ్గరికి పంపారు. రాజకీయ ప్రతినిధితోపాటు మరో బృందాన్ని కిగోమాకు పంపారు. ముఖ్య సమాచారమేదైనా ఉంటే మీకు వెంటనే తెలియజేస్తా....

ఈ సమాచారం ఆధారంగా స్థావరాన్ని శక్తివంతం చేయాల్సిందిగా మపూను ఆదేశించా. మకుంగో ఫ్రంట్ కు చెందిన అజీ నా దగ్గరికొచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో నా మనుషులందరినీ తిరిగి సమీకరించాలనుకున్నా తిరోగమన సమయంలో మన మిత్రులు విసిరికొట్టిన ఆయుధాల్ని వెతికేందుకు ఓ బృందాన్ని పంపించా, అవి శత్రువు చేతికి చిక్కకుండా ఉండేందుకు. వాటిలో బవాజా వది లేసిన తుపాకీ, ఫిరంగులు, మెషిన్గన్లు, వేగంగా పారిపోయే ప్రయత్నంలో కాంగో వాసులు దాచి పెట్టిన మరికొన్ని ఆయుధాలున్నాయి. సికీకి ఓ లెటర్ పంపించా. నాకందిన నివేదికల్లోని కొన్ని విషయాల్ని అందులో ప్రస్తావించా. నా సమీక్ష ఎలా ఉందో తెలిపే రెండు పేరాల్ని ఇక్కడ ఇస్తున్నా..."మనుషుల బలహీనతలు భయం గొలిపేలా ఉంటాయి. ప్రతి ఒక్కరూ సరస్సు దగ్గరికి వెళ్లాలని కోరుకుంటున్నారు. వారంతా మీ దగ్గరికొస్తున్నారు. వెంటనే వారిని నా దగ్గరికి తిప్పి పంపండి. ఎక్కువ సంఖ్యలో ఆయుధాలు కూడా. నిజంగానే అనారోగ్యంతో ఉన్నవారిని మాత్రం మీ దగ్గరే ఉండనీయండి. నేను నబీకుంబేలోనే ఉండాలని నిర్ణయించుకున్నా ఇది సరస్సు స్థావరానికి పదిగంటల ప్రయాణ దూరంలో, కసీమా నుంచి ఒకటిన్నర రోజుల దూరంలో, లుబోండ్జా సమీపంలోని బలహీన స్థావరానికి రెండు గంటల దూరంలో ఉంది. ఈ సమయంలో నేను సరస్సు దగ్గరికెళ్తే రాజకీయంగా అదే ఓ పెద్ద ఓటమి అవుతుంది. రైతులు మాపై నమ్మకముంచారు. పోరాటానికి అంకిత భావంతో సిద్ధమయ్యారు. ఓసారి పునర్నిర్మాణం జరిగితే ఎంతో ప్రభావం చూప గలదు. ఈ సాయంత్రమే సోవియట్ రైఫిల్తో షూటింగ్ ప్రాక్టీస్ ప్రారంభిస్తున్నాం. మాకిక్కడ పాయింట్ 30 (SKS), FAL బుల్లెట్ల కొరత ఉంది. మీ దగ్గరుంటే 5000 SKS. 3000 FAL రౌండ్లు పంపగలరు. లేనట్లయితే నాకు తెలపగలరు. సమాచారలోపం పిచ్చెక్కిస్తోంది. మూడు పడవల్లో ఆయుధాలు వచ్చాయంటూ పుకార్లు వ్యాపించాయి. కబీలా కబింబాకు వచ్చారని, అక్కడ 40 మంది క్యూబ నున్నట్టు తెలిసింది. సాధ్యమైతే వారిలో కొందరిని

మా దగ్గరికి పంపించండి. పరిస్థితి అక్కడ ఎలా ఉందో తెలిసుంటే నిర్ణయం తీసుకునే వీలుంటుంది".

కాంగో దూత (నోటి మాట) ద్వారా కబీలా వచ్చాడంటూ సమాచారమందింది. క్యాబిన్లతోపాటు కబీలా రావడాన్ని తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. లెటర్‌లో నేను కబింబా అంటూ చెప్పా. కానీ, కిబంబాగా చదువుకోవాలి. కామ్రేడ్ల నుంచి ఉత్తరాలు చాలా వచ్చాయి. అక్టోబర్ చివరన వచ్చిన ఓ లెటర్‌ను ఇక్కడ ఇస్తున్నా

"కామ్రేడ్ టాటూ.. కామ్రేడ్ బవాజాకు మా ప్రగాఢ సంతాపాన్నీ మీకు మా హృదయపూర్వక సానుభూతినీ తెలియజేస్తున్నాం. మీతోపాటు మిగతా కామ్రేడ్లం దరూ క్షేమంగా ఉన్నారని తెలిసి ఎంతో సంతోషించాం. మేం పంపిస్తున్న మొదటి దూతను, మొదటి ఉత్తరాన్ని మేం ఇక్కడికొచ్చిన రెండు రోజులకు అంటే 21న మీరు చూడగలరని భావిస్తున్నాం. మరో దూత ద్వారా మరో నివేదికను కూడా ఇప్పటికే పంపించాం. ఇక్కడ ఎవరెవరు ఉన్నదీ అందులో వివరించాం.

నాలుగు పడవలతో కబీలా వచ్చారని అతనెలా నమ్మారో మాకైతే అర్థం కావడంలేదు. వాస్తవానికి కిగోమాలో ఆయన ఎంతో ప్రశాంతంగా గడుపుతున్నారు. క్యాబిన్ల రాక విషయంలోనూ వారిది గందరగోళమే. ఒకేఒక్క క్యాబిన్ చాంగా మాత్రం వచ్చారు. ఆయనే మూడు నాలుగు రోజుల వ్యవధిలో రెండుసార్లు అటు ఇటూ తిరిగారు. సరస్సును కూడా కోల్పోతామన్న భయం ఆయనలో ఉంది. క్రిగోమా సరస్సుల దగ్గర మారిన పరిస్థితుల వల్ల నేను అక్కడికి రావాలనుకున్నా మసెంగో కోసం ఓ లెటర్ తీసుకెళ్తున్నట్టు దూతలు చెప్పారు. ఐతే, ఆయన ఇక్కడికి రాలేని పరిస్థితి. ఇక్కడ ఓటమి పాలైన వ్యక్తి. ఇక్కడ ఏమీ చేయలేరు. ఎవరికీ ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేరు. నిన్న స్వయంగా ఆయనే మాతో మాట్లాడారు. తాను గానీ, కబీలాగానీ అక్కడికి రావడం వల్ల ఏ సమస్యా పరిష్కారం కాదన్నారు. జరిగిన విపత్తుకు అందరూ తమనే బాధ్యుల్ని చేసి అవమానిస్తున్నారంటూ వాపోయారు. తమ ఆయుధాల్ని స్వాధీనం చేస్తామంటూ శత్రు సేనకు ఉత్తరాలు రాసిన ద్రోహుల్ని సైతం అరెస్ట్ చేసే అధికారం తమకు లేదన్నారు. తెగల మధ్య విభేదాలే ఈ దుస్థితికి కారణమంటూ సూత్రీకరించారు. భవిష్యత్లో మరోసారి పోరాటాన్ని ప్రారంభిస్తే మాత్రం ఆయుధాల్ని నిల్వ చేయడంలో తమకు

సహకరించాలంటూ మనల్ని కోరారు. ఆయన కిగోమాకు వెళ్లనున్నట్టు ఇప్పటికే మీకు తెలిపా.

(ఆ విషయాన్ని ఆయన నేరుగా మనకు చెప్పకుండా జెంజేకు సమాచారమందిం చారు). దీన్నిబట్టి ఆయన ఏ స్థితిలో ఉన్నారో అర్థం చేసుకోగలరు.

సరస్సు, స్థావరం, అలీ, టామ్ ఫ్రంట్ (కసీమా)ల దగ్గర పరిస్థితి పాత్ర నివేదికలో తెలిపినట్టే ఉంది. మారిందల్లా. రోజురోజుకూ పరిస్థితులు మరింత దారుణం కావడమే (ఇక్కడ మాత్రం సాధారణం). బట్టలు (ఇంకా రాలేదు), బూట్లు (సైజు తక్కువయి ఉన్నాయి) మినహా మిగతా నిల్వలు కొన్ని ఉన్నాయి. మీరు మా దగ్గరికి పంపిన పదిమంది కాంగోవాసుల్ని తిప్పి పంపించగలం. అక్కడ ఆయుధాలు ఏమీ లేవు. అక్కడి ప్రతిదాన్నీ జెంజే పరీక్షించి చూస్తున్నారు. ఐతే, ఇప్పటికే ఆలస్యం జరిగింది. ఇంకా ఏమీ లేవు. 15 FAL లు మాత్రం మా దగ్గరే వదిలేశారు. ఐతే, వాటిని పంపించడంలేదు. మీ నుంచి కూడా అలాంటి కోరిక ఉంటుందని అను కోలేం. ఇప్పటివరకూ మేమిచ్చిన నివేదికలు వాస్తవ పరిస్థితుల పట్ల మీకు అవ గాహన కలిగిస్తాయని భావిస్తున్నాం. మీరు ఉత్తరంలో కోరినట్టు ఓ నిర్ణయానికి రావడానికి తోడ్పడ్డాయి.

రెండు మూడు రోజులుగా ఇక్కడికొచ్చిన క్యూబన్ల వివరాలు; ఇజ్రాయెల్, కసాంబలా, అమియూ, అబ్దల్లా, అమి, అగానో... ఇజ్రాయెల్, కసాంబలా మినహా మిగతావారిని మీ దగ్గరికి పంపిస్తున్నా వీరిద్దరికీ కాళ్లు వాచిపోయాయి. బాటి. ఇంకా కోలుకోకపోవడంతో పంపించడం లేదు. 2000 రౌండ్ల FAL లు, మూడు పెట్టెల 7.62 బుల్లెట్లు మార్గమధ్యంలో ఉన్నాయి. AK లు ఇంకా మా దగ్గరికి రాలేదు.

టెంబో రావడం, మీతో పని చేయాలనుకోవడం సరైందనే భావిస్తున్నాం. మీరే ఇక్కడికి రావడం లేదా మా నుంచి ఎవరైనా అక్కడికి రావడం ద్వారా వాస్తవ పరి స్థితుల పట్ల చర్చలు జరిపేందుకు వీలవుతుంది. రేడియో ద్వారా కిగోమా, దార్ ఏ సలామ్‌లతో సంబంధాలు కొనసాగిస్తున్నాం.

ఇక్కడ జరుగుతుందంతా శత్రువుకు తెలిసిపోతున్నట్టుగా భావిస్తున్నాం. మసెంగో అభిప్రాయం కూడా అదే. ఉన్నతస్థాయి అధికారులతో సహా చాలామంది శత్రువు చేతుల్లోకి

వెళ్లిపోయినట్టుగా అనిపిస్తోంది. చాలామంది కనిపించకుండా పోయారు.

ఏదైనా జరగొచ్చని మసెంగో మాతో అన్నారు (ఆయనతో మేం ఏకీభవించాం). ఏ సమయంలోనైనా స్థావరంపై లేదా సరస్సుపై దాడి జరగొచ్చన్నారు. మీపై జరిగిన ఆకస్మిక దాడితో మాలో ఆ అభిప్రాయం బలపడింది. మీరు ఎంచుకున్న పొజిషన్ చాలా చెడ్డదని సికీ అన్నారు. ఏ సమయంలోనైనా మన మధ్య సంబంధాలు తెగిపోవచ్చు. కాయెలాకు స్థావరం చాలా దగ్గరలోనే ఉంది. చాలా రోజుల క్రితమే కసీమా శత్రువు చేతుల్లోకి వెళ్లిపోయిందనే విషయం మీకు తెలిసిందే. ఆస్మారీ, టామ్‌తోపాటు నలుగురు క్యూబన్లు మాత్రమే ఇక్కడ ఉన్నారు. కాంగోవాసులంతా పారిపోయారు.

మీ అవసరాలేమిటో, మీకు మేం చెప్పాల్సిందేమిటో మీ ప్రతిస్పందన చూశాకే మాకు అర్థమవుతుంది. ఆ తర్వాతే మా నుంచి ఆదేశాలు పంపిస్తాం.

ఇక్కడివారు ఏం చేస్తున్నారో వివరిస్తా. ఇద్దరు కామ్రేడ్లు సరస్సు పక్క ఫిరంగుల్ని చూస్తుండగా, మరో ఇద్దరు గన్నా దగ్గర పర్యవేక్షణ జరుపుతున్నారు. స్టోర్స్ దగ్గర మరొకరిని ఉంచాలి (లేదంటే కాంగోవాసుల చేతివాటం మీకు తెలిసిందే). ఇప్పటికే బీన్స్, ఉప్పు బస్తాల్ని సగంసగం ఖాళీ చేసి తామంటే ఏంటో రుచి చూపించారు.

సికీ, టెంబో.

ఈ లెటర్ తర్వాత అంతుకుముందు నేను రాసిన లెటర్‌కు సమాధానంగా మరో లెటర్ వచ్చింది. అక్టోబర్ 26న వచ్చిన ఆ లెటర్లోని కొన్ని ముఖ్యాంశాలు ఇలా..

సరస్సు, స్థావరం దగ్గర పరిస్థితి :

"మసెంగోతో సికీ సమావేశమయ్యాక ఈ నిర్ణయాలు జరిగాయి. మొదటిది; సరస్సు స్థావరానికి జెంజే ఇంచార్జ్‌గా ఉండాలి. రక్షణ అధికారాలన్నీ ఆయనకే ఉంటాయి. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఆదేశించే అధికారం ఆయనదే. మసెంగో, సికీలు మాత్రమే ఆయనపై కమాండర్లుగా వ్యవహరిస్తారు. సరస్సు నుంచి మేం పంపించే వస్తువులన్నిటికీ ఇంచార్జ్‌ల్ని జెంజే, కుమీలు నియమిస్తారు. భారీ ఆయుధాల మోహరింపు, రక్షణ వ్యూహాల్ని ఈ లెటర్తోపాటు

పంపిస్తున్నాం. మనకున్న వనరుల ఆధారంగా పక్కా ప్రణాళికలున్నాయి. అందులో ఒకటి; రెండు వరసలుగా కందకాలు తవ్వడం. ఆయుధాలు క్యాంపస్ల ఆధీనంలోనే ఉండాలని సికీ (నాలాగే) భావిస్తున్నారు. ఎందుకంటే... సమస్యలు ఎక్కడైనా ఒకటే. ఎంత చక్కగా పారిపోవాలన్నదానికే వారు ప్రాధాన్యత ఇస్తారు. అధికారాల బదలాయింపుల్లో లోపాలే అలాంటి తప్పిదాలకు కారణమయ్యాయి. పారిపోయి వచ్చిన వారందరికీ సరస్సు దగ్గరే పునరావాసం కల్పించాలి. అక్కడైతేనే వారు విశ్రాంతి పొందుతూ క్రమశిక్షణ నేర్చుకుంటారు. మసెంగోతో చర్చల్లో సాధారణ సిబ్బంది కార్యక్రమాలపై అంగీకారం కుదిరింది. మొదట మిలటరీ విషయాల్ని ప్రతిపాదించాం. ఆ తర్వాత వారి సూచనలతో కొన్ని మార్పులు చేసి పౌర అంశాల్ని చేర్చాం. ఓ సెక్షన్లో న్యాయం, ఆర్థిక అంశాల్ని ఉంచాం. అవి మిలటరీ చర్యల్లో భాగంగా ఉంటాయి. మీకు ఇంతకుముందే తెలిపినట్టు మిమ్మల్ని ఆపరేషనల్ కమాండర్గా ఎన్నుకోవాలన్నది వారి ఆలోచన.

ఇక నుంచి అవసర వస్తువులన్నీ మన అదుపులోనే ఉంటాయని చెప్పగలం. ఆయుధాలు, ఇతర వస్తువుల్ని మసెంగో మీకు అప్పగిస్తారు. ఇలాంటి ఆనందం ఎంతకాలమో చెప్పలేం. త్వరలోనే సమస్యలు తలెత్తుతాయని భావిస్తున్నాం. ఎందుకంటే. వారు పనికిగానీ, పోరాటానికి గానీ ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. తమ అవసరాల్ని తీర్చాలని మాత్రమే కోరుతున్నారు. సరస్సు దగ్గర, స్థావరం దగ్గర కొంత గడ్డు పరిస్థితే ఎదురవుతోంది. మేం మాత్రం "ఏదైనా ఫ్రంట్ కోసమే" అన్న నినాదానికే కట్టుబడి ఉన్నాం. అవసర వస్తువులు కోరే వారంతా ఫ్రంట్ కు వెళ్లాల్సిందే అంటూ షరతు విధించాం. మరో ప్రతిపాదన కూడా చేశాం. మూడోవంతు మనుషులు ఆహారం కోసం దగ్గరలోని గ్రామాలకు వెళ్లాలంటూ, అలా చేయనివారు ఆకలితో కడుపు పట్టుకొని ఉండాల్సిందే. తినేందుకిక వారికి ఏమీ లేదు."

అలీ ఫ్రంట్ పరిస్థితి; కబింబా :

శత్రుసేన కబింబాను ఆక్రమించి తగులబెట్టి వెళ్లినప్పటి నుంచి వారు కిబంబాకు సమీపంలోని కటాలలోనే ఉన్నారు. ప్రతిఘటించేందుకు అలీకి వారి నాయకుడు అనుమతివ్వలేదు. ఎలాంటి సలహా కూడా ఇవ్వలేదు. సరస్సు చుటూ ఓ మూర్ఖుడిలా తిరుగుతూ శత్రువు నుంచి

ఎదురయ్యే ప్రమాదాన్ని పసిగట్టలేకపోయాడు. దాంతో, అజ్ఞానంగా మూర్ఖంగా తిరిగే వారిని క్యూబన్లు బంధిస్తారంటూ అలీకి సికీ నుంచి ఆదేశాలందాయి. అందుకు ప్రతి సవాల్‌గా వారి నాయకుడు క్యూబన్లను స్థావరానికి వెళ్లి విశ్రాంతి పొందాలనడంతో అలీ పరిస్థితి అరకత్తెరలో పోకచెక్కలా మారింది. క్యూబన్లను ఇక్కడి నుంచి వెళ్లిపొమ్మనడమే సరైందని దళసభ్యులతో వారి నాయ కుడన్నట్లు, కాంగో రాజకీయ ప్రతినిధి ఒకరు అలీకి ధ్రువీకరించి చెప్పారు. ఈ విషయాన్ని మసెంగోకు సికీ గుర్తు చేయగా, కబింబా నేతతో తాను మాట్లాడి పరిస్థితి చక్కదిద్దుతానంటూ హామీ ఇచ్చారు. కొన్ని రోజుల క్రితం ఆల్బర్ట్ విల్లే రోడ్డుపై వెళూ ముగ్గురు పౌరుల్ని బందీలుగా పట్టుకున్నారు. శత్రువుకు చెందిన సరఫరాల లారీ త్వరలోనే ఆ రోడ్డుపై వెళ్తుందంటూ బందీలు ఉప్పందించారు. అయితే, కాంగో వాసులు దానికోసం ఏమాత్రం వేచి చూడకుండా తిరుగుముఖం పట్టారు. ఫ్రంట్ దుస్థితికి ఇది ఓ ఉదాహరణ. మొత్తం 11 మంది క్యూబన్లు ఆ ఫ్రంట్‌లో ఉన్నారు.

వారికోసం కొన్ని వస్తువుల్ని పంపించాం.

కసీమా పరిస్థితి :

కసీమాను శత్రుదళాలు స్వాధీనం చేసుకున్నట్లు ఇప్పటికే మీకు తెలిపా. తిరిగి వెళ్లేముందు వారు కాయెలా వెళ్లి అంతా తగులబెట్టారు. ఓ విమాన విధ్వంసకాన్ని కూడా తగులబెట్టారు (ఆ సమయంలో దాన్ని ఆపరేట్ చేయాల్సిన కాంగోవాసి పారిపోవడంతో ఓ క్యూబన్ దాన్ని దాచిపెట్టారు). వారు మాకు నివేదించిన విషయాల్నే మీకు తెలియజేస్తున్నాం. క్యూబన్ల ఆదేశానుసారం అక్కడ ఓ స్థావరాన్ని ఏర్పాటు చేయడం కోసం 50 మంది కాంగోవాసుల్ని పంపించాం. క్యూబా వెళ్లి వచ్చిన ఓ కమాండర్ తన వెంట ఏడుగురిని తీసుకొచ్చారు. బరాకా వెళ్తామని చెప్పగా, అక్కడి పరిస్థితి వివరించి, వద్దని వారించారు టామ్. ఆయన మాటల్ని లెక్క చేయకుండా వెళ్లి శత్రుదాడిలో చిక్కుకున్నారు. కమాండర్‌తోపాటు ముగ్గురు మృత్యువాత పడ్డారు. అక్కడివారికి సరఫరాల కోసం పదిమంది కాంగోవాసుల్ని పంపించాలంటూ సికీని ఆస్మారీ కోరారు. అక్కడి నుంచి కాయెలాకు మధ్య ప్రస్తుతానికి మూడు దాడులు జరిగాయి. కాంగోవాసులు పారిపోవడమే సమస్య లన్నిటికీ కారణమని స్పష్టమవుతోంది. వారిని బెదిరించి వదిలించుకోక

తప్పని పరిస్థితి. అయితే, వారిని కాల్చి చంపనని టామ్ చెప్పారు. అలా చేయాల్సివస్తే వారందరినీ కాల్చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం, ఫ్రంట్ దగ్గర ఆరుగురు క్యూబన్లున్నారు.

సమాచార వ్యవస్థ :

ఆర్ 805 ద్వారా కిగోమా ప్రతినిధులతో రోజుకు మూడుసార్లు సంప్రదింపులు జరుపుతున్నాం: ఉదయం 8 గంటలకు, సాయంత్రం 2.30కి, రాత్రి 7 గంటలకు. దార్-ఏ-సలామ్‌తోనూ ప్రయత్నిస్తున్నాం. అది కూడా మన వ్యవస్థ పరిధిలోనే ఉంది. సంబంధం సాధ్యమైతే రోజుకు రెండుసార్లు సంప్రదిస్తాం. కిగోమాలోని సౌకర్యాల్ని స్థావరంతో సంబంధాల కోసం కబీలా ఉపయోగిస్తున్నారు. పడవలోనూ సమాచార పరికరాన్ని ఉపయోగించే వీలుంది. మీరు అనుమతిస్తే సరస్సు దాటే సమయాల్లో దాన్ని ఉపయోగించుకుంటాం. సమాచార పునర్నిర్మాణం కోసం ఫోన్ సౌకర్యాన్ని ఉపయోగిస్తున్నాం. ఆ పరికరాన్ని ఎలా ఉపయోగించాలో, చెడిపోతే ఎలా బాగు చేయాలో నేర్పేందుకు ఇద్దరు లేదా ముగ్గురిని పంపేందుకు మసెంగో ఒప్పుకున్నారు.

మొదటి పేజీ రాసిన తర్వాత పరికరం ద్వారా దార్ ఏ సలామ్‌తో సంబంధం కలిసింది. సమాచారమివ్వడంలోనూ, తీసుకోవడంలోనూ నూరుశాతం విజయ వంతమైంది.

పరిస్థితిపై నివేదిక పూర్తయ్యాక సరస్సు నుంచి జెంజే నుంచి పిలుపు వచ్చింది. కిగోమా వెళ్లేందుకు మసెంగో సిద్ధమైనట్టు తెలిపారు. కొద్దిసేపటికే అక్కడి నుంచి మరో పిలుపు వచ్చింది. ముఖ్యనేతలంతా మసెంగోతో సమావేశమైనట్టు తెలిపారు. జెంజే, కుమీ కూడా వారిలో ఉన్నారు. సమావేశంలో తాను కిగోమా వెళ్లనున్నట్టు మసెంగో చెప్పారు. అందుకు ముఖ్య నేతలంతా అభ్యంతరం చెప్పడంతో నిర్ణయం మార్చుకున్నారు. అక్కడే ఉంటానన్నారు. కాంగోలో ఉంటున్న నాయకుడు ఆయన ఒక్కరే. మేం ఎంత చెబుతున్నా, అక్కడికి వెళ్లేందుకే ఆయన తన ప్రయత్నాల్ని కొనసాగిస్తున్నారు.

మాకొచ్చిన మూడో సమాచారం ప్రకారం వారింకా సమావేశాల్ని కొనసాగిస్తు న్నారు. కసావుబూ నుంచి తనకు ఓ మంత్రి పదవి ఇస్తామంటూ సమాచారమొచ్చిం దని మసెంగో తెలిపారు. కిబంబాకు సమీపంలో తన కోసం ఓ ఒడ వేచి ఉంటుం దనేది ఆ సమాచారం.

అందుకు తన సోదరుడు మిటొడీ పోరాటంలోనే చనిపోయాడని, తానూ అలాగే చనిపోయేందుకు ఇష్టపడ్డానంటూ మసెంగో సమాధానమిచ్చా నన్నారు.

ఏదైనా జరగొచ్చంటూ జెంజే, కుమీలు మమ్మల్ని హెచ్చరించారు. వాళ్లకు ఎదురైన సమస్యలన్నిటికీ క్యాబన్లే పరిష్కారం చూపిస్తారంటూ మసెంగో తప్పించు కున్నారు. కబింబా నేతకీ, అలీకి మధ్య సయోధ్య చేస్తానంటూ హామీ ఇచ్చిన మసెంగో, అది కూడా తన వల్ల కాదని, టింబో దాన్ని పరిష్కరిస్తారంటూ మాట మార్చారు.

రేపు సికీ, నేనూ వెళ్లి మసెంగోతో మాట్లాడ్తాం. ఆయన ఏమనుకుంటున్నారో తెలుసుకుంటాం. రేడియో ద్వారా పడిల్లా నుంచి మాకు సమాచారమందింది. ఆయన ఒకవేళ మసెంగో దగ్గరికెళ్తే సౌమాలియట్, కబీలాలతోనూ సంప్రదిస్తారు. దార్ నుంచి మొదటిసారిగా పడిల్లా ఇచ్చిన సమాచారమిది. తాజా పరిణామాలు, సరస్సు దగ్గర పరిస్థితి గురించి ఇంతకుముందే ఆయన మానుంచి నివేదిక కోరారు. దాంతోపాటు కబీలా గురించి మా అభిప్రాయం తెలపమన్నారు".

నివేదిక చివరన పోరాటం ముగించక తప్పదన్న సూచనలున్నాయి. పోరాటం విరమించాలన్న ఆలోచనలో మసెంగో ఉన్నారన్నది వారి అనుమానం. వారికి నేనిచ్చిన సమాధానం ఇలా ఉంది.

టింబో, సికీ...

మీ లెటర్లోని అంశాలకు వరుసగా సమాధానాలిస్తా. ఆ తర్వాత ఇక్కడి పరిస్థితిపై సమీక్షతోపాటు ఇతర విషయాలుంటాయి. కబీలా, మసెంగోలు ఒకవేళ మోసం చేసినా, అంతర్జాతీయంగా మన పరిస్థితి ఏమంత చెడ్డగా లేదు. సౌమా లియట్ ప్రకటనలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇక్కడ మనకో నాయకుడున్నారు. ఒకవేళ మసెంగో పోరాటాన్ని విరమించి వెళ్లే, ఆ బాధ్యతల్ని చేపట్టాల్సిందిగా ట్రిమెండోసు కోరా. చాలాకాలం నుంచి కబీలాతో మనకు ఏ సమస్యా లేదు. వ్యవహారాలన్నీరేడియో ద్వారా నడిపిస్తుండంతో, ఇక్కడ వైరుధ్యాలు తలెత్తినపుడెల్లా మనం ఆయన్ని విమర్శించాం. మనమిపుడు స్థావరాన్ని విడిచి వెళ్లాలనడం అర్థరహితం. మీరు దారుతో

సంప్రదించండి. టాంజానియా ప్రభుత్వంతో చర్చల ఫలితాల్ని తెలుసుకోండి.

సరస్సు, స్థావరాల రక్షణ వ్యూహం పటిష్టంగా ఉండాలి. పర్వత శ్రేణుల్ని రక్షణకోసం ఉపయోగించాలి. వాటిపై మెషిన్ గన్లను మోహరించి మైదానం వైపు గురిపెట్టాలి. కందకాల్ని తవ్వాలి. భారీ ఆయుధాల దగ్గర సుశిక్షితులైన క్యాబిన్లనే ఉంచాలి. పర్వతశ్రేణుల్లో పర్యవేక్షణ జరిపాకే రక్షణ ఏర్పాటు చేయాలి. సరఫరాల విషయంలో మీరు సాధ్యమైనంత కచ్చితంగా ఉండాలి.

అలీకి నివేదిక పంపా. మషూ మనుషులతో కలిసి పని చేయాలని చెప్పా. అవసరమైనమేరకు మోహరించి, కొందరిని రిజర్వ్లో ఉంచాలని సూచించా. శూన్యంగా కనిపించే పర్వతశ్రేణులే స్థావరానికి కాపలా కాస్తాయని మరచిపోవద్దు.

రక్షణ విషయంలో అదే కీలకం (ఫిరంగులతోపాటు విమాన విధ్వంసక మెషిన్గన్లు అక్కడ ఉంటాయి).

కసీమా గురించి ఇప్పటికే చెప్పా. అక్కడ పర్యవేక్షణ జరపాలని ఆదేశించా. ఓవేళ శత్రు దళాలు ఆవైపు వస్తే భయం గొలిపేలా దాడి జరపాలి. అందుకు అవసరమైన పునర్నిర్మాణం వెంటనే చేపడ్డా సమాచారానికి సంబంధించి. ముఖ్య మైన వార్తలు. మరోవైపున రోజుకు మూడుసార్లు, దారూ నుంచి రోజుకు రెండు సార్లు అందేలా ఏర్పాట్లు చేశాం. సమాచారం కోసం ఇంతకుముందు ఇలాంటి సౌకర్యం మనకు లేదు. శత్రు దళాలకు కోడ్ తెలిసిపోకుండా జాగ్రత్తలు తీసు కోవాలి. స్థావరం నుంచి ఆపరేట్ చేయకూడదు. సాంకేతిక విశ్లేషణ ద్వారా స్థావరమెక్కడో తెలిస్తే, వైమానిక దాడుల ప్రమాదముంది. కిగోమాతో రోజుకోసారి నిర్దేశిత సమయంలోనే సంభాషణలు జరపాలి. దార్ ఏ సలామ్తో రెండుమూడు రోజులకోసారి. సంభాషణలకు రాత్రి సమయమే సరైంది. వైమానిక దాడుల నుంచి సమాచార పరికరానికి రక్షణ ఉంటుంది. మైక్రోవేవ్ (సమాచార పరికరం) ఆలోచన సరైందే. కోడ్ను ఎప్పటికప్పుడు మార్చుకునే వీలుంది".

మసెంగో గురించి నివేదిక అందగానే ట్రిమెండోతో మాట్లాడా (లెటర్లో ప్రస్తావించినట్టే). అయితే, ఆయన అందుకు అంగీకరించలేదు. నాయకత్వానికి తాను తగిన వ్యక్తిని కాదన్నారు. కార్యాచరణలో చావడానికైనా సిద్ధమని, తనకు సాధ్యంకాని బాధ్యతలు మాత్రం చేపట్టనన్నారు.

తన సోదరుడు ముజూంబానే ఆయన అనుసరిస్తున్నారు. ముజూంబాకు లెటర్ రాయాలని నిర్ణయించా. అయితే, పరిస్థితిని అందులో వివరించకుండా ముఖ్య విషయమొకటి చర్చించేందుకు రావాలని కోరా. ఎందుకంటే లెటర్ శత్రువు చేతికి చిక్కే అవకాశముంది. లెటర్ ఇద్దరు దూతల ద్వారా వెళ్లింది. అది అనుకున్న చోటికి చేరిందీ లేనిదీ తెలియదు. ప్రత్యుత్తరంగానీ, దూతల నుంచి ఎలాంటి సమాచారంగానీ మాకు అందలేదు.

మసెంగో పై వచ్చిన నివేదికలన్నీ రికార్డు చేశాం. సికీ, టింబో ఇచ్చిన నివేదికలే గాక ఆయన నాతో వ్యవహరించిన తీరు అతిశయంగా ఉంది. ఇతరుల నుంచి వచ్చిన నివేదికలు కూడా అందుకు బలం చేకూర్చాయి. మానసిక ఆందోళన, విశ్వాసం లేకపోవడం, సమాచార లోపం ఇవన్నీ ఆయనలో నిరాశకు కారణ మయ్యాయి. అక్టోబర్ 27న టింబో, సికీల లెటర్ రాగా, ఆ మరుసటి రోజే మసెంగో ఓ సుదీర్ఘ లేఖ పంపారు. ఫ్రంట్ అంతటా తాను తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించారు. రైతుల సాయం కోరానన్నారు. అందులో ఓ ప్రవచనం కూడా ఉంది. "ఏం జరిగినా.. ఎల్లప్పుడూ ఆశావాదులుగానే ఉండాలి"... ఇది మన కామ్రేడ్లు ఆయనపై ఇచ్చిన నివేదికకు భిన్నంగా ఉంది. తన మానసిక స్థితిని మరుగుపరిచే ప్రయత్నమే ఆయన పాండిత్యంలో కనిపిస్తుంది. 29న టింబో, సికీలు రాసిన లెటర్ 30 రాత్రి నాకు అందింది. అందులో వారు ఖండితంగా చెప్పారు. అందులోని కొన్ని భాగాల్ని ఇక్కడ ఇస్తున్నా..

లులువాబిట్ స్థావరం, 29 అక్టోబర్ 65, సాయంత్రం ఆరు గంటలు.

"టాటూ... మేం మీకు పంపిస్తున్నది అత్యవసర సమాచారం. ఈరోజు 12 గంటల నుంచి ఏడు విమానాలు మాపై బాంబులు కురిపిస్తున్నాయి. పెట్రోల్ ట్యాంకుల్ని తలపించే పెద్ద వస్తువుల్ని నేలపై జారవిడుస్తున్నాయి. కబింబాపై సరస్సు సమీప ప్రాంతం జంగోపై దాడులు జరుగుతున్నాయి. ముందుకు రావడానికి లేదా నేలపై వాలడానికి శత్రు దళాలు అనుసరించే సాధారణ పద్ధతి ఇది. మీకు మా హెచ్చరికలు పంపడంలో ఆలస్యం జరిగింది. బాంబు దాడుల వల్ల మెషిన్ గన్ల బాధ్యులు వాటిని వదిలేసి వెనక్కి పారిపోతున్నారు. వారిలో ఒకరు కనిపించకుండా పోయారు. జెంజే, దీనిపై విచారణ జరిపి త్వరలోనే మీకు తెలియజేస్తారు.

సరస్సుకు రక్షణగా ఉన్న కాంగోవాసుల పై మాకు నమ్మకం లేదని ఇంతకుముందే అనేక నివేదికల్లో మీకు గుర్తు చేశాం. ప్రత్యేకించి వారు నైతికంగా దిగజారిపోతున్నారు. సరస్సు, స్థావరం దగ్గరున్న క్యాబిన్లలో ఎక్కువమంది అనా రోగ్యానికి గురవుతున్నారు. బయటి ప్రపంచానికి సమాచారాన్నివ్వడంలో గుండె కాయలాంటి మన ముఖ్య స్థావరాన్ని కూడా రక్షించుకోలేని పరిస్థితి ఎదురవుతోంది.

పాత నివేదికల్లోనే తెలిపాం. ఇక్కడివారు నైతిక స్థైర్యం కోల్పోతున్నారని, ఇదే మరోసారి గుర్తు చేయాలనుకోవడం లేదు. కానీ, పరిస్థితులు మాత్రం మనం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నాయి. పోరాటం నుంచి తప్పుకుంటున్నవారంతా సిగ్గువిడిచి సరస్సు దగ్గర చేరుతున్నారు. అక్కడ పెద్దసంఖ్యలో ఖైదీలు ఉన్నారని నిన్ననే మీకు తెలిపా. అంతేకాదు, వారిలో ఎక్కువభాగం నేరగాళ్లు, ద్రోహులు. అలాంటివారిని బంధించి ఉంచేందుకు కూడా ఇక్కడ ఎవరికీ శక్తి లేదు. కబీలాకు మసెంగో ప్రతిరోజూ ఉత్తరాలు రాస్తూనే ఉన్నారు. శత్రు అధికారులకు అను కూలంగా ఉంటామంటూ నివేదిక పంపాలని కోరుతూనేవున్నారు. మరో ప్రచారం ఏమంటే... ఆయుధాల్ని విడిచిపెట్టాల్సిందిగా కొందరు అధికారులు కోరుతున్నారని, కసావుబూతో సౌమాలియట్ ఎంతో స్నేహంగా ఉన్నారంటూ పుకార్లు వ్యాపిస్తున్నాయి.

ఇదివరకటి నివేదికలో చెప్పినట్టే మీరున్న పొజీషన్ మాకు ఏమాత్రం ఇష్టంలేదు. శత్రుదళాలు రోడ్లన్నీ మూసేస్తాయి. సరస్సుతో సంబంధాలు లేకుండా ఒంటరి చేస్తాయి. దీనికి పరిష్కారమెల్లా, మీ ప్రాంతంలో ఓ స్థావరాన్ని ఏర్పాటుచేసి అదనంగా ఉన్న క్యాబిన్లని మా దగ్గరికి పంపడమే.

అంతర్జాతీయ పరిస్థితితోపాటు ఇక్కడి విషయాల్ని వివరిస్తూ మీకు తగినంత సమాచారమిస్తున్నామన్నదే మా భావన. మేం ఎప్పటికప్పుడు వార్తల కోసం ఎదురు చూస్తూ ఉంటాం.

సికీ, టెంటో."

స్థావరం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఈ ప్రాంతానికి కమాండర్గా ఎంబిలీ కొనసాగుతారు. ఆయన మొదటి క్యాంప్‌లో ఉంటారు. మేమున్న క్యాంప్‌లో రెబోకెట్ ఉంటారు. రెండో వరస రక్షణ బాధ్యత ఈయనదే. తగినంతమంది కాంగోవాసులకు శిక్షణ ఇస్తాం.

ఇది ప్రాథమిక శిక్షణ మాత్రమే. కొంత డ్రిల్‌తోపాటు కాల్పులు జరపడంలో శిక్షణ ఉంటుంది. వీరు ఐదు మీటర్ల దూరంలోని ఆవును కూడా గురిపెట్టి కాల్చలేరు. రైతులతో మాట్లాడాం. వారు మా నిర్ణయాన్ని అర్థం చేసుకున్నారు. క్యాంప్లో మిగిలివున్నవారి పట్ల రైతులకు రక్షణ భావం ఉంది. హాస్పటల్లో డాక్టర్లున్నారు. గాయపడ్డ కాంగోవాసులతోపాటు అనారోగ్యానికి గురైన క్యూబన్లకు వైద్య సేవలందిస్తున్నారు.

మరో నెల అక్టోబర్ గడిచిపోయింది. నా డైరీలో ఇలా రాసుకున్నా.. "విపత్తులు కొనసాగిన నెల. బరాకా, పిజీ, లుబోండ్జా, ల్యాంబర్ట్ ఫ్రంట్లని కోల్పోయాం. ఇద్దరు కామ్రేడ్లను పోగొట్టుకున్నాం. మౌరినో (తప్పిపోయారు), బవాజా (చనిపోయారు). కాంగోవాసులు ధైర్యంగా ఉంటే జరిగిన నష్టాలు ఆందోళన కలిగించవు. దాదాపు వారి అధికారులంతా పారిపోయారు. మసెంగో మాత్రం లెక్కింపు పనిలో ఉన్నారు. టెంబో, సికీతోపాటు సాధారణ సైనికుల వరకూ క్యూబన్లు కూడా గొప్పగా చేసిందేమీలేదు. తప్పులన్నీ కాంగోవాసులపై నెట్టి తాము మాత్రం న్యాయంగానే ఉన్నామన్న భావన కలిగిస్తున్నారు. నా సొంత బలహీనతలతోపాటు క్యూబన్లలోనూ యుద్ధం పట్ల కొంత మృత్యుభయం వ్యక్తమైంది. కాంగోవాసులకు తాము పెద్దన్న లుగా భావించుకున్న క్యూబన్లు వారితో ఆత్మీయ సంబంధాల్ని నెలకొలుపుకోలేక పోయారు. సమయం దగ్గర పడింది. చివరి నెలలోకి ప్రవేశిస్తున్నాం. చివరగా మనం చేయగలిగింది కొంచెమే.

వాస్తవానికి ఆహార పంపిణీ విషయంలోనూ క్యూబన్లకూ-కాంగోవాసులకూ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయన్నది నా ఆరోపణ. వంటవాళ్ళైన క్యూబన్లు తమ కామ్రేడ్ల పట్ల కాస్త ఎక్కువ శ్రద్ధ చూపారు. కాంగోవాసులకు కేవలం బరువులు మోయడంలోనే ప్రాధాన్యత ఇచ్చారు. స్నేహ సంబంధాల్ని పెంపొందించలేక పోయాం. వారికి సలహాలిచ్చి పని చేయించే తెలివైనవారిగా మనలోని అహాన్ని బయటపెట్టుకున్నాం.

స్థావరం వైపు రెండురోజులపాటు ప్రయాణించాం. రెండో రోజు గంజా మీదుగా వెళ్తున్నప్పుడు చుట్టుపక్కల చెల్లాచెదురుగా పడివున్న పశువుల్ని చూశాం. దాదాపు 30 వరకూ ఉంటాయి. క్రితం రోజు వైమానిక దాడుల గురించి విన్నాం. జరిగిన సంఘటన మాకు ఓ విధంగా ఉపయోగపడింది.

ఇష్టమైన మాంసపు ముక్కలు తిని ఆకలి తీర్చుకున్నాం. ముందండి వచ్చారు. సీరియస్‌గా చర్చించుకున్నాం. అక్కడి నుంచి దూరంగా వెళ్తామన్నారు. అలాంటి పిచ్చిపని చేయొద్దంటూ నచ్చచెప్పాం. కాంగోతోనే రువాండన్ల జీవితాలు ముడిపడివున్నాయని చెప్పాం. ఎక్కడికెళ్లినా పోరాటం తప్పదని గుర్తు చేశా. విరమించాల్సివస్తే అందిరితోపాటు అలా చేయాలని చెప్పాం. అది పిచ్చితనమే అని ఆయన అంగీకరించారు. ఆ ప్రతిపాదన కొంతమంది తన ముందుకు తేగా, వద్దని వారించినట్టు చెప్పారు. ఆపై ఫ్రంట్ డీ ఫోర్స్ పై దాడి గురించి చర్చించాం. దాడి ద్వారా శత్రుదళాల దృష్టి మళ్లించాలన్నది ప్రణాళిక. స్థావరానికి చేరుకున్నా ఓటమితో వాతావరణం మారిపోయింది. కాంగోవాసుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనిపై కామ్రేడ్లతో కొంత చర్చించా. వారి వద్ద కిగోమాకు పారిపోయిన అధికారుల పెద్ద లిస్టే ఉంది. అది కచ్చితమైందని చెప్పలేకపోయినా వాస్తవ పరిస్థితి పట్ల అవగాహన కలిగిస్తుంది. అధికారుల పిరికితనాన్ని యుద్ధంపట్ల వారి నిరాసక్తతని తెలియజేస్తుంది. అన్నిటికీమించి వారి ద్రోహబుద్ధిని. అయితే, పోరాటంలో చివరి వరకూ కొనసాగినవారి కొన్ని పేర్లు కూడా ఆ లిస్ట్‌లో చేర్చడం మాత్రం అన్యాయమే. ఇక్కడ ఇస్తున్న రెండు నివేదికల్ని పరిశీలిస్తే ఆ సమయంలో వారి మానసిక స్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. అందులో ఒకటి టెంబో నుంచి ఓ కామ్రేడ్‌కు వచ్చింది.

స్థావరం, గురువారం, 28 అక్టోబర్ 1965

'మీ నివేదిక అందింది. దానిపై తేదీ లేదు. అయినా అది నేను మీ దగ్గరికి పంపిన చెయి' ద్వారా వచ్చినందున విశ్వసిస్తున్నా ఓ కామ్రేడ్‌ను కోల్పోయిన విషాదం తర్వాత మీరు ఆ లెటర్ రాశారు. అది తాజా సంఘటనల పట్ల మీ మానసిక స్థితిని తెలియజేసింది. ఒంటరిగా, తిరోగమన దిశలో కొనసాగుతున్న కాంగో విప్లవాన్ని చిత్రించింది. నాకు అది ఆందోళన కలిగించింది. మరోసారి నాపై విశ్వాసముంచాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నా అయితే ఆ విశ్వాసం ఏదో ఓ కొత్త విపత్తు వల్ల అకస్మికంగా మాయమైపోదని మాత్రం చెప్పలేను.

మీరు లోకం తెలియని పసిబాలుడు కాదని తెలుసు. మీ చుట్టూ ఉండే పరిస్థితులు ఏవైనాసరే ఓ విప్లవకారుడిగా మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించగలరనే భావిస్తున్నా మీ ప్రవర్తన నిశ్చయంగా

ఉండాలంటూ అభ్యర్థించలేను. అది సూత్ర రహితం, అసందర్భం కూడా. అయితే, మీకు నేను ఓ పాత సామెతను గుర్తు చేయగలను. "సీజర్ భార్య కేవలం గౌరవింపదగిన మహిళ మాత్రమే కాదు, గౌరవంగా కనిపించే మహిళ. తాజా పరిస్థితి పట్ల మీ అభిప్రాయాల్ని తెలుసుకునే అవకాశం ఎవరికీ ఇవ్వకండి లేదా పరిస్థితిని చక్కదిద్దడం కోసం మీరు చేపట్టిన చర్యల గురించి ఎవరికీ తెలియనీయకండి. ఓడిపోయాం, అయితే, పోరాడేందుకు ఇంకా అవకాశమే లేదన్న భావన కలిగించకండి. మీ పోరాట సంసిద్ధత మాత్రం శిఖరాగ్ర స్థాయిలో ఉండాలి. సంక్లిష్ట పరిస్థితుల మధ్య మిగతా కామ్రేడ్లలో ఉత్సాహాన్ని నింపేందుకు మీరే ఓ ఉదాహరణగా నిలవాలి.

కొన్ని విషయాల్ని అర్థం చేసుకోవడం మీకు సాధ్యం కాకపోవచ్చు లేదా కొన్ని చర్యలు మిమ్మల్ని తప్పుదారి పట్టించనూవచ్చు. కానీ వాస్తవ పరిస్థితులపట్ల టాటూతో సహా మిగతా కామ్రేడ్లెవరికీ అవగాహన లేదన్న నిర్ధారణ మాత్రం చేయ కండి. క్లిష్టపరిస్థితుల మధ్య ఓటమి నుంచి దృష్టి మళ్లించడం కోసం, మన నైతికతను కాపాడుకోవడం కోసం అసాధారణ జాగ్రత్తలు తప్పనిసరని మరచిపోకండి.

సికీతో కలిసి ఓ సమగ్ర నివేదికను టాటూకు పంపించా. మారుతున్న పరిస్థితుల గురించి వివరించాం. అది చదివాక ఆయన మా దగ్గరికి రాగలరని భావిస్తున్నా ఓవేళ ఆయన రాలేకపోతే వచ్చే గురువారం నేనే వెళ్లి తాజా సమాచారం అందిస్తా ఇలాంటి సందర్భాల్లోనే మన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నిలుపుకోవాలి. దృఢ చిత్తానికీ, ఆత్మవిశ్వాసానికీ ఉదాహరణగా నిలవాలి. సమస్యల పరిష్కారం కోసం విప్లవ కార్యాచరణే మార్క్సిస్ట్-లెనినిస్ట్ నేతలుగా మన కర్తవ్యం. టాటూ పై ఇదివరకెన్నడూ లేనంత నమ్మకం నాకుంది. మీకూ ఉందనే అనుకుంటా. ఆయన వల్ల ఏ తప్పూ జరగలేదని చెప్పను. కానీ ఓ వేళ ఆయన పొరపాట్లు చేస్తే, వాటిపై చర్చించాలి. ఆ తర్వాత ఆయన ఆదేశాల్ని అనుసరించాలి. నా మాటల్ని హాస్యంగా భావించ కూడదు. మనకు జరిగే మేలేమిటన్న అనుమానం ఎంత ఉన్నాసరే, పోరాడకుండా ఓడిపోవడంకన్నా యుద్ధంలో చావడానికే వేయి విధాలుగా సిద్ధంగా ఉంటానని చెప్పగలను. క్యూబన్ విప్లవకారులు చావడానికైనా సిద్ధపడ్డారు తప్ప భయపడరు.

ఓ సైనికుడిగా మీరు మీ విప్లవ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తారనే నమ్మకం నాకుంది. ఓ క్యూబన్గా, ఓ మానవుడిగా, అది కేవలం ఓ వ్యక్తిగత కర్తవ్యం మాత్రమే కాదు, ఓ బాధ్యత గల నాయకుడిగా ఇతరులకు మీరు ఆదర్శంగా నిలవాలి.

వెన్నిరెమోస్

మరో నివేదిక టెంబోనుద్దేశించి రాశారు.

కామ్రేడ్. శత్రుదళాలకు 3 కి.మీ. దూరంలోని ఓ కందకం నుంచి మీకు నేనీ లెటర్ రాస్తున్నా ఇక్కడి పరిస్థితిని వివరించాలనుకుంటున్నా టాటూ పై విమర్శలు చేస్తూ, కాంగోవాసులు మాతో గొడవలకు సిద్ధమవుతున్నారు. ఆహారపు కొరత, ఆయుధాల్ని కోల్పోవడం, రైతుల ఇళ్లు తగులబడి వారు సంచారజీవులుగా మారడం, ఈ నష్టాలన్నిటికీ ఆయన్నే నిందిస్తున్నారు. మేమంతా పోరాటాన్ని విరమించాలని నిర్ణయించుకున్నాం. టాటూతో వచ్చిన క్యూబన్లలో ఎక్కువమంది ఇక్కడి నుంచి వెళ్లాల్సిందే అంటూ మీముందు ప్రతిపా దించినట్టు తెలిసింది. ఇక్కడ ఉన్న 17 మందితోపాటు అక్కడికొచ్చిన ఏడుగురి అభిప్రాయం కూడా అదే. ఎమిలియో, ఇక్కడి కామ్రేడ్ల అందరి అభిప్రాయం ఒకటే. నిరాసక్తత, నమ్మకం లేకపోవడం, కాంగోను వదిలి వెళ్లాలన్న బలమైన కోరిక. ఎవరికోసమైతే పోరాడేందుకు వచ్చారో వారి పట్ల మన బాధ్యత తీరిపోయిందని భావిస్తున్నారు. కామ్రేడ్లంతా టాటూవైపు చూస్తున్నారు. ఆయన పట్ల వారికున్న అభిమానంతో ఆయనే ఓ మార్గం చూపగలరన్న నమ్మకంతో మీకు చెప్పాలనుకున్నది చెప్పా. మీకు సాధ్యమైన సాయం చేయండి.

రాజకీయ ప్రతినిధి

దళాల ఆత్మస్థైర్యం పూర్తిగా దెబ్బతిన్న వాస్తవం ఈ లెటర్ ద్వారా స్పష్టమైంది. ఇక్కడి నుంచి తిరిగి వెళ్లామంటూ నన్ను అడగడం కోసం కొంతమంది కామ్రేడ్లు ఓ సమావేశం నిర్వహించాలనుకున్నారు. దానికి నేనిచ్చిన సమాధానం చాలా కఠినం గానే ఉంది. వారి డిమాండ్ను ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించనని హెచ్చరించా. అందుకోసం ఎలాంటి సమావేశం నిర్వహించినా అది ద్రోహమే అవుతుందని చెప్పా. అలాంటి ప్రతిపాదన చేసేవారిని పిరికివాళ్లుగా ముద్ర వేస్తానంటూ గుర్తు చేశా. క్యూబన్ల మధ్య ఐక్యత సాధించే అధికారం నాకింకా మిగిలే ఉంది.

అయితే కాంగోవాసుల నుంచే చాలా దారుణ సంఘటనలు జరుగుతున్నాయి. ఆ రోజుల్లో మకాంబిలా రాసిన ఓ లెటర్ నాకందింది. గతంలో కాంగో జాతీయ ఉద్యమానికి ఆయన డిప్యూటీగా వ్యవహరించారు. మహిళల్ని చంపేశారంటూ మసెంగోపై ఆ లెటర్లో ఆరోపణలున్నాయి. తమ ప్రాంత పరిస్థితిని విశ్లేషించేందుకు పీజీ రావాల్సిందిగా నన్ను ఆహ్వానించారు. ఆ సమయంలో వివిధ దేశాల నుంచి వచ్చిన వార్తలు పెద్ద ప్రమాదాన్నే సూచించాయి. దాంతో సాధారణ సిబ్బంది రక్షణపట్ల శ్రద్ధ చూపాల్సివచ్చింది. ఈ పెద్ద మనిషి మాత్రం ఓ సమావేశం నిర్వహిస్తున్నా మంటూ ఉత్తరాల వర్షం కురిపిస్తున్నారు (ఆయన నుంచి అనేక ఉత్తరాలు నాకందాయి). ఆ సమయంలో విప్లవోద్యమం ఎంతటి పతనావస్థకు చేరుకుందో ఈ పేరా చూస్తే అర్థమవుతుంది.

"పీజీ ప్రాంత ప్రజల తరఫున కొన్ని ప్రతిపాదనల్ని ఆకాంక్షల్నీ మీముందుంచే అధికారం నాకుంది. 1–మా విప్లవోద్యమాన్ని నడిపే మిలటరీ బాధ్యతల్ని స్నేహదేశ దళాలకు అప్పగించాలనేది మా ప్రజల డిమాండ్. 2- స్నేహ దేశాల నుంచి మా ప్రజలు ఆశిస్తున్న సాయం. a) మిలటరీ ఆపరేషన్లు, ఆయుధాలు, వస్తు సామాగ్రి, ధనం, వ్యక్తిగత సాయం. b) సాంకేతిక సాయం, ఇంజనీర్లు, వివిధ రంగాల సాంకేతిక నిపుణులు, డాక్టర్లు, వగైరా. c) సామాజిక సేవలు, ఉపాధ్యాయులు, వర్తకులు, పారిశ్రామికవేత్తలు, వగైరా".

మా సాయం పొందుతూ, మిలటరీ అధికారాన్ని కూడా మాకు అప్పగించడ మంటే... దేశద్రోహ నేరారోపణకు అవకాశమివ్వడమే. ఇలాంటి ఆలోచన వెనుక శత్రు ప్రమేయం లేదనుకుంటే, తెగల మధ్య, కబీలా-మసెంగో బృందాల మధ్య వైరుధ్యాలే కారణమై ఉంటాయి.

అలీ నుంచి వచ్చిన నివేదిక ఈ అసందర్భపు ప్రతిపాదన నుంచి దృష్టి మళ్లించేలా చేసింది. వారు నిర్వహించిన రెండు దాడుల్లో శత్రువుకు అనేక నష్టాలు కలిగించారు. ఆయన, ఆయన బృందంలోని కామ్రేడ్లు చేసిన సాహసాలు మంచి ఫలితాల్ని సాధించాయి. ఓ దాడిలో శత్రువుకు చెందిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో వారి ప్రణాళికలు మ్యాపులతోపాటు ఓ రేడియో ఉంది. అలాగే రెండు ఫిరంగులు, ఓ రాకెట్ లాంచర్, నాలుగు FAL లు,

ఓ సూపర్FAL, ఇతర ఆయుధాలు, నిల్వలు పట్టుబడ్డాయి. ఇది మనకు మంచి ఫలితాలనిస్తే, శత్రువుకు తీవ్ర నష్టం కలిగించింది. అయితే పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ఈ ఒక్క సంఘటనే సరిపోదు.

తీర ప్రాంతాన్నంతా ఆక్రమించడమే వారి లక్ష్యంగా కనిపిస్తోంది. కిగోమాకు సమీపంలోని మన స్థావరాలన్నిటినీ ధ్వంసం చేయాలన్నది వారి ప్రణాళిక. మన నుంచి జరిగిన కొన్ని తప్పిదాల వల్ల మన ఆయుధాలు, దళసభ్యులు, క్యాబిన్ల సంఖ్య, తదితర వివరాలు శత్రువుకు స్పష్టంగా తెలిసిపోయాయి. వారి గూఢచారి వ్యవస్థ సమగ్రంగా పనిచేస్తోంది. అది ఏ స్థాయిలో చేస్తుందో తెలుసుకోలేకపోయాం.

నేను స్థావరానికి చేరుకుని చూస్తే, నాకు హామీ ఇచ్చినంతమంది అక్కడ కనిపించలేదు. శత్రువు ఏం చేయాలనకునేది మాత్రం మనకు ముందే తెలుసు. డాక్యుమెంట్ల వల్ల కొత్తగా తెలిసిందేమీలేదు. మన దళాల తిరోగమనమే భయం గొలుపుతోంది.

**********

స్థావరాన్ని శత్రు దుర్భేద్యంగా ఉంచేందుకు ప్రాథమిక జాగ్రత్తలు తీసుకున్నాం. శత్రువును తీవ్రంగా నష్టపరిచిన సందర్భంలో కనీసంగానైనా తీసుకోవాల్సిన జాగ్రత్తలవి. సున్నిత ప్రాంతాల్లో కందకాలు తవ్వి రక్షణ ఏర్పాట్లు చేశాం. రువాండసీ వైపుగా ఉన్న పర్వత శ్రేణుల్లో పర్యవేక్షణ కోసం స్కౌట్ దళాన్ని పంపించాం. దానికి దక్షిణంగా ఉన్న రోడ్డును చేరేందుకు మార్గం కనుగొంటారు. ఆ రోడ్డు గంజా నుంచి నేరుగా సరస్సుకు వెళ్తుంది. రహస్య ప్రదేశాల్లో బావులు తీయాల్సిందిగా ఆదేశించాం. క్యూబన్ కామ్రేడ్లు ఆ పని చేశారు. ఓవేళ ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాల్సివస్తే సైనిక సామగ్రినంతా వాటిలో దాచేందుకు వీలవుతుంది.

నేను రాగానే రేడియో పనితీరు సమీక్షించా. ఎక్కువ పరిధి ఉన్న పరికరాన్నే దానికి అమర్చారు. అయితే ప్రస్తుతం అంత పరిధిలో అందించడం సాధ్యపడదు. ఓ చిన్న జనరేటర్ ద్వారా 12 వోల్టుల బ్యాటరీలకు చార్జింగ్ చేస్తూ పని చేయి స్తున్నాం. అందుకోసం ఎక్కువ మొత్తంలోనే పెట్రోల్ అవసరమవుతోంది. దార్ వరకూ ప్రసారాలు అందుతున్నాయి. కానీ, స్పష్టత లేదు. క్రిగోమా వరకూ స్పష్టంగా అందుతున్నాయి. ప్రసార బాధ్యతల్ని ముగ్గురు కామ్రేడ్లు నిర్వహిస్తున్నారు. లెఫ్టినెంట్ టుమా, టెలిగ్రాఫ్ ఆపరేటర్, ఓ మెకానిక్. అక్టోబర్ 22 (అది పని చేయడం ప్రారంభమైన రోజు) నుంచి నవంబర్ 20 (మేం సరస్సును వీడిన రోజు) వరకూ అది 110 సందేశాల్ని పంపించగా 60 మాత్రమే గమ్యాన్ని చేరుకున్నాయి. ఓవైపు అంకిత భావంతో పనిచేస్తున్న ఈ కామ్రేడ్ల సేవలు ఉన్నతంగా ఉండగా, మరోవైపు నిస్పృహతో పోరాటాన్ని విరమిస్తున్న మన దళాల తీరు నిరాశ కలిగిస్తోంది. అనుభవజ్ఞులైన మనుషులు తాము చేయాల్సింది ఎంతో ప్రేమతో చేస్తారు. అలాంటి వారే ఆశ్చర్యకర ఫలితాన్ని సాధిస్తారు. హోదాలతో నిమిత్తం లేకుండా కార్యకర్త లంతా తమ పనిలో అలాంటి నాణ్యతనే కనబరచి ఉంటే ఫలితాలు మరో విధంగా ఉండేవని కచ్చితంగా చెప్పగలను.

నేను రాగానే మసెంగోతో ఫోన్‌లో మాట్లాడా. ఆయన ఎంతో ఉత్సాహంగా అనిపించారు. ఆయన మొదటి ప్రతిపాదన-కసీమాపై దాడి చేయాలని, అది ఆయన సొంత ఆలోచనే. దాన్ని గురించి మరుసటి రోజు చర్చిద్దామని చెప్పా ఆయన్ని చూసేందుకు వెళ్లినపుడు దాన్ని గురించి మరోసారి సంభాషించాం. నానే, కహేమాల ద్వారా నాకందిన సమాచారం ప్రకారం ఆ గ్రామంలో శత్రు సైనికులెవరూ లేరు. అదే ఆయనకు గుర్తు చేశా. అయితే ఆయనకందిన సమాచారం

మరోవిధంగా ఉంది: కెప్టెన్ సలూమ్ బృందం అక్కడికి వెళ్లేందుకు యత్నించగా, శత్రుదళాలు ఎదురుపడ్డాయి. దాంతో వారు వెనక్కి వచ్చారనేది ఆయన కథనం. మేమిద్దరం ఓ అంగీకారానికి రాలేకపోయాం. ప్రస్తుతానికి దాడి ఆలోచన వాయిదా వేసి, మరోసారి అక్కడ పర్యవేక్షణ జరపాలని నిర్ణయించాం.

స్థావరాన్ని రక్షించడం కోసం నేను చేపట్టిన చర్యల పట్ల ముందండి సంతృప్తి చెందారు. గంజా రక్షణ బాధ్యత ఆయన చూస్తారు. కొంతమంది కసీమా వైపు వెళ్తారు. రువాండన్లకు సాయం చేయాలని ముందండి కోరారు. బట్టలు, బూట్లు, ఆహారం, దాడికి సాయపడేందుకు కొందరు క్యూబన్ నిపుణుల్ని ఆయన అడిగారు. ఆరుగురిని పంపేందుకు హామీ ఇచ్చా. టామ్, అజాలు కరెంట్ స్తంభాల్ని కూల్చే బాధ్యత చేపడ్డారు. ఫ్రంట్ డీ ఫోర్స్ దగ్గర కామ్రేడ్ అంగాలియా బృందం కాల్పులు జరుపుతూ శత్రుదళాల దృష్టి మళ్లిస్తుంది. నీటి పైపును పగులకొట్టేందుకు యత్నిస్తుంది. బృందానికి అంచలి నేతృత్వం వహిస్తారు.

నాకోసం కొన్ని ముఖ్య సందేశాలొచ్చినట్టు తెలిసింది. దాంతో సరస్సు దగ్గరే వేచి ఉండాలని నిర్ణయించా. ఆ అవకాశాన్ని అక్కడి కార్యకర్తలతో మాట్లాడేందుకు ఉపయోగించా. వారిలో అన్సూరినీ ఒకరు. మౌలేన్ రెండో బ్రిగేడ్‌కు ఈయన చీఫ్. ల్యాంబర్ట్‌తోపాటు కిబంబాలోని కార్యకర్తలతో ఎప్పుడూ గొడవ పడేవారు. మసెంగోకు ఈయన పట్ల ఎంతో అపనమ్మకం. కఠినంగా మందలించా, ప్రవర్తన మార్చుకోవాలని చెప్పా పోరాటం లేకుండానే బరాకాను కోల్పోయిన విషయంగుర్తు చేశా (ఆ సమయంలో ఈయన అక్కడే ఉన్నారు). కరంబా స్థావరం నుంచి కిబంబాకు ఓ భారీ ఆయుధాన్ని మోసుకెళ్లేందుకు నా అనుమతి పొందారు. విపత్తు నుంచి ఆ ఆయుధాన్ని ఎలా రక్షించారో కథలు కథలుగా చెబుతూ నన్ను విసిగించారు. ఉదయం చాంగా వచ్చారు. పడవపై వస్తుండగా శత్రుదళాలు కాల్పులు జరిపాయి. నావికా పోరాటంలో గాయపడ్డ ఓ వ్యక్తిని వారు మోసుకొచ్చారు. చాంగాకు సైతం ముఖంపై గాయమైంది. రాకెట్ లాంచర్‌తో ఆయన సహచరులు ఎదురుకాల్పులు జరుపుతుండగా ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. గాయపడ్డ కామ్రేడ్లను చూసి కాంగోవాసులు పారిపోయారు. ఆపై వారిని వెనక్కి రప్పించడం కష్టమైంది. రఫెల్ మా దగ్గరికి

ఓ వార్తాహరుణ్ణి పంపించారు. ఆయన తెచ్చిన సమాచారం ఇలా ఉంది.

"కామ్రేడ్ టాటూ... ఈ ఉదయం ప్రభుత్వ అధికారులు (టాంజానియా) ప్యాబ్లోను పిలిపించి మాట్లాడారు. ఆఫ్రికా దేశాలు తమ దేశాధినేతల సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని తెలిపారు. ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదంటూ నిర్ణయించారు. దీంతో ఇప్పటి వరకూ వారందించిన సాయం విషయంలో మార్పు రానుంది. ఈ కొత్త విధానంవల్ల మనల్ని ఇక్కడి నుంచి వెళ్ళి పోవాల్సిందిగా కోరారు. అయితే ఇప్పటివరకూ చేసిన సాయంలో ఆఫ్రికా దేశాలకన్నా మన సాయమే అధికమని వారు గుర్తించారు. అధ్యక్షుడే స్వయంగా ఈ విషయాన్ని మన నేతలకు చెప్పనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నివేదికను హవానాకు పంపించాం. మీ అభిప్రాయాల కోసం ఎదురుచూస్తాం...

శుభాకాంక్షలతో... రఫెల్

క్షీణ దశకు చేరుకున్న విప్లవోద్యమానికి చావు దెబ్బలాంటిది. ఇలాంటి సమా చారాన్ని కాంగో కామ్రేడ్లకు చెప్పేందుకు మనసొప్పలేదు. రానున్న రోజుల్లో జరగ నున్న పరిణామాల కోసం వేచి చూస్తున్నాం. అయితే టాంజానియా విధానంలో మార్పు రావడంతో కిగోమా నుంచి సరఫరాలకు ఆటంకం కలిగే అవకాశాలున్నా యంటూ పరోక్షంగా హెచ్చరించా. దార్ నుంచి 4న ఓ టెలీగ్రాం వచ్చింది. ఫిడేల్ పంపిన లెటర్‌లోని ముఖ్యాంశాలు అందులో ఉన్నాయి. అవి: "మీరు ఇంకా అక్కడ కొనసాగడం న్యాయసమ్మతం కాదని టాటూ భావిస్తే, వెనక్కి వచ్చే ఆలోచన చేయాలి. మీరు అక్కడే ఉండాలని నిర్ణయిస్తే మాత్రం మీకు అవసరమైన మను షుల్ని వస్తువుల్ని చేరవేసేందుకు ప్రయత్నిస్తాం. మీ భయాల్లో నిజం లేకపోవడం, మీలోని నిరాశావాదం మాకు ఆందోళన కలిగించింది. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి మద్దతు ఇస్తాం. ఎలాంటి నష్టమూ జరగనీయకండి".

దీని తర్వాత మరో టెలీగ్రాం వచ్చింది.

టాటూకు. రఫెల్ నుంచి..."4న మరో సందేశం అందింది. పరిస్థితి ఎలా ఉన్నాసరే షోంబే దళాలు ఇంకా దేశంలోనే కొనసాగితే పలు రకాల దాడులకూ, క్రూర చర్యలకూ పాల్పడనున్నాయి.

అలాంటి దీనస్థితిలో కాంగో విప్లవకారులకు మన మద్దతు ఉపసంహరించినా, పోరాటాన్ని విరమించాలని నిర్ణయించినా అది ద్రోహమే అవుతుంది" టెలీగ్రాం సందేశాలతో, రఫెల్ లెటర్‌లోని విషయాల్ని పోల్చి చూసిన కామ్రేడ్లు ఎవరికైనా వాటి మధ్య స్పష్టమైన వైరుధ్యాలున్నాయన్నది అర్థమవుతుంది. మొదటిది హవానా నుంచి వచ్చిన లెటర్ సారాంశం. ఇది అక్టోబర్ 5న నేను రాసిన లెటర్‌కు సమాధానంగా వచ్చింది. ఇక రెండోది టాంజానియా ప్రభుత్వం తన ఆలోచనను మార్చుకున్నాక వచ్చిన నివేదికగా భావించాలి. ఫిడేల్‌కు మేమిచ్చిన సమాధానాన్ని దార్ రేడియో ప్రసారం చేసింది.

రేడియో ద్వారా ఫిడేల్కు పంపిన నివేదిక.

"రఫెల్. మీ పర్యటన సమయంలో జూలియో (మౌరినో) తప్పిపోయారు. వెనక్కి వెళ్లేటపుడు ఆయన మాతోపాటు వేగంగా రాలేకపోవడంతో తప్పిపోయారు. ఆయన తిరిగి కనిపించలేదంటే, ఆయన్ని చంపేసి ఉంటారు లేదా బంధించి ఉంటారు. అయితే మొదటిదే జరిగే అవకాశాలెక్కువని భావించాం. వెనక్కి వెళ్లడం పూర్తవగానే రఫెల్ పెరేజ్‌ను తీవ్రంగా హెచ్చరించా. 75 ఎంఎం-ఎస్ ఆర్ గన్ను వదిలేసి వచ్చినందుకు. ఆ తర్వాత కాంగోవాసులు దాన్ని వెతికి తెచ్చారు. కొత్త క్యాంప్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. అయితే అదే సమయంలో శత్రుదళాలు కూడా కదల్లేని స్థితిలో ఉన్నాయన్నది అర్థమైంది. ఆయుధాల డంప్ నిర్మాణ పనులే నెమ్మదిగా సాగాయి. ఈ నేలపై అడుగుపెట్టి అక్టోబర్ 24కు ఆరు నెలలు గడిచాయి. అయితే ఆ సందర్భంగా ఉత్సవాలు జరిపి ఉంటే, అదే అదనుగా శత్రువు ముందుకు వచ్చి దాడులకు పాల్పడేవాడు. జరిగిన సంఘటనలు దాన్నే రుజువు చేశాయి. రైతుల ఇళ్లను తగులబెట్టడాన్ని ప్రత్యక్షంగా చూశాం. క్యాంప్ నుంచి వెళ్లిన కాంగో వాసులు శత్రు దాడులకు గురయ్యారు. దాంతో అక్కడ వారి ఉనికిని గుర్తించాం. మన దళాన్ని ఎక్కడికక్కడ ప్రతిఘటించాల్సిందిగా ఆదేశించా. చీకటిపడేంత వరకూ నిలువరించడం ద్వారా ఆయుధాల్ని కాపాడుకోవాలని ఆలోచించాం. పెద్దసంఖ్యలో శత్రుదళాలు కొండల్ని చుట్టుముట్టినట్టుగా సమాచారమందింది. ఇది ఊహించని పరిణామం. కొండల చుటూ ముందస్తుగా ఎలాంటి రక్షణ ఏర్పాటూ చేయలేదు. దాంతో పర్వతశ్రేణుల రక్షణకోసం వేగంగా

స్పందించాల్సి వచ్చింది. అయితే వాస్తవం మరోవిధంగా ఉంది. శత్రుదళాలు రోడ్డుమార్గంలో ఫ్రంట్‌లో ప్రవేశించేందుకు యత్నించాయి. కొండలవైపున పరుగుతీసింది రైతులని ఆ తర్వాత తెలిసింది. పారిపోతున్న రైతుల్ని చూసి మన దళాలు శత్రువుగా భ్రమపడ్డాయి. శత్రువును నిలువరించే సామర్థ్యం ఉండి కూడా అది గ్రహించని మన దళాలు పారిపోయాయి. మన సేనలోని ఒకే ఒక్క యూనిట్ మాత్రమే శత్రువుతో పోరాడింది. ఓ గంటసేపు నిలువరించింది. అయితే తక్కువ సంఖ్యలో ఉండటంతో ఆత్మవిశ్వాసం కోల్పోయింది. FALతో పోరాడుతూ బవాజా తీవ్రంగా గాయపడ్డారు. గతుకుల రహదారిలో ఆయన్ని మోసుకుపోయాం. అది క్యూబాలోని సియెర్రా రహదారికన్నా దారుణంగా ఉంది. 26న ఉదయం ఆయన చనిపోయారు. వెనక్కిపరుగుతీయడం వల్ల 12.7 మెషీన్ గన్‌తోపాటు నిల్వ ఉంచిన ఆయుధాలన్నీ కోల్పోయాం. అంతకుమించి రైతుల విశ్వాసాన్ని కోల్పోయాం.

ఆ రోజుల్లో శత్రుదళాలు అన్నివైపులా ముందుకు రావడం ప్రారంభించాయి. మన స్థావరంపై చివరి దాడికి సిద్ధమవుతున్నట్టుగా భ్రమింపజేశాయి. అయితే అలా జరగలేదు. మన రక్షణ దృఢంగా ఉంది. అయితే ఆయుధాల కొరత, కాంగో వాసులపై నమ్మకం లేకపోవడం మన లోపాలే. పర్వతాల చుటూ నాలుగువైపులా మన దళాలున్నాయి. మ్యాప్‌లో చూపిన మన స్థావరాలు ఇవే; బరాకా, పిజీ, లుబోండ్జా, ఫోర్స్ - బెందేరా, కబింబా... మరోవైపు బరాకా, కబింబా వైపున శత్రు దళాల ఔట్‌పోస్టులున్నాయి. కబింబా ఫ్రంట్లోని అలీ దళాలు శత్రుదళాలపై మూడుసార్లు దాడులు జరిపాయి. రెండో దాడిలో శత్రుదళాల ఆధీనంలోని 25 కి.మీ. వరకూ మన దళాలు చొచ్చుకువెళ్లాయి. సరస్సు నుంచి మనకు సరఫరాలు జరకుండా అడ్డుకునేందుకు శత్రుదళాలు అక్కడ మోహరించాయి. వారి వాయు సేనకున్న 8టీ-28లు, రెండు బీ–26లు, ఒక డీసీ-3, ఓ హెలికాప్టర్ మన కాంగో కామ్రేడ్లను భయపెట్టగలిగాయి. మిలటరీ దృష్టితో చూస్తే మనకిది క్లిష్ట పరిస్థితే. మన దళాలకు ఆయుధాలున్నాయి. అయితే క్రమశిక్షణగానీ, పోరాట స్ఫూర్తిగానీ ఏమీలేవు. ఈరోజూ ఈ ప్రాంతానికి ఆపరేషన్స్ కమాండర్ ను నియమించా. దళాలకు ఆదేశాలిచ్చే పూర్తి అధికారాన్ని ఆయనకిచ్చాం. విమాన విధ్వంసక దళాన్ని కూడా ఆయనే కమాండ్ చేస్తారు.

82 రకం ఫిరంగులు, మూడు ఎస్ ఆర్-75 ఎం ఎం గన్స్, 10 ఏ ఏ12.7 మెషిన్ గన్లు ఉన్నాయి. వరుస ఓటములతో కాంగో అధికారుల్లో పోరాట స్ఫూర్తి రగులుకుంది. ఇక నుంచి సీరియస్‌గా వ్యవహరిస్తా మన్నారు. విప్లవోద్యమాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రాణాల్ని పణంగా పెడ్తామంటూ కొందరు హామీ ఇచ్చారు. అయితే కబీలా ఆలో చనలెలా ఉన్నాయో తెలియదు. త్వరలోనే ఇక్కడికి రాగలనని చెబుతున్నారు. ఫిడేల్ నుంచి తాజా సందేశాలందాయి. అందులో ఒకటి నా లెటర్కు సమాధానంగా వచ్చింది. ఇంకొకటి టాంజానియా నుంచి వచ్చిన తాజా సమాచారానికి ప్రతి స్పందన. నేను మాత్రం నిరాశావాదంలో కొట్టుకుపోవడంలేదు. నేను ఇక్కడే ఉంటా. నాతోపాటు ఎంపిక చేసిన 20 మంది ఉంటారు. మిగతావారిని వేరే ప్రాంతానికి పంపిస్తా ఇక్కడివారిలో పోరాట స్ఫూర్తిని రగిలించేవరకూ ఉంటా. ఆ తర్వాత మరో ఫ్రంట్ కు వెళ్తా టాంజానియా నుంచి వచ్చిన తాజా సమాచారం పట్ల ఫిడేల్ స్పందనతో ఏకీభవిస్తున్నా ఇక్కడి నుంచి వెళ్లే ఆలోచనే లేదు. ఏ ఒక్క క్యూబన్ కూడా ఈ పరిస్థితుల్లో ఇక్కడి నుంచి వెళ్లలేరు. టాంజానియా నేతలతో సర్దుబాటు కోసం చర్చలు చేయాల్సి ఉంది.

మా ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి: క్యూబన్ల ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం లేదా టింబో లేదా మిశ్రమ బృందం టాంజానియా వెళ్లి చర్చించాలి. వారు చర్చించాల్సిన విషయాలు ఇలా ఉండాలి; క్యూబా నుంచి వచ్చే సాయానికి టాంజానియా ఆమోదం ఉంటే దానికి మరింత విలువ ఉంటుంది. అది షరతులు లేకుండా, కాల పరిమితి లేకుండా ఉండాలి. ప్రస్తుతం, టాంజానియా ఎదు ర్కొంటున్న సమస్యల్ని అర్థం చేసుకోగలం. అయితే వారి ప్రతిపాదనల్ని మాత్రం అంగీకరించం. ఇచ్చిన హామీల నుంచి క్యూబన్లు ఎట్టి పరిస్థితిలోనూ వెనక్కి వెళ్లరు. కిరాయి సైనికుల అమానుష దాడులకు లేదా వారి దయాదాక్షిణ్యాలపై బతికే దీన స్థితికి తమ మిత్రుల్ని ఒంటరిగా వదిలి వెళ్లడమంటే అది సిగ్గుతో తలదించు కోవడమే అవుతుంది. తగిన బలమైన కారణాలుంటే లేదా కాంగోవాసులు మమ్మల్ని కోరితే మాత్రం పోరాటాన్ని తప్పకుండా విరమిస్తాం. అయితే అలాంటి పరిస్థితి తలెత్తకుండా పోరాడుతాం. ఇప్పుడు టాంజానియా ప్రభుత్వం చెబుతున్నదంతా మ్యూనిచ్ ఒప్పందానికి దగ్గరగా ఉంది. అది నయా వలసవాదానికి స్వేచ్ఛనిస్తుంది.

అయితే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వెనక్కి తగ్గడం, వాయిదా వేయడంలాంటివి ఉండకూడదు. ప్రస్తుత ప్రభుత్వమే కాంగోలో స్థిరపడ్డే, భవిష్యత్లో అది టాంజానియాకు ముప్పు తెస్తుంది. దాని సరిహద్దులన్నీ శత్రు దేశాలతో చుట్టివేయబడ్డాయి. మరోవైపు టాంజానియా సహకారం లేకుండా విప్లవమంటే అందుకు పెద్ద మొత్తంలోనే త్యాగాలు అవసరమవుతాయి. సహకార లోపం వల్ల కలిగే నష్టాలకు మనం బాధ్యులం కాలేం.

టెలీగ్రాఫిక్ సమాచార సహకారం కొనసాగించాల్సిందిగా టాంజానియాను కోరాలి. వారానికి ఒకటి లేదా రెండుసార్లు నిత్యావసరాల సరఫరా కోసం ఓడల్ని అనుమతించాలి. రెండు స్పీడ్ పడవలకు అనుమతించాలి. కొన్ని ఆయుధాలివ్వాలి. 15 రోజులకోసారి మెయిల్ సౌకర్యముండాలి.

పడవలు వెంటనే వచ్చేలా చూడమని చెప్పా. శత్రువుకు స్పీడ్ పడవలుండగా, మనకున్న సోవియట్ పడవలు నెమ్మదిగా కదులుతున్నాయి. మార్గమధ్యంలో కాల్పుల సంఘటనలు జరుగుతున్నాయి. ఇక్కడికొచ్చేటప్పుడు చాంగాకు అలాంటి అనుభవమే ఎదురైంది. మన సభ్యుడొకరి చేతికి గాయమైంది. ప్రతిరోజూ ఇలాంటి పోరాటాలకు టాంజానియా ప్రభుత్వం అంగీకరించదు. అందుకే పడవల్ని సరస్సు దగ్గర మనవైపునే ఉంచాలి. అవసరమైనపుడు అక్కడికెళ్లి అదే రాత్రి తిరిగి రావాలి. సరస్సుపై పట్టు కోల్పోయినపుడు పర్వతాల పక్కన ఓ పడవను నడపాలి. మన మింకా ఇక్కడే కొనసాగుతున్న విషయం టాంజానియాలోని కొద్దిమందికి మాత్రమే తెలిసి ఉండేలా జాగ్రత్త పడాలి. అందుకోసం అక్కడి నుంచి రాత్రి వేళ వస్తూ, ఇక్కడి నుంచి అక్కడికి తెల్లవారకముందే చేరుకోవాలి. అలాంటి పడవల్ని సముద్ర తీరాన స్మగ్లర్లు ఉపయోగిస్తారు. అయితే ఇదంతా మన పని సాఫీగా సాగిపోవడం కోసమే. మన కార్యాచరణకు ఎంతో ప్రాధాన్యత ఉన్నందున ప్రమాదాలకు దూరంగా ఉంచాలి. అంతిమ నిర్ణయాన్ని సోవియట్, చైనా దేశాలకు తెలపండి. తర్వాత జరిగే సంఘటనలకు మనల్ని నిందించకుండా ముందస్తు వ్యూహం ఇది. మా గురించి ఎలాంటి భయాలూ అవసరం లేదు. క్యూబా గర్వపడేలా మా చర్య లుంటాయి. మేమేమీ నాశనమైపోం. మా నుంచి బలహీనుల్ని త్వరలోనే వదిలించు కుంటాం. అపుడే మేం కచ్చితంగా, మరింత స్పష్టంగా వ్యవహరించగలం. మీ అందరికీ మా అందరి తరఫునా హృదయపూర్వక శుభాకాంక్షలు. -టాటూ

నోట్ : జంజిబార్‌లో ఎయిర్ బేస్ ఏర్పాటు గురించి కరుమేతో మాట్లాడగలరు. వీలైతే ఓ స్టాప్ టాంజానియాలో ఉండాలి. మీకు ఎలా సాధ్యమైతే అలా చేయండి. కిగోమా హాస్పిటల్‌కు డాక్టర్లను పంపేందుకు టాంజానియాను ఒప్పించండి. కొంతదూరం వరకూ వారు స్వేచ్ఛగా వెళ్లాల్సి ఉంటుంది. ఇంగ్లీష్ మాట్లాడగలిగిన నిపుణులైన డాక్టర్లనే అందుకు ఎంచుకోండి. వారు మన పనికి తగిన మంచి విప్లవకారులై ఉండాలి. ఇంతే సంగతులు.

కమాండ్ నిర్మాణ బలహీనతల పట్ల ఆందోళన చెందా. చిన్నదిగా ఉండాలన్నదే నా ప్రణాళిక. సాధారణ సిబ్బంది మృదువుగా ఉండటమే సరైంది. అయితే పరిస్థితుల్ని ఒక్కసారిగా మార్చలేమని మసెంగో అన్నారు. కొన్ని రోజుల క్రితమే ఓ నమూనాను రూపొందించాం. దీనిపై జరిగిన చర్చల్లో సికీ కూడా పాల్గొన్నారు. కబీలా ఆమోదం కోసం వేచి చూస్తున్నాం. నా నమూనా సోవియట్ సేన బెర్లిన్‌ను ముట్టడించే సమయంలో రూపొందించిన నమూనాను పోలి ఉంటుంది. అయితే నా ఆలోచన అమలు కాలేదు. క్రియాత్మక సైనిక పాఠశాలకు ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు చేపట్టాలని కోరారు. అందుకు బదులుగా ఆపరేషన్స్ నిర్వాహకుడిగా బాధ్యతలు చేపట్టా (సిద్ధాంతపరంగా కమాండర్ తర్వాతి హోదా ఇది). దీంతోపాటు ఇన్‌స్ట్రక్టర్‌గా, విమాన విధ్వంసక దళ నిర్వాహకుడిగా బాధ్యతలు అప్పజెప్పారు. జరగనున్న వినాశనాన్ని అడ్డుకునేందుకు ఓ మానవుడిగా సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేయాలన్న సంకల్పంతోనే బాధ్యతలు చేపట్టా.

24న జరిగిన విపత్తు తర్వాత అజీమా కంపెనీకి కొంత నష్టం జరిగింది. పారిపోయిన కాంగోవాసుల్లో చాలాభాగం వెనక్కి వచ్చారు. అయితే వారికోసం మా దగ్గర ఆయుధాలు లేవు. కిగోమాలోని ఆయుధాలు, సైనిక సామగ్రి అంతా విచక్షణారహితంగా పంపిణీ కావడంతో స్థావరం పూర్తిగా ఖాళీ అయిపోయింది. ఇతర బలహీనతలకు తోడు ఆయుధాల కొరత మరో పెద్ద సమస్యగా మారింది. ఆయుధాగారంలో ఇక మిగిలిందల్లా 12.7 బుల్లెట్లు, ఫిరంగి గుళ్లు మాత్రమే. విరివిగా ఉపయోగించే రైఫిళ్లుగానీ, SKS లుగానీ ఏమీ లేవు.

మేం చేయాల్సింది మెరుగ్గానే చేస్తున్నాం. ఆయుధాగారాల్ని నిర్వహించాం. దళాలకు ఆయుధాల్ని పంపిణీ చేశాం. విమాన విధ్వంసక యూనిట్ను ఏర్పాటు చేశాం.

ముందండి జోన్ నుంచి వచ్చిన మపూను కిసోసీకి (ఇది కసీమా, కిబింబాల మధ్య ఉంది) పంపించాం. ఆ ప్రాంత రక్షణ ఏర్పాట్లను ఆయన సమన్వయం చేస్తారు.

అక్కడి నుంచి రావడానికి ముందు వొళ్ళు జలదరించే ఓ సంఘటన జరిగింది. దగ్గరలోని కేలిగ్జిటే స్థావరం నుంచి ఇద్దరు కాంగో దూతలు క్యాంప్కు వచ్చారు. అప్పటికే ఆలస్యం కావడంతో మాతోనే ఉండి రాత్రి ఇక్కడే పడుకోవాలంటూ కామ్రేడ్లు చెప్పారు. అయితే తమను ముందండి పిలిచారని, రాత్రి అక్కడే ఉంటా మంటూ వారు వెళ్లిపోయారు. మరుసటిరోజు వారు కనిపించలేదు. దీనిపై ముందం డిని ప్రశ్నించగా, సాధారణ సైనికులైన వారు రాజకీయ ప్రతినిధులమంటూ తప్పుడు సమాచారమివ్వడంతో తిప్పి పంపామన్నారు. కొన్ని రోజుల తర్వాత ఇద్దరు రువాండన్లు నీలిరంగు చొక్కాలు, హెల్మెట్లు ధరించి కనిపించారు (రువాండన్లు సాధారణంగా అలాంటి డ్రస్సు ధరించరు). అవి తప్పిపోయిన కామ్రేడ్ల డ్రస్సులు. ఇంతలో కేలిగ్జిటే తమ మనుషులు తిరిగి స్థావరానికి చేరుకోలేదంటూ ఓ వ్యక్తిని పంపారు. దాంతో, ముందండి మనుషులు ఆ ఇద్దరినీ చంపేసినట్టు అర్థమైంది. అయితే కారణమేమై ఉంటుందో మాత్రం స్పష్టం కాలేదు. ఓ చిన్న దొంగతనమైనా కావొచ్చు లేదా మరేదైనా అయి ఉండొచ్చు. ఇక్కడి రెండు బృందాల మధ్య వైరుధ్యాలు ఎంత తీవ్రస్థాయికి చేరుకున్నాయో దీన్నిబట్టి అర్థమవుతోంది. నా అనుమానాల్ని మసెంగోకు వివరించా. అయితే వరుసగా జరిగిన దురదృష్టకర సంఘటనల వల్ల ఆ విషయం మరుగునపడింది.

లుబొండ్జా ఫ్రంట్‌లోని ఎంబిలీ నుంచి ఓ లెటర్ వచ్చింది. కాంగోవాసుల నుంచి తమ మనుషులపై ఒత్తిడి తీవ్రంగా ఉందనీ, తమ మనసులు గాయపడ్డాయన్నారు. పోరాటాన్ని విరమించేందుకు కొంతమంది క్యూబన్లకు అనుమతించాలంటూ హెచ్చరించారు. రాజకీయ ప్రతినిధి కరీం నుంచి వచ్చిన మరో లెటర్ కూడా ఇదే విషయాన్ని బలపరిచింది. ఇదివరకు నేను ప్రతిపాదించినట్టుగా టెంబోను పంపిస్తే, పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో వివరిస్తామన్నారు. పోరాటాన్ని విరమించాలని మెజారిటీ కోరుతున్నట్టు ఓ లిస్ట్ జత చేసి పంపారు. వారందరి మద్దతూ ఎంబిలీకి ఉందన్నారు. ఆ తర్వాత పోరాటం పట్ల అంకితభావంతో ఉన్న కొందరు ఎంబిలీని వ్యక్తిగతంగా అభ్యర్థించినా ఫలితం లేదు. విరమించాలనే వారికి నచ్చ చెప్పేందుకు యత్నించారు.

ఓటమిని బహిరంగంగా అంగీకరించడమంటే అది పిరికి చర్యతో సమానమన్న నా విమర్శకు సమాధానమిస్తూ తనను తాను సమర్థించుకున్నారు. ఆయన వాదనలకు కరీం మద్దతు తెలిపారు.

అదే సమయంలో కబింబా నుంచి అలీ వచ్చారు. అక్కడి అధికారులతో తన గొడవల గురించి వివరించారు. దీనిపై మసెంగో, ట్రిమెండోతో చర్చించాక అలీతో వెళ్ళేందుకు ట్రిమెండో అంగీకరించారు. పరిస్థితిని సమీక్షించాక మరో క్యూబన్‌ను కమాండర్‌గా అక్కడికి పంపడమా లేక మొత్తం దళాల్ని ఉపసంహరించడమా నిర్ణయించాలి. ఎంబిలీకి లెటర్ రాశా. లుబోండ్జా స్థావరంలోని కాంగోవాసులకు కాస్త దూరంగా ఉండాలని సూచించా. మా స్థావరంలోని రక్షణ ఏర్పాట్లను ముమ్మరం చేశాం. ఆయుధాల్ని పొజీషన్‌లో ఉంచుతూ, కందకాలు తవ్వుతున్నారు. శత్రుదళాల రాకకోసం ఎదురుచూస్తున్నాం. తీవ్రస్థాయిలో విరుచుకుపడేందుకు సిద్ధమవుతున్నాం. ముందండితో పని చేసేవారిని ప్రత్యేకంగా ఉండాలంటూ హెచ్చ రించా. మొత్తం ఆరుగురుండగా, పోరాట సమయంలో నలుగురిని ఓ బృందంగా, ఇద్దరిని మరో బృందంగా విడిపోవాల్సిందిగా సూచించా. వారి జీవితాలకు ప్రమాదం పొంచి ఉంటుందంటూ హెచ్చరించాం. గతంలో రువాండన్లు చేసిన మోసాలను దృష్టిలో ఉంచుకొని వారిని వేరుగా ఉండాలని సూచించాం.

కిగోమా నుంచి వచ్చిన టెలీగ్రాం ప్రకారం ఉపాధ్యక్షుడు కవావా అక్కడికి వచ్చారు. కబీలాతో మాట్లాడారు. కబీలా చెప్పేది వాస్తవమైతే, టాంజానియా వైఖరి గురించి ఇంతకుముందు మాకొచ్చిన సమాచారంలో నిజం లేదు. అందుకు భిన్నంగా అవసరమైన సాయమందించేందుకు హామీ ఇచ్చారు. సరస్సు తెరిచి ఉంచనున్నట్టు చెప్పారు. కసీమాలో 150 మంది శత్రు సైనికులున్నట్టు తెలిసింది. కాంగో రాజకీయ ప్రతినిధి దాడికి ప్రతిపాదించారు. ఎంబిలీ పంపిన మరో సమా చారం ప్రకారం లుబోండ్జాలో శత్రు కదలికలేమీ లేవు. పర్యవేక్షణకెళ్లిన బృందానికి ఎవరూ కనిపించలేదు. అప్పటికే అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయారు. వెళ్లే ముందు ఆయుధాల్ని విడిచిపెట్టాల్సిందిగా జనాలకు విజ్ఞప్తి చేశారు. దాంతో మరోసారి పర్యవేక్షణ జరపాల్సిందిగా ఆదేశించా. పిజీ రోడ్డు వైపు శత్రు కదలికలేమీ లేవన్నారు. అయితే అంతకు కొద్దిసేపటి ముందే ఆ దారిలో పెద్దసంఖ్యలో వాహన శ్రేణి వెళ్లినట్టు తెలిసింది. దాంతో దాడుల పరంపర కొనసాగించి శత్రువుకు నష్టం కలిగించామని,

ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నామంటూ ల్యాంబర్ట్ చెప్పారు. తమ మనుషులు 900 మంది పిజీ, బిరాకాల్ని చుట్టిముట్టినట్టు ఆయన తెలిపారు. మరో దాడికి అవసరమైన ఆయుధాలు, ఫిరంగులు, విమాన విధ్వంసకాలు కావాలని కోరారు. వెనక్కి పరుగుతీసిన సందర్భంలో ఫిరంగుల్ని కోల్పోయారని, ఆయుధాల్ని స్థావరానికి పంపించారన్నది ఆయన కథనం. దీనిపై ఎంబిలీ వివరణ ఇచ్చారు. పరిస్థితి చూస్తుంటే ఇది సరైన సమయం కాదన్నారు. ఈ మనుషులతో మనం మరోసారి మోసపోవద్దన్నారు.

స్థావరం దగ్గర మనకు ఓ విమాన విధ్వంసక మెషిన్ గన్ ఉంది. దాన్ని వెంటనే బేస్ క్యాంప్కు పంపించాం. తాజా సమాచారం ఆధారంగా ఎంబిలీని వెంటనే బేస్ క్యాంప్‌కు వెళ్లాల్సిందిగా ఆదేశించా. రెబొకేట్ నేతృత్వంలో ఓ బృందం మాత్రమే శిక్షణా క్షేత్రంలో ఉంది. అది స్థావరానికి రెండు గంటల దూరంలో ఉంది. ఇక ల్యాంబర్ట్ మనుషులు ఏంచేస్తారో వేచి చూడాలి. ఎంబిలీ ఇచ్చిన మరో నివేదిక ప్రకారం తన మనుషులతో ల్యాంబర్ట్ ఓ సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న మన పరిశీలకుడిచ్చిన సమాచారమిది. తమ దారికి అడ్డువచ్చిన శత్రు సైనికుల్ని తనతోపాటు 23 మంది తన అనుచర యోధులు ఎదుర్కొన్నట్టు చెప్ప కున్నారు. ఆ సమయంలో క్యాబిన్లతోపాటు అక్కడే ఉన్న 150 మంది ఏమీ చేయ లేకపోయారు. ఫలితంగా భారీ ఆయుధాల్ని కోల్పోయారు. మరో విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు. ఎవరికివారు పోరాటాన్ని విరమిస్తే, ఒక్కొక్కరికీ 500 ఫ్రాంకులతోపాటు (ఆ సమయంలో డాలర్ కన్నా ఫ్రాంక్ విలువ కాసింత ఎక్కువ) పని కల్పిస్తామని శత్రువు ఆశ చూపాడన్నది కథనం. దీనిపై మీ అభిప్రాయం చెప్పాలంటూ దళసభ్యుల్ని ఆయన అడిగారు. అందుకు మేం అంగీకరించమంటూ వారు బదులిచ్చారు. శత్రువు వేసే ఉచ్చుల్లో పడొద్దంటూ వారిని ఆయన హెచ్చరించారు. వార్తాహరుడి సమాచారం ప్రకారం దళసభ్యులు పోరాటం పట్ల అంకితభావంతో ఉన్నారని అర్థమవుతోంది.

వెనక్కి తిరిగి బేస్ క్యాంప్‌కెళ్లినందుకు ఆయన నాపై కూడా కొన్ని విమర్శలు చేశారు. తమ మనుషుల్నీ, ఆయుధాల్నీ వెనక్కి తేవాల్సిందిగా ఇంచార్జ్ అధికారిని ఆదేశించారు. ఇప్పుడవి వారికి అవసరమయ్యాయి. ఇది మాపై ప్రత్యక్ష దాడి లాంటిదే. పోరాటాన్ని కొనసాగించేందుకు

సిద్ధమవుతున్నట్టు చెప్పడం వెనుక అసలు ఉద్దేశం విరమించే ఆలోచనే.

అలాంటి మసెంగోతో మరోసారి చర్చించా. కసీమాపై దాడి గురించి మాట్లాడాం. ఈ పరిస్థితుల్లో అలాంటి నిర్ణయానికి ముందు మరింత పర్యవేక్షణ అవసరమని చెప్పా. దాడి ప్రతిపాదన పట్ల నాకు ఆసక్తి లేదు. అలాంటి ప్రయత్నం వల్ల జరిగే నష్టం, నైతిక స్థిర్యాన్ని మరింత దెబ్బతీస్తుందన్నదే నా అవగాహన. ముందుగా కొన్ని భారీ ఆయుధాల్ని పొజీషన్‌లో ఉంచాలి. ఎదురుదాడికి శత్రువుకు అవకాశం లేకుండా చేయాలి.

నవంబర్ 10న హాంకుమ్ ప్రత్యక్షమై ఓ నివేదిక ఇచ్చారు. గంజాకు వెళ్లిన ఆయనకు ఫ్రంట్ డీ ఫోర్స్ శత్రువు చేజిక్కిందంటూ కొందరు రువాండన్లు సమాచారమిచ్చారు. కొద్ది సేపటికే ముందండి దగ్గరి నుంచి క్యూబన్లు వచ్చారు. వారు ఓ దాడికి సిద్ధమవుతున్నట్టు తెలిపారు. రువాండన్లకు శత్రు దళాలు కనిపించాయ న్నారు. రైతుల సాయంతో మూడు బృందాలుగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు తెలిపారు. దళాల మధ్య భిన్నాభిప్రాయాలున్నందున దాడికి ముందండి నిర్ణయించ లేదు. భారీ ఆయుధాల్ని దాచిపెట్టి గంజాలో ఆశ్రయం పొందారు. మా కామ్రేడ్లను అక్కడ ఉండాల్సిందిగా కోరారు. అయితే నా ఆదేశాలు సరిగ్గా అర్థంకాని అంచలి బేస్ క్యాంప్‌కు తిరిగి వచ్చారు. రువాండన్లకు మన మద్దతు ఎంతో అవసరమని వారికి వివరించా. టామ్ కమాండ్ కింద మరోసారి పంపించా. మరుసటి రోజే మకుంగో క్యాంప్‌ను శత్రువు చేజిక్కించుకున్నట్టు తెలిసింది. దాంతో, ఆ సెక్టార్కు చెందిన కేలిగ్జిటే మా దగ్గరికొచ్చారు.

గంజా ప్రాంతాన్ని మా ఆధీనంలో ఉంచడానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. బేస్ క్యాంప్కు రక్షణ కల్పించడంతోపాటు అక్కడి పశువులతో మాకు అవసరముంది. సరస్సుతో సంబంధాలు దెబ్బతినడంతో ఆహారానికి కొరత ఏర్పడింది. కామ్రేడ్ నానే తెచ్చిన మూడు పశువులు మాత్రమే మా దగ్గరున్నాయి. ఆ రోడ్డు మూసుకు పోతే ఇక ఎలాంటి నిల్వలూ లేనట్టే. దాంతో, కామ్రేడ్ అజీ నేతృత్వంలో విమాన విధ్వంసక దళాన్ని అప్రమత్తం చేస్తున్నాం. వారి దగ్గర మూడు ఫిరంగులు, తగినన్ని ఫిరంగి గుళ్లు, రెండు 12.7 మెషిన్ గన్లు (ఒకదానికి స్టాండ్ లేదు) తోపాటు అవసరానికి మించిన ఇతర ఆయుధాలున్నాయి. ఇన్ని హంగులున్నందున శత్రువును తీవ్రంగా నష్టపరిచి

మనల్ని మనం కాపాడుకోగలమనే నమ్మకముంది.

కిసోసీతోపాటు దాని పక్కనున్న ప్రాంతాలన్నిటినీ పరిశీలించి రావాల్సిందిగా కామ్రేడ్ మోజాను పంపా. ఆయన ఇచ్చిన మొదటి నివేదిక ప్రకారం. తామున్న ప్రాంతంపై యుద్ధ విమానాలు కనిపించడంతో కాంగో కామ్రేడ్లు తనను ఒంటరిగా వదిలేసి పారిపోయారు. మూడు శత్రు పడవలు అక్కడ సంచరిస్తున్నాయి. అయితే అవి బెదురు పుట్టించడం తప్ప చేస్తుందేమీ లేదు.

సరఫరా కోసం ఏమీ లేనందునే రవాణా నౌకను సరస్సు దాటించలేదన్నది చాంగా కథనం. దాంతో, మా కోపం కట్టలు తెంచుకుంది. కిగోమా, దార్ పట్టణాలకు వరుస టెలీగ్రాంల ద్వారా ఆక్రోశం వెళ్లగక్కాం. అదే సమయంలో క్యూబాకు పంపిన ఓ టెలీగ్రాం ఇలా ఉంది... "సరస్సు మూసేందుకు శత్రు దళాలు తమ ప్రయత్నాల్ని ముమ్మరం చేశాయి. రోజురోజుకూ మాపై ఒత్తిడి పెరుగుతోంది.

ఒంటరితనం నుంచి బయటపడాలంటే కాంగో పోరాటానికి అదనపు నిధులు వెంటనే అందాలి. శత్రు దాడుల పరంపర కొనసాగుతోంది. మేం వేగంగా వెనక్కి రావాల్సిన పరిస్థితి. బేస్ క్యాంప్ రక్షణ కోసం సిద్ధమవుతున్నాం".

నవంబర్ 10న దార్‌తోపాటు కిగోమాకు పంపిన టెలీగ్రాం ఇలా ఉంది."శత్రు దాడుల వల్ల మేం వెనక్కి వెళ్లాల్సి వస్తే, మీతో మా సంబంధాలు తెగిపోతాయి. ప్రతిరోజూ మీరు 12-30కి ఓసారి, సాయంత్రం 5 గంటలకు మరోసారి కాల్ చేయడం మరచిపోకండి. తిరిగి సంబంధాలు నెలకొనేవరకూ"...

కిగోమా నుంచి మాకు ఓ సమాచారమందింది. తన పడవ సరిగ్గా నడవక పోవడంతో కబీలా ఇక్కడికి రావడం లేదని. బహుశా ఇది ఆయన 9న వస్తానంటూ రాలేకపోయినందుకు ఇచ్చిన వివరణ అయి ఉంటుంది. ఆ రోజు తప్పకుండా వస్తానంటూ మాట ఇచ్చారు. దీంతో, కబీలా నిలబెట్టుకోలేకపోయిన అనేక హామీల్లో ఇది కూడా చేరిపోయింది. అదే సమయంలో హవానాలో జరిగే మూడు దేశాల సమావేశానికి తనతో వెళ్లడానికి సిద్ధం కావాల్సిందిగా కివేకు కబురు పంపారు.

ఆ సమయంలో మా రక్షణ దళాల మోహరింపు ఇలా ఉంది. గంజా నుంచి సరస్సు వైపు వెళ్లే

రోడ్డుపై ఎంబిలీ నేతృత్వంలోని రువాండన్ల బృందాన్ని మోహ రించాం. బేస్ క్యాంప్ నుంచి వెళ్లే దారిలో అజీమా నేతృత్వంలోని కాంగోవాసుల్ని మోహరించాం. కసీమా నుంచి సరస్సు వైపు బాధ్యత మోజా చేపట్టారు. కబింబా నుంచి అలీ బాధ్యత.

కామ్రేడ్ ముందండి నుంచి ఈ కింది నివేదిక అందిన తర్వాత శత్రువును నిలువరించడం కోసం మా బలగాల్ని అలా మోహరించడమే హేతుబద్ధమని భావించాం.

కామ్రేడ్ టాటూ... విషమించిన పరిస్థితుల మధ్య రక్షణ కల్పించడం అసాధ్య మని చెప్పగలను. స్థానిక ప్రజలు ఇప్పటికే తమ పశువుల్ని శత్రు సైనికులకు అమ్మేశారు. వారితోనే కలిసి నడుస్తున్నారు. మన బలాబలాల పట్ల మనకన్నా శత్రువుకే ఎక్కువ అవగాహన ఉందనేది స్పష్టమైంది. దయచేసి నన్ను అర్థం చేసుకోండి. బలగాల ఉపసంహరణకే నేను నిర్ణయించా. క్యూబన్ కామ్రేడ్లను విడిచి వెళ్లాలన్న ఆలోచన లేదు. అయితే రువాండన్ల పట్ల నాకు బాధ్యత ఉంది. రువాండన్ కామ్రేడ్లంతా నాశనమైపోయే పని నేను చేయలేను. అలా చేస్తే.. నేనుమంచి విప్లవ కమాండర్‌ను అనిపించుకోలేను. పరిస్థితిని సరిగ్గా విశ్లేషించే శక్తి, యుద్ధంవల్ల జరిగే వినాశనాన్ని నిరోధించే అవగాహన ఓ విప్లవకారుడికి (మరీ ముఖ్యంగా ఓ మార్క్సిస్టుకు) ఉండాల్సిన మంచి లక్షణం. కామ్రేడ్లంతా నాశనమైతే అది నా తప్పిదమే అవుతుంది. ఈ విప్లవానికి సాయమందించేందుకు యత్నించా. మా సొంత దేశంలో మరో విప్లవానికి ఇది తోడ్పడుతుందని ఆశించా. ఒవేళ కాంగోవాసులు పోరాటాన్ని కొనసాగించలేకపోతే రువాండన్ల మాతృభూమి కోసం చావడానికే ప్రాధాన్యత ఇస్తా. అందుకోసం మా ప్రాణాలర్పించడమే ఎంతో సరైందరని భావిస్తున్నా..

విప్లవ శుభాకాంక్షలతో... ముందండి...

ఆ సమయంలో పోరాటాన్ని విరమించేందుకు ముందండి సిద్ధమవుతున్నారు. అది మాకు ఆందోళన కలిగించింది. ఏవైపు నుంచైతే (గంజా ప్రాంతం) శత్రువు దాడి చేయగల అవకాశముందో అక్కడే దళాల ఉపసంహరణ జరగడంవల్ల బలహీనమవుతాం. ఈ విషయం తెలియగానే మా దళాల్ని సమీకరించాం. నూతన పరిస్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాం.

**********

ఆయన మన శతాబ్దపు పరిపూర్ణ మానవుడు, తాను ఏం చెప్పాడో అలాగే జీవించిన వ్యక్తి, ఆయన కథ ప్రపంచ కథకు సమాంతరంగా నడిచింది.

రూపాల్ సార్త్ర్

నవంబర్ 12న మసెంగో నుంచి ఈ లెటర్ అందింది.

కామ్రేడ్ నిన్న మీతో ఫోన్‌లో మాట్లాడాక మోజా ప్రతిపాదనలో తప్పేమీ లేదనిపించింది. నా దృష్టిలో అది మంచి ఆలోచన (ఉత్తర దిక్కు నుంచి బేస్ క్యాంప్‌ను రక్షించడం). నా సొంత ప్రతిపాదనపై కూడా చర్చించండి. అందులో మొదటిది. విమాన విధ్వంసక నిపుణులు కొందరు నా దగ్గరికి రానున్నారు. వారి సంఖ్య తర్వాత తెలియజేస్తా రెండోది మా జనాలకు నమ్మకం కలిగించడం కోసం 50 FAL లు పంపించగలరు. రువాండసీలో నిరాయుధులుగా ఉన్న యోధుల కోసం 20 రైఫిళ్లు, కిబంబా పాఠశాలకు 10, కవూంబువే స్థావరానికి 20, బేస్ క్యాంప్ నుంచి మరో 20 రైఫిళ్లు తీసుకురాగలరు.

ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల నుంచి బయట పడాలంటే కసీమాపై దాడి జరపాలి. ఆ బాధ్యత నేను చేపట్టగలను. ప్రస్తుతం, క్యూబన్ కామ్రేడ్లు సరస్సులోని బేస్ క్యాంప్‌తోపాటు గంజా రక్షణకోసం ప్రాధాన్యత ఇస్తున్నారని భావిస్తున్నా మీరు నాతో ఏకీభవించగలరని ఆశిస్తున్నా..

ఈ లెటర్ పరిశీలిస్తే అనేక సందేహాలు వ్యక్తమవుతాయి. అందులో లెక్కల తప్పిదమొకటి. అడిగింది 50 రైఫిళ్ళయితే, తాను వాటిని 70 మందికి ఇస్తాననడం. మా దగ్గరున్న FAL నిల్వల పట్ల కాంగోవాసుల నమ్మకం అది. ఈ వైరుధ్యం గురించి మసెంగోకు చెప్పా. అప్పటికే కాంగో కామ్రేడ్లకు 15 రైఫిళ్లు పంపిణీ చేశాం. ఇక మా నిల్వల్లో మిగిలింది ఒకటో రెండో ఇంతకు ముందు మేమిచ్చిన ఆయుధాల్లో కొన్నింటిని తిరిగి రాబట్టలేకపోయాం. దళాల ఉపసంహరణ సంద ర్భాల్లో ఖరీ ఆయుధాల్ని మేం సురక్షితంగా దాచిపెట్టగా, మిగతావారు వాటిని అలాగే వదిలేశారు. మసెంగోకు మా మాటలపై నమ్మకం లేదు. ఆయన 50 లేదా 70 అంటూ మరోసారి పట్టుపట్టారు. దాడికి తనదే బాధ్యత అన్నారు. సరస్సు, గంజాల రక్షణపై మాకు సలహా కూడా ఇచ్చారు. నేను ఈ ప్రాంత ఆపరేషన్స్ బాధ్యత చేపట్టిన కొన్ని రోజులకు ఇది జరిగింది. ఫ్రంట్ రక్షణపై దృష్టి సారించా. మిగతా వారిపై నమ్మకం లేదు.

అవిధేయ అంశాలకు తోడు లెటర్లో మరో రెండు సమస్యలున్నాయి. అందులో ఒకటి; ఆ ప్రాంత రహదారులపై వ్యక్తుల్ని లక్ష్యంగా చేసే మందుపాతరల్ని అమర్చా లంటూ ఆదేశాలిచ్చారు. ఇది నా అభ్యర్థనకు విరుద్ధం. వాటివల్ల పర్యవేక్షణ కోసం వెళ్లే మన కామ్రేడ్లకు ప్రమాదమని,

సరైన సమన్వయం సాధించే వరకూ ఆ పని వాయిదా వేయాలని సూచించా. రెండోది: బేస్ క్యాంప్ పై దక్షిణ చివర నుంచి దాడి జరకుండా చూసేందుకు కిబంబాలో అలీ తన దళాన్ని మోహరిస్తారన్న ప్రతిపాద నకు మసెంగో అంగీకరించలేదు.

సాధారణ సిబ్బంది బాధ్యునితో (మసెంగో) మరోసారి మాట్లాడా. అయితే ఈసారి కూడా టాంజానియా ప్రభుత్వ విధానం గురించి చెప్పలేదు. సరస్సు రక్షణ కోసం మనకంటూ ఓ సొంత వ్యూహం ఉండాలంటూ వాదించా. నేను కేవలం సిద్ధాంతపరంగానే ఆపరేషన్స్ బాధ్యుణ్ణని చెప్పా. కసీమాపై దాడికి తానే బాధ్యత చేపడ్తానన్నందున మరోసారి చర్చించా (అందుకు ఇది తగిన సమయం కాదని చెప్పా కాంగో, క్యూబన్ కామ్రేడ్ల పర్యవేక్షణ ఏమాత్రం స్పష్టంగా లేనందున శత్రు బలాబలాలపై సరైన అంచనా వేయలేకపోయాం). నా బాధ్యతలు కేవలం ఓ సెక్టార్‌కే పరిమితం కావడానికి ఒప్పుకోలేదు. రక్షణ అనేది అందరితో కలిసి సమ న్వయంతో సాధించాల్సిన ప్రక్రియ. ఎక్కడ ఎక్కువ అపాయమనిపిస్తే అక్కడికి రిజర్వ్ దళాన్ని పంపించాల్సి ఉంటుంది. ఇంతకుముందే ఎన్నోసార్లు చెప్పినట్టు తాత్కాలిక యూనిట్లకు ఆయుధాల్ని ఇవ్వొద్దంటూ సూచించా. అలా చేస్తే ఇక అవి మన చేజారినట్టేనంటూ గుర్తు చేశా. పిజీతోపాటు మరికొన్ని చోట్ల పెద్ద దాడులు జరిపామంటూ ఇచ్చిన నివేదికలన్నీ అబద్ధాల పుట్టలే అంటూ దుయ్యబట్టా.

కసీమాపై మా వైఖరి పట్ల మసెంగో అసంతృప్తి చెందారు. అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో కాంగో దళాలు వెనక్కి వెళ్లాయి. వాస్తవానికి కిసోసీలో క్యూబన్లను రిజర్వ్‌లో ఉంచాలంటూ మోజాను ఆదేశించా. కానీ, ఆయన కాంగో వాసుల్ని కూడా వారితో చేర్చారు. ఫలితంగా ఓ ఫిరంగిని పాడు చేశారు. ప్రస్తుతం, కొన్ని భాగాలు ఊడిపోయి ఉన్న ఆ ఫిరంగిని ఓ క్యూబన్ ఆపరేట్ చేస్తున్నారు.

మసెంగోతో చర్చల సందర్భంగా ముందండి నుంచి వచ్చిన లెటర్ చూపించా. దానిపై ఆయన ఎంతో ఆవేశపడ్డారు. తానే స్వయంగా అక్కడికెళ్లి ఆయన్ని నిరాయుధుణ్ణి చేస్తానన్నారు. వెంటనే నేను ఎంబిలీకి లెటర్ రాశా, భారీ ఆయుధాల్ని పొజిషన్‌లో ఉంచాల్సిందిగా సూచించా. వారంతా తమ ఆయుధాల్ని అప్పగిస్తే, క్షేమంగా వెళ్లేందుకు అవకాశం కల్పిస్తానని తెలిపా..

ఉద్రిక్తత నెలకొన్న సమయంలో అనవసర రక్తపాతం తగదని భావించా. దీనిపై మసెంగోకు నచ్చజెప్పగలనన్న నమ్మకముందని చెప్పా. ఆ తర్వాత తానక్కడికి వెళ్లకుండా రాజకీయ ప్రతినిధిని పంపిస్తానంటూ మసెంగో హామీ ఇచ్చారు. చివరికి ముందండి దగ్గరికి ఎవరూ వెళ్లలేదు.

నాతో చర్చల సందర్భంగా కొన్ని రోజుల్లోనే కబీలా ఇక్కడికి వస్తున్నారంటూ నమ్మబలికారు. అందుకు నేను ధీటుగా బదులిచ్చా. పరిస్థితులు చివరి దశకు చేరుకోవడంతో కబీలా ఇక ఇక్కడికి వచ్చే అవకాశం లేదని చెప్పా ఇలాంటి పరిస్థితుల్లో రావడానికి ఆయన ఇష్టపడరని వాదించా. మా పక్కనే ఇతర కామ్రేడ్లుండటంతో సున్నితమైన ఈ అంశంపై వివరంగా మాట్లాడేందుకు కుదరలేదు. అయితే కమాండర్ ఇన్ చీఫ్ ఇక్కడికి రానే రారంటూ తేల్చి చెప్పా.

విప్లవ వ్యతిరేక కార్యక్రమాలు పిజీలో కొనసాగుతున్నాయి. శాంతి వాతా వరణంలో ఎన్నికల సందర్భాల్లో మాత్రమే మనం ఇలాంటివి చూశాం. నాకందిన ఓ సందేశంలో... 15న జరిగే సమావేశానికి హాజరవుతున్నారా లేదా తెలపగలరని ఉంది. దీనిపై స్పందిస్తూ, సమావేశాల పేరుతో సమయం వృథా చేయడం తగదని చెప్పా బేస్ క్యాంప్ రక్షణపై దృష్టి కేంద్రీకరించినందున హాజరు కావడం సాధ్యం కాదని తెలిపా. జరుగుతున్న సంఘటనల్ని విప్లవ వ్యతిరేక చర్యలుగా భావిస్తానని, మా ప్రభుత్వం నన్నిక్కడికి పంపింది ఇలాంటి కార్యకలాపాల కోసం కాదని స్పష్టం చేశా. పరిస్థితులు విషమించాయని చెప్పేందుకు మరో లెటర్ ఓ ఉదాహరణగా నిలుస్తుంది. హంతకుడిగా ఆరోపణలున్న మసెంగో, పిజీలో ఉండగా, ఆయన రక్షణకు హామీ ఇచ్చామన్నారు. ఈ మాటల అర్థం. ఓ కమాండర్ జీవితానికి సాధారణ సైనికులు హామీ ఇవ్వడంలాంటిది.

ప్రజా ఆరోగ్యమంత్రి కామ్రేడ్ ముచ్చుంగో పంపిన ఉత్తరాల్లోనూ వాస్తవ పరిస్థితుల్ని విస్మరించారు. నా వ్యవహార శైలిపై తన అక్కసునంతా ఆ లెటర్‌లో వెళ్లగక్కారు. భారీ ఆయుధాల్ని తొలగించడం పట్ల ల్యాంబర్ట్ మమ్మల్ని తప్పు పట్టినట్టు చెప్పారు. తాము కొన్ని దాడులకు సిద్ధమవుతున్నందున వాటిని తిరిగి ఇవ్వాల్సిందిగా కోరారు. మరో ఉత్తరంలో ఆ ప్రాంతంలోని జంగో అనే గ్రామంలో జరిగిన రైతుల సమావేశం గురించి వివరించారు. నాకైతే దానికి ఆహ్వానం అందలేదు. ఒకవేళ అందినా ఆ పరిస్థితుల్లో అలాంటి సమావేశాలకు హాజరయ్యేందుకు

నాకది తగిన సమయం కాదు. అసందర్భమైన ఇలాంటి ప్రతిపాదనలనేకం నా ముందుకొచ్చాయి. ముచ్చుంగో పంపిన మరో లెటర్ చూస్తే, పరిస్థితులపట్ల వారి అవగాహనారాహిత్యం ఇట్టే అర్థమవుతుంది.

"మన మిత్రులకు అభ్యర్థన. స్నేహిత దేశాల కేంద్ర స్థానం నుంచి 12 వేల మంది కార్యకర్తల్ని నా దగ్గరికి పంపించనున్నారు. అవన్నీ విప్లవ దేశాలు. విదేశీయుల సహకారంతోనే షోంబే మనతో యుద్ధం చేస్తున్నారన్న విషయం గుర్తించగలరు"

ఆ సమయంలో మిత్ర దేశాల సంఖ్య రెండు లేదా మూడు. అంటే వారంతా కలిసి 24 లేదా 36 వేల మందిని పంపిస్తారని అర్థం. ఇదంతా చూస్తే చిన్న పిల్లల బొమ్మలాటలా అనిపిస్తుంది. ఆ సందర్భంలో రైతులతో సమావేశం నిర్వహించడ మంటేనే నిరాశావహ పరిస్థితులకు అద్దం పట్టడం. ఇదే విషయాన్ని అత్యున్నత విప్లవ కమిటీ ప్రతినిధిగా ఉన్న ముచ్చుంగోకు వివరించా. పిజీ కామ్రేడ్లు తిరోగ మిస్తున్న దశలో ఇలాంటి ప్రతిపాదన పిల్ల చేష్టల్ని గుర్తు చేస్తుందంటూ దెప్పిపొడిచా. అందుకు ఆయన బదులిస్తూ, కిబంబా రక్షణ కోసం పిజీ నుంచి 300 మంది యోధులు బయలుదేరినట్టు చెప్పుకొచ్చారు. ఇలాంటి అసందర్భ ప్రేలాపనల వల్ల వారితో చర్చలు చేయడం వ్యర్థమనిపించింది. ఆపై వ్యక్తిగత విషయాల్ని ప్రస్తా వించారు. తన భార్యతోపాటు ఆరుగురు పిల్లల్ని అక్కడి నుంచి ఖాళీ చేయించేందుకు మసెంగో అడ్డుపడ్డారంటూ ఆరోపించారు. అది తనకు ఇబ్బందికర పరిస్థితి అంటూ చెప్పుకొచ్చారు. దీనిపై మసెంగోను వివరణ అడిగా. మొదటి అవకాశంలోనే పోరాట యోధుల భార్యలతోపాటు వారి పిల్లల్ని కిగోమాకు పంపిస్తామని మసెంగో తెలిపారు.

14 తెల్లవారుజామున చాంగా సరస్సు దాటారు. ఈసారి మాత్రం ఎలాంటి సంఘటనా జరగలేదు. నాకోసం సరిపడా నిత్యావసరాలతోపాటు ఓ సందేశం తెచ్చారు. టాంజానియా ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పూ లేదన్న రఫెల్ సందేశమది. మా నుంచి ప్రతిస్పందన కోసం వారు ఎదురు చూస్తున్నట్టు ఆయన తెలిపారు. పరిస్థితుల్ని అనుకూలంగా మార్చడం కోసం వారి నుంచి ఎలాంటి ప్రయత్నాల్ని ఆశించలేమని సూచించారు.

టాంజానియా ప్రభుత్వ నిర్ణయం గురించి తెలియని మసెంగో అదే రోజు ఓ టెలీగ్రాం పంపారు. సాధారణ పరిస్థితుల పట్ల ఆయన అవగాహనను అది వ్యక్తీకరించింది.

కబీలా... "మిలటరీ పరిస్థితి విషమించింది. ముందండి ఫ్రంట్‌లోకి శత్రుదళాలు చొరబడ్డాయి. గంజా మీదుగా బేస్ క్యాంప్ వైపు ముందుకు కదులుతున్నాయి. ముందండి, కేలిగ్బిటే, ఎంబిలీ దళాలు గంజాలో మోహరించాయి. బేస్ దిశగా ఉన్న అనేక రహదారుల్లో శత్రుదళాల కదలికలున్నాయి. బియ్యం, బీన్స్, ఉప్పు వెంటనే పంపించగలరు. త్వరితగతిన ఆయుధాల్ని తరలిస్తున్నాం. పాయింట్ 30, మౌసర్ తుపాకులు, ఫిరంగులు, విమాన విధ్వంసకాలు, రాకెట్ లాంచర్లు, మందుపాత్రలు. ముకుందీ ప్రాంతంలో శత్రువును చుట్టుముట్టేందుకు అన్ని విధాలా సిద్ధమవు తున్నాం. సరఫరాలు త్వరగా అందకపోవడం వల్ల మన దళాలు నీరసించిపోతు న్నాయి. టాంజానియా అధికారులు తమ శక్తినంతా ఉపయోగించాలని కోరు తున్నాం. ఆఫ్రికా దేశాల నిర్లక్ష్యం వల్లే కాంగో విప్లవం ఒత్తిడికి గురవుతుందని భావిస్తున్నాం. చివరి అభ్యర్థనను మన్నించండి. ఆకలి చావులను నిరోధించడం కోసం ఆర్థిక సాయమందించండి".

...మసెంగో...

ముకుందీ ప్రాంతంలో శత్రువుపై దాడికి సిద్ధంగా ఉన్నామన్న టెలీగ్రాం ఆశల్ని రేకిత్తించేలా ఉంది. సమాచార లోపం వల్ల వాస్తవ పరిస్థితులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మేం పంపిన కొన్ని టెలీగ్రాంల ప్రకారం పరిస్థితులు భీతి గొలిపేలా ఉన్నాయి. కామ్రేడ్లకు కొంత ఆందోళన కలిగించి ఉంటాయి. కిగోమాలో ఉన్న మా బాధ్యుడు దార్ ఏ సలామ్ వెళ్తానంటున్న కబీలాకు నా అనుమతి కోరారు. అందుకు నా సమాధానమిలా ఉంది.

"ఈరోజు పడవలు తప్పనిసరిగా రానున్నాయి. మేం ఆకలితో అలమటిస్తూ, చుట్టుముట్టబడి ఉన్నాం. కబీలా వెళ్లొచ్చు".

చాంగో తెచ్చిన సైనిక సామగ్రితోపాటు 40 మంది కాంగోవాసులున్నారు. వారంతా సోవియట్లో చదువుతున్న విద్యార్థులు. 15 రోజులపాటు సెలవులు కావాలన్నారు.

అక్కడ తమ సూట్‌కేసులకు కూడా స్థలం దొరకలేదన్నారు. తమకు ఆయుధాలు ఇవ్వలేదన్నారు. అది విషాద సమయం కాకపోయివుంటే ఆ పిల్లల్ని చూసి నవ్వుకోక తప్పదు. అలాంటి వారిపై నమ్మకముంచి విప్లవోద్యమాన్ని నడపాల్సి రావడమే విడూరం.

వీరందరినీ మసెంగో నా ఆదేశాల కింద ఉంచారు. నాకున్న ఓ సౌకర్యమల్లా. మీరేం చేయాలో స్పష్టంగా తెలుసుకునేందుకు "నిబంధనల పుస్తకం చదువుకోండని" చెప్పడం. వారితో నేరుగా ఫ్రెంచ్‌లో మాట్లాడే అవకాశం కూడా ఉంది. అయితే వారిలో విప్లవ స్ఫూర్తి ఏమాత్రం లేదు. వీరి మంచిచెడ్డలు చూసేందుకు అధికారుల్ని అప్పర్ బేస్‌కి పిలిపించా. కాల్పులు జరపడంలో పరీక్షించాకే ఫ్రంట్ కు పంపాలని ఆదేశించా. లేనిపక్షంలో వారిని తిప్పి పంపాలని చెప్పా కాలం వృథా చేయడం నాకిష్టం లేదు. (వృథా చేసేందుకు అవకాశం కూడా లేదు). వారిలో ఒకరు ఎంతో వివేచనతో మాట్లాడారు. నా షరతులకు ఒప్పుకున్నారు. కొద్ది రోజుల్లోనే బేస్ క్యాంప్‌కెళ్లి రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. పారిపోయిన సందర్భాల్లో కొందరు వదిలివెళ్లిన ఆయుధాలున్నాయి. వాటిని తాము చేపడ్తామన్నారు.

ఎంబిలీ నుంచి తాజా సమాచారమందింది. మన స్కౌట్ సభ్యులకు జుంగో రోడ్డు సమీపంలో శత్రుదళాలు కనిపించాయన్నారు. రోడ్డుపైకి చేరుకునే దారిలో మందుపాతరల్ని అమర్చేందుకు కొందరిని పంపానన్నారు. అయితే ఆ మందుపాతర లిపుడు మన కామ్రేడ్లకే అపాయంగా మారాయి. రోడ్డుకు ఓ వైపున మందుపాతరల్ని అమర్చగా, మరోవైపున అదే దారిలో నేను కొందరు స్కౌట్ సభ్యుల్ని పంపించా. అదృష్టవశాత్తూ మన సభ్యులు ఆ దారిపై నడవలేదు. కాళ్లు వాటిపై పడగానే వేటికవే పేలిపోయే పాతరలవి. వాటిని ఆపరేట్ చేసేందుకు పైలట్ ఎవరూ అక్కడ లేరు. గంజా-కరియంగా ప్రాంతం నుంచి సరస్సుకు వెళ్లేందుకు నాలుగు వేర్వేరు దారు లున్నాయి. శత్రుదళాలు ఏ దారిలో వస్తాయో మనకు తెలియదు. ఓవేళ వారు అన్ని దారుల్లో వస్తే.. ఆ ప్రాంతం పట్ల మనకన్నా వారికే ఎక్కువ అవగాహన ఉంది. వారికి దారి చూపేందుకు రైతుల నుంచే మంచి గైడ్లున్నారు. ఆహారాన్ని కూడా వారే చేరవేస్తున్నారు. గెరిల్లా యుద్ధాన్ని ఎదుర్కోవడంలో ఈసారి శత్రు సైనికులు కొన్ని పాఠాలు నేర్చుకున్నారు. రైతుల పట్ల వారి వైఖరిలో గొప్ప మార్పు కనిపించింది.

గతంలో మనంచేసిన తప్పిదాల వల్లే వారికిపుడు మన పట్ల విధేయత లోపించింది.

బృందాలన్నిటినీ మా చుటూ చేర్చిన మసెంగో ఆపై ఓ ప్రతిపాదన చేశారు. శత్రు విధ్వంసం కోసం ఏడు ఆత్మాహుతి దాడులు జరపాలన్నారు. ఆల్బర్ట్ విల్లే - కిగోమాల మధ్య సరఫరాల కోసం తిరిగే ఓడపై ఈ దాడి జరగాలన్నారు. కాన్వాయ్ లేకుండా తిరిగే ఆ ఓడను ముంచడం తేలికైన పనే అయినందున అది ఎప్పుడైనా వీలవుతుందనీ, అయితే అలాంటి పని ఈ సందర్భంలో తగదని చెప్పా. టాంజా నియాతో మన సంబంధాలు సానుకూలంగా లేని ఈ సందర్భంలో మనపై మరిన్ని ఆంక్షలకు ఆ సంఘటన ఓ సావుగా ఉపయోగపడుతందంటూ గుర్తు చేశా. దీనికి బదులుగా మరో చర్యను ప్రతిపాదించా. శత్రుదళాలపై నేరుగా దాడులు జరిపి, ఆయుధాల్ని స్వాధీనం చేసుకునేందుకు కొందరు క్యాబన్లను పంపించాలని చెప్పా. తామూ అదే ఆలోచిస్తున్నామన్నారు. కానీ, ఆ తర్వాత ఆ ప్రస్తావనే లేదు.

సరస్సు దాటేందుకు చాంగాకు ఇబ్బందులెదురయ్యాయి. ప్రతికూల పరిస్థితుల మధ్య మహిళలూ, పిల్లల్నీ అక్కడి నుంచి పంపించాల్సి వచ్చింది. కొంతమంది యువకులు సైతం వారితో కలిసి వెళ్తున్నారు. రోజుకు రెండు మూడు ట్రిప్పులు వెళ్లాల్సి వస్తోంది. ఓడ రక్షణ కోసం కాపలాగా దళాన్ని పంపించక తప్పలేదు. ఇదంతా దళాలకు విసుగు తెప్పించింది. కబీలా నుంచి ఓ సందేశమొచ్చింది.

మసెంగో.. మీ సందేశాన్ని టాంజానియన్లకు పంపిస్తున్నా ఈరోజు టబోరా వెళ్తున్నా ఆయుధాలతో సైనిక సామగ్రితో తిరిగి వస్తా మిగిలివున్న కాంగోవాసుల డబ్బులన్నీ పంపిస్తున్నా అధికారులూ-సామ్రాజ్యవాదుల కుట్ర ఫలితమే మన పోరాటంపై కొనసాగుతున్న అణచివేత. ఇక నా దగ్గర డబ్బులేమీలేవు.

..కబీలా

ఇక్కడ టబోరా వెళ్తున్నట్టు కబీలా చెప్పకున్నారు. మాకు మాత్రం దార్ వెళ్తున్నట్టు చెప్పారు. ఇంతకాయన ఎక్కడికి వెళ్లినట్టు. అధికారులతో మాట్లాడేందుకు వెళ్లారు. విపత్తు సమయంలో ఆయన ఉన్నది కిగోమాలో కాదు, దార్లో... నవంబర్ 16న అజీమా నుంచి కామ్రేడ్ సికీకి ఓ లెటర్

అందింది.

కామ్రేడ్ సికీ.. నా దగ్గర 16 మంది కాంగోవాసులతోపాటు 9 మంది క్యూబన్లు మాత్రమే ఉన్నారు. ఉపసంహరణ చాలా కష్టంగా ఉంది. మేమంతా బహిరంగ ప్రదేశాల్లోనే ఉన్నాం. వైమానిక దాడుల నుంచి తప్పించుకొని పారిపోయేందుకు మార్గమే లేదు. మమ్మల్ని వదిలి వెళ్లేందుకు కాంగోవాసులు సిద్ధపడ్డారు. తుపాకు లతో బెదిరించి వారిని వెళ్లకుండా అడ్డుకున్నాం. శత్రు సైనికులు త్వరలోనే మమ్మల్ని సమీపించనున్నారు. పరిస్థితి ఎంతో సంక్లిష్టంగా ఉంది. ధైర్యం కోల్పోయాను. పోరాడేందుకు ఇష్టంలేని వారిపై ఒత్తిడి చేస్తున్నాం. న్యాయమని నాకనిపించడం లేదు. అయితే నేను గొప్ప జ్ఞానవంతుడిని కాదు. అయినా, ఇది నాకు ఎంతో చెడుగా అనిపిస్తోంది. మాంసానికి సంక్షోభం ఏర్పడింది. తినడానికి వారికి ఏమీ ఇవ్వలేని పరిస్థితి. వీటికి తోడు ప్రతిరోజూ కుండపోతగా వర్షం కురుస్తోంది. షెల్టర్ తీసుకునేందుకు ఎక్కడా అవకాశం లేదు. అక్షర దోషాలుంటే క్షమించగలరు...

.. అజీమా...

ఈ లెటర్ ఎంతో ఆందోళన కలిగించింది. అక్కడికి వెళ్లి పరిస్థితి సమీక్షించా ల్సిందిగా సికీని ఆదేశించా. ఆకస్మిక దాడితో అజీమా కంగారుపడ్డారని సికీ తెలిపారు. అజీమా ఆందోళనతో ఉన్నందున కిస్వాను అక్కడికి పంపా. బాధ్యతలు తీసుకోమని చెప్పా. అలీ బృందంలో ఆయన రెండో కమాండర్. అలీతోపాటు వారి బృందమంతా కిబంబా నుంచి మా దగ్గరికొచ్చారు.

అలీ వచ్చిన సమయంలోనే ట్రెమెండో వచ్చారు. వారిద్దరూ కలిసే ప్రయాణం సాగించారు. అంతకుముందు కబింబా గురించి ట్రెమెండో లెటర్ రాశారు. అలీ వ్యవహార శైలి వల్లే అక్కడ ఉద్రిక్తతలు తలెత్తాయన్నారు. అందుకు అనేక ఉదా హరణల్ని ఆయన వివరించారు. వారి మధ్య ఐక్యత కోసం తాను చేయగలిగినంతా చేశానన్నారు. మిగతా క్యూబన్లందరితోనూ వారు స్నేహంగానే ఉన్నట్టు తెలిపారు. అయితే, అలీకీ-కాంగోవాసుల మేజర్‌కూ మధ్య చూపులు కూడా కరువయ్యా యున్నారు. ఈ విషయాల్ని మరోసారి నాకు నేరుగా వివరిస్తూ, మరికొన్ని సంఘ టనల్ని ఉదహరించారు. దీనిపై అలీ తీవ్రంగా స్పందించారు. ట్రెమెండోను తప్పు పడూ ఓ సరదా సంఘటన

ఉదహరించారు. తన సలహాకు విరుద్ధంగా పగటిపూట సరస్సులో ప్రయాణం సాగిస్తుండగా, శత్రు యుద్ధ విమానమొకటి ఆ వైపుగా వచ్చింది. దాంతో, ట్రిమెండో ఒక్కసారిగా నీళ్లలోకి దూకారు. ఆ కుదుపుకు పడవ పక్కకు ఒరిగిపోయింది. అలీ నీళ్లల్లోకి పడిపోయారు. తనకు ఈత రాకపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్నారు. మునిగిపోతానని భయపడ్డారు. ఈ విషయం చెబుతూ ట్రిమెండోపై కోపంతో ఊగిపోయారు. మాటలు తడబడ్డాయి. నత్తినత్తిగా మాట్లాడు తున్న ఆయన్ని చూసి నవ్వుకున్నాం.

జుంగో జంక్షన్ నుంచి ఎంబిలీ పంపిన తాజా నివేదికలందాయి. అక్కడ శత్రువు ముందుకు కదులుతున్నాడు. కాంగోవాసులుగానీ, రువాండన్లుగానీ పొజిషన్‌లో లేకుండా పోయారు. రెండు రక్షణ దళాల్లో 8 మంది చొప్పున క్యూబన్లున్నారు. కమాండర్లు కేలిగ్ఖేటే, హంస్సేనీలు పర్యవేక్షిస్తున్నారు. క్యూబన్లపైనే ఎంబిలీ నమ్మక మంతా. అయితే, వారు చివరిదాకా పొజిషన్‌లో ఉంటారా, లేదా అన్నది అనుమానమే. శత్రు సైనికుల సంఖ్య 400 వరకూ ఉంటుందని ఆయన అంచనా. మన దళాల్లోకి కొత్తగా చేరేవారి కోసం ఎదురు చూస్తున్నారు.

నవంబర్ 16న పరిస్థితి అలా ఉంది. దీనిపై మేం కొన్ని టెలిగ్రాంలు పంపాం. వాటిలో నేను పంపిన ఓ టెలిగ్రాం ఇలా ఉంది. "రఫేల్. అత్యవసరంగా మాకు కావాల్సినవి: SKS బుల్లెట్లు, 75 ఎంఎం చైనా రాకెట్ లాంచర్ గుళ్లు, అవకాశముంటే 200 రైఫిళ్లు, ఇతర సైనిక సామగ్రి, మొదటివి ఎంతో ముఖ్యం. కిగోమాకు దారులన్నీ మూసేస్తున్నారు. చాంగా ఇక్కడి నుంచి వెళ్లడం లేదు. అక్కడ శత్రు ఓడలు పొంచి ఉన్నాయి. చర్యలు వేగంగా జరగాల్సి ఉంది.

మసెంగో పంపిన టెలిగ్రాం ఇలా ఉంది. "శత్రువుపై దాడి అసాధ్యం. శత్రువును దిగ్బంధించడం అసాధ్యం. పరిస్థితి తీవ్రంగా ఉంది. నిత్యావసరాలు, ఆయుధాల సమాచారం వెంటనే ఇవ్వగలరు"... మసెంగో...

అన్ని వైపులా పరిస్థితి ఇబ్బందిగా తయారవుతోంది. ఎక్కడా అనుకూల సంకేతాలు కానరాలేదు. శత్రుదళాలు ఎంత శక్తితో ఉన్నాయన్నదే మాకు తెలియాల్సి ఉంది. ఏ లక్ష్యంతో వారు ముందుకు వస్తున్నారో తెలుసుకోవాల్సి ఉంది.

**********

మరో పర్యవేక్షణ అనంతరం సికీ తన నివేదిక అందించారు. రక్షణ ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపసంహరణ క్రమంలో అవసరమైన చోట పోరాటం సాధ్యమే అన్నారు. అయితే, స్థైర్యం దెబ్బతిన్న సమయంలో స్థిరంగా ఉంటూ రక్షణ చర్యలు చేపట్టడం సాధ్యం కాదన్నారు. కాంగోవాసుల్ని నమ్మలేమన్నారు. రువాండన్ల ప్రతిస్పందన ఎంతో బాగుందని, వారు ఎంటిబీకి మద్దతునిచ్చినట్టు తెలిపారు. అన్నివిధాలుగా విధేయులుగా ఉండేందుకు హామీ ఇచ్చారు. ఆ ప్రాంత రక్షణ బాధ్యతల్ని తిరిగి చేపడ్తానంటూ అజీమా కబురు పంపారు. అయితే, అక్కడ ఆయన్ని తిరిగి నియమించాల్సిన అవసరం లేదు.

తెల్లవారుజామునే సికీ వెళ్లిపోయారు. ఆయన తన పూర్తి నివేదిక ఇంకా ఇవ్వలేదు. ప్రయాణ బడలిక వల్ల విశ్రాంతి తీసుకున్నారు. ఓ వార్తాహరుని ద్వారా ఎంటిబీ పంపిన లెటర్ అందింది. మొదటిభాగం ఉదయం 9 గంటల సమయంలో రాసింది.

టాటూ... ఇక్కడ మిగిలి ఉన్న కాంగోవాసులు కందకాలు తవ్వేందుకు నిరాక రించారు. వారి నాయకుడొకడు శత్రుదళాలపై దాడికి వెళ్లాలన్న ఆలోచనలో ఉన్నాడు. కందకాలు తవ్వడం కన్నా అదే సరైందన్నాడు. కందకాలు తవ్వడమే సరైందని చెప్పే బాధ్యత చార్లెస్‌కు అప్పజెప్పాం. చార్లెస్‌కూ-అతనికీ మధ్య మాటా మాటా పెరిగింది. ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. కాంగో నేత రైఫిల్‌తో చార్లెస్‌ను కాల్చబోయాడు. దాంతో, ఆయుధాల్ని అతనికి దూరంగా లాక్కెళ్లాం. చార్లెస్‌ను క్యూబన్ల మనిషంటూ దుయ్యబట్టాడు. క్యూబన్లు చెడ్డవారని, చార్లెస్ మరింత చెడ్డవాడంటూ తూలనాడాడు. శత్రు సైనికులొస్తే తాము పారిపోతామని, వెళ్లేటపుడు మాపై కాల్పులు జరుపుతామంటూ నోరుజారాడు. ఇక్కడ ఉన్న వారి అధికారుల్లో ఒకడు క్యూబన్లు చాలా చెడ్డవారంటూ ప్రచారం సాగించడమే అందుకు కారణమనిపిస్తోంది. (కటెంగాపై దాడి సమయంలో తమ మనుషులకు ఇలాంటి వాదనలు వినిపించింది ఈ అధికారే). అదే ప్రచారాన్ని అతను ఇంకా కొనసాగిస్తు న్నాడు. కాంగోవాసుల శత్రుభావం బహిరంగంగా వ్యక్తమవుతోందిపుడు. అందుకే వారు ఏ పనికీ ఆసక్తి చూపడం లేదు"...

ముఖ్యమైన సమాచారం 11-15 ఉదయం...

టాటూ... రువాండన్లంతా వెళ్లిపోయారు. ఈ విషయం నాకు పది గంటలకు తెలిసింది. పరిశీలన కోసం అకీకాను పంపించా. వారు వెళ్లిపోయింది నిజమేనని ఆయన తేల్చి చెప్పారు. నిన్ననే మేం ఓ ప్రణాళిక అనుకున్నాం. ఈరోజు నాకు ఓ మాట కూడా చెప్పకుండా వారు వెళ్లిపోయారు. వారు తమ మాతృ దేశానికి వెళ్తున్నారని భావిస్తున్నా ఇదే విషయం వారి నుంచి పదేపదే వినిపించేది. ఈ వార్త మాకు అందినపుడు ముందండి అనుచరుడు మా దగ్గరే ఉన్నారు. ఈ విషయం చెప్పగానే అవాక్కయ్యారు. దూరంగా వెళ్లిపోయారు. మళ్లీ తిరిగి రాలేదు. ఏమీ చెప్పకుండానే వారు ఆయుధాలతో సహా వెళ్లిపోయారు. అదనంగా పదిమందితో పాటు ఓ మెషిన్ గన్ ఇస్తామంటూ నిన్ననే నాకు హామీ ఇచ్చారు. ఇప్పటికే వెళ్లిపోయిన కాంగోవాసుల్లో ఎవరూ తిరిగి రాలేదు. కేలిస్టే దగ్గర ఏం జరుగు తుందో తెలుసుకునేందుకు ఓ వ్యక్తిని పంపించా. అయితే, ఆయన ఎవరికీ కనిపించలేదు. ఆయన ఎక్కడ ఉన్నదీ ఎవరూ చెప్పలేకపోయారు.

ఏదో మోసం జరిగిందని భావించా. కొంత దూరం వెనక్కి వెళ్లాలని ప్రతిపాదించా. రెండు బృందాలుగా విడిపోయి పొజిషన్లు మార్చుకోవాలని చెప్పా రోడ్డుపై మందుపాత్రల్ని అమర్చాలని సూచించా. వెంటనే మాకు కార్యకర్తల అవసరముంది. మోసం జరిగిందన్న అనుమానంతోనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవా లనుకున్నా మీ నుంచి ప్రత్యుత్తరం తెచ్చే కాద్రేడ్ను వేరే దారిలో రావాల్సిందిగా చెప్పగలరు...

...ప్యాట్రియా ఓ మ్యూర్టే..

నోట్: ఈ విషయం కాంగోవాసులకు తెలియడంతో వారంతా వెళ్లిపోయారు.

కొన్ని గంటల్లోనే ఎంటిలీ ఆక్రమణలో ఉన్న ప్రాంతంపై యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. అయితే, అప్పటికే ఎంటిలీ దళాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. వెంటనే జరిగిన ఈ సంఘటన మోసం జరిగిందనేందుకు ఓ ఉదాహరణ. కొత్తవారిని చేర్చుకోవడం ప్రారంభించాం. పారిపోయి వచ్చి బేస్ క్యాంప్‌లో ఉంటున్న కొందరి నుంచి ఆయుధాలు లాక్కొని కొత్త వారికిచ్చాం. ఇది గొప్ప మార్పని చెప్పలేనుగానీ, మేం చేయగలిగినంతా చేస్తున్నామని చెప్పగలను.

ప్రతి బృందంలోనూ 8 మంది క్యూబన్లతోపాటు పదిమంది కాంగో వాసులుండేలా చూస్తున్నాం.

కొత్తగా చేరిన విద్యార్థులు సోవియట్‌లో విద్యాభ్యాసం చేసి వచ్చారు. ఫ్రంట్లో పని ప్రారంభిస్తామన్నారు. కొద్దిసంఖ్యలో కాకుండా తామంతా ఒకేసారి వెళ్తా మన్నారు. తిట్లు, హెచ్చరికల అనంతరం (పోరాటంలో పాల్గొనండి లేదా ఇక్కడి నుంచి వెళ్లిపోండి) బేస్ క్యాంప్లో ఆశ్రయం పొందుతున్న వారిలో కొందరు ఫ్రంట్‌లో పనికి సిద్ధమయ్యారు.

సాయంత్రం వేల ఓ కామ్రేడ్‌తో కలిసి ట్రెమెండోపుంటో వచ్చారు. ఆ కామ్రేడ్ పేరు గుర్తుకు లేదు. చూడటానికి అతను తెలివైన వాడిలా, ఎంతోకొంత సంకల్పం ఉన్నవాడిలా అనిపించాడు. అయితే, అతనికి ఎలాంటి అనుభవమూ లేదు. మేంచాలా విషయాలు మాట్లాడుకున్నాం. నా వాదనలోని ముఖ్యాంశం మాత్రం. ఉద్యమం పూర్తిగా కుప్పకూలే దశకు చేరుకుందని. దళాల్ని ఉపసంహరిస్తూ, అందుకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడం లేదా మన శక్తికి లోబడి రక్షణ చర్యలు చేపడూ, అక్కడే నిలిచి పోరాడటం. అయితే, మనం చేయకూడనిదల్లో.. ఎలాంటి పోరాటం లేకుండానే శత్రువుకు మన ప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చే అవకాశం కల్పించడం. అలాంటి ఎత్తుగడ (లేదా సరైన ఎత్తుగడ లేకపోవడం) ఎక్కువమందిని పోరాటం విడిచి వెళ్లేలా చేస్తుంది. అలాంటిది మనం అన్నీ కోల్పోయేందుకు, మిగిలివున్న వారిని నిర్మాణ రాహిత్యంలోకి నెట్టేందుకు కారణ మవుతుంది. ఆ సమయంలో మాట్లాడ్లానంటూ నా అనుమతి తీసుకున్నారు ట్రెమెండో పంటో, ఉన్న రెండు అవకాశాల్లో తాను స్థిరంగా నిలిచి పోరాడేందుకు మద్దతు ఇస్తానన్నారు. అపుడు నా పక్కనున్న క్యూబన్లు అవకాశం దొరికితే ఆయన్ని అమాంతం చంపేయడమో లేదా సజీవంగా తినేయడమో చేస్తారా అన్నంత కోపంతో చూశారు. ఇదంతా నాకు చాలా గజిబిజిగా అనిపించింది. చుటూ నెల కొన్న పరిస్థితులైతే స్థిరంగా నిలిచి పోరాడమనే చెబుతున్నాయి. కానీ, ఎవరితో కలిసి పోరాడాలి? కాంగోవాసులు, రువాండన్లు అప్పటికే వెళ్లిపోయారు. అక్కడ స్థానికులెవరూ లేని స్థితిలో కందకాల్లో చావడానికి మీరు సిద్ధమేనా అంటూ క్యూబన్లను విలా ప్రశ్నించగలను? ఇక్కడ మరో ముఖ్యమైన విషయమొకటి గుర్తుంచుకోవాలి. వారు అలాగే పోరాడితే సాధించగల ఫలితం ఏమిటి? స్థిరంగా నిలిచి పోరాడటం సిద్ధాంతరీత్యా ప్రత్యామ్నాయమే అయినా ఆచరణరీత్యా చేయా ల్సింది

మాత్రం అక్కడికిక వదిలివేయడమే.

వాతావరణం చెడిపోయింది. అదే రాత్రి మసెంగోతో మాట్లాడేందుకు త్రిమెండో వెళ్లారు. మరుసటి రోజు నేనూ అక్కడికే వెళ్లా. చర్చల్లో పాల్గొన్నవారు; త్రిమెండో, కెన్యా నుంచి కామ్రేడ్ కెంట్ (విముక్తి సేనలో చేరారు), చార్లెస్ బెంబా (తన భయాందోళనల గురించి నివేదించేందుకు వచ్చారు), మరో కామేడ్ పేరు నాకు తెలియదు. మిలటరీ అవకాశాల గురించి చర్చించాం. స్థిర పోరాటాన్ని చర్చల నుంచి మినహాయించాం. అక్కడ ఇక మిగిలింది కొద్దిమంది మాత్రమే (మేం మాత్రమే). వీరిపైనే పూర్తిగా ఆధారపడలేం. పిజీలో పరిస్థితి విషమించడంతో ఉపసంహరించాం. దీన్ని కూడా మినహాయించాం. పునరావాసానికి అనుకూలమైన మరో రెండు ప్రాంతాల్ని కూడా మినహాయించాం; అందులో ఒకటి. ఉవీరా, అక్కడికి సరస్సు మార్గంలో వెళ్లాలి. కాలి నడకన గతుకుల రోడ్డుపై రెండోది. దక్షిణదిశగా ఉన్న కొన్ని గ్రామాలు. వాటిలో... బొండో గ్రామం రక్షణకు అను కూలమైంది. అలీ, మోజాలు వెంటనే ఆ గ్రామానికెళ్లి అదే రోజు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. త్రిమెండో చేసిన ఈ ప్రతిపాదనపై అలీ అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితి బాగా లేదన్నారు. దీనిపై అలీకీ, నాకు మధ్య కొంత గొడవ జరిగింది. స్థానికుల సహకారం లేకున్నా కొండల చుటూ తిరగడమే సరైందని అలీ వాదించారు. అందుకు బదులిస్తూ.. బొండోలో ఉంటూ అందరినీ ఖాళీ చేయిస్తామని చెప్పా పోరాటాన్ని విరమించి వెళ్లే బృందంతో ఆయన్ని కూడా పంపిస్తా నంటూ చమత్కరించా. అందుకు సిగ్గుపడ్డ అలీ చివరిదాకా నాతోనే ఉంటానన్నారు. అయితే, ఆయన తన వాదన మాత్రం వదులుకోలేదు. "ఈ కొండల చుటూ 20 ఏళ్లపాటు ఇలాగే తిరుగుదామన్నారు".

కామ్రేడ్ మసెంగోకు టాంజానియా నిర్ణయం చెప్పేందుకు ఇదే సరైన సమయమని భావించా. ఇంకా దాచి పెట్టడం తగదని అనుకున్నా ప్రభుత్వ వైఖరి గౌరవప్రదంగా ఏమీలేదు. వారు మాతో వ్యవహరించిన తీరు తెలిసిన ఎవరైనా సరే మాతో ఏకీభవించక తప్పదు. విప్లవోద్యమం కోసం మర్యాదపూర్వకంగా చేయాల్సిన వేమీ వారు చేయలేదు. నాకు ఓ సమాచారమొచ్చిందంటూ కొన్ని రోజుల క్రితమే ప్రభుత్వ నిర్ణయం గురించి మసెంగోకు గుర్తు చేశా. అయితే, ఈ పరిస్థితుల్లో క్యూబన్లతో సహా ఆ విషయం ఎవరికీ తెలుపనని చెప్పా ఇపుడు ఆయన్ని ఒంటరిగా తీసుకెళ్లి

విషయం చెప్పాం. దాన్ననుసరించి ఆయనకు నిర్ణయాలు తీసుకునే వీలుంది. దీనిపై వెంటనే ఆయన కామ్రేడ్లతో చర్చిస్తాడనిపించింది. మసెంగో తన దగ్గరికొచ్చి పోరాటాన్ని విరమించాలని ప్రతిపాదించినట్టు తెల్లవారుజామునే ట్రిమెండో నాతో చెప్పారు. అయితే అంతకుముందే దీనిపై ఆయనతో మాట్లాడా. ఇక్కడి నుంచి ఖాళీచేసి వేరే చోటికి వెళ్తామని చెప్పా. అపుడాయన ఇంకా ముందుకు వెళ్లడం ఇష్టంలేదన్నారు. ఇంచార్జ్ కామ్రేడ్లంతా పోరాటాన్ని ఇక ముగించాలన్నారు.

అది చాలా గంభీరమైన నిర్ణయమని చెప్పా ఇప్పటికీ ఫ్రంట్‌లో దళాలు పనిచేస్తున్న విషయం గుర్తు చేశా. పిజీ, ముకుందీ, ఉవీరా, ములేలే ఫ్రంట్లో్ల దళాలున్నట్టు తెలిపా. మనం వెంటనే ఉపసంహరిస్తే, శత్రు సైన్యం మన దళాలపై విరుచుకుపడే ప్రమాదముందని చెప్పా. మనం పారిపోవడం వల్ల ఆ దళాలు చెల్లాచెదురవుతాయని, తమను తాము కాపాడుకునే శక్తి వారికి లేదని గుర్తు చేశా. ఏ పరిస్థితుల్లో ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందో వివరిస్తూ, మసెంగో నుంచి లెటర్ తీసుకోవాలని సూచించా. దీనిపై ట్రిమెండో పునరాలోచనలో పడ్డారు. ఆయన కొంత కలత చెందారు. మన చర్యల్ని నమోదు చేసేందుకు చరిత్ర అంటూ ఒకటుందని, ఇదే విషయాన్ని నేను మరోసారి నొక్కిచెప్పా. అది ఎన్నో భాగాలుగా ఉంటుందని, కొన్నింటిని ఎవరూ పట్టించుకోరని వివరించా. సంక్షిప్తంగా.. నా సమక్షంలో జరుగుతున్న సంఘటనలు కనుక లెటర్ ఇవ్వాలని కోరా. మన చర్యలు ఎప్పటికీ తప్పు పట్టేవిగా ఉండకూడదు. నా వాదనకు బలం చేకూరుస్తూ, ఇటీవల మాపై మోపిన నిందల్ని గుర్తు చేశా. దీనికి బదులిస్తూ, ఇలాంటి డిమాండ్ చాలా కష్టమైందని, అందుకు మసెంగో అంగీకరిస్తారో లేదో తెలియదన్నారు. దాంతో, నాకో విషయం స్పష్టమైంది. ఓవేళ లెటర్ ఇచ్చేందుకు ఆయన అంగీకరించకపోతే, తాను చేస్తుంది తప్పేనన్న అపరాధ భావన ఆయనలో ఉండి ఉండాలి. ఉప సంహరణ బాధ్యత ఎప్పటికీ మనపై ఉండకూడదంటూ ఆయనకు ఎంతో వివరించా...

ట్రిమెండో తన కామ్రేడ్లతో మాట్లాడేందుకు వెళ్లడంతో మా మధ్య చర్చలు అసంపూర్తిగా ముగిసాయి. ఆ సమయంలో అప్పర్ బేస్ నుంచి నాకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. శత్రు సైనికులు చొచ్చుకువచ్చారు. ఎలాంటి పోరాటం చేయకుండానే అజీమా వెనక్కి వెళ్లారు.

అక్కడ చాలామందే ఉన్నారు. వారంతా రెండు బృందాలుగా విడిపోయారు. వెనక్కి వెళ్తుండగా వారిపై దాడులు జరిగాయి. అయితే ఎలాంటి నష్టమూ జరగలేదని తెలిసింది. వైమానిక దాడి నుంచి మన పరిశీలకుడు తప్పించు కున్నారు. ఆయన పేరు సులేమాన్. ఆయనతో ఓ దళ సభ్యుడు కూడా ఉన్నారు. అతను కాంగోవాసి. అయితే, వారిద్దరూ కనిపించకుండా పోయారు. క్షేమంగానే ఉన్నారని భావిస్తున్నాం.

దీంతో, నేరుగా మసెంగో దగ్గరికెళ్లా వెంటనే ఉపసంహరణకు రంగం సిద్ధం చేయాలని ప్రతిపాదించా. అందుకు అంగీకరించారు. ఎలా వెళ్లాలో అప్పటికే చర్చించినట్లు ట్రిమెండో చెప్పారు. ఉపసంహరణ సజావుగా సాగుతుందని చెప్పారు. మా సంభాషణంతా మిలటరీ చీఫ్ విన్నారు. ఐదు నిమిషాల తర్వాత టెలిఫోన్ ఆపరేటర్లతో సహా మిలటరీ పోలీసులంతా పారిపోయారు. బేస్ క్యాంప్‌లో గందరగోళం నెలకొంది.

తన మనుషుల్ని ఎటూ కదలకుండా చూడాల్సిందిగా మసెంగోకు సూచించా. క్యూబన్ల ద్వారా ఉపసంహరణ ఓ పద్ధతి ప్రకారం జరిగేలా నేనే చూస్తానని చెప్పా. అలాగే చేశా. చేతిలో పట్టుకెళ్లే ట్రాన్స్‌మీటర్‌తో సహా పరికరాలన్నిటినీ ముందుగా వెళ్లే దళాలతో పంపించాలని చెప్పా. భారీ ఆయుధాల్నీ సైనిక సామగ్రినీ దాచి పెట్టాలని సూచించా. మిగిలిన వస్తువులన్నిటినీ అదే రాత్రి కాల్చేయాలని ఆదేశించా. కిందకి వెళ్లి మీ కోసం వేచి ఉంటానని చెప్పా ట్రాన్స్‌మీటర్ తీసుకెళ్లడం తప్పనిసరైంది. అప్పటికే అప్పర్ బేస్ నుంచి కిగోమాకు సంబంధం కలిసింది. కనీసం అక్కడి మాటలైనా స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఆ పరికరం పరిధి 20 కి.మీ. మాత్రమే కావడంతో 70 కి.మీ. లేదా అంతకు మించిన దూరాన ఉన్న టాంజా నియా రేవుతో సంబంధం కుదరలేదు. తక్కువ సమయంలోనే అనేక టెలిగ్రాం సందేశాల్ని పంపగలిగాం. 18న పంపిన ఓ సందేశం ఇలా ఉంది..."రఫెల్. పరిస్థితి చేజారిపోయింది. మన దళాలు, రైతులు, శత్రువు చేతుల్లోకి వెళ్లిపోయారు. ఏ ఒక్క కాంగో దళాన్నీ నమ్మలేని పరిస్థితి. ఈ రోజు నుంచి ప్రధాన పరికరం ద్వారా సందేశాల్ని పంపించలేం. కిగోమాతో సంబంధాల్ని చేతిలో పట్టుకెళ్లే మరో పరికరం ద్వారా కొనసాగిస్తున్నాం. కొన్ని ఇబ్బందుల వల్ల చాంగా ఇక్కడే ఉండిపోయారు. మంచి కండీషన్లో ఉన్న ఓ ఓడ, పడవలు

అత్యవసరం"...

చివరికి చాంగా సరస్సు దాటారు. ఆయనతోపాటు పెద్దసంఖ్యలో మహిళలూ, పిల్లలూ వెళ్లారు. దాంతో, కిగోమా కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద గుంపే తయారైంది. మీ దగ్గర వికలాంగుల్నీ ఆశక్తుల్ని మాత్రమే వదిలేస్తానని, మిగతా వారిని ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే పంపిస్తామన్నారాయన. కానీ, అలా చేయలేకపోయాం. అదే రోజు రఫెల్ ఓ టెలిగ్రాం పంపారు. "టాటూ.. కబీలాతో రెండో దఫా చర్చలు జరిపాం. పరిస్థితి తీవ్రతను ఆయనకు వివరించాం. వెంటనే నిత్యావసరాలు పంపించాలని కోరాం. తాను కొరియా వెళ్లడానికి ముందే ఈ సమస్యను పరిష్కరిస్తానన్నారు. రోడ్డుపై కిగోమాకు వెళ్తున్న ఓ లారీని చూశాం. అందులో కొన్ని వస్తువులు మాత్రమే కనిపించాయి. నిన్ననే క్యాంబోనాకు విషయం చెప్పాం. అధ్యక్షునితో మాట్లాడి ఈరోజు సమాధానమిస్తానన్నారు. ఇది నేరుగా వారికి తమ బాధ్యతను గుర్తుచేసే సంభాషణ కాగలదు. సోవియట్, చైనా దేశాలకు సమాచారం అందించాం. వారిక్కడికి పంపిన వస్తువుల్ని చేరవేయడంలో ఎదురవు తున్న ఇబ్బందుల్ని వివరించాం. UAR, ఘనా, మాలి, రాయబారులతో మాట్లాడాం. ఆక్రా ఒప్పందాన్ని అమలు చేయడంలో టాంజానియా వైఫల్యాన్ని గుర్తు చేశాం. కిరాయి తెల్ల సైనికులతో పోరాడుతున్న జాతీయవాదులకు నిత్యావస రాల్ని అందించలేకపోతుందని తెలిపాం. జరిగే నష్టాలన్నిటికీ ఆఫ్రికా నేతలతోపాటు టాంజానియా బాధ్యత వహించాలని చెప్పాం. మాతో కలిసి కబీలా కూడా ఇక్కడి ప్రభుత్వ అధికారులతో మాట్లాడారు. మేమడిగిన ప్రశ్నలే ఆయన నుంచీ వచ్చాయి. అటు చైనా, సోవియట్ దేశాలకు సమాచారమిచ్చారు".

దీనికి నేనిచ్చిన ప్రత్యుత్తరం ఇలా ఉంది.

రఫెల్. క్యూబాకు పంపిన చివరి నివేదిక గురించి తెలుసుకోవాలను కుంటున్నాం. అది టాంజానియా ప్రభుత్వంతో చర్చలు జరిపే కమిషన్ గురించి. ఘనా, మాలి, UAR ప్రభుత్వాలతో చర్చలు జరిపేటప్పుడు ఈ ప్రశ్న అడగండి. జరిగిన ఒప్పందం ప్రకారం ప్రస్తుత స్థితిలో మమ్మల్ని వదిలేయడం సరైందేనా? మీరు మాకందించాల్సిన సాయం చాలా ఆలస్యమవుతోంది. దాదాపు నెల రోజులవుతోంది. మేమిక ఇక్కడి నుంచి వెళ్లాలనుకుంటున్నాం. క్యూబన్లలో ఎక్కువ భాగం రెండో

విడత వెళ్లిపోనున్నారు. క్యూబా గౌరవార్థం ఓ చిన్న బృందం మాత్రమే ఇక్కడ ఉంటుంది. క్యూబాకు తెలియజేయండి".

అనారోగ్యవంతుల్నీ పిరికివాళ్లనీ, కాళ్లల్లో సత్తువ లేనివాళ్లనీ వెనక్కి పంపాలను కున్నా పోరాటాన్ని కొనసాగించేందుకు ఓ చిన్న బృందాన్ని ఇక్కడ ఉంచాలను కున్నా అందుకోసం ఓ 'నిర్ణయ పరీక్ష నిర్వహించా. ఫలితాలు నిరాశపరిచేవిగా ఉన్నాయి. ఏ ఒక్క కామ్రేడ్ కూడా ఇక్కడ ఉండి పోరాడేందుకు ఇష్టపడలేదు. ఖాళీ చేయించడంలో ఓ సమస్య ఎదురైంది. కసీమాలో పర్యవేక్షణ కోసం మహూ ఇద్దరిని పంపించగా వారు తిరిగి రాలేదు. వారిని వెతికేందుకు మరో మనిషిని పంపాలని నిర్ణయించారు. వీలైనంత త్వరగా అతన్ని తిరిగి రావాలని చెప్పారు. భారీ ఆయుధాల్ని అక్కడే వదిలేసి ఆ బృందం కూడా మాతోనే వస్తారు. అయితే, తెల్లవారుజామునే మేం లోయర్ బేస్ వదిలి వెళ్లే ఎంబిలీతోపాటు మరికొందరు సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. శత్రు దాడుల స్వభావాన్ని గమనించి నేను కొన్ని అంచనాలు వేశా. శత్రువు మరో వ్యూహం కోసం ఓ రోజంతా విశ్రాంతి పొందే అవకాశముంది. దానివల్ల మా ప్రయాణం సులభమవుతుంది. అయితే, శత్రువు కంటపడకుండా మా ముఖ్య వస్తువుల్ని కాపాడుకోవాలి.

బేస్‌క్యాంప్ ఇంచార్జ్ జెంజేతోపాటు మాలోని ముగ్గురు అనారోగ్య జీవుల్ని పడవలో ముకుంగో అనే చిన్న గ్రామానికి పంపాం. అక్కడే పోరాటానికి సిద్ధం కావాలనుకున్నాం. అజీ యూనిట్ నుంచి కొన్ని భారీ ఆయుధాల్ని వారు తీసు కెళ్లారు. అయితే, అన్నింటినీ వారు మోయలేకపోయారు. మా సొంత దళాలతో ఉన్న కాంగోవాసులు పారిపోవడంతో చాలా వస్తువులు చెల్లాచెదురయ్యాయి. ఇపుడు కాంగోవాసులు పిజీ వైపు వెళ్తున్నారు. ముందుగా వారిపై దాడి చేసి వెనక్కి రప్పించాలనుకున్నాం. కానీ, ఖాళీ చేసి వెళ్లే ముందు అలా చేయడం మంచిది కాదనుకున్నాం. ఇలాంటి సమయంలో వారందరినీ మాతోనే ఉండాలని ఒత్తిడి చేయడం సరైంది కాదని భావించాం.

దాదాపు 7 నెలలపాటు మాకు ఆశ్రయమిచ్చిన ఆ ఇంటిని తెల్లవారుజామునే తగులబెట్టాం. అందులో కుప్పలకొద్దీ కాగితాలతోపాటు ఎన్నో డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. ఇక్కడి మా జ్ఞాపకాల్ని మరచిపోకుండా అవి మాకు ఎంతో ఉపయోగ పడ్డాయి. అవన్నీ ఇపుడు మంటల్లో కాలి

బూడిదైపోతున్నాయి. కొద్దిసేపటికే తెల్లారింది. ఆయుధాగారాల్ని మండించడం మొదలుపెట్టారు. నాతో గానీ, మసెంగోతో గానీ చెప్పకుండానే ఆ పని చేస్తున్నారు. దీనిపై కాంగోవాసులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించా. మరో కొత్త బేస్ ఏర్పాటు చేయడం సాధ్యం కాదనుకుంటే కనీసం సమీపంలోని పర్వతం మాటున వాటిని దాచుకోవాల్సిందిగా సూచించా. విలువైన నిల్వలన్నీ కాలిపోతున్నాయి. భారీ పేలుళ్లతో మంటలు ఎగసిపడుతున్నాయి. జుంగో వైపున ఉన్న మొదటి కొండపై నిల్చొని ఎగసిపడుతున్న మంటల్ని చూశా. చెల్లా చెదురైన మిత్రులందరినీ అక్కడే నిలిపి ఉంచేందుకు వేచి చూస్తున్నా వారంతా వయసుమళ్లి జీవం కోల్పోయిన వారిలా కనిపించారు.

ఆయుధాల్ని మోయలేక వాటి విడి భాగాల్ని ఒక్కొక్కటే పీకి పడేస్తూ ప్రయాణం సాగిస్తున్నారు. యుద్ధంలో వాటి అవసరమెలాంటిదో వారికి అర్థమైనట్టు లేదు. మూత్రో మిగిలివున్న వారిలో కాంగోవాసులెవరూ లేరు. దాంతో, ప్రతిదీ క్యూబన్లే మోయాల్సివస్తోంది. ఆయుధాల్ని కాపాడుకోవాలని నొక్కిచెప్పా వెళ్లేముందు చివరి దాడికి వాటి అవసరముంటుందని గుర్తు చేశా. కాళ్లు ఈడ్చుకుంటూ ఆగిఆగి నడుస్తున్నారు. ఓ తుపాకీ, మరో మెషిన్‌గన్ మాత్రమే వారి దగ్గరున్నాయి. మరో రెండింటిని దారిలోనే వదిలేశారు.

సమాచార పరికరం కోసం వేచి చూశా. ఆరు గంటలకు మొదటి కాంటాక్ట్ దొరికింది. బృంద నాయకుడు టుమా కొండ వైపు వస్తున్నారు. ఆప్పర్ బేస్ నుంచి సరస్సు వైపు నాకు వ్యతిరేక దిశలో ఉన్నారు. పది నిమిషాల్లో దిగాల్సిన కొండకు మూడు గంటలు పట్టడంతో కామ్రేడ్లపై మండిపడ్డా, మధ్యలో ఓ చోట విశ్రాంతి కూడా తీసుకున్నారు. ఏదైనా బరువుగా ఉంటే వదిలేసి స్పీడ్‌గా నడవాలని ఆదేశించా. ఆపరేటర్ కోడ్ మరచిపోయారు. దానికోసం మరొకరిని వెనక్కి పంపా. ఆపరేటర్లను సీరియస్‌గా మందలించా. సమాచార పరికరం ఎంతో ముఖ్యమైందని, జాగ్రత్తగా ఉండాలని సూచించా. పది గంటలకు మరో కాంటాక్ట్ కోసం యత్నించి విఫలమయ్యాం. కొండల మధ్య నడవడంలో అనుభవంలేని ముగ్గురు కామ్రేడ్ల వల్ల మా వేగం తగ్గింది. మమ్మల్ని అనుసరించి నడవాలని సూచించా. దాంతో, కొంత వేగం పెరిగింది. క్రిబంబాలోని మా బేస్ క్యాంప్ నుంచి జుంగోకు సాధారణంగా నడిచి వెళ్తే 3 లేదా 4 గంటలు పడుతుంది. సాయంత్రం 3 గంటల వరకెల్లా

కాంటాక్ట్ కోసం మరో పాయింట్ దగ్గరికి చేరగలమనుకున్నా కానీ, మేమింకా దానికి చాలా దూరంలోనే ఉండిపోయాం. అయితే అక్కడి నుంచి కాంటాక్ట్ కోసం యత్నించి విజయం సాధించాం...

"చాంగా... బేస్‌క్యాంప్‌ను కోల్పోయాం. ముఖ్యమైన పరికరాలతో వస్తున్నాం. ఈరోజు రాగలిగితే వెంటనే బదులివ్వగలవు".

ఆ తర్వాత మరో సందేశం పంపాం.

"చాంగా.. ఈ రోజు శత్రు దళాలు సరస్సు ప్రాంతంలో కనిపించలేదు. మేం జంగోలో ఉన్నాం. కిబంబాకు దక్షిణాన 10 కి.మీ. దూరంలో పోరాటాన్ని వీడేందుకు మసెంగో నిర్ణయించారు. సాధ్యమైనంత త్వరగా పోరాటాన్ని వీడి వెళ్లడమే మనకిక మంచిది".

సరస్సు నుంచి "అర్థమైంది" అన్న మాట వినపడగానే కామ్రేడ్ల ముఖాలలో ఏదో తమాషా జరగుతుందన్న భావం వ్యక్తమైంది. మా చివరి సందేశం చాంగా రాకకు సంబంధించి. అయితే, సందేశాలను డీకోడ్ చేసి అర్థం చేసుకొని, తిరిగి కోడ్ భాషలో ప్రతిస్పందన పంపాలి. ప్రతిస్పందన ఇలా ఉంది. "ఇక్కడికి ఎవరూ రాలేదు"... అపుడు ఆపరేటర్స్ చెప్పిందేమంటే సందేశాలు పంపడంలో ఇబ్బందులెదురవుతున్నాయని.

కానీ, అది మా ప్రశ్నకు సమాధానమిచ్చింది. పడవలు ఇంకా అక్కడికి చేరుకోలేదన్న సందేశమిచ్చింది. సరస్సు దగ్గర చాంగాకు ఇబ్బందులెదురయ్యాయని అర్థమైంది. ఆరోజు శత్రు విమానాలు ఆకాశంలో కనిపించాయి. దాంతో, పడవల్ని కోల్పోయామని, ఇక వెళ్లలేమని అర్థమైంది. మరోసారి మా ముఖాల్లో మబ్బులు కమ్ముకున్నాయి. మా మనసుల్లో ఆందోళన మొదలైంది. 7 గంటల సమయంలో మరో కాంటాక్ట్ కోసం యత్నించి విఫలమయ్యాం. సరస్సు ప్రాంత వాతావరణంలో మా పరికరానికి 3 గంటల సమయమే అనుకూలమైందని గుర్తించాం.

నిద్రించే వేళకు జుంగో చేరుకున్నాం. అక్కడ అంతా గజిబిజిగా ఉంది. మాకోసం వివరూ ఆహారం సిద్ధం చేయలేదు. మమ్మల్ని మేం లెక్కించుకుంటే నలుగురు తప్పిపోయారు. శత్రు దళాలు మాకు కనిపించినపుడే వారు తప్పిపోయి ఉంటారు. వారిలో ఇద్దరు కసీమాలో పర్యవేక్షణ కోసం వెళ్లి

తిరిగి రాలేదు. వారికోసం వెళ్లిన మరో వ్యక్తి ఒంటరిగా వచ్చారు.

రెబోకేట్ నేతృత్వంలో ఓ దళాన్ని ఏర్పాటు చేశాం. గంజా నుంచి పర్వతాల మధ్యలో వెళ్లే రోడ్డుపై ప్రయాణం సాగించాలి. రెండు చోట్ల శత్రు దళాలు ఎదురయ్యే అవకాశముంది. ఒకటి ఎత్తైన కొండల మధ్య, రెండోది సరస్సు సమీపంలో. రోడ్డు మార్గంలో ఉన్న ఓ కొండమీద పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. మందుపాతరలు అమర్చిన ప్రాంతంలోకి శత్రు దళాలు ప్రవేశించినట్టు అర్థమైంది. అయితే ఆ సమయంలో పర్వతశ్రేణుల మధ్య దాడికి సిద్ధం కావడం అసాధ్యమనిపించింది. అప్పటికే కొన్ని పర్వత శ్రేణులు మా స్వాధీనంలో ఉన్నాయి. రక్షణ కోసం పరిమిత చర్యలు మాత్రమే తీసుకోగలిగాం. జుంగోకు సమీపంలోని సెలే అనే గ్రామం వైపు ప్రయాణం సాగించాం.

నవంబర్ 20న ఆరు గంటలకోసారి, పది గంటలకోసారి కాంటాక్ట్ కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆపరేటర్లు నెమ్మదిగా నడవడంతో సెలే చేరుకునేసరికి మధ్యాహ్నమైంది. సెలే దగ్గర జనం పెద్దసంఖ్యలో ఉన్నారు. అక్కడే మా ఆకలి కొంత తీర్చుకున్నాం. బన్విర్ రాకను దన్ని గమనించారు. ఆయన్ని వెనకే వదిలేసి వచ్చాం. ఆయన కాలి మడమ బాగా వాచిపోయింది. దాంతో దారి మధ్యలో తన కిట్ బ్యాగ్ వదిలేసి వచ్చారు. దాన్ని వెతికి తీసుకురావాల్సిందిగా ఓ కామ్రేడ్‌ను కోరారు. అయితే ఆ కామ్రేడ్ ఆ పని చేశారో లేదో తెలియదు. ఉదయం లేచి చూస్తే ఆయన అక్కడే పడి ఉన్నారు. ఉదయం 9గంటల వరకూ ఆయన అక్కడే ఉన్నారు. శత్రుదళాలు ఆవైపు రాలేదు. రోడ్లన్నీ నిర్మానుష్యమయ్యాయి. ఇళ్లన్నీ ఖాళీ అయిపోయాయి. సాయంత్రం 2.30కి కిగోమాతో కాంటాక్ట్ దొరికింది.

మా సందేశం ఇలా ఉంది. "చాంగా దాదాపు మా సంఖ్య 200 వరకూ ఉంటుంది. రోజులు గడవడం ఎంతో కష్టమవుతోంది. మేమిపుడు సెలేలో ఉన్నాం. ఇది కిబంబాకు దక్షిణ దిశలో 10 లేదా 15 కి.మీ. దూరంలో ఉంది" వారి నుంచి ప్రతిస్పందన కోసం చాలాసేపు వేచి చూశాం. "టాటూ ఈ రాత్రికి సరస్సు దాటిస్తాం. నిన్న కమిషనర్ అందుకు అంగీకరించలేదు".

మనుషులంతా సుఖాన్నే కోరుకుంటారు. అదే రాత్రి అక్కడి నుంచి వెళ్లాలంటూ మసెంగోకు

సూచించా. అక్కడ కాంగోవాసులు ఎక్కువగా ఉన్నారు. సాధారణ సిబ్బంది సమావేశమై ఓ నిర్ణయం చేసింది. జీన్‌పాలిస్ తన అనుచరులతో కలిసి అక్కడే ఉంటారు. నాయకులంతా అక్కడి నుంచి వెళ్లాలి. స్థానిక దళ సభ్యులు అక్కడే ఉంటారు. మేం పోరాటాన్ని విరమించే విషయం సమీప గ్రామస్తులకు తెలియనీయరు. ఏదో ఒక సాకు చెబుతూ అక్కడే ఉంటారు. ఓ చిన్న పడవ వచ్చింది. పెద్దసంఖ్యలో కాంగోవాసులు అందులోకెక్కారు. మా దళ సభ్యులు కొందరు మాంసం కోసం వేచి ఉండేందుకు ఒప్పుకున్నారు. క్యూబన్లతో కలిసి చివరి పీడ్కోలుకొచ్చే కాంగోవాసుల్ని ఎంపిక చేయాల్సిందిగా ఆదేశించా. అరులుగా నేను గుర్తించిన వారిని మాతో పంపేందుకు మసెంగో ఒప్పుకున్నారు.

ఇది నాకు సంక్లిష్ట పరిస్థితి. పర్యవేక్షణ కోసం వెళ్లిన ఆ ఇద్దరూ తిరిగి రాలేదు. వారు తమ పని పూర్తి చేశారు. కానీ మేం వెళ్తున్న దారి తెలుసుకోలేకపోయారు. దాంతో చిక్కుల్లో పడ్డారు. వాళ్లను మేం అలాగే వదిలేసి వెళ్తే, వెనువెంటనే మాపై కాంగో బయటా, లోపలా అపనిందల వర్షం కురిపిస్తారు (అయితే ఓ నెల రోజుల తర్వాత మన కార్యకర్తల బృందమొకటి వారిని కాపాడింది. ఆ బృందంలో ఇఫ్రిని, అంచలి, అజా, అలసిరి ఉన్నారు. సికీ, చాంగాతోపాటు మందుపాతరల బృందం సహకారంతో చివరి క్షణాల్లో వారు మమ్మల్ని చేరుకోగలిగారు). మా బృందంలో మిశ్రమ దళాలున్నాయి. నా వెంట 20 మందిని తీసుకెళ్లాలనుకున్నా వారందరూ సునిశిత దృష్టి కలిగినవారై ఉండాలి. ఆ తర్వాత నేనేం చేయాలి? నాయకులంతా పోరాటాన్ని విడిచి వెళ్తున్నారు. మా పట్ల రైతుల్లో మునుపెన్నడూ లేనంత శత్రు భావం వ్యక్తమవుతోంది. మరోవైపు మేమిక్కడికొచ్చి ఏమీ సాధించకుండానే వెళ్తున్నామన్న ఆలోచన నన్ను ఎంతో బాధించింది. ఆత్మరక్షణ తెలియని రైతులు, పోరాట స్ఫూర్తి లోపించిన సాయుధులు, ఓటమి, మోసపోయామన్న ఆవేదన, ఇవన్నీ వదిలి వెళ్తున్నామన్న అపరాధ భావన. కాంగోలోనే ఉండిపోవడాన్ని నా దృష్టిలో త్యాగంగా భావించను. నా అనుచరులతోపాటు ఓ ఏడాది మాత్రమే కాదు ఐదేళ్లయినా ఉండేందుకు నేను సిద్ధమే. నా మనసులో రూపు దిద్దుకున్న పోరాటమార్గంలో ఓ భాగంగానే దాన్ని చూడాలి. దీనిపై వివేచనతో ఆలోచించా. నుదుటిపై ముడతలు లేని ఆరు లేదా 8 మంది యోధులు నాతో ఉండాలి.

మిగతావారు అది తమ విప్లవ కర్తవ్యంగా లేదా నాపై వారికుండే అభిమానంతో ఉండాలి. "పోరాడేందుకు శక్తిలేని వారికోసం నా జీవితాన్ని త్యాగం చేయాలనుకున్నా ఈ భావన ఇంతకు ముందే నాలో కలిగింది కాదు. ఇక్కడికొచ్చాకే నాలో అలాంటి భావం కలిగింది. కాంగో నేతల గురించి ఇక్కడి ప్రజలు నన్ను హాస్యభరితంగా ప్రశ్నించినపుడు కలిగిన భావన అది". అయితే నేనపుడు వారి గురించి మాట్లాడే ముందు మిమ్మల్ని మీరు ఆత్మ విమర్శ చేసుకోవాలంటూ కఠినంగానే సమాధానమిచ్చా. అపుడు వారంతా మౌనం వహించారు. నా మాటలు వారికి మొరటుగా అనిపించాయి. శత్రు భావాన్ని కలిగించాయి. నేనపుడు అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. వారి వెన్ను తట్టి ధైర్యమిచ్చేలా మాట్లాడి ఉండాల్సింది. కానీ నేనపుడు అలా ఆలోచించలేకపోయా.వాస్తవానికి నేనింకా కాంగోలో కొనసాగాలంటే రాత్రివేళ ఓ భూతంలా తిరుగుతూ ఉండాలి. సుదీర్ఘకాలంపాటు అలా ఓ పిరికివాడిలా తిరిగేందుకు నాకస్సలు సాధ్యంకాదు. పోరాట విరమణ కాంగోవాసుల దృష్టిలో మా ఔన్నత్యాన్ని తక్కువ చేసేదే. మా ఉపసంహరణ పారిపోవడంలాంటిదే అవుతుంది. ఆ ప్రజల్ని ఆ నేలపై ఒంటరిగా వదిలి వెళ్లడం మోసమే అనిపిస్తోంది. అయితే ఇంతకీ నేనెవరు? అన్న భావన నాలో కలిగింది. ఫిడేల్‌కు వీడ్కోలు ఉత్తరం రాసిన నాటి నుంచీ కామ్రేడ్లంతా నన్ను క్యూబా సమస్యలకు దూరంగా మరో ప్రపంచం గురించి ఆలోచించే మరో మానవుడిగానే చూస్తున్నారు. అందుకే ఇంకా నాతో మిగిలివున్న మిత్రుల్ని ప్రాణ త్యాగాలకు డిమాండ్ చేయలేను. ఇక్కడి నా చివరి క్షణాల్ని ఒంటరిగా ఇలాంటి ఆలోచనలతో గడిపాను. అదే రాత్రి క్యూబన్ పడవలు మమ్మల్ని చేరుకున్నాయి. రాత్రి రెండు గంటలకు ప్రయాణానికి సిద్ధమయ్యాయి. 3 గంటలకు మా పడవ ముందుకు కదలడం ప్రారంభించింది. తెల్లవారుజామున 5.30కి సరస్సు మధ్యకు చేరుకున్నాం. మార్గమధ్యంలో ఉపసంహరణకు ప్రణాళిక సిద్ధం చేశా. ముందుగా అనారోగ్యంతో బాధపడేవారు, ఆ తర్వాత నేను ఎంపిక చేసిన మసెంగోకు చెందిన 40 మంది సాధారణ సిబ్బంది, చివరగా క్యూబన్లందరూ. అది బాధతో మనసు చిన్నబుచ్చుకునే సన్నివేశం. తమను మావెంట తీసుకెళ్లా లంటూ వేడుకునేవారిని తప్పించుకుంటూ

వేగంగా ముందుకు కదిలా. ఉప సంహరణ చెప్పుకునేటంత గొప్ప విషయం కాదు. మెషిన్గన్లతో నా అనుచరుల్ని సిద్ధంగా ఉంచా. ఒడ్డుకు చేరుకునే సమయంలో అనుకోకుండా శత్రు దళాలు తారసపడితే ఎదుర్కొనేందుకు. అయితే అలాంటిదేమీ జరగలేదు. పారుబోతుల నాయకుడి గొణుగుడు తప్ప.

ఇక్కడ కొందరు కామ్రేడ్ల పేర్లు చెప్పాలి. ఎందుకంటే ఎల్లవేళలా నేను ఆధారపడింది వారిపైనే. వారికున్న వ్యక్తిగత సుగుణాలు, విప్లవం పట్ల వారికున్న నమ్మకం, తమ కర్తవ్యాల పట్ల వారికున్న స్పష్టత వల్ల. వారిలో కొందరు చివరి నిమిషం వరకూ ఉన్నారు. త్యాగాలకు సిద్ధపడ్డ వారి నమ్మకాన్ని బలహీనపరచ కుండా మేం కూడా వారితోపాటే ఉన్నాం. కచ్చితంగా ఇలాంటివారు ఇంకా ఉండి ఉంటారు. అయితే వారందరినీ సన్నిహితంగా చూసే అవకాశం లేనందున గుర్తించలేకపోయా. అందుకే నేనిచ్చే ఈ లిస్ట్ అసంపూర్ణమైందనే చెప్పగలను. ఇలాంటి వారినెవరినైనా సరే నా లిస్ట్లో చేర్చనందుకు దయచేసి క్షమించగలరు: మోజా, ఎంబిలీ, పోంబో, అజీ, మఫూ, టుమైనీ, ఇప్రినీ, టిజా, అలావు, వజీరి, అగానో, హంకూము, అమి, అమియా, సింగిడా, అలసిరి, అనానానే, అంగాలియా, బొడాల, అనార, ముస్తాప, డాక్టర్లు: కుమీ, పిజీ, మొరోగోరో, కాసులు, సరస్సు ప్రాంతానికి మాస్టర్గా వ్యవహరించిన అడ్మిరల్ చాంగా: సికీ, టింబోల గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. పరిస్థితిని అంచనా వేయడంలో వారితో నేను చాలాసార్లు విభేదించాను కూడా. అయినా నా పట్ల వారి ఆరాధన చెక్కుచెదరలేదు. చివరగా అలీ గురించి ఓ మాట. ఆయన గొప్ప సైనికుడే, కానీ చెడ్డ రాజకీయవేత్త.

పడవలు నెమ్మదిగా నడిచినా, సరస్సు దాటడంలో ఎలాంటి సమస్యలూ ఎదురు కాలేదు. ఆల్బర్ట్ విల్లే ఓడ రేవు నుంచి కార్గో ఓడలో పగటివేళ్ల క్రిగోమా చేరుకున్నాం. సలసల కాగే నూనె తొట్టిలోంచి బయటపడ్డట్టుగా క్యూబన్, కాంగో మిత్రులు అమిత భావోద్వేగానికి లోనయ్యారు. ఒక్కసారిగా అంతా ఒడ్డున వాలిపోయారు. ఆ కుదుపుకు లంగరు తెగిపోయిందా అన్నంత ఉద్రిక్తత

అక్కడ నెలకొంది. అది నన్ను బాధించిందే కాని క్రుంగదీయలేదు. కాంగోలో నా చివరి క్షణాలన్నీ పూర్తిగా ఒంటరిగా గడిచిపోయాయి. క్యూబాలోనే కాదు, భూగోళం మీద నా కాలు మోపిన ఎక్కడా అంత ఒంటరిగా గడపలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే: ఇప్పటివరకూ నేను సాగించిన ప్రయాణాలన్నింటిలోకీ ఈరోజు ఉన్నంత ఒంటరిగా ఏరోజూ లేనని చెప్పగలను.

**********

ఉపసంహారణలో చెప్పకునేదల్లా యుద్ధం ద్వారా సాధించిన ఫలితాల గురించి. యుద్ధంలో ఎదురైన వివిధ పరిస్థితుల గురించి. వీటితోపాటు కాంగో విప్లవ భవిష్యత్ పై నా అభిప్రాయాలుంటాయి. ప్రత్యేకించి తూర్పు ఫ్రంట్ ప్రాంతం గురించి నా విశ్లేషణలుంటాయి. ఎందుకంటే వ్యక్తిగతంగా అదే నాకు బాగా తెలిసింది కనుక. అయితే కాంగోలోని వివిధ ప్రాంతాల లక్షణాలు వేరుగా ఉన్నందున నా అనుభవాల్ని జనరలైజ్ చేసి చెప్పలేను.

పోరాటం కోసం మేం చేరుకున్నది భౌగోళికంగా బాగా లోతట్టు ప్రాంతం. అది టాంజానియికా సరస్సు పక్కన ఉంది. సరాసరి 50 కి.మీ. వెడల్పుతో 35000 చ.కి.మీ. మేర సరస్సు విస్తరించి ఉంది. ఈ సరస్సే టాంజానియా, బురుండీలతో కాంగోను విడదీసింది. ఈ సరస్సుకు ఇరువైపులా పర్వతాల వరుసలున్నాయి. ఓవైపున టాంజానియా, బురుండీ ఉండగా, మరోవైపున కాంగో ఉంది. సముద్ర మట్టానికి 1500 మీటర్ల ఎత్తున కాంగో ఉంది. (సముద్ర మట్టానికి 700 మీటర్ల ఎత్తున సరస్సు ఉంది). పోరాటం జరిగిన ప్రాంతం. దక్షిణాన ఆల్బర్ట్ విల్లే, ఉత్తరాన బుకావుల మధ్య ఉంది. కొండల పక్కన ఉష్ణమండల అడవులు మొదలయ్యాయి. అయితే వీటి విస్తరణ ఒక్కతీరుగా లేదు. సరాసరిన 20 నుంచి 30 కి.మీ. వెడల్పున విస్తరించి ఉన్నాయి. మరో రెండు ఎత్తైన వరుసలున్నాయి. అవి: తూర్పు దిక్కున పర్వతశ్రేణులు, పశ్చిమ దిక్కున చిట్టడవులు. వీటి మధ్యనున్న ఎగుడుదిగుడు ప్రాంతమే వ్యవసాయానికి అనుకూలమైంది. ఇక్కడి లోయలు పశువుల పెంపకానికి అనుకూలమైనవి (ఈ ప్రాంతంలోనే రువాండా గిరిజనులు నివాసమున్నది. పశువుల పెంపకం వీరి ప్రత్యేకత). పర్వతాల పక్కనే మైదానం మొదలువుతుంది. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 700 మీటర్ల ఎత్తున ఉంది. ఈ ప్రాంతంలోనే కాంగో నది ప్రవహిస్తోంది. అయితే ఈ ప్రాంతంలో పశ్చిమ దిక్కున ఉన్న కబాంబేర్ మాత్రం ఉష్ణమండల లక్షణాల్ని కలిగి ఉంది.

సరస్సు పక్కన ఉన్న పర్వతాలు ఆ ప్రాంతానికి ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అక్కడి చిన్న చిన్న మైదానాలు దళాలు ఆశ్రయం పొందేందుకు అవకాశం కల్పిం చాయి. అయితే అక్కడ సురక్షితంగా ఉండాలంటే పక్కనున్న పర్వతాల్లో పొజిషన్ తీసుకోక తప్పదు. మైదానం నుంచి దక్షిణ దిశలో వెళ్లే రోడ్డు బింబా దగ్గర అంత మవుతుంది. అక్కడే మనకు ఓ పొజిషన్ ఉంది.

పశ్చిమ దిశలో వెళ్లే రోడ్డు చుట్టూ పర్వతాలున్నాయి. అదే పరిస్థితి ఆల్బర్ట్ విల్లే నుంచి లులింబా-పిజీ వరకూ కొన సాగుతుంది. అక్కడి నుంచి మరో రోడ్డు ముయెంగా మీదుగా బుకావు వరకు వెళ్తుంది. ఇంకో రోడ్డు సరస్సు తీరం మీదుగా బరాకా వైపు వెళ్లి చివరికి ఉవీరా దగ్గర అంతమవుతుంది. లులింబా నుంచి పర్వతాల మధ్యన వెళ్లే రోడ్డు శత్రు దళాలపై దాడికి అనుకూలమైంది. ఇది కొంతమేరకు మైదాన ప్రాంతాన్ని కలుపుతుంది.

అక్కడ వర్షం సర్వసాధారణం. అక్టోబర్ నుంచి మే వరకు దాదాపు ప్రతిరోజూ ఉంటుంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఉండదు. పర్వత ప్రాంతాల్లో అన్ని సమయాల్లోనూ వర్షం కురుస్తుంది. పొడి మాసాల్లో మాత్రం చాలా తక్కువ ఉంటుంది. మైదాన ప్రాంతాల్లో జింకలలాంటి వేట జంతువులున్నాయి. పర్వతాల్లో అడవి బర్రెల్ని వేటాడుతారు (అయితే అవి చాలా తక్కువ). ఏనుగులు, కోతులు విరివిగా ఉన్నాయి. కోతి మాంసం రుచిగా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఏనుగు మాంసం కఠినంగా రబ్బర్లా సాగుతుంది. అయితే ఆకలిగా ఉన్నపుడు సులభం గానే మింగుడుపడుతుంది. ప్రధాన ఆహార పంటలు; కాసవా దుంపలు, మొక్కజొన్నలు. పామ్ చెట్ల నుంచి నూనె తీస్తారు. మేకలు ఎక్కువసంఖ్యలో ఉన్నాయి. చిన్నచిన్న వ్యవసాయక్షేత్రాల్లో తేనెటీగల పెంపకం ఉంది. పందులు ఆ ప్రాంతమంతటా కనిపిస్తాయి. కొన్ని క్లిష్ట పరిస్థితుల వల్ల గెరిల్లా దళాలకు ఆహార సేకరణ కష్టమైంది.

బరాకా-పిజీకి ఉత్తర దిశగా ఉన్న ఈ ప్రాంతం పలు రకాల పంటలకు నెలవుగా ఉంది. ఉవీరాకు కాస్త ఉత్తర దిశగా ఓ చక్కెర మిల్లు ఉంది. కబేంబేర్-కసెంగా ప్రాంతంలో వరి, వేరుసెనగ ఎక్కువగా పండిస్తారు. పత్తి కూడా పండించేవారు. అయితే మేమక్కడికి వెళ్లగానే అది మాయమైంది. వ్యవసాయ పంటగా అక్కడి రైతులు దీన్ని ఎలా ఆదరించారో నాకు అర్థం కాలేదు. పెట్టుబడిదారులు తమ దోపిడీ కోసం ఉపయోగించే పంట ఇది. ఆధునిక చరిత్రలో విదేశీ కార్పొరేట్ సంస్థలు తమ వ్యూహాత్మక కేంద్రాల్లో దీన్ని ప్రవేశపెడుతున్నాయి.

సరస్సులో చేపలు విరివిగా లభిస్తాయి. అయితే మాకు చేపలు పట్టే అవకాశం తక్కువ. పగలు యుద్ధ విమానాలు, రాత్రివేళ పడవలతో దాడులు.

విప్లవశక్తుల విశ్లేషణ ప్రకారం, అక్కడి ప్రజల్ని మూడు వర్గాలుగా విభజించ గలం. రైతులు, నాయకులు, సైనికులు. రైతులు వివిధ తెగలకు చెందినవారు. అక్కడ వారి సంఖ్య ఎక్కువే. శత్రు సైన్యపు నివేదికల్ని చూస్తే దాడి కోసం వారు రూపొందించుకునే ప్రణాళికలో ఆ ప్రజల తెగను గురించిన ప్రత్యేక ప్రస్తావన కనిపిస్తుంది. రాజకీయ చర్యలకు ఇది ఎంతో ముఖ్యమైన సమాచారం. తెగల మధ్య సంబంధాలు చూడటానికి ఆత్మీయంగా అనిపిస్తాయి. కానీ వారి మధ్య నిజమైన సోదరభావం లేదు. కొన్ని తెగల మధ్య శత్రుత్వం తీవ్రస్థాయిలో ఉంది. రువాం దన్లకూ- ఇతర కాంగో తెగలకూ మధ్య శత్రుత్వం తీవ్రస్థాయిలో ఉంది. ఇలాంటి వైరాలు కటంగా ఉత్తర ప్రాంతంలోని తెగల మధ్య (మన గెరిల్లాల ఆధీనంలోని దక్షిణ ప్రాంతం ఆక్రమణకు గురైంది) మనకు కనిపిస్తాయి. ఇక్కడి తెగల మధ్య వైరుధ్యాలకు ఓవైపున కబీలా, మరో వైపున సౌమాలియట్ నేతృత్వం వహిస్తున్నారు.

రైతులు కొన్ని క్లిష్ట సమస్యల్నే ఇక్కడి ప్రజా యుద్ధం ముందుంచారు. ఇలాంటి విముక్తి ఉద్యమాల్లో ప్రధానంగా ఉండేది భూమికోసం పోరాటం. రైతుల దారి ద్ర్యానికి కారణమయ్యేది జమీందారులు, భూస్వాముల దోపిడి. కొన్ని సందర్భాల్లో పెట్టుబడిదారీ కంపెనీలు. అయితే కాంగోలో మాత్రం ఇలాంటి సమస్యలు లేవని చెప్పగలను. 20 లక్షల చ.కి.మీ. సువిశాల భూభాగంలో నివాసముంటోంది కేవలం కోటీ 40 లక్షల మంది మాత్రమే (జనసాంద్రత చాలా తక్కువ). ఎంతో సార వంతమైన నేల. తూర్పు ఫ్రంట్ ప్రాంతంలో మాత్రం ఎలాంటి భూపోరాటాలూ కనిపించవు. అక్కడ వ్యక్తిగత కమతాలు కూడా లేవు. పెంపకం చేసే వారివే పంటలు. ఒకరి ఆస్తిపై మరొకరు చొరబాట్లు జరపడం లేదా అలాంటి వాటిని నిరోధించడం అనే సమస్యే అక్కడ లేదు. అయితే కొన్ని తోటల్లోకి మాత్రం మేకలు తదితర జంతువుల్ని ప్రవేశించనీయరు. అవి వాటిని నష్టపరుస్తాయన్న కారణంగానే. మేం సందర్శించిన ప్రాంతాల్లో చాలా తక్కువ చోట్ల మాత్రమే భూమిపై హక్కు దారుల్ని చూశాం. ఎక్కువ చోట్ల ఎవరికిష్టమైన చోట వారు సాగు చేసుకునే వీలుంది. బుకావు చుట్టుపక్కల నేను సేకరించిన సమాచారం ప్రకారం, కేవలం ఉత్తర ప్రాంతంలో మాత్రమే ఫ్యూడల్ వ్యవస్థ అభివృద్ధి చెందింది. అక్కడ మాత్రమే భూస్వాములు,

బానిసలు అనే విభజన ఉంది. మేం నివాసమున్నపర్వత ప్రాంతంలో రైతులందరూ స్వతంత్రులే.

ఇక్కడి తెగల పరిణామ దశను ఎవరైనా ఎలా వర్ణించగలరు? అందుకోసం మాకు దొరికిన అవకాశంకన్నా మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. భౌగోళిక విభజనకు సంబంధించి మరింత సమాచారాన్ని సేకరించాలి. ఆయా ప్రాంతాల అభివృద్ధి, వాటి ప్రత్యేక చరిత్ర, సామాజిక పరిస్థితులపై జరుగుతోంది. అక్కడి సంచారజాతుల్లో ఆదిమ కమ్యూనిజపు ఆనవాళ్లను నేను గుర్తించా. కొంతమేరకు మహిళల్ని బానిసలుగా మార్చడం కనిపిస్తుంది. అయితే పురుషుల విషయంలో అలాంటిది లేదు. మహిళల్ని ఓ సరుకుగా భావిస్తారు. అమ్మకాలు, కొనుగోళ్లు సర్వ సాధారణం. ఇంతమందినే కలిగి ఉండాలనే నిషేధం కూడా ఏమీ లేదు. వారి ఆర్థిక స్థోమతే వారికి ఓ పరిమితి. ఓ మహిళను కొన్నాడంటే ఇక ఆమెపై సర్వహక్కులూ వాడివే లేదా ఆమె భర్తవే. ఇంట్లోగానీ, క్షేత్రాల్లోగానీ పురుషులు చేసే పని చాలా తక్కువే లేదా అసలే ఉండదు. పురుషులు చేసేదెల్లా వేటాడటం. అందులోనూ మహిళలు వెంట వెళ్లాల్సిందే, చురుకైన పాత్ర వారిదే. భూమి దున్నడం, పంటల్ని తరలించడం, పిల్లల సంరక్షణ అన్నీ మహిళలే చేస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె యంత్రంలా పనిచేసే జంతువు. ఉత్తర ప్రాంతంలో భూస్వామ్య వ్యవస్థ కనిపిస్తుంది. ఇక్కడ మాత్రం లేదు. ఇక్కడ భూమి అనేది ఓ ఆస్తి కూడా కాదు. ఇక్కడి సామాజిక ముఖచిత్రంలో పెట్టుబడిదారి ఆధిపత్యం కని పించదు. కానీ దాని ప్రాథమిక రూపమైన చిరు వ్యాపారులు కనిపిస్తారు. అందుకు గుర్తుగా రైతులు ఉపయోగించిన కొన్ని వస్తువుల్ని చెప్పగలను. మట్టికుండల స్థానంలో అల్యూమినియం బిందెలు, అంతకుముందు ఇళ్లల్లో లేదా స్థానిక కొలుముల్లో తయారైన ఈటెల్ని వాడితే ఇప్పుడు పరిశ్రమల్లో తయారైనవి వాడు తున్నారు. కొందరు ఆధునిక దుస్తులు ధరిస్తే, ధనికుల ఇళ్లల్లో రేడియోలు కనిపించాయి. వ్యవసాయ ఉత్పత్తుల్ని అమ్మడం ద్వారా వచ్చిన డబ్బుతో రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు.

కొంతకాలం క్రితం రైతులు కూలీలుగా పనిచేశారు. నదీ తీరప్రాంతాల్లో బంగారు గనుల తవ్వకాల్లో పాల్గొన్నారు. అందుకోసం తీసిన గోతులు ఇప్పటికీ కనిపిస్తాయి. ఇప్పుడా పని వారు వదిలేశారు. పత్తిలాంటి కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల్ని పెట్టుబడిదారులు తమ

అవసరాలకనుగుణంగా ప్యాక్ చేయిస్తున్నారు. అందుకోసం ఆధునిక యంత్రాల్ని ఉపయోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో కాటన్ మిల్లులు కనిపించలేదు కానీ ఆల్బర్ట్ విల్లేలో కొన్నింటిని చూశాం. ఇక్కడ పారిశ్రామిక కార్మికులెవరూ లేరు. (విద్యుత్ కేంద్రంలో మినహా). రోజు కూలీలు కూడా కనిపించలేదు. కొందరు రైతులు సైన్యానికి సేవలందిస్తున్నారు. మిగతావారు వేట, చేపలు పట్టడంతోపాటు వ్యవసాయ పనులు చేస్తున్నారు. అదనపు ఉత్పత్తుల్ని అమ్ముకుంటున్నారు. సరకుల మారకంలో కాంగో కరెన్సీ వాడకం ఎక్కువగా కనిపించలేదు.

సామ్రాజ్యవాద చిహ్నాలు కొన్నిచోట్ల మాత్రమే కనిపించాయి. ఖనిజ నిల్వలున్న కటంగా (ఇక్కడ పారిశ్రామిక కార్మికులున్నారు), డైమండ్ నిల్వలున్న కటంగా, కసాయి; మా ప్రాంతానికి సమీపంలోని మరో ప్రాంతంలో టిన్ నిల్వలున్నాయి. ఇక్కడి రైతులు పత్తి, వేరుశనగ సాగు చేస్తున్నారు. నూనె కోసం కొంతమేరకు పామ్ వృక్షాల్ని పెంచుతున్నారు. అయితే ఈ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ప్రాథమిక వ్యాపార సంబంధాలు మాత్రమే ఇక్కడ కనిపించాయి.

రైతుల కోసం విముక్తి సేన ఏం చేయగలదు? మమ్మల్ని ఎల్లవేళలా వేధించిన ప్రశ్న ఇదే. వ్యవసాయ సంస్కరణలు, భూపంపిణీ గురించి వారికి మేం బోధించలేం. ఎందుకంటే అది ఇప్పటికే జరిగివుంది కనుక. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కావాలంటూ వారి తరఫున వాదించలేం. వారు ఉత్పత్తి చేసేదంతా వారి కోసమే కనుక. తమ దగ్గరున్న ప్రాథమిక పనిముట్లతో వారి ఆహారాన్ని వారే మార్పిడి చేసుకుంటున్నారు. మార్కెట్ విస్తరణ కోసం వారు ప్రయత్నించడం లేదు. పారిశ్రామిక ఉత్పత్తుల వాడకం గురించి వారిని ప్రోత్సహించాల్సి ఉంది. వాటిని ఉపయోగించుకోవాలన్న కోరిక వారిలో ఉంది. వారి అవసరాలరీత్యా మార్కెట్ విస్తరణకు అవకాశముంది. అయితే యుద్ధ పరిస్థితుల మధ్య దీనిపై మేం శ్రద్ధ చూపలేకపోయాం.

రైతులపై జరిగే దోపిడీ గురించి వారికి చైతన్యం కలిగించాలనుకున్నాం. అయితే ఆ సమయంలో వారికి ఎదురవుతున్న అనుభవాలు వారిని అవమానించే విధంగా ఉన్నాయి. శత్రు దళాల ఆధీనంలోని ప్రాంతాల్లో మహిళలపై అత్యాచారాలు, పురుషులు, మహిళలు, పిల్లలపై మారణకాండ పెరిగిపోతున్నాయి. ఆహార సరఫరా, ఇతర సేవల కోసం శత్రు సైనికులు వారిపై

బలప్రయోగం జరుపుతున్నారు. ఆధునిక సైన్యం తమ కుటిల నీతిని వారిపై ప్రదర్శిస్తోంది. ఆహారపు కొరత సృష్టించి వారిలో వారికి శత్రుత్వాన్ని రగిలించేందుకు కుట్రలు చేసింది.

మరోవైపు వారికోసం మేమేం చేయగలం? వారికి తగినన్ని రక్షణలు కల్పించ లేకపోయాం. మా కథలో చెప్పింది అదే. సమాచారాన్ని అందుకోవడంలో గొప్ప వాహనంగా ఉండే విద్యను కూడా వారికి అందించలేకపోయాం. కొద్దిమంది క్యూబన్లు మాత్రం వారికి వైద్య సేవలందించారు. అయితే నాణ్యమైన మందులు, ఆరోగ్య కేంద్రాల్ని సమకూర్చలేకపోయాం. ఉత్పత్తి సంబంధాల్లో రైతులు భూమికోసం పోరాడే అవసరంలేనపుడు ఎలాంటి విప్లవ ఎత్తుగడల్ని అనుసరిం చాలనే దానిపై లోతైన పరిశోధన జరగాల్సి ఉంది. ఈ ప్రాంతంలోని ప్రధాన సామాజికవర్గం రైతులే. పారిశ్రామిక కార్మికులు లేరు. పెటీ బూర్జువాలు లేదా మధ్య తరగతి వర్గం ఇంకా ఆవిర్భవించలేదు.

ఇక్కడి విప్లవాన్ని నడుపుతున్న నాయకులు ఎలాంటి వారు? సౌలభ్యం కోసం వారిని జాతీయ, స్థానిక నేతలుగా విభజించి చెబుతా. నాకు తెలిసిన జాతీయ నేతల్లో కబీలా, మసెంగోలు మొదటి వరుసలో ఉంటారు. వీరిలో కబీలా స్పష్టత ఉన్న నాయకుడని కచ్చితంగా చెప్పగలను. హేతుబద్ధంగా ఆలోచించగల సామర్థ్య మున్న నేత. తన ఉనికిని చాటుకోవడంలో, అనుచరుల్ని సృష్టించుకోవడంలో దిట్ట. ప్రజలతో నేరుగా సంబంధాలు నెలకొలుపుకోవడంలో నైపుణ్యత సాధించిన నేత (ఇలాంటి గుణాలున్న నాయకులు చాలా అరుదు.). ఒక్కమాటలో చెప్పాలంటే జన సమీకరణలో సామర్థ్యమున్న నాయకుడు. మసెంగోలో నాయకత్వ లక్షణాలు చాలా తక్కువ. యుద్ధ క్రక్రియలో పరిజ్ఞానంగానీ, నిర్మాణ ప్రతిభగానీ ఈయనలో లేవు. సంఘటనల మధ్య మునిగిపోతారు. ఈయనలో చెప్పకోదగిన గుణమెల్లా కబీలా పట్ల ఎడతెగని విధేయత. తాను అనుకున్న ప్రణాళికను మించి పోరాటాన్ని కొనసా గించాలనుకుంటారు. తన అనుచరుల అభిప్రాయాలకు భిన్నంగా కూడా. అలాంటి వ్యక్తి నుంచి ఎక్కువగా ఆశించడం కూడా అన్యాయమే అవుతుంది. ఆయన చేయగలిగింది మాత్రం చేయగలరు.

సాధారణ సిబ్బందికి చెందిన అధిపతుల్లో ఏ విభాగంలోనూ ఏ ఒక్కరికి కూడా జాతీయ స్థాయి నాయకత్వ లక్షణాలు లేవు. భవిష్యత్లో ఆ దిశగా అభివృద్ధి చెందే అవకాశం మాత్రం కామ్రేడ్

ముజుంబాకుంది. ఇంకా ఆయన కాంగోలోనే ఉంటు న్నారు. ఆయనిపుడు ఏ పరిస్థితిలో ఉన్నారో తెలియదు. మా పరిశీలన మేరకు తెలివైన, స్పష్టత ఉన్న యువకుడు.

కాంగో జాతీయ నాయకుల్లో ములేలే ఓ పెద్ద మిస్టరీగా మిగిలిపోతారు. ఆయన్ని ఓ పిశాచిలా చూస్తారు. సమావేశాల్లో ఆయన ఏరోజూ కనిపించలేదు. పోరాటం మొదలైన నాటి నుంచీ ఏనాడూ తన జోన్ దాటి రాలేదు. ఆధిపత్య లక్షణాలున్న నేత. అయితే ఆయన తరపు రాయబారులిచ్చిన నివేదికలన్నీ ప్రపంచ విప్లవోద్యమ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నాయి.

ఇటీవల కొంత పలుకుబడి సాధించిన మరో నాయకుడు జనరల్ ఒలెంగా. అయితే ఈయన గురించి మాకు కొందరిచ్చిన సమాచారం సరైందా లేదా అన్నది చెప్పలేం. కానీ ఆ కథనం ప్రకారం ఈయనది ఎలాంటి త్యాగానికీ సిద్ధపడే వ్యక్తిత్వం కాదు. మేమక్కడున్న కొన్ని నెలలపాటు జరిగింది అదే. బహుశా, ఏళ్లతరబడి అలాగే చేస్తారో ఏమో! ప్రవాసంలో ఉంటున్న ఆ జనరల్ విప్లవోద్యమంలో ఓ మిథ్యగా మిగిలిపోతారు. కొందరు రాజకీయ నేతలు అలాగే చేస్తారు. కానీ, ఓ జనరల్‌గా ఫోన్ సంభాషణలపై ఆధారపడి, ఆపరేషన్స్ నిర్వహించడమే మింగుడుపడని విషయం. కైరో లేదా ఇతర రాజధాని నగరాల్లో ఉంటూ ఆయన తన వ్యవహారాల్ని నడిపిస్తున్నారు. మరో నేత సౌమాలియట్. ఈయన మధ్య స్థాయి విప్లవ నేత. సరైన గైడెన్స్, పర్యవేక్షణ ఉన్నపుడు విప్లవ కౌన్సిల్ అధ్యక్షుడిగా తన సేవలం దించారు. ఆయన ఎక్కువ కాలం పర్యటనలతో గడిపారు. విలాస జీవితాన్ని అనుభవించారు. ఈయన ప్రెస్ కాన్ఫరెన్స్‌లన్నీ సంచలనం సృష్టించేవే. ఈయనలో నిర్మాణ సామర్థ్యం లోపించింది. కబీలాతో ఈయనకున్న విభేదాల వల్ల రెండు వైపులా కుట్రలు జరిగాయి. ఫలితంగా విప్లవోద్యమం బలహీనపడి తాత్కాలిక ఓటమిని చవిచూసింది.

బెన్యే గురించి గొప్పగా చెప్పకునేందుకేమీ లేవు. ఒక్క మాటలో విప్లవ ప్రతీఘాతకులకు ఏజెంట్‌గా పనిచేశాడు.

కొందరు యువకులు విప్లవ నాయకత్వానికి తగిన విధంగా అభివృద్ధి చెందారు. అయితే వారిని వ్యక్తిగతంగా కలవలేకపోయా. ఇంకా వారు తమను వ్యక్తీకరించు కునే స్థాయికి ఎదగలేదు. స్థానిక నేతల్ని రెండు తరగతులుగా విభజించవచ్చు. మిలటరీ ఇంచార్జ్‌లు, రైతు నాయకులు.

మిలటరీ నాయకుల్ని సాధారణ పరిశీలన ద్వారా ఎంపిక చేశారు. వారికి సిద్ధాంత, వైజ్ఞానిక, మిలటరీ లేదా నిర్మాణాత్మక శిక్షణ ఏమీ లేదు. స్థానికంగా ఆయా తెగల్లో వారికున్న పలుకుబడినే కొలమానంగా తీసుకున్నారు.

స్థానిక రైతు నాయకుల్లో రెండు తరగతులవారున్నారు. చైర్మన్లు, కపిటాలు. లుముంబా పాలనా కాలం నుంచీ వీరు గ్రామ నాయకులుగా ఎంపికవుతున్నారు. పౌర సమాజానికి వీరే అధికార ప్రతినిధులు. తెగల సంప్రదాయానుసారమే వీరి ఎంపిక జరుగుతోంది. వీరిలో ఎక్కువ భాగం సంప్రదాయ భావాల్ని అనుసరించే వారే. కొద్దిమంది మాత్రమే ప్రగతిశీల భావాల్ని కలిగి ఉన్నారు. వీరిలో కొందరికి విప్లవ చైతన్యం ఉంది. అయితే ఏ ఒక్కరు కూడా కనీసం మధ్యస్థాయి రాజకీయ నేతలుగా కూడా ఎదగలేదు. రైతు సమూహాలు వీరి ఆదేశాల్ని పాటిస్తాయి. దళాలకు ఆహారాన్ని సమకూర్చడం, నిత్యావసరాల్ని ఓ చోటి నుంచి మరో చోటికి తర లించడం, ఇళ్ల నిర్మాణంలాంటి విషయాల్లో వీరి సహకారం తప్పనిసరి. ఇలాంటి సమస్యల్ని పరిష్కరించడంలో మధ్యవర్తులుగా వ్యవహరించడం మినహా వీరు చేసిన రాజకీయ కార్యకలాపాలేమీ లేవు.

ఇక్కడి ఉద్యమానికి రాజకీయ ప్రతినిధులున్నారు (పొలిటికల్ కమిస్సార్స్). సోషలిస్ట్ విముక్తి సేన లేదా ప్రజా సైన్యం ఈ పదాన్ని వాడుకలోకి తెచ్చింది. పలు విముక్తి పోరాటాల గురించి, కామ్రేడ్ల వీరత్వం, వారి త్యాగాల గురించిన కథనాలు తెలిసిన వారినే కమిస్సార్లుగా భావిస్తారు. అలాంటి వారిని కాంగోలో గుర్తించడం సాధ్యం కాదు. ఇక్కడ కమిస్సార్లను ఓ స్థాయి విద్యావంతుల నుంచి ఎంపిక చేస్తారు. దాదాపు ఫ్రెంచ్‌లో మాట్లాడగలిగే వారే అందుకు ఎంపికవుతారు. ఇలాంటి వారంతా పట్టణ పెటీ బూర్జువా కుటుంబాల నుంచి వచ్చినవారే. వీరి కార్యక్రమ మెల్లా అప్పుడప్పుడూ సమావేశాలు నిర్వహించి కొన్ని ప్రత్యేక సమస్యలపై ఉపన్యాసా లివ్వడం. వీరి ఆదేశాల్ని దళాలు అమలు చేశాయే తప్ప, కొద్దిమందిని మిన హాయించి వీరెవరూ ప్రత్యక్షంగా పోరాటాల్లో పాల్గొన్నవారు కాదు. తమ శరీరాల్ని కాపాడుకుంటూ, మంచి ఆహారం తీసుకుంటూ, ఖరీదైన బట్టలు ధరించడానికే వీరు ప్రాధాన్యత ఇచ్చారు. అప్పుడప్పుడూ ఆటవిడుపుగా సమీపంలోని గ్రామాల్లోకెళ్లి "పోంబే' అనే నాటు సారా తాగుతూ ఎంజాయ్ చేసేవారు.

తమ అలసత్వంతో కాంగోలోని పొలిటికల్ కమిస్సార్లు విప్లవోద్యమాన్ని బలోపేతం చేయలేకపోయారు. సూత్రరీత్యా వీరి పని విధానం సరిగ్గా ఉంటే నిఖార్సైన విప్లవకారుల్ని తీర్చిదిద్ది, ప్రజా సైన్యాన్ని నిర్మించడంలో వీరిదే కీలకపాత్ర కావాలి.

రైతులే దళాల నిర్మాణానికి ముడిసరుకు. సైనిక దుస్తులు ధరించి రైఫిల్ పట్టుకోవడమంటే వారికి ఎంతో మోజు. కొన్ని సందర్భాల్లో బూట్లు ధరించేందుకు కూడా. వీటితోపాటు స్థానికంగా ఆధిపత్యం ఉంటుందన్న ఆశ. అయితే అలసత్వం, అవినీతి వీరి బలహీనతలు. ఎలాంటి రాజకీయ చైతన్యం లేకపోవడంతో శత్రువు పట్ల, మరణం పట్ల సంప్రదాయిక భయాందోళనలు వీరిని వెంటాడాయి. గిరిజన సంప్రదాయాల్ని వదిలి భవిష్యత్తు దర్శించగల విప్లవ చైతన్యం వీరిలో కొరవడింది. త్యాగనిరతితో కూడిన పోరాట స్ఫూర్తిని అలవరచుకోలేక సోమరితనంతో క్రమ శిక్షణారాహిత్యంలో కొట్టుమిట్టాడారు. వారికి వారి నాయకుల మీద నమ్మకం లేదు (నాయకులంటే వారి దృష్టిలో పోంబే తాగుతూ, పుష్టిగా తిని మగువల మధ్య కులాసాగా గడిపేవారు). వారికి ఎలాంటి పోరాట అనుభవాలు లేవు. అవి వారి అనుభవంలోకి రావాల్సి ఉంది. పోరాటమంటే కేవలం మనుషుల్ని చంపే ఓ క్రీడగానే వారు భావిస్తున్నారు. మేం అక్కడ ఉన్నన్ని రోజులూ వ్యాయామం, డ్రిల్ తప్ప యుద్ధంలో ఎలాంటి శిక్షణా వారు తీసుకోలేదు. ఇలాంటి లోపాల వల్లే కాంగో విప్లవకారులు అత్యంత బలహీన యోధులకు ఓ ఉదాహరణగా నిలిచారు. ఇప్పటి వరకూ ఇంతటి బలహీనుల్ని నేనెక్కడా చూడలేదు.

ఒకవేళ అక్కడి నాయకత్వం పూర్తిస్థాయిలో మాకు సహకరించి ఉంటే, ఇలాంటి వారిని సైతం విప్లవ సైనికులుగా తీర్చిదిద్దగల అవకాశముండేది. అయితే ఉన్నత స్థాయి నాయకత్వానికి అలాంటి ఆసక్తి లేకపోవడంతో, స్థానిక నాయకుల నుంచి అడ్డంకులుండటంతో ఏమీ చేయలేకపోయాం.

ఏదో ఒక సోషలిస్ట్ దేశంలో ఆరు నెలలపాటు శిక్షణ పొందినవారే రాజకీయ ప్రతినిధి లేదా ఆయుధాల ఇన్‌స్ట్రక్టర్లుగా వచ్చారు. ఈ విద్యావంతుల్లో ఎక్కువ భాగం బల్గేరియా, సోవియట్ యూనియన్, చైనాల్లో శిక్షణ పొందినవారే. ఇలాంటి వారితో అద్భుతాలు సాధించలేం. ప్రాథమిక ఎంపికే చాలా చెడ్డగా ఉంది. వారు వృత్తి విప్లవకారులు లేదా పోరాట పరీక్షలో నెగ్గినవారు

కానిపక్షంలో ఆ ఎంపిక లాటరీ పద్ధతిన జరిగిందనే చెప్పగలను. అలాంటివారు వ్యక్తిగతంగా దేనికి ప్రాధాన్యత ఇస్తారో అదే వారిలో వ్యక్తమవుతుంది. కార్యకర్తల్ని రక్షించుకోవడంలో అభివృద్ధి పరచిన కార్యాచరణ అంటే అది తమను తాము రక్షించుకోవడమే అన్నది వారి చర్యల్లో వ్యక్తమైంది. విదేశాల్లో నేర్చుకున్న విప్లవ భావాల్ని వారు తమకు అను కూలంగా మార్చేసుకున్నారు. వారు ఏ రోజున కూడా పోరాటంలో భాగస్వాములు కాలేదు. వారు కేవలం ఇన్‌స్ట్రక్టర్లుగానే ఉండిపోయారు. కొందరిని మినహాయిస్తే వారెవరూ ఆచరణలో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. మార్క్సిజం-లెనినిజం పేరుతో సమాంతర రాజకీయ నిర్మాణాలు చేపట్టి విప్లవశక్తుల మధ్య విభజనకు కారణమయ్యారు. నా దృష్టిలో ఈ దుష్ఫలితాలన్నిటికీ కారణం, వారి ప్రాథమిక ఎంపికలోనే ఉంది. చైతన్యవంతులకు సరైన విద్య ఉంటే అది ఓ అదనపు అర్హతగా ఎంతో ఉపయోగపడుతుంది. అయితే ఈ పెంపుడు విప్లవకారులు సోషలిస్ట్ దేశాల్లో ఉంటూ కొన్ని నెలలపాటు అభివృద్ధి చేసుకున్న వారి పాండిత్యం ద్వారా నాయకులు అవుతారేగాని వారివల్ల ఉపయోగమేమీ ఉండదు.

ఓటమి తర్వాత మిగిలిందేమిటీ? అంటూ మనలో మనం ప్రశ్నించుకోవాలి. మిలటరీ దృష్టితో చూస్తే పరిస్థితి భయం గొలిపేలా ఏమీ లేదు. మనం కోల్పోయింది కేవలం మన ఆధీనంలోని చిన్నచిన్న గ్రామాల్ని మాత్రమే. అయితే వాటి చుట్టుపక్కల మన దళాలు ఇంకా ఉనికిని కోల్పోలేదు. కొంత సైనిక సామగ్రితోపాటు కొన్ని ఆయుధాల్ని మాత్రమే కోల్పోయాం. శత్రు దళాలు, అవి ప్రయాణించిన మార్గంలోని ప్రాంతాల్ని మాత్రమే ఆక్రమించాయి. మనం గమనించాల్సిన ముఖ్యాంశం ఇది. రాజకీయ దృష్టితో చెప్పాలంటే చెల్లాచెదురైన మన దళాలు పునస్సమీకరణ జరుపుకో నున్నాయి. వాటి బీజాల నుంచే భవిష్యత్ గెరిల్లా సైన్యం రూపొందనుంది. వాస్తవ పరిస్తితిని సమీక్షించి చూస్తే పిజీ-బరాకా ప్రాంతంలోని శత్రు దళాలు, ఆ ప్రాంతాన్ని పూర్తిగా ఆక్రమించడంగానీ, లేదా శాశ్వతంగా అదుపులోకి తీసుకోవడంగానీ చేయలేకపోయాయి. ఉవీరాలో నిర్మాణపరంగా మన దళాలు బలంగా ఉన్నాయి. బరాకా నుంచి బుకావు వైపు వెళ్లే ప్రధాన రహదారిపై అదుపు కలిగి ఉన్నాయి. ముకుంది, ముజుంబాల్లోనూ నిర్మాణ బీజాలున్నాయి. అక్కడి వారిలో పోరాటం పట్ల రాజకీయ అవగాహన ఉంది. కబింబాలోనూ మనకింకా కొన్ని

దళాలున్నాయి. వారి దగ్గర నాణ్యమైన ఆయుధాలే ఉన్నాయి. కబేంబేర్, కసెంగో పర్వత ప్రాంతం లోనూ మనకు కొంత నిర్మాణం ఉంది. అయితే కొంతకాలం నుంచీ ఆ ప్రాంతంతో మన సంబంధాలు తెగిపోయాయి.

ఇక్కడో ముఖ్య విషయం గుర్తుంచుకోవాలి. ఈ బృందాల మధ్య సంబంధాలు చాలా తక్కువ. పైనుంచి వెళ్లే ఆదేశాల్ని చాలా తక్కువ ఆచరిస్తారు. తమ ప్రాంతాల్ని దాటి ఇతర ప్రాంతాల్లోకి వెళ్లాలన్న కాంక్ష వీరిలో చాలా తక్కువ. ఈ కారణాల వల్ల ప్రస్తుత పరిస్థితిని, మరో నూతన సైనిక నిర్మాణానికి పిండస్థ దశగా చెప్పలేం. గతానికి అవశేషంగానే మిగిలిపోతారు. ఈ ప్రాంతంలో దాదాపు 4 నుంచి 5 వేల ఆయుధాలు చెల్లాచెదురయ్యాయి. నిర్మాణం లేకుండానే రైతులకు వాటిని పంపిణీ చేశారు. వాటన్నిటినీ తిరిగి రాబట్టడం అంత సులభం కాదు. కొన్ని భారీ ఆయు ధాల్ని కూడా నష్టపోయాం. వాటిసంఖ్య ఎంత అనేది కచ్చితంగా చెప్పలేను. సరైన నాయకత్వ లక్షణాలున్న ఒక్క నాయకుడున్నా తూర్పు ఫ్రంట్‌లో కూడా మంచి ఫలితాలు సాధించి ఉండేవాళ్లం. తాజాగా, సౌమాలియట్, కబీలాలతో తీవ్రంగా విభేదించే ఓ వ్యక్తి గురించి విన్నాం. ఆయన పేరు ఎంబేగిరా, విప్లవ కౌన్సిల్ విదేశీ వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. ఈయన ఉవీరాలో పని చేస్తున్నారు. అయితే పూర్తి వివరాలు తెలియకుండా ఆయన గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేం. కాంగో పోరాటానికి అవసరమైన నాయకత్వ సామర్థ్యం ఆయనలో ఉందా లేదా అన్నది జరిగే పరిణామాలే నిర్ణయిస్తాయి.

శత్రు సైన్యపు గుణగణాలేమిటి? బెల్జియన్ల వలస కాలం నుంచీ కొనసాగిన కాంగో సైన్యపు పాతకాలపు వారసత్వ లక్షణాలు. సరైన నాయకత్వంగానీ, పోరాట స్ఫూర్తిగానీ వారికి లేవు. విప్లవాల ఒరవడికి అవన్నీ కొట్టుకుపోయాయి. నైతికంగా దెబ్బతినడంతో ఎలాంటి పోరాటం లేకుండానే పట్టణాల్ని వదిలేసింది (సింహాలు : కాంగో విముక్తి సేనకు మారు పేరు, ఫలానా పట్టణాన్ని ఆక్రమించేందుకు వస్తున్నా యంటూ ఫోన్ ద్వారా తెలిసినా సరే ప్రభుత్వ దళాల్ని ఉపసంహరించిన సందర్భా లున్నాయి). ఓటమి అనుభవాలతో అమెరికన్, బెల్జియన్ ఇన్‌స్ట్రక్టర్ల నీడతోత్రి వెళ్లిపోయింది. వారి నేతృత్వంలోనే మరోసారి సైనిక సామర్థ్యాన్ని సంతరించుకుంది.

యుద్ధపు చివరి దశలో కిరాయి తెల్ల సైనికుల సాయం తీసుకున్నారు. వీరిలో శిక్షణ పొందిన క్రమశిక్షణ గల కార్యకర్తలున్నారు. తెల్ల సైనికులు పోరాటాల్లో చురుగ్గా ఉన్నారు. వారిని నల్ల సైన్యం అనుసరించింది. అయితే వారి ఆయుధాలు ఏమంత ఆధునికం కాదు. వారి పడవలు మాత్రం సరస్సు దగ్గర మనకు అడ్డంకులు కలి గించాయి. యుద్ధ విమానాలు కూడా పాతవే. వాటి వల్ల పెద్ద ప్రమాదమేమీ లేదు. పదాతి దళాల్ని చివరి దశలో ఉపయోగిస్తున్నారు. షోంబే సైన్యంతో పోలిస్తే మన పదాతి దళాలే శక్తివంతంగా ఉన్నాయి. మనకు మంచి ఆయుధాలున్నాయి. అయితే ఇది అర్థం చేసుకోవడం కొంత కష్టమైందే.

ఇలాంటి యుద్ధాల్లో శత్రు ఎత్తుగడలు సులభమైనవే. దళాలపై, జన సమ్మర్ద ప్రాంతాలపై వైమానిక దాడుల్ని కేంద్రీకరిస్తారు. చివరి దశలో యుద్ధ విమానాల నీడలో ప్రధాన రహదారులపైకి పదాతి దళాన్ని ప్రవేశపెట్టారు. అప్పటికే మన దళాలు ధైర్యం కోల్పోవడంతో మనకు బలమైన కేంద్రాలుగా పర్వత ప్రాంతాల్ని ఒకటొకటిగా ఆక్రమిస్తూ ముందుకు కదిలాయి. ఎలాంటి పోరాటం లేకుండానే అవి వారి ఆక్రమణలోకి వెళ్లిపోయాయి. ఇలాంటి సైన్యానికి అడ్డుకట్ట వేయాలంటే ఊహించని గట్టి దెబ్బ కొట్టాలి. భౌగోళిక పరిస్థితుల పట్ల అవగాహన ఉంటే అందుకు అవసరమైన ఎత్తుగడల్ని రూపొందించడం సులభమే.

ఇక మన సొంత (క్యూబన్) సైన్యం గురించి విశ్లేషిస్తే మనలో ఎక్కువ భాగం నల్లవారే. కాంగోవాసులతో ఐక్యమైపోవడానికి ఇది మనకున్న అనుకూలాంశం. అయితే ఆ దిశగా తగిన చర్యలు జరగలేదు. వాస్తవానికి తెలుపు, నలుపు అనేవి మన మధ్య విభేదాలకు కారణం కాకూడదు. వ్యక్తుల ద్రోహబుద్ధిని గ్రహించే శక్తి కాంగోవాసులకుంది. అందుకు తెల్లవాడినైన నా పట్ల వారి ఆదరణే ఓ ఉదాహరణ. ఓవిధంగా వారి సంస్కృతిని అర్థం చేసుకోవడంలో మన వాళ్లే రాజకీయంగా వెనకబడి ఉన్నారు. కొన్నిసార్లు ఎంతో ఆశావాదంతో ముందుకు వెళ్లారు. వారితో వైషమ్యాలు తలెత్తక ముందు నాపైనే కొందరు విరుచుకుపడ్డారు. పరిస్థితుల్ని టాటూ మిలటరీ దృష్టితో చూస్తున్నారని, పిరికితనంతో వ్యవహరిస్తున్నారంటూ దుయ్య బట్టారు. ఓ చివర నుంచి మరో చివరకు దూసుకుపోగలమని, మమ్మల్ని ఏ అవాంతరాలూ అడ్డుకోలేవనీ, ఆ దేశాన్ని విముక్తి చేశాకే

హవానాకు తిరిగి వెళ్తామంటూ ప్రగల్భాలు పలికారు.

యుద్ధం సమాప్తి కావడానికి 3 నుంచి ఐదేళ్లు పడుతుందంటూ నేను అనేకసార్లు హెచ్చరించా. అపుడు నా మాటల్ని ఏ ఒక్కరూ విశ్వసించలేదు. వారంతా విజయ పథంలో దూసుకుపోగలమంటూ కలలుకన్నారు. సుదీర్ఘ ఉపన్యాసాలతో, గొప్ప సత్కారాలతో వీడ్కోలు తీసుకొని, మెడల్స్‌తో సహా హవానాకు తిరిగి వెళ్లగలమని ఊహించారు. అయితే వాస్తవ పరిస్థితి వారికి షాక్ కలిగించింది. ఆహారపు కొరత, కనీసం ఉప్పు కూడా లేని పచ్చి కాసవా దుంపలు లేదా బుకాలి, మందుల కొరత, బట్టలు, బూట్లు కూడా లేని దుస్థితి. చివరికి అనుభవజ్ఞులైన క్రమశిక్షణ గల మన సైనికుల్ని కాంగోవాసులతో కలిపి మిశ్రమ దళాన్ని ఏర్పాటు చేయాలన్న నా కల వాస్తవ రూపం దాల్చకుండాపోయింది.

అక్కడి వారితో సమైక్యత సాధించలేకపోయాం. అయితే దీనికి మనుషుల చర్మపు రంగును నిందించలేం. వాస్తవానికి కొంతమంది క్యూబన్లు చాలా నల్లనివారు. అయినా, కాంగోవాసుల్ని వారు తమతో సమానంగా చూడలేకపోయారు. నాతో ఒకరు ఇలా అన్నారు "మీ దగ్గర అదనంగా ఉన్న నల్లవారిలో ఇద్దరిని మా దగ్గరికి పంపండి" ఇక్కడ వారిద్దరూ కాంగోవాసులని అర్థం.

మా మనుషులు విదేశీయులు. తమకు తాము అధిమానవులుగా భావించు కుంటారు. గతంలో విదేశీ సెటిలర్ల వల్ల తమకు జరిగిన అవమానాల కారణంగా కాంగోవాసులు ఎంతో సున్నిత మనస్కులు. దాంతో క్యూబన్లు ఎవరైనా వారిని ఎగతాళి చేస్తూ, సంజ్ఞలు చేస్తే చాలు చలించిపోయేవారు. ఆహారం అందరికీ సమానంగా అందించడంలోనూ విఫలమయ్యా బరువులు మోసే పని కాంగో వాసులకే ఎక్కువగా అప్పజెప్పారన్న మరో అపవాదు క్యూబన్లపై ఉంది. ఇలాంటి వైరుధ్యాలకు అనేక కారణాలున్నాయి. క్యూబన్ల చేత కాంగోలకు బదులు కాంగో వాసులంటూ గౌరవప్రదంగా అనిపించడంలోనూ వైఫల్యం చెందా. ఇలాంటివే ఆత్మీయంగా సాన్నిహిత్యాన్ని పెంచుకోవాల్సిన చోట శత్రుత్వపు విషబీజాల్ని నాటాయి. మా మధ్య భాష మరో అడ్డంకి. దాంతో ఓ సైనిక శక్తిగా కాంగో జనాలతో కలసిపోవడం ఎంతో కష్టమైంది. మాలో కొందరు అక్కడికి వెళ్లిన దగ్గరి నుంచీ కాంగోవాసులతో స్నేహం చేస్తూ, వారి మాతృభాష స్వాహిలీ నేర్చుకునేందుకు

యత్నించారు. అయితే వారు కూడా సగం తప్పులు మాట్లాడటం, అపార్థాలకు అవకాశమిచ్చింది. సంబంధాలు చెడిపోయేందుకు కారణమైంది.

మా దళాల ఉపసంహరణ ఎలా జరిగిందో వివరించేందుకు యత్నిస్తా. అది ఒక్కసారిగా కాకుండా ఓ క్రమంలో జరిగింది. ఓటమి ఎదురైన ప్రతి సందర్భం లోనూ పేలుడు సామగ్రినంతా ఓ చోట చేర్చి తగులబెట్టాం. అంటు జాడ్యం వ్యాపించిన క్రమం; ఫ్రంట్ డీ ఫోర్స్‌లో పరాజయంతో మొదలైంది; కబెంగా నుంచి కాంగోవాసులు పారిపోవడం, ఇక్కడే ఎక్కువమంది అనారోగ్యానికి గురయ్యారు: వ్యక్తిగతంగా నా చేదు అనుభవం. గాయపడ్డ వ్యక్తిని మోసుకుపోవడంలో ఎదురైన ఇబ్బందులు, ఆ సమయంలో కాంగోవాసులు అందించిన సాయం చాలా తక్కువ. చివరికి మన దళాలన్నీ ఉపసంహరణకు సిద్ధమయ్యాయి. ఎదురైన ప్రతి ఓటమీ మన నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. చివరికి మన పోరాట శక్తిని క్రుంగదీసింది.

చివరి దశలో సరస్సు దగ్గరికి చేరుకోవాలన్న అంటు జాడ్యంతో అంతా బాధపడ్డారు. ఇంటిబెంగ ఎక్కువైంది. పోరాటం నుంచి తప్పుకొని క్షేమంగా ఇళ్లకు చేరాలన్న ఆలోచనతో తమకు తాము అనారోగ్యవంతులుగా చెప్పుకునేందుకు ఆరాటపడ్డారు. సరస్సు ఆవలి ఒడ్డుకు క్షేమంగా చేరుకోవడంపైనే దృష్టి కేంద్రీక రించారు. క్రమశిక్షణారాహిత్యం వెర్రితలలు వేసింది. హాస్యాస్పద సంఘటనలకు అవకాశమిచ్చింది. అలాంటి కొందరిపై కఠిన శిక్షలు అమలు చేయాలనుకున్నాం.

నిష్పాక్షికంగా విశ్లేషించి చెప్పకుంటే నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడంలో క్యూబన్లనే బాధ్యుల్ని చేయడం న్యాయమవుతుంది. అయినా, చాలామంది చివరి వరకూ కొనసాగారు. అయితే వారు కూడా పోరాట స్ఫూర్తితోగాక క్రమశిక్షణగా, బాధ్యతగా భావించడం వల్ల. నేను మన బలహీనతలపైనే ఎక్కువగా దృష్టి సారించానని ఎవరైనా భావిస్తే అది నిజమే అవుతుంది. ఇక్కడ మనం ఓటమికి కారణాల్ని విశ్లేషిస్తున్నపుడు వాటి గురించే ప్రధానంగా చర్చించాలి. వరుసగా జరిగిన ప్రతి కూల సంఘటనలే అందుకు కారణమయ్యాయి.

ఇప్పుడు మాకెదురైన సమస్యల్ని ఆఫ్రికా పోరాటపు తర్వాతి దశల్లో ముందుగానే తొలగించుకోవడం చాలా కష్టమైన పనే. అభివృద్ధిలో అట్టడుగున ఉన్న దేశాలకు ఇది వర్తిస్తుంది.

కాంగో విప్లవానికి ఎంతో అనుకూల పరిస్థితులున్నాయంటూ మా కామ్రేడ్లలో ఒకరు ఎంతో ఉత్సాహంగా చెప్పారు. ఆ మాటలు కొంత వ్యంగ్యంగా అనిపించినా, విశాల దృష్టితో చూస్తే నిజం లేకపోలేదు. అలాంటిది సాధ్యం కావా లంటే క్యూబన్ విప్లవ ప్రారంభ దశలో సియేరామీస్త్రా రైతు పోరాటపు విప్లవ స్ఫూర్తి ఇక్కడి ఉద్యమకారుల్లో అభివృద్ధి చెందాలి.

మిలిటెంట్లకు నిర్దేశించాల్సిన కర్తవ్యాల గురించి మనం కనుగొనాల్సి ఉంది. వాస్తవ పోరాటంలో వారు ఎదుర్కొనే హింస, గాయాల బాధలను అధిగమించేలా చేయడానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. అసలు కార్యకర్తల ఎంపిక పద్ధతులే కఠినంగా ఉండాలన్నది నా ఆలోచన. దీంతోపాటు వారి కర్తవ్యాల పట్ల ముందుగానే హెచ్చరించాలి. విప్లవం విజయవంతం కావడానికి మూడు నుంచి ఐదేళ్లు పడు తుందని ముందే చెప్పా. అయితే నా మాటల్ని అపుడు ఎవరూ విశ్వసించలేదు. దాంతో, ఇపుడు ఎదురైన అనుభవం వారిని బాధతో క్రుంగిపోయేలా చేసింది. వారి కల ధ్వంసమైపోయింది. విప్లవ కార్యకర్తలెవరూ ఇలాంటి పోరాటాన్ని ప్రారం భించేటపుడే కలలు కనకూడదు. అన్నీ వదిలేసి తమ జీవితాల్ని పణంగా పెట్టాల్సి ఉంటుంది. విప్లవ శక్తితో పని చేసే అలాంటి కార్యకర్తలు సరాసరి వ్యక్తుల కంటే ఎంతో ఉన్నతులు (విప్లవ దేశాల్లోని సరాసరి వ్యక్తుల కంటే కూడా). పోరాట అనుభవం, ఉన్నతస్థాయి రాజకీయ చైతన్యం, కఠోర క్రమశిక్షణ విప్లవ సైనికుల విశిష్ట లక్షణాలు. కొత్తగా సభ్యుల్ని చేర్చుకోవడం ఓ క్రమంలో జరగాలి. వీరోచిత లక్షణాలున్న చిన్న బృందంతో ప్రారంభం కావాలి. నిర్దేశిత సూత్రాలకనుగుణంగా కొత్తసభ్యులు లేనపుడు తొలగించాలి. మరో మాటలో చెప్పాలంటే, కార్యకర్తల ఎంపిక పద్ధతికనుగుణంగా ఉండాలి. ఈ రీతిన ఉద్యమస్ఫూర్తి బలహీనపడకుండా సభ్యుల సంఖ్య క్రమంగా పెంచుకోవాలి. దాంతో, స్నేహ దేశాల సహాయ కార్యకర్తల సంఖ్య కూడా పెరుగుతుంది. మనం సాదాసీదా పాఠశాల ఉపాధ్యాయులం కాదు. విప్లవ పాఠశాలల్లో అధ్యయనం చేసినవాళ్లం.

మనమెదుర్కొన్న మరో సమస్య సహాయక బేస్ క్యాంప్‌కు సంబంధించి. భవిష్యత్లో దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. పెద్దమొత్తంలో నిధులు దుర్విని యోగమయ్యాయి. అవి దురాశపరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. క్షేత్రస్థాయిలో పోరాడుతున్న దళాలకు మాత్రం ఆహారం,

సైనిక సామగ్రి తక్కువ మొత్తంలో అందాయి. ఆపరేషన్ జోన్‌లో కమాండ్ అధికారులుగా వివాదరహితుల్ని నిఖార్సైన వారినే ఎంపిక చేయాలి. సహాయక బేస్‌క్యాంప్‌పై కఠినమైన అదుపు వారికుండాలి. ఉన్నతస్థాయి విప్లవ కేంద్రాల దీర్ఘకాలిక పరిశీలన ద్వారా ముందస్తుగానే వారి ఎంపిక జరగాలి. యుద్ధ సమయంలో 24 గంటల్లో ఓ వ్యక్తి ప్యాకెట్ సిగరెట్లు కాల్చాడంటే అతనేమీ చేయలేదని అర్థం. అదే వంద ప్యాకెట్లంటే ఎంత వృథా అయినట్లో అర్థం చేసుకోగలం.

ఇక నా సమయం వచ్చింది. మిగతా అన్ని విశ్లేషణలకన్నానా గురించి విశ్లేషణ ఎంతో భిన్నంగా ఉంటుంది. ఆత్మవిమర్శ చేసుకోవడంలో నాకు సుదీర్ఘ అనుభవ ముంది. నా గురించి నేను నిర్ధారించుకున్నవి ఇలా ఉన్నాయి. విప్లవ కమాండ్లో నా సంబంధాల విషయంలో కొన్ని అసహజ అడ్డంకుల మధ్య కాంగోలోకి ప్రవేశించా. ఈ ప్రతికూలతను అధిగమించడం నాకు సాధ్యం కాలేదు. అయితే అక్కడ గడిపిన ఎక్కువ సమయం సంతృప్తిగానే గడిచింది. కానీ కొన్ని సందర్భాల్లో జరిగిన సంఘటనలపై నేను స్పందించిన తీరు అదుపు తప్పింది. ఎదుటివాళ్ల మనసు గాయపడేలా కఠినంగా దూషించా. అయితే వారు ద్రోహ బుద్ధితో వ్యవహ రించారనే. ఒకే ఒక్క బృందంతో మాత్రం నా సంబంధాలు ఆత్మీయంగా సాగాయి. అది రైతులతో, రాజకీయ దృష్టితో వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించడంవల్లే నేనీ విజయం సాధించా. అయితే తగినంతగా స్వాహిలీ నేర్చుకోలేకపోయా. అక్కడి పరిస్థితులపై అవగాహన కోసం ఎక్కువ సమయం నాయకులతో ఫ్రెంచ్లో సంభాషించడంపైనే ఆధారపడ్డా. దాంతో కింది స్థాయి వారికి దూరమయ్యా నాంలో సంకల్ప బలం లోపించడంవల్లే ఈ విషయంలో తగినంత శ్రమించలేకపోయా.

మానవ సంబంధాల విషయంలో త్యాగపూరితంగా వ్యవహరించాననే భావి స్తున్నా నాపై ఎవరూ ఎలాంటి ఆరోపణలూ చేయలేదు. నాకున్న రెండు బల హీనతల్ని క్రాంగోలో సంతృప్తిగా తీర్చుకున్నా పొగాకు చాలా తక్కువసార్లు మాత్రమే అందలేదు. రెండోది పుస్తక పఠనం: అన్నివేళలా వీలు కలిగింది. ఇబ్బంది కలిగించినవి; అరిగిపోయిన బూట్లూ, మురికి బట్టలు, ఒకే రకపు ఆహారం. అయితే నాతోపాటు మిగతావారు కూడా ఇదే పరిస్థితిలో జీవించినందున వ్యక్తిగతంగా నాకిది త్యాగం కాదు. నేను చాలా కష్టపడ్డా. అయితే నా శక్తికి మించి కాదు.

నేను అన్యాయంగా వ్యవహరించలేదని చెప్పగలను. ప్రస్తుతం, సాధారణ సైన్యం అనుసరించే పద్ధతికి భిన్నమైన పద్ధతిని అనుసరించా. ఆహారం తీసుకోకుండా పోరాటానికి వెళ్లడం. గెరిల్లా యుద్ధాల్లో మంచి ఫలితాల్ని సాధించిన అనుభవం నాకుంది. మొదట నేను నైతిక సూత్రాల్ని ప్రయోగించా. వైఫల్యం చెందా. పరిస్థితుల పట్ల నా అవగాహనతో మిగతా వారిని ఏకీభవింపజేయ ప్రయత్నించా. వైఫల్యం చెందా. "భవిష్యత్ పట్ల ఆశావాదంతో ఉండేందుకు వారు సిద్ధంగా లేరు. వర్తమానంలోని కారుమబ్బుల్ని చూసి కంగారుపడ్డారు".

నిర్ణయించుకునే సమయం వచ్చినపుడు ఉన్నత త్యాగానికి సిద్ధపడలేకపోయా. నా మానసిక స్థితి, నా అంతరంగం అందుకు అడ్డుపడ్డాయి. ఆ సమయంలో కాంగోలోనే ఉండిపోవడం నాకు సులభమైందే. "పోరాటయోధుల దృష్టితో చెప్పా లంటే యుద్ధ ద్వారం మూసుకుపోయినపుడు అక్కడే ఉండి అనుకూలతను సృష్టించాలి". నా భవిష్యత్ కార్యాచరణ దృష్టితో మాత్రం అక్కడే ఆగిపోవడం సరైంది కాదు. రెండు రకాల నిర్ణయాన్ని తూకం వేసి చూశా. అక్కడ ఇంకా మిగిలివుంది స్వల్ప సంఖ్యలో, అది కూడా మేమే. వైఫల్యం చెందిన ఆ స్థితిలో సాయమందిం చేందుకు ఎవరూ ముందుకు రాని దుస్థితి.

ఫిడేల్‌కు నేను రాసిన వీడ్కోలు ఉత్తరం చివరి రోజుల్లో మా సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపింది. అయితే ఆ లెటర్లో నేను ప్రస్తావించిన విషయాలు పూర్తిగా అనుభవపూర్వకమైనవి. అంటే కొన్నేళ్ల క్రితం వారితో నాకెదురైన అనుభవం అలాంటిది. సియెర్రాలో నా ఉద్యమ జీవితం ప్రారంభమైనపుడు క్యూబన్ కామ్రేడ్లు నన్ను ఓ విదేశీయుడిగానే చూశారు. అక్కడి నుంచి ఇక్కడికి బయలుదేరినపుడు, ఇపుడు తిరిగి వెళ్తున్నపుడు అదే పరిస్థితి. కొన్ని కనీస వస్తువులు అందరికీ లేని పరిస్థితి ఉంది. అలాంటి వాటిని నేను త్యజించా. అయితే వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ వాటిని పవిత్రంగా భావిస్తారు; కుటుంబం, భూమి, తమను చుట్టి ఉండే పరిసరాలు. ఈ లెటర్ క్యూబాకు ఎంతో అనుకూలంగా తయారైంది. నన్ను మాత్రం ప్రపంచం లోని పోరాట యోధులకు దూరం చేసింది.

ప్రాపంచిక దృష్టితో కూడిన ఈ మానసిక భావన పోరాట విశ్లేషణకు అతీతంగా ఉంటుంది.

కేంద్రక భావనపట్ల నాకు ఇప్పటికీ విశ్వాసముంది. నేను క్యూబన్ల బృందానికి నాయకుడిని. అయితే ఒకటికి మించి ఏ కంపెనీ బలంగా లేదు. అలాంటి స్థితిలో ప్రజా సైన్యాన్ని బలోపేతం చేసి విజయం దిశగా నడిపే బాధ్యత నాది. నా ప్రత్యేక పరిస్థితి మాత్రం నన్ను ఓ సైనికునిగా మలచిన ఓ విదేశీ శక్తికి ప్రతినిధి పాత్ర. క్యూబన్లకూ, కాంగోవాసులకూ ఇన్‌స్ట్రక్టర్‌గా వ్యూహాలు పన్నే ఉన్నతస్థాయి రాజకీయవేత్త పాత్ర. అయినా విప్లవ నేతలతో నా సంబంధాల్ని పదే పదే సెన్సార్ చేస్తున్న దుస్థితి. ఈ బంధనాలన్నీ నాకు ఓ చిక్కుముడిగా తయా రయ్యాయి. ఆ ముడి విప్పడం సాధ్యం కాలేదు. అత్యున్నత అధికారమున్న సైనికుడిగా, క్లిష్టమైన ఈ సంబంధాల్ని ప్రభావితం చేయగల సామర్థ్యం నాకుంది. విపత్తు సమయంలో నాతో సహా కార్యకర్తలందరినీ సురక్షిత ప్రాంతానికి ఎలా తరలించిందీ ఇప్పటికే వివరించా. నా గుణగణాలే చివరి సన్నివేశంలోనూ నన్ను ఉన్నత స్థాయిలో నిలబెట్టాయి.

కాంగోలో కొన్ని విషయాలు నేర్చుకున్నా ఇక్కడ జరిగిన కొన్ని తప్పులు మరోసారి జరగనీయను. కొన్ని జరగవచ్చుగాక. ఇంకొన్ని కొత్తవి కూడా జరగ వచ్చు. వైఫల్యం ఎదురైన ఈ సందర్భంలోనూ గెరిల్లా పోరాటం పట్ల నా విశ్వాసం మరింత బలపడింది. ఇందులో నా బాధ్యత పెద్దదే. "ఓటమినీ, అది నేర్పిన పాఠాల్నీ నేనెన్నటికీ మరచిపోను".

కాంగోలో మా భవిష్యత్ ఎలా ఉండనుంది? కచ్చితంగా విజయం సాధిస్తాం. అయితే సుదూర కాలంలో

నూతన సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా ఆఫ్రికా దేశాల్లో జరిగే విముక్తి ఉద్యమాలు భిన్నమార్గాల్లో వెళ్లడం అనివార్యమవుతోంది. వాస్తవానికి అన్ని దశల్లోనూ విజయపరంపరతో ముందుకు సాగిన ఏ ఒక్క ఉదాహరణ మనకు కనిపించదు. ఇటీవలి పోర్చుగీస్ గ్వినియాలోని ప్రజా యుద్ధం కూడా ఓ అసంపూర్ణ ఉదాహరణే. అయితే అక్కడి పోరాటం మాత్రం వలసవాదులకు వ్యతిరేకంగా జరిగిందే. అల్జీరియాను కూడా ఓ ఉదాహరణగా తీసుకోలేం. అక్కడ ఫ్రాన్స్ తన నయా వలస రూపాల్ని అభివృద్ధి చేసుకుంది. ప్రత్యేక వలస దోపిడీకి అది ఓ ఉదాహరణగా నిలుస్తుంది.

కాంగో విముక్తి పోరాటంలో క్రూరమైన చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఇక్కడి అనుభవాల అధ్యయనం భవిష్యత్తు ఉపయోగపడే నూతన భావనల్ని అందిస్తుంది.

లాటిన్ దేశాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. నయా వలస వాదానికి వ్యతిరేకంగా అక్కడ హింసాత్మక వర్గ పోరాటాలు జరిగాయి. వలస వాదులతో ఒప్పందాలకు ముందు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి అక్కడి జాతీయ బూర్జువాలు చేదోడుగా నిలిచారు. కాగా, ఆఫ్రికా దేశాల ముఖ చిత్రం మాత్రం సామ్రాజ్య వాదుల ప్రణాళికలనుగుణంగా కనిపిస్తోంది. ఇక్కడి అతి కొద్ది దేశాలు మాత్రమే సాయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్యాన్ని పొందాయి. మిగతా అన్నింటిలోనూ ఆయిల్ అద్దిన మిషన్లలాగా అన్నీ సాఫీగా జరిగిపోతున్నాయి.

వాస్తవానికి ఆఫ్రికాలోని దక్షిణ ప్రాంత దేశాలు మాత్రమే అధికారికంగా వలసలు. ఆ దేశాల్లోనే పరిణామాలు వేగంగా జరిగేందుకు అవకాశముంది. కనీసం పోర్చుగీస్ వలసల్లోనైనా, దక్షిణ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలు భిన్నమైనవి. ఇక్కడ జరిగే విముక్తి పోరాటాల పురోగామి దశలు ప్రజా యుద్ధాన్ని పోలి ఉంటాయి. అయితే అసలు సమస్యేల్లా మనమక్కడ పాతుకుపోవాలంటే ఎలా అన్న ప్రశ్నలకు నా దగ్గర సమాధానాలు లేవు. బలహీనమైన అసంపూర్ణమైన నా అనుభవాల నుంచి కొన్ని విషయాల్ని మాత్రం చెప్పగలను. ప్రస్తుత పరిస్థితుల్లో ఆఫ్రికా విముక్తి పోరాటాల్ని విజయవంతం చేయాలంటే మార్క్సిస్ట్ విశ్లేషణల్ని సమకాలీన స్థాయికి అభివృద్ధి చేయాలి.

చారిత్రకంగా ప్రాథమిక వైరుధ్యం ఏమిటి? ఒకవేళ అది సామ్యవాద, సామ్రాజ్య వాద దేశాల మధ్య లేదా సామ్రాజ్యవాద దేశాల పాలకులకూ, శ్రామికులకూ మధ్య అయితే మాత్రం మూడో ప్రపంచ దేశాల పాత్ర చాలా తక్కువే అని చెప్పాలి. అయితే దోపిడీకి పాల్పడుతున్న దోపిడీకి గురవుతున్న దేశాల మధ్యనే ప్రాథమిక వైరుధ్యమనేందుకు అనేక సీరియస్ కారణాలున్నాయి. దీన్ని గురించి ఎక్కువగా వివరించే ప్రయత్నం మాత్రం చేయను. ఈ చారిత్రక లక్షణాలు సామ్యవాద పరిణామాలకు వ్యతిరేకమని కూడా చెప్పడం లేదు. అయితే ఈ పరిస్థితి మనల్ని సంక్లిష్టమైన పక్కదారుల్లోకి నెడుతుంది. సరైన మార్గాన్వేషణ కోసం విస్తృత సమాచారం,

వాదనలు అవసరమవుతాయి. ఊహలపై ఆధారపడ్డ ఈ ఆలోచనల్ని ఇంతటితో వదిలేస్తా ఆచరణే ఈ సందేహాలన్నిటికీ సమాధానం చెబుతుంది.

ప్రాథమిక వైరుధ్యానికి సంబంధించి అదే సరైందైతే ఆఫ్రికా చురుకైన పాత్ర నిర్వహించనుంది. ప్రస్తుత చారిత్రక దశలో మూడో ప్రపంచ దేశాలన్నిటినీ & ముద్దగా తీసుకుంటే ఆయా దేశాల, ఖండాల పాత్ర ఒక్కో విధంగా ఉంటుంది.

సారాంశంలోకొద్దాం, ల్యాటిన్ అమెరికా దేశాల్లో వర్గపోరాటం తీవ్రస్థాయికి చేరుకుంది. అక్కడి జాతీయ బూర్జువాలు సామ్రాజ్యవాద శక్తితో పూర్తిస్థాయిలో ఒడంబడిక చేసుకున్నాయి. ఆ దేశాల స్వల్పకాలిక భవిష్యత్‌లోకి చూస్తే అది సోషలిస్ట్ విప్లవ శక్తుల విముక్తి పోరాటమే.

ఆసియాలోనూ జరుగుతోంది అదే. అయితే పరిణామాలు మాత్రం ఎంతో సంక్లిష్టమైనవి. ఇక్కడ జపాన్‌లాంటి సామ్రాజ్యవాద దేశాలు, చైనాలాంటి సోషలిస్ట్ దేశాలున్నాయి. వీటిపక్కనే సామ్రాజ్యవాదుల కింద కీలుబొమ్మలుగా వ్యవహరించే భారత్లాంటి ప్రమాదకర దేశాలున్నాయి. జాతీయ బూర్జువాలు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి కలిసిరాని సందర్భాల్లోనూ విముక్తి పోరాటాలు విజయం సాధిస్తే ఆ దేశాలకు ఓ ప్రత్యేకత ఉంటుంది. అలాంటి దేశాల్లో పరిణామాలు వేగంగా జరుగుతాయి. ఇక కేవలం విముక్తి పొందిన దేశాలు (స్వతంత్ర దేశాలుగా ఏర్పడినవి) లేదా ఆ దేశాలు గత వందేళ్లుగా లాటిన్ దేశాలు అనుభవించిన కాల్పనిక స్వేచ్ఛకు దూరంగా ఉన్నాయనుకుంటే, అలాంటి దేశాల్లో విప్లవ అని వార్యతకు మరికొంత సమయం పడుతుంది.

ఆఫ్రికాలో, ప్రత్యేకించి నల్లని ఆఫ్రికన్లకు (అంటే వారి చర్మపు రంగు వల్ల) సుదీర్ఘమైన గొలుసుకట్టు చరిత్ర ఉంది. అది ఆదిమ కమ్యూనిజం నుంచి వ్యవ సాయిక సమాజం, ఆ తర్వాత బూర్జువా సమాజపు అభివృద్ధి వరకూ. నయా సామ్రాజ్యవాదుల ప్రణాళికలో భాగంగా ఇక్కడి జాతీయ బూర్జువాలకూ-నయా వలస శక్తులకూ మధ్య ఎలాంటి వైరుధ్యాలూ లేవు. ఇలాంటి దశలో, ప్రతి దేశం తమ విముక్తి పోరాటాన్ని తగిన ప్రణాళికతో రూపొందించుకోవాలి. ఇక్కడ సామ్రాజ్యవాదులతోపాటు ఆ శక్తులను బలపరిచే (వలస సైన్యాలు ఇప్పటికీ అక్కడ పాగా వేసి ఉన్నాయి. వారి అధికారుల సామ్రాజ్యవాద ఆలోచనలు ఎంతో ప్రమాద కరం) ఇతర శక్తులు నూతన

ధనిక వర్గం, దిగుమతిదారులు, బడా పారిశ్రామిక వేత్తలు, వ్యవస్థీకృత పెట్టుబడిదారుల రూపంలోని ఏకస్వామ్య శక్తులు (కార్పొరేట్ పెట్టుబడిదారులు) వీరందరినీ శత్రువులుగానే చూడాలి.

ఈ పరిస్థితుల్లో విదేశీ శక్తులతో పోరాడేది పెటీ బూర్జువాలే. అయితే ఆఫ్రికా దేశాల్లో పెటీ బూర్జువాలంటే ఎవరు? సామ్రాజ్యవాదులకు, వలసవాదులకు సేవలం దించిన వర్గం. వీరికి మానవ గౌరవం, వ్యక్తిగత అభివృద్ధిపట్ల కొంత చైతన్యం ఉంటుంది. ఈ వర్గం ఉన్నత చదువుల కోసం తమ పిల్లల్ని మేధోవంతమైన వలస దేశాలకు పంపించాయి (మంచి సదుపాయాలు కల్పించే దేశాలకు), ఈ నూతన దశలో సామ్యవాద దేశాలకు. అయితే ప్రజాయుద్ధం ఉన్నతస్థితిలో ఉన్న ఈ సమయంలో మాత్రం అలాంటివి చాలా తక్కువే. ఇంతకు ముందే చెప్పినట్టు కాంగో రైతులు పెద్ద, చిన్న గిరిజన బృందాలుగా విడిపోయి ఉన్నారు. వారి నివాస ప్రాంతం ఎంత చిన్నదైతే, వారి మధ్య బంధం అంత దృఢంగా ఉంటుంది. వివిధ పెద్ద బృందాల్ని (నాకు తెలిసి కటంగా, కివూ ప్రాంతాల్లో ఉన్నారు) కలిపి ఉంచేది 'జాతీయత. చిన్న బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తాయి.

వివిధ గ్రామాల్లోని ఒకే బృందంవారి మధ్య ఐక్యత ఎంతో ఉన్నతంగా ఉంటుంది. ఇక ఒకే గ్రామంలోని వారి మధ్య మరింత ఉన్నతంగా ఉంటుంది. నేనిక్కడ చెబుతున్న సహజ జీవనం, పరిమిత ప్రాంతానికి లేదా కనీసం ఓ జోన్ కు సంబంధించి. మిగతా ప్రాంతాల్లో చూస్తే పెట్టుబడిదారుల కోసం కాంగోలోని సహజ సంపదను సేకరించి పెట్టడంలో కలిసి ఉంటారు. ఉదాహరణకు జిగురు, గతంలో అయితే ఏనుగు దంతాలు, నూనె కోసం పామ్ గింజలు. ఇలాంటి సంబంధాలు కొంత భిన్నంగా ఉంటాయి. అయితే వాటిని అంత దగ్గరగా గమనించ లేకపోయా. మరికొందరు శ్రామికులు మాత్రం యూనియన్ ప్రభుత్వ అవసరాల కోసం ఓ చోట చేర్చబడ్డారు. మొదట వారిని సేవకులుగా మార్చేందుకు బల ప్రయోగం అవసరమైంది. ఆ తర్వాత తమంతట తామే కొంత విలాసవంతమైన నాగరిక జీవితానికి అలవాటుపడిపోయారు. యూరోపియన్ భాషలో చెప్పాలంటే ఆకలి తీర్చుకునేందుకు వేతనం పొందే జీవితానికి. అయితే ఈ శ్రామికుల్లో తిరుగుబాటు లక్షణాలు కనిపించవు. పైపై విశ్లేషణ చేస్తున్నందుకు నన్ను మరోసారి క్షమించగలరు. ఇది నా అసంపూర్ణ అనుభవాలపై ఆధారపడి చేస్తున్న విశ్లేషణ. కాంగో సమాజం పట్ల నాకున్న

కొద్దిపాటి అవగాహనతో చేస్తున్న విశ్లేషణ.

ఏ సందర్భంలోనైనా ఎలాంటి వ్యూహం అనుసరించాలి? పట్టణ ప్రజల మధ్య వైరుధ్యాలున్నాయి. ప్రధానమైంది ద్రవ్యోల్బణం. తెల్లవారికీ-నల్లవారికీ మధ్య వివక్షే కాదు, నల్లవారిలోని ధనికులకూ-పేదలకూ మధ్య వైరుధ్యం ఉంది. ఈ విధమైన అసంతృప్తి ఒంటరి పోరాటాలకు అవకాశమిస్తోంది. ఇక్కడ నిర్ణయాత్మక శక్తి మాత్రం వలస సైన్యమే. ఎవరికి రక్షణ కల్పించాలన్నా ఎవరిని అభివృద్ధి చేయా లన్నా వారి జోక్యం తప్పనిసరవుతోంది.

రైతుల్లో కనిపించే సాధారణ లక్షణం దారిద్ర్యమే. అయితే ఇది గత పదేళ్ల క్రితం ఉన్నదానికన్నా ఎక్కువేమీ లేదు. యుద్ధ ప్రాంతాల్లో తప్ప మరెక్కడా రైతులు ఆయుధాలు పట్టుకున్నట్టు లేదు. ఆ ప్రాంతాల్లో వారికది తప్పనిసరి అవసరమైంది. వాస్తవ పరిస్థితుల్ని బేరీజు వేసేటపుడు ఓ దేశ ప్రజల స్థాయిని మరో దేశ ప్రజలతో పోల్చి చెప్పడానికి చాలా తక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. దేనికదే చూడాలి. దక్షిణ అమెరికా దేశాల రైతుల్లో దారిద్ర్యం ఉంది. అయితే అది అక్కడికక్కడ చూసినపుడు. అక్కడ ఆకలి, దారిద్ర్యంతోపాటు దోపిడీ పెరిగిపోతోంది. కానీ, కాంగోలోని చాలా ప్రాంతాల్లో అలాంటి పరిస్థితిలేదు. ఇలాంటి చోట ఆర్థిక ప్రాతిపదికన తిరుగుబాటు నినాదాలివ్వడం ఎంతో కష్టమైన వ్యవహారం. అయితే ప్రజా యుద్ధంలో అదే ప్రధాన డిమాండ్గా ఉంటుందని ఇంతకుముందే గుర్తు చేశా. భూమి కోసం పోరాటం పేరుతో అది ఉంటుంది. ఇక ఇక్కడ ఉన్న మరో మార్గం గిరిజన సంబంధాల ప్రాతిపదికన ముందుకు వెళ్లడం. అయితే అలాంటి విముక్తి పోరాటాన్ని సుదీర్ఘ కాలంపాటు కొనసాగించలేం. గిరిజన భావంతో ముందుకెళ్లే చైతన్యం పొందిన ఓ గిరిజన తెగ అణచివేతకు పాల్పడే శత్రు సైన్యంతో పోరటానికన్నా తమ తోటి మరో గిరిజన తెగతో ఘర్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. ఇలాంటి సందర్భాల్లో తమ ఉమ్మడి శత్రువుపై పోరాటానికి గిరిజన తెగల్ని ఐక్యం చేయడమే ఉద్యమ అభివృద్ధికి ప్రాతిపదిక అవుతుంది. ఆ దిశగా ముందుకు వెళ్లిన పార్టీ లేదా నాయకత్వం మాత్రమే ఆ ప్రాంత ప్రతినిధిగా గుర్తింపు సాధిస్తుంది. పోరాటాన్ని అభివృద్ధి చేయడంలో ముఖ్యాంశం. సార్వత్రిక భావాల్ని ఆచరణలో పెట్టడం. ప్రపంచంలో ప్రాచుర్యం పొందిన పోరాటాలన్నిటిలోనూ వెనక్కి వెళ్లిన చోటే

సామ్రాజ్యవాదులు విజయం సాధించారు. ఎక్కడైతే నిఖార్సైన ప్రగతిశీల ప్రభుత్వాలు అధికారం చేపట్టాయో అక్కడ సామ్రాజ్యవాదం ఓటమి పాలైంది. సామాజిక విశ్లేషణ విషయంలో ఆయా దేశాల్ని వేటికవిగా చూడాల్సిన పని లేదు. ఈరోజున లాటిన్ అమెరికా మొత్తంగా నయా వలసగా మారిపోయింది. అక్కడ పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు రాజ్యమేలుతున్నాయి. దీంతోపాటు ఫ్యూడల్ సంబంధాలు కూడా ఇంకా కొనసాగుతున్నాయి. అక్కడే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం (ఇది పెట్టుబడిదారీ వ్యతిరేకమైంది) ప్రాచుర్యం పొందింది. చివరికది సామ్యవాద పోరాటంగా రూపు దాల్చింది. అలాంటిదే కాంగోలో లేదా ఏదైనా ఆఫ్రికా దేశంలో సాధ్యం కాగలదని భావిస్తున్నాం. వేట లేదా ఆహార పంటల ద్వారా జీవనం గుడపుతూ ఓ ప్రాంతానికే పరిమితమయ్యేకన్నా నూతన ఆలోచనలతో ప్రపంచ అభివృద్ధిలో భాగస్వాములు కాగలరని ఆశిస్తున్నాం. సామ్యవాద భావాలు ఆఫ్రికా దేశాల్లోని విశాల ప్రజానీకాన్ని ప్రభావితం చేయగలవు. అయితే మక్కీకి మక్కీగా కాకుండా నూతన పరిస్థితుల కనుగుణంగా అన్వయించుకోవాలి. ప్రపంచంలో వస్తున్న ప్రధాన మార్పులు ఆ నేలను తప్పకుండా తాకగలవని భావిస్తున్నాం.

ఇదంతా ఓ ఆదర్శ లక్ష్య సాధన కోసం. అందుకు ప్రజా బాహుళ్యం గర్వించ దగిన జాతీయ పార్టీ నిర్మాణం జరగాలి. అది దృఢమైన అభివృద్ధి చెందిన కార్య కర్తలతో ఉండాలి. అలాంటి పార్టీ కాంగోలో ఇంకా ఉనికిలోకి రాలేదు. ప్రస్తుతం, అక్కడ ఉన్నవన్నీ నిట్టనిలువు నిర్మాణాలు, ఓ మోస్తరు మేధావులు, ఊగిసలాడే పెటీ బూర్జువా కార్యకర్తలతో కూడిన లుముంబిస్ట్ ఉద్యమాలు.

ప్రస్తుత కాంగో పరిస్థితుల్లో, మార్క్సిస్ట్ బోధనలతో నడిచే ఓ కొత్త పార్టీ ఏర్పడాల్సి ఉంది. అది నూతన పరిస్థితులకు తగిన విధంగా ఉండాలి. కాంగో జాతీయులు గౌరవించదగిన, వినయవంతులైన ప్రతినిధులు దానికి నాయకత్వం వహించాలి. విశాల ప్రజాబాహుళ్యానికి నాయకత్వం వహించే సామర్థ్యం, త్యాగ గుణం వారిలో ఉండాలి. జరుగుతున్న పోరాటల నుంచే అలాంటివారు వస్తారని ఆశిస్తున్నాం.

కామ్రేడ్ ములేలే ఇంకా అక్కడే ఉన్నారు. అజ్ఞాత కార్యకలాపాలు సాగిస్తున్నారు. అందుకు సంబంధించిన వివరాలింకా తెలియలేదు. తూర్పు జోన్లోనూ తమ పని కొనసాగిస్తున్నారని

భావిస్తున్నాం. అణచివేతకు వ్యతిరేకంగా మొదటి గెరిల్లా సేన ఏర్పాటైంది అక్కడే. సైనిక నిర్మాణపు సాధ్యాసాధ్యాల్ని పరీక్షించింది అక్కడే. వారికపుడు తమ నాయకులపై విశ్వాసంగానీ, తమను నడిపించే పార్టీ గానీ లేవు. ఇపుడు జరుగుతున్న ప్రయత్నాలన్నీ జాతీయస్థాయిలో విప్లవోద్యమానికి నాయకత్వం వహించే పార్టీ కోసమే. అలాంటి పార్టీ నినాదాలు కార్యకర్తలకు, ప్రజలకు సంబంధించినవై ఉండాలి. భవిష్యత్‌ను దర్శించగల సామర్థ్యంతోపాటు వీరోచిత త్యాగ గుణాలు ఆ పార్టీ నాయకత్వ బృందానికుండాలి. ఆ తర్వాతి దశల్లో కార్మి కులతో సంబంధాలు మెరుగుపడాలి. అంటే ఇది కార్మికులకూ-రైతులకూ మధ్య ఐక్య సంఘటనను తిరస్కరిస్తుందని కాదు. వాస్తవానికిది ప్రారంభమయ్యేదే కార్మిక వర్గ సిద్ధాంతంతో మమేకమయ్యే వెనకబడ్డ రైతాంగపు ఐక్య సంఘటనతో.

ప్రస్తుత కాంగో పరిస్థితుల్లో ఆ తర్వాత దశల్లో కలుపుకోవాల్సింది పారిశ్రామిక కార్మికుల్ని అత్యంత దారుణ దోపిడీ త్రి గురయ్యే వీరు గెరిల్లా ఉద్యమానికి సన్నిహితు లవుతారు. సైనిక చర్యల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తారు. వియత్నామీయుల మాటల్లో చెప్పాలంటే "సాయుధ ప్రచారకులు". ఉద్యమ అభివృద్ధిలో వీరిది ప్రధాన భూమిక కానుంది.

"ప్రజా గెరిల్లా యుద్ధమంటేనే విశాల ప్రజానీకపు పోరాటమని మరోసారి నొక్కి చెబుతున్నా ప్రజా పోరాటాల్ని గెరిల్లా పోరాటాలతో (ఇది ఎంపిక చేసిన కేంద్రక దళాలు జరిపే పోరాటం) కొన్నిసార్లు వేరు చేసి చూడటాన్ని మేం అంగీకరించం. ఆ పోరాటానికి కార్మిక వర్గమే నాయకత్వం వహించాలన్న హఠవాదుల వ్యూహం కూడా సరైంది కాదు. దోపిడీ వర్గాన్ని అధికారం నుంచి తొలగించడం కోసం ఆరాటపడే బృందాలన్నిటికీ గెరిల్లా యుద్ధం ఓ సాధనంలాంటిది. గెరిల్లా యుద్ధ వ్యూహకర్తలు చేయాల్సిందేమంటే విజయం సాధించే మార్గం పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగించాలి. కార్యాచరణలో రుజువులు చూపించాలి". అదే సమయంలో ఓ కొత్త ప్రపంచాన్ని అభివృద్ధికరమైన భవిష్యత్‌ను సాధించగల సాయుధ పోరాట ప్రక్రియలో ఎప్పటికపుడు చేపట్టాల్సిన మార్పుల గురించి వివరించాలి.

లక్ష్య సాధనకు సుదీర్ఘ పోరాటం అనివార్యం. గ్రామీణ ప్రాంతాల్లోకి, నూతన ప్రాంతాల్లోకి ఉద్యమం విస్తరించి, శత్రువును మరిన్ని చావు దెబ్బలు కొట్టాక ఇలాంటి ప్రచారం ఇక మనకు

అవసరముండదు. ఆ రోజున ఉద్యమాన్ని మరింత ముందుకు ఎలా తీసుకెళ్లాలన్నదే అప్పటి ప్రధాన సమస్య అవుతుంది. కాంగోలో ప్రస్తుత అనుభవాలు మాత్రం ఉపసంహారం, ఓటమి. అయినా ఇక్కడ సాయుధ పోరాటానికి అనుకూల పరిస్థితులున్నాయి. తిరుగుబాటు అనేది రైతుల అనుభవంలోకి వచ్చింది. వారు ఓడిపోయారు, అవమానాలు, అత్యాచారాలకు గురయ్యారు. తిరుగుబాటు అంటే ఏంటో కూడా రుచి చూశారు. వారికిపుడు సాయుధ పోరాట అనుభవ ముంది. యుద్ధంతో సహజీవనం చేసిన వారికిపుడు ఆయుధాలు కూడా ఉన్నాయి.

ఈరోజున కాంగో ఉద్యమం స్థానిక బృందాలుగా విడిపోయి ఉంది. ఆ బృందాల నాయకులకు జాతీయ సమైక్యత లేదా కాంగో జాతీయత అన్న భావన లేదు. తమను చుట్టి ఉండే గిరిజన తెగలే ఓ జాతిగా భావిస్తారు. ఇలాంటి పరిస్థితులున్నందునే వీరోచిత యోధులతో కేంద్రక దళాల్ని(ఉక్కులాంటి ఒక్కరితోనైనా సరే) ప్రారంభిం చాలనుకున్నాం. "గుణాత్మక పనితనం లేకుండా గెరిల్లా దళాల్ని పెంచుకుంటూ పోవడంవల్ల ఉపయోగం లేదని గ్రహించాం. అందుకే ప్రారంభం ఎంత చిన్నదైనా అదే సరైందనుకున్నాం". ఈ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఆయా ప్రాంతాల్లో మిలటరీ నాయకుల ద్వారా ఉద్యమం అభివృద్ధి చెందుతుంది. వేగంగా వివిధ దశల్ని దాటుకుంటూ ముందుకు వెళ్తుంది". చరిత్రలోని ప్రాథమిక దశ నుంచి (కొన్ని చోట్ల ఈ దశ ఇప్పటికీ ఉంది) అంటే ఆదిమ కమ్యూనిజం, బానిస సమాజం, భూస్వామ్య సమాజం, ఇంకా అభివృద్ధి దశల వైపు పురోగమించిన క్రమంలో తమ సొంత వనరుల నుంచే ఈ ప్రజలు క్రమంగా సాయుధం కావాలి. తమ సొంత పట్టుదలతోనే చైతన్యం పొందాలి. 'గెరిల్లా యోధుడికి ప్రతి ఆయుధం ఓ బహు మతిలాంటిది. ప్రజా యోధులకు ఆయుధం ఓ గౌరవ చిహ్నంగా ఉండాలి". ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలంటే ఇప్పుడున్న కార్యకర్తలందరినీ పక్కకు నెట్టాలి. వారినసలు పరిగణించకూడదు. ఎంత చిన్నదైనా సరే, సాధ్యమైతే ఎంత పెద్దదైనా సరే కేంద్రక దళ నిర్మాణం ప్రారంభం కావాలి. ఈ మార్గంలోనే నూతన నాయకత్వం, కార్యకర్తలు వస్తారు. అందుకోసం యుద్ధరంగం నుంచే చావుబతుకుల పోరాటంలో రాటుదేలిన త్యాగశీలుర్ని ఎంపిక చేయాలి.

ఇలాంటి షరతులమధ్య భవిష్యత్ పట్ల మరింత స్పష్టత ఉన్న నాయకత్వమే వస్తుంది.

విప్లవ పరిస్థితుల్ని అభివృద్ధి పరచగల ఆత్మత్యాగమున్న లబ్దప్రతిష్ఠులే జాతికి నాయకులవుతారు. ఈ మహోద్యమ పోరాట ప్రక్రియ ప్రజా సైనికుల్ని కార్యకర్తల్నీ, నాయకుల్ని సృష్టిస్తుంది. కఠినంగా చెప్పాలంటే ఇప్పటివరకూ ఇలాంటిది జరగలేదు. పోరాటమిపుడు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు విస్తరించాలి. మొదట చిన్న బృందాలుగా ప్రారంభిస్తే రక్షణ సమస్యలు అంతగా ఎదురుకావు. ఈ బృందాలు వేగంగా విస్తరించే నైపుణ్యం సాధించాలి. "సాంకేతి కంగా ఆధునిక మిలటరీ రూపంలో, యుద్ధ తంత్రాల్లో గెరిల్లా రూపంలో శిక్షణ పొందాలి. విప్లవ బీజాల్ని నాటడంలో ఓ ఉదాహరణగా నిలవాలి. విజయానికి మార్గం అదే". అది త్వరలోనే సాధ్యమవుతుంది. వేగంగా ముందుకు వెళ్లగల త్యాగపూరిత ఉన్నత నాయకత్వం, మధ్యతరహా నాయకత్వాన్ని గైడ్ చేయడం ద్వారా. తిరుగుబాటు తత్వంతో రగిలిపోయే రైతాంగాన్ని ప్రజా సైన్యంగా అభివృద్ధి చేయడం ద్వారా.

సమస్యలు చాలా ఉన్నాయి. విప్లవ సిద్ధాంతం, ఆచరణపై మనం దృష్టి సారిం చాలి. సరైన మార్గాన్వేషణ కోసం సీరియస్ అధ్యయనం జరగాలి. రైతాంగాన్ని ప్రజా సైన్యంతో కలిపి ఒకే శక్తిగా మలచాలి. అపుడే సుదీర్ఘమైన, వెనక్కి తిరిగి చూడని మున్ముందుకే వెళ్లగల పోరాటం ప్రారంభమవుతుంది. ఇతర శక్తులు తోడవుతాయి. కాంగోలోని మారుమూల ప్రాంతాలతోపాటు పారిశ్రామిక ప్రాంతాల్లోని కార్మికుల వరకూ ఉద్యమం వెళ్తుంది. ఇదంతా జరగడానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేం. అది సాధ్యమేనని మాత్రం చెప్పగలం. ప్రస్తుత పరిస్థితుల్ని మానవీయ రూపంలోకి మార్చగల అనుకరణశక్తి మనకు ఉంది. అయితే "సామ్య వాద భావాలు అభివృద్ధి చెందుతున్నకొద్దీ శత్రువర్గపు కుట్రలూ, కుతంత్రాలూ అధికమవుతాయి. ప్రజా సైన్యానికి ఆశలు చూపి తమవైపు తిప్పకునేందుకు యత్నిస్తారు. దాంతో కొన్నేళ్ల తర్వాతే విజయం మనల్ని వరిస్తుంది".

అమెరికా సామ్రాజ్యవాదుల దృష్టిలో ఆఫ్రికాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రత్యేకించి అక్కడి వనరుల వల్ల. అయితే లాటిన్ దేశాల్లో ప్రజాయుద్ధం శక్తి వంతమైతే సామ్రాజ్యవాదులకు తాము కొల్లగొట్టిన సంపదను తరలించడం, మార్కెట్లను విస్తరించడం కష్టమవుతుంది. సామ్రాజ్యవాదుల ప్రధాన శక్తి అదే. ఒకవేళ ఆఫ్రికన్లు వలసవాదానికి తలవంచి తిరుగుబాట్లకు యత్నించని పక్షంలో

సామ్రాజ్యవాదులు తమ పెట్టుబడుల్ని అక్కడికి తరలిస్తారు. అది ఇప్పటికే మొదలైంది. ఇలాగే కొనసాగినిస్తే, విశాలమైన సుసంపన్నమైన ఆఫ్రికా ఖండం సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్లిపోతుంది.

ఆఫ్రికా పోరాటాన్ని అంతర్జాతీయ దృష్టితో చూడాలి. అపుడే సామ్రాజ్యవాదులకు అడుకట్ట వేసే వ్యూహం అర్థమవుతుంది. ప్రపంచ ప్రజలు సాగించే ఓ మహత్తర పోరాటంలో భాగస్వాములు కావాలంటే ఆ దేశాల ప్రజలు సంపూర్ణ విముక్తి దిశగా తమ పోరాటాన్ని తీవ్రం చేయాలి. విజయం లక్ష్యంగా సీరియస్గా సాగే ఉద్యమా లన్నిటికీ మద్దతు తెలిపి, చేదోడుగా నిలవడం మా బాధ్యతగా భావిస్తాం.

వీటన్నిటిలో మేమెలా పాల్గొనగలం? ఇప్పటికే కాంగోలో కొంత్ర అనుభవమున్న వారి నుంచి కేంద్రక దళాన్ని ఎంపిక చేసి పంపిస్తాం. స్నేహదేశాలు అనుమతిస్తే ఆయుధాలు అందించగలం. ఆర్థిక సాయం అందిస్తూ, కార్యకర్తలకు శిక్షణ ఇవ్వగలం. అయితే ఇప్పటివరకూ మమ్మల్ని గైడ్ చేసి నడిపించిన విప్లవ వ్యూహం ఒకదాన్ని మార్చుకోక తప్పదు. ఎలాంటి షరతులు లేకుండా సాయమందించాలని చెప్పాం. అయితే అది తప్పని తేలిపోయింది. పొజీషన్లో ఉండి పోరాడే వారికే సాయమందించాలి. ఓ దేశ విముక్తి కోసం జరిగే విప్లవోద్యమం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కూడా అని నమ్మదగిన విశ్లేషణ ఉన్నపుడు మాత్రమే సాయ మందించాలి. అలాంటి విశ్లేషణను అత్యంత రక్షణాత్మకంగా ఉంచాలి. ఆ ఉద్యమం గురించి తెలుసుకునేందుకు మనం జోక్యం చేసుకోవాలి. షరతులపైనే సాయ మందించాలి. అలా రిస్క్ తీసుకోలేని పక్షంలో నిధులన్నీ విప్లవ వ్యతిరేక కార్య కలాపాల కోసం ఖర్చయ్యే ప్రమాదముంది. విప్లవ దొరలు తమ రాజభోగాల కోసం దుర్వినియోగం చేసే అవకాశాలుంటాయి. అలాంటి వారి వల్ల త్యాగాలు చేసే పోరాట యోధులు, ఆ దేశ ప్రజలు ఓ అమ్మకపు సరకుగా మారిపోతారు. విప్లవోద్యమం పూర్తిగా వెనక్కి నెట్టబడుతుంది. అలా జరిగిందంటే మనమే సామ్రాజ్య వాదులతో చేతులు కలిపినట్టవుతుంది. అలాంటి సందర్భంలో కొన్నివేల డాలర్లను ఆఫ్రికా విముక్తి ఉద్యమాల పేరిట ఖర్చు చేయడంకన్నా తెలివి తక్కువ పని మరొక టుండదు (ఇప్పటికే అలా జరిగి ఉండకపోతే, భవిష్యత్లో జరిగేది అదేననడంలో నాకు

అనుమానం లేదు). ప్రజా సైన్యానికి పోరాటంలో ఎదురయ్యే బాధలకన్నా నిధుల దుర్వినియోగం వల్ల తలెత్తే వైరుధ్యాలు, ఓటమి మరింత చికాకు కలిగిస్తాయని చెప్పగలను.

చివరగా, కాంగోలో జాతీయ నాయకుడిగా మీరెవరినైనా గుర్తించారా అని అడిగితే మాత్రం ములేలేను ఓ పక్కకు నెట్టి స్పష్టమైన సమాధానం చెప్పలేను. ఆయన గురించి నాకు తెలియనందున. "నాకు తెలిసిన వారిలో మాత్రం నాయకత్వ లక్షణాలు దండిగా ఉన్న వ్యక్తి కబీలా. అయితే ఓ వ్యక్తి నిఖార్సైన విప్లవకారుడైనంత మాత్రాన నాయకత్వ లక్షణాలు లేకుండానే ఆ వ్యక్తి విప్లవోద్యమానికి నాయకుడు కాజాలడు. అదేవిధంగా ఓ వ్యక్తికి నాయకత్వ లక్షణాలు దండిగా ఉన్నంత మాత్రాన్నే కూడా విప్లవ నాయకుడుగా రాణించలేడు. తన కార్యాచరణను గైడ్ చేసి నడిపించే విప్లవ సిద్ధాంతం పట్ల అవగాహన, పోరాట స్ఫూర్తి, త్యాగనిరతి తప్పనిసరిగా ఉండాల్సిన గుణగణాలు. ఇప్పటివరకూ వీటిలో ఏ ఒక్కటీ కబీలాలో వ్యక్తం కాలేదు. అయితే యువకుడైనందున ఆయనలో మార్పు వస్తే భవిష్యత్లో సాధ్యమే. కొన్నేళ్ల తర్వాత ఓ వెలుగు వస్తుందంటూ చెప్పేందుకు నేను ఎంతో సాహసిస్తున్నా ఆయన చుటూ అలుముకున్న పరిస్థితుల్ని చూస్తే మాత్రం తన బలహీనతల నుంచి బయట పడగల సామర్థ్యం ఆయనకు ఉందా అన్న పెద్ద అనుమానమే నాకు కలుగుతోంది. అయితే ఈ రోజున దేశంలో ఏదో ఓ మూలనున్న కొత్త తరం నుంచి కూడా ఆశలు లేకపోలేదు. వారే కాంగో విముక్తి పోరాటాన్ని నడిపించి, నిజమైన చరిత్ర లిఖించ గలరేమో...

జనవరి, 1966

**********

కాంగో పూర్వనామం.జైరే, మధ్య ఆఫ్రికాలో ఉన్న ఈ దేశ రాజధాని. కిన్షాసా, ఈ దేశాన్ని DRC (డెమాక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ద కాంగో) లేదా కాంగో-కిన్షాసా అని కూడా అంటారు. ఎందుకంటే దీని పక్కనే కాంగో పేరుతో మరో దేశం ఉంది. DRCకి పశ్చిమ దిశగా ఉన్న మరో కాంగో పూర్తిపేరు."రిపబ్లిక్ ఆఫ్ ద కాంగో. దీని రాజధాని బ్రజ్జావిల్లే. దాంతో, దీన్ని కాంగో-బ్రజ్జావిల్లేగా పిలుస్తారు. DRCకి ఉత్తర దిశగా సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్", సూడాన్ దేశాలున్నాయి. తూర్పు దిక్కున ఉగాండా, రువాండా, బురుండీ ఉండగా, దక్షిణ దిక్కున జాంబియా, అంగోలా ఉన్నాయి. పశ్చిమ దిక్కున దాదాపు 37 కి.మీ. అట్లాంటిక్ మహా సముద్ర తీరం ఉంది. తూర్పు దిక్కున ఉన్న టాంజానియికా సరస్సు టాంజానియా దేశంతో కాంగోను విడదీస్తోంది.

23,45,409 చ.కి.మీ. వైశాల్యంతో కాంగో ప్రపంచ విస్తీర్ణంలో 12వ స్థానాన్ని దాదాపు 7 కోట్ల 10 లక్షల జనాభాతో ప్రపంచ జనాభాలో 18వ స్థానాన్ని ఆక్రమించింది. 30 జూన్ 1960న బెల్జియం నుంచి స్వాతంత్ర్యం పొందింది. ఈ దేశ అధికారిక భాష.ఫ్రెంచ్, గుర్తింపు పొందిన జాతీయ భాషలు.లింగాల, క్రిక్రోంగో, స్వాహిలీ, పిలుబా... IMF లెక్కల ప్రకారం ఈ దేశ తలసరి ఆదాయం. 340 డాలర్లు, ఇది ప్రపంచంలోనే అత్యంత తక్కువ. ఇంత పేద దేశంలోనూ అపారమైన ఖనిజ నిల్వలున్నాయంటే నమ్మశక్యం కాదు. కానీ, ఓ లెక్క ప్రకారం... ఈ దేశ ఖనిజ నిల్వల విలువ దాదాపు 24 లక్షల కోట్ల డాలర్లు. ఇది అమెరికా, యూరప్ దేశాల మొత్తం జీడీపీకి సమానం...

లారెంట్ కబీలా. 27 నవంబర్ 1939న కాంగోలోని కటంగా ప్రావిన్స్‌లో జన్మించారు. కబీలా తండ్రి లూబా తెగకు, తల్లి లుండా తెగకు చెందినవారు. ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యనభ్యసించి రాజకీయ తత్వశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. లుముంబా నాయకత్వంలో జరిగిన కాంగో స్వాతంత్ర్యోద్యమంలో యువ నాయ కుడిగా పాల్గొన్నారు. 1960లో కాంగో స్వాతంత్ర్యం పొందగా, మొదటి ప్రధానిగా ఎన్నికైన లుముంబాను కొన్ని నెలల వ్యవధిలోనే సి ఐ ఏ కుట్ర చేసి చంపింది. ఈ సంఘటన అనంతరం ఆ దేశ సైనికాధికారి మొబూటూ నేతృత్వంలో నియంతృత్వ పాలనకు తెర లేచింది. మొబూటూకు అమెరికా అండగా నిలిచింది. దాంతో, కబీలాతోపాటు లుముంబా అనుచరులంతా అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. లుముంబా హత్యానంతరం కాంగోలో కమ్యూనిస్ట్ అనుకూల శక్తులకూ, అమెరికా అనుకూల శక్తులకూ మధ్య అంతర్యుద్ధ పరిస్థితి నెలకొంది. ఆ సందర్భంగానే బృందం (1965లో) కాంగో వెళ్లింది. ఆ సమయంలో కాంగో పొరుగు దేశమైన టాంజానియాలో కబీలా ఆశ్రయం పొందుతున్నారు.

కబీలాపై 'చే' జోస్యం నిజమైంది

ఏడు నెలలపాటు కాంగో విప్లవకారులకు వెన్నుదన్నుగా నిలిచింది చే బృందం. కాంగో నుంచి తిరిగి వెళ్లడానికి ముందు ఆ దేశ భవిష్యత్ పట్ల చే కొన్ని ఊహాగానాలు చేశారు. భవిష్యత్‌లో ఆ దేశానికి నాయకులు కాగల వ్యక్తుల గురించి కూడా చే విశ్లేషించారు. అందులో కబీలా గురించి ఇలా అన్నారు."ప్రజాదరణకు అవసరమైన విశిష్ట నాయకత్వ లక్షణాలున్న వ్యక్తి కబీలా. ఐతే, ఆయనలో విప్లవ గాంభీర్యత లోపించింది". ఇంకా ఇలా అన్నారు. "ఐతే, యువకుడైనందున (అపుడు కబీలా వయసు 26 ఏళ్లు) ఆయనలో మార్పు వస్తే భవిష్యత్‌లో సాధ్యమే. కొన్నేళ్ల తర్వాత ఓ వెలుగు వస్తుందంటూ చెప్పేందుకు నేను ఎంతో సాహసిస్తున్నా చుటూ అలుముకున్న పరిస్థితుల్ని చూస్తే మాత్రం. తన బలహీనతల నుంచి బయట పడగల సామర్థ్యం ఆయనకు ఉందా అన్న పెద్ద అనుమానమే నాకు కలుగుతోంది".

ఆ సమయంలో కబీలాపై మందుకూ, మగువలకూ బానిసయ్యాడన్న ఆరోపణ లున్నాయి. ఐతే, అలాంటి వాటిని అక్కడి ప్రజలు పెద్దగా తప్పు పట్టని సామాజిక పరిస్థితి.

అప్పటి కాంగో సామాజిక సంబంధాలు కొంతవరకు ఆదిమ కమ్యూనిస్ట్ లక్షణాల్ని కలిగివున్నాయి. సామాజిక సంబంధాల్ని విలువల్నీ వేరు చేసి చూడలేం. నైతిక విలువలు సాపేక్షం.

చే బృందం కాంగోను విడిచి వెళ్లాక 1967లో కబీలా నేతృత్వంలో పీపుల్స్ లిబరేషన్ పార్టీ (PLP) ఏర్పడింది. దానికి చైనా అండగా నిలిచింది. ఆ తర్వాత దేశంలోని మిగతా విప్లవ శక్తులతో కలిసి ADFL పేరుతో ఐక్య సంఘటన ఏర్ప ర్చారు కబీలా, కబీలా నేతృత్వంలోని ఐక్యదళాలు 20 మే 1997న కిన్షాసాలోకి (కాంగో రాజధాని) ప్రవేశించాయి. ఐక్య దళాలకు ఉగాండా, రువాండా, బిరుం డీలు సైనిక సాయమందించాయి. దాంతో, నియంత మొబుటూ తన అనుచరులతో కలిసి దేశం విడిచి పారిపోయాడు. కబీలా దేశాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. కాంగో పేరు డెమాక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ద కాంగోగా (DRC) మారి పోయింది. జనవరి 16,2001న రషీది అనే తన అంగరక్షకుడు జరిపిన కాల్పుల్లో కబీలా తీవ్రంగా గాయపడ్డారు. దుండగున్ని కాంగో దళాలు చంపేశాయి. చికిత్స పొందుతూ జనవరి 18న కబీలా మరణించారు. కబీలా మరణానంతరం ఆయన దత్త పుత్రుడు జోసెఫ్ ఆ దేశాధ్యక్షుడయ్యారు.

**********

"కాంగోకు నేను నా వ్యక్తిగత విజయాన్ని ఆశించి రాలేదు. లేదంటే నా వ్యక్తిగత ప్రతిష్ట కోసం ఎవరినీ బలిపెట్టేందుకు కూడా కాదు. అలాంటి ఉద్దేశాలే నాలో ఉంటే... ఇక్కడ మనకు జరిగిన నష్టాల గురించిన సమాచారమిచ్చే వాడినే కాదు. ఎందుకంటే నేను నా నిజాయితీని కోల్పోలేదు. ఐతే, నేను ఇక్కడి మనుషుల మానసిక స్థితిని వివరించా. ఊగిసలాట, అనుమానాలు, బలహీనతల గురించి విశ్లేషించా"-------

"తమను తాము సాధువులుగా భావించుకున్నవారంతా మరుసటి రోజుకే వైరాగ్యానికి లోనయ్యారు. క్యూబాలో విప్లవోద్యమాన్ని బలోపేతం చేసే క్రమంలో మాకెదురైన అనుభవాలవి. అలాంటివే కాంగోలోనూ ఎందుకు జరగవనుకోవాలి? ప్రజల నుంచే కాంగో విప్లవ సేనను నిర్మించాలి. అందుకోసం ఒకరి తర్వాత ఒకరిని పరీక్షిస్తున్న సందర్భమిది".

తన తల్లిదండ్రులు, తోబుట్టువులతో చే–1944. చే, సెలియా (తల్లి), సెలియా (సోదరి),

రాబర్టో, జువాన్ మార్టిన్, ఎర్నెస్టో (తండ్రి), అనా మేరియా

*- చే గువేరా*

"చే కేవలం ఓ మేధావి మాత్రమే కాదు, ఆయన మన కాలపు పరిపూర్ణ మానవుడు"

*- రూపాల్ సార్త్*

ఈ పుస్తకం రాసిన వ్యక్తి నన్ను ఎంతగానో ప్రభావితం చేశారు. నాకు తెలిసినంతవరకూ అంతటి గౌరవనీయమైన వ్యక్తి మరొకరు లేరు. దురదృష్టవశాత్తూ ఆయనిపుడు మన మధ్య లేరు. ఉండివుంటే 30 ఏళ్ల క్రితం ఆయన చెప్పిన విషయాలపై ఆయనే వివరణ ఇచ్చేవారు. ఇపుడేం చెప్పాల్సివుంటుందో కూడా చెప్పేవారు. నేనెందుకిలా అంటున్నానంటే అవి ఎంతో సంక్లిష్టమైన విషయాలు కనుక. ఇపుడు ప్రచురిస్తున్న "కాంగో విప్లవోద్యమ డైరీలు".చే వ్యక్తిగత ఆర్కైవ్స్లో భద్రపరచిన ఓ డాక్యుమెంట్ కు సంబంధించినవి. చరిత్ర కోసం ఎంతో బాధ్యతగా చేసిన వివిధ పరిశీలనలు, శైలి కోసం చేసిన కొన్ని దిద్దుబాట్లు, ఎన్నో తీసివేతలు (నోట్స్‌లో ఉన్న కొట్టివేతలు) ఇందులో ఉన్నాయి.

*...అలైడా మార్చ్*



*తన తల్లిదండ్రులు, తోబుట్టువులతో చే-1944.. చే, సెలియా (తల్లి), సెలియా (సోదరి), రాబర్టో, జువాన్ మార్టిన్, ఎర్నెస్టో (తండ్రి), అనా మేరియా*



బొలీవియాలోని ఓ గ్రామంలో - 1967




చైనాను సందర్శించినపుడు మావోతో చే - 1960



కాంగో మాజీ అధ్యక్షుడు లారెంట్ కబీలా



చే కూతురు అలైడా గువేరా




టాంజానియా సరస్సు మ్యాప్




కాంగో మ్యాప్



టాంజానియా సరస్సు




కాంగోలోని ఓ ప్రకృతి దృశ్యం



ప్రముఖ ఫ్రెంచ్ తాత్వికుడు ఝూపాల్ సార్త్రేతో.. 1960లో సార్త్రే క్యూబా సందర్శించినపుడు తీసిన ఫోటో (మధ్యలో వ్యక్తి సార్త్రే)



మాస్కోలోని రెడ్‌స్క్వేర్‌లో చే గువేరా (1964)


నా ఆఫ్రికన్ స్వప్నం